# పదో తరగతి

## సాంఘికశాస్త్రం

**ముఖ్యసలహాదారు**


**శ్రీమతి చిత్రా రామచంద్రన్,** ఐ.ఎ.ఎస్.,
ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, విద్యాశాఖ, తెలంగాణ.

**సంపాదకమండలి**

**ఆచార్య శ్రీ కె. సతీష్‌రెడ్డి,** డీన్, ఫ్యాకల్టీ ఆఫ్ సోషల్ సైన్సెస్ (రిటైర్డ్), డా. బి. ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటి, హైదరాబాద్.

**ప్రొఫెసర్ బి. శ్రీనగేష్,** డిపార్ట్‌మెంట్ ఆఫ్ జియోగ్రఫి, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

**డా॥ కృష్ణారెడ్డి చిట్టెడి,** అసిస్టెంట్ ప్రొఫెసర్, స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, యూనివర్సిటి ఆఫ్ హైదరాబాద్.

**డా॥ రావుల కృష్ణయ్య,** అసిస్టెంట్ ప్రొఫెసర్, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

**శ్రీ యం. పాపయ్య,** లెక్చరర్, ప్రభుత్వ ఉపాధ్యాయ విద్యా కళాశాల, నల్గొండ.

**శ్రీ గడ్డమీది రథంగ పాణి రెడ్డి,** స్కూ.అ. (సాంఘిక శాస్త్రం), జి.ప.ఉ.పా. జానంపేట, మూసాపేట, మహబూబ్‌నగర్.

**సమన్వయం, సహకారం**

**శ్రీ మారసాని సోమిరెడ్డి,**
సంయుక్త సంచాలకులు,
సార్వత్రిక విద్యాపీఠం,
తెలంగాణ, హైదరాబాద్.

**శ్రీ సువర్ణ వినాయక్,**
కో-ఆర్డినేటరు, తెలుగు,
రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణా సంస్థ,
తెలంగాణ, హైదరాబాద్.

**శ్రీ బోయినపల్లి వెంకటేశ్వరరావు,**
స్టేట్ కో-ఆర్డినేటరు,
సార్వత్రిక విద్యాపీఠం,
తెలంగాణ, హైదరాబాద్.

**పాఠ్యపుస్తక ప్రచురణ సమితి**

**శ్రీమతి ఎ. దేవసేన,** ఐ.ఎ.ఎస్.,
సంచాలకులు,
పాఠశాల విద్యాశాఖ,
తెలంగాణ, హైదరాబాద్.

**శ్రీ ఎ. కృష్ణారావు,**
సంచాలకులు,
సార్వత్రిక విద్యాపీఠం,
తెలంగాణ, హైదరాబాద్.

**శ్రీ ఎస్. వెంకటేశ్వర శర్మ,**
సంచాలకులు,
పాఠ్యపుస్తక ముద్రణాలయం
తెలంగాణ, హైదరాబాద్.



**ప్రచురణ**

**సార్వత్రిక విద్యాపీఠం,**
**తెలంగాణ, హైదరాబాదు**

© Government of Telangana, Hyderabad

*First Published 2021*

**All rights reserved**

No part of this publication may be reproduced, stored in a retrieval system, or transmitted, in any form or by any means without the prior permission in writing of the publisher, nor be otherwise circulated in any form of binding or cover other than that in which it is published and without a similar condition including this condition being imposed on the subsequent purchaser.

The copy right holder of this book is the Sarvatrika Vidya Peetham, Telangana, Hyderabad.

This Book has been printed on 70 G.S.M. Maplitho
Title Page 200 G.S.M. White Art Card

సార్వత్రిక విద్యాపీఠం, తెలంగాణ 2021-22

*Printed in India*
at the Telangana Govt.Text Book Press,
Mint Compound, Hyderabad,
Telangana.

# జాతీయ గీతం

– రవీంద్రనాథ్ ఠాగూర్

జనగణమన అధినాయక జయహే!
భారత భాగ్యవిధాతా!
పంజాబ, సింధ్, గుజరాత, మరాఠా,
ద్రావిడ, ఉత్కళ, వంగ!
వింధ్య, హిమాచల, యమునా, గంగ!
ఉచ్ఛల జలధి తరంగా!
తవ శుభనామే జాగే!
తవ శుభ ఆశిష మాగే
గాహే తవ జయగాథా!
జనగణ మంగళదాయక జయహే!
భారత భాగ్య విధాతా!
జయహే! జయహే! జయహే!
జయ జయ జయ జయహే!!

# ప్రతిజ్ఞ

– పైడిమర్రి వెంకట సుబ్బారావు

భారతదేశం నా మాతృభూమి. భారతీయులందరూ నా సహోదరులు. నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను. సుసంపన్నమైన, బహువిధమైన నా దేశ వారసత్వ సంపద నాకు గర్వకారణం. దీనికి అర్హత పొందడానికి సర్వదా నేను కృషి చేస్తాను.

నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్ని గౌరవిస్తాను. ప్రతివారితోను మర్యాదగా నడుచుకుంటాను. జంతువులపట్ల దయతో ఉంటాను.

నా దేశంపట్ల, నా ప్రజలపట్ల సేవానిరతితో ఉంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను.

వారి శ్రేయోభివృద్ధులే నా ఆనందానికి మూలం.

## విషయనిపుణులు, నిర్వహణ

**శ్రీ గడ్డమీది రథంగ పాణి రెడ్డి,** ఎస్.ఎ. (సాంఘిక శాస్త్రం), జి.ప.ఉ.పా. జానంపేట, మహబూబ్‌నగర్.

## రూపకల్పనలో పాల్గొన్నవారు

**శ్రీ గడ్డమీది రథంగ పాణి రెడ్డి,** ఎస్.ఎ.(సాంఘిక శాస్త్రం)
జి.ప.ఉ.పా. జానంపేట, మూసాపేట, మహబూబ్‌నగర్.

**శ్రీ జి.వెంకటేశ్వర్లు,** ఎస్.ఎ.(సాంఘిక శాస్త్రం)
జి.ప.ఉ.పా. చంపాపేట్, రంగారెడ్డి.

**శ్రీ ఆయాచితుల లక్ష్మణరావు,** ఎస్.ఎ.(సాంఘిక శాస్త్రం) రిటైర్డ్
ప్ర.ఉ.పా. ధన్‌గర్‌వాడి, కరీంనగర్.

**శ్రీ వి.సతీష్ ప్రకాశ్,** ఎస్.ఎ.(సాంఘిక శాస్త్రం)
జి.ప.ఉ.పా. దుగ్గొండి, వరంగల్ రూరల్.

**శ్రీమతి బి.లలిత,** ఎస్.ఎ.(సాంఘిక శాస్త్రం)
జి.ప.ఉ.పా. మంచాల్, రంగారెడ్డి.

**శ్రీ యన్. రాధాకృష్ణాచారి,** ఎస్.ఎ.(సాంఘిక శాస్త్రం)
జి.ప.ఉ.పా. రేగొండ, జయశంకర్ భూపాలపల్లి.

**శ్రీ మోహన్ రెడ్డి,** ఎస్.ఎ.(సాంఘిక శాస్త్రం)
జి.ప.ఉ.పా. గార్లపహాడ్, మహబూబ్‌నగర్.

**శ్రీమతి పి. సునీత ఖన్నా,** ఎస్.ఎ.(సాంఘిక శాస్త్రం)
జి.ప.ఉ.పా. (బా) నారాయణఖేడ్, సంగారెడ్డి.

**శ్రీమతి హెచ్. హిరణ్య,** ఎస్.ఎ.(సాంఘిక శాస్త్రం)
ప్ర.ఉ.పా. (బా) తిరుమలగిరి, హైదరాబాద్.

**శ్రీ టి.ప్రభాకర్ రెడ్డి,** ఎస్.ఎ.(సాంఘిక శాస్త్రం)
జి.ప.ఉ.పా. (బా) షాబాద్, రంగారెడ్డి.

**శ్రీ ఎం. రాజేంద్ర కుమార్,** పి.జి.టి.(అర్థశాస్త్రం)
తెలంగాణ స్టేట్ మోడల్ స్కూల్, కేతేపల్లి, నల్గొండ.

**డా. జె.యెల్లయ్య,** పి.జి.టి.(అర్థశాస్త్రం)
తెలంగాణ స్టేట్ మోడల్ స్కూల్, వల్లాల, నల్గొండ.

**శ్రీ ఎ. శ్రీనివాస్ గౌడ్,** ఎస్.ఎ.(సాంఘిక శాస్త్రం)
జి.ప.ఉ.పా. ధన్వాడ, నారాయణపేట.

**శ్రీ ఆర్. విక్రం రెడ్డి,** ఎస్.ఎ.(సాంఘిక శాస్త్రం)
జి.ప.ఉ.పా. కూసుమంచి, ఖమ్మం.

**శ్రీ బి. సంతోష్ కుమార్,** ఎస్.ఎ.(సాంఘిక శాస్త్రం)
మం.ప.ప్రా.ఉ.పా. నిపాణి, ఆదిలాబాద్.

**శ్రీ ఎం. ప్రసూన్ కుమార్,** ఎస్.ఎ.(సాంఘిక శాస్త్రం)
జి.ప.ఉ.పా. డోంగ్లి, కామారెడ్డి.

**శ్రీ వేల్పూరు శ్రీనివాస్,** ఎస్.ఎ.(సాంఘిక శాస్త్రం)
జి.ప.ఉ.పా. బాల్కొండ, నిజామాబాద్.

**శ్రీ అశోక్ కుమార్ ఆలూరి,** ఎస్.ఎ.(సాంఘిక శాస్త్రం)
జి.ప.ఉ.పా. శనిగరం, వరంగల్ అర్బన్.

## డిజైనింగ్

**కవర్ పేజి డిజైనింగ్ : కె. సుధాకరాచారి,** ఎం.పి.పి.ఎస్, మైలారం, రాయపర్తి (మం.), వరంగల్ రూరల్.

**లే ఔట్ & గ్రాఫిక్స్ డిజైనింగ్ : దార కన్నయ్య,** దండంపల్లి, నల్లగొండ.

## అభ్యాసకులకు సూచనలు

- సాంఘికశాస్త్ర పాఠ్య పుస్తకం చదవడం ద్వారా ఆశించిన అభ్యసన ఫలితాలు సాధించాలి.
- ప్రతి పాఠం అభ్యసన ఫలితాలతో మొదలవుతుంది. కాబట్టి పాఠం చదివే ముందు అభ్యసన ఫలితాలను చదివి బాగా అవగాహన చేసుకోవాలి.
- పాఠం మధ్యలో 'మీ ప్రగతిని పరీక్షించుకోండి' అని ఇవ్వడం జరిగింది. దీని కింద ఇచ్చిన ప్రశ్నలకు మీరు పైన ఇచ్చిన భావనలను అర్థం చేసుకొని సమాధానాలు రాయండి.
- పాఠం మధ్యలో ఇచ్చిన పటాలను పరిశీలించండి. దీని ద్వారా భావనలు మరింత బాగా అర్థమవుతాయి.
- పాఠం మధ్యలో ఇచ్చిన పట్టికలను పరిశీలించండి. పట్టికలో ఇచ్చిన దత్తాంశాలను పోల్చండి. విశ్లేషించండి.
- ప్రతి పాఠం చివర, 'ముగింపు (ముఖ్యాంశాలు)' కింద ముఖ్యాంశాలు ఇవ్వడం జరిగింది. వీటిని చదవడం ద్వారా పాఠం యొక్క ముఖ్యాంశాలు అవగాహన చేసుకోవచ్చు.
- పాఠం చివర 'మాదిరి పరీక్షా ప్రశ్నలు' ఇవ్వడం జరిగింది. దీనిలో అతి లఘు, లఘు, వ్యాసరూప ప్రశ్నలు మరియు బహుళైచ్ఛిక ప్రశ్నలు ఇవ్వడం జరిగింది.
- పాఠ్యాంశాల అవగాహన కొరకు, కేంద్రంలో ప్రత్యక్ష తరగతులు నిర్వహిస్తారు. వీటికి తప్పనిసరిగా హాజరు కావాలి. కేంద్రానికి వెళ్ళినపుడు బోధకుడితో మీ సందేహాలను అడిగి నివృత్తి చేసుకోవాలి.
- పబ్లిక్ పరీక్షలో మాదిరి పరీక్షా ప్రశ్నలు యథాతథంగా రావు. కాబట్టి ప్రశ్నలకు సమాధానాలు సొంతంగా రాయాలి. దీని వల్ల ప్రశ్న ఎలా అడిగినా మీరు సులభంగా రాయవచ్చు.

## బోధకులకు సూచనలు

- సాంఘికశాస్త్ర పాఠ్య పుస్తకాలను పూర్తిగా చదివి, అవగాహనను పెంచుకోవాలి.
- పాఠ్య పుస్తకం ప్రారంభంలో ముందుమాట, అభ్యాసకులకు సూచనలు, అభ్యసన ఫలితాలు పొందుపరిచారు.
- 'ముందుమాట'ను చదవడం ద్వారా పాఠ్య పుస్తకం గురించిన ప్రాథమిక అవగాహన, ఉద్దేశం బోధపడుతుంది.
- 'అభ్యాసకులకు సూచనలు' చదవడం ద్వారా అభ్యాసకులతో మీరు ఏమి చేయించాలో తెలుస్తుంది.
- 'అభ్యసన ఫలితాలు' చదవడం ద్వారా ఈ పాఠ్య పుస్తకం యొక్క బోధనోద్దేశం అవగాహన అవుతుంది.
- ప్రతి పాఠానికి ప్రారంభంలో 'అభ్యసన ఫలితాలు' ఇవ్వడం జరిగింది. వీటిని అవగాహన చేసుకుంటే ఆ పాఠం ద్వారా ఏమి సాధించాలి అనే విషయం అర్థం అవుతుంది.
- పాఠం మధ్యలో 'మీ ప్రగతిని పరీక్షించుకోండి' ఇవ్వడం జరిగింది. వీటిని అభ్యాసకులతో చేయించాలి. వారి అవగాహనను అంచనా వేయాలి.
- పాఠం చివర 'మాదిరి పరీక్షా ప్రశ్నలు' ఇవ్వడం జరిగింది. వీటిని అభ్యాసకులు సొంతంగా రాసేటట్లు ప్రోత్సహించాలి.
- కేంద్రంలో ప్రత్యక్ష బోధన కోసం కేటాయించిన రోజులను దృష్టిలో పెట్టుకొని ఒక్కొక్క పాఠానికి ఎన్ని రోజులు వస్తుందో విభజించుకోవాలి.
- ప్రత్యక్ష బోధనతో పాటు ఆన్‌లైన్ ద్వారా కూడా బోధన నిర్వహిస్తారు. ఆన్‌లైన్ బోధనా సౌకర్యాన్ని అభ్యాసకులు వినియోగించుకునేలా చూడాలి.
- మీ కేంద్రంలో నమోదైన అభ్యాసకులతో సమకాలీన, సామాజిక సమస్యలపై డిబెట్, ఉపన్యాస, క్విజ్ వంటి పోటీలు నిర్వహించాలి. మాదిరి ఎన్నికలు, నమూనా పార్లమెంట్ నిర్వహించి వారిలో ఉత్సాహాన్ని నింపాలి.

# విషయసూచిక


| క్ర.సం. | పాఠం పేరు | పేజి నెంబర్ |
|---|---|---|
| 1 | తెలంగాణ రాష్ట్రంలోని ఒక గ్రామం | 1-9 |
| 2 | భారతదేశ ఉనికి - భౌగోళిక స్వరూపాలు | 10-18 |
| 3 | భారతదేశ శీతోష్ణ స్థితి - నదులు | 19-28 |
| 4 | సహజ వనరులు | 29-36 |
| 5 | ఖండాలు, మహా సముద్రాలు | 37-49 |
| 6 | జనాభా | 50-65 |
| 7 | భారతదేశ ఆర్థిక వ్యవస్థ - ప్రధాన రంగాలు | 66-78 |
| 8 | ఆర్థిక సంస్కరణలు - ప్రపంచీకరణ | 79-86 |
| 9 | ప్రభుత్వ రాబడి, ప్రభుత్వ వ్యయం, బడ్జెట్ | 87-99 |
| 10 | ప్రాచీన భారతదేశం | 100-114 |
| 11 | మధ్యయుగ భారతదేశం | 115-131 |
| 12 | ఆధునిక భారతదేశం | 132-143 |
| 13 | తెలంగాణ చరిత్ర | 144-159 |
| 14 | తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం - ఆవిర్భావం | 160-170 |
| 15 | తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం - సామాజిక, ఆర్థికాభివృద్ధి | 171-189 |
| 16 | భారత రాజ్యాంగం - ప్రవేశిక | 190-200 |
| 17 | ప్రాథమిక హక్కులు - విధులు | 201-210 |
| 18 | ప్రభుత్వాలు - కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు | 211-225 |
| 19 | భారతదేశ ప్రజాస్వామ్యం - సవాళ్ళు | 226-238 |
| 20 | సమకాలీన అంశాలు - సంబంధిత చట్టాలు | 239-248 |
| 21 | సామాజిక, ఆర్థిక అభివృద్ధి - అననుకూల వర్గాల సాధికారత | 249-257 |
| 22 | అంతర్జాతీయ సంస్థలు | 258-264 |

## సాంఘికశాస్త్రం - అభ్యసన ఫలితాలు

- భారతదేశం యొక్క భౌగోళిక లక్షణాలను వర్గీకరించి, హిమాలయాల గురించి వివరిస్తారు.
- భారతదేశ పటంలో పర్వతాలు, పీఠభూములు, తీర మైదానాలను గుర్తిస్తారు.
- భారతదేశంలో ఋతుపవనాలను వర్గీకరిస్తారు. భారతదేశ పటంలో నదులను గుర్తించి, వాటి గురించి వివరిస్తారు.
- ప్రపంచ పటంలో ఖండాలు, మహా సముద్రాలు గుర్తిస్తారు. ఖండాలు ఏర్పడిన విధానాన్ని వివరిస్తారు.
- భారతదేశంలోని సహజ వనరుల గురించి వివరిస్తారు. సహజ వనరులు తగ్గిపోవడానికి గల కారణాలను, దాని సంరక్షణకై సూచనలు ఇస్తారు.
- భారతదేశంలో జనాభా పెరుగుదలకు గల కారణాలు చెబుతారు. జనాభా నియంత్రణ కొరకు సూచనలు చేస్తారు.
- భారతదేశ ఆర్థిక వ్యవస్థను వర్గీకరిస్తారు. వ్యవసాయ, పారిశ్రామిక, సేవల రంగం ప్రాధాన్యతలను వివరిస్తారు.
- ప్రభుత్వ రాబడి, ప్రభుత్వ వ్యయం, బడ్జెట్ భావనలను వివరిస్తారు. బడ్జెట్‌ను విశ్లేషిస్తారు.
- భారతదేశంలో ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలను వివరిస్తారు. భారతదేశంపై ప్రపంచీకరణ ప్రభావాన్ని విశ్లేషిస్తారు.
- సింధూలోయ నాగరికత ప్రాముఖ్యాన్ని వివరిస్తారు. అశోకుని గొప్పతనాన్ని ప్రశంసిస్తారు.
- మధ్యయుగ భారతదేశ చరిత్రలో చోటు చేసుకున్న మార్పులను వివరిస్తారు.
- ఆధునిక భారతదేశ చరిత్రలో సిపాయిల తిరుగుబాటు, స్వాతంత్ర్య సమరంలోని ముఖ్య ఘట్టాలను వివరిస్తారు.
- స్వాతంత్ర్య సమర యోధుల నుండి స్ఫూర్తి పొందుతారు. వారి గొప్ప గుణాలను నిత్య జీవితంలో పాటిస్తారు.
- తెలంగాణా సాధన ఉద్యమంలో చేపట్టిన నిరసనలను వివరిస్తారు. పెద్ద మనుషుల ఒప్పందం, ముల్కీ నిబంధనలను ఎలా అతిక్రమించారో విశ్లేషిస్తారు.
- తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత రాష్ట్రంలో సాధించిన ఆర్థిక, సామాజిక అభివృద్ధిని వివరిస్తారు.
- భారత రాజ్యాంగ ప్రవేశికలోని ముఖ్యమైన రాజ్యాంగ విలువలను గుర్తిస్తారు. వాటి గురించి వివరించి, వాటిని నిత్య జీవితంలో పాటిస్తారు.
- ప్రాథమిక హక్కుల గురించి వివరించి, ప్రాథమిక విధులను గుర్తించి ఆచరిస్తారు.
- ప్రజాస్వామ్యంలో ఎదుర్కొనే సవాళ్ళు అనగా పేదరికం, నిరక్షరాస్యత, మహిళల పట్ల వివక్షత వంటి వాటిపై వ్యాఖ్యానిస్తారు.
- సమాజంలో అననుకూల వర్గాలు ఎదుర్కొనే సమస్యల గురించి వివరిస్తారు. ఆయా వర్గాల అభివృద్ధికి తగిన సూచనలు చేస్తారు.
- ప్రపంచ శాంతికి దోహదపడే ఐక్యరాజ్యసమితి విభాగాలను పేర్కొని, వాటి గురించి వివరిస్తారు.

# 1 తెలంగాణ రాష్ట్రంలోని ఒక గ్రామం

## 1.0 అభ్యసన ఫలితాలు

- జానంపేట గ్రామం ఉనికిని, జనాభా లక్షణాలను తెలియజేస్తారు.
- గ్రామంలోని వృత్తుల గురించి వివరిస్తారు.
- ఉత్పత్తి కారకాలను వర్గీకరిస్తారు.
- నేలలను వర్గీకరించి, పండే పంటలను గురించి వివరిస్తారు.
- వ్యవసాయ, వ్యవసాయేతర కార్యకలాపాలకు ఉదాహరణలను సూచిస్తారు.
- కుల వృత్తుల పునరుద్ధరణపై కరపత్రం తయారు చేస్తారు.
- నేడు వ్యవసాయేతర కార్యకలాపాలు పెరగడానికి కారణాలు చెబుతారు.
- గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ, పాలన, ఆర్థిక వనరుల గురించి వివరిస్తారు.

## 1.1 పరిచయం

భారతదేశ అభివృద్ధి గ్రామాభివృద్ధితో ముడిపడి ఉంది. గ్రామాలు అభివృద్ధి చెందితే దేశం కూడా అభివృద్ధి సాధించినట్లే కదా! తెలంగాణ రాష్ట్రంలో గ్రామాల సంఖ్య ఎక్కువ. గ్రామాల్లో ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయం. వ్యవసాయం కాకుండా ఇతర అనుబంధ కార్యకలాపాలు మరియు వ్యవసాయేతర కార్యకలాపాలు కూడా నిర్వహిస్తుంటారు. గ్రామాలలో అనేక కులాల, మతాల ప్రజలు నివసిస్తుంటారు. వీరిలో కొందరు కుల వృత్తులను నమ్ముకొని జీవిస్తున్నారు. సాధారణంగా గ్రామంలోని ప్రజలు కులమతాలకతీతంగా కలిసి జీవిస్తున్నారు. ఈ యూనిట్‌లో గ్రామాల ఉనికి ఎలా ఉంది? ప్రజలు ఎక్కువగా దేనిపై ఆధారపడి నివసిస్తున్నారు? అక్కడ ఎలాంటి నేలలు ఉన్నాయి? ఏ ఏ రకాలైన పంటలు పండిస్తున్నారు? ఎలాంటి సాగునీటి సదుపాయాలున్నాయి? ప్రజల జీవన విధానం ఎలా ఉంది? గ్రామ పంచాయితీ ఎలాంటి విధులు నిర్వహిస్తున్నది? అనే విషయాలు తెలుసుకోవడానికి మనం తెలంగాణ రాష్ట్రంలో మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలంలోని జానంపేట గ్రామం గురించి తెలుసుకుందామా? పాఠం యొక్క రచయిత గ్రామాన్ని సందర్శించి, అక్కడి అన్ని అంశాలను లోతుగా పరిశీలించి ఈ గ్రామం గురించి రాయడం జరిగింది.

## 1.2 జానంపేట గ్రామం, ఉనికి

జానంపేట గ్రామం మహబూబ్‌నగర్ జిల్లా తెలంగాణ రాష్ట్రంలో ఉంది. ఇది భౌగోళికంగా తెలంగాణ పీఠభూమిలో ఉంది. సాధారణంగా పీఠభూమిలో చిన్నకొండలు, పర్వతశ్రేణులు, గుట్టలు ఉండి వాటి మధ్య చదును భూములు ఉంటాయి, జానంపేట గ్రామానికి ఆనుకొని గుట్టలు ఉన్నాయి. జానంపేట గ్రామ సరిహద్దులు:

తూర్పున పోల్కంపల్లి, తిమ్మాపూర్, కనకపూరు శివారు; పశ్చిమాన తున్కిపూర్ శివారు; ఉత్తరాన గాజులపేట, తాటికొండ శివారు; దక్షిణాన సంకల్మద్ది, కామాజిపూర్ శివారు ఉన్నాయి. ఈ గ్రామం గుండా జాతీయ రహదారి 44 వెళ్ళుతున్నది. ఈ రహదారి జమ్ముకాశ్మీర్లోని శ్రీనగర్ నుండి తమిళనాడులోని కన్యాకుమారి వరకు వెళ్ళుతున్నది. ఇది దేశంలోనే అత్యంత పొడవైన రహదారి.

## 1.3 గ్రామ జనాభా లక్షణాలు

2011 జనాభా లెక్కల ప్రకారం జానంపేట గ్రామ జనాభా 3,633గా ఉంది. దీనిలో మహిళలు 1,800 మంది పురుషులు 1,833 మంది ఉన్నారు. గ్రామంలో షెడ్యూల్డ్ తెగలకు చెందిన వారు కేవలం 13 మంది ఉన్నారు. షెడ్యూల్డ్ కులాలకు చెందిన వారు 556 మంది ఉన్నారు. ఇతర కులాలకు చెందిన వారు 3,064 మంది ఉన్నారు. దీనిలో వెనుకబడిన తరగతులు, మైనారిటీ వర్గానికి చెందిన వారు ఉన్నారు.

సాధారణంగా గ్రామాలలో అన్ని వర్గాలకు చెందిన ప్రజలు కలిసి జీవిస్తారు. కొన్ని గ్రామాలలో షెడ్యూల్డ్ తెగల వారు ఎక్కువగా ఉండవచ్చు. అదే విధంగా షెడ్యూల్డ్ కులాలు, మైనారిటీ వర్గాలైన ముస్లింలు, క్రైస్తవులు కూడా ఉండవచ్చు.

**ఆలోచించండి**

- అన్ని వర్గాల ప్రజలు గ్రామంలో నివసించడం వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటి?

## 1.4 ప్రధాన వృత్తులు

గ్రామాలలో అన్ని కులాలు, మతాలకు సంబంధించిన వారు నివసిస్తుంటారు. వీరు రకరకాలైన వృత్తులు చేసే వారై ఉంటారు. వీటిలో కొన్ని వంశపార్యపరంగా వచ్చిన వృత్తులు కావచ్చు లేదా కొంత సాంకేతికంగా నైపుణ్యాన్ని సంపాదించి చేపట్టిన వృత్తులు కావచ్చు.

### 1.4.1 వ్యవసాయం

గ్రామంలో ఎక్కువ మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. గ్రామంలో 90% ప్రజలు వ్యవసాయం, దాని అనుబంధ వృత్తులలో పని చేస్తున్నారు. పశు పోషణ, పాల ఉత్పత్తిపై ఆధారపడి కొంతమంది జీవిస్తున్నారు. గ్రామంలో ఎక్కువగా వరి, జొన్నలు, వేరుశెనగ, పత్తి, ఆముదాలు పండిస్తున్నారు. రాగులు కూడా కొద్ది విస్తీర్ణంలో పండిస్తున్నారు.

గ్రామంలోని రైతులు ఖరీఫ్లో ఎక్కువగా పంటలు పండిస్తున్నారు. దీనిని సాధారణంగా వానా కాలం పంటగా చెబుతారు. అలాగే రబీలో కూడా పంటలు పండిస్తున్నారు. తెలంగాణలో రబీ పంటకాలాన్ని 'యాసంగి'గా పిలుస్తున్నారు. జయాద్లో ఇక్కడ పంటలు వేయడం లేదు (జయాద్ అనేది వేసవి కాలం పంట). కాని కొన్ని గ్రామాలలో నీటి వనరులు ఉన్న చోట జయాద్లో వేరుశెనగ, వరి పండిస్తున్నారు.

### 1.4.2 కుల వృత్తులు

గ్రామంలో అన్ని రకాల కుల వృత్తుల వారు నివసిస్తున్నారు. కాని పరిస్థితుల ప్రభావం వల్ల కుల వృత్తులను కొంత మంది మాత్రమే కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా నాయి బ్రాహ్మణులు, కటిక, గొల్ల, కురుమ, వైశ్యులు, కుమ్మరి వారు వారి వృత్తులను కొనసాగిస్తున్నారు.

గ్రామంలో కుమ్మరి కులానికి చెందిన యాదయ్యను కలుసుకోవడం జరిగింది. గ్రామంలో కొన్ని కుమ్మరి కుటుంబాలు ఉన్నప్పటికీ యాదయ్య కుటుంబం మాత్రమే వారి వృత్తిని కొనసాగిస్తున్నారు. యాదయ్య వారి వృత్తి గురించిన కొన్ని వివరాలు చెప్పడం జరిగింది.



యాదయ్య దంపతులు కుండల తయారీకి కావలసిన మట్టిని స్థానిక చెరువు నుండి తెచ్చుకుంటున్నారు. వీరు కుండల తయారీని వర్షాకాలం ముగిసిన తర్వాత మొదలు పెడతారు. నవంబరు 20 తర్వాత మొదలు పెడతామని యాదయ్య తెలిపాడు. యాదయ్య దంపతులు ఉదయం 6 నుండి సాయంత్రం 6 గంటల వరకు కుండల తయారీ ప్రక్రియలో పాల్గొంటారు. వీరు రోజుకు 20 నుండి 25 కుండల వరకు తయారు చేస్తున్నారు. తయారు చేసిన కుండలను ఇంటిలో నీడకు సుమారు 8 రోజులు పెట్టి, ఆరిన తర్వాతనే కాలుస్తారట. లేదంటే బయటి గాలి తగిలితే కుండలు కాల్చడానికి పనికిరావట.

యాదయ్య దంపతులు సంవత్సరంలో 5 నెలలు కుండల తయారీలో పాల్గొంటారు. సంవత్సరం కష్టపడితే ఖర్చులు పోను లక్ష రూపాయల వరకు వస్తాయని చెప్పాడు. కాని కరోనా లాక్‌డౌన్ వల్ల అంతకు ముందు సంవత్సరం తయారు చేసిన కుండలే ఇప్పటికీ ఉన్నాయని యాదయ్య తెలిపాడు. వీరు తయారు చేసిన కుండలు గ్రామంలోనే కాకుండా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా తీసుకుపోతుంటారని తెలిపాడు. అంతే కాకుండా జడ్చర్ల, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ పట్టణాల నుండి కూడా వ్యాపారస్తులు ఇక్కడి నుండి మట్టి కుండలు తీసుకుని వెళ్ళి పట్టణాలలో అమ్ముతున్నారు.

సంవత్సరంలో 6 నెలలు కులవృత్తిని కొనసాగిస్తూ, మిగతా సమయంలో వ్యవసాయ కూలీలుగా కూడా పని చేస్తూ ఉంటామని యాదయ్య తెలిపారు.

### 1.4.3 ఇతర వృత్తులు

గ్రామంలో కొంత మంది ప్రజలు ఇతర వృత్తులను కూడా చేపడుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెరగడం వల్ల, ఇతర పనుల లభ్యత వలన గ్రామంలోనే మీ సేవ, సెల్‌ఫోన్స్ అమ్మడం, రిపేరు చేయడం చేస్తున్నారు. అలాగే ఆటోలు నడపడం, పాల కేంద్రం నిర్వహణ, బైక్ మెకానిక్, వెల్డింగ్ మొదలగు పనులు చేస్తున్నారు.

**మీ ప్రగతిని పరీక్షించుకోండి**

- వ్యవసాయ సీజన్లు ఎన్ని? అవి ఏమిటి?
- జానంపేట గ్రామంలో ప్రధాన కుల వృత్తులు ఏవి?

## 1.5 ఉత్పత్తి కారకాలు

ప్రజలకు అవసరమైన వస్తువులను, సేవలను అందించడమే ఉత్పత్తి ముఖ్య ఉద్దేశం. వస్తువులను గాని, సేవలను గాని ఉత్పత్తి చేయడానికి దోహదపడే వాటిని ఉత్పత్తి కారకాలు అంటారు.

ఉత్పత్తి కారకాలను నాలుగు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి: 1. భూమి, 2. శ్రమ, 3 మూలధనం (పెట్టుబడి), 4. వ్యవస్థాపన.

**1. భూమి :** భూమిని వ్యవసాయంతో పాటు ఇతర కార్యకలాపాలకు కూడా ఉపయోగిస్తాం. జానంపేట గ్రామంలో భూమిని ఎక్కువగా వ్యవసాయానికి ఉపయోగిస్తున్నారు. అదే విధంగా రైస్ మిల్లు, ఉద్యానవనాలు, పాఠశాల, హాస్పిటల్ వంటి ఇతర కార్యకలాపాలకు కూడా వినియోగిస్తున్నారు. భూమిని వినియోగించినందుకు భూయజమానికి బాటకం చెల్లిస్తారు. అనగా భూమికి చెల్లించే ప్రతిఫలం బాటకం.

**2. శ్రమ :** భూమి తరువాత ఉత్పత్తికి అవసరమైన అంశాలలో శ్రమ ఒకటి. వ్యవసాయానికి ఎంతో శారీరక శ్రమ అవసరం. భూమిలేని కుటుంబాల నుంచి వ్యవసాయ కార్మికులు వస్తారు. అలాగే పరిశ్రమలలో కూడా వస్తువుల ఉత్పత్తిలో కార్మికులు పాల్గొంటారు. వీరి శ్రమను వినియోగిస్తున్నందుకు యజమానులు వేతనం చెల్లిస్తారు. అంటే శ్రమకు ప్రతిఫలంగా ఇచ్చేది వేతనం.

**3. మూలధనం (పెట్టుబడి) :** భూమిని, భవనాలను, యంత్రాలను, ముడి పదార్థాలను సమకూర్చుకోవడానికి, వేతనాలను చెల్లించడానికి పెట్టుబడి అవసరం అవుతుంది. ఈ పెట్టుబడి పొదుపు ద్వారా గాని, బ్యాంకులు లేదా వ్యక్తుల నుండి గాని తీసుకుంటారు. బ్యాంకులు గాని, వ్యక్తులు గాని, పెట్టుబడి సమకూర్చినందుకు రుణగ్రహీత నుండి కొంత వడ్డీ వసూలు చేస్తాయి. అంటే మూలధనంకు చెల్లించే ప్రతిఫలం వడ్డీ.

**4) వ్యవస్థాపన :** భూమి, శ్రమ, మూలధనంలను సేకరించి వ్యవసాపకుడు ఉత్పత్తి ప్రక్రియలో తనకున్న జ్ఞానాన్ని ఉపయోగించి వాటిని వినియోగిస్తాడు. ఉత్పత్తి చేయడానికి కొంత ఖర్చు (వ్యయం) అవుతుంది. అలాగే తయారైన వస్తువులను మార్కెట్‌లో విక్రయించగా కొంత ఆదాయం వస్తుంది. వ్యవస్థాపకునికి ఉత్పత్తి వ్యయం ఎక్కువగా ఉండి, రాబడి తక్కువగా వస్తే నష్టాలు రావచ్చు. అలాగే ఉత్పత్తి వ్యయం తక్కువగా ఉండి, మొత్తం రాబడి ఎక్కువగా ఉంటే లాభాలు రావచ్చు. అంటే వ్యవస్థాపకునికి చెల్లించే ప్రతిఫలం లాభం లేదా నష్టం.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. ఉత్పత్తి కారకాలను వర్గీకరించండి.
2. వ్యవస్థాపకునికి నష్టాలు ఎందుకు వస్తాయి?

## 1.6 భూమి / నేలలు

వ్యవసాయంలో నేలలు ప్రధాన పాత్ర వహిస్తాయి. ఒక ప్రదేశంలో ఏర్పడే నేల ఆ ప్రాంతపు భూమి స్వభావంపై ఆధారపడి ఉంటుంది. జానంపేట గ్రామంలో మనకు అన్ని రకాల నేలలు కనిపించవు. ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కో రకపు నేల విస్తీర్ణం ఎక్కువగా ఉంటుంది.

### 1.6.1 నేలలు రకాలు

నేలలను సాధారణంగా క్రింది రకాలుగా వర్గీకరించవచ్చు. అవి: 1. ఒండ్రు మట్టి నేలలు, 2. ఎర్రనేలలు, 3. నల్ల రేగడి నేలలు, 4. లేటరైట్ నేలలు, 5. క్షారపు నేలలు (చవుడు నేలలు), 6. పర్వత నేలలు, 7. చిత్తడి నేలలు

జానంపేట గ్రామంలో చెరువుల క్రింద ఇసుక, మట్టితో కూడిన నేలలు ఉన్నాయి. వీటిలో వరిని అధికంగా పండిస్తున్నారు. గ్రామంలో ఎర్ర నేలలు కూడా ఉన్నాయి. ఇవి తక్కువ సారవంతమైనవి. వీటిలో జొన్నలు, ప్రత్తి పండిస్తున్నారు. అక్కడక్కడ చవుడు నేలలు కూడా ఉన్నాయి. కొన్ని గ్రామాలలో మనం నల్ల రేగడి నేలలను కూడా చూడవచ్చు. నల్ల రేగడి నేలలు తేమను అధికంగా నిల్వ చేసుకుంటాయి. వీటిలో ఎక్కువగా ప్రత్తి, గోధుమ, జొన్నలు పండిస్తారు.

### 1.6.2 భూమి పంపిణీ

గ్రామంలో ఎక్కువ మంది ఉపాంత, చిన్న రైతులు ఉన్నారు. కొద్ది మంది దిగువ మధ్య తరగతి వారు ఉన్నారు. పెద్ద రైతులు ఎవరు లేరు. గ్రామంలో ప్రభుత్వ భూమి ఏమి లేదు. ఊరికి ఉత్తరాన ప్రభుత్వ భూమి గుట్టల రూపంలో అటవీ శాఖ ఆధీనంలో ఉంది.

రైతులను వారికి గల స్వంత భూముల ఆధారంగా పట్టిక-1.1లో తెలిపిన విధంగా వర్గీకరించవచ్చు.

*పట్టిక-1.1: రైతుల వర్గీకరణ*

| క్ర.సం. | రైతు పరిమాణం | ఎకరాలు |
|---|---|---|
| 1. | ఉపాంత రైతులు (marginal farmers) | 2.47 |
| 2. | సన్న చిన్న కారు రైతులు (small farmers) | 2.48 - 4.94 |
| 3. | దిగువ మధ్య తరగతి (semi-medium farmers) | 4.95 - 9.88 |
| 4. | మధ్య తరగతి (medium farmers) | 9.89 - 24.77 |
| 5. | పెద్ద రైతులు (large farmers) | 24.78 ఎకరాలు, అంత కంటే ఎక్కువ |

**వనరు:** Report on census of Land Holdings, Telangana, 2015-16, DES, Hyderabad.

### 1.6.3 భూమి వినియోగం

గ్రామాలలో సాధారణంగా భూమిని వ్యవసాయం కొరకు వినియోగిస్తారు. కాని ప్రజల తలసరి ఆదాయం, కొనుగోలు శక్తి, పట్టణాల విస్తరణ, ప్రభుత్వ విధానాల వల్ల వ్యవసాయ భూమిని అనేక వ్యవసాయేతర కార్యకలాపాల కోసం వాడుతున్నారు. ఉదాహరణకు జానంపేట గ్రామంలో కూడా వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చి అమ్ముతున్నారు. అలాగే ప్రభుత్వాలు కూడా పారిశ్రామిక వికేంద్రీకరణలో భాగంగా గ్రామాలలో కూడా పెద్ద, చిన్న పరిశ్రమలకు అనుమతులిస్తున్నారు. ఉదాహరణకు మహబూబ్‌నగర్ జిల్లాలోని పోలేపల్లి గ్రామంలో ప్రత్యేక ఆర్థిక మండళ్ళు ఏర్పాటు చేయడం జరిగింది.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. నేలల రకాలను పేర్కొనుము.
2. వ్యవసాయ భూమిని ఇతర వినియోగానికి ఎందుకు ఉపయోగిస్తున్నారు?

## 1.7 వర్షపాతం, నీటి వనరులు

జూన్ చివరి నుంచి అక్టోబర్ వరకు గల వర్షాకాలంలో ఇక్కడ వర్షపాతం చాలా తక్కువ మరియు అనిశ్చితత్వం. ఒక సంవత్సరం నుంచి మరొక సంవత్సరానికి వర్షపాతంలో చాలా తేడా ఉంటుంది. కాబట్టి వర్షపాతాన్ని ముందే అంచనా వేయలేం. వర్షాభావపు సంవత్సరాలలో కరువు పరిస్థితులు నెలకొంటాయి. పంటలు ఎండిపోవచ్చు. తక్కువ వర్షపాతం కారణంగా చెరువులు నిండవు. కాని ఈ (2020) సంవత్సరంలో వర్షపాతం బాగా నమోదు కావడం వల్ల గ్రామంలోని అన్ని చెరువులు నిండినాయి. భూగర్భ జలాలు కూడా పెరిగాయి.

గ్రామంలో రెండు రకాలైన నీటి వనరులున్నాయి. అవి: గొట్టపు బావులు, చెరువులు. వర్షాలు బాగా పడి, భూగర్భ జలాలు పెరిగినపుడు గొట్టపు బావులు, చెరువుల ద్వారా నీటి పారుదల సదుపాయం కలుగుతుంది. గ్రామంలో పెద్ద చెరువు, నాగిరెడ్డి పల్లె చెరువు, గంగారం చెరువు మరియు నేరేడు చెరువులున్నాయి. వర్షపాతం తక్కువగా ఉన్నప్పుడు చెరువులు నిండడం లేదు.

గ్రామంలో ఖరీఫ్, రబీ కాలాల్లో పండించిన పంటల వివరాలు పట్టిక-1.2లో చూపబడినవి.

*పట్టిక-1.2: పంటలు (ఎకరాలలో) (1919-1920)*

| కాలాలు | వరి | ప్రత్తి | ఆముదం | రాగులు | జొన్నలు | కందులు | కొర్రలు |
|---|---|---|---|---|---|---|---|
| ఖరీఫ్ | 171 | 54 | 74 | 1 | 120 | 50 | 3 |
| రబీ | 300 | - | - | - | - | - | - |

ఖరీఫ్ పంట కాలంలో అన్ని రకాలైన పంటలు పండిస్తున్నారు. రబీ పంట కాలంలో ఎక్కువగా వరిని మాత్రమే పండిస్తున్నారు. కాని కొన్ని గ్రామాలలో మూడు కాలాల్లో అంటే ఖరీఫ్, రబీ, జయాద్ పంట కాలాల్లో పంటలు పండిస్తున్నారు. రాష్ట్రంలో నిర్మించిన ప్రాజెక్టుల వల్ల కాలువల ద్వారా కూడా లక్షల ఎకరాల్లో పంటలు పండిస్తున్నారు.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. ఖరీఫ్ పంట కాలంలోనే ఎక్కువ పంటలు పండించడానికి గల కారణాలు ఏమిటి?
2. మన రాష్ట్రంలోని ముఖ్య పంట కాలాలు ఏవి?

## 1.8 గ్రామంలోని ఆర్థిక కార్యకలాపాలు

గ్రామంలో ప్రజలు వ్యవసాయంతో పాటు అనేక వ్యవసాయేతర కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు.

### 1.8.1 వ్యవసాయ కార్యకలాపాలు

గ్రామంలో ఎక్కువగా గొట్టపు బావుల కింద, చెరువుల కింద వరిని పండిస్తున్నారు. పండించిన వరిని గ్రామంలోనే సహకార సంఘాల ద్వారా నిర్ణయించిన ధరకు రైతులు అమ్ముతున్నారు. కొన్ని గ్రామాలలో మహిళలు

స్వయం సహాయక సంఘాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. దీనికి గాను భారత ఆహార సంస్థ క్వింటాలుకు కొంత శాతం కమీషన్‌గా ఇస్తుంది. మిగతా ధాన్యాలను వ్యవసాయ మార్కెట్‌కు తీసుకుపోతారు.

### 1.8.2 వ్యవసాయేతర కార్యకలాపాలు

ప్రధాన ఉత్పత్తి కార్యకలాపమైన వ్యవసాయం కాకుండా జానంపేట గ్రామంలో కొన్ని వ్యవసాయేతర ఉత్పత్తి కార్యకలాపాలున్నాయి. ఈ గ్రామంలో అనేక కుటుంబాలు పాలు ఉత్పత్తి చేస్తాయి. గేదెలకు వివిధ రకాలైన గడ్డి, వానాకాలంలో సాగు చేసే జొన్న, వరి గడ్డిని మేతగా వేస్తారు. గ్రామంలోనే పాల కేంద్రం ఉంది. చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు కూడా ఇక్కడికి వచ్చి పాలను పాల కేంద్రానికి అమ్ముతారు.

**ఆలోచించండి**

- మీ ప్రాంతంలో ప్రధాన ఆర్థిక కార్యకలాపం ఏమిటి? ఎందుకు?

గ్రామంలో వరి బాగా పండడం వల్ల రైస్ మిల్లు కూడా ఉంది. ఇక్కడ కొంత మంది పని చేస్తున్నారు. గ్రామానికి దగ్గరలో సీడ్స్ కంపెనీ ఉండడం వల్ల వందల మందికి అక్కడ పని లభిస్తున్నది. అదే విధంగా కోళ్ళ పెంపకం, గొర్రెల పెంపకం, ఆటోలు నడపడం, తాపి మేస్త్రీలుగా పని చేయడం వంటివి చేస్తున్నారు. గ్రామాలలో అక్కడ ఉన్న వనరులను బట్టి ఉపాధి లభిస్తుంది.

## 1.9 జీవన విధానం, సంప్రదాయాలు

గ్రామంలో ప్రజలు కులమతాలకు అతీతంగా కలిసి జీవిస్తున్నారు. గ్రామంలో హిందువులు, మహ్మదీయులు ఉన్నారు. హిందువులు ఉగాది, సంక్రాంతి, దసరా, బతుకమ్మ, దీపావళి పండుగలు జరుపుకుంటారు. పోచమ్మ, మైసమ్మ, వీరనాగమ్మ వంటి స్థానిక దేవతలను ఆరాధిస్తారు. మహమ్మదీయులు రంజాన్, బక్రీద్ పండుగలను బాగా జరుపుకుంటారు. మొహర్రం పండుగ మతాలకతీతంగా అందరూ కలిసి జరుపుకుంటారు. తెలంగాణలోని అన్ని గ్రామాలలో వలె బోనాల పండుగ ఈ గ్రామంలో కూడా ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు.

## 1.10 స్థానిక స్వపరిపాలన - గ్రామ పంచాయతీ



స్థానిక ప్రభుత్వాలు ప్రజాస్వామ్య వికేంద్రీకరణ అనే ప్రక్రియకు వ్యవస్థీకృతమైన రూపం. ఉదాహరణకు ఆదేశ సూత్రాలలో స్థానిక ప్రభుత్వాల ఏర్పాటు గురించి పేర్కొనడం జరిగింది. తెలంగాణలో మూడు అంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ అమలులో ఉంది. ఈ వ్యవస్థలో గ్రామ స్థాయిలో పంచాయతీ, మండల స్థాయిలో మండల పరిషత్, జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్ ఉంటాయి.

## 1.10.1 గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ

గ్రామ పంచాయతీ సభ్యులను ఆ గ్రామంలో గల ఓటర్లు ఎన్నుకుంటారు. గ్రామ పంచాయతీ సభ్యుల ఎన్నిక కొరకు గ్రామాన్ని కొన్ని వార్డులుగా విభజిస్తారు. జానంపేట గ్రామాన్ని 12 వార్డులుగా విభజించారు. ఈ ఎన్నికలలో జనాభా ప్రాతిపాదిక ఆధారంగా స్త్రీలకు, షెడ్యూల్డు కులాలకు, తెగలకు కొన్ని సీట్లను కేటాయించడం జరుగుతుంది. జానంపేట గ్రామంలో షెడ్యూల్డు తెగల వారు చాలా తక్కువగా ఉన్నందున వారికి వార్డుల విభజనలో చోటు లభించలేదు.

గ్రామ సర్పంచ్‌ను 18 సంవత్సరాలు నిండిన వయోజనులు ప్రత్యక్ష ఎన్నిక ద్వారా ఎన్నుకుంటారు. గ్రామంలోని వార్డు మెంబర్లు ప్రత్యక్షంగా ఎన్నుకోబడి, వారిలో నుండి ఒకరిని ఉప సర్పంచ్‌గా పరోక్షంగా ఎన్నుకుంటారు. వీరి పదవీ కాలం 5 సంవత్సరాలు.

## 1.10.2 పాలనా కార్యక్రమాలు

సర్పంచ్ గ్రామ పంచాయతీ సమావేశాలకు అధ్యక్షత వహిస్తాడు. సర్పంచు లేనపుడు ఉపసర్పంచ్ అధ్యక్షత వహిస్తాడు. గ్రామంలోని ఓటర్లు గ్రామ సభలో సభ్యులు. ఒక సంవత్సరంలో కనీసం రెండు సార్లు గ్రామ సర్పంచ్ గ్రామ సభను ఏర్పాటు చేయాలి. గ్రామ సభ గ్రామాభివృద్ధికి సంబంధించిన నిర్ణయాలను తీసుకుంటుంది. గ్రామ సభ సమావేశాలకు సర్పంచ్ అధ్యక్షత వహిస్తాడు.

ప్రతి గ్రామ పంచాయతీకి పంచాయతీ సెక్రటరీ కార్యనిర్వహణాధికారిగా వ్యవహరిస్తాడు. గ్రామ పంచాయతీ బడ్జెట్ తయారు చెయ్యడం, గ్రామ పంచాయతీ సమావేశాలలో పాల్గొనడం చేస్తాడు.

## 1.10.3 ఆర్థిక వనరులు – విధులు

పన్నులు వసూలు చేయడం ద్వారా కేంద్ర, రాష్ట్ర గ్రాంటుల ద్వారా, ఆస్తుల ద్వారా వచ్చిన ఆదాయం, సంత బజారు వేలం వేయడం మొదలగు వాటి ద్వారా గ్రామాలకు ఆర్థిక వనరులు సమకూరుతాయి.

గ్రామంలో రోడ్డులను వేయించడం, వాటిని మరమ్మతులు చేయడం, వీధి దీపాలు వేయించడం, పారిశుద్ధ్యం, నీటి సరఫరా, అంటు రోగాలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం వంటివి గ్రామ పంచాయతీ విధులలో కొన్ని. ఇంకా విపులంగా తెలుసుకోవడానికి ప్రభుత్వాలు 'కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు' అనే యూనిట్‌లో తెలుసుకోవచ్చు.

## 1.11 ముగింపు (ముఖ్యాంశాలు)

- తెలంగాణ రాష్ట్రంలో ఒకటైన జానంపేట గ్రామంలో ప్రజలు ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు.

- గ్రామంలో వ్యవసాయంతో పాటు కుల వృత్తులు, ఇతర వృత్తులు చేపట్టిన వారు కూడా ఉన్నారు.
- ఉత్పత్తి ప్రక్రియలో ఉత్పత్తి కారకాలు చాలా ముఖ్యమైనవి.
- ఉత్పత్తి కారకాలలో భూమిని వ్యవసాయం కొరకు మాత్రమే కాక, ఇతర ఉపయోగాలకు కూడా ఉపయోగిస్తున్నారు.
- తెలంగాణలో వర్షపాతం తక్కువ. తెలంగాణలో గొట్టపు బావులు, చెరువులు ముఖ్యమైన సాగు నీటి వనరులు. ఈ మధ్య కాలంలో కాలువల ద్వారా కూడా సాగునీటి వసతి పెరిగింది.
- ప్రజలు కుల, మతాలకు అతీతంగా గ్రామాలలో కలిసి జీవిస్తున్నారు.

## 1.12 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. కింది ప్రశ్నలకు 1-2 వాక్యాల చొప్పున సమాధానాలు రాయండి.**

1. గ్రామ పంచాయతీ చేసే పనులకు రెండు ఉదాహరణలు ఇవ్వండి.
2. నీటి వనరులను వర్గీకరించండి.

**II. కింది ప్రశ్నలకు 4-5 వాక్యాల చొప్పున సమాధానాలు రాయండి.**

1. జానంపేట గ్రామంలోని పంట కాలాలను పేర్కొని, ఆ కాలంలో పండే పంటలను పేర్కొనండి.
2. నేలలను వర్గీకరించి నేలలలో పండే పంటలను పేర్కొనండి.
3. గ్రామాలలో గల వ్యవసాయేతర కార్యకలాపాల గురించి రాయండి.
4. గ్రామ ప్రజల జీవన విధానాన్ని వర్ణించండి.
5. గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియను వివరించండి.
6. వ్యవసాయ భూముల ఆధారంగా రైతులను వర్గీకరించండి.

**III. కింది ప్రశ్నలకు 8-10 వాక్యాల చొప్పున సమాధానాలు రాయండి.**

1. గ్రామాలలోని కుల వృత్తులను పేర్కొని, ఏవైనా రెండు కుల వృత్తుల గురించి రాయండి.
2. ఉత్పత్తి కారకాలను వర్గీకరించి, వాటి గురించి వివరించండి.

**IV. కింది వాటిలో సరైన సమాధానాలను ఎంపిక చేయండి.**

1. నల్లరేగడి నేల ఈ పంటకు బాగా అనుకూలం ( )
   ఎ) వరి  బి) చెరకు  సి) పత్తి  డి) వేరుశనగ
2. ఒక సంవత్సరంలో కనీసం గ్రామసభ ఎన్ని సార్లు సమావేశం కావాలి? ( )
   ఎ) ఒకటి  బి) రెండు  సి) మూడు  డి) నాలుగు
3. క్రింది వానిలో ఉత్పత్తి కారకం కానిది: ( )
   ఎ) మూలధనం  బి) వ్యవస్థాపన  సి) భూమి  డి) వేతనం

## 1.13 ఉపయుక్త గ్రంథాలు

- NCERT Text Books
- ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ నివేదిక

# 2 భారతదేశ ఉనికి - భౌగోళిక స్వరూపాలు

## 2.0 అభ్యసన ఫలితాలు

- భారతదేశ ఉనికి మరియు తెలంగాణ ఉనికిని అక్షాంశాల, రేఖాంశాల రూపంలో తెలుపుతారు.
- భారతదేశ పొరుగు దేశాలను, తెలంగాణ పొరుగు రాష్ట్రాలను పటంలో గుర్తిస్తారు.
- భారతదేశ భౌగోళిక స్వరూపాలను వర్గీకరిస్తారు.
- తెలంగాణ  భౌతిక స్వరూపాన్ని వివరిస్తారు.

## 2.1 పరిచయం


- మనం నివసించే భౌగోళిక ప్రదేశం మన జీవితాన్ని ప్రభావితం చేస్తుందా?

మనం నివసించే ప్రదేశం మన జీవన విధానం మరియు ప్రవర్తనను ప్రభావితం చేస్తుంది. అందువల్ల మనం ఏ ప్రదేశానికి చెందినవారమో, ఆ ప్రదేశం ఎక్కడ ఉందో తెలుసుకోవడం చాలా ముఖ్యం. ఒక ప్రాంత ఉనికిని గుర్తించడం (ఎక్కడ ఉందో తెలుసుకోవడం) వల్ల ఆ ప్రాంత శీతోష్ణస్థితి, వర్షపాతం, నదులు ఆ ప్రాంతానికి ఇతర ప్రదేశాలతో గల సంబంధం మొదలైన విషయాలు తెలుసుకోవచ్చు. మీరు నివసించే ప్రదేశం (గ్రామం లేదా పట్టణం) తెలంగాణలో ఉందని మీకు తెలుసు కదా! తెలంగాణ భారతదేశంలోని ఒక రాష్ట్రం. ఈ పాఠంలో మనం భారతదేశం మరియు తెలంగాణల యొక్క ఉనికి, భౌగోళిక స్వరూపాలను గురించి కొన్ని ముఖ్య విషయాలు తెలుసుకుందాం.

## 2.2 ఉనికి

### 2.2.1 భారతదేశ ఉనికి


భారతదేశ ప్రధాన భూభాగం 8 డిగ్రీల 4 నిమిషాల ఉత్తర అక్షాంశం నుండి 37 డిగ్రీల 6 నిమిషాల ఉత్తర అక్షాంశం వరకు మరియు 68 డిగ్రీల 7 నిమిషాల తూర్పు రేఖాంశం నుండి 97 డిగ్రీల 25 నిమిషాల తూర్పు రేఖాంశం వరకు విస్తరించి ఉంది. భారతదేశం ఉత్తర-దక్షిణాలుగా 3214 కి.మీ. పొడవు మరియు తూర్పు పడమరలుగా 2933 కి.మీ. కలిగి ప్రపంచ భూభాగ విస్తీర్ణంలో 2.42% కలిగి ఉంది.





*పటము–2. 1: అక్షాంశ, రేఖాంశాల పరంగా భారతదేశం*

### మీకు తెలుసా?

**అక్షాంశాలు:** భూమధ్యరేఖకు సమాంతరంగా (సమాన దూరంలో) ఉత్తర ధృవం వరకు మరియు దక్షిణ ధృవం వరకు అడ్డంగా గీయబడిన ఊహారేఖలను అక్షాంశాలు అంటారు. ఇవి పూర్తి వృత్తాలు.




పటం-2.2: ప్రధాన అక్షాంశాలు




పటం-2.3: రేఖాంశాలు

**రేఖాంశాలు:** ఉత్తర, దక్షిణ ధృవాలను కలుపుతూ నిలువుగా గీయబడిన ఊహారేఖలను రేఖాంశాలు అంటారు. ఇవి అర్ధ వృత్తాలు.

భారతదేశం పూర్తిగా ఉత్తరార్ధ మరియు పూర్వార్ధ (తూర్పు అర్ధ) గోళాలలో ఉంది. కర్కటరేఖ ($23^0$ 30' నిమిషాల ఉత్తర అక్షాంశ రేఖ) భారతదేశం మధ్య గుండా పోతుంది. ఇది భారత దేశాన్ని రెండు సమ భాగాలుగా చేస్తుంది. కర్కటరేఖకు ఉత్తరంగా ఉన్న భాగాన్ని ఉత్తర భారతదేశమని, దక్షిణంగా ఉన్న భాగాన్ని దక్షిణ భారత దేశమని అంటారు. అదేవిధంగా భారతదేశం మధ్య గుండా పోయే $82^0$ 30' నిమిషాల తూర్పు రేఖాంశాన్ని భారత ప్రామాణిక రేఖాంశంగా వ్యవహరిస్తారు. దీని ఆధారంగానే భారతదేశ ప్రామాణిక సమయాన్ని నిర్ధారిస్తారు.

### మీకు తెలుసా?

భారతదేశంలో తూర్పున ఉన్న అరుణాచల్ ప్రదేశ్ మరియు పడమరన ఉన్న గుజరాత్ సమయంలో 2 గంటల తేడా ఉంటుంది. అందువల్ల భారతదేశం మధ్య గుండా పోయే $82^0$ 30' తూర్పు రేఖాంశాన్ని భారత ప్రామాణిక రేఖాంశంగా వ్యవహరిస్తారు. $82^0$ 30' తూర్పు రేఖాంశం ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగరాజ్ మీదుగా పోతుంది.

## 2.3 భారతదేశం-పొరుగు దేశాలు

భారతదేశం ఆసియా ఖండంలో ఉంది. దీనికి మూడు వైపులా సముద్రం (నీరు) కలదు. పడమర అరేబియా సముద్రం, తూర్పున బంగాళాఖాతం, దక్షిణాన హిందూ మహాసముద్రం ఉన్నాయి. భారతదేశానికి వాయవ్య దిశన పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ ఉన్నాయి. ఉత్తరాన చైనా, భూటాన్, టిబెట్ మరియు నేపాల్ దేశాలు ఉన్నాయి. తూర్పున బంగ్లాదేశ్, మయన్మార్ దేశాలు ఉన్నాయి. భారతదేశానికి దక్షిణంగా హిందూ మహా సముద్రంలో శ్రీలంక, మాల్దీవులు ఉన్నాయి.

భారతదేశానికి దక్షిణ కొన ఇందిరా పాయింట్. ఇది నికోబార్ దీవులలో $6^0$ $4'$ ఉత్తర అక్షాంశాల వద్ద ఉంది. భారతదేశ ప్రధాన భూభాగానికి దక్షిణాన చిట్ట చివరగా కన్యాకుమారి ఉంది ($8^0$ $4'$ ఉత్తర అక్షాంశం).

## 2.4 భారతదేశం భౌతిక విభాగాలు

భారతదేశం భౌగోళిక వైవిధ్యం కలిగిన దేశం. భౌగోళిక స్వరూపాలను బట్టి భారతదేశాన్ని 6 భౌతిక విభాగాలుగా విభజించవచ్చు. అవి: 1. హిమాలయ పర్వతాలు, 2. గంగా-సింధు మైదానం (ఉత్తర మైదానాలు), 3. ద్వీపకల్ప పీఠభూమి, 4. థార్ ఎడారి, 5. తీర మైదానాలు, 6. దీవులు




*పటం-2.4: భారతదేశం విభాగాలు'*

## 1. హిమాలయ పర్వతాలు

హిమాలయాలు నూతనంగా ఏర్పడిన ముడుత పర్వతాలు. ఇవి ప్రపంచంలో ఎత్తైన పర్వతశ్రేణి (పర్వతాల సమూహం). ఇవి భారతదేశానికి ఉత్తర సరిహద్దుగా పడమర నుండి తూర్పుకు 2,400 కిలో మీటర్ల వరకు విస్తరించి ఉన్నాయి. వీటి వెడల్పు పశ్చిమ ప్రాంతంలో 500 కిలో మీటర్లు మధ్య, తూర్పు ప్రాంతాలలో 200 కిలో మీటర్ల వరకు విస్తరించి ఉంది. హిమాలయాలలో 3 సమాంతర శ్రేణులు ఉన్నాయి. అవి:

i) ఉన్నత హిమాలయాలు లేదా హిమాద్రి

ii) మధ్య హిమాలయాలు లేదా హిమాచల్

iii) బాహ్య హిమాలయాలు లేదా శివాలిక్ పర్వతాలు

**i) ఉన్నత హిమాలయాలు లేదా హిమాద్రి:** అన్నిటికంటే ఉత్తరాన ఉన్న పర్వతశ్రేణిని 'ఉన్నత హిమాలయాలు' లేదా 'హిమాద్రి' అంటారు. ఈ శ్రేణి అవిచ్ఛిన్నంగా ఉంటూ పర్వతాల సగటు ఎత్తు సముద్రమట్టం నుండి సుమారు 6,100 మీటర్లు ఉంది.వెడల్పు 120 కి.మీ. నుండి 190 కి.మీ. మధ్య ఉంది. ప్రపంచంలోనే అతి ఎత్తయిన ఎవరెస్ట్ శిఖరం (8,848 మీ.), భారతదేశంలోనే అతి ఎత్తైన శిఖరం K2 మరియు ధౌల్‌గిరి, మకాలు, నంగప్రభాత్ మొదలైనవి ఈ శ్రేణిలోనే ఉన్నాయి. షిప్కిలా, నాథులా, జోజిలా, బొమిడిలా వంటి కనుమలు హిమాద్రి శ్రేణిలోనే ఉన్నాయి.

హిమాద్రి శ్రేణి సంవత్సరమంతా మంచుతో కప్పబడి ఉంటుంది. ఇక్కడ హిమానీ నదాలు ఉంటాయి. మంచు పేరుకోవడం, కరుగుతూ కదలడం వల్ల జీవ నదులు ఏర్పడతాయి. జీవ నదులైన సింధూ, గంగా, యమున, బ్రహ్మపుత్ర ఇక్కడి నుండే ప్రారంభమవుతాయి.

**ii) మధ్య హిమాలయాలు లేదా హిమాచల్:** మధ్య హిమాలయాలు లేదా హిమాచల్ శ్రేణి ఎత్తు 4,500 మీటర్ల నుండి 1,000 మీటర్లు, సగటు వెడల్పు 50 కి.మీ. ఉంది. పిర్ పంజాల్, ధౌల్ ధార్ మరియు మహాభారత శ్రేణులు ఇక్కడే ఉన్నాయి. పేరు పొందిన వేసవి విడుదులు సిమ్లా, డార్జిలింగ్, ముస్సోరి, నైనిటాల్ ఉన్నాయి. కాశ్మీర్, కులు, కాంగ్రా లోయలు కూడా ఇక్కడే ఉన్నాయి.

**iii) బాహ్య హిమాలయాలు లేదా శివాలిక్ పర్వతాలు:** బాహ్య హిమాలయాలు లేదా శివాలిక్ పర్వతాలు 1,100 మీటర్ల నుండి 900 మీటర్ల ఎత్తు మరియు 10 నుండి 50 కిలోమీటర్ల వెడల్పు కలిగి ఉన్నాయి. జమ్ము కొండలు, మిజో, మిసిమి కొండలు వంటివి ఇక్కడే ఉన్నాయి.

హిమాలయాల ఆవిర్భావంలో చివరగా ఏర్పడ్డ శివాలిక్ శ్రేణులు, హిమాలయ ఎగువ పరీవాహ ప్రాంతాల నుండి వచ్చే నదీ ప్రవాహాన్ని అడ్డుకోవడంతో ఇక్కడి లోయల్లో పెద్ద సరస్సులు ఏర్పడ్డాయి. నదులచే తీసుకురాబడ్డ బురద మరియు అవక్షేపాలు ఇక్కడి సరస్సుల్లో నిక్షేపించబడ్డాయి. నదులు శివాలిక్ శ్రేణులగుండా తమ మార్గాన్ని ఖండించిన తర్వాత, ఇక్కడ సరస్సులు ఎండిపోయి పశ్చిమాన 'డూన్స్' మరియు తూర్పున 'డార్స్' అనబడే మైదానాలను ఏర్పరచాయి. 75 కి.మీ. పొడవు మరియు 15–20 కి.మీ. వెడల్పైన ఉత్తరాంచల్‌లోని డెహ్రాడూన్ ఇలాంటి మైదానాలకు మంచి ఉదాహరణ.

## 2. గంగా–సింధు మైదానం (ఉత్తర మైదానాలు)

హిమాలయాలకు దక్షిణంగా ద్వీపకల్ప పీఠభూమికి ఉత్తరంగా ఉన్న ప్రాంతాన్ని గంగా–సింధు మైదానం అని పిలుస్తారు. సింధు, గంగా, యమున నదులు హిమాలయాల నుండి తీసుకువచ్చిన ఒండ్రు మట్టితో ఈ మైదానం ఏర్పడింది. పశ్చిమంగా పంజాబ్ నుండి తూర్పుగా అస్సాం వరకు 2,400 కి.మీ. పొడవున ఈ మైదానం ఉంది. వెడల్పు పడమర 300 కి.మీ. నుండి తూర్పున 150 కి.మీ. మధ్య మారుతుంది.

ఈ మైదానం ప్రధానంగా పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ మరియు అస్సాం రాష్ట్రాలలో విస్తరించి ఉంది. హిమాలయనదుల ఒండ్రు మట్టితో ఏర్పడిన అత్యంత సారవంతమైన ఈ మైదానం ప్రపంచంలోని పెద్ద మైదానాలలో ఒకటి. సరియైన నీటిపారుదల సౌకర్యం ఉండడం వలన ఆహారధాన్యాల ఉత్పత్తి గణనీయంగా ఉంటుంది. ప్రధానంగా గోధుమ, వరి, చెరకు, పప్పులు, నూనెగింజలు మరియు జనుము పండుతాయి. కాబట్టి ఇక్కడ జన సాంద్రత కూడా ఎక్కువగా ఉంటుంది. ఈ మైదానాన్ని రెండు భాగాలుగా విభజించవచ్చు. అవి:

i) సింధూ మైదానం

ii) గంగా–బ్రహ్మపుత్ర మైదానం

**i) సింధూ మైదానం:** ఈ మైదానం సింధునదీ వ్యవస్థ (సింధు మరియు దాని ఉపనదులు సట్లెజ్, జీలం, చినాబ్, బియాస్, రావి) వలన ఏర్పడింది. ఇది థార్ ఎడారికి పశ్చిమంగా ఉంది. దీంట్లో ఎక్కువ భాగం పాకిస్తాన్‌లో, తక్కువ భాగం మన భారతదేశంలో ఉంది.

**ii) గంగా–బ్రహ్మపుత్ర మైదానం:** ఈ మైదానం గంగా మరియు బ్రహ్మపుత్ర నదుల వలన ఏర్పడింది. ఇక్కడ సారవంతమైన నేలలు మరియు నీటిపారుదల వసతులు ఉన్నాయి.

## 3. ద్వీపకల్ప పీఠభూమి

ద్వీపకల్ప పీఠభూమి త్రిభుజాకారంలో ఉన్న పీఠభూమి. దీని విస్తీర్ణం 5 లక్షల చదరపు కిలో మీటర్లు. ఈ పీఠభూమి మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు మరియు తెలంగాణ రాష్ట్రాలలో విస్తరించి ఉంది. నర్మదా నది ఈ పీఠభూమిని రెండు భాగాలుగా చేస్తుంది. అవి:

i) మధ్య ఉన్నత పీఠభూములు

ii) దక్కన్ పీఠభూమి

**i) మధ్య ఉన్నత పీఠభూములు:** ఇది ఉత్తర మైదానాలు మరియు నర్మదా నది మధ్య విస్తరించి ఉంది. వీటిలో ముఖ్యమైనవి. 1) మాళ్వా పీఠభూమి, 2) ఛోటా నాగ్‌పూర్ పీఠభూమి.

1) మాల్వా పీఠభూమి: మాళ్వా పీఠభూమిలోని ముఖ్య నదులు: బెట్వా, చంబల్ మరియు కెన్.

2) ఛోటా నాగ్‌పూర్ పీఠభూమి: ఛోటా నాగ్‌పూర్ పీఠభూమిలో ఖనిజాలు ఎక్కువగా లభిస్తున్నాయి.

మధ్య ఉన్నత పీఠభూములలోని నర్మదా నది వింధ్య, సాత్పురా పర్వతాల మధ్య తూర్పు నుండి పడమరకు ప్రవహించి అరేబియా సముద్రంలో కలుస్తుంది.

**ii) దక్కన్ పీఠభూమి:** నర్మదా నదికి దక్షిణంగా ఉన్న ప్రాంతం దక్కన్ పీఠభూమి. ఇది అగ్నిపర్వత ప్రక్రియ వలన ఏర్పడింది. దక్కన్ పీఠభూమికి ఉత్తరాన సాత్పురా పర్వతాలు, దక్షిణాన నీలగిరి పర్వతాలు, పశ్చిమాన పశ్చిమ కనుమలు, తూర్పున తూర్పు కనుమలు సరిహద్దులుగా కలవు. ఇక్కడి నల్ల రేగడి భూములు ఎక్కువగా కలవు.

### 4. థార్ ఎడారి

ఆరావళి పర్వతాల వర్షచ్ఛాయా ప్రాంతంలో థార్ ఎడారి ఉంది. కాబట్టి ఇక్కడ వర్షపాతం చాలా తక్కువ. సంవత్సర వర్షపాతం 100 మి.మీ. నుండి 150 మి.మీ. మధ్య ఉంటుంది. ఎడారిలో ఎత్తు, పల్లాలతో కూడిన ఇసుక మైదానం ఉండి అక్కడక్కడా శిలామయమైన బోడిగుట్టలు ఉంటాయి. రాజస్థాన్‌లోని అధిక భాగంలో ఈ ఎడారి విస్తరించి ఉంది. ఇక్కడ శుష్క (పొడి) వాతావరణం ఉంటుంది. చెట్లు తక్కువ. వర్షాకాలంలో వాగులు ఏర్పడి, వర్షాకాలం అయిపోగానే అంతమవుతాయి. ఇక్కడి ఏకైక నది 'లూని'. ఈ నదిలోని నీరు సముద్రం చేరకుండా అక్కడి భూభాగంలోని సరస్సులలోనికే (అంతస్థలీయ ప్రవాహం) ప్రవహిస్తుంది.

### 5. తీరమైదానాలు

ద్వీపకల్ప పీఠభూమికి పశ్చిమాన అరేబియా మహాసముద్ర తీరం మరియు తూర్పున బంగాళాఖాతం వెంట సన్నటి తీరప్రాంత మైదానాలు ఉన్నాయి.

**పడమటి తీరమైదానం:** పడమటి తీరమైదానం రాణ్ ఆఫ్ కచ్ వద్ద మొదలై కన్యాకుమారి వరకు విస్తరించి ఉంటుంది. తూర్పు తీరమైదానం కంటే పడమటి తీరమైదానం వెడల్పు తక్కువ. దీనిని మూడు భాగాలుగా విభజించవచ్చు. అవి: 1. కొంకణ్ తీరప్రాంతం– ఇది ఉత్తర భాగం (మహారాష్ట్ర మరియు గోవా), 2. కెనరా తీరప్రాంతం– ఇది మధ్య భాగం (కర్ణాటక), 3. మలబార్ తీరప్రాంతం– ఇది దక్షిణ భాగం (కేరళ)

**తూర్పు తీరమైదానం:** బంగాళాఖాతం యొక్క తీరప్రాంత మైదానం వెడల్పుగా ఉంది. ఈ మైదానం ఒడిశాలోని మహానది నుంచి మొదలై తమిళనాడు లోని కావేరి నది డెల్టా వరకు విస్తరించి ఉంది. మహానది, గోదావరి, కృష్ణ, కావేరి నదులతో ఏర్పడిన ఈ మైదాన ప్రాంతాలు చాలా సారవంతమైనవి. ఈ తీరప్రాంత మైదానాలను స్థానికంగా వివిధ పేర్లతో పిలుస్తారు. అవి:

1. ఉత్కళ్ తీరం (ఒడిశా), 2. సర్కార్ తీరం (ఆంధ్రప్రదేశ్), 3. కోరమాండల్ తీరం (తమిళనాడు).

గంగా–సింధూ మైదానాలలాగా ఇవి కూడా వ్యవసాయపరంగా అభివృద్ధి చెందాయి. కోస్తా ప్రాంతంలో చేపల వనరులు కూడా సమృద్ధిగా ఉన్నాయి. ఒడిషాలోని 'చిల్కా సరస్సు', ఆంధ్ర ప్రదేశ్ లోని 'కొల్లేరు', 'పులికాట్ సరస్సు' తీరప్రాంత మైదానం లోని ముఖ్యమైన సరస్సులు.

### 6. దీవులు

భారతదేశంలో రెండు ద్వీప (దీవుల) సమూహాలు ఉన్నాయి. అవి: 1. బంగాళాఖాతంలోని అండమాన్–నికోబార్ దీవులు, 2. అరేబియా సముద్రంలోని లక్షదీవులు.

1. **అండమాన్-నికోబార్ దీవులు:** సముద్రంలో మునిగిన మయన్మార్ కొండలలో సముద్రం నుంచి పైకి వచ్చిన శిఖర ప్రాంతాలే అండమాన్, నికోబార్ దీవులు. వీటిలోని నార్కొండం, బారెన్ దీవులు అగ్ని పర్వతాల వల్ల ఏర్పడ్డాయి. భారతదేశ దక్షిణ అంచు నికోబార్ దీవులలోని ఇందిరా పాయింట్. ఇది 2004లో సంభవించిన సునామీ వల్ల ముంపునకు గురి అయ్యింది.


2. **లక్ష దీవులు:** లక్ష దీవులు ప్రవాళ భిత్తికల నుంచి ఏర్పడ్డాయి. వీటి మొత్తం విస్తీర్ణం 32 చదరపు కిలో మీటర్లు. భిన్న రకాల వృక్ష, జీవజాతులకు ఈ ద్వీప సమూహాలకు ప్రఖ్యాతిగాంచింది.

## 2.5 తెలంగాణ ఉనికి

భారతదేశంలోని ద్వీపకల్ప పీఠభూమిలో తెలంగాణ రాష్ట్రం $15^0$ 46' ఉత్తర అక్షాంశం నుండి $19^0$ 47' ఉత్తర అక్షాంశం వరకు మరియు $77^0$ 16' తూర్పు రేఖాంశం నుండి $81^0$ 30' తూర్పు రేఖాంశం వరకు విస్తరించి ఉంది.

## 2.6 తెలంగాణ-పొరుగు రాష్ట్రాలు

తెలంగాణ భూపరివేష్టిత రాష్ట్రం. సముద్రానికి చాలా దూరంగా ఉంది. దీనికి ఉత్తరం- మహారాష్ట్ర మరియు ఛత్తీస్‌గఢ్, పడమర- కర్ణాటక, తూర్పు మరియు దక్షిణం- ఆంధ్రప్రదేశ్ సరిహద్దులుగా ఉన్నాయి. తెలంగాణ భౌగోళిక స్వరూపాలు, శీతోష్ణ స్థితి గురించి 15వ పాఠంలో వివరంగా తెలుసుకుంటారు.




*పటం 2.5: తెలంగాణ-పొరుగు రాష్ట్రాలు*

## 2.7 ముగింపు (ముఖ్యాంశాలు)

1. మనం నివసించే ప్రదేశం మన జీవన విధానాన్ని ప్రభావితం చేస్తుంది.
2. భారతదేశ ప్రధాన భూభాగం $8^0$ 4' ఉత్తర అక్షాంశం నుండి $37^0$ 6' ఉత్తర అక్షాంశం వరకు మరియు $68^0$ 7' తూర్పు రేఖాంశం నుండి $97^0$ 25' తూర్పు రేఖాంశం వరకు విస్తరించి ఉంది. ప్రపంచ భూభాగ విస్తీర్ణంలో భారతదేశం 2.42% కలిగి ఉంది.
3. భారతదేశం మధ్య గుండా పోయే $82^0$ 30' తూర్పు రేఖాంశాన్ని భారత ప్రామాణిక రేఖాంశంగా వ్యవహరిస్తారు.
4. భౌగోళిక స్వరూపాలను బట్టి భారతదేశాన్ని 6 భౌతిక విభాగాలుగా విభజించవచ్చు. అవి:

   1. హిమాలయ పర్వతాలు 2. గంగా-సింధు మైదానం 3. ద్వీపకల్ప పీఠభూమి

   4. థార్ ఎడారి 5. తీర మైదానాలు 6. దీవులు

## 2.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 1-2 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. అక్షాంశాలు అనగా ఏమిటి?
2. రేఖాంశాలను వివరించండి.
3. తెలంగాణకు ఆంధ్రప్రదేశ్ ఏ వైపున కలదు?

**II. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 4-5 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. భారతదేశానికి సరిహద్దులుగా గల దేశాలు ఏవి?
2. డూన్‌లు అనగానేమి?

**III. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 8-10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. భారతదేశ భౌతిక స్వరూపాలను పేర్కొని, ఏవేని 2 అంశాల గురించి వివరించండి.
2. భారతదేశ పటంలో కింది వాటిని గుర్తించండి.

   i) హిమాలయాలు ii) థార్ ఎడారి iii) దక్కన్ పీఠభూమి iv) గంగా సింధూ మైదానాలు

## 2.9 ఉపయుక్త గ్రంథాలు

- SCERT, Telangana సాంఘికశాస్త్ర పుస్తకాలు

# 3 భారతదేశ శీతోష్ణ స్థితి - నదులు

## 3.0 అభ్యసన ఫలితాలు

- 'శీతోష్ణస్థితి' మరియు 'వాతావరణం' మధ్య గల తేడాలు తెలుసుకుంటారు.
- భారతదేశం మరియు తెలంగాణలోని శీతోష్ణ స్థితి, ఋతుపవనాలు మరియు కాలాలను గురించి వివరిస్తారు.
- భారతదేశం మరియు తెలంగాణలోని నదులను గురించి వివరిస్తారు.
- హిమాలయ నదులు మరియు ద్వీపకల్ప నదుల మధ్య గల భేదాలను తెలుపుతారు.
- హిమాలయ నదులు జీవనదులు కావడానికి గల కారణాలు తెలుపుతారు.
- నదీజలాల సంరక్షణ ఆవశ్యకతను తెలుపుతారు.

## 3.1. పరిచయం

'శీతోష్ణస్థితి' మరియు 'వాతావరణం' రెండూ ఒకటేనా?

ఒక ప్రదేశంలో, ఒక నిర్దిష్ట కాలానికి (ఒక రోజు, ఒక నెల, ఒక సంవత్సరం మొదలగునవి) చెందిన ఉష్ణోగ్రత, వర్షపాతం మొదలైన అంశాల స్థితిని 'వాతావరణం' అంటారు. ఇవి తక్కువ కాలంలో కూడా మారుతుంటాయి.

సాధారణంగా ఒక విశాలమైన ప్రాంతంలో (రాష్ట్రం, దేశం మొదలైనవి) ముప్పై సంవత్సరాలకన్నా ఎక్కువ కాలం ఉండే సరాసరి వాతావరణ పరిస్థితులను 'శీతోష్ణ స్థితి' అంటారు. ఈ పాఠంలో భారతదేశం మరియు తెలంగాణ శీతోష్ణస్థితిని ప్రభావితం చేసే అంశాలను గురించి తెలుసుకుందాం.

## 3.3 శీతోష్ణ స్థితి

ఒక ప్రాంతపు శీతోష్ణ స్థితి అక్కడి మానవ కార్యకలాపాలలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఎందుకంటే ఒక ప్రాంతపు వ్యవసాయం, పరిశ్రమలు, వాణిజ్యం, రవాణా అన్ని ఆ ప్రాంతపు శీతోష్ణ స్థితి వల్ల ప్రభావితం అవుతాయి. ఒక ప్రాంతపు శీతోష్ణ స్థితి అనేది ఆప్రాంతపు భౌగోళిక స్వరూపం, పీడనం, గాలులు, తేమ మొదలైన వాటిపై ఆధారపడుతుంది.

### 3.3.1 భారతదేశ శీతోష్ణ స్థితి


**భారతదేశ శీతోష్ణ స్థితిని ప్రభావితం చేసే అంశాలు:**

భారతదేశంలోని వివిధ ప్రాంతాలలో ఉష్ణోగ్రతలలో ఎన్నో తేడాలు ఉన్నాయి. శీతోష్ణ స్థితిని ప్రభావితం చేసే అంశాలను శీతోష్ణ స్థితి కారకాలు అంటారు. అవి: 1. అక్షాంశం, 2. సముద్రం నుండి దూరం, 3. ఎత్తు, 4. పర్వతశ్రేణులు, 5. భూ ఉపరితల గాలుల దిశ, 6. ఉపరితల వాయు ప్రవాహాలు (జెట్ స్ట్రీమ్‌లు)

### 1. అక్షాంశ లేదా భూమధ్య రేఖ నుండి దూరం:

భూమధ్య రేఖకు దగ్గరగా ఉన్న ప్రాంతాలు అధిక ఉష్ణోగ్రతను పొందుతాయి. భూమధ్య రేఖ నుండి దూరం పెరుగుతున్న కొద్దీ ఉష్ణోగ్రత తగ్గుతుంది. ఈ దృష్ట్యా భూమిని మూడు ప్రాంతాలుగా విభజిస్తాం. అవి :

1. ఉష్ణ ప్రాంతాలు - భూమధ్య రేఖకు దగ్గరగా ఉన్నవి.
2. ధృవ ప్రాంతాలు - ధృవాలకు దగ్గరగా ఉన్నవి.
3. సమశీతోష్ణ ప్రాంతాలు - ఈ రెండింటికీ మధ్యలో ఉన్నవి.




*చిత్రం 4.1 : శీతోష్ణస్థితిపై అక్షాంశాల ప్రభావం.*

భూమధ్య రేఖకు దగ్గరగా 8 డిగ్రీల 4 నిమిషాల ఉత్తర అక్షాంశం నుండి భారత భూభాగం మొదలవుతుంది. అంతేకాకుండా 23 డిగ్రీల 30 నిమిషాల ఉత్తర అక్షాంశం (కర్కటరేఖ) భారతదేశం మధ్య గుండా పోతుంది. కర్కటరేఖకు దక్షిణంగా ఉన్న భూభాగం ఉష్ణమండల ప్రాంతం. ఉత్తరంగా ఉన్న భూభాగం సమశీతోష్ణ మండల ప్రాంతం. అంటే కర్కట రేఖకు దక్షిణంగా ఉన్న ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు, ఉత్తరంగా ఉన్న ప్రాంతాల్లో తక్కువ ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయి. ఉదాహరణకు తెలంగాణ రాష్ట్రంలో, హర్యానాలో కంటే ఉష్ణోగ్రత ఎక్కువగా ఉంటుది.

### 2. సముద్రం నుండి దూరం :

భారతదేశపు దక్షిణ భాగంలో మూడువైపులా సముద్రాలు ఉన్నాయి. పశ్చిమం వైపు అరేబియా సముద్రం, తూర్పు వైపు బంగాళాఖాతం మరియు దక్షిణం వైపు హిందూ మహాసముద్రం ఉన్నాయి. దక్షిణ భారతదేశం సముద్ర ప్రభావిత శీతోష్ణ స్థితి కలిగి ఉంది. అందువల్ల ఇక్కడ వేసవిలో ఎక్కువ వేడి గానీ, శీతాకాలంలో ఎక్కువ చలి గానీ ఉండవు. సమశీతోష్ణ స్థితి ఉంటుంది. ఉత్తర భారతదేశం సముద్రానికి ఎక్కువ దూరంలో ఉంది. ఇక్కడ ఉష్ణోగ్రతలలో ఎక్కువ భేదాలను గమనించవచ్చు.

### 3. ఎత్తు :

భూమి ఉపరితలం నుండి పైకి ఎత్తుకుపోయిన కొలది ఉష్ణోగ్రత తగ్గుతుంది. ఎత్తైన కొండలపై ఉన్న సిమ్లా వంటి నగరాలు చల్లగా ఉంటాయి. మైదాన ప్రాంతాల్లో ఉన్న లూథియానా వంటి చోట్ల అత్యధిక వేడి ఉంటుంది.

### 4. పర్వతశ్రేణులు :

ఒక ప్రదేశం యొక్క ఉష్ణోగ్రతను అక్కడి పర్వతశ్రేణులు ఎంతో ప్రభావితం చేస్తాయి. భారతదేశానికి ఉత్తర దిక్కున ఉన్న హిమాలయ పర్వతశ్రేణులు (ఆరు వేల మీటర్ల సగటు ఎత్తు) మధ్య ఆసియా నుంచి వచ్చే అతి చల్లని గాలులను అడ్డుకుంటాయి. అలాగే నైఋతి ఋతుపవనాలకు అడ్డుగా నిలిచి భారతదేశంలో వర్షాలు

కురిసేటట్లుగా చేస్తాయి. పశ్చిమ కనుమలు భారతదేశ పశ్చిమ తీర ప్రాంతంలో ఎక్కువ వర్షం పడేటట్లుగా చేస్తాయి.

**5. భూఉపరితల గాలుల దిశ :**

భారతదేశ శీతోష్ణ స్థితిని పవనాలు వీచే దిశ కూడా ప్రభావితం చేస్తుంది. పవనాలలో ప్రపంచ పవనాలు, ఋతుపవనాలు మరియు స్థానిక పవనాలు ఉన్నాయి. ఈ గాలిలో ఉన్న తేమ మన దేశంలోని చాలా ప్రాంతాలలో వర్షం పడేటట్లు చేస్తుంది.

ప్రపంచ పవనాలు: సంవత్సరం మొత్తం నిరంతరాయంగా ఒకే దిశలో వీచే గాలులు.

ఋతుపవనాలు: ప్రతి సంవత్సరం నిర్ణీత సమయంలో ఒకే దిశలో వీచే గాలులు.

స్థానిక పవనాలు: స్థానికంగా ఉండే ఉష్ణోగ్రతలు, పీడనాల తేడా వల్ల ఇవి వీస్తాయి. వీటిలో ఉష్ణపవనాలు, శీతల పవనాలు ఉంటాయి. ఉదా: లూ పవనాలు.

**6. ఉపరితల వాయు ప్రవాహాలు (జెట్ స్ట్రీమ్‌లు) :**

భూమి ఉపరితలంపై వీచే గాలులతో పాటు, భూమికి చాలా ఎత్తులో వీచే బలమైన వాయు ప్రవాహాలు (జెట్ స్ట్రీమ్‌లు) కూడా భారతదేశ శీతోష్ణస్థితిని ప్రభావితం చేస్తాయి. ఇవి నేల నుంచి 12,000 మీటర్ల ఎత్తులో వేగంగా ప్రవహించే గాలులు. వీటి వేగం వేసవిలో గంటకు 110 కిలో మీటర్లు, శీతాకాలంలో 184 కిలో మీటర్లుగా ఉంటుంది. 25 డిగ్రీల ఉత్తర అక్షాంశం వద్ద తూర్పు జెట్ ప్రవాహం ఏర్పడుతుంది. దీని వల్ల చుట్టూ ఉన్న ఉష్ణోగ్రత చల్లబడుతుంది. ఫలితంగా అక్కడ వర్షం కురుస్తుంది.

## 3.3.2 తెలంగాణ శీతోష్ణ స్థితి

తెలంగాణ రాష్ట్ర శీతోష్ణ స్థితి, భారతదేశ శీతోష్ణ స్థితిని పోలి ఉంటుంది. తెలంగాణ రాష్ట్రం సముద్ర ప్రభావానికి దూరంగా ఉండటం మరియు భౌగోళికంగా ఉప శుష్క ప్రాంతానికి చెందడం వల్ల వాతావరణం వేడిగా మరియు పొడిగా ఉంటుంది. ఇక్కడ వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా, శీతాకాలంలో తక్కువగా ఉంటాయి. వర్షాకాలం ఋతుపవన లక్షణాలు కలిగి ఉంటుంది. వేసవి కాలం మార్చి నెలలో ప్రారంభమై మే నెలలో తీవ్రరూపం దాల్చి సగటు ఉష్ణోగ్రత 42 డిగ్రీల సెంటిగ్రేడ్‌గా నమోదు అవుతుంది. శీతాకాలం నవంబర్ చివరిలో ప్రారంభమై ఫిబ్రవరి వరకు సగటు ఉష్ణోగ్రత 22 డిగ్రీల నుండి 23 డిగ్రీల సెంటిగ్రేడ్ నమోదు అవుతుంది. తెలంగాణలో 'రామగుండం' అనే ప్రదేశంలో అత్యధిక సగటు ఉష్ణోగ్రత 46 డిగ్రీల సెంటిగ్రేడ్ నమోదు అవుతుంది. దీనికి ఆ ప్రదేశంలో బొగ్గు గనులు, థర్మల్ విద్యుత్ కేంద్రంలో బొగ్గును మండించడం ఒక కారణంగా చెప్పవచ్చు. ఆదిలాబాద్ జిల్లాలో తక్కువ ఉష్ణోగ్రత నమోదు అవుతుంది. ఎందుకంటే ఆ ప్రాంతం మిగతా ప్రాంతం కంటే ఎత్తయిన ప్రదేశంలో ఉండడమే కాక అక్కడ అడవులు ఉండడం కూడా ఒక కారణం.

### 3.3.3 భారతదేశ కాలాలు – ఋతువులు

భారతదేశ శీతోష్ణ స్థితిని 3 కాలాలుగా విభజించవచ్చు. అవి : 1.శీతాకాలం, 2.వేసవికాలం, 3.వర్షాకాలం.

### 1. శీతాకాలం (చలి కాలం)

భారతదేశ భూభాగంపై ఉష్ణోగ్రతలు నవంబర్ మధ్య నుంచి గణనీయంగా తగ్గుతాయి. ఈ చలికాలం ఫిబ్రవరి మధ్య వరకు కొనసాగుతుంది. జనవరి సాధారణంగా అత్యంత చలిగా ఉంటుంది. దేశంలో చాలా ప్రాంతాలలో పగటి ఉష్ణోగ్రత 10 డిగ్రీల సెంటీగ్రేడ్ కంటే తక్కువ ఉంటుంది. ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో అతి తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. దక్షిణ భారతదేశం, ప్రత్యేకంగా కోస్తా ప్రాంతంలో ఉష్ణోగ్రతలు, మధ్యస్తంగా అంటే 20 డిగ్రీల సెంటీగ్రేడ్ కంటే ఎక్కువ ఉండి, వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది.

శీతాకాలంలో  నిర్మలమైన ఆకాశం, గాలిలో తక్కువ తేమ శాతం, చల్లటి గాలులతో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యధరా సముద్రం నుంచి వచ్చే తుఫాన్ వాయుగుండాలు (పశ్చిమ విక్షోభాలు) ఉత్తర భారతదేశంలో కొంత మేరకు వర్షం కురవడానికి కారణమవుతాయి. సాధారణంగా రబీ కాలంలో సాగు చేసే గోధుమ పంటకు ఈ వర్షం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

### 2. వేసవికాలం (ఎండాకాలం)

వేసవికాలంలో భారతదేశ దక్షిణ ప్రాంతం నుండి ఉత్తర ప్రాంతం వైపు వెళ్తుంటే సగటు ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉత్తర భారతదేశ మైదానాలలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఏప్రిల్ నుండి క్రమేపి 27 డిగ్రీల సెంటిగ్రేడ్ దాటుతాయి. మే నెల మధ్య నాటికి భారతదేశంలోని అనేక ప్రాంతాలలో, ముఖ్యంగా వాయువ్య మైదానంలోనూ మధ్య భారతదేశంలోనూ పగటి ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల నుండి 46 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు నమోదవుతాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా 20 డిగ్రీల సెంటిగ్రేడ్ కంటే తక్కువ ఉండవు. ఉత్తర మైదానాలలో పొడిగా మరియు వేడిగా ఉండే స్థానిక పవనాలు వీస్తాయి. వీటిని 'లూ పవనాలు' అంటారు. సాధారణంగా వేసవి ముగిసే సమయంలో దక్కన్ పీఠభూమిలో 'తొలకరి జల్లులు' కురుస్తాయి. భారతదేశ ద్వీపకల్ప ప్రాంతంలో అనగా దక్షిణ భారతదేశంలో మామిడి వంటి పండ్లు త్వరగా పండటానికి ఇవి ఉపయోగపడుతాయి. కాబట్టి వీటిని తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ లలో 'మామిడి జల్లులు' లేదా 'తొలకరి జల్లులు' అని అంటారు.

### 3. వర్షాకాలం

భారతదేశంలోని శీతోష్ణస్థితి ఋతుపవనాల వల్ల గణనీయంగా ప్రభావితం అవుతుంది. గతంలో భారతదేశానికి వచ్చిన నావికులు గాలులు వీచే దిశ క్రమం తప్పకుండా మారడాన్ని గమనించారు. ఈ గాలుల సహాయంతో వారు భారతదేశ తీరం వైపు ప్రయాణం చేసేవారు. ఇలా కాలాన్ని బట్టి గాలుల దిశ మారడాన్ని అరబ్ వర్తకులు 'మాన్ సూన్' అని పిలిచారు. వీటిని మనం 'ఋతుపవనాలు' అంటాం.


ఉష్ణ ప్రాంతంలో సుమారుగా 20 డిగ్రీల ఉత్తర అక్షాంశం నుండి 20 డిగ్రీల దక్షిణ అక్షాంశాల మధ్య ఋతుపవనాలు ఏర్పడతాయి. దక్షిణార్ధ గోళంలోని ఆగ్నేయ ఋతుపవనాలు భూమధ్యరేఖను దాటిన తర్వాత భారత ఉపఖండంపై ఏర్పడిన అల్పపీడన ప్రాంతం వైపు ప్రయాణిస్తాయి. ఈ సమయంలో భారతదేశంలోని మధ్య భారతం, గంగానది మైదాన ప్రాంతాల మీద అల్ప పీడనం ఏర్పడి ఉంటుంది. కాబట్టి ఈ పవనాలు ఉత్తర్ధా గోళంలో నైరుతి ఋతుపవనాలుగా ప్రయాణం మొదలు పెడతాయి.

**మీకు తెలుసా?**


వర్షాన్ని కురిపించే గాలులకు అడ్డుగా పర్వతాలు ఉన్నపుడు, అక్కడే అవి వర్షం కురిపిస్తాయి. పర్వతాలకు వెనుక వైపు వర్షం కురవదు. దీనినే 'వర్షచ్ఛాయా ప్రాంతం' అంటారు.

### 4. ఈశాన్య ఋతుపవన కాలం

వేడిమి పెరుగుతున్న నెలల నుండి పొడిగా ఉండే చలి పరిస్థితుల మధ్య అక్టోబర్, నవంబర్ నెలలు సంధి కాలంగా ఉంటాయి. ఈశాన్య ఋతుపవనాల సమయంలో ఆకాశం నిర్మలంగా ఉండడమే కాక ఉష్ణోగ్రతలు పెరుగుతుంటాయి. నేల ఇంకా తేమగా ఉంటుంది. అధిక ఉష్ణోగ్రత, గాలిలో అధిక తేమ వల్ల వాతావరణం చాలా ఉక్కపోతగా ఉంటుంది. దీనిని 'అక్టోబర్ వేడిమి" అంటారు. ఇంతకు ముందు వాయవ్య భారతదేశంలో ఉన్న అల్పపీడన పరిస్థితులు నవంబర్ ఆరంభం నాటికి బంగాళాఖాతంలో ఏర్పడతాయి. అల్పపీడన ప్రాంతం బాగా దక్షిణానికి మారుతుంది. ఈ కాలంలో అండమాన్ ప్రాంతంలో తుఫానులు, వాయుగుండాలు ఏర్పడతాయి.




*పటం–2.2 : భారతదేశం – నైరుతి ఋతుపవనాల ప్రవేశం.*




*పటం–2.3 : భారతదేశం – నైరుతి ఋతుపవనాల నిష్క్రమణం.*

**సాంప్రదాయ భారతీయ ఋతువులు**

భారతదేశ సంప్రదాయం ప్రకారం సంవత్సరాన్ని 6 ఋతువులుగా విభజించారు. ఒక్కొక్క ఋతువు రెండు నెలలు ఉంటుంది.

| ఋతువులు | తెలుగు నెలలు (చాంద్రమాన సంవత్సరం) | ఇంగ్లీషు నెలలు (పశ్చిమదేశాల క్యాలెండర్ ప్రకారం) |
|---|---|---|
| వసంతం | చైత్రం –వైశాఖం | మార్చి –ఏప్రిల్ |
| గ్రీష్మం | జ్యేష్టం – ఆషాడం | మే – జూన్ |
| వర్ష | శ్రావణం – భాద్రపదం | జూలై – ఆగష్టు |
| శరత్ | ఆశ్వయుజం – కార్తీకం | సెప్టెంబర్ – అక్టోబర్ |
| హేమంతం | మార్గశిరం – పుష్యం | నవంబర్ – డిసెంబర్ |
| శిశిరం | మాఘం – ఫాల్గుణం | జనవరి – ఫిబ్రవరి |

## 3.4 భారతదేశ నదులు

మానవజాతి చరిత్రలో నదులు చాలా ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయి. పూర్వ కాలంలో నదీ తీరాల వెంట ప్రజలు తమ నివాసాలు ఏర్పరుచుకున్నారు. అవి తర్వాత కాలంలో పెద్ద నగరాలుగా మారాయి. అంతేకాకుండా ప్రజల జీవనోపాధికి, జలమార్గాలు, జల విద్యుత్ ఉత్పత్తితో పాటు వ్యవసాయం కోసం కూడా నదులు ఉపయోగపడతాయి. భారతదేశంలోని నదులను అవి ప్రవహించే ప్రాంతాలను బట్టి రెండు విభాగాలు చెప్పవచ్చు. అవి: 1. హిమాలయ నదీవ్యవస్థ, 2. ద్వీపకల్ప నదీ వ్యవస్థ.

**1. హిమాలయ నదీ వ్యవస్థ**

- హిమాలయ నదులు జీవ నదులు. ఇవి మంచు కొండల నుండి ఆవిర్భవించడం వలన సంవత్సరమంతా ప్రవహిస్తాయి. ఇవి వర్షపు నీటిని కూడా స్వీకరిస్తాయి.
- క్రమక్షయం ప్రక్రియ ద్వారా ఈ నదులు లోయలను ఏర్పరుస్తున్నాయి.
- నీటిపారుదల సౌకర్యాలు సారవంతమైన నేలలను ఏర్పరుస్తున్నాయి.

హిమాలయ నదీ పరివాహక వ్యవస్థ : దీనిని మూడు విభాగాలుగా చెప్పవచ్చు.


i) సింధు నదీ వ్యవస్థ: జీలం, రావి, చీనాబ్, బియాస్ మరియు సట్లెజ్ నదులు.

ii) గంగా నదీ వ్యవస్థ: యమున, రాంగంగా, ఘాగ్రా, గోమతి, గండక్ మరియు కోసి మొదలైన నదులు.

iii) బ్రహ్మపుత్ర నదీ వ్యవస్థ: దిబాంగ్ లోహిత్ మరియు తీస్తా మొదలైన నదులు.

**2. ద్వీపకల్ప నదులు:**

ముఖ్యమైన ద్వీపకల్ప నదులు గోదావరి, మహానది, కృష్ణ మరియు కావేరి. చాలా వరకు ద్వీపకల్ప నదులు తూర్పుగా ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తున్నాయి. నర్మద మరియు తపతి నదులు మాత్రమే పశ్చిమ కనుమల ద్వారా పశ్చిమ దిశలో ప్రవహించి అరేబియా సముద్రంలో కలుస్తున్నాయి.




*పటం-2.4 : భారతదేశ ద్వీపకల్ప నదులు*

**కృత్యం**

అట్లాస్‌లో భారతదేశ భౌతిక మరియు రాజకీయ పటాలను పరిశీలించి క్రింది పట్టిక ను పూర్తి చేయండి.

| నది | ముఖ్య నదులు | పుట్టినప్రదేశం | ప్రవహించే రాష్ట్రాలు | కలిసే సముద్రం |
|---|---|---|---|---|
| గంగ | | | | |
| బ్రహ్మపుత్ర | | | | |
| సింధు | | | | |
| సట్లెజ్ | | | | |
| గోదావరి | | | | |
| కృష్ణా | | | | |

## 3.5 తెలంగాణ నదులు

తెలంగాణ రాష్ట్ర భూభాగం మొత్తం వాయువ్యం ఎత్తుగా ఉండి అగ్నేయం పల్లంగా ఉండటం వల్ల తెలంగాణలోని నదులు వాయువ్య దిశ నుండి ఆగ్నేయ దిశకు (తూర్పు వైపు) ప్రవహిస్తూ బంగాళాఖాతంలో కలుస్తాయి. తెలంగాణ రాష్ట్రంలో ప్రవహించే ప్రధాన నదులు. అవి: 1. గోదావరి నది, 2. కృష్ణా నది.

**1. గోదావరి నది**

గోదావరి నది తెలంగాణలో అతి పెద్ద నదీ వ్యవస్థ. దీనిని 'దక్షిణ గంగ' అని కూడా పిలుస్తారు. ఇది పశ్చిమ కనుమలలోని 'త్రయంబకేశ్వర్' వద్ద జన్మించింది. గోదావరి నది తెలంగాణలో నిర్మల్ జిల్లాలోని కందుకుర్తి వద్ద ప్రవేశించి సుమారు 600 కిలో మీటర్ల పొడవున ప్రవేశిస్తుంది. దీనిపై తెలంగాణలో శ్రీరామ్‌సాగర్, శ్రీపాద, దమ్ముగూడెం మొదలైన ప్రాజెక్టులు నిర్మించి సాగు నీరు, తాగు నీరు అందిస్తున్నారు. తెలంగాణలో నిర్మల్,

నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ప్రవహిస్తుంది. అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రవహించి చివరగా బంగాళాఖాతంలో కలుస్తుంది. మంజీర, మానేరు, కడెం, హరేద్ర, పెద్దవాగు, ప్రాణహిత, పెన్ గంగ, శబరి, కిన్నెరసాని మొదలైన నదులు గోదావరికి ఉపనదులు. ఈ నదీ తీరంలో దట్టమైన అడవులు, వృక్షజాలం, జంతుజాలం యొక్క గొప్ప జీవ వైవిధ్యం ఉంది. దీని ప్రయాణం పూర్తవగానే సరస్వతీ నదితో కలిసి కాళేశ్వరం వద్ద త్రివేణి సంగమంగా ఏర్పడుతుంది. ఈ నదిపై ఇటీవల తెలంగాణ ప్రభుత్వం కాళేశ్వరం సమీపంలో మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు నిర్మాణం చేసింది.

**2. కృష్ణానది**

మహారాష్ట్రలోని సతారా జిల్లాలో మహాబలేశ్వర్ వద్ద పశ్చిమ కనుమలలో జన్మించి బంగాళాఖాతంలో కలుస్తుంది. సుమారు 416 కిలో మీటర్లు తెలంగాణలో ప్రవహిస్తుంది. తెలంగాణ రాష్ట్రంలో కృష్ణానది నారాయణపేట జిల్లాలోని మక్తల్ మండలం తంగడి గ్రామం వద్ద ప్రవేశిస్తుంది. కొయినా, పంచగంగ, దూద్ గంగ, ఘటప్రభ, మలప్రభ, తుంగభద్ర, భీమ, దిండి, పెద్దవాడు, హాలియా, మూసి, పాలేరు, మున్నేరు మొదలైన నదులు కృష్ణానదికి ఉపనదులు.

### కృష్ణానది ఉపనదులు

**తుంగభద్ర నది:** పశ్చిమ కనుమలలోని కర్ణాటక రాష్ట్రంలో పుట్టి జోగులాంబ జిల్లా సరిహద్దులో కృష్ణానదిలో 'సంగం' అనే ప్రదేశం వద్ద కలుస్తుంది. ఇది కృష్ణానదికి ముఖ్యమైన ఉపనది. తుంగ, భద్ర అనే రెండు నదుల కలయిక వలన తుంగభద్ర నది ఏర్పడింది.

**మూసీ నది:** వికారాబాద్ జిల్లాలో సమీపంలో శివారెడ్డి పేట వద్ద అనంతగిరి కొండల సమీపంలో పుట్టి హైదరాబాద్ మీదుగా ప్రవహిస్తూ, నల్గొండ జిల్లా వాడపల్లి వద్ద కృష్ణా నదిలో కలుస్తుంది. దీన్ని పూర్వ కాలంలో 'ముచుకుంద' నది అని పిలిచేవారు. ఈ నదిపై గండిపేట వద్ద ఉస్మాన్ సాగర్ ఆనకట్ట నిర్మించబడింది. ఈ ఆనకట్ట మహానగరం అయినా హైదరాబాద్, సికింద్రాబాద్ ప్రజలకు తాగునీరు అందిస్తోంది. దీనికి ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ అను ప్రధాన రిజర్వాయర్లు ఉన్నాయి. హైదరాబాద్ నగరంలోని మురికి నీరు, కర్మాగారాల నుంచి వెలువడిన ఈ వ్యర్థ పదార్థాల వల్ల మూసీనది జలాలు తీవ్రమైన కాలుష్యానికి గురవుతున్నాయి.

## 3.5 నదుల పరిశుభ్రతను పాటిద్దాం

భూమిపై గల మొత్తం నీటిలో 97% ఉప్పునీరుగా మహా సముద్రాలలో ఉంది. కేవం 3% మాత్రమే మంచి నీళ్లు. ఈ మంచి నీటిలో 70% అంటార్కిటికా, ఆర్కిటిక్ ఇతర పర్వతాలలో శాశ్వత మంచుపొరగా ఉంది. 29.5% భూగర్భజలంగా ఉంది. అంటే భూమిపై ఉన్న మొత్తం మంచినీటిలో కేవలం 0.5% మాత్రమే చెరువులు, ఆనకట్టలు మరియు నదులలో ఉంది. మన అవసరాలకు తేలికగా అందుబాటులో ఉన్న నీళ్ళు ఇవే. ఈ నీటిపైనే ప్రపంచ మానవాళి ఆధారపడి ఉంది. ఇంత తక్కువ మొత్తంలో ఉన్న నీరు సమస్త జీవరాశులకు ప్రాణాధారం. మంచి నీరు అనేది చాలా ముఖ్యమైన వనరు. మరి నేడు నదులు, సరస్సులు కాలుష్యం బారిన పడి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి.

మన జీవితంలో గర్వించదగ్గ ప్రదేశాలుగా ఈ నదులను చూద్దాం. ఎన్నో నగరాలు, పవిత్ర ప్రదేశాలు నదుల ఒడ్డున వెలిశాయి. గంగా, యమునా నదులను పవిత్ర నదులుగా కోట్ల కొద్దీ ప్రజలు భావిస్తారు. కానీ

ప్రస్తుతం ఇవి కాలుష్యంతో నిండి ఉన్నాయి. 70% కాలుష్యంతో భారతీయ నదులు మురికి కాలువలుగా మారిపోయాయి. దీని వల్ల మానవ ఆరోగ్యంపై మరియు సముద్ర జీవజాలంపై ప్రభావం పడుతుంది. కాలుష్య కారకాలు ప్రజల నిర్లక్ష్యం వలన రోజూ నదులలో కలుస్తున్నాయి. పట్టణాల ద్వారా ప్రవహించే నదులు ఎక్కువగా కాలుష్యానికి గురి అవుతున్నాయి.

భారత ప్రభుత్వం నదుల పరిశుభ్రత గురించి గంగా నీటి పరివాహక కార్య నిర్వాహక ప్రణాళిక మరియు జాతీయ నది పరిరక్షణ ప్రణాళిక వంటివి అమలు పరిచే ప్రయత్నం చేస్తున్నప్పటికీ, సమస్య పరిష్కారం కావడం లేదు. ప్రతి ఒక్కరూ నదిని తనదిగా భావించడంతో పాటు నది దిగువ ప్రాంతంలో నివసించే వారిని దృష్టిలో పెట్టుకోవడం చేయాలని పర్యావరణవేత్తలు చాలా కాలం నుండి కోరుతున్నారు. ప్రజా సంఘాలు మరియు ప్రజల భాగస్వామ్యంతో నీటి పరిశుభ్రత ప్రాముఖ్యాన్ని తెలియజేయవచ్చు.

## 3.6 ముగింపు (ముఖ్యాంశాలు)

- ఒక ప్రదేశంలో, నిర్దిష్ట కాలానికి (ఒక రోజు, ఒక నెల, ఒక సంవత్సరం మొదలగునవి) చెందిన ఉష్ణోగ్రత, వర్షపాతము మొదలైన అంశాల స్థితిని 'వాతావరణం' అంటారు. సాధారణంగా ఒక విశాలమైన ప్రాంతంలో (రాష్ట్రం, దేశం మొదలైనవి) 30 సంవత్సరాల కన్నా ఎక్కువ కాలం ఉండే సరాసరి వాతావరణ పరిస్థితులను 'శీతోష్ణ స్థితి' అంటారు.
- భారతదేశ శీతోష్ణ స్థితిని ప్రభావితం చేసే అంశాలు ఆరు (6). అవి: 1. అక్షాంశ, 2. సముద్రం నుండి దూరం, 3. ఎత్తు, 4. పర్వతశ్రేణులు 5. భూఉపరితల గాలుల దిశ, 6. ఉపరితల వాయుప్రవాహాలు (జెట్ స్ట్రీమ్‌లు)
- భారతదేశ శీతోష్ణ స్థితిని 3 కాలాలుగా విభజించవచ్చు అవి: 1. శీతాకాలం, 2. వేసవికాలం, 3. వర్షాకాలం
- భారతదేశంలోని నదులను ప్రవహించే ప్రాంతాలను బట్టి రెండు విభాగాలుగా చెప్పవచ్చు. అవి : 1. హిమాలయ నదీ వ్యవస్థ 2. ద్వీపకల్ప నదీ వ్యవస్థ
- హిమాలయ నదీ పరివాహక వ్యవస్థ: దీనిని మూడు విభాలుగా చెప్పవచ్చు. 1. సింధునదీ వ్యవస్థ, 2. గంగానదీ వ్యవస్థ, 3. బ్రహ్మపుత్ర నదీ వ్యవస్థ
- ముఖ్యమైన ద్వీపకల్ప నదులు: గోదావరి, మహానది, కృష్ణ మరియు కావేరి, చాలా వరకు ద్వీపకల్ప నదులు తూర్పుగా ప్రవహించి బంగాళాఖాతంలో కలుస్తున్నాయి. నర్మద మరియు తపతి నదులు మాత్రమ పశ్చిమ కనుమల ద్వారా పశ్చిమ దిశలో ప్రవహించి అరేబియా సముద్రంలో కలుస్తున్నాయి.
- తెలంగాణ రాష్ట్రంలో ప్రవహించే ప్రధాన నదులు: గోదావరి, కృష్ణా, మంజీర, ప్రాణహిత, పెన్‌గంగ, మానేరు, శబరి, కిన్నెరసాని, మూసి, దిండి, పాలేరు, మున్నేరు, భీమ, పెద్దవాగు.
- భూమిపై గల మొత్తం మంచి నీటిలో కేవలం 0.5 శాతం మాత్రమే చెరువులు, ఆనకట్టలు మరియు నదులలో ఉంది.
- నేడు నదులు, సరస్సులు, కాలుష్యం బారిన పడి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. కావున నీటిని సంరక్షించుట కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయవలసిన ఆవశ్యకత ఎంతో ఉంది.

## 3.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 1-2 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. వాతావరణం అనగానేమి?
2. ఋతుపవనాలు ఏ అక్షాంశాల వద్ద ఏర్పడతాయి?

**II. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 4-5 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. తెలంగాణలో అత్యధిక ఉష్ణోగ్రత ఎక్కడ ఉంటుంది? అందుకు కారణమేమిటి?
2. ప్రపంచ పవనాలు మరియు ఋతుపవనాల మధ్య గల భేదాలు తెలపండి.

**III. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 8-10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. హిమాలయ నదులు మరియు ద్వీపకల్ప నదుల మధ్య గల భేదమేమి?
2. భారతదేశ శీతోష్ణ స్థితిని ప్రభావితం చేసే అంశాలేవి? ఏవైనా రెండింటిని వివరించండి.

**IV. కింది వాటిలో సరైన జవాబును ఎంపిక చేయండి.**

1. ఈశాన్య ఋతుపవనాల కాలంలో తుఫానులు ఏర్పడే ప్రాంతం ( )

   ఎ) లక్షద్వీప్ బి) అండమాన్ సి) తెలంగాణ డి) ఢిల్లీ

2. పడమరగా ప్రవహించే నదులు ( )

   ఎ) గోదావరి, కృష్ణ బి) తుంగభద్ర, కావేరి

   సి) నర్మద, తపతి డి) మహానది, దామోదర్ నది

## 3.8 ఉపయుక్త గ్రంథాలు

- SCERT, Telangana సాంఘికశాస్త్ర పుస్తకాలు

# 4 సహజ వనరులు

## 4.0 అభ్యసన ఫలితాలు

- సహజ వనరుల లక్షణాలను వివరిస్తారు.
- సహజ వనరులను వర్గీకరిస్తారు.
- సహజ వనరుల ప్రాధాన్యతను వివరిస్తారు.
- సహజ వనరుల క్షీణతకు కారణాలను విశ్లేషిస్తారు.
- సహజ వనరుల పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలను సూచిస్తారు.
- హరిత శక్తిని ఉపయోగిస్తారు.

## 4.1 పరిచయం

**సెప్టెంబర్ 12, 2020 - టైమ్స్ ఆఫ్ ఇండియా**

***సహజ వనరుల రక్షణకై ప్రాణాలను త్యజించిన అమర వీరులకు వందనం***

ధార్వాడ్: శుక్రవారం రోజున సహజ వనరుల రక్షణకై ప్రత్యేకంగా దేశ గొప్ప అడవి సంపదకై ప్రాణాలను త్యజించిన అమర వీరులకు గౌరవ వందనం సమర్పించారు.

ధార్వాడ్‌లో అటవీ శాఖ నిర్వహించిన అటవీ అమర వీరుల దినోత్సవం రోజున అడవి సంపద కాపాడిన వారి త్యాగాలకు గుర్తుగా మూడు రౌండ్ల బుల్లెట్లను గాలిలో కాల్చారు.

ధార్వాడ్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఉమేష్ అడిగ, డిపూటీ కమీషనర్ నితేష్ పాటిల్ మరియు అటవీ రక్షణ ప్రధాన అధికారి (ధార్వాడ్ సర్కిల్) మంజునాథ్ కార్యక్రమంలో పాల్గొని అమర వీరులకు పుష్పగుచ్ఛాలు సమర్పించారు. కార్యక్రమంలో ఉమేష్ అడిగ మాట్లాడుతూ యువతలో సహజ వనరులను కాపాడాలన్న చైతన్యం కల్పించాలి అని అన్నారు. అడవుల పరిరక్షణకై ప్రాణ త్యాగం చేసిన వారి అంకిత భావాన్ని కొనియాడి వారి కుటుంబాలకు తగిన సహాయాన్ని అందించాలన్నారు. ఒక పక్క వారి ప్రాణాన్ని కాపాడుకుంటూ అడవిని కాపాడడం అనేది చాలా కష్టమైన పని అని అన్నారు. సహజ వనరులను రక్షించడం అటవీశాఖ వారి బాధ్యతే కాదు, సమాజంలోని ప్రజలందరు సహజ వనరులను రక్షించి, వాటి రక్షణకై న్యాయ సంస్థలకు సహకారం అందించాలి అని అన్నారు.

- ఈ అంశం దేనికి ప్రాధాన్యతనిస్తుంది?
- మీ జీవితంలో జరిగిన ఇలాంటి సంఘటనలను గుర్తు తెచ్చుకొని మీ స్నేహితులతో పంచుకోండి.
- ఇలాంటి వ్యాసాలు వార్తా పత్రికల నుండి సేకరించండి.

## 4.2 సహజ వనరులు

ఒక అవసరాన్ని తీర్చే వస్తువు లేక ఆధారాన్ని 'వనరు' అని అంటాం. మానవ జోక్యం లేకుండా ప్రకృతిలో సహజ సిద్ధంగా ఏర్పడే వనరులను 'సహజ వనరులు' అని అంటారు. ఈ వనరులు మన గ్రహం భూమి యొక్క భాగం. ఇవి మన చుట్టు కనబడుతాయి. ఈ వనరులను ఇతర వస్తువుల ఉత్పత్తిలో ఉత్పాదకాలుగా వాడుతారు. మన చుట్టూ చాలా వనరులు ఉన్నప్పటికి కొన్ని వనరులు చాలా విలువైనవి. ఎందుకు అలా? మనుషులు ఆ వనరులకు వేరే వనరుల కన్నా అధిక ప్రాధాన్యత ఇస్తారు. వనరులన్నీ మానవాళి యొక్క ఆరోగ్యం, సంపద మరియు శ్రేయస్సును సృష్టించుటకు ఆధారాలు.

**కృత్యం:**

మీరు ప్రతి రోజు ఉపయోగించే, అరుదుగా ఉపయోగించే, ఎప్పుడు ఉపయోగించని సహజ వనరుల జాబితాను తయారు చేసి క్రింది పట్టికను పూరించండి.

*పట్టిక-1: సహజ వనరుల ఉపయోగం*

| సహజ వనరులు | ప్రతిరోజు | అరుదుగా | ఎప్పుడు ఉపయోగించని |
|---|---|---|---|
| | | | |

## 4.3 సహజ వనరుల వర్గీకరణ

అన్ని సహజ వనరులు ఒకే రకమైనవా? వాటి మధ్యన ఏవైనా భేదాలు ఉన్నాయా? సహజ వనరులను క్రింది విధంగా వర్గీకరించవచ్చు.

సహజ వనరులు

- పునరుద్ధరింపబడే వనరులు
- పునరుద్ధరింపబడని వనరులు

పునరుద్ధరింపబడే వనరులు: మళ్ళీ పునరావేశం చేయబడే వనరులను పునరుద్ధరింపబడే వనరులుగా పరిగణించచవచ్చు.

ఉదా: అలలు, పవనాలు

పునరుద్ధరించలేని వనరులు: అతి కష్టంగా పునరావేశం అయ్యే వనరులను పునరుద్ధరించబడని వనరులుగా పరిగణించవచ్చు.

ఉదా: శిలాజ ఇంధనాలు, ఖనిజాలు (బొగ్గు, ఇనుము, మైకా మొదలైనవి)

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. క్రింద పట్టికను పూరించండి.

| సహజ వనరులు | సహజ వనరుల రకం | సహజ వనరుల ఉపయోగం |
|---|---|---|
| | | |

2. ఏ రకమైన సహజ వనరులు మీ చుట్టూ ఉన్నవి? కొన్ని ఉదాహరణలివ్వండి.


## 4.4 పునరుద్ధరించబడే శక్తి వనరులు

పెరుగుతున్న జనాభా దృష్ట్యా సహజ వనరుల అవసరం అధికంగా ఉంది. ఒక వైపు అత్యవసరంగా పునరుద్ధరింపబడని వనరుల వెలికితీసి తగ్గిస్తూ మరో వైపు పెరుగుతున్న జనాభా అవసరాలను తీర్చడం మానవాళికి పెద్ద సవాలుగా మారింది. ఈ పరిస్థితులలో ప్రస్తుత అవసరాలను తీరుస్తూ భవిష్యత్ తరాలకు ఈ వనరులను అందించేందుకు ఏవైనా ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నాయా? పునరుద్ధరింపబడే వనరుల వినియోగం మాత్రమే పరిష్కారం. పునరుద్ధరింపబడే శక్తి వనరు అనగా ప్రకృతి సాధారణంగా ఇచ్చే వనరులు. ఉదా: సూర్యరశ్మి, పవనాలు, అలలు. సాధారణంగా ఈ శక్తినిచ్చే వనరులను పునరుద్ధరింపబడని వనరులకు ప్రత్యామ్నాయంగా పరిగణిస్తారు. ఈ వనరుల నుండి ఉత్పత్తయ్యే శక్తిని హరిత శక్తి (green energy) అని అంటారు. పునరుద్ధరింపబడే శక్తి వనరులు ఇవి:

1. **బయో మాస్ ఎనర్జీ (Bio-mass energy):** జంతువులు, వృక్షాల నుండి లభించిన సేంద్రియ పదార్థాలను ఉపయోగించి ఉత్పత్తి చేసే శక్తి బయో మాస్ ఎనర్జీ.
2. **జల శక్తి:** నీటిని ఉపయోగించి విద్యుత్ శక్తిని ఉత్పత్తి చేయడం.
3. **భౌగోళిక ఉష్ణ శక్తి (Geo thermal energy):** భూమి పొరల యందు ఉత్పన్నమయ్యే ఉష్ణోగ్రతను వినియోగించుకొని ఉత్పత్తి చేసే శక్తి భౌగోళిక ఉష్ణ శక్తి.
4. **పవన శక్తి:** పవనాలు వీస్తున్నప్పుడు టర్బైన్ల ద్వారా ఉత్పత్తి చేసే శక్తియే పవన శక్తి.
5. **సౌర శక్తి:** సూర్యరశ్మిని ఉపయోగించి ఉత్పత్తి చేసే శక్తిని సౌర శక్తి అని అంటారు.

6. **అలల శక్తి (Tidal energy):** సముద్ర అలలు ఎగసిపడుతున్నప్పుడు ఆ శక్తిని ఉపయోగించుకొని ఉత్పత్తి చేసే శక్తియే అలల శక్తి.

**పునరుద్ధరింపబడని వనరులు:** భారతదేశంలో పునరుద్ధరింపబడని వనరుల లభ్యత ఈ పటంలో గమనించవచ్చు.




*పటం-4.1: భారతదేశం - ఖనిజాలు*

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. హరిత శక్తి (green energy) వినియోగంపై చైతన్యం కలిగించడానికి ఒక కరపత్రాన్ని తయారు చేయండి.
2. మీ నిత్య జీవితంలో మీరు హరిత శక్తిని ఎలా ఉపయోగిస్తారు?

## 4.5 సహజ వనరుల ప్రాధాన్యత

జీవరాశులు ఉండే ఒకే ఒక గ్రహం భూమి. సహజ వనరులు లేకపోతే ఇది సాధ్యం కాదు. భూమిపై జీవ, నిర్జీవ వనరుల పరస్పర కలయిక వల్ల జీవనం కొనసాగుతుంది.

### సహజ వనరుల ప్రయోజనాలు

**పేదలకు ప్రయోజనకరమైనవి:** పేదలు కొన్ని అవసరాలను తీర్చుకొనుటకు సహజ వనరులపై కొంత వరకు ఆధారపడతారు. ప్రత్యేకంగా, ఎప్పుడైతే వారి వద్ద ఖర్చు చేయడానికి డబ్బు ఉండదో అప్పుడు వారి తిండి మరియు ఇంటి అవసరాలు తీర్చుకొనుటకు ఈ వనరులపై ఆధారపడతారు. వారు చిన్న చిన్న గాయాలు మానుటకు కూడా ఔషధ మొక్కలను ఉపయోగిస్తారు.

**ఉపాధి సృష్టి కల్పన:** ప్రత్యేకంగా గ్రామీణ ప్రజలకు, సహజ వనరులు ఉపాధి కల్పిస్తాయి. చాలా దేశాల ఆర్థిక వ్యవస్థకు ఈ రోజు కూడా వ్యవసాయం వెన్నెముక. సారవంతమైన భూములు, మరియు నీటి లభ్యత పరిశ్రమలు మరియు సేవా రంగంలో కూడా ఉపాధి కల్పిస్తాయి. కొన్ని సార్లు ఈ వనరులు సహజ పెట్టుబడిగా మారుతాయి. పారిశ్రామిక విప్లవం తర్వాత పరిశ్రమ రంగంలో ఉపాధి అవకాశాలు తగ్గాయి అన్నది గమనార్హం. అయినప్పటికీ పునరుద్ధరింపబడే శక్తి వినియోగ రంగంలో ఉపాధి అవకాశాలు క్రమంగా పెరుగుతున్నాయి. వ్యవసాయ మరియు పరిశ్రమల రంగంలో సుస్థిరాభివృద్ధి పద్ధతులు అవలంభిస్తే ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

**ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక:** సహజ వనరులు ఒక దేశ ఆర్థిక వ్యవస్థకు వరం లాంటివి. సహజ వనరులు లేకపోతే వస్తు మరియు సేవల ఉత్పత్తి మరియు పంపిణీ ఉండదు. ఇవి అన్ని రంగాలలో అనగా వ్యవసాయం, పరిశ్రమ, సేవా రంగాలలో ఉపయోగపడతాయి. ఇవి ఆర్థిక వ్యవస్థ యొక్క రెండు సవాళ్ళకు (పేదరిక నిర్మూలన, ఉపాధి అవకాశాలు పెంచుట) పరిష్కారం చూపుతాయి. కనుక సహజ వనరులు ఒక దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటివని మరియు వాటి వినియోగం సుస్థిరాభివృద్ధికి దారి తీస్తాయని అనడంలో అతిశయోక్తి లేదు. కావున, వనరుల యొక్క విలువ ఉత్పత్తి చేసిన వస్తువుల కన్నా ఎక్కువ.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. సహజ వనరుల ప్రాధాన్యతను తెలుపుతూ ఒక పోస్టర్‌ను తయారు చేయండి.

## 4.6 సహజ వనరుల క్షీణత

మానవాళి సహజ వనరులను ఉపయోగిస్తుందా, మితిమీరి వాడుతుందా, దుర్వినియోగం చేస్తుందా? సహజ వనరుల వాడకం వాటి పునరుద్ధరింపబడే సమయాని కన్నా వేగంగా ఉంటే అవి క్షీణిస్తాయి. ఒక వనరును నిరంతరంగా వెలికి తీస్తే అది ఒక అరుదైన వనరుగా మారి కాలక్రమేణా అంతరించిపోతుంది. ఈ వనరులు ఏర్పడడానికి కొన్ని మిలియన్ల సంవత్సరాలు పడుతుంది, ప్రత్యేకంగా పునరుద్ధరింపబడని వనరులు. ఈ మధ్య

కాలంలో నిరంతరంగా వనరులను వెలికి తీసినట్లయితే ఇవి క్షీణిస్తాయి. ఈ వనరులు అందుబాటులో లేకపోతే మానవాళి మనుగడకే ముప్పు. పునరుద్ధరింపబడని వనరులను నిరంతర వెలికితీస్తే భవిష్యత్ తరాలు వీటిని పొందలేరు మరియు ప్రస్తుత తరం వారు కాలుష్యం వలన చాలా సమస్యలను ఎదుర్కొంటారు.

### సహజ వనరుల క్షీణతకు కారణాలు

- **జనాభా విస్ఫోటం:** జనాభా నిరంతరంగా పెరుగుతుంది. ఇది సహజ వనరుల వినియోగం పెంచడానికి దారి తీస్తుంది. తరచూ పెరుగుతున్న డిమాండ్‌కి అనుగుణంగా ఎక్కువ సహజ వనరులను వెలికి తీయడంతో అవి క్షీణిస్తాయి.
- **అడవుల నరికివేత:** పెరుగుతున్న జనాభా ఆహార, ఆశ్రయ అవసరాలను తీర్చుటకు అడవులను నరికి ఎక్కువ భూమిని పండిస్తున్నారు. అందువలన జీవావరణం వర్షం మరియు ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుంది.
- **పారిశ్రామిక విప్లవం:** పారిశ్రామిక విప్లవం వలన ఎంతో సాంకేతిక పురోగతి జరిగింది. యంత్రాలు మరియు సాంకేతికత వాడడం వలన ఉత్పత్తి పెరిగి ముడి పదార్థాలకై డిమాండ్ పెరిగింది.

### సహజ వనరుల క్షీణత ప్రభావం

- సహజ వనరులను అధికంగా వెలికి తీయడం వల్ల శీతోష్ణ స్థితిపై ప్రతికూల ప్రభావం ఉంటుంది. ప్రపంచ వ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో శీతోష్ణ స్థితి మారిపోతుంది. అందువల్ల ఆకస్మిక వరదలు సంభవించడం, హిమానీనదాలు కరిగి నీటి మట్టం పెరిగి ద్వీపాలు ముంపుకు గురవుతాయి. వీటి వలన ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది.
- అపరిమితంగా సహజ వనరులు వాడడం వల్ల కొన్ని జాతులు, జంతువులు, చెట్లు అంతరించిపోతాయి.
- క్రమేణా సహజ వనరుల క్షీణత భూమిపై మానవ మనుగడను విధ్వంసం చేస్తుంది.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. అంతరించిపోయిన, అంతరించడానికి దగ్గరలో ఉన్న వృక్షాలు, మొక్కలు, జంతువులు, పక్షులు, సముద్ర జీవుల జాబితా తయారు చేయండి.
2. అంతరించిపోవడానికి దగ్గరలో ఉన్న జీవరాశుల, వృక్షాల పరిరక్షణకై ఒక కరపత్రం తయారు చేయండి.

## 4.7 వనరుల పరిరక్షణ

వనరును రక్షించినట్లయితే వనరును ఉత్పత్తి చేసినట్టు. భూమిపై జీవనాన్ని కొనసాగడానికి అత్యవసరంగా సహజ వనరులను పరిరక్షించాలి. వనరుల పరిరక్షణ సుస్థిరాభివృద్ధికి దారి తీస్తుంది.

### వనరుల పరిరక్షణ

- ఈ చర్యలను తక్షణం చేపట్టి వనరులను రక్షించాలి.
- పునరుద్ధరింపబడని వనరుల వెలికితీత క్రమంగా తగ్గించాలి.
- ప్రత్యామ్నాయ ముడి పదార్థాల వినియోగాన్ని ప్రోత్సహించాలి.

- పెద్ద ఎత్తున పునరుద్ధరింపబడే వనరుల ఉత్పత్తి మరియు వాడకం చేపట్టాలి. పునరుద్ధరింపబడే వనరుల ఉత్పత్తి పెరిగితే, వాటి ధర తగ్గుతుంది దాని వల్ల అందరు వాటిని వాడుకోగలుగుతారు.
- వనరుల ఉత్పత్తి మరియు వాడకం వాటిని సంరక్షించేలా రూపాంతరం చెందాలి.
- వ్యర్థ పదార్థాల నిర్వహణను ప్రోత్సహించాలి.
- వాడిన నీటిని (treatment of used water) మరియు దాని పునర్వినియోగం ఈ నాలుగింటిని అనుసరించాలి.
- తగ్గించు (reduce)– వనరుల వినియోగాన్ని తగ్గించాలి.
- పునర్వినియోగం (reuse)– వనరులను తిరిగి చాలా సార్లు వినియోగించాలి.
- తిరిగి ఉపయోగించు (recycle)– వనరులను మళ్ళీ భవిష్యత్ ఉపయోగానికి సిద్ధం చేయాలి.
- నిరాకరించడం (refuse)– అవసరం లేకపోతే వనరుల వినియోగం ఉపయోగం నిరాకరించాలి.
- సహజ వనరులను రక్షించాలని వివిధ వర్గాలలో చైతన్యాన్ని కల్పించాలి.
- అధోకరణం కాని వస్తువులను వినియోగించకూడదు.
- ప్రజలు, సంస్థలు మరియు అందరూ కలిసి సహజ వనరులను రక్షించాలి.

**మీ ప్రగతిని పరీక్షించుకోండి**

1. గత 6 నెలల్లో వచ్చిన నీటి బిల్లును సేకరించి నీటి వినియోగాన్ని (ltr/ gallon) పరిశీలించండి. మీ కుటుంబ సభ్యులలో మరియు మీ ఇంటి ఇరుగు పొరుగు వారిలో నీటిని కాపాడాలన్న చైతన్యాన్ని కల్పించండి.
2. భూగర్భ జలాలను వెలికి తీయడం మరియు అధిక వినియోగం తగ్గించడంపై ఒక పోస్టరును తయారు చేయండి.
3. మీ ప్రాంతంలో ఇంకుడు గుంతల తవ్వకంపై ప్రజలలో చైతన్యాన్ని కల్పించండి.

కావున సహజ వనరులకు ప్రత్యామ్నాయం లేదు. మానవాళి వీటిని ఖచ్చితంగా కాపాడాలి. ప్రజలందరి, సంస్థలు మరియు ప్రభుత్వం సమిష్టి బాధ్యత వహించి ఈ వనరులను పరిమితంగా ప్రస్తుతం వినియోగించుకొని భవిష్యత్ తరాలకు అందజేయడం అనేది **ప్రతి ఒక్కరి ప్రాథమిక విధి.**

## 4.8 ముగింపు (ముఖ్యాంశాలు)

- మానవ జోక్యం లేకుండా ప్రకృతిసిద్ధంగా ఏర్పడే వనరులను 'సహజ వనరులు' అని అంటారు.
- తిరిగి ఏర్పడే / పునరుద్ధరింపబడే వనరులను 'పునరుద్ధరింపబడే వనరు' అంటారు.
- అతి కష్టంగా ఏర్పడే వనరులను 'పునరుద్ధరింపబడని వనరులు' అని అంటారు.
- భారతదేశంలో చాలా సహజ వనరులు దేశమంతటా కలవు.
- సహజ వనరులను అధికంగా వెలికి తీస్తే క్షీణిస్తాయి.
- దేశంలోని సహజ వనరులను భద్రపరిచే బాధ్యత ప్రతి ఒక్క పౌరుడిపై ఉంటుంది.

## 4.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 1-2 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. సహజ వనరులు అనగానేమి?
2. శిలాజ ఇంధనం పునరుద్ధరింపబడని వనరుగా ఎందుకు పరిగణింపబడినది?
3. పునరుద్ధరింపబడే ఏవైనా రెండు వనరులను పేర్కొనండి.

**II. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 4-5 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. వివిధ హరిత శక్తి వనరులను వివరించండి.
2. సహజ వనరులు ప్రాధాన్యత ఏమిటి?

**III. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 8-10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. సహజ వనరులు క్షీణించడానికి కారణాలు ఏమిటి? దాని ప్రభావం ఎటువంటిది?
2. సహజ వనరులను నీవు ఎట్లా కాపాడుతావు?

**IV. కింది వాటిలో సరైన జవాబును ఎంపిక చేయండి.**

1. ప్రతి గృహం నందు సులభంగా ఉపయోగపడే శక్తి వనరు ( )

   ఎ) అలల శక్తి బి) పవన శక్తి సి) సౌర శక్తి డి) భౌగోళిక ఉష్ణ శక్తి

2. సరికాని వాక్యాన్ని గుర్తించండి ( )

   ఎ) సహజ వనరులను రక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత.

   బి) అతి కష్టంగా ఏర్పడే వనరులను పునరుద్ధరింపబడే వనరులు అని అంటారు.

   సి) మళ్ళీ పునరావేశం చేయబడే వనరులను పునరుద్ధరింపబడే వనరులని అంటారు.

   డి) అడవుల నరికివేత సహజ వనరుల క్షీణతకు కారణం.

## 4.10 ఉపయుక్త గ్రంథాలు


- SCERT, Telangana సాంఘికశాస్త్ర పుస్తకాలు

# 5 ఖండాలు, మహాసముద్రాలు

## 5.0 అభ్యసన ఫలితాలు

- భూమిపై ఖండాలు ఏర్పడిన తీరును వివరిస్తారు.
- ప్రపంచ పటంలో ఖండాలను, మహాసముద్రాలను గుర్తిస్తారు.
- వివిధ ఖండాల ముఖ్య అంశాలను వివరిస్తారు.
- మహాసముద్ర విస్తరణను గురించి వివరిస్తారు.
- సముద్రపు వనరుల గురించి వివరిస్తారు.
- మహాసముద్రాలలో కాలుష్యంపై వ్యాఖ్యానిస్తారు

## 5.1 పరిచయం

ఈ భూమి మీద కోట్లాది జంతువులు, వృక్షజాలం, సూక్ష్మజీవులతో పాటు మనం నివసిస్తున్నాం. ఈ భూమి మీద మానవ జీవితం లక్షకు పైగా సంవత్సరాల క్రితం ఉద్భవించింది. ఇతర జీవులు లాగా కాకుండా మనుషులు భూమిని మరింత మెరుగైన నివాస ప్రదేశంగా చేయడానికి కృషి చేస్తున్నారు. భూవనరులను యథేచ్ఛగా దోచుకోవడం వల్ల అడవులు, నదులు, కొండలు నాశనమయ్యాయి.

భూమి మీద ఖండాలు, మహా సముద్రాలను మొదటి శ్రేణి భూస్వరూపాలు అంటారు. అతి పెద్దవైన జల భాగాలను మహాసముద్రాలు అంటారు. భూగోళ శాస్త్రం భూమి అంతర్భాగాలను మాత్రమే కాకుండా భూమిపై ఉన్న ఖండాలు, మహాసముద్రాలు గురించి కూడా పరిశీలిస్తుంది. మరి మనం భూగోళశాస్త్రం ఎందుకు చదవాలి? మనం భూమిపై సౌకర్యవంతంగా ఎలా ఉండాలో తెలుసుకోవాలంటే భూమిపై గల వివిధ ఖండాలు, వివిధ ప్రాంతాల గురించి తెలుసుకోవాలి.

## 5.2 భూ పరిణామక్రమం



పటం–5. 1:

భూమి అత్యంత వేడిమి గల గ్రహంగా ఉండేదని కాలక్రమంలో చల్లబడి పైపొర (భూపటలం) మాత్రమే గట్టిగా మారిపోయిందని భూమధ్య భాగం ఇంకా ద్రవ రూపంలోనే వేడిగా ఉందని శాస్త్రజ్ఞులు విశ్వసిస్తున్నారు. భూమి లోపలి భాగం కూడా చల్లబడుతూ, సంకోచం చెందుతూ ఉంటే, పైపొర ముడతలు పడి ఎత్తులు అంటే కొండలు, పల్లాలు తర్వాత సముద్రాలుగా ఏర్పడ్డాయి. భూమి వాతావరణంలో నీటి


ఆవిరితో పాటు సహా అనేక రకాల వాయువులు ఉన్నాయి. అయితే మనం జీవించడానికి అనుకూలమైన వాతావరణం రూపొందడానికి చాలా కాలం పట్టింది. భూమి చరిత్రలో చాలా కాలం ఎటువంటి ప్రాణి లేకుండా నిర్జీవంగా గడిచింది. ఆ తర్వాత సముద్రాలలో జీవం ప్రారంభమైంది. లక్షల సంవత్సరాల పరిణామ క్రమంలో అనేక రకాల మొక్కలు, జంతువులతో పాటు మానవులు రూపాంతరం చెందారు.

మనం భూమి అంతర్భాగాన్ని పరిశీలించినట్లయితే, భూ కేంద్రకం భూ ఉపరితలం నుండి 6,000 కిలో మీటర్ల లోతులో ఉంటుంది. భూమి లోపలి పొరల్లో వేడి అధికంగా ఉంటుంది. అందుకే భూమి పొరల్లోని లోపలి భాగాల్లో లోహాలు, శిలలు ద్రవ రూపంలో ఉంటాయి. భూమిలో అనేక ప్రాంతాల్లో పైపొర తిరిగి మధ్య పొరలోకి ప్రవేశించి ద్రవంగా మారుతుంది. ఈ విధంగా భూపటలం నిత్యం ఏర్పడుతూ, నశిస్తూ ఉండటం వల్ల భూమి ఇంకా సక్రియంగా ఉందన్న వాస్తవాన్ని తెలియజేస్తుంది. భూమి లోపలి పొరల్లోని ప్రక్రియల వల్ల భూకంపాలు, అగ్నిపర్వతాలు ఏర్పడతాయి.


## 5.3 భూ పటం యొక్క కదలికలు మరియు మార్పులు

భూమి చరిత్రలో ఎన్నో అద్భుతమైన ఘటనలు చోటుచేసుకున్నాయని శాస్త్రవేత్తల పరిశోధనలు ద్వారా తెలిపారు. ఖండాల, మహా సముద్రాల ప్రస్తుత స్థితిని కొంత మేరయినా వివరించటానికి 20వ శతాబ్ద ఆరంభంలో జర్మనీకి చెందిన వాతావరణ, భూభౌతిక శాస్త్రవేత్త అయిన ఆల్ఫ్రెడ్ వెజినర్ ఖండచలన సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. మిలియన్ల సంవత్సరాల క్రితం పాంజియా అనే మహాఖండం పాంథాల్స అనే జలభాగంచే ఆవరించబడి ఉండేదని అతను ప్రతిపాదించాడు. పాంజియా ఒక ఊహాత్మకమైన ఖండం. ఈ పాంజియా అనే మహాఖండం, రెండు భాగాలుగా విడిపోయిందని ప్రతిపాదించాడు. అవి: 1. లారేషియా లేదా అంగారా భూమి, 2. గోండ్వానా భూమి.


ఈ రెండు భాగాలు టెథిస్ సముద్రం అనే పొడవైన, లోతు తక్కువ సముద్రంతో వేరు చేయబడ్డాయి. భూమి




పటం–5. 2:




పటం–5. 3:




పటం–5. 4:

మీద ప్రస్తుతం ఉన్న ఖండాల రూపంలోకి రావడానికి కొన్ని మిలియన్ సంవత్సరాల సమయం పట్టింది. ఇప్పటికీ కూడా పలు ఖండాలు మెల్లగా కదులుతూనే ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న భూభాగమంతా ఈ రెండు ప్రధాన భూఖండాల నుంచి ఏర్పడ్డవే. భారతదేశ ద్వీపకల్పం గోండ్వాన భూభాగం లోనిది. 200 మిలియన్ సంవత్సరాల క్రితం గోండ్వానా భూభాగం ముక్కలుగా విడిపోయి, భారతదేశ ద్వీపకల్ప ఫలకం ఈశాన్య దిశగా పయనించి చాలా పెద్దదైన యురేషియా ఫలకం (అంగార భూమి) తో ఢీకొంది. ఇలా ఢీకొనడం వల్ల, లక్షల సంవత్సరాల క్రమంలో ముడత పడటం ద్వారా పర్వతాలు ఏర్పడ్డాయి. ఉదా: హిమాలయాలు.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

- పాంజియా అనగానేమి?
- భారతదేశ ద్వీపకల్పం ఏ ఫలకంతో ఢీకొన్నది?

## 5.4 ఖండాలు

భూమిపై విస్తరించి ఉన్న పెద్ద భూభాగాలను ఖండాలు అని పిలుస్తాం. ఖండాలు, మహాసముద్రాలు, సముద్రాలతో వేరుచేయబడి ఉన్నాయి. భూమిని 7 ఖండాలుగా విభజించడం జరిగింది.

ఖండాలు: ఆసియా, ఆఫ్రికా, ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా, యూరప్, ఆస్ట్రేలియా మరియు అంటార్కిటికా.

మనం ప్రపంచ పటాన్ని గమనించినట్లయితే, ఎక్కువ ఖండాలు ఉత్తరార్ధ గోళంలోనే ఉన్నాయని గుర్తిస్తాం. ఇప్పుడు మనం ఖండాల గురించి తెలుసుకుందాం.

### కృత్యం

- కింది పటంలో మహా సముద్రాలను, ఖండాలను గుర్తించండి.



*పటం–5.5: ప్రపంచ పటం*

### 5.4.1 ఆసియా ఖండం

అన్ని ఖండాలలోకెల్లా ఆసియా అతిపెద్ద ఖండం. పశ్చిమాన మధ్యధరా సముద్రం నుండి తూర్పున పసిఫిక్ మహా సముద్రం వరకు విస్తరించి ఉంది. ప్రపంచంలోని భూభాగంలో దాదాపు మూడింట ఒక వంతు వాటా ఆసియా ఖండానిదే. ఆసియా ఖండం 10 డిగ్రీల దక్షిణ అక్షాంశం నుండి 80 డిగ్రీల ఉత్తర అక్షాంశం వరకు విస్తరించి ఉంది. ప్రధాన భూభాగం ఉత్తరార్థ గోళంలో ఎక్కువ విస్తరించి ఉంది. రేఖాంశాల పరంగా చూసుకుంటే ఆసియా ఖండం 25 డిగ్రీల తూర్పు రేఖాంశం నుండి 170 డిగ్రీల పశ్చిమ రేఖాంశం వరకు విస్తరించి ఉంది. ఆసియాకు పశ్చిమాన యూరల్ పర్వతాలు, దక్షిణాన హిందూ మహాసముద్రం, తూర్పున పసిఫిక్ మహాసముద్రం, ఉత్తరాన ఆర్కిటిక్ మహాసముద్రం ఉన్నాయి.

**పర్వతాలు, మైదానాలు, నదులు:**

అన్ని ఖండాలలోకెల్లా ఆసియా అత్యంత పర్వత ప్రాంతం కలిగిన ఖండం. ప్రపంచంలోని ఎత్తైన శిఖరాలలో 50 కి పైగా ఆసియాలో ఉన్నాయి. ఎవరెస్ట్ శిఖరం 8,848 మీటర్లతో ప్రపంచంలోనే ఎత్తైన శిఖరంగా ఉంది. కారకోరం శ్రేణిలోని K2 పర్వత శిఖరం రెండవ ఎత్తైన శిఖరం. ఇది భారతదేశంలోని ఎత్తయిన శిఖరం.

ఆసియా ఖండంలో ఎన్నో పీఠభూములు ఉన్నాయి. టిబెట్ పీఠభూమి ప్రపంచంలోనే ఎత్తయిన పీఠభూమిగా ప్రసిద్ధి చెందినది. దీనిని 'ప్రపంచ పైకప్పు' అని పిలుస్తారు. హిమానీనదాలకు ఇది జన్మస్థానం. ఆసియా ఖండంలోని దక్షిణ భాగంలో అతి ప్రాచీన దక్కన్ పీఠభూమి ఉంది.

భారతదేశంలో గంగా, సింధు, బ్రహ్మపుత్ర, గోదావరి, కృష్ణ నదులు ముఖ్యమైనవి. ఇరాక్‌లో టిగ్రిస్, యూఫ్రాటిస్; చైనాలో యాంగ్జియాంగ్, హోయాంగ్ హో, మెకాంగ్; మయన్మార్‌లోని ఐరావత్ నదులు ముఖ్యమైనవి. పై నదులు ఆయా దేశాల్లో ప్రముఖమైన మైదానాలను ఏర్పరిచాయి. భారతదేశంలోని గంగా సింధూ మైదానాలు చాలా సారవంతమైనవి.

ఆసియా ఖండంలో అనేక ద్వీపాలు ఉన్నాయి. ఫిలిప్పీన్స్, ఇండోనేషియా, జపాన్ మరియు తైవాన్‌లు ప్రధాన ద్వీప దేశాలు. ప్రపంచంలోనే పెద్ద దీవుల సముదాయం ఇండోనేషియా. భారతదేశంలోని అండమాన్ నికోబార్, లక్ష దీవులు కూడా దీవుల సముదాయాలే.

**శీతోష్ణ స్థితి:**

ఈ ఖండం ఉత్తర ధృవంలోని సైబీరియా ప్రాంతం నుండి ఉష్ణ మండలంలోని ఇండోనేషియా వరకు అనేక రకాల వాతావరణ ప్రదేశాలను కలిగి ఉంది. ఆసియా మధ్య భాగంలో తూర్పు – పశ్చిమ దిశలో విస్తరించిన హిమాలయ పర్వత శ్రేణులు వాతావరణంపై ప్రభావం చూపిస్తున్నాయి. చలికాలంలో మధ్య ఆసియా ఖండంలో కూడా ఉష్ణోగ్రతలు $0^o$ కంటే తక్కువ నమోదు అవుతూ, అత్యంత చల్లగా ఉంటుంది. సైబీరియన్ ప్రాంతంలోగల వెర్కోయానిస్క్ అత్యంత చల్లని ప్రదేశం ($-67.68^oC$). ఆసియా ఖండాంతర్భాగంలో వేసవికాలంలో చాలా వేడిగా ఉండి, తక్కువ వాయుపీడనం కలిగి ఉంటుంది. వేసవి సమయంలో భూమధ్యరేఖ ప్రాంతంలోని సముద్రాలలో అత్యధిక వాయుపీడనం కలిగి ఉండటం వలన ఇక్కడ ఏర్పడిన పవనాలు మధ్య మరియు ఉత్తర ఈశాన్య ప్రాంతం వైపు వెళ్లడం వలన వేసవి కాలంలో వర్షాలు కురుస్తాయి. దీనిని ఋతుపవన శీతోష్ణ స్థితి అంటారు.

భారతదేశ ఈశాన్య ప్రాంతంలో గల మాసిన్‌రాం ప్రపంచంలో అత్యధిక వర్షపాతం నమోదు అయిన ప్రాంతాలలో ఒకటిగా గుర్తింపు పొందింది. ఆసియాలోని ఫిలిప్పీన్స్, ఇండోనేషియా, మలేషియా, దక్షిణ చైనా, జపాన్లలో ఋతుపవనాల కారణంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయి.

**వ్యవసాయం:**

ఆసియా ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయం. సారవంతమైన నేలలు, తగిన నీటి పారుదల, శీతోష్ణ స్థితి మొదలైనవి వ్యవసాయానికి అనుకూలమైన అంశాలు. ఈ ఖండంలో పురాతన వ్యవసాయ పద్ధతుల నుండి ఆధునిక వ్యవసాయ విధానం వరకు కొనసాగుతున్నది. విస్థాపన (shifting), సాంద్ర (intensive), విస్తృత (extensive) పద్ధతులలో వ్యవసాయం చేస్తున్నారు. వరి, గోధుమ, రై, ఓట్లు, చిరుధాన్యాలు మొదలైన ఆహార పంటలు పండిస్తారు. పత్తి, జనుము, చెరుకు, తేయాకు, పొగాకు మొదలగు వాణిజ్య పంటలను విస్తారంగా పండిస్తారు. ఆసియా ఖండంలో ఇనుము, మాంగనీసు, బాక్సైట్, మైకా, టిన్, బొగ్గు, చమురు మరియు సహజ వాయువు ముఖ్యమైన సహజ ఖనిజ వనరులు.

**జనాభా:**

ప్రపంచ జనాభాలో 60% ఆసియాలో నివసిస్తున్నారు. ప్రపంచంలోని మూడవ వంతు ప్రజలు చైనా మరియు భారతదేశంలో నివసిస్తున్నారు. ఆసియాలో 40 కి పైగా దేశాలు ఉన్నాయి. సైబీరియా ఉత్తర తూర్పు ప్రాంతాలు, థార్, అరేబియా ఎడారి ప్రాంతాలలో తక్కువ జనాభా ఉంది. బంగ్లాదేశ్ అత్యధిక జనసాంద్రత కలిగిన దేశంగానూ మంగోలియా అత్యల్ప జనసాంద్రత ఉన్న దేశాలుగానూ గుర్తించవచ్చు. నదీతీర ప్రాంతాలు, మైదానాలు, డెల్టా నగరాలలో జనాభా విస్తరించి ఉంది. ఆసియాలో ఎక్కువ జనాభా గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్నారు.

> భూమి మీద దాదాపు 24 కోట్ల ఏళ్ళ కిందట భారీ డైనోసార్లు ఆవిర్భవించాయి.

## మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. ఉత్తరార్ధ గోళంలో ఉన్న ఖండాలేవి?

## 5.4.2 ఆఫ్రికా

ప్రపంచంలో రెండో అతిపెద్ద ఖండం ఆఫ్రికా. ఇది $37^{0}3'$ ఉత్తరక్షాంశం నుంచి $35^{0}$ల దక్షిణ అక్షాంశం వరకు వ్యాపించి ఉంది. భూమధ్యరేఖ, కర్కటరేఖ, మకరరేఖలు మరియు గ్రీనిచ్ రేఖాంశం ఈ ఖండం ద్వారా వెళ్తున్నాయి. ఈ ఖండానికి ఉత్తరాన మధ్యధరా సముద్రం; ఈశాన్యంలో సూయెజ్ కాలువ, ఎర్ర సముద్రం; తూర్పున హిందూ మహా సముద్రం; పశ్చిమాన అట్లాంటిక్ మహాసముద్రం ఉన్నాయి.

**పర్వతాలు, మైదానాలు, ఎడారులు, నదులు:**

ఆఫ్రికా అంతా భారీ పీఠభూమిలా కనిపిస్తుంది. పీఠభూమి ఎక్కువగా దక్షిణ మరియు తూర్పు వైపు ఎక్కువ ఎత్తులో ఉంటుంది. భూమధ్యరేఖకు సమీపంలో ఉన్న తూర్పు భాగాలలో పీఠభూమి పైన కొన్ని అగ్నిపర్వత శిఖరాలు ఉన్నాయి. ఆఫ్రికాలోని ముఖ్య పర్వతాలు: అట్లాస్ పర్వతాలు మరియు డ్రాకెన్స్‌బర్గ్ పర్వతాలు. ఆఫ్రికా యొక్క ఎత్తైన శిఖరం మౌంట్ కిలిమంజారో ఈ ప్రాంతంలో ఉంది. ఇది సంవత్సరమంతా మంచుతో కప్పబడి ఉంటుంది. ప్రపంచంలో అతి పెద్ద ఎడారిగా ప్రసిద్ధిగాంచిన సహారా ఎడారి ఆఫ్రికాలోని తూర్పు భాగంలో విస్తరించి ఉంది.

ఎడారుల మీదుగా ప్రవహించే నదులను ఎక్సోటిక్ (Exotic)/ జీవ నదులు అని పిలుస్తారు. నైల్ నది మరియు ఆరెంజ్ నదులు ఎక్సోటిక్/ జీవ నదులు. ఈజిప్టును 'నైలు నదీ వరప్రసాదం' అని పిలుస్తారు. జాంబెజీ, కాంగో, నైజర్, లింపోపో నదులు కూడా ఈ ఖండంలో ప్రవహిస్తున్నాయి. ఎడారుల్లో అక్కడక్కడ ఒయాసిస్సులు ఏర్పడతాయి.

**శీతోష్ణ స్థితి:**

ఆఫ్రికాలో ప్రధానంగా ఉష్ణమండల శీతోష్ణ స్థితి ఉన్నప్పటికీ మధ్యధరా శీతోష్ణ స్థితులు కూడా ఉన్నాయి. పశ్చిమ పవనాల వల్ల నైరుతి ఆఫ్రికా సంవహన వర్షపాతం పొందుతుంది. ఆఫ్రికా నైరుతి భాగంలో కలహరి ఎడారి ఉంది. ఇక్కడ సగటు ఉష్ణోగ్రత $32^0$C. ఖండం మొత్తం సరాసరి ఉష్ణోగ్రత $20^0$C. ఈ ఖండములో దాదాపుగా సంవత్సరమంతా అధిక ఉష్ణోగ్రత కలిగి ఉంటుంది. ప్రపంచంలోనే అత్యధిక ఉష్ణోగ్రత ($58^0$) ఈ ఖండంలోని ఆల్ అజీజియా (లిబియా)లో నమోదైంది.

**వ్యవసాయం:**

19వ శతాబ్దం చివరి వరకు ఆఫ్రికా ఖండం గురించి పెద్దగా తెలియకపోవడం వల్ల దాన్ని చీకటి ఖండం అని పిలిచేవారు.

ఆఫ్రికా 10% భూమి మాత్రమే పంటలకు అనుకూలంగా ఉంటుంది, ఇందులో తూర్పు ఆఫ్రికా యొక్క అగ్నిపర్వత నేల, నైలు నది లోయ యొక్క ఒండ్రు నేలలు మరియు సవన్నా భూముల యొక్క కొన్ని భాగాలు వ్యవసాయానికి చాలా అనుకూలమైనవి. ఆఫ్రికా ఖండంలో ఇతర భాగాలలో వాతావరణ పరిస్థితులు మరియు నేలలు వ్యవసాయానికి అనుకూలంగా లేవు. కానీ మధ్య ఆఫ్రికా భాగం దట్టమైన అడవులతో నిండి మంచి సహజ వనరుగా ఉపయోగపడుతున్నది. ప్రధానంగా పోడు వ్యవసాయం అమల్లో ఉంది. ఈ ఖండంలో గోధుమ, వరి, మొక్కజొన్న, ఖర్జూర పంటలు పండిస్తున్నారు. గినియా తీరంలో రబ్బరు తోటలున్నాయి.

**జనాభా:**

ఆఫ్రికాలో 50కి పైగా దేశాలు కలవు. కానీ ప్రపంచంలోని మొత్తం జనాభాలో 14 శాతం మాత్రమే ఇక్కడ నివసిస్తున్నారు. ప్రాచీన కాలం నుండి ఇక్కడి ప్రజలు జంతువులను వేటాడుతూ, పశు పోషణ, వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నారు. ఆఫ్రికాలో 70 శాతం మంది నల్ల జాతీయులు, మిగిలిన వారు యూరప్, ఆసియా వంటి ఇతర ఖండాల నుండి వచ్చారు. ఇక్కడి ఆటవిక జాతులు కలవు. కాంగోనదీ ప్రాంతంలో-పిగ్మీలు; సహారా ఎడారి ప్రాంతంలో-బిడౌన్లు; కలహారి ఎడారిప్రాంతంలో-బుష్‌మెన్‌లు, హట్టెన్ టాట్లు; తూర్పు ఆఫ్రికా ప్రాంతంలో-మసాయ్; సహారా ఉత్తర భాగంలో-సెమైట్లు; సూడాన్, పశ్చిమాఫ్రికాలో-హెమటైట్లు. ఆఫ్రికాలో నైజీరియా అత్యధిక జనాభా గల దేశం.

### 5.4.3 ఉత్తర అమెరికా ఖండం

ఉత్తర అమెరికా ఖండం ఉత్తరార్ధ గోళంలో ఉంది. ఇది ప్రపంచంలో మూడో పెద్ద ఖండం. ఉత్తర అమెరికా $7^0$ ఉత్తర అక్షాంశం నుంచి, $83^0$ ఉత్తర అక్షాంశం వరకు, $20^0$ పశ్చిమ రేఖాంశం నుంచి $120^0$ పశ్చిమ

రేఖాంశం వరకు విస్తరించి ఉంది. ఆర్కిటిక్ వలయం మరియు కర్కటక రేఖ ఈ ఖండం ద్వారా వెళ్తున్నాయి. ఈ ఖండానికి తూర్పున అట్లాంటిక్ మహా సముద్రం, పశ్చిమాన పసిఫిక్ మహా సముద్రం, దక్షిణాన దక్షిణ అమెరికా, ఉత్తరాన ఆర్కిటిక్ ప్రాంతం ఉన్నాయి. విస్తీర్ణంలో ఉత్తర అమెరికా భారతదేశంతో పోలిస్తే సుమారుగా 8 రెట్లు అధికంగా ఉంటుంది.

**పర్వతాలు, మైదానాలు, నదులు:**

ఉత్తర అమెరికా పశ్చిమ భాగంలోని విశాలమైన పర్వత ప్రాంతాన్ని పశ్చిమ కార్డిలెరాగా పిలుస్తారు. ఉత్తరం నుంచి దక్షిణం వరకు ఈ పర్వతాలు విస్తరించి ఉన్నాయి. అలస్కాలోని 'మెకిన్‌లే' శిఖరం ఎత్తయినది. పశ్చిమ కార్డిలెరా అనేక సమాంతర పర్వత శ్రేణులు కలిగి ఉంది. లేబ్రడార్ నుంచి న్యూఫౌండ్ లాండ్ వరకు విస్తరించి ఉన్న అప్పలేచియన్ పర్వతాలు తూర్పు మెట్టభూముల్లో ఉన్నాయి. విశాల మధ్య మైదానాలు పశ్చిమ కార్డిలెరా, తూర్పు మెట్ట భూములకు మధ్య విస్తరించి ఉన్నాయి. ఈ మైదానంలో మధ్య, దక్షిణ ప్రాంతాల్లో ఉన్న విశాల, సమతల ప్రాంతంలో మిసిసిప్పి నది ప్రవహిస్తోంది. మిస్సిసిపీ, మిస్సోరి, సెయింట్ లారెన్స్, మెకంజీ మొదలగునవి ఉత్తర అమెరికాలోని ముఖ్య నదులు.

**శీతోష్ణ స్థితి:**

ఉత్తర అమెరికా శీతోష్ణ స్థితి పశ్చిమ పర్వత ప్రాంతం మరియు అప్పలేచియన్ పర్వతాలపై ఆధారపడి ఉన్నది. విశాలమధ్య మైదాన ప్రాంతాలు ఉత్తరం నుండి వచ్చే చల్ల గాలుల వలన మరియు దక్షిణం నుండి వచ్చే వేడి గాలులతో ప్రభావితం అవుతున్నది. ఎడారి వాతావరణం ప్రధానంగా ఉత్తర మెక్సికోలో మరియు అమెరికా సంయుక్త రాష్ట్రాల యొక్క నైరుతి భాగంలో కనిపిస్తుంది. ఉత్తర పవనాల వల్ల శీతాకాలంలో చలి ఎక్కువగా ఉంటుంది. వేసవిలో సముద్ర సామీప్యం వల్ల పశ్చిమతీరం చల్లగా, ఖండ మధ్య భాగం వేడిగా ఉంటుంది. ఉత్తర అమెరికాలో అన్ని రకాల శీతోష్ణ స్థితులు ఉన్నాయి. తీరానికి దూరంగా ఉన్న ఖండాంతర్గత ప్రాంతంలో వర్షపాతం తక్కువ. ఈ ప్రాంతాల్లో ఎడారులు ఉన్నాయి.

**వ్యవసాయం:**

మొత్తం విస్తీర్ణంలో 12 వ వంతు మాత్రమే సాగులో ఉన్నప్పటికీ కేవలం 2% ప్రజలు మాత్రమే వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు. సారవంతమైన మైదానాలు, చక్కని నీటి సదుపాయం ఉన్న మైదానాలు ఉండటం వల్ల ఉత్తర అమెరికా వ్యవసాయ రంగంలో ఉన్నత స్థానంలో ఉంది. ఇక్కడ విస్తృత వ్యవసాయం ప్రధానమైంది. వ్యవసాయ క్షేత్రాలు పెద్దగా ఉండటం వల్ల, యంత్రాల సహాయంతో వ్యవసాయం చేసేందుకు అనుకూలంగా ఉంటుంది. రైతులు శాస్త్రీయ పద్ధతిలో వ్యవసాయం చేస్తారు. దిగుబడి ఎక్కువగా ఉండటం వల్ల మిగులు ఉత్పత్తులను ఎగుమతి చేస్తారు. ఉత్తర అమెరికాలో ముఖ్యమైన పంటలు మొక్కజొన్న, గోధుమ, పత్తి, పొగాకు, ఓట్స్, బార్లీ, సోయాచిక్కుడు మొదలైనవి.

**జనాభా:**

జన సాంద్రత చదరపు కిలోమీటరుకు 15 మంది మాత్రమే. ఈ ఖండం పశ్చిమ భాగంలోని చాలా ప్రాంతాల్లో జనసాంద్రత చదరపు కిలో మీటరుకు రెండు కంటే తక్కువ. ఉత్తర అమెరికాలో తూర్పు తీర ప్రాంతంలో, సరస్సుల చుట్టూ ఉన్న ప్రాంతాల్లో జనసాంద్రత ఎక్కువ. తూర్పుతీర ప్రాంతంలో 15 పెద్ద నగరాలు ఉన్నాయి.

ఈ ప్రాంతంలో చల్లటి వాతావరణం ఉంటుంది. ఇక్కడ ఇంధన ఖనిజాలు మరియు అనేక పరిశ్రమలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో మెరుగైన రవాణా సౌకర్యాలు ఉన్నాయి.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. ఉత్తర అమెరికా ఉనికిని రాయండి.
2. ఉత్తర అమెరికాలో పండే పంటలేవి?

### 5.4.4 దక్షిణ అమెరికా

దక్షిణ అమెరికా ఖండం ఎక్కువ భాగం దక్షిణార్ధ గోళంలో, పూర్తి భాగం పశ్చిమార్ధ గోళంలో ఉంది. దీని పశ్చిమాన పసిఫిక్ మహాసముద్రం, ఉత్తరం, తూర్పున అట్లాంటిక్ మహాసముద్రం వాయువ్యాన ఉత్తర అమెరికా, కరీబియన్ సముద్రం గలవు. ఈ ఖండం $12^0$ ఉత్తరఅక్షాంశం నుండి $55^0$ దక్షిణ అక్షాంశాల వరకు, $35^0$ తూర్పు రేఖాంశం నుండి $81^0$ పడమర రేఖాంశాల వరకు విస్తరించిఉంది. దక్షిణ అమెరికా ఖండం త్రిభుజాకారంగా ఉంది. దీని ఉత్తర భాగం విశాలంగా ఉండి, దక్షిణ భాగానికి వెళ్ళే కొద్దీ సన్నబడుతుంది. ఇది పసిఫిక్, అట్లాంటిక్ మహాసముద్రాలు మధ్య ఒక ఆకు వలె కనిపించును.

**పర్వతాలు, మైదానాలు, నదులు:**

పశ్చిమ పర్వత శ్రేణులు పశ్చిమ తీరానికి సమాంతరంగా కొన్ని వేల కిలోమీటర్లు విస్తరించి ఉన్నాయి. వీటిని ఆండీస్ పర్వతశ్రేణి అంటారు. ఇవి హిమాలయాల తరువాత అత్యంత పొడవైన శ్రేణులు. ఆండిస్ పర్వత శ్రేణుల్లోని చాలా శిఖరాలు ఎత్తు ఎక్కువగా ఉండటం వల్ల ఏడాది పొడవునా మంచుతో కప్పి ఉంటాయి. ఈ పర్వత ప్రాంతంలో భూకంపాలు, అగ్ని పర్వతాలు ఎక్కువ. ఈక్వడార్‌లోని కోటాపాక్సి ప్రపంచంలోనే అత్యధిక చురుకైన అగ్నిపర్వతం. వెనిజులాలోని ఏంజెల్ జలపాతం ప్రపంచంలోనే ఎత్తైనది. విమానాల నుంచి మాత్రమే దీన్ని చూడగలం. పశ్చిమ తీరమైదానం దక్షిణ అమెరికా పశ్చిమ తీరంలో ఉత్తర కొన నుంచి దక్షిణం వరకు విస్తరించి ఉన్న సన్నని తీరమైదానం. మధ్య మైదానాలు, ఆండిస్ పర్వతాలు, తూర్పు మెట్ట భూములకు మధ్య ఉన్నాయి. నీటి పరిమాణం పరంగా అమెజాన్ నది ప్రపంచంలోనే పెద్దది. ఈ నది ఆండిస్ పర్వతాల్లో పుట్టి అట్లాంటిక్ మహాసముద్రంలో కలుస్తోంది. అమెజాన్, ఒరినాకో మరియు పరాన దక్షిణ అమెరికాలోని ముఖ్య నదులు.

**శీతోష్ణ స్థితి:**

ఈ ఖండం చాలా భాగం ఉష్ణ మండలంలో ఉంది. అందువల్ల ఈ ప్రాంతంలో వేడి అధికంగా ఉంది. ఈ ప్రాంతంలో సంవత్సరం పొడుగునా అధిక ఉష్ణోగ్రత, వర్షపాతం ఉంటాయి. దక్షిణ అమెరికాలో సూర్యుని అనుసరించి వర్షం కురుస్తుంది (Rain follows the sun). ఈ ప్రాంతంలో సూర్యుడు ఉత్తర ప్రాంతంలో ఉన్నపుడు ఉత్తర ప్రాంతంలోనూ, దక్షిణంలో ఉన్నపుడు దక్షిణా ప్రాంతంలోనూ వర్షం కురుస్తుంది. దక్షిణ అమెరికాలో ఇంచుమించు అన్నిరకాల శీతోష్ణస్థితులు ఉన్నాయి.

**వ్యవసాయం:**

దక్షిణ అమెరికాలో ప్రధానంగా మొక్కజొన్న, గోధుమ, కాఫీ, చెరకు, పత్తిని పండిస్తారు. వీటిలో మొక్కజొన్న, గోధుమను ఆహార పంటలుగా ఉపయోగిస్తారు. గోధుమను అర్జెంటీనా అధికంగా ఉత్పత్తి చేస్తున్నది. ప్రపంచంలో

కాఫీ ఉత్పత్తి, ఎగుమతిలో బ్రెజిల్ ప్రథమ స్థానంలో ఉంది. పత్తి ఎక్కువగా పండే దేశాల్లో బ్రెజిల్ ఒకటి. కాఫీ, చెఱకు దక్షిణ అమెరికాలోని ప్రధాన వాణిజ్య పంటలు. చెఱకును క్యూబా ఎక్కువగా ఉత్పత్తి చేస్తుంది.

**జనాభా:**

దక్షిణ అమెరికా ప్రజలు అమెరికన్, ఇండియన్ నీగ్రో, యూరోపియన్ అనే మూడు ప్రధాన జాతులకు చెందినవారు. ఇప్పుడు అక్కడ అనేక మిశ్రమ జాతులవారు ఉన్నారు. ఈ జాతుల్లో మెస్టిజో జాతివారు ఎక్కువ. జనాభాలో చాలావరకు రేవు పట్టణాలు, రాజధాని నగరాల్లోనే నివసిస్తున్నారు. దక్షిణ అమెరికా జనసాంద్రత చదరపు కిలోమీటరుకు 13 మంది ఉన్నారు.

## 5.4.5 అంటార్కిటికా

అంటార్కిటికా ఖండం దక్షిణార్ధ గోళంలో 'అంటార్కిటిక్' వలయం లోపల దక్షిణ ధృవాన్ని ఆవరించి ఉంది. ట్రాన్స్ అంటార్కిటిక్ పర్వతాలు ఈ ఖండాన్ని తూర్పు అంటార్కిటికా, పశ్చిమ అంటార్కిటికా అని పిలిచే రెండు నైసర్గిక మండలాలుగా విభజిస్తున్నాయి. అంటార్కిటికాలో ఏ దేశాలు లేవు. అంటార్కిటికా సుమారు 98% మంచు పలకతో కప్పబడి ఉంది. ప్రపంచంలోని మొత్తం మంచులో 90% మరియు 70% మంచి నీరు ఇక్కడే ఉంది. ప్రపంచంలో అతిపెద్ద హిమానీనదాలైన 'లాంబార్డ్', 'బియర్డ్ మోల్' ఈ ఖండంలోనే ఉన్నాయి.

**శీతోష్ణ స్థితి:**

ఇది అతి శీతల ఖండం. సగటు ఉష్ణోగ్రతలు కనిష్ఠంగా శీతాకాలంలో $-80^0$C గరిష్ఠంగా వేసవిలో $5^0$C మధ్య ఉంటాయి. సంవత్సర కాలాన్ని వెలుతురు, చీకటి అనే రెండు అర్ధ భాగాలుగా విభజిస్తారు. దక్షిణ ధృవం వద్ద సూర్యుడు సెప్టెంబరు 23న ఉదయించి, మార్చి 21న అస్తమిస్తాడు. అవపాతం సగటున ఏటా 10 మి.మీ. కంటే తక్కువ. ప్రపంచంలో కెల్లా అతి తీవ్రమైన తుపానులు ఈ ఖండంలోనే సంభవిస్తాయి.

**వ్యవసాయం:**

అంటార్కిటికా యొక్క వాతావరణం వ్యవసాయానికి అనుకూలంగా లేదు. దీని వల్ల అంటార్కిటికా 'ప్రపంచంలోనే వృక్షాలు లేని ఏకైక ఖండం'గా పేరు పొందింది. ఇక్కడ అనేక రకాల 'పెంగ్విన్' పక్షులు ఉంటాయి. ఇవి అంటార్కిటిక్ పక్షి సంతతికి ప్రతీకలుగా నిలుస్తున్నాయి. ఈ పక్షులు వాటికి అనుకూల ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో సమూహాలుగా నివసిస్తాయి. ఇలాంటి సమూహాలను 'రూకరీలు' అంటారు.

**జనాభా:**

దీనికి శాశ్వత మానవ జనాభా లేదు. వివిధ దేశాలు, ఈ ఖండంలో శాశ్వత మానవ సహిత పరిశోధన కేంద్రాలను నిర్వహిస్తున్నాయి. ఖండంలోను, దాని సమీప ద్వీపాలలోనూ శాస్త్రీయ పరిశోధన, ఇతర పనులూ నిర్వహించేవారు, వారి సహాయకుల సంఖ్య శీతాకాలంలో సుమారు 1,000, వేసవిలో 5,000 వరకు ఉంటుంది. భారతదేశ శాస్త్రజ్ఞులు అంటార్కిటికాలో నివసించి పరిశోధనలు చేసేందుకు వీలుగా 'దక్షిణ గంగోత్రి', 'మైత్రి' పరిశోధనా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

### 5.4.6 యూరప్

యూరప్ ఖండం ప్రపంచంలోని ఏడు శాతం భూమిని కలిగి ఉంది. యూరప్ $35^0$ – $72^0$ ఉత్తర అక్షాంశ రేఖల మధ్య, $10^0$ పశ్చిమ రేఖాంశం నుంచి $60^0$ తూర్పు రేఖాంశం వరకు విస్తరించి ఉంది. $0^0$ల గ్రీనిచ్ రేఖాంశం ఈ ఖండంలోని లండన్ నగరం మీదుగా వెళ్తోంది. ఈ ఖండానికి ఉత్తరాన – ఆర్కిటిక్ మహా సముద్రం, దక్షిణాన – మధ్యధరా సముద్రం, తూర్పున – యూరల్ పర్వతాలు, పశ్చిమాన – అట్లాంటిక్ మహాసముద్రం సరిహద్దులుగా ఉన్నాయి.

**పర్వతాలు, మైదానాలు, నదులు:**

ఆల్ప్స్ పర్వతాలు ఖండంలోని ప్రసిద్ధ పర్వత శ్రేణి. ఫ్రాన్స్‌లోని ఆల్ప్స్, కాకసస్ పర్వతాల్లో ఎల్‌బ్రస్ శిఖరం (5,642 మీ.) ఎత్తయినది. యూరప్‌లో పశ్చిమాన ఉన్న మైదాన ప్రాంతాలను పశ్చిమ యూరప్ మైదానం, తూర్పున ఉన్న వాటిని 'రష్యా ప్లాట్ ఫాం' అని అంటారు. యూరప్‌లోని ఆల్ప్స్ పర్వతాలు చాలా నదులకు ఆధారం. వోల్గా, డాన్యూబ్, రైన్, సీన్, గరోన్, పో యూరప్‌లోని ముఖ్య నదులు.

**శీతోష్ణ స్థితి:**

యూరప్ ఖండం ఉత్తర సమశీతోష్ణ మండలంలో ఉంది.అట్లాంటిక్ మహాసముద్ర అగాధ ప్రవాహాలు యూరప్ శీతోష్ణ స్థితిపై ఎక్కువ ప్రభావం చూపుతున్నాయి. ఇవి అధిక ఉష్ణోగ్రతకు కారణమవుతున్నాయి.మధ్యధరా సముద్ర ప్రభావ ప్రాంతాల్లో జనవరి నెలలో చలి ఎక్కువగా ఉండి వేసవికాలం పొడిగాలులు వీస్తాయి. ఈ ప్రాంతంలో శీతకాలంలో వర్షం సంభవిస్తుంది. సుమారు 80 – 130 సెం.మీ. వర్షపాతం ఉంటుంది. వేసవిలో వర్షం ఉండదు.

**వ్యవసాయం:**

యూరప్ భూభాగంలో 30 శాతం వ్యవసాయానికి యోగ్యమైన జలవనరులు, మృత్తికలను కలిగి ఉంది. ఎక్కువగా మిశ్రమ వ్యవసాయాన్ని చేస్తారు. గోధుమ, మొక్కజొన్న, రై , బార్లీ, ఆలివ్ ముఖ్యపంటలు. మధ్యధరా శీతోష్ణస్థితి ప్రాంతం ఆలివ్ నూనె ఉత్పత్తికి అనుకూలమైంది.

**జనాభా:**

ప్రపంచం మొత్తం జనాభాలో 1/5వ వంతు యూరప్‌లో ఉంది. ఐస్‌లాండ్, ఉత్తర యూరప్‌లోని స్కాండినేవియా, ఉత్తర రష్యాలోని టండ్రా ప్రాంతాల్లో చ.కి.మీ.కి 10 కంటే తక్కువ మంది నివసిస్తారు. ఇటలీ, ఫ్రాన్స్ నుంచి మాస్కో వరకు మధ్య మైదానాల్లో, నదీలోయ ప్రాంతాల్లో చ.కి.మీ.కి 50 నుంచి 100 మంది జనాభా నివసిస్తున్నారు.

### 5.4.7 ఆస్ట్రేలియా ఖండం

దక్షిణ అర్ధగోళంలో పసిఫిక్ మరియు హిందూ మహాసముద్రాల మధ్య ఉన్న అతి చిన్న ఖండం ఆస్ట్రేలియా. ఆస్ట్రేలియా $9^0$ మరియు $44^0$ దక్షిణ అక్షాంశాల మధ్య మరియు $112^0$ మరియు $154^0$ తూర్పు రేఖాంశాల మధ్య ఉంటుంది.

**పర్వతాలు, మైదానాలు, నదులు:**

గ్రేట్ డివైడింగ్ రేంజ్ లేదా ఈస్టర్న్ హైలాండ్స్ ఆస్ట్రేలియా యొక్క ముఖ్య పర్వతశ్రేణి మరియు ప్రపంచంలో భూమిపై ఉన్న ఐదవ పొడవైన శ్రేణి. మౌంట్ కోస్సియుస్కో ఆస్ట్రేలియా యొక్క ఎత్తయిన పర్వతం. ముర్రే మరియు డార్లింగ్ ఆస్ట్రేలియా యొక్క ప్రధాన నదులు. ఐరీ సరస్సు ఈ ప్రాంతంలో అతిపెద్ద సరస్సు.

**శీతోష్ణ స్థితి:**

ఆస్ట్రేలియా దక్షిణార్ధ గోళంలో ఉంది. కాబట్టి ఉత్తరార్ధ గోళంలో వేసవి కాలం అయితే ఆస్ట్రేలియాలో చలికాలం, ఉత్తరార్ధ గోళంలో చలికాలం అయితే ఆస్ట్రేలియాలో వేసవి కాలం. ఆస్ట్రేలియా యొక్క ప్రధాన భూభాగంలో మొత్తం 55% ఎడారులు ఉన్నాయి. ఆస్ట్రేలియా యొక్క ఉత్తర భాగంలో వేసవిలో ఋతుపవనాల ప్రభావంతో వర్షాలు కురుస్తాయి.

**వ్యవసాయం:**

చాలా ప్రాంతాల్లో వర్షపాతం సరిపోకపోవడం వల్ల, ఆస్ట్రేలియాలో కేవలం 4% భూమి మాత్రమే సాగులో ఉంది. గోధుమ, బార్లీ, ఓట్స్ మరియు మొక్కజొన్న ముఖ్యమైన పంటలు. చెరకు, పొగాకు మరియు పత్తి ప్రధాన నగదు పంటలు.

**జనాభా:**

ఆస్ట్రేలియా పట్టణ ఖండం, ఎందుకంటే 85% కంటే ఎక్కువ మంది పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. ఆస్ట్రేలియా ప్రజలు చాలా మంది ప్రధాన భూభాగం యొక్క దక్షిణ మరియు తూర్పు తీరాల వెంబడి ఉన్న నగరాల్లో నివసిస్తున్నారు. ప్రధాన నగరాల్లో పెర్త్, సిడ్నీ, బ్రిస్బేన్, మెల్బోర్న్, కాన్‌బెర్రా మరియు అడిలైడ్ ఉన్నాయి.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

- శాశ్వత మానవ జనాభా లేని ఖండం ఏది?
- దక్షిణ అమెరికా ఏ శీతోష్ణస్థితి మండలంలో ఉన్నది?

## 5.5 మహాసముద్రాలు

భూమి మీద గల నీటి భాగాన్ని భూశాస్త్రజ్ఞులు అయిదు మహాసముద్రాలుగా విభజించారు. అవి: పసిఫిక్ మహాసముద్రం, అట్లాంటిక్ మహాసముద్రం, హిందూ మహాసముద్రం, దక్షిణ మహాసముద్రం (అంటార్కిటిక్), ఆర్కిటిక్ మహాసముద్రం. ఈ సముద్రాలన్నీ కలసి కోట్లాది సంవత్సరాల క్రితం ఒకే ఒక్క మహాసముద్రంగా ఉండేది. దీన్నే పాంథాల్స అన్నారు. ఇందులో పసిఫిక్ మహాసముద్రం పరిమాణంలోనూ ఉపరితల విస్తీర్ణంలోను అన్నింటికంటే పెద్దది.

## 5.6 సముద్ర వనరులు

అంతర్జాతీయంగా అధిక భాగం సరకుల రవాణా సముద్రం మీదనే జరుగుతుంది. తీర ప్రాంతాల్లో నివసించే అనేక మంది ప్రజలు చేపల వేటపై ఆధారపడి ఉంటారు. అదేవిధంగా, భూమిపై అనేక రకాల వృక్ష

జంతు సంబంధ జీవరాశులు, ఖనిజ శక్తి వనరులు ఉన్నట్లుగానే సముద్రాల్లో కూడా వివిధ జీవరాశులు, ఖనిజ శక్తి వనరులు ఉన్నాయి. పూర్వ కాలం నుండి మానవులు తమ ఆహారం కోసం, జీవనోపాధి కోసం సముద్రాలపై ఆధారపడి ఉన్నారు. సముద్రాల నుండి ఉప్పు, మెగ్నీషియం, మాంగనీసు, పెట్రోలియం వంటి ఖనిజాలు లభిస్తున్నాయి. సముద్రపు అలలు, తరంగాలు, ఎక్కువ వేగంతో రావడాన్ని గమనించి ఉంటారు. బలమైన తరంగాల తాకిడి వలన శక్తి విడుదల అవుతుంది. అలల కదలిక ద్వారా తగు పరికరాలతో విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చును. దీనిపై ఇంకా పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఈ విధంగా సముద్రాలు మానవులకు ఒక వనరుల కేంద్రంగా ఉంటున్నాయి.

### 5.6.1 మహాసముద్రాల కాలుష్యం

పారిశ్రామిక, వ్యవసాయ, నివాసాల వ్యర్థాలు ఇష్టారీతిగా వదిలివేయడం వలన సముద్ర కాలుష్యం పెరుగుతుంది. దాదాపు ఎనిమిది శాతం సముద్ర కాలుష్యం భూమి నుంచే వచ్చిందని చెబుతున్నారు. సముద్రంలోకి వదులుతున్న పురుగు మందుల అవశేషాలు, ప్లాస్టిక్ సముద్ర జీవులకు హానికరంగా పరిగణిస్తున్నాయి. సముద్ర జీవావరణంలోకి చేరిన పురుగు మందుల అవశేషాలు సముద్ర జీవుల పెరుగుదలను నిరోధిస్తున్నాయి. ప్లాస్టిక్, ఇతర విష పదార్థాలు సముద్రంలో పెరిగే జంతువుల శరీరంలోకి ప్రవేశిస్తాయి. సముద్రం ఉత్పత్తులైన చేపలు, రొయ్యలు తదితరాలు తిన్నపుడు వాటి ఆవశేషాలు మానవ శరీరంలోకి ప్రవేశించి రోగాల బారిన పడుతున్నారు. ఓడల ద్వారా రవాణా అయ్యే ముడి చమురు కొన్ని సార్లు సముద్రంలో చింది కలుషితం అవుతోంది. అనేక సందర్భాలలో ఓడలు అనవసర వ్యర్థాలను వదిలి వేస్తున్నాయి. మైనింగ్ ప్రభావం వల్ల కూడా సముద్ర కాలుష్యం ఏర్పడుతుంది.

పర్యావరణ పరిరక్షణ గురించి ప్రజల్లో అవగాహన కల్పించడమే ధరిత్రి దినోత్సవం (ఏప్రిల్ 22) ముఖ్యోద్దేశ్యం.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

- వేటిని మహాసముద్రాలు అంటారు?
- మహాసముద్రాలలో కాలుష్యానికి రెండు కారణాలను తెలపండి.

### 5.7 ముగింపు (ముఖ్యాంశాలు)

- జీవరాశులు ఉన్న గ్రహం భూమి.
- ఖండచలన సిద్ధాంతం ద్వారా ప్రస్తుత ఖండాలు ఏర్పడ్డాయని శాస్త్రవేత్తలు ప్రతిపాదించారు.
- పాంజియా ఒక ఊహాత్మకమైన ఖండం.
- పాంథాల్స అనేది కోట్ల సంవత్సరాల క్రితం ఉన్నటువంటి మహాసముద్రం.
- భూఅంతర్భాగం చలనంలో వల్ల భూమిపై వివిధ రకాలైన స్వరూపాలు ఏర్పడ్డాయి.
- మొత్తం భూమిపై 70 శాతం నీటితో నిండి ఉంది, మిగిలిన దాంట్లో ఖండాలు విస్తరించి ఉన్నాయి. భూమిపై ఉన్న అతిపెద్ద భూభాగాలను 7 ఖండాలుగా విభజించడం జరిగింది.
- సముద్రాలలో ఉప్పు మెగ్నీషియం, మాంగనీసు వంటి ఖనిజాలు ఉన్నాయి.

## 5.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 1-2 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. ఉత్తరార్ధ గోళంలో ఉన్న ఖండాలు ఏవి?
2. పాంజియా మహాఖండం ఏ రెండు ఖండాలుగా విడిపోయింది?

**II. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 4-5 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. ఆసియాలోని ఏ ప్రాంతాలలో ఋతుపవన వర్షాలు కురుస్తాయి?
2. ఆఫ్రికాలో ఎన్ని రకాల శీతోష్ణ స్థితులున్నాయి?
3. దక్షిణ అమెరికాలో ప్రధానంగా పండే పంటలు ఏవి?

**III. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 8-10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. భూ పరిణామక్రమం గురించి వివరించండి
2. మహాసముద్రాలలో కాలుష్యం మరియు దాని పరిణామాల గురించి రాయండి.
3. ఉత్తర అమెరికా జనాభా విస్తరణను తెలపండి .

**IV. కింది వాటిలో సరైన జవాబును ఎంపిక చేయండి.**

1. గ్రేట్ డివైడింగ్ రేంజ్ ఈ ఖండంలోనిది

   ఎ) ఆసియా   బి) ఆఫ్రికా   సి) ఆస్ట్రేలియా   డి) అంటార్కిటికా

2. మడగాస్కర్ ఈ మహాసముద్రంలోని పెద్ద దీవులలో ఒకటి.

   ఎ) అట్లాంటిక్ మహాసముద్రం   బి) హిందూ మహాసముద్రం

   సి) పసిఫిక్ మహాసముద్రం   డి) ఆర్కిటిక్ మహాసముద్రం

## 5.9 ఉపయుక్త గ్రంథాలు


- SCERT, Telangana సాంఘికశాస్త్ర పుస్తకాలు
- NCERT 6th to 12th Textbooks

# 6 జనాభా

## 6.0 అభ్యసన ఫలితాలు

- జనగణన ఆవశ్యకతను వివరించగలరు.
- జనాభా పరివర్తన సిద్ధాంతాన్ని విశ్లేషిస్తారు.
- భారతదేశ జనాభాలో వయస్సు వారి కూర్పును విశ్లేషించగలరు.
- లింగ వివక్షతపై వ్యాఖ్యానిస్తారు.
- భారతదేశంలో జన సాంద్రతలో గల వ్యత్యాసాలకు కారణాలు చెబుతారు.
- అభివృద్ధిలో మానవ వనరుల ఆవశ్యకతను వివరిస్తారు.

## 6.1 పరిచయం

మానవుడు లేని ఈ ప్రపంచాన్ని మనం ఊహించగలమా? వనరులను ఉపయోగించుకోని వారెవరుంటారు? ఈ ప్రశ్నకు ఖచ్చితంగా మనం మానవుడు లేని సమాజాన్ని ఊహించలేము. ఒక నిర్ణీత ప్రదేశంలో గల మానవ సమూహాన్ని మనం 'జనాభా' అని పిలుస్తాం. సామాజిక, ఆర్థిక ప్రగతికి జనాభా అవసరం. మానవుడు సంఘజీవి. మానవులు పరస్పర ఆధారంగా జీవిస్తున్నారు. మానవులు ప్రకృతిలో గల వనరులను ఉపయోగించుకుని కనీస మరియు కాస్త సౌకర్యవంతంగా ఉండే జీవనానికి ప్రయత్నిస్తున్నారు. దీనికై సమాజంలో ఒకరికొకరు పరస్పర సహకారంతో వీటిని సాధిస్తున్నారు. కాబట్టి జనాభా అనేది ఒక ముఖ్యమైన అంశం.

జనాభా అధ్యయనం వల్ల ఒక దేశంలో గల మనుషుల సంఖ్యతో పాటు జీవన నాణ్యతను కూడా పరిశీలించవచ్చు. ఒక దేశంలో ఒక ప్రత్యేక సమయంలో ఉన్న జనాభా పెరుగుదల, విస్తరణ మరియు నాణ్యమైన జీవితం గురించి అధ్యయనం చేయవచ్చు. ఈ గణాంకాలను అధ్యయనం చేయడం ద్వారా సామాజిక ఆర్థిక అంశాలను అర్థం చేసుకోవచ్చు. తద్వారా నాణ్యమైన జీవితానికి కావాల్సిన అంశాలను గుర్తించి అభివృద్ధి సాధించవచ్చు. వేగంగా పెరుగుతున్న జనాభా వల్ల పేదరికం మరియు నిరుద్యోగం పెరగవచ్చు. దీని వలన అభివృద్ధి చెందుతున్న మన దేశం ఆర్థికంగా నష్టపోతుంది.

ఈ పెరుగుతున్న జనాభాను అభివృద్ధి కొరకు ఏ విధంగా ఉపయోగించవచ్చు, జనాభాను ఒక వనరుగా చూడవచ్చా, జనాభా పెరుగుదలను ఒక సమస్యగా మాత్రమే కాకుండా ఒక వనరుగా ఏ విధంగా చూడవచ్చు వంటి అంశాలను మనం తెలుసుకుందాం. ఇటువంటి ఇతర అంశాలను ఈ పాఠం ద్వారా చర్చిద్దాం.

## 6.2 జనాభా పరివర్తన సిద్ధాంతం

జనాభా పెరుగుదల తీరును విశ్లేషించే ఈ సిద్ధాంతం జనన, మరణాల రేట్లలో మార్పులు మరియు వృద్ధి రేటుపై ప్రభావాన్ని వివరిస్తుంది. ఈ సిద్ధాంతం ప్రకారం ప్రతీ దేశం జనన మరణాల రేట్లకు సంబంధించి మూడు దశల గుండా వెళ్తుంది. ఈ మార్పులు దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావాన్ని చూపుతాయి. ఈ సిద్ధాంతం ప్రకారం ఉన్న మూడు దశలను ఇప్పుడు పరిశీలిద్దాం.

### 6.2.1 మొదటి దశ

జననాల రేటు, మరణాల రేటు రెండూ ఎక్కువగానే ఉంటాయి. అధిక జననాల రేటు మరియు అధిక మరణాల రేటు ఉండటం వలన జనాభా పెరుగుదల ఎక్కువగా ఉండదు. సరి అయిన వైద్య సదుపాయాలు లేకపోవడం, జీవన ప్రమాణ స్థాయి తక్కువగా ఉండటం, సరైన పోషక విలువలు లేని ఆహారం వల్ల మరణాలు ఎక్కువగా ఉంటాయి. నిరక్షరాస్యత, మూఢ నమ్మకాలు, సామాజికంగా ఉన్న కొన్ని ఆచార వ్యవహారాల వలన జననాల రేటు అధికంగా ఉంటుంది. భారతదేశంలో 1921 కు ముందు మనం మొదటి దశను గమనించాం.


### 6.2.2 రెండవ దశ

ఆర్థిక అభివృద్ధి, జీవన ప్రమాణాల స్థాయి పెరుగుదల, ఆరోగ్య వసతుల కల్పన, ముఖ్యంగా అంటువ్యాధుల నుండి రక్షణ మొదలగు వాటి వలన రెండవ దశలో మరణాల రేటు తక్కువగా ఉంటుంది. కానీ ప్రజల వెనుకబాటుతనం, మూఢ నమ్మకాలు, సరైన విద్య లేకపోవడం, సామాజిక పరమైన అంశాల కారణంగా జనాభా పెరుగుదల అనేది మొదటి దశ లాగా ఎక్కువగానే ఉంటుంది. అంటే మరణాల రేటు కంటే జననాల రేటు అధికంగా ఉండి, జనాభా పెరుగుదల రేటు అధికంగా ఉంటుంది. జనాభా పెరుగుదల రేటు అధికంగా ఉండటాన్ని మనం 'జనాభా విస్ఫోటనం' అంటాం. భారతదేశంలో 1921–1951 మధ్య కాలాన్ని రెండవ దశగా చూడటం జరిగింది.

### 6.2.3 మూడవ దశ

ఆర్థిక వృద్ధి, శాస్త్ర సాంకేతిక మార్పులు, వృత్తులలో మార్పులు, పట్టణీకరణ, వేగవంతమైన పారిశ్రామిక, సేవా రంగాల అభివృద్ధి మొదలగునవి మూడవ దశ లక్షణాలు. పట్టణీకరణ మరియు సంక్షేమం దృష్ట్యా చిన్న కుటుంబం అనే ఆలోచన ధోరణి వలన జననాల రేటు తక్కువగా నమోదు అవుతుంది. వైద్య ఆరోగ్య సదుపాయాల పెరుగుదల వలన మరణాల రేటు కూడా తక్కువగా నమోదు అవుతుంది. ఈ దశలో జనన, మరణాల రేట్లు తక్కువ స్థాయిలో ఉండటం వలన జనాభా పెరుగుదల తక్కువ రేటులో ఉంటుంది. ప్రస్తుతం భారతదేశం ఈ దశలో ఉంది.

ఈ విధంగా జనాభా పరివర్తన సిద్ధాంతంలోని మూడు దశలను పటం-6.1లో వివరించాం.




*పటం-6.1: జనాభా పరివర్తన సిద్ధాంతంలోని దశలు*

పటం-6.1లో ఎరుపు గీత మరణాల రేటును, నీలం గీత జననాల రేటును సూచిస్తున్నాయి. OX అక్షం కాలాన్ని సూచిస్తుంది. OY అక్షంపైన 1,000 జనాభాకు వార్షిక జనన-మరణాల రేట్లను సూచించాం.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. జనాభా పరివర్తన సిద్ధాంతంలో రెండవ దశలో మరణాల రేటు తగ్గడానికి కారణాలు తెలపండి.
2. భారతదేశంలో ప్రస్తుతం ఏ దశ కొనసాగుతున్నది?
3. జనాభా విస్ఫోటనం ఏ దశలో సంభవిస్తుంది?

**మీకు తెలుసా?**

భారతదేశంలో మొదటిసారి 1872లో జనగణన జరిగింది. కానీ 1881 నుండి అధికారికంగా ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి జనగణన కేంద్ర ప్రభుత్వ హోం శాఖలోని రిజిస్ట్రార్ అండ్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్, ఇండియా వారు నిర్వహిస్తారు.

## 6.3 భారతదేశంలో జనాభా పెరుగుదల మరియు విస్తరణ

సాధారణంగా జనాభాలో మార్పు అనేది జననాల రేటు, మరణాల రేటు మరియు వలసలపైన ఆధారపడి ఉంటుంది. భారతదేశంలో జనాభా మార్పుపై వలసల ప్రభావం చాలా తక్కువగా ఉంది. ప్రతి దశాబ్దానికి చేరిన అదనపు మనుషుల సంఖ్య జనాభా పెరుగుదలను సూచిస్తుంది. ప్రస్తుత జనాభా నుండి దశాబ్దం క్రితం గల జనాభాను తీసివేస్తే వచ్చే సంఖ్య ధనాత్మకం అయితే జనాభా రేటు పెరిగిందని, రుణాత్మకం అయితే తగ్గిందని అంటాం.

ప్రపంచ భూభాగ విస్తీర్ణంలో భారతదేశ విస్తీర్ణం 2.4 శాతంగా ఉంది. కానీ మొత్తం ప్రపంచ జనాభాలో భారతదేశ జనాభా 17.6 శాతంగా ఉంది. మన దేశం 2011 జనాభా లెక్కల ప్రకారం 1210 మిలియన్

జనాభాతో ప్రపంచంలో చైనా తరువాత రెండవ స్థానంలో ఉంది. 1901 జనగణన ప్రకారం భారతదేశ జనాభా 236 మిలియన్లు మరియు 2017 ప్రకారం 1.3 బిలియన్లు. అంటే 116 సంవత్సరాల కాలంలో పెరుగుదల 1,064 మిలియన్లు.

జనాభా పరివర్తన సిద్ధాంతం ప్రకారం భారతదేశ జనాభా పెరుగుదల సరళిని గమనించినట్లయితే మొదటి దశ 1921 ముందు ఉన్న దశ. 1881 నుండి 1921 వరకు 15 మిలియన్ల పెరుగుదల మాత్రమే ఉంది. 1881 లో 236 మిలియన్ల జనాభా అయితే, 1921 లో 251 మిలియన్ల జనాభా ఉంది. ఈ దశలో అధిక మరణ, జనన రేట్లు ఉండడం గమనించాం.

1921–1951 మధ్య కాలంలో 110 మిలియన్ల పెరుగుదల కనిపించింది. 1921లో 251 మిలియన్లు ఉన్న జనాభా 1951లో 361 మిలియన్లకు చేరింది. దీనిని మనం జనాభా పరివర్తన సిద్ధాంతంలో రెండవ దశగా గుర్తించవచ్చు. ఈ కాలంలో మరణాల రేటు ప్రతి 1,000 మందికి 49 నుండి 27కు తగ్గడం జరిగింది. జననాల రేటు మాత్రం ప్రతి వెయ్యి మందికి 49 నుండి 40కి తగ్గడం జరిగింది. అనగా మరణాల రేటుకు అనుగుణంగా జననాల రేటు ఆ స్థాయిలో తగ్గలేదు. అందువలన జనాభా పెరుగుదల సంభవించింది.

1921 వ సంవత్సరంలో జనాభా విభాజక సంవత్సరంగా గుర్తిస్తాం. ఎందుకంటే 1911–1921 మధ్య కాలంలో మాత్రమే జనాభా పెరుగుదల రుణాత్మకంగా ఉంది. ఆ దశాబ్ద కాలంలో వచ్చిన అంటువ్యాధులు, కరువులు దీనికి కారణం.

మూడో దశ 1951 నుండి 1981 మధ్య కాలంలో గుర్తించవచ్చు. 1951లో 361 మిలియన్లుగా ఉన్న జనాభా 1981 వరకు 683 మిలియన్లకు చేరింది. ఈ 30 సంవత్సరాల కాలంలో 322 మిలియన్ల జనాభా పెరుగుదల నమోదు అయ్యింది. జనాభా విస్ఫోటనం ఈ దశలో సంభవించింది. ఈ దశలో మరణాల రేటు ప్రతి 1,000 కి 27 నుండి 15కు తగ్గగా, జననాల రేటు మాత్రం 40 నుండి 37కు మాత్రమే పడిపోవడం జరిగింది. అంటే జనన మరణాల రేట్లలో అత్యధిక వ్యత్యాసం ఉంది. దీని వలన జనాభా పెరుగుదల రేటు అధికంగా ఉంది. 1981–2011 మధ్య కాలంలో జనాభాలో 683 మిలియన్ల నుండి 1,210 మిలియన్లకు పెరిగింది. అంటే జనాభా వార్షిక సగటు వృద్ధి రేటు 1.84 శాతంగా ఉండింది. జనాభాలో పెరుగుదల కనిపించినప్పటికీ, పెరుగుదల రేటు నెమ్మదించడం గమనించవచ్చు. 1951–1981 మధ్య ఈ పెరుగుదల రేటు 2.14 శాతంగా ఉండింది. పై గణాంకాల ద్వారా జనాభా పరివర్తన సిద్ధాంతం ప్రకారం భారతదేశం మూడవ దశలో కొనసాగుతుందని గమనించవచ్చు.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. భారతదేశంలో జనాభా విభాజక సంవత్సరం ఏది?
2. 1951–1981 మధ్య జనాభా వృద్ధి రేటు ఎంత ఉంది?
3. ప్రపంచ జనాభాలో భారతదేశ జనాభా ఎంత శాతంగా ఉంది?

## 6.4 జననాల రేటు, మరణాల రేటు మరియు శిశు మరణాల రేటు

జనన, మరణాల రేట్లు మరియు వలసల ఆధారంగా ఒక ప్రాంతంలో గాని, ఒక దేశంలో గాని జనాభా మార్పును లెక్కించవచ్చు అని ఇదివరకే తెలుసుకున్నాం.

**1. జననాల రేటు :** ఒక ప్రాంతంలో ఒక సంవత్సర కాలంలో ప్రతి వెయ్యి మందికి అదనంగా చేరిన జననాల సంఖ్యను జననాల రేటు అంటారు.

$$\text{జననాల రేటు} = \frac{\text{ఒక ప్రాంతంలో ఒక సంవత్సరంలో జీవంతో పుట్టిన జననాల సంఖ్య}}{\text{ఆ ప్రాంతంలో మధ్య సంవత్సరంలో (mid year) జనాభా}} \times 1000$$

**ఉదాహరణ :** ఒక ప్రాంతంలో జీవంతో జన్మించిన వారు ఒక సంవత్సరంలో 1,000 మరియు మధ్య సంవత్సరంలో జనాభా 25,000 అని అనుకుందాం. అప్పుడు

$$\text{జనన రేటు} = \frac{1000}{25000} \times 1000 = 40 \text{ (జననాలు ప్రతి 1000కి)}$$

**2. మరణాల రేటు :** ఒక ప్రాంతంలో ఒక సంవత్సర కాలంలో ప్రతి వెయ్యి మందిలో సంభవించిన మరణాల సంఖ్యను మరణాల రేటు అంటారు.

$$\text{మరణాల రేటు} = \frac{\text{ఒక సంవత్సరంలో కలిగిన మరణాల సంఖ్య}}{\text{ఆ ప్రాంతంలో మధ్య సంవత్సరంలో (mid year) జనాభా}} \times 1000$$

**ఉదాహరణ :** ఒక ప్రాంతంలో ఒక సంవత్సరంలో అయిదు వందల (500) మరణాలు సంభవించడం, ఆ సంవత్సర మధ్య కాలంలో ఉన్న జనాభా 25,000 అనుకుంటే

$$\text{మరణాల రేటు} = \frac{500}{25000} \times 1000 = 20 \text{ (ప్రతి 1,000 మందికి కలిగిన మరణాల రేటు)}$$

వృద్ధి రేటు = జననాల రేటు – మరణాల రేటు

పై ఉదాహరణను అనుసరించి జననాల రేటు 40, మరణాల రేటు 20 గా ఉంది. అంటే జనాభా వృద్ధి రేటు ప్రతి 1,000 మందికి 20 అని గమనించవచ్చు.

జనన, మరణాల రేట్లను ఎలా లెక్కిస్తారో తెలుసుకున్నాం కదా, ఇప్పుడు భారతదేశ జనన, మరణాల రేట్లను గమనిద్దాం.

1921 ముందు అధిక మరణాల రేటును మరియు అధిక జననాల రేటు వలన జనాభా పెరుగుదల ఎక్కువగా లేదని ఇంతకు ముందే చర్చించి ఉన్నాం. ఇప్పుడు ఈ శతాబ్దంలో జరిగిన మార్పులను పట్టిక–6.1 ద్వారా విశ్లేషిద్దాం.

1901–1921 మధ్య కాలంలో విష పడిశం (influenza) అంటువ్యాధుల వలన అధిక మరణాల రేటు కలిగింది. 1918లో విష పడిశం వలన 15 మిలియన్ల మంది చనిపోవడం జరిగింది. స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో కరువుల ప్రభావం తగ్గి అంటువ్యాధులను నియంత్రణ చేయడం వలన 1921 తో పోల్చితే మరణాల రేటు గణనీయంగా తగ్గింది. పట్టిక–6.1 ను విశ్లేషించినట్లయితే 1911–20 కాలంలో నమోదైన మరణాల శాతం ప్రతి 1,000 కి 48.6 ఉండగా 2001–11లో 7.1 కి తగ్గింది. ఇదే జననాల శాతంను పరిశీలించినట్లయితే 1911–20లో ప్రతి 1,000 కి 49.2 ఉన్నది, ఇదే 2001–11 కాలానికి 21.8 శాతానికి తగ్గింది. ఇక్కడ మనం గమనించినట్లయితే మరణాల శాతం తగ్గినంతగా జనాభా పెరుగుదల శాతం తగ్గలేదు.

*పట్టిక–6.1: జనన, మరణాల రేట్లు*

| దశాబ్దం | జననాలు (ప్రతి 1000కి) | మరణాలు (ప్రతి 1000కి) |
|---|---|---|
| 1891-1900 | 45.8 | 44.4 |
| 1901-1911 | 48.1 | 42.6 |
| 1911-1920 | 49.2 | 48.6 |
| 1921-1930 | 46.4 | 36.3 |
| 1931-1940 | 45.2 | 31.6 |
| 1941-1950 | 39.9 | 27.4 |
| 1951-1960 | 40.0 | 18 |
| 1961-1970 | 41.2 | 19.2 |
| 1971-1980 | 37.2 | 15.0 |
| 1981-1990 | 29.5 | 9.3 |
| 1991-2000 | 25.4 | 8.4 |
| 2001-2011 | 21.8 | 7.1 |

**3. శిశు మరణాల రేటు (Infant Mortality Rate - IMR):** ఇది కూడా జనాభా పెరుగుదల రేటును ప్రభావితం చేస్తుంది. శిశు మరణాలు అనగా సజీవంగా పుట్టిన ప్రతి 1,000 మంది పిల్లల్లో సంవత్సరం పూర్తి అయ్యేసరికి ఎంత మంది చనిపోతున్నారో తెలియజేసే సంఖ్య. 20వ శతాబ్దం ద్వితీయార్థంలో శిశు మరణాలు ప్రతి వెయ్యి మంది జననాలకు 218 ఉండగా, అది 2010–11 ప్రకారం ప్రతి వెయ్యి జననాలకు 47 కు తగ్గడం జరిగింది. వైద్య, ఆరోగ్య సదుపాయాల మెరుగుదల, పౌష్టికాహార పథకాల అమలు మొదలగు కారణాల వల్ల శిశు మరణాల రేటు గణనీయంగా తగ్గింది. ఒక దేశ ఆర్థిక అభివృద్ధి ఆ దేశంలో శిశు మరణాల రేటుపై ఎంతో ఆధారపడి ఉంటుంది. శిశు మరణాల సంఖ్య ఎక్కువగా ఉంటే రాబోయే కాలంలో పని చేసేవారు తగ్గి ఆర్థిక వ్యవస్థ కుంటుపడుతుంది.

**మీ ప్రగతిని పరీక్షించుకోండి**

1. మరణాల రేటును ఏ విధంగా తెలియజేస్తారు?
2. ఇప్పటి వరకు అతి తక్కువ జననాల రేటు ఏ దశాబ్దంలో నమోదు అయ్యింది?

## 6.5 లింగ నిష్పత్తి

మానవ వనరుగా ఒక దేశ జనాభా నాణ్యతను నిర్ణయించే ప్రధాన సూచిక లింగ కూర్పు లేదా లింగ నిష్పత్తి. ప్రతి వెయ్యి మంది పురుషులకు గల స్త్రీల సంఖ్యను లింగ నిష్పత్తి అంటారు. ఒక నిర్ణీత కాల వ్యవధిలో పురుషుల మరియు స్త్రీల సమానత్వాన్ని కొలిచే ఒక ప్రధాన సూచిక లింగ నిష్పత్తి. మన దేశంలో లింగ నిష్పత్తి

ఎప్పుడూ స్త్రీలకు ప్రతికూలంగా ఉంటూ క్రమంగా తగ్గిపోతున్నది. 1901 సంవత్సరంలో ప్రతి 1,000 మంది పురుషులకు 972 మంది స్త్రీలు ఉండేవారు. 1951 లో ఈ సంఖ్య 946 గాను, 2001 నాటికి 933 కు తగ్గిపోయింది. 2001-2011 కాలానికి మాత్రం స్వల్ప పెరుగుదల కనబడింది. 2011 లో ప్రతి 1,000 మంది పురుషులకు 940 స్త్రీలుగా నమోదు అయ్యింది.

$$\text{లింగ నిష్పత్తి} = \frac{\text{ఒక ప్రాంతంలో ఉన్న మొత్తం స్త్రీల సంఖ్య}}{\text{అదే ప్రాంతంలో ఉన్న మొత్తం పురుషుల సంఖ్య}} \times 1000$$

**ఉదాహరణ :** ఒక ప్రాంతంలో ఒక నిర్ణీత కాలంలో ఉన్న స్త్రీల సంఖ్య 30,000 గాను, పురుషుల సంఖ్య 36,000 గాను ఉన్నట్లయితే,

$$\text{ఆ ప్రాంత లింగ నిష్పత్తి} = \frac{30000}{36000} \times 1000 = 833.3$$

2011 జన గణన ప్రకారం 1210.6 మిలియన్లలో పురుషులు 623.1 మిలియన్లు ఉండగా, మహిళలు 587.5 మిలియన్లుగా ఉన్నారు. అంటే లింగ నిష్పత్తి 940గా ఉంది.

లింగ నిష్పత్తిలో కేరళ 1084 మరియు పుదుచ్చేరి 1038తో మెరుగ్గా ఉన్నాయి. హర్యానా, పంజాబ్ రాష్ట్రాలలో ఈ నిష్పత్తి 877 మరియు 893 తో అట్టడుగు స్థాయిలో ఉన్నాయి.

ఆడ పిల్ల కంటే మగ పిల్లవాడు పుట్టాలని కోరుకునే లింగ వివక్షత భారతదేశంలో ఇంకా కొనసాగుతూనే ఉంది. శిశు మరణాలలో ఆడ పిల్లల మరణాలు ఎక్కువగా ఉంటున్నాయి. స్త్రీ వివక్షత అనేది పుట్టిన నాటి నుండి మొదలు కావడం వలన లింగ నిష్పత్తి ప్రతికూలంగా ఉంది. లింగ నిష్పత్తి అనుకూలంగా ఉన్న దేశాలు ఆర్థిక వృద్ధిని వేగంగా సాధించడం గమనించాలి. అమెరికా, యూరప్ దేశాలు ఇందుకు ఉదాహరణలు.

పౌష్టిక ఆహారాన్ని అందించడంలో, ఆరోగ్యం పట్ల శ్రద్ధ కనబరచడంలో ఆడ పిల్లలకు తక్కువ ప్రాధాన్యత ఉంటుంది. ఆడ శిశువుల భ్రూణ హత్య అనేది ఇంకా కొనసాగుతూనే ఉంది. అనేక కుటుంబాలు ఆడపిల్లలను భారంగా భావిస్తున్నాయి. అందువల్ల అక్షరాస్యత శాతం కూడా ఆడ పిల్లలలో తక్కువగా ఉంది. లింగ వివక్షత ఇలాగే కొనసాగితే ఆర్థిక వృద్ధిని సాధించడం కష్టమవుతుంది. సమాజంలో ఆడ పిల్లల పట్ల ఉన్న వివక్షత ఖచ్చితంగా మారాల్సిన అవసరం ఉంది.

*పట్టిక-6.2: భారతదేశంలో శిశు జనాభా (0-6 సంవత్సరాలు) : 2001, 2011*

| | 2001 | 2011 | భేదం | వ్యత్యాసం (శాతంలో) |
|---|---|---|---|---|
| శిశువులు | 163819589 | 164478150 | 658561 | +0.4 |
| బాలురు | 84999186 | 85732470 | 733284 | +0.8 |
| బాలికలు | 78820403 | 78745680 | -74723 | -0.09 |

**మీ ప్రగతిని పరీక్షించుకోండి**

1. లింగ నిష్పత్తిని ఎలా కొలుస్తారు?
2. లింగ నిష్పత్తి అధికంగా ఉన్న రాష్ట్రాలు ఏవి?

> లింగ వివక్షతను నిరసిస్తూ ఒక కరపత్రాన్ని రూపొందించండి.

## 6.6 జనాభా విస్ఫోటనం : భావన, కారణాలు, నివారణ చర్యలు

### 6.6.1 భావన

మాల్థస్ జనాభా సిద్ధాంతం ప్రకారం జనాభా పెరుగుదల అనేది చాలా ఎక్కువగా ఉండి మానవులకు కనీస అవసరాలైన తిండి గింజలు మరియు ఇతర అవసరాల పెరుగుదల తక్కువ స్థాయిలో ఉంటాయి. దీని మూలంగా పేదరికం ఎక్కువగా ఉంటుంది. ఈ సిద్ధాంతం ప్రకారం జనాభా పెరుగుదల గుణ శ్రేణి (2,4,8,16,32, ....) లో ఉండి పంటల ఉత్పత్తి అంక శ్రేణి (1,2,4,6,....) లో ఉంటాయి. కావున ప్రజలు పేదరికం అనుభవిస్తారు. జనాభా నియంత్రణ మాత్రమే ప్రజల పేదరికాన్ని తొలగించి ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి వైపు నడిపిస్తుంది. జనాభా పరివర్తన సిద్ధాంతంలోని రెండవ దశలో మనం జనాభా విస్ఫోటనాన్ని గమనిస్తాం. మరణాల రేటు తగ్గి జననాల రేటు మాత్రం అదే స్థాయిలో కొనసాగుతూ ఉండటం వలన అధిక జనాభాకు దారితీస్తుంది. భారతదేశం 1951-1991 మధ్య కాలంలో ఈ స్థితిని చవిచూసింది. జనాభా పెరుగుదలను నియంత్రించడంలో సరైన చర్యలు తీసుకోకపోతే ఆహార సమస్య, పేదరికం, నిరుద్యోగం మొదలగు తీవ్ర పరిస్థితులు నెలకొంటాయి.

### 6.6.2 భారతదేశంలో జనాభా విస్ఫోటనానికి గల కారణాలు

భారతదేశ జనాభా విస్ఫోటనానికి ప్రధానంగా మూడు కారణాలున్నాయి. అవి : 1) అధిక జననాల రేటు 2) అల్ప మరణాల రేటు 3) వలసలు. ఇందులో వలసల ప్రభావం అత్యల్పం. భారతదేశంలో జనాభా విస్ఫోటనానికి గల ఈ కారణాలను ఇప్పుడు విశ్లేషిద్దాం.

**1) మరణాల రేటు తక్కువగా ఉండడానికి గల కారణాలు**

**ఎ) కరువు కాటకాల నియంత్రణ :** బ్రిటిష్ పాలన అనంతరం భారతదేశంలో పంట విధానాల్లో మార్పు తేవడం, పంటలకు సాగునీటి సౌకర్యం కల్పించడం, కరువు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడం వలన మరణాల రేటు తగ్గింది.

**బి) వ్యాధుల నియంత్రణ :** స్వాతంత్ర్యానంతరం ఆరోగ్య రంగంలో జరిగిన అభివృద్ధి కారణంగా కలరా, మలేరియా, మశూచి వంటి అంటువ్యాధుల ద్వారా ఏర్పడే మరణాలను అరికట్టడం జరిగింది. దీని వలన మరణాల రేటు తగ్గింది. ముఖ్యంగా శిశు మరణాల రేటును చాలా నియంత్రించగలిగాం.

**సి) ఇతర అంశాలు :** వైద్య సదుపాయాల మెరుగుదల, త్రాగునీటి వసతి, శుభ్రత, విద్యా సదుపాయాల కల్పన, రోగ నిరోధక టీకాలు ఇవ్వడం, పేదరిక నిర్మూలన పథకాల అమలు వలన మరణాల రేటు చాలా తగ్గడం జరిగింది.

**2) అధిక జననాల రేటుకు కారణాలు**

**I. ఆర్థిక కారణాలు**

**ఎ) వ్యవసాయ రంగ ఆధిపత్యం :** వ్యవసాయ కుటుంబంలో పిల్లలను ఆర్థిక భారంగా చూడడం జరగదు. పైగా వ్యవసాయానికి కూలీల సంఖ్య అధికంగా అవసరం కాబట్టి జనాభా నియంత్రణ గురించి ఆలోచించరు. అందువల్ల వ్యవసాయ కుటుంబాలు ఉమ్మడి కుటుంబాలుగా పెద్దవిగా ఉండేవి.

**బి) పట్టణీకరణ :** పారిశ్రామికీకరణ మందకొడిగా ఉండడం వలన పట్టణీకరణ వేగవంతంగా జరగలేదు. వృత్తులలో పెద్దగా మార్పులు లేకపోవడం వలన జననాల రేటు అధికంగా ఉండేది.

**సి) పేదరికం :** జనాభా పెరుగుదలకు పేదరికం ఒక ప్రధాన కారణం. పేదవారు తమ సంతానాన్ని భారంగా చూడకుండా ఒక ఆర్థిక వనరుగా చూడటం వలన జననాల రేటు అధికంగా ఉంటుంది.

**II. సామాజిక కారణాలు**

ఎ) భారతదేశ సమాజంలో వివాహ వ్యవస్థ ఒక సర్వజన అంగీకారంగా ఉండటం వలన అది తప్పనిసరిగా జనాభా పెరుగుదలకు కారణం అవుతున్నది. వివాహం తప్పనిసరి అనే భావన ఉండటం వల్ల వివాహం వైపు మొగ్గు చూపడం జరుగుతుంది. ఈ కారణంగా జనాభా పెరుగుదల అనేది సహజంగా ఉంటుంది.

బి) చిన్న వయసులో వివాహం కావడం వలన జననాల రేటు అధికంగా ఉంది. భారతదేశ మహిళలకు సరాసరి వివాహ వయసు 18.3 సంవత్సరాలు మరియు పురుషులకు 22.6 సంవత్సరాలుగా ఉంది. చిన్న వయస్సులో మహిళకు వివాహం జరగడం వలన ఫర్టిలిటీ రేటు (ఒక మహిళకు పుట్టే మొత్తం పిల్లలు) ఎక్కువగా ఉండటం వలన జననాల రేటు అధికంగా ఉంది.

సి) మతాచారాలు, మూఢ నమ్మకాలు, వెనుకబాటుతనం వంటి కారణాలు కూడా జననాల రేటు అధికంగా ఉండడానికి దోహదపడుతున్నాయి.

డి) ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో సంతానాన్ని ఆర్థిక భారంగా చూడకపోవడం వల్ల ఎక్కువ మంది సంతానాన్ని కలిగి ఉండటం జరిగింది. ప్రస్తుతం ఉమ్మడి కుటుంబ వ్యవస్థ వేగంగా కనమరుగు కావడం గమనిస్తున్నాం.

ఇ) సమాజంలో విద్య ఒక్కటే మానవుల నడవడికను మార్చగలదు. ఉత్తమ విద్యా విధానాలు లేకపోవడం వలన సమాజంలో జనాభా నియంత్రణ ఆలోచనా ధోరణి మారడం లేదు.

ఎఫ్) కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటించకపోవడం వలన జనాభా వృద్ధి రేటు తగ్గడం లేదు. మతం, ఆచారాల వలన కుటుంబ నియంత్రణ ప్రచారం సఫలం కావడం లేదు.

## 6.6.3 జనాభా పెరుగుదల నియంత్రణ కొరకు చర్యలు

**I. ఆర్థిక చర్యలు**

**ఎ) పారిశ్రామిక రంగ విస్తరణ :** కార్మికులు ఆర్థికపరమైన అవగాహనను కొంత కలిగి ఉంటారు. ఉద్యోగాన్ని సంపాదించడంలో ఉన్న కష్టనష్టాలు తెలుసు. కావున వారి కుటుంబ సంఖ్యను నియంత్రణలో

ఉంచడానికి ఇష్టపడతారు. వారి సంతానానికి నాణ్యమైన జీవితాన్ని కల్పించేందుకు ఇష్టపడతారు. కావున తక్కువ మంది పిల్లలు ఉండడానికి ఇష్టపడతారు. దీని వలన జనాభా పెరుగుదలలో నియంత్రణ ఉంటుంది.

**బి) ఉద్యోగ కల్పన :** పారిశ్రామికీకరణ వలన ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా కల్పించవచ్చు. పట్టణీకరణ కూడా జరుగుతుంది. పట్టణీకరణ మరియు ఉద్యోగ కల్పన వలన ప్రజల్లో ఆర్థికపరమైన అవగాహన కలిగి చిన్న కుటుంబం పట్ల మొగ్గు చూపుతారు. ఈ రకంగా జనాభా పెరుగుదలలో నియంత్రణ కలుగుతుంది.

**సి) పేదరిక నిర్మూలన :** పేదరికంలో ఉన్న వారు సంతానాన్ని ఆర్థిక వనరుగా భావిస్తారు. కాబట్టి పేదరిక నిర్మూలన జరిగితే కొంత వరకు జనాభా నియంత్రణను సాధించవచ్చు.

**II. సామాజిక చర్యలు**

**ఎ) అక్షరాస్యత :** అక్షరాస్యత మానవుల నడవడికను మార్చుతుంది. జీవితం పట్ల చక్కటి అవగాహన కలుగజేస్తుంది. కాబట్టి విద్యాధికులైన యువతీ యువకులు కుటుంబ శ్రేయస్సుపై అవగాహన కలిగి ఉండి మూఢ నమ్మకాలను విడిచి చిన్న కుటుంబం లేదా తక్కువ సంతానం కలిగి ఉంటారు. విద్య, ఉద్యోగం వల్ల వివాహ వయస్సు వాయిదా పడే అవకాశం ఉంటుంది. దీని ద్వారా జనాభా పెరుగుదల నియంత్రణ కనబడుతుంది.

**బి) వివాహ వయస్సు :** చిన్నతనంలో వివాహం కావడం వలన పిల్లలు పుట్టే సంఖ్య అధికంగా ఉండవచ్చు. భారతదేశంలో పురుషుల కనీస వివాహ వయస్సు 21 సంవత్సరాలు అయితే మహిళలకు 18 సంవత్సరాలు అని నిర్ణయించారు. వివాహ వయస్సు ఎక్కువగా ఉంటే ఫర్టిలిటీ సంఖ్య తగ్గి జనాభా నియంత్రణ జరుగుతుంది.

**సి) కుటుంబ నియంత్రణ :** ఈ పద్ధతుల గురించి ప్రచారం కల్పించడం అత్యంత ఆవశ్యకం అయింది. ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు దీని కొరకై పథకాలను రూపొందించాలి.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. జనాభా పెరుగుదలకు గల ఆర్థిక కారణాలు ఏవి?
2. జనాభా పెరుగుదల నియంత్రణ కొరకు తీసుకోవాల్సిన సామాజిక చర్యలు ఏవి?
3. భారతదేశ మహిళలకు కనీస వివాహ వయసు ఎంత?

**చర్చించండి**

అక్షరాస్యతకు ఉన్న సంబంధాన్ని చర్చించండి.

## 6.7 జన సాంద్రత

జనాభా విస్తీర్ణం జన సాంద్రతను తెలియజేస్తుంది. ఒక నిర్దిష్ట వైశాల్యంలో జన సంఖ్య ఆధారంగా జన సాంద్రతను లెక్కగడతారు.


$$\text{జన సాంద్రత} = \frac{\text{నిర్దిష్ట ప్రాంతంలో జన సంఖ్య}}{\text{ఆ ప్రాంత వైశాల్యం (చదరపు కిలో మీటర్లు)}}$$

ఉదాహరణకు ఒక ప్రాంత వైశాల్యం 10 చదరపు కిలో మీటర్లు అనుకుందాం. ఆ ప్రాంతంలో 25 వేల జనాభా ఉంటే జన సాంద్రత 25,000/10=2,500. అంటే ప్రతి చదరపు కిలో మీటర్ వైశాల్యంలో 2,500 మంది విస్తరించి ఉన్నారని అర్థం.

జన సాంద్రత వలన మనం ఏమి తెలుసుకోగలం?

ఒక ప్రదేశంలో జన సాంద్రత ఎక్కువగా ఉంది అని అనుకుంటే దానర్థం ఆ ప్రాంత భూభాగం, మౌలిక వసతులు మొదలగునవి జీవనానికి అనుకూలంగా ఉన్నాయని అర్థం చేసుకోవచ్చు.

ఉదాహరణకు బీహార్‌లో 1,102 జన సాంద్రత ఉంది. దీనికి ప్రధాన కారణం ఇది మైదాన ప్రాంతం; పంటలకు, పరిశ్రమలకు, రవాణా సౌకర్యాలకు అనుకూలమైనది. అదే విధంగా అరుణాచల్ ప్రదేశ్ జన సాంద్రత 17. దీనికి ప్రధాన కారణం రాష్ట్రం పూర్తిగా కొండలు గుట్టలతో ఉంటుంది. నివాసయోగ్యం కానిది. అందువల్ల జన సాంద్రత తక్కువగా ఉంది.




పటం–6.2: భారతదేశంలో రాష్ట్రాల వారీ జన సాంద్రత

భారతదేశంలో జన సాంద్రత ప్రతి చదరపు కిలో మీటరుకు 382 గా ఉంది. అదే రాష్ట్రాల వారీగా గమనించినట్లయితే చాలా వ్యత్యాసాలు కనబడతాయి. పటం–6.2 ను పరిశీలించండి.

**మీకు తెలుసా?**

- మన పొరుగు దేశమైన బంగ్లాదేశ్ జన సాంద్రత మన దేశం కంటే చాలా ఎక్కువ.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. జన సాంద్రత ఏ అంశాలపై ఆధారపడి ఉంటుంది?
2. పర్వత ప్రాంతాలలో జన సాంద్రత చాలా ఎక్కువ: తప్పు/ ఒప్పు

**కనుక్కోండి**

బంగ్లాదేశ్ మరియు భారతదేశం కన్నా ఎక్కువ జన సాంద్రత గల దక్షిణాసియా దేశాల జన సాంద్రతను కనుక్కోండి.

## 6.8 వయస్సుల వారీ జనాభా

ఒక దేశ జనాభాను వయసుల వారీగా ప్రధానంగా మూడు వర్గాలుగా విభజిస్తారు.

### 6.8.1 పిల్లలు


సాధారణంగా 15 సంవత్సరాల వయస్సులోపు వారిని బాలలు లేదా పిల్లలుగా గుర్తిస్తారు. వీరి సంరక్షణ కుటుంబంపై ఉంటుంది. వీరికి విద్యా, వైద్య సౌకర్యాలను కల్పించడం అవసరం. అలాగే వీరి అవసరాలకు ఇతరుల డబ్బు అవసరం. కానీ ఆర్థిక అవసరాల కొరకు వీరిని పనికి పంపించడం శ్రేయస్కరం కాదు. భవిష్యత్తులో వీరు దేశానికి ఆర్థిక వనరుగా మారతారు.

### 6.8.2 పని చేసే వయసు వారు (Working Population)

దేశ జనాభాలో 15 నుండి 60 సంవత్సరాల వయసు వారిని పని చేసే వయసు వారిగా వర్గీకరించవచ్చు. ఈ వర్గం వారు దేశ ఆర్థిక-సామాజిక అభివృద్ధికి ముఖ్యమైన వారు. వస్తుసేవలను ఉత్పత్తి చేసే వీరి పని సామర్థ్యాలపై అభివృద్ధి ఆధారపడి ఉంటుంది. పిల్లలు, వృద్ధులు వారి అవసరాల కొరకు ఈ వర్గంపై ఆధారపడి ఉంటారు.

### 6.8.3 వృద్ధులు

60 సంవత్సరాల వయస్సు పైబడిన వారిని వృద్ధులుగా పరిగణిస్తాం. కొందరు తమకు వచ్చే పెన్షన్‌పై ఆధారపడి ఉంటారు. మరికొందరు తమ సంతానంపై ఆధారపడి ఉంటారు. అయినా మన దేశంలో అధికంగా ఈ వయస్సు వారు అసంఘటిత రంగంలో పనిచేస్తూ ఉంటారు. సాధారణంగా వీరికి వైద్యం అవసరాలు ఎక్కువగా ఉండి, డబ్బుల అవసరాలు ఎక్కువగా ఉంటాయి. ప్రభుత్వం వృద్ధులకు తప్పని సరిగా పెన్షన్ అమలు చేస్తే సౌకర్యంగా ఉంటుంది.




*పటం-6.3: భారతదేశంలో వయస్సు వారీ విభజన ధోరణులు, 1971-2011*

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. ఆర్థికాభివృద్ధికి అవసరమైన పనిచేసే వయస్సు వారి పరిధి (సంవత్సరాలలో)

   ఎ) 10-15 బి) 15-60 సి) 6-14 డి) 60-80

## 6.9 వృత్తుల వారీ జనాభా విభజన

ఏ దేశమైనా వృద్ధి చెందాలి అంటే శ్రామిక శక్తి అవసరం. ఉత్పత్తి కారకాలలో శ్రామికులు ముఖ్య కారకాలు. ఒక ఆర్థిక వ్యవస్థలోని పని చేసే వయస్సులో ఉన్న జనాభాను వివిధ రకాల వృత్తుల మధ్య విభజించడాన్ని వృత్తుల వారీ జనాభా విభజన అనవచ్చు. మూడు రకాలైన ప్రధాన వృత్తులను మనం గమనించవచ్చు. అవి:

**1. ప్రాథమిక వృత్తులు (Primary Occupations):** వ్యవసాయం, పశుపోషణ, అడవులు, చేపల పెంపకం మొదలగు వాటిని ప్రాథమిక వృత్తులు అంటారు.

**2. ద్వితీయ వృత్తులు (Secondary Occupations):** చిన్న, మధ్య, భారీ తరహా పరిశ్రమలలోని వృత్తులను ద్వితీయ వృత్తులు అని అంటారు.

**3. తృతీయ వృత్తులు (Tertiary Occupations):** రవాణా, కమ్యూనికేషన్లు, బ్యాంకింగ్ పాలన, విత్తం మొదలగు వృత్తులను లేదా సేవలను తృతీయ వృత్తులు అని అంటారు.

2011 జనాభా లెక్కల ప్రకారం 121 కోట్ల జనాభాలో 40 కోట్ల మంది పని చేస్తున్న వారు అంటే ఉత్పాదక కార్యకలాపాలలో భాగస్వాములైన ప్రజలు ఉన్నారు. భారతదేశ ఉపాధి రంగంలో ఎక్కువ మార్పులు రాలేదని చెప్పవచ్చు. ఇప్పటికీ వ్యవసాయమే ప్రధాన ఉపాధి రంగంగా ఉంది. పారిశ్రామిక, సేవా రంగాలలో ఉపాధిని ఎక్కువగా కల్పించలేకపోవడం కారణంగా వ్యవసాయ రంగంలోనే ఎక్కువ మంది కొనసాగుతున్నారు.

దేశంలోని కార్మికులలో సుమారు సగం మంది వ్యవసాయంలో ఉన్నప్పటికీ స్థూల దేశీయ ఉత్పత్తిలో (Gross Domestic Product-GDP) చాలా తక్కువ వాటా కలిగి ఉంది. వ్యవసాయ రంగంలో దాదాపు 50 శాతం వరకు ఉన్న శ్రామిక శక్తి మొత్తం దేశీయ ఉత్పత్తిలో మాత్రం కేవలం 19 శాతం మాత్రమే నమోదు అవుతుంది. స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయ రంగం వాటా గణనీయంగా క్షీణించింది. కానీ వ్యవసాయ రంగంలో కార్మికుల శాతం మాత్రం అంతగా క్షీణించకుండా ఉంది. దీంతో వ్యవసాయ రంగంలో అవసరమైన దానికంటే ఎక్కువ మంది ఉన్నారని అర్థమవుతోంది. వ్యవసాయం నుండి కొంత మందిని తొలగించినప్పటికీ వ్యవసాయ ఉత్పత్తిపై ప్రభావం ఉండదు. ఇలా వ్యవసాయ రంగంలో అవసరమైన దానికంటే ఎక్కువ మంది పని చేయడాన్ని 'ప్రచ్ఛన్న నిరుద్యోగం' (disguised unemployment) అంటారు. సహజంగా మనం గ్రామీణ వ్యవసాయ కుటుంబంలో ఈ పరిస్థితిని చూస్తాం. కుటుంబం అంతా తమకు ఉన్న చిన్న వ్యవసాయ భూమిపై ఆధారపడి ఉంటారు. నిజానికి ఆ భూమిపై అంత మంది పని చేసే అవసరం లేదు. ఇతర రంగాలలో ఉపాధి అవకాశాలు పెరిగితే వ్యవసాయ రంగంలో కార్మికుల వాటా తగ్గవచ్చు.

**కనుక్కోండి**


మీ ప్రాంతంలో వ్యవసాయంపై ఆధారపడ్డ కుటుంబాలలో ఎంత మంది పనిచేసే వారు ఉన్నారు? వారు ఎందుకు వ్యవసాయాన్ని మాత్రమే చేయడానికి ఇష్టపడుతున్నారు? కనుక్కోండి.

**మీ ప్రగతిని పరీక్షించుకోండి**


1. సేవా రంగానికి ఉదాహరణలు తెలపండి.
2. ఇప్పటికీ ఏ రంగంలో ఎక్కువ మంది పని చేస్తున్నారు?

## 6.10 రంగాల వారీగా ఉపాధి మరియు ఉత్పత్తి విభజన

భారతదేశంలో రంగాల వారీగా ఉపాధి వాటా చూసినట్లయితే 2015-16 లో వ్యవసాయంలో 47 శాతం పరిశ్రమలలో 22 శాతం మరియు సేవా రంగంలో 31 శాతంగా ఉంది. ఇదే రకంగా మూడు రంగాలలో స్థూల జాతీయోత్పత్తిని చూసినట్లయితే వ్యవసాయ వాటా 19 శాతం పరిశ్రమల వాటా 28 శాతం సేవల వాటా 53 శాతంగా ఉంది.




*పటం-6.4: మూడు రంగాలలో ఉపాధి వాటా*




*పటం-6.5: మూడు రంగాలలో స్థూల జాతీయోత్పత్తి వాటా*

పటాలు 6.4 మరియు 6.5 లను పరిశీలించినట్లయితే ఉపాధి రంగానికి, ఉత్పత్తి రంగానికి మధ్య తేడా స్పష్టంగా కనబడుతుంది. 47 శాతం ఉపాధి ఉన్న వ్యవసాయ రంగం నుండి ఉత్పత్తి కేవలం 19 శాతం మాత్రమే ఉంది. అదే విధంగా 31 శాతం ఉపాధిగా ఉన్న సేవా రంగం మొత్తం ఉత్పత్తిలో 53 శాతం వాటా కలిగి ఉంది. అంటే వ్యవసాయ రంగంలో శ్రామిక శక్తి అధికంగా ఉంది. దీనిని పారిశ్రామిక, సేవా రంగాలకు తరలించాల్సిన అవసరం ఉంది.

మన దేశంలో ఉపాధి తీరులో చెప్పుకోదగినంత మార్పులు జరగడం లేదని ఇంతకు ముందే పరిశీలించడం జరిగింది. ఉపాధిలో వ్యవస్థీకృత (organised), అవ్యవస్థీకృత (unorganised) రంగాలు ఉన్నాయి. కర్మాగారాల చట్టం, కనీస వేతన చట్టం వంటి ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ క్రమబద్ధ ప్రక్రియలు, విధానాలు పాటిస్తూ ఉన్న సంస్థల కార్మికులను వ్యవస్థీకృత రంగంగా గుర్తించవచ్చు. కానీ ఈ రంగాలలో ఉపాధి అవకాశాలు తక్కువగా ఉన్నాయి, మరియు అభివృద్ధి చాలా నెమ్మదిగా జరుగుతున్నది.

అవ్యవస్థీకృత రంగంలో చిన్న సంస్థలు ఉంటాయి. ఇవి ప్రభుత్వ నిబంధనలు పాటించవు. ఉద్యోగులకు జీతం తక్కువ, భద్రత కూడా ఉండదు. ఎక్కువ పని, తక్కువ వేతనం ఉంటుంది. యజమాని ఉద్యోగిని ఎప్పుడైనా ఉద్యోగం నుంచి తీసేయవచ్చు. సేవా రంగంలో స్వయం ఉపాధి పొందుతున్న వాళ్ళు పెద్ద సంఖ్యలో ఉన్నారు. కూరగాయలు, పండ్లు, బజార్లలో చిన్న చిన్న వస్తువులు, వీధి వీధి తిరిగి జీవితం కొనసాగిస్తారు. ఈ రకంగా ఉపాధి విషయంలో ఎక్కువగా అవ్యవస్థీకృత రంగానికి చెందిన వారే ఉన్నారు.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. స్థూల జాతీయోత్పత్తిలో ఏ రంగం వాటా ఎక్కువగా ఉంది?
2. అవ్యవస్థీకృత రంగానికి ఉదాహరణలు ఇవ్వండి.
3. వ్యవసాయ రంగంలో పని చేసే వారు ఎక్కువగా నివసించే ప్రాంతం : పట్టణ / గ్రామీణ

మీ ప్రాంతంలో పనిచేస్తున్న వారి గురించి సర్వే నిర్వహించండి. ఈ సర్వే ఆధారంగా వ్యవస్థీకృత, అవ్యవస్థీకృత రంగాలలోని ఉపాధి అవకాశాలను విశ్లేషించండి:

| పేరు | వయస్సు | వృత్తి | వ్యవస్థీకృత / అవ్యవస్థీకృత రంగం |
|---|---|---|---|
| | | | |

## 6.11 గ్రామీణ-పట్టణ జనాభా

భారతదేశం గ్రామాల దేశం. 2011 జనాభా లెక్కల ప్రకారం గ్రామీణ జనాభా 833.5 మిలియన్లు, పట్టణ జనాభా 377.1 మిలియన్లుగా ఉంది. అనగా 68.8 శాతం ప్రజలు గ్రామాల్లో నివసిస్తున్నారు. పట్టణాలలో 31.2 శాతం ఉన్నారు. 2001 గణాంకాలతో పోలిస్తే 27.8 శాతంగా ఉన్న పట్టణ జనాభా ఇప్పుడు 31.2

శాతంకు చేరింది. అదే విధంగా 72.2 శాతంగా ఉన్న గ్రామీణ జనాభా 68.8 శాతానికి తగ్గింది. 2011 జనాభా లెక్కల ప్రకారం, భారతదేశ రాష్ట్రాలలో ఢిల్లీలో అత్యధికంగా 97.5 శాతం జనాభా పట్టణ జనాభా ఉంది. దేశ రాజధాని కావడమే ఇందుకు కారణం. గోవా (62%), మిజోరం (52%), తమిళనాడు (48%), కేరళ (47%), మహారాష్ట్ర (45%) ఆ తర్వాతి స్థానాలలో ఉన్నాయి. అత్యధిక గ్రామ జనాభా గల రాష్ట్రాలుగా హిమాచల్ ప్రదేశ్ (90%), బీహార్ (89%), అసోం (86%), మేఘాలయ (80%), ఉత్తరప్రదేశ్ (78%) ఉన్నాయి.

పట్టణీకరణ పెరుగుతున్నప్పటికీ ఇందుకు అనుగుణంగా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం లేదు. రోడ్లు, మురుగు నీటి పారుదల, విద్యుచ్ఛక్తి, త్రాగు నీరు, ఇతర ప్రజా సదుపాయాల అవసరం ఉంది. పట్టణ మౌలిక సదుపాయాలలో, ప్రత్యేకించి రోడ్డు రవాణా మెరుగుపరచడంలో ప్రభుత్వ జోక్యం కొన్ని ఫలితాలను ఇస్తుంది. అయితే విద్యుచ్ఛక్తి, త్రాగు నీరు, వైద్య పరిస్థితి విషయంలో దారుణంగా ఉంది.

నగరాలలో పట్టణీకరణ ఉండటం, అక్కడికి వలస పోవటం కొంత మందికి వరంగా ఉంది. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాలలో పేదరికం స్థాయి తక్కువగానే ఉన్నప్పటికీ, అధిక ఆదాయం, తక్కువ ఆదాయం గల కుటుంబాల మధ్య వ్యత్యాసం చాలా ఎక్కువగా ఉంది. ఈ వ్యత్యాసం రాను రాను ఇంకా పెరుగుతోంది. పట్టణాలు, నగరాలలోని జనాభా పెరుగుదలలో అధిక భాగం సహజ వృద్ధి వల్ల జరిగింది. ఈ పట్టణాల జనాభా కాలక్రమంలో పెరిగింది. చుట్టుపక్కల ఉన్న గ్రామీణ ప్రాంతాలను కలుపుకోవడం వల్ల కొన్ని పట్టణాలు, నగరాలు విస్తరించాయి. జనాభా వృద్ధిలో ఐదింట ఒక వంతు మాత్రమే గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతానికి వచ్చిన వలసల వల్ల సంభవించింది. పట్టణీకరణ జరగటంలోని ఒక సమస్య భూమిలో కలిసిపోని పదార్థాల వినియోగం పెరగటం. పెరుగుతున్న పట్టణ జనాభాకు గృహ వసతి కావాలి, నీటి సరఫరా ఉండాలి, మురుగు నీరు, ఇతర వ్యర్థ పదార్థాలు తొలగించే విధానం ఉండాలి. ఇవి లేకపోతే ఎన్నో అంటువ్యాధులకు దారి తీయవచ్చు. ఈ విధంగా పట్టణీకరణ అభివృద్ధికే కాకుండా సమస్యలకు కూడా నిలయం అవుతుంది.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. భారతదేశంలో అధిక గ్రామీణ జనాభా ఎందుకు ఉంది?
2. ఢిల్లీ రాష్ట్రంలో అత్యధిక శాతం ప్రజలు పట్టణ ప్రాంతంలో ఉండటానికి కారణం ఏమిటి?

## 6.12 ముగింపు (ముఖ్యాంశాలు)

- జనన, మరణాల రేట్లకు సంబంధించి ప్రతి దేశం సాధారణంగా మూడు దశల గుండా వెళ్తుంది.
- మరణాల రేటు కంటే జననాల రేటు ఎక్కువగా ఉంటే జనాభా పెరుగుదల రేటు అధికంగా ఉంటుంది. ఈ పరిస్థితినే 'జనాభా విస్ఫోటనం' అంటారు.
- జననాల రేటు, మరణాల రేటు, వలసలపైన జనాభాలో మార్పు ఆధారపడి ఉంటుంది.
- భారతదేశంలో 1881 నుండి ప్రతి 10 సంవత్సరాలకు ఒకసారి జనాభా లెక్కల సేకరణ (census) జరుగుతుంది.
- మన దేశంలో లింగ నిష్పత్తి (sex ratio) స్త్రీలకు ప్రతికూలంగా ఉండడమే గాకుండా అది రాను రాను పెరుగుతున్నది.

- భారతదేశంలో కరువు కాటకాల నియంత్రణ, వ్యాధుల నియంత్రణ, వైద్య సదుపాయాల మెరుగుదల వంటి కారణాల వల్ల మరణాల రేట్లు తగ్గుతూ వచ్చాయి.
- వ్యవసాయ రంగ ఆధిపత్యం, పట్టణీకరణ వేగవంతంగా జరగకపోవడం, పేదరికం, చిన్న వయసులో వివాహాలు జరగడం, మహిళా అక్షరాస్యతా రేటు తక్కువగా ఉండడం, కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటించకపోవడం మొదలగునవి అధిక జననాల రేటుకు కారణం అయ్యాయి.
- భారతదేశంలో రాష్ట్రాల వారీగా జన సాంద్రతను గమనించినట్లయితే చాలా వ్యత్యాసాలు కనబడతాయి.
- ఒక దేశ ఆర్థిక సామాజిక అభివృద్ధికి పని చేసే వయసు గల జనాభా (working population) చాలా ముఖ్యం. సాధారణంగా పిల్లలు, వృద్ధులు వీరిపై ఆధారపడి ఉండే అవకాశం ఉంది.
- భారతదేశంలో మెజారిటీ ప్రజలు గ్రామాలలో నివసించడమే గాకుండా వారిలో అధికులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు.
- మన దేశంలో ఇప్పటికీ ఎక్కువ మంది శ్రామికులు అవ్యవస్థీకృత (unorganised) రంగాలలో పని చేస్తున్నారు.

## 6.13 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 1-2 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. జన సాంద్రత అంటే ఏమిటి?
2. ప్రాథమిక వృత్తులు అంటే ఏమిటి?

**II. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 4-5 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. జనన, మరణ, శిశు మరణాల రేట్లు అంటే ఏమిటి?
2. భారతదేశంలో వయస్సుల వారీ జనాభా విభజన వర్గాలను తెలపండి.

**III. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 8-10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. జనాభా పరివర్తన సిద్ధాంతంలోని దశలను వివరించండి.
2. భారతదేశంలో గత దశాబ్ద కాలంలోని జనన, మరణ శాతాలలో వచ్చిన మార్పులను విశ్లేషించండి.
3. లింగ నిష్పత్తి భావనను వివరించండి. ఇది భారతదేశంలో ఎందుకు ప్రతికూలాంశంగా ఉంది?
4. జనాభా విస్ఫోటనానికి గల కారణాలను వివరించండి.

**IV. కింది వాటిలో సరైన జవాబును ఎంపిక చేయండి.**

1. భారతదేశంలో ప్రచ్ఛన్న నిరుద్యోగాన్ని మనం ఈ రంగంలో చూస్తాము ( )
   ఎ) వ్యవసాయ రంగం బి) పారిశ్రామిక రంగం సి) సేవా రంగం డి) ఇవేవీ కావు
2. కింది వాటిలో అత్యల్ప జన సాంద్రత గల రాష్ట్రం ( )
   ఎ) ఢిల్లీ బి) మహారాష్ట్ర సి) తెలంగాణ డి) అరుణాచల్ ప్రదేశ్

## 6.14 ఉపయుక్త గ్రంథాలు

1. అర్థశాస్త్రం, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పాఠ్య గ్రంథం, తెలుగు అకాడమీ.

# 7 భారత ఆర్థిక వ్యవస్థ - ప్రధాన రంగాలు

## 7.0 అభ్యసన ఫలితాలు

- ఆర్థిక కార్యకలాపాలను వర్గీకరిస్తారు. మూడు రంగాలలోని కార్యకలాపాలకు ఉదాహరణలను తెలుపుతారు.
- జాతీయాదాయంలో మూడు రంగాల వాటాను వివరిస్తారు.
- వ్యవసాయ రంగంపై శ్రామిక జనాభాలో ఎక్కువ భాగం ఆధారపడటానికి గల కారణాలను విశ్లేషిస్తారు.
- జాతీయాదాయంలో అధిక వాటాను సేవా రంగం కల్పించడానికి గల కారణాలను విశ్లేషిస్తారు.
- మూడు రంగాల్లో ఉపాధి అవకాశాలను పెంచడానికి చర్యలను సూచిస్తారు.
- వ్యవసాయ, పారిశ్రామిక రంగాల వెనుకబాటుతనానికి గల కారణాలను విశ్లేషిస్తారు. అలాగే ఈ రంగాల అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలను సూచిస్తారు.

## 7.1 పరిచయం

స్వాతంత్ర్యం సాధించిన తర్వాత భారతదేశ ఆర్థిక వ్యవస్థలో అనేక నిర్మాణాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాల్లో ఆధునిక మరియు అధునాతన ఉత్పత్తి పద్ధతులు ఉపయోగించ బడుతున్నాయి. ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో భారతదేశం ఒకటి. ప్రాథమిక రంగపు పాత్ర తగ్గుతూ ద్వితీయ, తృతీయ రంగాల పాత్ర క్రమంగా పెరగుతున్నది. కానీ, ఇప్పటికీ జనాభాలో ఎక్కువ శాతం వ్యవసాయం మీద ఆధారపడి ఉన్నారు. ఆర్థిక వ్యవస్థలోని రంగాలు ఎలా వర్గీకరించబడ్డాయి, జాతీయ ఉత్పత్తిలో ఏ రంగాల వాటా గణనీయంగా పెరుగుతోంది వంటి ప్రశ్నలకు సమాధానం కోసం మనం ఆర్థిక వ్యవస్థలోని మూడు రంగాల గురించి అర్థం చేసుకోవాలి. ఈ విభాగంలో ఆర్థిక రంగాల ప్రాముఖ్యత, జాతీయ ఆదాయంలో వాటి భాగస్వామ్యం మరియు ఈ రంగాలలో జరిగిన పురోగతిని వివరంగా చర్చిస్తాం.

## 7.2 భారతీయ ఆర్థిక వ్యవస్థ : మూడు రంగాలు

### 7.2.1 భారతదేశంలో ప్రణాళికారచన

స్వాతంత్ర్యం సిద్ధించిన తరవాత భారత ప్రభుత్వం ప్రణాళికా సంఘాన్ని 1950 మార్చిలో ఏర్పాటు చేసింది. భారత ప్రభుత్వం 12 పంచవర్ష ప్రణాళికలను అమలు పరచడం ద్వారా ఆర్థిక వృద్ధి, స్వయం సమృద్ధి, సమ్మిళిత వృద్ధి, సుస్థిర అభివృద్ధి, ఉపాధి కల్పన, పేదరిక నిర్మూలన, ఆదాయ అసమానతల తగ్గింపు లక్ష్యాలను సాధించడానికి కృషి చేసింది. కొన్ని లక్ష్యాలు సాధించబడ్డాయి, మరికొన్ని సాధించబడలేదు. ప్రణాళికా సంఘం


స్థానంలో భారత ప్రభుత్వం 2015 జనవరి 1న నీతి ఆయోగ్ (National Institution for Transforming India - NITI Aayog) ను స్థాపించింది. ఇది ఆర్థిక వ్యవస్థలో వివిధ అంశాలపై విధానాలను సూచించడంలో కీలక పాత్రను పోషిస్తుంది.

### 7.2.2 మిశ్రమ ఆర్థిక వ్యవస్థ

భారతదేశాన్ని మిశ్రమ ఆర్థిక వ్యవస్థగా పిలుస్తారు. ఎందుకంటే ఇక్కడ పబ్లిక్ (ప్రభుత్వం) మరియు ప్రైవేటు రంగాలు ఆర్థిక కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి. 1991లో ప్రధాన ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టే వరకు ఆర్థిక కార్యకలాపాలలో ప్రభుత్వ రంగం ప్రధాన పాత్ర పోషించింది. కానీ, తరువాతి కాలంలో సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణల అమలు కారణంగా ప్రైవేటు రంగపు ప్రాముఖ్యత పెరుగుతోంది. మీరు యూనిట్-8లో ప్రధాన ఆర్థిక సంస్కరణలను అధ్యయనం చేస్తారు.

### 7.2.3 భారత ఆర్థిక వ్యవస్థలోని మూడు ప్రధాన రంగాలు

భారత ఆర్థిక వ్యవస్థను మూడు ప్రధాన రంగాలుగా విభజించవచ్చు. అవి: ప్రాథమిక రంగం, ద్వితీయ రంగం, తృతీయ రంగం.




*చార్టు-7.1: ఆర్థిక వ్యవస్థ - మూడు రంగాలు*

**1. ప్రాథమిక రంగం (ముడి పదార్థాల వెలికితీత):** సహజ వనరులను నేరుగా ఉపయోగించడం ద్వారా వస్తువులను ఉత్పత్తి చేయడం ప్రాథమిక రంగపు ఒక కార్యకలాపం. వ్యవసాయ రంగం ఇతర అన్ని ఉత్పత్తులకు ఆధారం. వ్యవసాయం, అటవీకరణ, చేపలు పట్టడం, పాడి, మైనింగ్ మొదలైన వాటి నుండి మనకు లభించేవి చాలా వరకు సహజ ఉత్పత్తులు. దీనిని 'వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగం' అని కూడా పిలుస్తారు.

**2. ద్వితీయ రంగం (తయారీ రంగం):** ఇందులో ముడి పదార్థాలు మరియు మాధ్యమిక (ఇంటర్మీడియరీ) ఉత్పత్తులను వస్తువులుగా మార్చడం జరుగుతుంది. ఉదాహరణకు ఉక్కును కార్లుగా, పత్తిని దారాలు, బట్టలుగా తయారు చేయడం మొదలైనవి. ఇది ముడి పదార్థాలను ఉత్పత్తి చేయకుండా వస్తువులను తయారు చేసే ఆర్థిక వ్యవస్థలో ఒక భాగం. ఈ రంగం వివిధ రకాల పరిశ్రమలతో ముడిపడి ఉన్నందున దీనిని 'పారిశ్రామిక రంగం' అని కూడా పిలుస్తారు.

**3. తృతీయ రంగం:** వినియోగదారులకు సేవలను, వ్యాపారస్తులకు పూర్తిగా ఉత్పత్తి అయిన (తుది) వస్తువులను అందించడానికి తృతీయ రంగం ఉపయోగపడుతుంది. ఇక్కడ సేవలు ఉత్పత్తి చేయబడతాయి. కాబట్టి దీనిని 'సేవా రంగం' అని కూడా పిలుస్తారు. రవాణా, గిడ్డంగి, కమ్యూనికేషన్, బ్యాంకింగ్, బీమా, వాణిజ్యం, హోటళ్ళు, రెస్టారెంట్లు, ఫైనాన్సింగ్, రియల్ ఎస్టేట్, బిజినెస్ సర్వీసెస్, టూరిజం, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మొదలైనవి సేవా రంగంలోని కొన్ని కార్యకలాపాలు.

## 7.3 స్థూల దేశీయ ఉత్పత్తి (GDP) లో రంగాల వారీ వాటా

ఒక దేశపు ఆర్థిక వృద్ధిని స్థూల జాతీయోత్పత్తి (GDP) ద్వారా కొలుస్తారు. స్థూల దేశీయోత్పత్తి అనగా ఒక సంవత్సరంలో ఒక దేశం ఉత్పత్తి చేసే తుది వస్తువుల, సేవల మొత్తం ద్రవ్య విలువ. 1950-51 కాలంలో వ్యవసాయం భారతదేశ జిడిపిలో అత్యధికంగా 57% వాటాను కలిగి ఉంది. కానీ క్రమంగా దాని వాటా 2018-19 నాటికి 16.1 శాతానికి తగ్గింది. జిడిపిలో పరిశ్రమల రంగం వాటా 1950-51 లో 15% నుండి 2018-19 లో 29.6% కి క్రమంగా పెరిగింది. సేవా రంగం వాటా 1950-51 లో 25% నుండి 2018-19 లో 54.3% కి మెరుగుపడింది (ఆర్థిక సర్వే నివేదిక 2019-20 ప్రకారం). వ్యవసాయ రంగ వాటా తగ్గడానికి ప్రతికూల వాతావరణ స్థితిగతులు మరియు దేశంలో కాలక్రమేణ నిర్మాణాత్మక మార్పులు చోటు చేసుకోవడం ప్రధాన కారణాలు. ఉదాహరణకు మౌలిక (అవస్థాపన) సదుపాయాల విస్తరణ, సమాచార, సాంకేతిక పరిజ్ఞానం, బ్యాంకింగ్, ఆర్థిక సంస్థలు, ఇతర సేవల అభివృద్ధి వంటి నిర్మాణాత్మక మార్పులు (structural reforms) దేశంలో జరుగుతూనే ఉన్నాయి.

## 7.4 రంగాల వారీ జనాభా విభజన

పెరుగుతున్న జనాభా దృష్ట్యా దేశంలో శ్రామిక జనాభా మొత్తానికి ఉపాధి అవకాశాలను కల్పించడం చాలా అవసరం. భారత జన గణన 2011 ప్రకారం, భారతదేశ జనాభా 1.2 బిలియన్లలో 481.9 మిలియన్ల మంది మొత్తం కార్మికులు, 263.1 మిలియన్ల మంది వ్యవసాయ కార్మికులు ఉన్నారు. 1951 లో 361.1 మిలియన్ జనాభాలో 139.5 మిలియన్లు కార్మికులు కాగా, 97.2 మిలియన్లు వ్యవసాయ కార్మికులు. భారతదేశంలోని కార్మికుల గురించి కొన్ని ప్రాథమిక వాస్తవాలను పట్టిక-7.1 చూపిస్తుంది.

*పట్టిక-7.1: భారతదేశంలో 1951, 2011 సంవత్సరాలలో జనాభా మరియు వ్యవసాయ కార్మికులు (మిలియన్లలో)*

| సంవత్సరం | మొత్తం జనాభా | సరాసరి సంవత్సర వృద్ధి రేటు (%) | గ్రామీణ జనాభా | మొత్తం కార్మికులు | వ్యవసాయ కార్మికులు | | |
|---|---|---|---|---|---|---|---|
| | | | | | వ్యవసాయదారులు | వ్యవసాయ కూలీలు | మొత్తం |
| **1951** | **361.1** | **1.25** | **298.6** | **139.5** | **69.9** | **27.3** | **97.2** |
| **2011** | **1210.9** | **1.50** | **833.7** | **481.9** | **118.8** | **144.3** | **263.1** |

ఆధారం: రిజిస్ట్రార్ జనరల్ & సెన్సస్ కమిషనర్ ఆఫ్ ఇండియా

వ్యవసాయ రంగంలో ఉపాధి కొరకు అధిక జనాభా ఆధారపడడానికి కారణం పరిశ్రమ మరియు సేవా రంగాలలో తగినంత ఉద్యోగాలు సృష్టించబడలేదు. ఫలితంగా దేశంలో దాదాపు సగం మంది కార్మికులు వ్యవసాయ రంగంలోనే పని చేస్తున్నారు. కానీ జిడిపిలో సుమారు 1/6వ వంతు వాటా మాత్రమే వ్యవసాయం కలిగి ఉంది. దీనికి విరుద్ధంగా పరిశ్రమ, సేవా రంగాలు కలిపి సగం మంది కార్మికులతో జిడిపిలో సుమారు 4/5వ వంతు వాటాను కలిగి ఉంది. దీనిని బట్టి అవసరమైన దాని కన్నా ఎక్కువ మంది వ్యవసాయంలో నిమగ్నమైన ఉన్నారని అర్థమవుతుంది. అందులో కొంత మంది వ్యవసాయం నుండి బయటపడినప్పటికీ, ఉత్పత్తి ప్రభావితం కాదు.

## 7.5 వ్యవసాయ రంగం

ప్రపంచ ఆహార సంస్థ (FAO) గణాంకాల ప్రకారం పాల ఉత్పత్తులు, జనపనార, పప్పు ధాన్యాలు మరియు పశు సంపదలో గేదెల ఉత్పత్తిలో భారతదేశం ప్రపంచంలో మొదటి స్థానంలో ఉంది. భారత ఆర్థిక వ్యవస్థను వ్యవసాయం ఎంతగానో ప్రభావితం చేస్తుంది. ఒక దేశ ఆహార భద్రత వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉంటుంది. ఆహారాన్ని అందించడంతో పాటు పత్తి, పంచదార, పొగాకు, కాగితం మొదలగు వ్యవసాయ ఉత్పత్తులను పరిశ్రమలకు ముడి పదార్థాలుగా కూడా వ్యవసాయ రంగమే అందిస్తుంది. మన విదేశీ వ్యాపారంలో చెప్పుకోదగ్గ విదేశీ మారక ద్రవ్యాన్ని వ్యవసాయ రంగంలోని ఉత్పత్తులైన తేయాకు, కాఫీ, ముడి పొగాకు, వంట నూనెలు, ముడి పత్తి, పండ్లు మున్నగునవి దోహదపడుతున్నాయి. భారతదేశంలో ఉన్న పశు సంపద వల్ల దేశంలో కోడి గుడ్లు, పాలు, మాంసం, ఉన్ని మొదలగు వాటి డిమాండును తీర్చడానికి దోహదపడుతుంది.

### 7.5.1 స్వాతంత్ర్యానంతరం భారత వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులు

భారతదేశంలో వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులను మూడు దశలుగా చెప్పవచ్చు. మొదటి దశను 'పూర్వ-హరిత విప్లవ దశ' (హరిత విప్లవానికి ముందు దశ) అంటారు. ఈ దశలో భూసంస్కరణలు, గ్రామీణ పరపతి మరియు నీటి పారుదల సౌకర్యాలను కల్పించే అంశాలకు ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. రెండవ దశలో నీటి నిర్వహణతో పాటు, నీటి పారుదల కల్పించిన ప్రాంతాలకు పురుగు మందులు, రసాయనిక ఎరువులు వివిధ రకాల నూతన వంగడాలను అభివృద్ధి పరచడం వంటి తదితర అంశాలకు ప్రాధాన్యతను ఇవ్వడం జరిగింది. మూడవ దశ నూతన ఆర్థిక విధానం, 1991 యొక్క కాలం. ఈ దశ ప్రోత్సాహకాలను అందించడంపై, అదే విధంగా వ్యవసాయంలో పబ్లిక్ పెట్టుబడిని ప్రోత్సహించాలని నొక్కి చెప్పింది. దురదృష్టవశాత్తు మొదటి దశలో పెరుగుతున్న జనాభా అవసరాలను తీర్చడానికి ఆహార ధాన్యాల ఉత్పత్తి తగినంతగా లేదు. రెండవ దశలో జరిగిన ప్రయత్నాల ఫలితంగా తలసరి ఆదాయాలు పెరిగాయి. ఇక మూడవ దశలో వ్యవసాయంపై ప్రభుత్వం చేసే పెట్టుబడులు తగ్గుతూ వచ్చాయి. మరోవైపు వ్యవసాయాభివృద్ధికై పలు రకాల విధానాలను, పథకాలను ప్రభుత్వం అమలు పరిచింది. ఫలితంగా వ్యవసాయ ఉత్పాదకత ప్రతి సంవత్సరం క్రమంగా పెరుగుతూ వచ్చింది.

### 7.5.2 హరిత విప్లవం, వ్యవసాయ ఉత్పాదకత

**1. హరిత విప్లవం:** హరిత విప్లవంలో రెండు దశలు వున్నాయి. ఇందులో మొదటి దశలో (సుమారు 1960 మధ్య దశకం నుండి 1970 మధ్య దశకం వరకు) అధిక ఉత్పత్తిని ఇచ్చే (HYV) వంగడాల ఉపయోగం, నీటి పారుదల సౌకర్యాల కల్పన, పురుగు మందులు, ఎరువుల కొనుగోలుకు ఆర్థిక సహాయం అందించడంలో

ఎక్కువ దృష్టిని కేంద్రీకరించారు. అయితే ఇది అధిక ఆదాయం గల పంజాబ్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలలో కేంద్రీకృతమైంది. అందులోనూ అధిక దిగుబడినిచ్చే వంగడాలు కేవలం గోధుమ పండించే ప్రాంతాలకే పరిమితమైంది. హరిత విప్లవం రెండవ దశలో (1970 మధ్య దశకం నుండి 1980 మధ్య దశకం వరకు) అధిక దిగుబడినిచ్చే వంగడాల వినియోగాన్ని చాలా రాష్ట్రాలకు విస్తరించడంతో పాటు అనేక పంటలకు వర్తింపచేశారు. హరిత విప్లవం సాంకేతిక ప్రభావం విస్తరించడం వల్ల ఆహార ధాన్యాల ఉత్పాదకతలో మెరుగైన ఫలితాలతో పాటు స్వయం సమృద్ధిని, మార్కెట్ మిగులును భారతదేశం సాధించింది.

**2. వ్యవసాయ ఉత్పాదకత:** వ్యవసాయ ఉత్పత్తులను రెండు రకాలుగా విభజించవచ్చు. అవి: ఆహార పంటలు, ఆహారేతర పంటలు. ఆహార పంటలలో వరి, గోధుమ, చిరు ధాన్యాలు, పప్పు ధాన్యాలు ఉంటాయి. ఆహారేతర పంటల్లో నూనె గింజలు, చెరకు, పత్తి, సోయాబీన్స్ ముఖ్యమైనవి. వ్యవసాయ ఉత్పాదకత అనేది భూకమతాల పరిమాణం, ఉపయోగించే సాంకేతిక పరిజ్ఞానంతో పాటు నేల సారం, వరదల నియంత్రణ, నీటి పారుదల సౌకర్యాల కల్పన, శీతల గిడ్డంగులు లాంటి మౌలిక వసతులపై ఆధారపడి వుంటుంది. భారతదేశంలో ఎక్కువ మంది రైతులు చిన్న కమతాలు గల పంట భూమిలో వ్యవసాయం చేస్తున్నారు. అందువల్ల ఎక్కువ ఉత్పాదకతను పొందడానికి వీలవుతుంది. మన దేశంలో ఆహార, ఆహారేతర పంటల విస్తీర్ణం క్రమంగా పెరుగుతూ, పంట ఉత్పాదకతలో కూడా చెప్పుకోదగ్గ పెరుగుదల నమోదవుతున్నది.

**3. వ్యవసాయ ఉత్పాదకతను పెంచడానికి అవసరమైన చర్యలు:**

a) మధ్యవర్తుల తొలగింపు, కౌలు సంస్కరణలతో కూడిన భూసంస్కరణల అమలు.

b) నాణ్యమైన విత్తనాల, ఎరువుల పంపిణీ.

c) సంస్థాగత పరపతిని అందించడం.

d) సరియైన మార్కెటింగ్, గిడ్డంగి సౌకర్యాలను కల్పించడం.

e) అవస్థాపనా (infrastructure) సదుపాయాలను, నీటి పారుదల సౌకర్యాలను విస్తరించడం.

f) కనీస మద్దతు ధరలను పెంచడం.

g) వ్యవసాయ ఉత్పాదకాల కోసం సబ్సిడీలను ఇవ్వడం, పంటల బీమా సౌకర్యాన్ని కల్పించడం.

h) అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అందుబాటులో ఉన్న వనరులను సుస్థిరమైన పద్ధతిలో, గరిష్ట స్థాయిలో వాడుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించడం.

### 7.5.3 వ్యవసాయ పరపతి

రైతులకు లభించే వ్యవసాయ పరపతి ఆధారాలు/ వనరులు రెండు రకాలు: ఎ) సంస్థాగతం కాని పరపతి, బి) సంస్థాగతమైన పరపతి.

**ఎ) సంస్థాగతం కాని పరపతి ఆధారాలు :** సంస్థాగతం కాని ఆధారాలలో వడ్డీ వ్యాపారులు, భూస్వాములు, వ్యాపారస్తులు, స్నేహితులు, బంధువులు వంటివారు ఉంటారు. ఈ ఆధారాలు ఏ సమయంలోనైనా రైతులకు

అందుబాటులో ఉంటాయి. కానీ ఈ రకమైన పరపతి వ్యవస్థలో అధిక వడ్డీ రేట్లు, భూస్వాముల దోపిడీ వంటి అనేక లోపాలు ఉన్నాయి.

**బి) సంస్థాగతమైన పరపతి ఆధారాలు :** సంస్థాగత పరపతి ఆధారాలలో సహకార సంఘాలు, షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు మొదలగునవి ముఖ్యమైనవి. వ్యవసాయ సాగు ప్రక్రియలో అవసరమైన ఉత్పాదితాలను (inputs) కొనుగోలు చేయడానికి రైతులకు చౌక రుణాలను, సరిపోయినంత రుణాలను ఈ సంస్థలు కల్పిస్తాయి. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, ట్రాక్టర్లు, బోరెవెల్స్ మొదలగునవి ఈ ఉత్పాదితాలు. రైతులకు రుణాలు సరఫరా చేసే సంస్థాగత పరపతి ఆధారాల సమాచారం లేకపోవడం, రుణాలు మంజూరు చేయడంలో సంక్లిష్టమైన విధానం మరియు రుణం మంజూరు చేసిన తరువాత రుణాల పంపిణీ ఆలస్యం కారణంగా సంస్థాగత పరపతి రైతులకు సరిగా అందడం లేదు.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. భారత ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ ప్రాముఖ్యతను 4, 5 పంక్తులలో రాయండి.
2. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి వ్యవసాయ ఉత్పత్తి వృద్ధిలో వచ్చిన మూడు విభిన్న దశలను గుర్తించండి.

## 7.6 పారిశ్రామిక రంగం

వ్యవసాయ, సేవా రంగాలకు అవసరమయ్యే పరికరాలను పారిశ్రామిక రంగం అందిస్తుంది. ఉపయోగించే ముడి సరుకుల ఆధారంగా పరిశ్రమలను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి: వ్యవసాయధార పరిశ్రమలు, ఖనిజాధార పరిశ్రమలు. మన దేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయాధార పరిశ్రమలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. వ్యవసాయాధార పరిశ్రమల్లో వస్త్ర పరిశ్రమ, చక్కెర, పొగాకు, నూనె దినుసులు, రబ్బరు, సుగంధ ద్రవ్యాలు, పాడి, తోలు పరిశ్రమలు ముఖ్యమైనవి. ఇనుము–ఉక్కు, సిమెంట్, ఎరువులు, చమురు, భారీ పరిశ్రమల వంటివి ఖనిజాధార పరిశ్రమలు.

పరిశ్రమలలో ఉత్పత్తి (manufacturing) ముఖ్యమైన కార్యకలాపం. ఉత్పత్తి కార్యకలాపాలు రెండు విధాలుగా జరుగుతాయి. అవి: ఫ్యాక్టరీలు నిర్వహించే ఉత్పత్తి కార్యక్రమాలు, రెండోది గృహ సంస్థలు నిర్వహించే కార్యక్రమాలు. ఇవి పెద్ద సంఖ్యలో ఉపాధిని కల్పించడమే కాకుండా తక్కువ మూలధనంతో పని చేస్తాయి. గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో పారిశ్రామికీకరణకు తోడ్పాటును అందిస్తున్నాయి. ప్రాంతీయ అసమానతలు తగ్గిస్తూ జాతీయాదాయం, సంపద సంతులిత పంపిణీకి ఉపకరిస్తున్నాయి. ఒక దేశ సామాజిక ఆర్థిక అభివృద్ధి అధిక భాగం పరిశ్రమలపైనే ఆధారపడతాయి.

### 7.6.1 పారిశ్రామిక నిర్మాణం లేదా పరిశ్రమల రకాలు

యాజమాన్యం ఆధారంగా పరిశ్రమలను ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేట్ రంగ సంస్థలుగా విభజిస్తారు. మూలధన పరిమాణం ఆధారంగా పరిశ్రమలను కింది విధంగా విభజించారు:

a) భారీ పరిశ్రమలు: పెట్టుబడి వ్యయం రూ. 10 కోట్లకు మించి, రూ. 100 కోట్ల లోపు పరిశ్రమలు.

b) మెగా పరిశ్రమలు: రూ.100 కోట్లకు మించిన పెట్టుబడి వ్యయం కలిగిన పరిశ్రమలు.

c) కుటీర పరిశ్రమలు: ఇవి అసంఘటిత రంగంలోని చిన్న తరహా పరిశ్రమలకు సంబంధించినవి. ఇందులో ఉత్పత్తులు, సేవలు ఫ్యాక్టరీ ఆధారితంగా కాకుండా గృహ ఆధారితంగా సృష్టిస్తారు.

d) అనుబంధ పరిశ్రమలు: ఈ పరిశ్రమలు తయారు చేసిన పరికరాలను, విడి భాగాలను భారీ పరిశ్రమల్లో ఉపయోగిస్తారు. వీటి పెట్టుబడి వ్యయం రూ.1 కోటికి మించదు.

e) అతి చిన్నపరిశ్రమలు: యంత్రాలు, ఇతర పరికరాల పెట్టుబడి రూ.25 లక్షలకు మించని పరిశ్రమలు.

f) గృహ పరిశ్రమలు: చేతి వృత్తుల వారు, నైపుణ్యం గల హస్త కళాకారులు, సాంకేతిక నిపుణులు వీటిని నిర్వహిస్తారు. ఈ పరిశ్రమల కోసం 3,000 చ. అడుగుల కంటే తక్కువ స్థలం, 1 kw కంటే తక్కువ విద్యుత్, గరిష్టంగా ఐదుగురు కూలీల శ్రమ అవసరం అవుతాయి. ఈ పరిశ్రమల వల్ల ఎలాంటి కాలుష్యం ఉండదు.

**భారత ప్రభుత్వం జూన్ 2020 లో పెట్టుబడి మరియు టర్నోవర్ ఆధారంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ (MSME) నిర్వచనాలను సవరించింది.**

i) సూక్ష్మ పరిశ్రమలు: ప్లాంట్లు, యంత్రాలలో పెట్టుబడులు రూ.1 కోటికి మించకుండా, టర్నోవర్ రూ.5 కోట్లకు మించని పెట్టుబడి ఉన్న పరిశ్రమలను సూక్ష్మ పరిశ్రమలని అంటారు.

ii) చిన్న పరిశ్రమలు: ప్లాంట్లు, యంత్రాలలో పెట్టుబడులు రూ.10 కోట్లకు మించకుండా, టర్నోవర్ రూ.50 కోట్లకు మించని పెట్టుబడి ఉన్న పరిశ్రమలను చిన్న పరిశ్రమలుగా పిలుస్తారు.

iii) మధ్య తరహా పరిశ్రమలు: ప్లాంట్లు, యంత్రాలలో పెట్టుబడులు రూ.50 కోట్లకు మించకుండా, టర్నోవర్ రూ.250 కోట్లకు మించకుండా పెట్టుబడి ఉండే పరిశ్రమలను మధ్య తరహా పరిశ్రమలుగా పిలుస్తారు.

### 7.6.2 భారతదేశంలో పరిశ్రమల అభివృద్ధి

స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో పరిశ్రమల వృద్ధి ఒకే రకంగా లేదు. 1950, 1960 దశకాల్లో పారిశ్రామిక రంగం వేగంగా వృద్ధి చెందింది. మొదట మౌలిక, మూలధన పరిశ్రమలకు ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చారు. తరువాత మాధ్యమిక, వినియోగ వస్తు పరిశ్రమలపై దృష్టి కేంద్రీకరించారు. డిమాండ్, సరఫరాల అడ్డంకుల కారణంగా 1965 తరువాత పారిశ్రామిక వృద్ధి క్షీణించింది. 1970 దశకం చివరి నుండి పారిశ్రామిక పునరుజ్జీవనం జరిగింది. తదనంతరం, 1980 లో వృద్ధి వేగవంతమైంది. 1980ల్లో నూతన పారిశ్రామిక విధానం ద్వారా నూతన టెక్నాలజీని ఉపయోగించారు. విదేశీ, ప్రైవేట్ పెట్టుబడులను ఆహ్వానించారు. లైసెన్సింగ్ విధానం, విదేశీ దిగుమతుల్లో సరళీకరణ విధానాలను అవలంభించారు. దేశీయ, విదేశీ డిమాండ్లకు అనుగుణంగా 1990లో నూతన ఆర్థిక విధానం రూపొందించారు.

### 7.6.3 పారిశ్రామిక విధానాలు

భారతదేశ పారిశ్రామిక విధానాల ప్రధాన లక్ష్యాలు:

**1. ప్రధాన లక్ష్యాలు:**

i) పారిశ్రామిక ఉత్పాదకతలో నిరంతర వృద్ధిని కొనసాగించడం.

ii) భారీ స్థాయిలో ఉపాధి అవకాశాలను కల్పించడం.

iii) మానవ, సహజ వనరులను సద్వినియోగం చేసుకోవడం.

iv) అంతర్జాతీయ పోటీతత్వాన్ని సాధించడం.

v) ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారతదేశం కీలక పాత్ర పోషించేటట్లు పరివర్తన చెందించడం మొదలైనవి.

**2. పారిశ్రామిక విధాన తీర్మానాలు:**

1948 పారిశ్రామిక విధాన తీర్మానం మౌలిక, మూలధన పరిశ్రమలపై దృష్టి సారించింది. ప్రభుత్వ, ప్రయివేట్ రంగాల్లో రోడ్లు, రైల్వేల వంటి అవస్థాపనా సౌకర్యాలను అభివృద్ధి చేయడానికి నిర్ణయించింది. పెద్ద ఎత్తున ఉపాధికి అవకాశం ఇస్తూ, స్థానిక వనరులను వినియోగించుకునే విధంగా చిన్న, కుటీర పరిశ్రమలను ప్రోత్సహించడంపై ఈ పాలసీ దృష్టి సారించింది. 1956 పారిశ్రామిక విధాన తీర్మానం ప్రభుత్వ రంగాన్ని విస్తరించాల్సిన ఆవశ్యకతను, ఉపాధి అవకాశాలను పెంచడంతో పాటు కుటీర, చిన్న తరహా పరిశ్రమల విస్తరణను చేపట్టాలని, ఆర్థిక శక్తిని వికేంద్రీకరించాలని నొక్కి చెప్పింది. 1991 నూతన పారిశ్రామిక విధానం ప్రభుత్వ రంగంలో పెట్టుబడులను ఉపసంహరించడం ద్వారా ప్రైవేటీకరణను పెంచింది.

### 7.6.4 పారిశ్రామిక వెనుకబాటుతనం : కారణాలు, సూచనలు

**1. భారతదేశంలో పారిశ్రామిక వెనుకబాటుకు ప్రధాన కారణాలు:** మూలధన లేమి, వ్యవస్థాపకుల కొరత, శ్రామికుల నైపుణ్య లేమి, నిర్వహణ లోపాలు, ముడి పదార్థాల కొరత, విద్యుత్ కొరత, విదేశీ మారకం లేకపోవడం, సాంకేతిక నిపుణుల కొరత, రాజకీయ సంక్షోభం, రవాణా, మార్కెటింగ్ సదుపాయాలు సరిగా లేకపోవడం, ప్రభుత్వ విధానాలు మారుతూ ఉండటం, లైసెన్సింగ్ విధానాలలో లోపాలు, పరిశోధన–అభివృద్ధి (Research & Development - R & D) పై దృష్టి పెట్టకపోవడం వంటి కారణాలు భారత పారిశ్రామిక అభివృద్ధి వెనుకబాటుతనానికి నిదర్శనాలు.

**2. పారిశ్రామిక అభివృద్ధికి సూచనలు:** పారిశ్రామిక వివాదాల పరిష్కారం, రోడ్లు, రైల్వేలు, నీటి మార్గాలు, విద్యుత్ వనరులు, పరిశోధన, సమాచార సాంకేతిక రంగం, నూతన సాంకేతిక పరిజ్ఞానం వంటి మౌలిక సౌకర్యాలను వృద్ధి చేయడం, ప్రభుత్వ జోక్యంను నివారించడం, మూలధన నిర్మాణాన్ని ప్రోత్సహించడం, విదేశీ మారకాన్ని పెంచడం, ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించడం, హేతుబద్ధమైన పన్ను విధానాన్ని అవలంభించడం, చిన్న పరిశ్రమలకు ఆర్థిక సహకారం పెంచడం, నైపుణ్యాభివృద్ధికి సహకరించడం, అంతర్జాతీయ పోటీకి తగ్గట్టు దేశీయ పారిశ్రామిక రంగాన్ని వృద్ధి చేయడం వంటి చర్యలను చేపట్టి పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పాటును అందించాలి.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. వ్యవసాయాధార పరిశ్రమలకు, ఖనిజాధార పరిశ్రమలకు ఉదాహరణలు ఇవ్వండి.
2. భారతదేశ పారిశ్రామిక విధానాల లక్ష్యాలను తెలపండి.

## 7.7 సేవల రంగం, అవస్థాపనా (Infrastructure మౌలిక) రంగం

సేవా రంగాన్ని మూడు రకాలుగా విభజించారు. అవి: ఎ) వ్యాపార సేవలు: ఉదా: బ్యాంకింగ్, బీమా, రవాణా, గిడ్డంగి; బి) సామాజిక సేవలు: ఉదా: విద్య, ఆరోగ్యం, పరిపాలన; సి) వ్యక్తిగత సేవలు: ఉదా: పర్యాటకం, రెస్టారెంట్లు, వినోదం మరియు ఇతర సేవలు. జాతీయాదాయ పరంగా వ్యవసాయం, పరిశ్రమల రంగాలను సేవా రంగం అధిగమించింది. ఇది భారత స్థూల దేశీయోత్పత్తిలో 50 శాతానికి పైగా వాటాను పొందింది. ఎకనామిక్ సర్వే రిపోర్ట్–2019 ప్రకారం, భారతదేశానికి మొత్తం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (FDI) ప్రవాహంలో 2/3 వ వంతు భారత ఆర్థిక వ్యవస్థలో సేవా రంగం దోహదం చేస్తుంది. భారతదేశంలో ఉపాధి కల్పించడంలో సేవల రంగం వాటా గత కొన్ని దశాబ్దాలుగా పెరుగుతోంది, అలాగే ప్రాథమిక రంగం వాటా తగ్గుతోంది. ఆరోగ్యం, విద్య, IT, IT ఆధారిత సేవలు (ITes) మన దేశంలో మానవ అభివృద్ధికి దోహదం చేస్తున్నాయి. మౌలిక సదుపాయాల విస్తరణలో, నిర్వహణలో సేవా రంగం ఎంతో పురోగతి చెందింది. ప్రధానంగా IT, IT ఆధారిత సేవలు జిడిపి వాటా మరియు ఎగుమతుల పరంగా దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందడానికి సహాయపడుతున్నాయి. సేవా రంగం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారతదేశాన్ని ప్రధాన భాగస్వామిగా మార్చింది.

భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి మౌలిక సదుపాయాలు (infrastructure facilities) ఒక ఛోదక శక్తి. దేశం యొక్క మొత్తం అభివృద్ధి మౌలిక సదుపాయాలపై ఆధారపడి ఉంటుంది. ఎందుకంటే ఇవి ఆర్థిక వ్యవస్థ యొక్క మూడు రంగాల వృద్ధికి దోహదం చేస్తాయి. రవాణా, విద్యుత్, నీరు, కమ్యూనికేషన్ మొదలైన వాటిని 'ఆర్థిక (economic) మౌలిక సదుపాయాలు' అంటారు. ఇవి ఆర్థిక వ్యవస్థలో ఉత్పత్తికి, పంపిణీకి ప్రత్యక్షంగా దోహదం చేస్తాయి. విద్య, ఆరోగ్యాన్ని 'సామాజిక (social) మౌలిక (అవస్థాపనా) సదుపాయాలు'గా భావిస్తారు. ముడి పదార్థాలు మరియు తుది వస్తువులను మార్కెట్లకు సరఫరా చేయడానికి మౌలిక సదుపాయాలు సహాయపడతాయి. ఇవి నాణ్యమైన మానవ వనరులను దేశానికి అందిస్తూ పరోక్షంగా ఆర్థిక ప్రగతికి దోహదం చేస్తాయి. అవస్థాపనా (మౌలిక) సదుపాయాల ప్రాజెక్టులు ఉపాధి అవకాశాలను సృష్టించడమే కాక జీవన సౌలభ్యాన్ని మెరుగుపరుస్తాయి.

### 7.7.1 రవాణా రంగం

బాగా అనుసంధానించబడిన రవాణా సౌకర్యాలు మార్కెటింగ్ వ్యవస్థను ప్రోత్సహిస్తాయి. అలాగే అంతర్గత, అంతర్జాతీయ వాణిజ్యాన్ని ప్రోత్సహిస్తాయి. ఇది విదేశీ మారక ద్రవ్యం యొక్క ముఖ్యమైన వనరు. రవాణా సేవలు మన దేశ స్థూల దేశీయోత్పత్తికి ఎంతగానో దోహదం చేస్తున్నాయి. అదే విధంగా ఉపాధి అవకాశాల కల్పనలో ప్రధాన పాత్రను పోషిస్తున్నాయి. విపత్తులు మరియు అత్యవసర సమయాల్లో కూడా రవాణా కీలక పాత్ర పోషిస్తుంది. రవాణా వ్యవస్థను రోడ్డు మార్గాలు, రైల్వే మార్గాలు, నీటి మార్గాలు, వాయు మార్గాలుగా విభజించారు. భారతదేశంలో రోడ్డు రవాణా వ్యవస్థ 80% ప్రయాణీకుల మరియు 60% వస్తువుల రవాణాలో పాలుపంచుకుంటుంది. భారత రైల్వే ప్రపంచంలో అతి పెద్ద రైలు నెట్‌వర్క్‌లలో ఒకటి. రైలు, రోడ్డు రవాణా వ్యవస్థల తరువాత జల రవాణా మరియు పౌర విమానయానం తదుపరి స్థానాలను ఆక్రమించాయి. అత్యంత చౌకైన మరియు తక్కువ కాలుష్యం కలిగించే రవాణా విధానమే జల రవాణా. పౌర విమానయానంలో ప్రపంచంలో భారతదేశం మూడవ అతి పెద్ద దేశీయ మార్కెట్.

### 7.7.2 ఆతిథ్యం, పర్యాటక రంగం

మన దేశ సామాజిక ఆర్థిక అభివృద్ధిలో పర్యాటక రంగం కీలక పాత్రను పోషిస్తోంది. ఇది సమాజంలోని వివిధ వర్గాలకు ఉపాధి అవకాశాలను కల్పించడంలో తగినంత పాత్ర వహిస్తుంది. దేశానికి విదేశీ మారక ద్రవ్యం అందించడంలో పర్యాటక రంగం మంచి వృద్ధిని కనబరిచింది. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడానికి పర్యాటక వృద్ధికి అవసరమైన మంచి నాణ్యమైన, సరసమైన సౌకర్యాలను భారత ప్రభుత్వం నిర్వహిస్తోంది. 2019 క్యాలెండర్ సంవత్సరంలో ట్రావెల్ అండ్ టూరిజం స్థూల దేశీయోత్పత్తిలో దాదాపు 7% వాటాను కలిగి ఉంది.

### 7.7.3 విద్య, ఆరోగ్యం

**1. విద్య:** జ్ఞానాన్ని, నైపుణ్యాన్ని విద్య అందిస్తుంది. అలాగే ఉపాధి అవకాశాలను సృష్టిస్తుంది. ఆదాయ స్థాయిలను పెంచడంలో సహాయ పడుతుంది మరియు జీవన ప్రమాణాలను మెరుగు పరుస్తుంది. విద్య ఉత్పత్తి ప్రక్రియలో ఆధునిక పద్ధతులను అవలంభించడంలో సహాయ పడుతుంది, తద్వారా ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహిస్తుంది. భారతదేశంలో అన్ని స్థాయిలలో విద్యా సౌకర్యాలు పెంచబడ్డాయి. ఈ రంగంలో సంస్కరణలు, విధానాలు అక్షరాస్యత రేటును పెంచడంలో దోహదపడ్డాయి. విద్యపై వ్యయంలో నిరంతర పెరుగుదల ఫలితంగా విద్యా సంస్థల సంఖ్య అన్ని స్థాయిలలో పెరిగింది. ప్రాథమిక, ద్వితీయ, ఉన్నత స్థాయిలలో నమోదు కూడా పెరిగింది. ఇంజనీరింగ్, మెడిసిన్, మేనేజ్‌మెంట్, వ్యవసాయం, విజ్ఞాన రంగాలలో గొప్ప పురోగతి సాధించబడింది. ఫలితంగా చైనా తరువాత ప్రపంచంలో మన దేశం రెండవ అతి పెద్ద విద్యావంతులైన మరియు నైపుణ్యం కలిగిన మానవ శక్తిని ఉత్పత్తి చేస్తుంది.

**2. ఆరోగ్యం:** ఆసుపత్రులు, వైద్య పరికరాలు, క్లినికల్ ట్రయల్స్, ఔట్‌సోర్సింగ్, టెలి మెడిసిన్, మెడికల్ టూరిజం, ఆరోగ్య బీమా మరియు వైద్య పరికరాలు ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఉంటాయి. భారతదేశంలో ఆరోగ్య రంగాన్ని ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు బలపరుస్తున్నాయి. మెరుగైన ఆరోగ్యం దేశానికి మంచి నాణ్యమైన మానవ వనరులను అందిస్తుంది. మంచి ఆరోగ్యానికి సమతుల్య ఆహారం మరియు వైద్య సంరక్షణ అవసరం. ఆరోగ్య ప్రమాణాలను పెంచడానికి, అంటు వ్యాధుల నియంత్రణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి, పిల్లలు, గర్భిణీ స్త్రీలు మరియు నర్సింగ్ మహిళలకు కుటుంబ సంక్షేమం మరియు పోషకాహార కార్యక్రమాల అమలు, పారిశుధ్యం, శుభ్రమైన తాగు నీటి సరఫరా వంటి కార్యక్రమాలపై భారత ప్రభుత్వం దృష్టి సారించింది. ఫలితంగా ఆయుర్దాయం, శిశు మరణాల రేటు, ప్రసూతి మరణాల రేటు, మొత్తం సంతానోత్పత్తి రేటు వంటి ఆరోగ్య సూచికలలో మెరుగుదల ఉంది. అయితే ఇతర ఆసియా దేశాలతో పోల్చినప్పుడు భారత దేశం ఆయుర్దాయంలో సంతృప్తికరమైన స్థాయిని సాధించలేకపోయింది.

### 7.7.4 బ్యాంకింగ్, ఇన్సూరెన్స్

బ్యాంకింగ్ మరియు బీమా సంస్థలు జాతీయాదాయ వృద్ధికి దోహదపడే ఉత్పాదక ప్రయోజనాల కోసం నిధులను సమీకరిస్తాయి.

**1. బ్యాంకింగ్:** రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా దేశంలో కేంద్ర బ్యాంకు. ఇది దేశంలో పర్యవేక్షణ అధికారం గల సంస్థ. ఇది దేశంలో ద్రవ్య ప్రవాహాన్ని, రుణ ప్రవాహాన్ని నియంత్రిస్తుంది. రుణమిచ్చే రేట్లు

మార్చుకోవడానికి అనుకూలంగా చేయడం, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రభుత్వ పెట్టుబడులను క్రమంగా తగ్గించడం, ప్రైవేటు రంగంపై, అంతర్జాతీయ బ్యాంకులపై ఆంక్షలను సడలించడం వంటివి ఇటీవల అమలు చేసిన ఆర్థిక నియంత్రణ సంస్కరణలు. ఈ ఆర్థిక సంస్కరణల ద్వారా బ్యాంకింగ్ రంగాన్ని బలోపేతం చేశారు. బ్యాంకింగ్ వ్యవస్థలో సహకార రుణ సంస్థలతో పాటు ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రైవేట్ రంగ బ్యాంకులు, విదేశీ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, సహకార బ్యాంకులు, సహకార పరపతి సంస్థలు ఉన్నాయి.

**2. బీమా:** భారతదేశంలో బీమా రంగాన్ని రెండు రకాలుగా విభజించారు: (i) జీవిత బీమా, (ii) సాధారణ బీమా [జీవితేతర బీమా (non-life insurance)]. బీమా సంస్థలు తమ వినియోగదారులకు అనేక రకాల ఆర్థిక నష్ట భయాల నుండి (వరదలు, ప్రమాదాలు, దొంగతనం మొదలగునవి) భద్రత కల్పించడానికి వివిధ ప్రణాళికలు లేదా పథకాలను అందిస్తున్నాయి. అంతేకాకుండా బీమా సంస్థలు వివిధ వర్గాల వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా వనరులను సరఫరా చేస్తాయి (ఆకర్షణీయమైన బోనస్ ఇవ్వడం, వ్యాపార, పొదుపు రాబడులను పెంచడం మొదలగునవి). ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (Insurance Regulatory and Development Authority of India - IRDAI) భారతదేశంలోని బీమా కంపెనీల కోసం మార్గదర్శకాలను రూపొందిస్తుంది. అధిక జనాభా దృష్ట్యా భారతదేశం చాలా తక్కువ జీవిత బీమా కవరేజీని కలిగి ఉంది. భారత బీమా మార్కెట్లో చాలా తక్కువ పురోగతి సాధించింది. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (LIC) ఆఫ్ ఇండియా 1956 లో స్థాపించబడింది. ఇది పాలసీదారులకు ఆర్థిక భద్రతను కల్పించడానికి గాను స్థాపించబడిన ప్రభుత్వ రంగ సంస్థ. LIC బీమా పథకాలలో పెన్షన్ ప్లాన్లు, ఆరోగ్య బీమా, గ్రూప్ ఇన్సూరెన్స్ మొదలైనవి ఉన్నాయి. ప్రైవేట్ బీమా కంపెనీలు 2000 సంవత్సరంలో మార్కెట్లోకి ప్రవేశించాయి.

### 7.7.5 ఇంధన రంగం

దేశం యొక్క నిరంతర సుస్థిర (sustainable) ఆర్థిక వృద్ధిని నిర్ణయించడంలో ఇంధన శక్తి ప్రధాన అంశం. ఎకనామిక్ సర్వే 2019-20 ప్రకారం, భారతదేశం ప్రపంచంలో మూడవ అతి పెద్ద ఇంధన వినియోగదారు. వ్యవసాయం, పరిశ్రమ, రవాణా మరియు గృహ రంగాలలో ఇంధన శక్తి అవసరమైన ఉత్పాదకం. ఇంధన వనరులు రెండు రకాలు. అవి: పునరుత్పాదక (పునఃస్థాపిత), అంతరించి పోయే ఇంధన వనరులు. బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు (శిలాజ ఇంధనాలు), అణు ఇంధనాలను అంతరించిపోయే ఇంధన వనరులుగా చెప్పవచ్చు. సౌర శక్తి, పవన శక్తి, జల శక్తి, సముద్రపు అలల (tidal) శక్తి, భూగర్భ (geothermal), జీవ సంబంధిత (biomass) శక్తి మొదలగు వాటిని పునరుత్పాదక ఇంధన (renewable energy) వనరులుగా చెప్తారు. వీటిని పునరుద్ధరించవచ్చు లేదా మళ్లీ మళ్లీ ఉపయోగించుకోవచ్చు. కొన్నిసార్లు పునరుత్పాదక వనరులను సాంప్రదాయేతర ఇంధన వనరులు అని కూడా పిలుస్తారు. సాంప్రదాయక ఇంధన వనరులలో బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు మొదలైనవి ఉన్నాయి.

### 7.7.6 కమ్యూనికేషన్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (సమాచార సాంకేతిక విజ్ఞానం)

**1. టెలికమ్యూనికేషన్ సేవలు:** వాటిలో టెలిఫోన్ సర్వీస్, టెలెక్స్ సర్వీస్, ఫాక్స్ సర్వీస్, ఇంటర్నెట్ మరియు బ్రాడ్‌బ్యాండ్ సర్వీస్, పోస్టల్ సర్వీసెస్, రేడియో మరియు టెలివిజన్ నెట్‌వర్క్ ఉన్నాయి. 2019 లో 1.16 బిలియన్ల చందాదారులతో డౌన్‌లోడెడ్ apps పరంగా భారతదేశం అమెరికాను అధిగమించి రెండవ అతి

పెద్ద మార్కెట్‌గా నిలిచింది. మొత్తం ఇంటర్నెట్ వినియోగదారుల పరంగా భారతదేశం ప్రపంచంలో రెండవ అతి పెద్ద మార్కెట్. భారతదేశం ప్రపంచంలో చైనా తరువాత రెండవ అతి పెద్ద టెలికమ్యూనికేషన్ మార్కెట్ (డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్-DPIIT ప్రకారం). భారత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన డిజిటల్ ఇండియా ప్రోగ్రాం కింద ఆరోగ్య సంరక్షణ వంటి అన్ని రంగాలు ఇంటర్నెట్ ద్వారా అనుసంధానించబడతాయి.

**2. సమాచార సాంకేతిక పరిజ్ఞాన (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ-IT) రంగం:** ఇండియన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ (IT-BPM) పరిశ్రమ గత రెండు దశాబ్దాలుగా భారతదేశపు అతి పెద్ద ఆర్థిక ఎగుమతిదారుగా ఉంది (భారతదేశపు ఎకనామిక్ సర్వే 2019 ప్రకారం). ఉపాధి పెరుగుదల, విలువ పెరుగుదల పరంగా భారత ఆర్థిక వ్యవస్థలో ఈ రంగం కీలక పాత్ర పోషిస్తోంది. ఐటి పరిశ్రమలో సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, అనువర్తనాలు (applications) మరెన్నో ఉన్నాయి. సమాచారం సృష్టించడం, నిల్వ చేయడం, ప్రాసెసింగ్ చేయడం వంటి సేవలను IT-BPM అందిస్తుంది. నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీల (NASSCOM) ప్రకారం ఐటి రంగాన్ని (i) ఐటి సేవలు, (ii) సాఫ్ట్‌వేర్, ఇంజనీరింగ్ సేవలు, (iii) బిపిఎం, (iv) హార్డ్‌వేర్‌లుగా విభజించవచ్చు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (DPIIT) ప్రకారం ఈ రంగం FDI ప్రవాహంలో దేశంలో 2వ స్థానంలో ఉంది. ఐటి పరిశ్రమ ఎగుమతుల్లో సాఫ్ట్‌వేర్ సేవలు (ఐటి సేవలు) మరియు ఐటి అనుబంధ సేవలు ఉన్నాయి.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. రవాణా వ్యవస్థ రకాలు ఏవి?
2. పునరుత్పాదక మరియు అంతరించిపోయే వనరులకు ఉదాహరణలు ఇవ్వండి.

## 7.8 ముగింపు (ముఖ్యాంశాలు)

- భారత ఆర్థిక వ్యవస్థ వ్యవసాయం, పరిశ్రమ, సేవలు అనే మూడు ప్రధాన రంగాలుగా విభజించబడింది.
- భారతదేశంలో ఇప్పటికే మెజారిటీ ప్రజలు వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు.
- స్థూల దేశీయోత్పత్తిలో వ్యవసాయ రంగ వాటా క్రమంగా తగ్గిపోతూ ఉండగా సేవా రంగం వాటా పెరుగుతూ ఉన్నది.
- కమత పరిమాణం, సాంకేతిక పరిజ్ఞానం స్థాయిపై వ్యవసాయ ఉత్పాదకత ఆధారపడి ఉంటుంది.
- హరిత విప్లవం వ్యవసాయంలో అధిక వృద్ధి రేటుకు దోహదపడింది.
- భారతీయ పరిశ్రమ ప్రభుత్వ, ప్రైవేటు రంగాలను కలిగి ఉంది.
- మౌలిక మరియు మూలధన వస్తువుల ఉత్పత్తిలో స్వయం సమృద్ధితోపాటు పరిశ్రమలో వైవిధ్యభరితమైన వృద్ధి ఉంది.
- సేవా రంగంలో రవాణా, కమ్యూనికేషన్స్, ఐటి, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, రియల్ ఎస్టేట్, అడ్మినిస్ట్రేషన్ మరియు ఇతర సేవలు ఉన్నాయి.
- సామాజిక అవస్థాపనా సౌకర్యాలలో విద్య, ఆరోగ్యం ఇమిడి ఉంటాయి.
- ఆధునిక కాలంలో, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సేవా రంగం సహాయంతో వస్తువుల, సేవల మార్పిడి సులభతరం అవుతుంది.

## 7.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 1-2 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. హరిత విప్లవం అంటే ఏమిటి?
2. దేశ అభివృద్ధికి మౌలిక సదుపాయాలు ఏ విధంగా దోహదం చేస్తాయి?

**II. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 4-5 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. పారిశ్రామిక అభివృద్ధికి వ్యవసాయం ఎలా దోహదపడుతుంది?
2. పారిశ్రామిక అభివృద్ధికి చర్యలు సూచించండి.

**III. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 8-10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. ఆర్థిక వ్యవస్థ ప్రధాన రంగాలను విశదీకరించండి.
2. భారతదేశంలో తృతీయ రంగం ఎందుకు వేగంగా పెరుగుతూ ఉన్నది?

**IV. కింది వాటిలో సరైన జవాబును ఎంపిక చేయండి.**

1. భారతదేశంలో జి.డి.పి. పరంగా అతి పెద్ద వాటా అందించే రంగం ( )
   ఎ) తృతీయ రంగం బి) ద్వితీయ రంగం సి) ప్రాథమిక రంగం డి) తయారీ రంగం
2. భారతీయ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పోరేషన్ (LIC of India) సంస్థ ............ యాజమాన్యంలో ఉంది
   ఎ) ప్రైవేట్ రంగం బి) ప్రభుత్వ రంగం ( )
   సి) పబ్లిక్ కమ్ ప్రైవేట్ రంగం డి) కార్పొరేట్ సంస్థ
3. కింది కార్యకలాపాలు ప్రాథమిక రంగానికి చెందినవి కావు ( )
   ఎ) ఫిషింగ్ బి) ఫారెస్ట్రీ సి) మైనింగ్ డి) బ్యాంకింగ్
4. పారిశ్రామిక వెనుకబాటుకు ఇది కారణం కాదు ( )
   ఎ) మూలధన కొరత బి) విద్యుత్ కొరత సి) అధిక నైపుణ్యత డి) లైసెన్సింగ్ సమస్యలు

## 7.10 ఉపయుక్త గ్రంథాలు


- తెలుగు అకాడమి: అర్థశాస్త్రం, ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం పాఠ్య గ్రంథం, 2020
- Datt & Sundaram's Indian Economy, S.Chand, New Delhi, latest edition.

# 8 ఆర్థిక సంస్కరణలు – ప్రపంచీకరణ

## 8.0 అభ్యసన ఫలితాలు

- ఆర్థిక సంస్కరణల ఆవశ్యకతను, వాటి ముఖ్యాంశాలను విశదీకరిస్తారు.
- సరళీకరణ, ప్రైవేటీకరణలను వివరిస్తారు.
- ప్రపంచీకరణ ఆవశ్యకతను, ప్రపంచీకరణ వలన కలిగే ప్రయోజనాలను విశ్లేషించగలరు.
- ప్రపంచ వాణిజ్య సంస్థ గురించి వ్యాఖ్యానిస్తారు.

## 8.1 పరిచయం

స్వాతంత్ర్యానంతరం దేశంలో ఉన్నటువంటి ఆర్థిక అసమానతలు, పేదరికం, నిరుద్యోగిత వంటి ముఖ్యమైన సమస్యలను తొలగించడానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు ప్రభుత్వ రంగ సంస్థల ప్రాముఖ్యతను పెంచాయి. భారతదేశం స్వాతంత్రం పొందిన తర్వాత దేశం మిశ్రమ ఆర్థిక వ్యవస్థగా ఉండాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే 1948 పారిశ్రామిక విధాన తీర్మానం మిశ్రమ ఆర్థిక వ్యవస్థకు పునాది వేసింది. దీనికి అదనంగా 1956 పారిశ్రామిక తీర్మానం మిశ్రమ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసింది. ప్రభుత్వ రంగ విస్తరణలో భాగంగా, ప్రభుత్వ రంగ సంస్థలు పెరిగాయి. ప్రైవేటు రంగంపై అధిక నియంత్రణ ఉండేది. లైసెన్స్‌లు, పర్మిట్లు, కోటాలు వంటి విధానాల ద్వారా ప్రైవేటు రంగాన్ని నియంత్రణ చేశారు.

వీటి దృష్ట్యా మనం ఈ యూనిట్‌లో 1991లో ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టవలసిన ఆవశ్యకతను మొదట చర్చించుకొంటాం. ఆర్థిక సంస్కరణలలో ప్రధాన భాగాలైన సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణలను విశ్లేషించుకుంటాం. ప్రపంచ వాణిజ్య సంస్థను సంక్షిప్తంగా తెలుసుకుంటాం.

## 8.2 ఆర్థిక సంస్కరణలు : మూలం, ఆర్థిక సంస్కరణలకు దారి తీసిన పరిస్థితులు, భావన

### 8.2.1 ఆర్థిక సంస్కరణలకు మూలం

ప్రైవేటీకరణ ద్వారా ఆధునిక సాంకేతిక విజ్ఞానాన్ని సంపూర్ణంగా ఉపయోగించడం, ఉత్పాదకతను పెంచడం ముఖ్య లక్ష్యాలుగా 1985లో నూతన ఆర్థిక విధానం ప్రవేశపెట్టబడింది. ప్రైవేటు రంగానికి పెద్ద పీట వేసి ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించడానికి పన్నులు, లైసెన్సింగ్, విదేశీ వ్యాపార విధానాలలో సంస్కరణలు చేపట్టడం; నిబంధనలను, నియంత్రణలను తొలగించి ప్రభుత్వ పాలనా విధానాన్ని సరళీకృతం చేసి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను, బహుళ జాతీయ సంస్థలను ఆకర్షించటం వంటి మార్పులు చేపట్టారు.

### 8.2.2 ఆర్థిక సంస్కరణలకు దారి తీసిన పరిస్థితులు

1990-91 ఆర్థిక సంక్షోభం ఆకస్మికంగా వచ్చింది కాదు. 1980వ దశకంలో ఏర్పడిన పరిస్థితుల వల్ల అసమతుల్యానికి దారి తీసింది. ప్రభుత్వ వ్యయానికి, రాబడికి గల వ్యత్యాసం పెరిగి కోశ లోటు పెరిగింది. 1990-91 నాటికి కోశ లోటు 7.8 శాతానికి చేరుకుంది. విదేశీ వ్యాపార చెల్లింపుల శేషపు కరెంటు ఖాతాలో లోటు పెరిగింది. ప్రభుత్వపు విదేశీ రుణం స్థూల దేశీయ ఉత్పత్తిలో 23 శాతానికి చేరింది. ద్రవ్యోల్బణం 10.3 శాతానికి చేరింది. గల్ఫ్ సంక్షోభం వలన విదేశీ మారక నిల్వలు కేవలం ఒక వారానికి సరిపడే దిగుమతుల స్థాయికి పడిపోయాయి. దీనితో దేశ ఆర్థిక స్థాయి అంతర్జాతీయంగా క్షీణించింది.

### 8.2.3 ఆర్థిక సంస్కరణలు : భావన

దేశాన్ని ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేర్చే ప్రక్రియలను సంస్కరణలు అంటాం. దేశాన్ని ఏ విధంగా అభివృద్ధి చేయాలి అనే దానికి కొత్తగా ఆలోచించి ఆ దేశ ప్రజలకు ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చే విధంగా అవసరానికి తగినట్లుగా కొత్త విధానాలను, కొత్త పథకాలను ఒక విధానపరమైనటువంటి పద్ధతిలో తీసుకునే అన్ని చర్యలను ఆర్థిక సంస్కరణలు అంటారు.

ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడడానికి 1991లో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టింది. వీటిలో భాగంగా సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణలను అమలు పరిచింది.

**మీ ప్రగతిని పరీక్షించుకోండి**

1. ఆర్థిక సంస్కరణలకు మూలం ఏమిటి?
2. ఆర్థిక సంస్కరణలకు దారి తీసిన పరిస్థితులు వివరించండి.

## 8.3 సరళీకరణ

దేశీయ, విదేశీయ వ్యాపారంపై ఉన్న ప్రభుత్వ నియంత్రణలకు సడలింపు ఇవ్వడం, ఆర్థిక వ్యవస్థపై ప్రభుత్వ జోక్యం తగ్గించడం, ప్రైవేట్ పెట్టుబడులపై నియంత్రణలను తొలగించడం మరియు పెట్టుబడులను ప్రోత్సహించడం జరిగింది. పారిశ్రామిక రంగంపై ఉన్న ప్రభుత్వ నియంత్రణలను, విత్త, ద్రవ్య, విదేశీ విధానాలను, ప్రభుత్వ ఆంక్షలను, నియంత్రణలను అవసరమైన మేరకు సడలించడం జరిగింది. ఈ రకమైన ప్రభుత్వ నియంత్రణ సడలింపులను 'సరళీకరణ' అంటారు.

### 8.3.1 పారిశ్రామిక రంగం

ప్రభుత్వ నియంత్రణ వలన భారీ పెట్టుబడులు పెట్టకపోవడం, పరిశ్రమల విస్తరణ జరగక పోవడం వలన ప్రభుత్వం 1991 నూతన పారిశ్రామిక విధాన తీర్మానం తీసుకువచ్చింది. ఇందులో భాగంగా క్రింది అంశాలలో మార్పులు జరిగాయి.

లైసెన్సింగ్ విధానంలో మార్పులు చేయబడ్డాయి. 18 గ్రూపుల పరిశ్రమలు (రక్షణ రంగం, వ్యూహాత్మకమైన సామాజిక ప్రయోజనాలతో కూడిన ప్రమాదకర రసాయనాలు, వాతావరణాన్ని కలుషిత పరిచే పరిశ్రమలు) తప్ప మిగతా వాటి విషయంలో లైసెన్సింగ్ రద్దుపరచబడింది. ఈ మార్పులు పరిశ్రమల స్థాపనకు, ఉత్పత్తి పరిమాణ

విస్తరణకు దోహదపడ్డాయి. 10 లక్షల జనాభా కంటే అధిక జనాభా ఉన్న ప్రాంతాలను మినహాయించి మిగిలిన ప్రాంతాలలో ప్రభుత్వ అనుమతి లేకుండా పరిశ్రమలను స్థాపించుకోవచ్చు.

### 8.3.2 విదేశీ పెట్టుబడులు

ఉత్పత్తి కారకాల (భూమి, భవనాలు, యంత్రాలు, ఇతర పరికరాలు) పై బహుళ జాతి సంస్థలు ఖర్చు పెట్టే మొత్తాన్ని 'విదేశీ పెట్టుబడులు' అంటారు. 1991 కు ముందు ఉన్న ఆర్థిక విధానం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులపై నియంత్రణ ఉండటం వలన భారీ పెట్టుబడులను సమకూర్చడానికి ఆంక్షలు అడ్డుగా ఉండేవి.

నూతన ఆర్థిక విధానం వలన ప్రభుత్వ ఆంక్షలు సడలించారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు భారీ పరిశ్రమలకు అవసరమైన మూలధనం, సాంకేతిక విజ్ఞానం, ఆధునిక ఉత్పత్తి పద్ధతులు, నవీన నిర్వహణ వ్యూహాలు సమకూర్చడంతో పాటు పరిశ్రమలకు రుణ భారాన్ని తగ్గిస్తాయని ఆశించారు. విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించడానికి క్రింది చర్యలు చేపట్టడం జరిగింది.

1. విదేశీ పెట్టుబడులను పెంచడానికి అనుమతించారు. ప్రస్తుతం బ్యాంకులు, బీమా, టెలీకమ్యూనికేషన్స్, విమానయానం తప్ప అనేక పరిశ్రమల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 100% వరకు అనుమతించారు.
2. ఎగుమతి కార్యకలాపాలు నిర్వహించే వాణిజ్య సంస్థలు 51% మూలధనంతో అంతర్జాతీయ మార్కెట్‌లోకి ప్రవేశించవచ్చు.
3. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడికి అర్హత గల పరిశ్రమలకు అనుమతిని వేగవంతం చేశారు.

### 8.3.3 విదేశీ సాంకేతిక పరిజ్ఞానం

సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించడానికి అధిక ప్రాధాన్యత గల రంగాలలో విదేశీ సాంకేతికతను ఆటోమేటిక్‌గా అనుమతిస్తారు.

### 8.3.4 ప్రభుత్వ రంగ విధానం

ప్రభుత్వ రంగానికి నిర్దేశించిన పరిశ్రమల సంఖ్యను తగ్గించారు. ప్రభుత్వ రంగ సంస్థలలో తీవ్ర రుగ్మతకు గురైన పరిశ్రమలను విచారణకు నివేదించడం, మ్యూచువల్ ఫండ్స్ ద్వారా ప్రభుత్వ రంగ సంస్థలు 20 శాతం వరకు మూలధనం సమకూర్చుకోవటం, గుత్తాధిపత్య మరియు నిర్బంధ వాణిజ్య పద్ధతుల చట్టం (MRTP Act) ను సవరించి రూ. 100 కోట్ల గరిష్ఠ పరిమితిని ఎత్తి వేశారు. రూ. 100 కోట్లు దాటినప్పటికీ పెద్ద సంస్థలు MRTP కమిషన్ అనుమతి పొందవలసిన అవసరం లేదు.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. లైసెన్సింగ్ విధానంలో వచ్చిన మార్పులు ఏవి?
2. విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించడానికి చేపట్టిన చర్యలు ఏవి?

## 8.4 ప్రైవేటీకరణ

ప్రభుత్వ సంస్థల యాజమాన్యం, ఆస్తులతో పాటు నిర్వహణను ప్రైవేటుపరం చేసే ప్రక్రియను 'ప్రైవేటీకరణ' అని అంటారు. 1991లో ప్రవేశపెట్టిన నూతన ఆర్థిక సంస్కరణలు ప్రైవేటీకరణకు పెద్ద పీట వేశాయి. ప్రభుత్వ రంగ సంస్థల యాజమాన్యంను, ఆస్తులను ప్రైవేటీకరణ చేయడం వల్ల సంస్థల యాజమాన్య సామర్థ్యం మెరుగుపడింది. ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు సంస్థలుగా మార్చే ప్రక్రియ రెండు రకాలుగా జరుగుతుంది. అవి:

1. ప్రభుత్వ రంగ సంస్థల పెట్టుబడిని, యాజమాన్య బాధ్యత నుండి ప్రభుత్వం ఉపసంహరించుకోవడం.
2. ప్రభుత్వ రంగ సంస్థలను పూర్తిగా అమ్మి వేయడం.

### 8.4.1 పెట్టుబడుల ఉపసంహరణ

1991 నూతన పారిశ్రామిక తీర్మానం ద్వారా ప్రభుత్వ రంగ సంస్థల పెట్టుబడుల ఉపసంహరణను ప్రభుత్వం మొదలుపెట్టింది. ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తులను, యాజమాన్యాన్ని, ఈక్విటీలను మొత్తంగా గాని లేదా పాక్షికంగా గాని అమ్మకం చేయడాన్ని పెట్టుబడుల ఉపసంహరణ అంటారు.

### 8.4.2 ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మివేయడం

1991 సంవత్సరం వరకు ప్రభుత్వ రంగమే ఆర్థిక ప్రాధాన్యత కలిగిన రంగంగా కొనసాగింది. నూతన ఆర్థిక విధానం ద్వారా ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించడం జరిగింది. కొన్ని ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరించబడ్డాయి. మరి కొన్నింటిని ప్రైవేటీకరించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది.

### 8.4.3 ప్రైవేటీకరణ ప్రయోజనాలు

- సత్వర ఆర్థికాభివృద్ధికి ప్రైవేటు రంగం ప్రాధాన్యతను ఇస్తుంది.
- నూతన పరిశ్రమల ఏర్పాటు వలన ఉపాధి కల్పన పెరుగుతుంది.
- ఆధునిక పరిశ్రమల ఏర్పాటు, ముఖ్యంగా వినియోగ వస్తు రంగంలో, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, మోటారు వాహనాల పరిశ్రమలు వేగంగా విస్తరించాయి.
- అవస్థాపనా సౌకర్యాల కల్పనలో – రోడ్ల నిర్మాణం, విద్యుదుత్పత్తి, కమ్యూనికేషన్స్ మొదలగు వాటిలో ప్రైవేటు రంగ పాత్ర పెరిగింది.
- సేవా రంగంలో – బ్యాంకింగ్, బీమా, విద్య, వైద్యం, వినోద సేవలు, కుటుంబ సేవలు, వృత్తిపరమైన సేవలలో – ప్రైవేటు రంగం విస్తరించింది.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. ప్రభుత్వ సంస్థలను ప్రయివేటు సంస్థలుగా మార్చే ప్రక్రియ ఎన్ని రకాలు? అవి ఏవి?
2. ప్రయివేటీకరణ లాభ, నష్టాలు వివరించండి.

## 8.5 ప్రపంచీకరణ

### 8.5.1 ప్రపంచీకరణ భావన

దేశ ఆర్థిక వ్యవస్థను అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానం చేసి వ్యాపారం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, స్వల్పకాల మూలధనం, మానవ వనరులు, సాంకేతిక విజ్ఞానం మొదలగు వాటి ప్రవాహాన్ని సార్వత్రికంగా కొనసాగించడాన్ని ప్రపంచీకరణ అని అంటారు. ప్రపంచ దేశాలు తమ సరిహద్దులు దాటి వస్తు సేవలు, మూలధనం, సాంకేతికత వ్యాప్తి ద్వారా అంతర్జాతీయ వ్యాపార పరిమాణాన్ని పెంపొందించుకునే విధానమే ప్రపంచీకరణ అని చెప్పవచ్చు. దేశాలు వేగంగా అనుసంధానమయ్యే ప్రక్రియయే ప్రపంచీకరణ. 20వ శతాబ్దం చివరలో ప్రపంచ వ్యాప్తంగా జరిగిన ముఖ్యమైన పరిణామాల్లో ప్రపంచీకరణ ఒకటి. దీనికి రాజకీయ, సాంస్కృతిక, ఆర్థిక కోణాలున్నాయి.

### 8.5.2 ప్రపంచీకరణ ఆధారపడే అంశాలు

ప్రపంచీకరణ కింది అంశాల ఆధారంగా జరుగుతుంది:

1. వాణిజ్య అవరోధాలు తగ్గించి వివిధ దేశాల మధ్య సేవల ప్రవాహానికి ఇబ్బందులు తొలగించడం.
2. వివిధ దేశాల మధ్య సాంకేతిక విజ్ఞాన ప్రవాహానికి అనుకూల వాతావరణం కల్పించడం.
3. అదే విధంగా మూలధన ప్రవాహానికి అనుకూల వాతావరణం కల్పించడం.
4. చట్టానికి అనుకూలంగా శ్రామిక గమనశీలతను ప్రోత్సహించడం.

### 8.5.3 ప్రపంచీకరణకు అనుకూల అంశాలు

1. దేశీయ మార్కెట్‌ను విదేశీ మార్కెట్లతో అనుసంధానం చేసుకోవచ్చు.
2. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చెందుతున్న దేశాలు పొందవచ్చు.
3. భారీ పరిశ్రమలకు కావలసిన యంత్రాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చెందిన దేశాల నుంచి దిగుమతి చేసుకోవచ్చు.
4. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా వస్తూత్పత్తి నైపుణ్యాన్ని పెంచుకోవచ్చు.
5. వెనుకబడిన దేశాలు తమ ఉత్పత్తులను ఎగుమతి చేయవచ్చు. అభివృద్ధి చెందిన దేశాల నుంచి కావాల్సిన వినియోగ వస్తువులను దిగుమతి చేసుకోవచ్చు.

### 8.5.4 ప్రపంచీకరణకు ప్రతికూల అంశాలు

1. ప్రపంచీకరణ వల్ల అభివృద్ధి చెందిన దేశాలు అధికంగా లాభాన్ని పొందాయి, కాని అభివృద్ధి చెందుతున్న దేశాలు అల్పంగా లాభాన్ని పొందాయి.
2. అభివృద్ధి చెందుతున్న దేశాలలో ప్రభుత్వాలు ప్రజా సంక్షేమంపై చేసే ఖర్చును తగ్గించాయి.

### 8.5.5 విదేశీ వాణిజ్యం, మార్కెట్ల అనుసంధానం

దేశాల మధ్య అనుసంధానంగా చాలా కాలంగా వాణిజ్యం ఉంటుంది. ఉత్పత్తిదారులకు దేశీయ మార్కెట్లకు మించిన అవకాశాలను విదేశీ వాణిజ్యం అందిస్తుంది. అదేవిధంగా కొనుగోలుదారులకు స్థానికంగా ఉత్పత్తి అయిన వస్తువులే కాకుండా మరిన్ని వస్తువులు అందుబాటులోకి వస్తాయి. అంటే విదేశీ వాణిజ్యం వివిధ దేశాలలోని మార్కెట్లతో అనుసంధానం చేస్తుంది.

### 8.5.6 బహుళ జాతి కంపెనీలు

ఒక దేశం కంటే ఎక్కువ దేశాలలో ఉత్పత్తిని చేపట్టే సంస్థలను 'బహుళ జాతి సంస్థలు' అంటారు. ఉత్పత్తి ఖర్చులను తగ్గించి తమ లాభాలను పెంచుకోవడమే బహుళ జాతి సంస్థల ఉద్దేశం. చౌకగా వనరులు లభించే ప్రాంతాల్లో బహుళ జాతి సంస్థలు తమ కార్యాలయాలను, కర్మాగారాలను నెలకొల్పుతాయి. ఈ దేశాలలో విదేశీ పెట్టుబడులు, విదేశీ వాణిజ్యం పెరుగుతున్నాయి. విదేశీ వాణిజ్యంలో అధిక భాగాన్ని బహుళ జాతి సంస్థలు నియంత్రిస్తున్నాయి.

### 8.5.7 ప్రపంచ వాణిజ్య సంస్థ

అంతర్జాతీయ వాణిజ్యంలో వచ్చిన అవరోధాలను పరిష్కరించడానికి ప్రపంచ వాణిజ్య సంస్థను ఏర్పాటు చేశారు. 1947లో అంతర్జాతీయ వ్యాపారాలకు సంబంధించి జనరల్ అగ్రిమెంట్ ఆన్ టారిఫ్ అండ్ ట్రేడ్ (GATT) ను ఏర్పాటు చేశారు. గాట్‌పై భారతదేశంతో సహా 23 దేశాలు సంతకాలు చేశాయి. ఈ గాట్ 1948 జనవరి 1 నుండి అమలులోకి వచ్చింది. గాట్ అధ్వర్యంలో 1947 నుండి 1994 వరకు ఎనిమిది సార్లు బహుళపక్ష వ్యాపార సమావేశాలు నిర్వహించడం జరిగింది. ఉరుగ్వేలో జరిగిన 8వ రౌండ్ గాట్ చర్చల యొక్క ముఖ్య ఉద్దేశం విదేశీ వ్యాపారానికి గల ప్రతిబంధకాలను తొలగించి ఆర్థిక అభివృద్ధిని సాధించుట. 1994లో కుదిరిన ఒప్పందం ఫలితంగా డంకెల్ ప్రతిపాదనలను అనుసరించి గాట్ శాశ్వత ప్రాతిపదికపై ప్రపంచ వాణిజ్య సంస్థ (WTO) గా రూపాంతరం చెందింది. WTO స్విట్జర్లాండ్ దేశంలో జెనీవా ప్రధాన కార్యాలయంగా 1995 జనవరి 1న పని చేయడం ప్రారంభించింది.

### 8.5.8 భారతదేశంపై ప్రపంచీకరణ ప్రభావం

భారతదేశంలో 1991లో ఆర్థిక సంస్కరణల అమలు వలన స్థిరీకరణ చర్యలను చేపట్టింది. దేశంలో బహుళ జాతి సంస్థల విదేశీ పెట్టుబడులు పెరిగాయి. దీనికి కారణం బహుళ జాతి సంస్థలకు ఎక్కువ లాభాలు వస్తున్నాయి. ముఖ్యంగా శీతల పానీయాలు, ఫాస్ట్ ఫుడ్, ఎలక్ట్రానిక్స్, వాహనాలు, సెల్‌ఫోన్లు వంటి పరిశ్రమల ఉత్పత్తులకు మన దేశంలో కొనుగోలుదారులు పెరిగారు. ఈ పరిశ్రమలకు ముడి సరుకులు సరఫరా చేసే దేశీయ సంస్థలు లాభపడ్డాయి.

ప్రపంచీకరణ వల్ల ముఖ్యంగా సేవా రంగం విస్తరించింది. ఐటీతో పాటు సేవలు అందించే సంస్థలకు కొత్తగా ఉపాధి అవకాశాలు లభించాయి. కాల్ సెంటర్ల నిర్వహణ, డేటా ఎంట్రీ, పరిపాలనా సంబంధమైన పనులు, ఇంజనీరింగ్, బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. భారతదేశ కంపెనీలలో ఉత్పత్తి పద్ధతులలో

మార్పులు వచ్చాయి. సాంకేతిక విజ్ఞానం వినియోగించడం, ఉత్పత్తి ప్రమాణాలను పెంచడం, విదేశీ కంపెనీలతో కలిసి పని చేయడం మొదలుపెట్టాయి. పెద్ద భారతీయ కంపెనీలు స్వయంగా బహుళ జాతి సంస్థలుగా ఎదిగాయి. టాటా మోటార్స్ (వాహనాలు), ఇన్ఫోసిస్ (ఐ.టి.), రాన్‌బాక్సీ (మందులు), ఏషియన్ పెయింట్స్ (రంగులు), సుందరం ఫాస్టెనర్స్ (నట్లు, బోల్టులు) వంటి కంపెనీలు ప్రపంచ వ్యాప్తంగా ఉత్పత్తులను కొనసాగిస్తున్నాయి.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. ప్రపంచీకరణకు ప్రతికూల అంశాలు ఏవి?
2. ప్రపంచ వాణిజ్య సంస్థ అంటే ఏమిటి?

## 8.6 ముగింపు (ముఖ్యాంశాలు)

- స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో 1948 మరియు 1956 పారిశ్రామిక విధాన తీర్మానాలు మిశ్రమ ఆర్థిక వ్యవస్థ వైపు మొగ్గుచూపాయి.
- 1980 వ దశకంలో ఆర్థిక సంస్కరణలకు బీజం పడింది. అప్పటి కేంద్ర ప్రభుత్వం దానికి అనుగుణంగా చర్యలను ప్రారంభించింది.
- అంతకుముందు తీసుకున్న నిర్ణయాల కారణంగా 1990 లో ఆర్థిక సంక్షోభం ఏర్పడింది.
- 1990-91 నాటికి కోశ లోటు, కరెంటు ఖాతాలలో లోటు, ద్రవ్యోల్బణం పెరగడం వలన ఆర్థిక సంక్షోభం ఏర్పడింది.
- సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణలతో కూడిన నూతన ఆర్థిక సంస్కరణలు 1991 లో అమలులోకి వచ్చాయి.
- ఆర్థిక వ్యవస్థపై ప్రభుత్వ జోక్యాన్ని సడలించడం, ప్రైవేట్ పెట్టుబడులపై ఆంక్షలను, నియంత్రణలను తొలగించడం ద్వారా ఆర్థిక సరళీకరణ జరుగుతుంది.
- ప్రభుత్వ సంస్థల యాజమాన్యం, ఆస్తులతో పాటు నిర్వహణను ప్రైవేటుపరం చేయడం ద్వారా ప్రైవేటీకరణ జరుగుతుంది.
- ప్రపంచీకరణ వల్ల అభివృద్ధి చెందుతున్న దేశాల కన్నా అభివృద్ధి చెందిన దేశాలు అధికంగా లాభాన్ని పొందాయి.

## 8.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 1-2 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. సరళీకరణ అంటే ఏమిటి?
2. ప్రైవేటీకరణ ప్రక్రియలను తెలపండి.
3. బహుళ జాతి కంపెనీలు అంటే ఏమిటి?

**II. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 4-5 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. ఆర్థిక సంస్కరణలకు దారి తీసిన పరిస్థితులను వివరించండి.
2. ప్రైవేటీకరణ వల్ల కలిగే ప్రయోజనాలను పేర్కొనండి.
3. ప్రపంచీకరణ ఆధారపడే అంశాలు ఏవి?

**III. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 8-10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. ప్రపంచీకరణ యొక్క అనుకూల, ప్రతికూల అంశాలను వివరించండి.
2. 1991లో ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలను వివరించండి.

**IV. కింది వాటిలో సరైన జవాబును ఎంపిక చేయండి.**

1. కింది వాటిలో ప్రపంచ పరిపాలనా సంస్థ ఏది? (   )

   ఎ) SBI  బి) WTO  సి) MRTP  డి) MNC

2. 1991 ఆర్థిక సంస్కరణలలోని ముఖ్యాంశాలు ఏవి? (   )

   ఎ) సరళీకరణ  బి) ప్రైవేటీకరణ  సి) ప్రపంచీకరణ  డి) పై అన్ని అంశాలు

3. బహుళ జాతి కంపెనీలకు ఒక ఉదాహరణ (   )

   ఎ) BSNL  బి) Bharathi Cement  సి) Indian Railways  డి) Coca Cola

## 8.8 ఉపయుక్త గ్రంథాలు

1. భారతదేశ ఆర్థిక వ్యవస్థ, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం, తెలుగు అకాడమి, హైదరాబాద్.
2. భారతదేశ ఆర్థిక వ్యవస్థ, డిగ్రీ, తెలుగు అకాడమి, హైదరాబాద్.

# 9 ప్రభుత్వ రాబడి, ప్రభుత్వ వ్యయం, బడ్జెట్

## 9.0 అభ్యసన ఫలితాలు

- ప్రభుత్వ విత్తంను వివరిస్తారు.
- ప్రభుత్వ రాబడి మార్గాలను వర్గీకరిస్తారు.
- వస్తు సేవల పన్ను ఉపయోగాలను వివరిస్తారు.
- ప్రభుత్వ వ్యయం ఆవశ్యకతను వివరిస్తారు.
- బడ్జెట్ రకాలను వర్గీకరిస్తారు.

6. భారతదేశంలో ద్రవ్య లోటు పెరుగుదలకు గల కారణాలను విశ్లేషిస్తారు.

## 9.1 పరిచయం

నేటి కాలంలో ద్రవ్యం (డబ్బు) లేనిదే ఏ రకమైన పనులను నిర్వహించలేము. అలాగే వ్యయం (ఖర్చు) చేయకుండా ఏ రకమైన పనులను చేపట్టలేము. మనం మన కుటుంబ అవసరాల కోసం, వివిధ వస్తువుల కొనుగోలు కోసం, విద్య కోసం, నిత్యావసర సరుకుల కొనుగోలు కోసం, భూములు, భవనాల కొనుగోలు కోసం ఖర్చు చేస్తూ ఉంటాము. ఈనాటి ప్రభుత్వాలు కూడా ప్రజా సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. అనగా ప్రజలకు కావలసిన రేషను బియ్యం, పాఠశాలల నిర్వహణ, ఆసుపత్రుల నిర్వహణ, రోడ్లు, కరెంటు, ప్రభుత్వ పాలన, పెన్షన్లు, శాంతి భద్రతల నిర్వహణ వంటి ఎన్నో కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతుంది. దీని వల్ల ప్రభుత్వ వ్యయం క్రమంగా పెరుగుతుంది.

అయితే నిరంతరంగా పెరుగుతున్న వ్యయానికి కావలసిన ఆదాయాన్ని పెంచుకోవడానికి ప్రభుత్వం మార్గాలను వెతుకుతుంది. వివిధ రకాల పన్నుల ద్వారా ప్రభుత్వం రాబడిని పెంచుకుంటుంది. ఈ విధంగా వచ్చిన రాబడిని ఒక ప్రణాళిక ప్రకారం ఖర్చు చేయాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వానికి అనేక ఉద్దేశాలు, కార్యక్రమాలు ఉంటాయి. కాబట్టి వీటిని అమలు చేయాలంటే బడ్జెట్ అవసరమవుతుంది.

ఆదాయానికి, వ్యయానికి సంబంధించిన ఒక ప్రణాళికయే 'బడ్జెట్'. ఇందులో రాబడికి సంబంధించిన అంశాలు ఒకవైపు, వ్యయానికి సంబంధించిన అంశాలు మరొకవైపు చూపిస్తారు. ఈ పాఠ్య భాగంలో మనం ప్రభుత్వ రాబడి, ప్రభుత్వ వ్యయం, బడ్జెట్ గురించి తెలుసుకుందాం.

## 9.2 ప్రభుత్వ విత్తం : భావన, ప్రాముఖ్యత, ప్రధాన అంశాలు

### 9.2.1 ప్రభుత్వ విత్త భావన

ప్రభుత్వ విత్త శాస్త్రం పరిధిని బట్టి ఆ శాస్త్ర ప్రాధాన్యతను మూల్యాంకనం చేయవచ్చు. సాంప్రదాయికంగా ఆదాయం, వ్యయాలను పరిశీలించే మరియు విశ్లేషించే శాస్త్రాన్ని ప్రభుత్వ విత్త శాస్త్రంగా పరిగణించవచ్చు. సాంప్రదాయ రచయితలు ప్రభుత్వ విత్త అంశాలను ప్రధానంగా మూడు భాగాలుగా విభజించారు. అవి: ఆదాయం, వ్యయం, రుణం.

### 9.2.2 ప్రభుత్వ విత్త ప్రాముఖ్యత

1. సమాజ అవసరాలకు తగినట్లుగా వనరులను కేటాయించడం ప్రభుత్వం యొక్క ముఖ్యమైన పని. వాటిలో ప్రధానంగా ప్రజల సామాజిక కోరికలు, అవసరాలు, దేశ రక్షణ, శాంతి భద్రతలు, సామాజిక న్యాయం మొదలైనవి ఉంటాయి. వాటిని ప్రభుత్వం కల్పించడానికి నిధుల అవసరం ఉంది. వీటి గురించి ప్రభుత్వ విత్త శాస్త్రం తెలుపుతుంది.
2. ప్రజల సంక్షేమం, పేద-ధనిక అసమానతలను తొలగించడం, పేదలకు కావల్సిన సంక్షేమ పథకాలను అమలు చేయడం, నిరుద్యోగాన్ని తగ్గించడం, సామాజిక న్యాయాన్ని చేకూర్చడం, ఆర్థిక వృద్ధిని సాధించడం ఆధునిక ప్రభుత్వాల విధి.
3. ప్రజా వస్తు సేవలైన రోడ్లు, సైనిక సేవలు, వీధి దీపాలు మొదలైనవి నిర్వహించడానికి ప్రభుత్వ విత్తం అవసరం. ప్రైవేట్ వ్యాపార సంస్థలు వీటిని సమకూర్చలేవు.
4. సమాజంలో ఉన్న పేద, ధనికుల మధ్య ఆదాయ అసమానతలను తొలగించడానికి, ధనవంతుల మీద పన్నులను విధించి పేద వర్గాలకు సేవలు అందించడానికి ప్రభుత్వ విత్తం అవసరం.
5. సామాజిక సంక్షేమం, సామాజిక భద్రత వంటి సాంఘిక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయుటకు ప్రభుత్వ విత్తం అవసరం.

### 9.2.3 ప్రభుత్వ విత్త ప్రధాన అంశాలు

ప్రభుత్వ విత్తంలో ప్రధానంగా ప్రభుత్వ ఆదాయం, ప్రభుత్వ వ్యయం, ప్రభుత్వ రుణం మొదలైన అంశాలుంటాయి. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే వివిధ పద్ధతులను ప్రభుత్వం చేపడుతుంది. ఇందులో పన్నుల నుంచి వచ్చే ఆదాయం, ఇతర రాబడులు కలిసి ఉంటాయి. పన్ను రాబడిలో ప్రత్యక్ష, పరోక్ష పన్నుల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. ఇతర రాబడులైన ఫీజులు, జరిమానాలు మొదలైన అంశాల ద్వారా కూడా ఆదాయం వస్తుంది. ప్రజల సంక్షేమం, ప్రజలకు కావల్సిన వివిధ పథకాలకు ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. దాని కోసం ప్రభుత్వానికి వచ్చే రాబడులు సరిపోనపుడు ప్రభుత్వం దేశంలోని ప్రజల నుండి గాని, సంస్థల నుండి గాని, విదేశాల నుంచి గాని రుణాలను (అప్పులను) తీసుకుంటుంది. వీటిని ప్రభుత్వ రుణం అంటారు. కాబట్టి ఈ అంశాలన్నింటినీ కూడా ప్రభుత్వ విత్తంలో ప్రధాన భాగాలుగా చెప్పవచ్చు.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. ప్రభుత్వ విత్తం యొక్క ఆవశ్యకత ఏమిటి?
2. ప్రభుత్వ విత్తంలోని మూడు ప్రధాన భాగాలను గుర్తించండి.

## 9.3 ప్రభుత్వ రాబడి

ప్రైవేట్ సంస్థలలాగా ప్రభుత్వం, లాభ నష్టాలను బేరీజు వేసుకుని ప్రజలకు అందించే ప్రతి వస్తు సేవకు ధరను నిర్ణయించలేదు. పేదలకు, ఆర్థికంగా, సాంఘికంగా వెనుకబడిన బలహీన వర్గాల ప్రజలకు ఉచితంగా కొన్ని వస్తు సేవలను ప్రభుత్వం అందజేయాల్సి ఉంటుంది. వివిధ రకాల పన్నుల ద్వారా ప్రభుత్వం రాబడిని పెంచుకుంటుంది. అందువల్ల ప్రజల నుంచి ఏ విధంగా ఎంత మొత్తంలో రాబడిని సమకూర్చుకోవాలో ప్రభుత్వం జాగ్రత్తగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి.

### 9.3.1 ప్రభుత్వ రాబడి మార్గాలు

ఆధునిక కాలంలో అనేక మార్గాల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం లభిస్తుంది. అందులో ప్రధానమైన రాబడి మార్గాలు:

1. వివిధ రకాలైన పన్నులు
2. జరిమానాలు
3. నిర్బంధ రుణాలు
4. ప్రభుత్వ ఆస్తుల నుండి ప్రభుత్వానికి వచ్చే ఆదాయం
5. ప్రభుత్వ సంస్థల లాభాలు
6. ప్రభుత్వ సేవలకు చెల్లించే ఫీజులు

### 9.3.2 పన్నులు

ప్రభుత్వ ఆదాయ వనరులలో అత్యంత ప్రధానమైనవి పన్నులు. ప్రభుత్వ ఆదాయంలో ఎక్కువ భాగం పన్నుల ద్వారానే సమకూరుతుంది. పన్నులు కేవలం ప్రభుత్వానికి ఆదాయ వనరే కాకుండా కొన్ని ఆర్థిక కార్యకలాపాలను నియంత్రణ చేయడానికి కూడా ఉపయోగపడతాయి.

పన్నులను ముఖ్యంగా రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి: ప్రత్యక్ష పన్నులు, పరోక్ష పన్నులు.

**పన్నులు**

- ప్రత్యక్ష పన్నులు
  - ఆదాయపు పన్ను
  - కార్పొరేట్ పన్ను
  - ఆస్తి పన్ను
  - వృత్తి పన్ను
- పరోక్ష పన్నులు
  - అమ్మకం పన్ను
  - ఎక్సైజ్ సుంకం
  - ఎగుమతి, దిగుమతి సుంకం
  - విలువ ఆధారిత పన్ను (వ్యాట్)
  - వస్తు సేవల పన్ను (జి.ఎస్.టి.)

### 9.3.3 ప్రత్యక్ష పన్నులు

ఎవరిపై పన్ను విధించబడుతుందో వారే దానిని చెల్లించినట్లైతే దానిని ప్రత్యక్ష పన్ను అంటారు. ఇంకా వివరంగా చెప్పాలంటే ఈ విధానంలో పన్ను చెల్లించే వ్యక్తి మొత్తం భారాన్ని తానే భరిస్తాడు. ఉదాహరణకు 1.ఆదాయ పన్ను 2.కార్పొరేట్ పన్ను.

**1. ఆదాయ పన్ను**

వ్యక్తుల యొక్క వ్యక్తిగత ఆదాయంపై విధించే పన్నును 'ఆదాయపు పన్ను' అంటారు. వ్యక్తిగత ఆదాయాలలో జీతాలపై వచ్చే ఆదాయం, బ్యాంకులోని డిపాజిట్లపై వచ్చే వడ్డీ, భవనాలు వంటి ఆస్తులపై వచ్చే అద్దె ఉంటాయి. మన దేశంలో ఆదాయ పన్నును కొంత పరిమితికి మించి ఆదాయాన్ని సంపాదించిన వారిపై విధిస్తారు. మన దేశంలో పురోగామి పన్ను విధానం (progressive taxation) అమల్లో ఉంది. పురోగామి పన్ను అంటే ఆదాయం పెరిగిన కొద్దీ పన్ను రేటు కూడా పెరుగుతుంది. ఉదాహరణకు "ఎ" అనే వ్యక్తికి ఆదాయం సంవత్సరానికి రూ.5 లక్షలు అని, అతనిపై 5 శాతం పన్ను రేటును విధిస్తారని అనుకుంటే అతను రూ.25,000 చెల్లించాలి. అదే విధంగా "బి" అనే వ్యక్తి సాంవత్సరిక ఆదాయం రూ.10 లక్షలు అనుకుంటే అతనిపై పన్ను రేటు 15 శాతం విధించగా అతను రూ.1.5 లక్షలు చెల్లించాలి. "సి" అనే వ్యక్తి సాంవత్సరిక ఆదాయం రూ.50 లక్షలు అయినపుడు అతనిపై 30 శాతం పన్ను విధించినచో అతను రూ.15 లక్షలు చెల్లించాలి. అనగా వారి ఆదాయాలు పెరిగిన మొత్తంలో పన్ను రేటు కూడా పెరుగుతూ వచ్చింది. దీనినే 'పురోగామి పన్ను విధానం' అంటారు.

భారతదేశంలో 2020-21 ఆర్థిక సంవత్సరంలో ఆదాయపు పన్ను రేట్లు పట్టిక-9.1 లో తెలిపిన విధంగా ఉన్నాయి.

*పట్టిక-9.1: ఆదాయ పన్ను శ్లాబులు మరియు పన్ను రేట్లు (2020-21 ఆర్థిక సంవత్సరం)*

| సాంవత్సరిక ఆదాయం (రూ.లలో) | పన్ను రేటు |
|---|---|
| 2,50,000 వరకు | పన్ను లేదు |
| 2,50,001-5,00,000 | 5% |
| 5,00,001-7,50,000 | 10% |
| 7,50,0001-10,00,000 | 15% |
| 10,00,001-12,50,000 | 20% |
| 12,50,001-15,00,000 | 25% |
| 15,00,000 పైన | 30% |

**2. కార్పోరేట్ పన్ను**

కంపెనీలు, వ్యాపార సంస్థలు వస్తు సేవలను డబ్బుకు విక్రయిస్తాయి. ఆ విధంగా వచ్చిన ఆదాయంలో ఆ వస్తువు తయారీకి అయిన ఖర్చులన్నీ తీసివేయగా మిగిలినది ఆ కంపెనీల యొక్క లాభం. ఈ లాభాలపై విధించే పన్నులను కార్పొరేట్ పన్ను అంటారు.

### 9.3.4 పరోక్ష పన్నులు

ఒకరిపై విధించిన పన్నులలో కొంత భాగం కాని, మొత్తం గాని మరొకరు చెల్లిస్తే దానిని 'పరోక్ష పన్ను' అంటారు. ఉదా: ఒక వస్తువును ఉత్పత్తిదారుడు తయారు చేసినపుడు అతనిపై పన్ను విధిస్తారు. కానీ ఈ పన్నును వస్తువును కొనుగోలు చేసిన వ్యక్తి చెలిస్తాడు. దీనినే పరోక్ష పన్ను అంటారు. అమ్మకం పన్ను, ఎక్సైజ్ సుంకం, కస్టమ్స్ సుంకం (ఎగుమతి దిగుమతి సుంకం) విలువ ఆధారిత పన్ను (వ్యాట్), వస్తు సేవల పన్ను (జి.ఎస్.టి.) వంటివి పరోక్ష పన్నులకు ఉదాహరణగా చెప్పవచ్చు. పరోక్ష పన్నులలో ముఖ్యమైనది అమ్మకం పన్ను. ఈ పన్నును వస్తు సేవల అమ్మకంపై విధిస్తారు. అదే విధంగా టెలికాం కంపెనీలు చేసే సేవలు, బ్యాంకుల సేవలు, ఇన్సూరెన్స్ వంటి వాటిపై సేవా పన్ను విధిస్తారు. వస్తువుల తయారీపై విధించే పన్నును 'ఎక్సైజ్ సుంకం' అని, ఎగుమతి దిగుమతులపై విధించిన పన్నులను 'కస్టమ్స్ సుంకం (ఎగుమతి దిగుమతి సుంకం)' అని అంటారు.

**1. విలువ ఆధారిత పన్ను (వ్యాట్)**

రాము టీవీ కొందామని ఓ ప్రముఖ టీవీ షోరూంకి వెళ్లాడు. తనకు నచ్చిన టీవీని కొనుగోలు చేసిన తర్వాత బిల్లును చూడగా ఖరీదుతో పాటు అదనంగా వ్యాట్ అంటూ కొంత సొమ్మును తన వద్ద నుండి వసూలు చేశారు. అసలు ఈ వ్యాట్ అంటే ఏమిటో తెలుసుకుందాం.

వ్యాట్ అంటే విలువ ఆధారిత పన్ను. ఏదైనా ఒక వస్తువు ఉత్పత్తి లేదా అమ్మకపు దశలలో పెరిగిన విలువపై మాత్రమే విధించే పన్నును విలువ ఆధారిత పన్ను (వ్యాట్) అంటారు. ఉదాహరణ : టీవీ తయారీదారు. రూ.3000 కు టీవీని పంపిణీదారునికి (షోరూం వ్యక్తికి) అమ్మాడు. రశీదులో టీవీ ధర రూ.3,000, ఎక్సైజ్ సుంకం 12.5 శాతం అనగా రూ.375 విధించారు. ఇపుడు మొత్తం ధర రూ.3,375 అయింది. మళ్ళీ దీనిపై వ్యాట్ 14.5 శాతం విధించారు. దాంతో పన్ను రూ.490 అయింది. చివరగా కస్టమర్ చెల్లించాల్సిన మొత్తం రూ.3,865. ఈ ఉదాహరణలో పన్నుపై పన్ను విధించినట్లుగా మనకు అర్థమవుతుంది. ఈ విధానంలో కస్టమర్‌పై పన్ను భారం ఎక్కువగా విధించడం జరిగింది. ఈ విధానంలో ఉన్న లోపాన్ని తొలగించి వస్తు సేవల పన్నును ప్రవేశపెట్టారు.

**2. వస్తు సేవల పన్ను (Goods and Services Tax - GST)**

భారతదేశంలో 2017 సంవత్సరంలో వస్తు సేవల పన్నును ప్రవేశపెట్టారు. ఇంతకు ముందు వరకు వివిధ పరోక్ష పన్నులు ఉండేవి. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌లో ఓ వస్త్ర తయారీ కంపెనీ రంగులను తెలంగాణ నుంచి కొనుగోలు చేసిందనుకుందాం. ఆ సమయంలో కేంద్రపు ఎక్సైజ్ సుంకంతో పాటు తెలంగాణ రాష్ట్రంలో అమల్లో ఉన్న అమ్మకం పన్నును ఆ కంపెనీ చెల్లిస్తుంది. వస్త్రాలను తయారు చేసిన తర్వాత వాటిని వివిధ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంది. వస్తువు అమ్మకం సమయంలో రాష్ట్రాల స్థాయిలో వ్యాట్‌ను వసూలు చేస్తున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని పన్నులు కలిపి మోత మోగుతోంది. పైగా గందరగోళం, ఏ వస్తువుపై ఎంత పన్ను అని అడిగితే చెప్పడానికి క్లారిటీ లేనంత అయోమయం అంతవరకు అమలులో ఉన్న పన్ను చట్టంలో ఉంది.

ఈ అయోమయానికి తెరదించుతూ ఇక దేశవ్యాప్తంగా వస్తు, సేవలపై ఒకటే పన్ను రేటు అమలవుతుంది. దీంతో గందరగోళం పోయి స్పష్టత ఏర్పడుతుంది. అందుకే ఒకటే దేశం, ఒకటే మార్కెట్, ఒకటే పన్ను. అదే జి.ఎస్.టి.

జీఎస్టీని మూడు రకాలుగా విభజించారు. అవి:

1. సెంట్రల్ జీఎస్టీ (సీజీఎస్టీ) : కేంద్ర స్థాయిలో పన్నులన్నీ సీజీఎస్టీలో కలిసిపోతాయి.
2. స్టేట్ జీఎస్టీ (ఎస్‌జీఎస్టీ) : రాష్ట్రాల స్థాయిలో పన్నులన్నీ ఎస్‌జీఎస్టీ పరిధిలోకి వస్తాయి.
3. ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ (ఐజీఎస్టీ) : రెండు రాష్ట్రాలకు చెందిన సంస్థల మధ్య లావాదేవీలు ఐజీఎస్టీ పరిధిలోకి వస్తాయి.

వస్తు సేవల పన్నును ఏ విధంగా విధిస్తారో ఒక ఉదాహరణ ద్వారా తెలుసుకుందాం. టీవీ తయారీదారుడు టీవీని తయారు చేయడానికి కావలసిన ముడి పదార్థాలను రూ.2,000 లకు కొన్నాడనుకుందాం. ఇందులోనే కొనుగోలు చేసే సమయంలో 18 శాతం జీఎస్టీ విధించారు. అనగా అది రూ.360 అవుతుంది. ఉత్పత్తిదారుడు టీవీని తయారు చేయడానికి రూ.500 ఖర్చు అయిందనుకుందాం. ఇప్పుడు టీవీ ధర రూ.2,500.

ఉత్పత్తిదారుడి నుంచి పంపిణీదారుడు (షోరూం వ్యక్తి) టీవీని రూ.2,500 కు కొనుగోలు చేసాడు. ఇప్పుడు దానిపై పంపిణీదారుడు (షోరూం వ్యక్తి) 18 శాతం జీఎస్టీ చొప్పున రూ.450 చెల్లించాలి. కానీ అతను రూ.450కు బదులుగా కేవలం రూ.90 మాత్రమే పన్ను చెల్లిస్తాడు. ఎందుకంటే ఉత్పత్తిదారుడు ముడి పదార్థాలను కొనుగోలు చేసే సమయంలో రూ.360 పన్నుగా చెల్లించాడు.

పంపిణీదారుడు (షోరూం వ్యక్తి) దానిపై తన లాభం రూ.500 కలుపుకొని టీవీ ధర రూ.3,000 గా నిర్ణయించాడు. దానిపై జీఎస్టీ 18 శాతం విధించగా అది రూ.540 అవుతుంది. పంపిణీదారుడు (షోరూం వ్యక్తి) నుంచి వినియోగదారుడు దానిని రూ.3,540 కి కొనుగోలు చేస్తాడు. వ్యాట్ విధానంలో టీవీ ధర రూ.3,865 కాగా జీఎస్టీలో టీవీ ధర రూ.3,540. ఈ విధానంలో కొనుగోలుదారునికి రూ. 325 మిగులు కనిపించింది.

జీఎస్టీలో వివిధ రకాల వస్తువులపై వివిధ రకాల పన్నులను విధిస్తున్నారు. నవంబర్ 2020 వరకు గల సమాచారం ప్రకారం జీఎస్‌టీ రేట్లు 4 స్లాబులుగా ఉన్నాయి. అవి: 5% పన్ను. 12% పన్ను, 18% పన్ను మరియు 28% పన్ను.

**వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) ఉపయోగాలు:**

- దేశవ్యాప్తంగా ఒకటే మార్కెట్.
- ఒక వస్తువుపై దేశవ్యాప్తంగా ఒకటే పన్ను. గతంలో మాదిరిగా ఒక వస్తువుపై ఒక పన్ను కట్టిన తర్వాత, ఆ పన్నుపైన మరల పన్ను చెల్లించడం అన్నది ఇక ఉండదు. దీనివల్ల పన్ను చట్టం సులభతరం అవుతుంది.
- వ్యాపార వ్యయాలు తగ్గుముఖం పడతాయి. పారదర్శకత పెరుగుతుంది.

- ఎన్నో శాఖలతో అవసరం ఉండదు గనుక అవినీతి తగ్గుముఖం పడుతుంది.
- రాష్ట్రాలు ఇప్పటి వరకూ వస్తువులపై పన్నును నిర్ణయించేవి. ఇకపై జీఎస్టీ మండలిదే అంతిమ నిర్ణయం.
- ఎగుమతి చేసే వస్తు, సేవలపై జీఎస్టీ ఉండదు గనుక వాటికి ప్రోత్సాహం లభిస్తుంది.
- ఒక రాష్ట్రం నుంచి మరొక రాష్ట్రానికి సరుకులను పన్ను చెల్లించకుండా అక్రమంగా రవాణా చేసే వారిని ఇది అరికడుతుంది.
- అదేవిధంగా రాష్ట్రాల సరిహద్దులలో ప్రవేశ పన్నును తొలగించడం జరుగుతుంది.

### 9.3.5 పన్నుల విధింపులో సరైన విధానం

సమాజంలో ధనవంతులు తక్కువ శాతం, పేదవాళ్ళు అధిక శాతం ఉన్నారు. ఇలాంటప్పుడు పన్నులను ఏ విధంగా విధిస్తే బాగుంటుంది అనే ఒక ప్రశ్న ఎదురవుతుంది. ఎక్కువ ఆదాయం ఉన్నవారికి ఎక్కువ పన్ను, తక్కువ ఆదాయం ఉన్నవారికి తక్కువ పన్ను విధించాలి. లేదా పేదవారికి పన్నుల నుంచి మినహాయింపు ఇవ్వాలి.

ప్రత్యక్ష పన్నుల విషయంలో ఇది సాధ్యమవుతుంది. కానీ పరోక్ష పన్నుల విషయంలో ధనవంతులు, పేదల మధ్య వ్యత్యాసం చూపడం కష్టమైన పని. ఉదాహరణకు ధాన్యాలు, పప్పులు, కూరగాయలు, వంట నూనెలు వంటి అత్యవసర వస్తువులు ప్రతి ఒక్కరూ కొంటారు. కానీ పేదవారు వాళ్ళ మొత్తం ఆదాయంలో ఎక్కువ భాగం వీటిపైనే ఖర్చు చేయాల్సి వస్తోంది. అందువల్ల అందరూ వినియోగించే అత్యవసర వస్తువులపై పన్ను విధించకుండా విలాస వస్తువులపై పన్ను విధించాలి.

కొన్ని సార్లు ప్రజలు ప్రత్యక్షంగా ఉపయోగించని వస్తువులైన డీజిల్, పెట్రోల్ ధరలు పెరిగినప్పుడు నిత్యావసర వస్తువులైన పండ్లు, కూరగాయలు, ఇతర ఆహార వస్తువుల ధరలు పెరుగుతున్నాయి. ఎందుకంటే వాటి రవాణా ఖర్చులు పెరుగుతున్నాయి. దీంతో పన్నుల పెరుగుదల పేదలపై ఎక్కువ ప్రభావాన్ని చూపిస్తున్నాయి. అందువలన ప్రభుత్వాలు పన్నులు విధించే సమయంలో ఈ విషయాలను దృష్టిలో ఉంచుకొని పన్నులు విధించాలి.

### 9.3.6 పన్ను వసూళ్ళు, ఎగవేత

కేంద్ర ప్రభుత్వం విధించే పన్నులను నాలుగు రకాలుగా విభజించవచ్చు:

- కేంద్ర ప్రభుత్వం విధించి, వసూలు చేయగా వచ్చిన ఆదాయం తానే ఉంచుకొనే పన్నులు. ఉదా: కార్పొరేషన్ పన్ను, కస్టమ్స్ సుంకాలు.
- కేంద్ర ప్రభుత్వం విధించి, తానే వసూలు చేయగా వచ్చిన ఆదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలతో పంచుకునే పన్నులు. ఉదా: ఆదాయం పన్ను, కేంద్ర ఎక్సైజ్ పన్నులు.
- కేంద్ర ప్రభుత్వం విధించి, వసూలు చేయగా వచ్చిన ఆదాయం మొత్తాన్ని రాష్ట్రాలకు ఇచ్చే పన్నులు. ఉదా: ఎస్టేట్ డ్యూటీ.
- కేంద్ర ప్రభుత్వం విధిస్తే రాష్ట్ర ప్రభుత్వాలు వసూలు చేసి ఆ అదాయం మొత్తాన్ని రాష్ట్రాలే తీసుకునే పన్నులు. ఉదా: స్టాంప్ డ్యూటీ, సౌందర్య వస్తువులపై విధించే పన్ను, ఆల్కహాల్ పన్ను మొదలైనవి.

అయితే గత కొద్ది సంవత్సరాలుగా మన దేశంలో వ్యక్తిగత ఆదాయపు పన్ను వసూళ్లు మెరుగుపడ్డాయి. పన్ను ఎగవేత చర్యలు సమర్థవంతమైన పన్ను చెల్లింపుదారుల సంఖ్య పెరగడంతో పన్నుల మెరుగుదలకు దారి తీసింది.

అయినప్పటికీ ఇంకా కొంత మంది ప్రజలు తమ ఆదాయాలను వెల్లడించడం లేదు, లేదా వాస్తవంగా ఉన్న దానికంటే తక్కువ చూపిస్తున్నారు. ఈ ఆదాయాన్ని పైకి కనపడకుండా దాచి పెడుతున్నారు. దీనినే నల్ల ధనం (బ్లాక్ మనీ) అంటారు. ఉదా: కొంత మంది ఉత్పత్తిదారులు వాస్తవంగా జరిగిన ఉత్పత్తికన్నా తక్కువ ఉత్పత్తి జరిగినట్లు చూపి పన్ను నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. కొంత మంది వ్యాపారస్థులు వస్తువులను అమ్మిన దానికంటే తక్కువ అమ్మినట్లుగా రశీదులు చూపి పన్ను ఎగవేస్తున్నారు. అదేవిధంగా ప్రజలు భూములు, ప్లాట్ల రిజిస్ట్రేషన్ సమయంలో మార్కెట్‌లో ఉన్న ధర కంటే తక్కువ ధరకే రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. ఈ విధంగా ప్రభుత్వానికి రావలసినంత ఆదాయం రావడం లేదు.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. ప్రభుత్వం ప్రజలకు చేసే సేవలకు, ఇతర కార్యక్రమాల నిర్వహణకు డబ్బు ఎలా లభిస్తుంది?
2. ఆదాయంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి సమానమైన పన్నులు చెల్లించడం సరైనదేనా?

## 9.4 ప్రభుత్వ వ్యయం : భావన, వర్గీకరణ, పెరుగుదల

నేటి కాలంలో ద్రవ్యం లేనిదే ఏ రకమైన కార్యకలాపాలను నిర్వహించలేం. అలాగే వ్యయం (ఖర్చు) చేయకుండా ఏ రకమైన పనులను చేపట్టలేం. మనం మన కుటుంబ అవసరాల కోసం వివిధ వస్తువుల కొనుగోలు కోసం, అదేవిధంగా పాఠశాల విద్య కోసం, నిత్యావసర సరుకులు కొనుగోలు కోసం, భూములు, భవనాల కొనుగోలు కోసం ఖర్చు చేస్తూ ఉంటాం. అదే విధంగా ప్రభుత్వాలు కూడా ప్రజల సంక్షేమం కోసం, ఇతర అవసరాల కోసం ఖర్చు చేస్తూ ఉంటాయి. ప్రభుత్వాలు చేసే ఈ రకమైన వ్యయాన్ని ప్రభుత్వ వ్యయం అంటారు.

### 9.4.1 ప్రభుత్వ వ్యయ భావన

ప్రభుత్వం ప్రజల సామాజిక అవసరాలను తీర్చడం కోసం, ప్రజల ఆర్థిక, సామాజిక సంక్షేమం కోసం ఖర్చు చేయాల్సిన అవసరం ఉంది. ప్రజా అభివృద్ధి కార్యక్రమాలైన విద్య, ఆరోగ్యం, సామాజిక భద్రత, సాగు నీటి పారుదల, త్రాగు నీరు, రోడ్లు, మురుగు నీటి పారుదల వ్యవస్థ, విద్యుత్తు వంటి వాటిపై ప్రభుత్వం ఖర్చు చేస్తుంది. ప్రజల ఉమ్మడి అవసరాలను తీర్చుట కొరకు లేదా ప్రజల బాగోగుల నిమిత్తం కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు చేసే వ్యయాన్ని 'ప్రభుత్వ వ్యయం' అంటారు.

### 9.4.2 ప్రభుత్వ వ్యయ వర్గీకరణ

ప్రభుత్వ ఆర్థిక కార్యక్రమాలపై చేసే వ్యయాన్ని క్రింది విధంగా వర్గీకరించవచ్చు:

**ఎ) ప్రణాళికా వ్యయం:** ప్రణాళికలో భాగంగా అభివృద్ధి పనులకు అయ్యే పెట్టుబడులను ప్రణాళికా వ్యయం అంటారు.

**బి) ప్రణాళికేతర వ్యయం:** ప్రణాళికలో చూపించని వ్యయం 'ప్రణాళికేతర వ్యయం'. ఇందులో పరిపాలనా ఖర్చులకు, దేశ రక్షణ, వడ్డీ చెల్లింపులు, పెన్షన్లు వంటివి ఉంటాయి. వీటిని రెవిన్యూ వ్యయం, మూలధన వ్యయంగా విభజించారు. ఎలాంటి ఆస్తులను సృష్టించని వాటిపై చేసే వ్యయాన్ని 'రెవెన్యూ వ్యయం'గా పిలుస్తారు. ఉదాహరణకు పరిపాలనా ఖర్చులకు, దేశ రక్షణ, వడ్డీ చెల్లింపులు, పెన్షన్లు వంటి వాటికి చేసే ఖర్చు. ఆస్తులను పొందటానికి చేసే వ్యయాలను 'మూలధన వ్యయం' అంటారు. ఉదాహరణకు భూమి, భవనాలు, యంత్రాలు, యంత్ర సామాగ్రి, పెట్టుబడులు పెట్టడం, ప్రభుత్వ రంగ సంస్థలకు ఇచ్చే రుణాలు మూల ధన వ్యయంలో భాగం.

### 9.4.3 ప్రభుత్వ వ్యయం ఎందుకు పెరుగుతుంది?

1. ప్రజలకు అవసరమైన విద్య, వైద్యం, గృహ వసతి, తాగు నీరు, సాగు నీరు, కాలువలు, గ్రామీణ రోడ్లు, విద్యుత్తు వంటి సేవలను అందించడం వలన ప్రభుత్వం వ్యయం పెరుగుతుంది.

2. దేశ రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణ, సామాజిక న్యాయం మొదలైనవి సమాజంలోని ప్రజలందరికీ అందించడానికి ప్రభుత్వ వ్యయం అవసరం.

3. ప్రభుత్వ రంగంలో వస్తువులను ఉత్పత్తి చేసి తక్కువ ధరలకు అల్పాదాయ వర్గాల వారికి రాయితీ ధరలకు అందించడం ద్వారా ఆదాయ సంపదలలో అసమానతలను తొలగించడానికి ప్రభుత్వ వ్యయం తప్పనిసరి అవుతుంది.

4. అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయాలంటే వ్యవసాయం, పరిశ్రమల రంగాలను అభివృద్ధి చేయాలి. దీని కోసం నీటి పారుదల ప్రాజెక్టులను నిర్మించడం మరియు పరిశ్రమలలో నూతన విధానాలను ప్రోత్సహించడానికి ప్రభుత్వ వ్యయం చేయాల్సిన అవసరం ఉంది.

5. ప్రాంతీయ అసమానతలను నిర్మూలించడానికి వెనుకబడిన ప్రాంతాలలో పరిశ్రమల స్థాపన, ప్రభుత్వ పనులను చేపట్టాలి. ఉదాహరణకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పని కోరిన ప్రతి వ్యక్తికి సంవత్సరానికి 100 రోజులు పని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

6. ప్రజాస్వామ్య సంస్థలు అంటే కేంద్ర స్థాయిలో లోక్ సభ, రాజ్య సభ; రాష్ట్ర స్థాయిలలో శాసన సభ, శాసన మండలి; జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్తు, పురపాలక సంస్థలు, గ్రామ పంచాయతీలు మొదలైన వాటిని నిర్వహించడం, వాటికి ఎన్నికలు జరిపించడం కారణంగా ప్రభుత్వ వ్యయం పెరుగుతుంది.

7. పెరుగుతున్న జనాభా కారణంగా పట్టణాల స్థాయి పెరుగుతుంది. కాబట్టి పెరిగిన జనాభాకు అవసరమైన విద్య, వైద్యం, రవాణా అవసరాలు, రోడ్లు, శాంతి భద్రతలు, మంచి నీటి సదుపాయం, పారిశుద్ధ్యం, గ్రంథాలయాలు, క్రీడా ప్రాంగణాలు సమకూర్చడానికి ప్రభుత్వాలకు వ్యయం అవసరమవుతుంది.

## మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. ప్రభుత్వ వ్యయం రోజు రోజుకూ ఎందుకు పెరుగుతుందని మీరు భావిస్తున్నారు?
2. ప్రభుత్వ వ్యయాన్ని వర్గీకరించండి?

## 9.5 బడ్జెట్ : భావన, ఉద్దేశం, రకాలు, లోటు ద్రవ్య విధానానికి గల కారణాలు

### 9.5.1 బడ్జెట్ భావన

బడ్జెట్ అనేది రాబోయే ఒక సంవత్సర కాలంలో, ఒక దేశంలో ఆదాయ వ్యయాలకు సంబంధించినటువంటి ఒక అంచనాల నివేదిక. సాధారణంగా ఇది ఒక ఏడాదికి సంబంధించి ఉంటుంది. భారతదేశంలో ఏప్రిల్ 1 నుంచి మార్చి 31 వరకు గల కాలాన్ని 'ఆర్థిక సంవత్సరం' అని అంటారు.

### 9.5.2 బడ్జెట్ ఉద్దేశం

ఏదైనా ఒక లక్ష్యాన్ని సాధించాలంటే ప్రణాళిక అవసరం. ప్రభుత్వానికి అనేక లక్ష్యాలు, ఉద్దేశాలు, ఉంటాయి. ఈ లక్ష్యాలను అమలు చేయాలంటే బడ్జెట్ అవసరమవుతుంది. బడ్జెట్‌లో రాబడికి సంబంధించిన అంశాలు ఒకవైపు, వ్యయానికి సంబంధించిన అంశాలు మరొకవైపు చూపిస్తారు. గత కార్యక్రమాలను మరియు అనుభవాలను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్ కార్యక్రమాలను రూపొందించడం కోసం బడ్జెట్ అవసరం.

**కుటుంబ బడ్జెట్**

ప్రజలు వివిధ పనులు చేయడం ద్వారా ఆదాయాన్ని పొందుతారు. ఉదాహరణకు వ్యవసాయం, భవన నిర్మాణ పనులు, కూరగాయలు అమ్మడం, ఉద్యోగం, దుకాణాలు, ఫ్యాక్టరీలలో పని చేయడం మొదలగునవి. ఈ విధంగా వచ్చే ఆదాయాన్ని కుటుంబ అవసరాలకు ఖర్చు చేస్తారు. ప్రతి కుటుంబం తమ దగ్గరున్న ఆదాయాన్ని తమ అవసరాలకు ఎంత ఖర్చు చేయాలనే ఒక ఆలోచన ఉంటుంది. అది రాతపూర్వకంగా ఉండొచ్చు, ఉండకపోవచ్చు. ఈ విధంగా వారు ఏర్పరుచుకున్న ఒక ప్రణాళికనే 'కుటుంబ బడ్జెట్' అని చెప్పవచ్చు. దీనిని ఒక ఉదాహరణ ద్వారా తెలుసుకుందాం.

*పట్టిక-9.2: ఒక వ్యక్తి యొక్క కుటుంబ బడ్జెట్ (రూపాయలలో)*

| ఆదాయం (రాబడి) రూ.లలో | | ఖర్చు (వ్యయం) రూపాయలలో | |
|---|---|---|---|
| నెలలో వచ్చిన ఆదాయం 15,000 | | ఆహారం | 4,000 |
| | | ఇంటి అద్దె | 2,500 |
| | | మందులు | 2,000 |
| | | పాఠశాల ఫీజులు | 3,000 |
| | | కరెంటు బిల్లు, ఇతర ఖర్చులు | 2,500 |
| | | బస్సు, ఆటో చార్జీలు | 1,000 |
| **మొత్తం ఆదాయం** | **15,000** | **మొత్తం ఖర్చు** | **15,000** |

పట్టిక-9.2 లో ఎడమ వైపున రామయ్య కుటుంబ ఆదాయం లేదా రాబడులు, కుడి వైపున ఖర్చు చూపబడ్డాయి. వారి కుటుంబం నెలలో సంపాదించిన ఆదాయం రూ.15,000 గా ఉంది. అదే విధంగా వారి ఖర్చులు చూచినట్లయితే వారు ఆహారం, పాఠశాల ఫీజులు, మందులు, బస్సు, ఆటో చార్జీలు, కరెంట్ బిల్లు మొదలైన వాటి కోసం చేసినటువంటి ఖర్చులు రూ.15,000 గా ఉన్నాయి. ఈ విధంగా వచ్చినటువంటి ఆదాయాన్ని ఒక పద్ధతి ప్రకారం ఖర్చు చేయాలనేది ఒక నివేదిక రూపంలో ప్రతి కుటుంబం ఏర్పాటు చేసుకుంటే అది కుటుంబ బడ్జెట్ అని చెబుతాం.

### 9.5.3 బడ్జెట్ రకాలు

నిర్ణీత కాలం అంటే సంవత్సరానికి ఒకసారి రూపొందించే బడ్జెట్‌ను 'సాధారణ బడ్జెట్' అంటారు. ఇలా కాకుండా ప్రభుత్వాలు తరచుగా మారడం, యుద్ధం వంటి కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో సంవత్సరం కంటే తక్కువ కాలానికి తయారు చేసిన బడ్జెట్‌ను 'మధ్యంతర బడ్జెట్' అంటారు. ఒక్కోసారి ప్రభుత్వాలు అపద్ధర్మ కాలంలో ఉన్నప్పుడు తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశ పెడతాయి. దీనినే 'ఓటాన్ అకౌంట్ బడ్జెట్' అంటారు. ప్రభుత్వం రూపొందించే బడ్జెట్‌ను మూడు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి:

**1. సంతులిత బడ్జెట్:** ఒక సంవత్సర కాలంలో ప్రభుత్వం పొందిన మొత్తం ఆదాయం, అది చేసే వ్యయం రెండూ సమానంగా ఉంటే దానిని 'సంతులిత బడ్జెట్' అంటారు.

**2. లోటు బడ్జెట్:** ప్రభుత్వం పొందిన మొత్తం ఆదాయంకంటే వ్యయం అధికమైతే దానిని 'లోటు బడ్జెట్' అంటారు. ఆధునిక కాలంలో లోటు బడ్జెట్ సాధారణమైపోయింది.

**3. మిగులు బడ్జెట్:** ప్రభుత్వం చేసిన వ్యయం కంటే ఆదాయం ఎక్కువగా ఉంటే దానిని 'మిగులు బడ్జెట్' అంటారు.

### 9.5.4 భారతదేశంలో లోటు ద్రవ్య విధానానికి గల కారణాలు

ఈ మధ్య కాలంలో లోటు ద్రవ్య విధానం అనేది మామూలైపోయింది. ప్రభుత్వం యొక్క మొత్తం వ్యయం కంటే మొత్తం ఆదాయాలు తక్కువగా ఉన్నటువంటి పరిస్థితిని లోటు ద్రవ్య విధానం అంటారు. మొదటి పంచవర్ష ప్రణాళిక ప్రారంభం నుంచే భారతదేశంలో ప్రభుత్వం లోటు ద్రవ్య విధానాన్ని అవలంబిస్తోంది. అయితే దీనికి ఎన్నో కారణాలు ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలు, కరువు భత్యం, యుద్ధ సామాగ్రి ఉత్పత్తి, పరిపాలనా నిర్వహణ ఖర్చులు మొదలైన కారణాల కోసం ప్రభుత్వం లోటు ద్రవ్య విధానం అవలంభించింది. ప్రభుత్వం తమ దగ్గరున్న ఆదాయాలతో పెరుగుతున్న వ్యయాలను తట్టుకునే పరిస్థితుల్లో లేనట్లయితే తప్పనిసరిగా లోటు ద్రవ్య విధానం పాటిస్తుంది. నూతన ద్రవ్యాన్ని ముద్రించటం ద్వారా ఈ అగాధాన్ని తగ్గించుకోవటానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుంది.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. మీ కుటుంబ బడ్జెట్‌ను రూపొందించండి.
2. మీ కుటుంబ ఆదాయం కంటే ఖర్చు పెరిగినపుడు, పెరిగిన ఖర్చులు మీ కుటుంబంపై ఏ రకమైన ప్రభావాన్ని చూపిస్తాయి?

## 9.6 ముగింపు (ముఖ్యాంశాలు)

- లాభ నష్టాల దృష్ట్యా కాకుండా ప్రజల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం వస్తు సేవలను అందిస్తుంది.
- ప్రభుత్వ విత్తంలో ప్రధానంగా ఆదాయం (రాబడి), వ్యయం, రుణం అనే మూడు భాగాలు ఉంటాయి.
- ప్రభుత్వ ఆదాయ వనరులలో అత్యంత ప్రధానమైనవి ప్రత్యక్ష మరియు పరోక్ష పన్నులు.
- వ్యక్తుల వ్యక్తిగత ఆదాయంపై విధించబడే ఆదాయ పన్నును కొంత పరిమితికి మించి సంపాదించే ఆదాయంపై విధిస్తారు.
- 2017లో ప్రవేశపెట్టబడిన వస్తు సేవల పన్ను (GST) రేట్లు 4 స్లాబులుగా (5%, 12%, 18% మరియు 28%) ఉన్నాయి.
- ప్రజల సామాజికార్థిక సంక్షేమం కోసం, విద్య, వైద్యం, త్రాగు నీరు, రోడ్లు, సాగు నీరు, విద్యుత్ సరఫరా వంటి వాటిపై ప్రభుత్వం వ్యయం చేస్తుంది.
- ఒక దేశంలో రాబోయే ఒక ఆర్థిక సంవత్సర కాలంలో ఆదాయ వ్యయాలకు సంబంధించిన అంచనాల నివేదికను 'బడ్జెట్' అంటారు.
- ప్రభుత్వం రూపొందించే బడ్జెట్లు మూడు రకాలుగా ఉండవచ్చు. అవి: సంతులిత బడ్జెట్, మిగులు బడ్జెట్ మరియు లోటు బడ్జెట్.

## 9.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. కింది ప్రశ్నలకు 1-2 వాక్యాల చొప్పున సమాధానాలు రాయండి.**

1. పన్నులను ఎన్ని రకాలుగా వర్గీకరించవచ్చు? అవి ఏవి?
2. బడ్జెట్ అంటే ఏమిటి?

**II. కింది ప్రశ్నలకు 4-5 వాక్యాల చొప్పున సమాధానాలు రాయండి.**

1. ప్రభుత్వ ఆదాయ మార్గాలను తెలపండి.
2. ప్రభుత్వ వ్యయాన్ని వర్గీకరించండి.
3. బడ్జెట్‌ను ఎలా రూపొందిస్తారో ఉదాహరణ ద్వారా తెలపండి.

**III. కింది ప్రశ్నలకు 8-10 వాక్యాల చొప్పున సమాధానాలు రాయండి.**

1. ప్రభుత్వ విత్తం యొక్క ప్రాధాన్యతను వివరించండి.
2. వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) ఉపయోగకరంగా ఉందని నీవు ఎట్లా చెప్పగలవు?
3. ప్రభుత్వ వ్యయం పెరగడానికి గల కారణాలను తెలపండి.

**IV. కింది వాటిలో సరైన సమాధానాన్ని ఎంచుకోండి.**

1. ఈ పన్ను విధానంలో పన్ను ఆధారం పెరిగే కొద్దీ పన్ను రేటు పెరుగుతుంది. ( )

   ఎ) పురోగామి పన్ను  బి) తిరోగామి పన్ను

   సి) అనుపాతపు పన్ను  డి) పైవి ఏవీ కావు

2. కంపెనీ లాభాలపై విధించే పన్ను ( )

   ఎ) ఆదాయపు పన్ను  బి) కార్పోరేటు పన్ను

   సి) సంపద పన్ను  డి) ఎస్టేట్ డ్యూటీ

## 9.8 ఉపయుక్త గ్రంథాలు


- ప్రభుత్వ విత్తం – అంతర్జాతీయ అర్థశాస్త్రం. బి.ఎ. మూడవ సంవత్సరం, తెలుగు అకాడమి.
- ద్రవ్యం, బ్యాంకింగ్, ప్రభుత్వ విత్తం. బి.ఎ. (ఎకానమిక్స్), డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం.
- ప్రభుత్వ అర్థశాస్త్రం. డా.బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

# 10 ప్రాచీన భారతదేశం

## 10.0 అభ్యసన ఫలితాలు

1. భారతీయ ప్రాచీన నాగరికతల విశేషాలను వివరిస్తారు.
2. సింధూ నాగరికత కట్టడాలను తెలియజేస్తారు.
3. తొలి, మలి వేద కాలపు సామాజిక, ఆర్థిక పరిస్థితులను పోలుస్తారు.
4. మౌర్య సామ్రాజ్య విస్తరణకు అనుకూలించిన పరిస్థితులను వివరిస్తారు.
5. శాతవాహనుల పరిపాలనా వ్యవస్థను ప్రస్తుత పాలనా వ్యవస్థతో పోలుస్తారు.
6. గుప్తుల కాలంలోని శాస్త్రసాంకేతికలపై కరపత్రం తయారు చేస్తారు.
7. భారతదేశ పటంలో మహాజన పదాలను, మౌర్య సామ్రాజ్య విస్తరణను, శాతవాహన సామ్రాజ్య విస్తరణను గుర్తిస్తారు.

## 10.1 పరిచయం

చరిత్ర అంటే కేవలం గడిచిన సంఘటనల సమాహారం మాత్రమే కాదు,అది మన భవిష్యత్తును నిర్మించుకోవడానికి ఉపయోగపడే పునాది. ఒక జాతి మూలాలు దాని చరిత్రలోనే లభిస్తాయి. మూల భారతీయ నాగరికతలైన సింధూ నాగరికత, వేద నాగరికత, మరికొన్ని ముఖ్యమైన సామ్రాజ్యాలను, వారి పరిపాలన వివరాలను, అప్పటి ప్రజల జీవన విధానాన్ని, ఆర్థిక, సాంఘిక, మత పరిస్థితులను, సంస్కరణలను వివరించడమే ఈ భాగం యొక్క ముఖ్యోద్దేశం.

## 10.2 సింధూ లోయ నాగరికత

భారతదేశానికి చెందిన ప్రాచీన నాగరికతను హరప్పా నాగరికత లేదా సింధూ నాగరికత అంటారు. ఈ నాగరికత సాధారణ శకానికి పూర్వం 4,000 నుండి సాధారణ శకానికి పూర్వం 1750 వరకు విలసిల్లింది. 1921లో జరిపిన తవ్వకాల ఫలితంగా పశ్చిమ పంజాబ్ (నేటి పాకిస్తాన్)లోని రావి నదీ తీరాన మొదటిసారిగా ఈ నాగరికత బయల్పడింది. ఈ నాగరికత వ్యాప్తి ఉత్తరాన జమ్ము నుండి దక్షిణాన మహారాష్ట్ర వరకు, పశ్చిమాన బెలూచిస్తాన్ నుండి తూర్పున మీరట్ వరకు విస్తరించి ఉండేది.

### 10.2.1 హరప్పా సంస్కృతి-నగర నిర్మాణం

**చెప్పండి**

నేడు నిరంతరంగా విస్తరిస్తున్న నగరాల పెరుగుదలకు కారణాలేమై ఉన్నాయో ఆలోచించండి.



*చిత్రం-10.1: హరప్పా పట్టణం*

మొహంజోదారో (మొహంజోదారో అనగా 'మృతుల నగరం' అని అర్థం), హరప్పా, చన్హుదారో, లోథాల్, కాలిబంగన్ మొదలైన నగరాలు భారతదేశంలో తొలి నగరీకరణ ఫలితాలు. ఎప్పుడైతే వ్యవసాయం అభివృద్ధి చెంది వ్యవసాయ ఉత్పత్తుల మిగులు సాధిస్తామో అప్పుడే నగరాల నిర్మాణం జరుగుతుందనేది గమనించవలసిన విషయం. 'మొహంజోదారో' పట్టణం సింధూ నదీ తీరంలో నిర్మితమైంది. 'హరప్పా' పట్టణం పంజాబ్‌లోని రావి నదీ తీరంలో నిర్మితమైంది. తరువాత కాలపు తవ్వకాలలో బయటపడిన కాలిబంగన్ రాజస్థాన్‌లో ఉంది. ఇంకా అనేక చోట్ల చాలా చిన్న, పెద్ద పట్టణాలు విస్తృతంగా బయల్పడ్డాయి. ఈ పట్టణాలన్నీ కూడా ఉత్తర దక్షిణాలుగా 950 మైళ్ల నిడివిన ఏకరూప నిర్మాణ పద్ధతిలో నిర్మించబడ్డాయి. ఈ నిర్మాణాలన్నీ కూడా ఒక ప్రణాళిక ప్రకారం జరిగినట్లు తెలుస్తుంది. ప్రధాన వీధులు ఉత్తర దక్షిణాలుగా, వీటిని కలిపే చిన్న వీధులు తూర్పు పడమరలుగా ఏర్పరచబడ్డాయి. గాలి ప్రసారం, పరిశుభ్రతల కొరకు ఈ విధంగా నిర్మించుకున్నారు. చాలా నివాస గృహాలలో స్వంత బావులు, స్నానపు గదులు ఉన్నాయి, అలాగే ప్రతి వీధికి ఒక ఉమ్మడి బావి కూడా ఉండేది.

### 10.2.2 మురుగు కాలువలు

ఈ నగరాల్లో ఒక పద్ధతి ప్రకారం మురుగు కాల్వల నిర్మాణం జరిగింది. నివాస గృహాల నుండి వెలువడే మురుగు కాలువలు, వీధి పక్కన గల ప్రధాన మురుగు కాలువలోకి ప్రవహించేవి. వీధి కాలువలోకి నివాస గృహాల కాలువలు కలిసే చోట మనుషులు దూరేటంత రంధ్రాలు (Man holes) ఉండేవి. ఇంతటి విశిష్టమైన మురుగు నీటి కాల్వల నిర్మాణం మరే ఇతర ప్రాచీన నాగరికతలో లేదు.

### 10.2.3 పౌర నిర్మాణాలు

వీటిలో ముఖ్యంగా పేర్కొనదగినవి మొహంజోదారోలో కనిపించే మహా స్నానవాటిక. దీని పొడవు ఉత్తర దక్షిణాలుగా 55 మీటర్లు, వెడల్పు తూర్పు పడమరలుగా 33 మీటర్లు కలదు. ఉత్తర, దక్షిణ దిక్కులలో మెట్ల వరసలు కూడా ఉండేవి. ఈ స్నానవాటికలోకి వేడి నీటిని పంపే ఏర్పాటు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. హరప్పాలో

కనిపించే ధాన్యాగారం, విశాలమైన ఒక పెద్ద భవనం, కోట మరియు కార్మికుల నివాస గృహాలు ఈ రెండు నగరాల్లో కనిపించే ముఖ్యమైన నిర్మాణాలు.

### 10.2.4. మత విశ్వాసాలు, ఆచారాలు



చిత్రం-10.2: అమ్మతల్లి



చిత్రం-10.3: పశుపతి



చిత్రం-10.4: మహా స్నానవాటిక

ఇప్పటి వరకు లభించినటువంటి విగ్రహాలలో స్త్రీమూర్తుల విగ్రహాలు అధికంగా లభించాయి. ఇవన్నీ ప్రకృతి స్వరూపిణి, శక్తి స్వరూపిణి అయిన అమ్మతల్లి (Mother Goddess) విగ్రహాలు.

కొమ్ములు గల తల పాగ ధరించిన పురుష దేవతామూర్తి విగ్రహం ఒక ముద్రలో కనిపిస్తుంది. ఈ దేవతామూర్తి అర్ధనిమీలిత నేత్రాలతో పద్మాసనంలో ఆసీనుడై ఉన్నాడు. ఈ చిత్రం మూడు ముఖాలు కలిగిన పశు పతిగా, మహా యోగిగా, శివునిగా చూపుతోంది. కొన్ని ముద్రల్లో వృషభం, ఏనుగు, మహిషం, సర్పం, అశ్వత్థ వృక్షం (రావి చెట్టు), అగ్ని, నీరు కూడా కనిపిస్తాయి. ఇది ప్రకృతి శక్తుల ఆరాధనను స్ఫురింపజేస్తుంది. నేడు మనం చేస్తున్న పర్యావరణ పరిరక్షణను 4 వేల ఏళ్ల క్రితమే సింధూ ప్రజలు ప్రకృతి శక్తుల రూపంలో పాటించినట్లు మనం అర్థం చేసుకోవాలి.

**మీ ప్రగతిని పరీక్షించుకోండి**

1. సింధూ ప్రజల నిర్మాణ కౌశలాలను గురించి రాయండి.
2. సింధూ ప్రజల మత పరిస్థితులను వివరించండి.

**చెప్పండి**

మీ ప్రాంతంలో ఏయే సందర్భాల్లో ఏయే దేవతలను ఆరాధిస్తున్నారు

## 10.3 వైదిక నాగరికత-వాఙ్మయం

భారతీయ సంస్కృతీ, సమాజాల పరిణామ క్రమంలో, సాధారణ శకానికి పూర్వం 1500 నుండి 600 వరకు విస్తరించిన వైదిక యుగం ఎంతో ముఖ్యమైనది. వైదిక వాఙ్మయం భారతదేశంలో మొట్ట మొదటి వాఙ్మయం మాత్రమేకాక, వైదిక యుగం గురించి తెలుసుకోవడానికి అది ప్రాథమిక ఆధారం కూడా. వేదాలలో మొదటిది 'ఋగ్వేదం' మిగతా మూడింటి కంటే ప్రాచీనమైనది. సామ, యజుర్, అధర్వణ వేదాలు తర్వాత కాలానికి చెందినవి.

### 10.3.1 ఋగ్వేద కాలపు నాగరికత

తొలి ఆర్యులు సప్త సింధు (సతుద్రి (సట్లెజ్), పరుషిణి (రావి), విపాస (బియాస్), వితస్త (జీలం), అసికిని (చీనాబ్), సింధు, సరస్వతి) ప్రాంతంలో నివసించినట్లు ఋగ్వేదం ద్వారా తెలుస్తుంది. ఋగ్వేదంలో సరస్వతీ

నదిని 'నదీ తమ (నదులలో ముఖ్యమైనది)'గా కీర్తించారు. ఈ కాలంలోని ప్రజలు గణ సమాజాలుగా సట్లెజ్-యమునా నదుల మధ్య ప్రాంతంలో నివసించేవారు. 'బ్రహ్మావర్తం'గా వ్యవహరింపబడిన ఈ ప్రాంతమే సప్తసింధు ప్రాంతం. ఆర్యులు సంస్కృత భాషను ఉపయోగించే వారు. ఋగ్వేద ఆర్యుల ప్రధాన వృత్తి పశు పోషణ అయినప్పటికీ వారికి ప్రాథమిక వ్యవసాయం కూడా పరిచితమే. వారి జీవన సంస్కృతిలో ఆవుకు ప్రముఖ స్థానం ఉండేది.

### 10.3.2 సాంఘిక, ఆర్థిక వ్యవస్థలు

ఋగ్వేద కాలం చివరలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర అనే నాలుగు వర్ణాలు ఏర్పడ్డాయి. ఈ విభజన వృత్తులపై ఆధారపడింది. ఋగ్వేద ఆర్యులు దాదాపు సంచార జీవనం గడిపారు. వారి ఆర్థిక వ్యవస్థ పశు పోషణ, ప్రాథమిక వ్యవసాయ మిశ్రమంగా ఉండేది. అశ్వానికి కూడా తగినంత ప్రాముఖ్యత కలదు. రథ ఛోదనలోను, యుద్ధాలలోనూ ఉపయోగపడే జంతువు కావడంతో ప్రాముఖ్యత సంతరించుకొంది. గొర్రె, మేక వంటి జంతువులను మచ్చిక చేసుకుని వాటి నుంచి వచ్చే ఉన్ని ద్వారా వస్త్రాలను తయారు చేసుకునేవారు. పశువులు వ్యక్తిగత ఆస్తిగా ఉంటే, భూమి తెగల ఉమ్మడి ఆస్తిగా ఉండేది. వృత్తి కళాకారులయిన వడ్రంగులు బండ్లు, రథాలను తయారు చేసేవారు. నేత పనివారు, చర్మకారులు, కుమ్మరి, కమ్మరి మొదలైన వృత్తి వర్గాల వారు సమాజంలోని ప్రజల అవసరాలను తీర్చేవారు.

### 10.3.3 మలి వేద కాలపు నాగరికత

సాధారణ శకానికి పూర్వం 1000 నుండి 500 మధ్య గల కాలానికి చెందిన ఈ యుగంలో, ఆర్యుల జీవన విధానానికి చెందిన ప్రతి అంశంలో విశేషమైన మార్పును మనం గమనించవచ్చు. ఈ మార్పులను తెలుసుకునేందుకు, వాఙ్మయ గ్రంథాలు, ఇటీవలి కాలంలో కనుగొనబడ్డ పురావస్తు పరికరాలు, ఆయుధాలు ఆధారాలుగా ఉన్నాయి.

### 10.3.4 సాంఘిక, ఆర్థిక వ్యవస్థలు

తొలి వేద కాలంలో నిరాడంబరంగా ఉన్న సమాజం, మలి వేద కాలంలో కొంత క్లిష్టమైనట్లుగా కనిపిస్తుంది. పుట్టుక, వర్ణం ఆధారంగా క్రమానుగత సమాజం రూపుదిద్దుకొంది. ఈ సమయంలో బ్రాహ్మణులు పౌరోహిత్యానికి, క్షత్రియులు రాజ్య పాలనకు, వైశ్యులు వ్యవసాయానికి, పశు పోషణకు స్థిరపడగా శూద్రులు సమాజంలోని వివిధ వృత్తులలో స్థిరపడినారు.

ఈ యుగం స్థిర వ్యవసాయం, పశు పోషణపై ఆధారపడింది. వ్యవసాయంలో పశువుల వాడకం నాడు సర్వ సాధారణమైంది. వ్యవసాయ కార్యకలాపాల గురించి, త్రవ్వకాలలో నాణేలు లభ్యం కాకపోయినా డబ్బు ప్రస్తావన గురించి 'శతపథ బ్రాహ్మణం' వివరంగా వర్ణించింది.

#### మీ ప్రగతిని పరీక్షించుకోండి


1. తొలి వేద కాలపు సాంఘిక, ఆర్థిక వ్యవస్థ గురించి తెలపండి.
2. మలి వేద కాలపు సాంఘిక ఆర్థిక వ్యవస్థను గురించి వివరించండి.

## 10.4 మహాజన పదాలు

ఈ మహా జనపదాలలో కనిపించే రాజ్య వ్యవస్థ – పాలనా సిద్ధాంతాలు దాదాపుగా ఆధునిక రాజ్యాల లక్షణాలను ప్రతిఫలించేవిగా ఉన్నాయి. జైన సారస్వతం పేర్కొన్న ఈ మహాజన పదాలు అంగ, మగధ, వజ్జి, మల్ల (మధ్యగంగా ప్రాంతంలో), వాటికి పశ్చిమంగా కాశీ, కోసల, వత్స, ఇంకాస్త పశ్చిమంగా కురు, పాంచాల, మత్స్య, శూరసేన, వాయవ్య దిశలో కాంభోజ, గాంధార, మధ్య భారతంలో అవంతి, చేది, దక్షిణంలో గోదావరి ప్రాంతంలో అశ్మక. వీటిలో వజ్జి, మల్ల గణ రాజ్యాలు.

### 10.4.1 జైన మతం

సాధారణ శకానికి పూర్వం 540లో వైశాలికి చెందిన రాజ కుటుంబంలో జన్మించిన మహావీరుడు జైన మతాన్ని లాంఛనంగా ప్రారంభించాడు. తన బోధనలను ప్రచారం చేయడానికి పూర్వమే వృషభనాథుడు మొదలుగా గల తీర్థంకరుల బోధనలను క్రోడీకరించి జైన మతాన్ని వ్యవస్థీకరించాడు. ఇతను 30 సంవత్సరాల వరకు రాజ కుటుంబ జీవనం గడిపాడు. సత్యాన్వేషణ కొరకు కుటుంబ జీవనాన్ని పరిత్యజించాడు. దాదాపు 12 సంవత్సరాల కఠిన తపస్సు తర్వాత ఇతనికి జ్ఞానోదయమై కైవల్య ప్రాప్తి లభించి జినుడు (దుఃఖాన్ని జయించినవాడు) అయ్యాడు. ఇతను ఐదు ప్రధాన సూత్రాలను బోధించాడు. అవి: 1. అహింస, 2. సత్యం, 3. దొంగతనం చేయకుండుట, 4. ఇతరుల ఆస్తిని అపహరించకుండా ఉండుట, 5. బ్రహ్మచర్యాన్ని పాటించుట.




*పటం–10.1: మహా జనపదాలు*

### 10.4.2 బౌద్ధ మతం

బౌద్ధ మత స్థాపకుడు గౌతమబుద్ధుడు. ఇతడు సాధారణ శకానికి పూర్వం 563లో జన్మించాడు. జ్ఞానోదయానికి పూర్వం అతని పేరు సిద్ధార్థుడు. కపిలవస్తుకు చెందిన క్షత్రియుడు. తన 29వ సంవత్సరం వరకు రాజ కుటుంబ జీవనం గడిపాడు. తర్వాత కుటుంబ జీవనానికి స్వస్తి చెప్పి సత్యాన్వేషణకై బయలుదేరి ప్రపంచంలో గల దుఃఖాలను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించి, చివరికి జ్ఞానోదయం పొందాడు. బుద్ధుడు 4 ఆర్య సత్యాలను ప్రవచించాడు. అవి 1 .ప్రపంచమంతా దుఃఖమయం, 2. దుఃఖానికి కారణం కోరికలు, 3. దుఃఖం నుండి విముక్తి (కోరికలను జయించుట), 4. దుఃఖం నుండి విముక్తిని పొందే మార్గం (అష్టాంగ మార్గం).

## 10.5 మౌర్య సామ్రాజ్యం

భారతదేశ చరిత్రలో మౌర్య వంశ స్థాపన ఒక నూతన అధ్యాయానికి నాంది పలికింది. మౌర్యుల కాలంలోనే భారతదేశమంతా ఏకం చేయబడి, ఉత్తరాన హిమాలయాల నుండి దక్షిణాన తుంగభద్ర నది వరకు విస్తరించింది. మౌర్యుల చరిత్రను తెలుసుకోవడానికి ఎన్నో లౌకిక, మత పరమైన ఆధారాలు లభిస్తున్నాయి. లౌకిక గ్రంథాలలో కౌటిల్యుని అర్థ శాస్త్రం, మెగస్తనీస్ ఇండికా గ్రంథం, విశాఖదత్తుని ముద్రారాక్షసం మొదలైనవి నాటి విశేషాలను తెలుపుతున్నాయి. పురావస్తు ఆధారాలలో అశోకుని శిలా శాసనాలు, దశరథుని నాగార్జునకొండ శాసనాలతో పాటు నాటి పాటలీపుత్ర నగర అవశేషాలు, నాణెములు, మృణ్మయపాత్రలు, నాటి వాస్తు శిల్పాలతో నాటి ఆర్థిక వ్యవస్థ, పరిపాలనా వ్యవస్థ, మతం మొదలైన వాటి గురించి తెలుసుకోవచ్చు.

### 10.5.1 ముఖ్యమైన రాజులు-సంక్షిప్త చరిత్ర

**చంద్రగుప్త మౌర్యుడు:** ఇతడు మౌర్య సామ్రాజ్య స్థాపకుడు. అతనిని "భారతదేశ మొదటి చారిత్రక చక్రవర్తి" అంటారు. సాధారణ శకానికి పూర్వం 324లో మగధను పాలిస్తున్న నందవంశపు చివరి రాజైన ధననందుడిని ఓడించి చంద్రగుప్త మౌర్యుడు మౌర్య సామ్రాజ్య స్థాపనకు పునాది వేశాడు. ఇతనికి అర్థశాస్త్రాన్ని రచించినటు వంటి చాణక్యుడు మంత్రిగా ఉండి రాజ్య పాలనలో సహాయపడ్డాడు.

**బిందుసారుడు:** చంద్రగుప్తుని కుమారుడైన బిందుసారుడు మౌర్య సామ్రాజ్యానికి రెండవ చక్రవర్తి. ఇతడు తన తండ్రి నెలకొల్పిన సామ్రాజ్యాన్ని రక్షించడమేకాక, దాన్ని ఇంకా విస్తరించాడు. ఇతనికి 'అమిత్రఘాత' అనే బిరుదు కలదు.

**అశోకుడు:** బిందుసారుని వారసుడైన అశోకుడు ప్రపంచ చరిత్రలోని గొప్ప చక్రవర్తులలో ఒకడు. అశోకుడు యువరాజుగా ఉన్నప్పుడే అవంతి, తక్షశిల రాష్ట్రాలకు రాజ ప్రతినిధిగా వ్యవహరించాడు. ఇతను సాధారణ శకానికి పూర్వం 268లో సింహాసనాన్ని అధిష్టించాడు. అశోకుని ఉన్నత లక్ష్యాలు, ఆదర్శ భావాలు, పరిపాలన కాలంలోని ముఖ్య సంఘటనల గురించి తెలుసుకోవడానికి, దేశంలో వివిధ ప్రాంతాల్లో అతను వేయించినటువంటి శిలా, స్తంభ శాసనాలు బాగా ఉపయోగపడతాయి. భారతదేశ చరిత్రలో ఇలాంటి శాసనాలు వేయించిన మొదటి చక్రవర్తి అశోకుడు. ఈ శాసనాల్లో అశోకుడికి 'దేవానాంప్రియ' (దేవతలకు ప్రియమైనవాడు), 'ప్రియదర్శి' (చక్కని రూపము కలవాడు) అనే బిరుదులున్నాయి.

### 10.5.2 కళింగ యుద్ధం – అశోకధమ్మ లేదా ధర్మ సిద్ధాంతం

అశోకుని జీవితంలోనే కాక భారత చరిత్రలో కూడా కళింగ యుద్ధానికి చాలా ప్రాముఖ్యత ఉంది. ఆధునిక కాలంలో ఒరిస్సా అని పిలువబడుతున్న కళింగ రాజ్యానికి, అశోకుని కాలంలో చాలా సైనిక, ఆర్థిక ప్రాముఖ్యత ఉండింది. దీని గురించి అశోకుడు తన 13వ శిలా శాసనంలో తెలియజేశాడు. ఈ యుద్ధంలో లక్ష మంది చనిపోయారని, లక్షన్నర మంది నిరాశ్రయులయ్యారని, రెండు లక్షల మంది గాయపడ్డారని అశోకుడు విలపించాడు. ఆ యుద్ధంలో జరిగిన ఘోర విధ్వంసకాండ అశోకుడి హృదయాన్ని తీవ్రంగా కదిలించింది. దాంతో ఇక యుద్ధాలు చేయనని, పూర్తిగా శాంతికి కట్టుబడతానని, ఆయుధాలు పట్టనని ప్రకటించి బౌద్ధమతాన్ని స్వీకరించాడు. అయితే ప్రపంచ చరిత్రలో యుద్ధంలో గెలిచిన తర్వాత ఇక యుద్ధాలు చేయనని ప్రకటించిన రాజు మరొకరు లేరు.

తన ప్రజల శ్రేయస్సు కోసం అశోకుడు తీవ్ర కృషి చేశాడు. మనిషిని సత్ప్రవర్తన దిశగా మార్చడమే అతని ధ్యేయం. దాన్నే అతడు ధర్మంగా భావించాడు.దానికోసం ప్రజలకు కొన్ని విశిష్టమైన ఆచరణ మార్గాలను సూచించాడు. తల్లిదండ్రులను, పెద్దలను, గురువులను గౌరవించడం, సత్యవాక్య పరిపాలన, దయ, దాన గుణం, సత్యం, శుచి, సహనం మొదలైన వాటిని అలవర్చుకోవాలని, క్రౌర్యాన్ని, క్రోధాన్ని, అహాన్ని, అసూయను విడనాడవలసిందిగా విజ్ఞప్తి చేశాడు. సాటి మానవులనే కాకుండా జంతువులతో కూడా దయతో మెలగాలని బోధించాడు. జంతువుల కోసం ప్రత్యేకమైన ఆసుపత్రులను నిర్మించాడు, బాటసారుల కోసం రహదారుల ప్రక్కన బావులు తవ్వించాడు, సేదతీరుటకు ఇరువైపులా మొక్కలు నాటించాడు.

### 10.5.3 మౌర్యులు-పరిపాలన

మౌర్యుల కాలంలో రాజుకు అనేక అధికారాలున్నాయి. మంత్రులను, ముఖ్య అధికారులను నియమించి వారిని అజమాయిషీ చేయడం, ప్రభుత్వ నియమాలను, చట్టాలను రూపొందించడం, న్యాయ పరిపాలన మొదలైనవి రాజుకు గల ముఖ్య అధికారాలు. రాజుకు అపారమైన అధికారాలునప్పటికీ అతడు నిరంకుశుడు కాడు. ఆ రోజుల్లో రాజు తండ్రి వంటి వాడనే అభిప్రాయంఉండేది. “తల్లిదండ్రులు తమ పిల్లలను సరైన సంరక్షకులకు అప్పజెప్పినట్లు, నేను నా ప్రజల యోగ క్షేమాల బాధ్యతను ‘రాజుక’ వంటి అధికారులకు అప్పజెప్పాను” అని అశోకుడు తన నాల్గవ స్తంభ శాసనంలో ప్రకటించాడు. “ప్రజల సుఖమే రాజు సుఖం, వారి సంక్షేమమే రాజు సంక్షేమం. రాజు క్షేమం తన సుఖం వల్ల కాకుండా తన ప్రజల సుఖం వల్ల లభిస్తుంది” అని కౌటిల్యుడు అర్థశాస్త్రంలో వ్యాఖ్యానించాడు.

### 10.5.4 ఆర్థిక వ్యవస్థ

మౌర్యుల కాలంలో ఆర్థిక వ్యవస్థ ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడి ఉండేది. ఎక్కువ శాతం ప్రజలు గ్రామాలలో నివసించేవారు. వ్యవసాయానికి నీటి పారుదల వనరులను ప్రభుత్వమే ఏర్పాటు చేసేది. పరిశ్రమల వల్ల కూడా ప్రజలకు జీవనాధారం లభించేది. నేత పరిశ్రమ, వడ్రంగం, ఆయుధాల పరిశ్రమ, గృహోపకరణాల ఉత్పత్తి, వ్యవసాయ పనిముట్ల తయారీ, భవన నిర్మాణం, కుమ్మరి మొదలగు పరిశ్రమల వల్ల ప్రజలకు జీవనాధారం లభించేది. ప్రతి వస్తువు మీద ఆ వస్తువు తయారైన తేదీని కూడా ముద్రించేవారు. దాని వల్ల ప్రజలకు పాత, కొత్త వస్తువుల వ్యత్యాసం తెలిసేది.

## 10.6 కుషాణులు

మౌర్యుల పాలన అంతమైన తరువాత ఉత్తర, వాయవ్య భారతంలో ప్రధానంగా ఇండో గ్రీకులు, పార్థీనియన్లు, కుషాణులు మొదలైనవారు ఆధిపత్యం వహించారు. వీరిలో కుషాణులు ఎక్కువ ప్రభావం చూపారు.

### 10.6.1 కనిష్కుడు

కుషాణులలో ముఖ్యమైనవాడు కనిష్కుడు. ఈయన కాలంలో జారీ చేయబడిన శాసనాలు, నూతన శకం మొదటి సంవత్సరంలో గణన చేయబడ్డాయి. టంకశాలలో తయారు చేయబడిన బంగారు నాణాలపై వివిధ మతాలకు చెందిన దేవతల బొమ్మలు చిత్రించబడ్డాయి. కనిష్కుని విజయ పరంపర అంచెల వారీగా సాధించబడింది. విశాలమైన భూభాగంపై అధిపత్యం చెలాయించాడని, ఆయన శాసనాలు దొరికిన ప్రాంతాల వల్ల నిరూపణమౌతుంది.

### 10.6.2 పాలనా వ్యవస్థ


కుషాణులు దైవదత్త అధికారాన్ని విశ్వసించారు. అయినప్పటికీ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలించారు. రాజ్యాన్ని ఆహారం, జనపదం, విషయం అనే విభాగాలుగా విభజించారు. పాలనలో దండనాయక అనే ప్రాంతీయ నాయకులు రాజుకు సైనిక, పౌరపాలనలో సహకరించేవారు. 'రాజామాత్య' రాజుకు ప్రధాన సలహాదారు. గ్రామ పాలనను గ్రామిక, భద్రపాల అనే అధికారులు నిర్వహించేవారు.

### 10.6.3 ఆర్థిక వ్యవస్థ

కుషాణుల పాలనలో ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయం. దానితో పాటు ప్రజలు వివిధ వృత్తులను అనుసరించేవారు. వారిలో కమ్మరులు, కుమ్మరులు, స్వర్ణకారులు, గాజు సామాగ్రి తయారీదారులు, దంతపు వస్తువుల తయారీదారులు మొదలైనవారు కలరు. కుషాణుల కాలంలో దేశీయ, విదేశీ వ్యాపారం గణనీయంగా అభివృద్ధి చెందింది. దాంతో వ్యాపారంలో నాణేల వాడకం కూడా పెరిగింది. రోమ్‌తో వ్యాపారం ఉచ్ఛస్థితిలో సాగింది. రోమ్ నుండి పెద్ద మొత్తంలో బంగారం భారతదేశానికి చేరింది. కుషాణులు 'దినార్' అనే బంగారు నాణాన్ని, 'కర్షాపణ' అనే రాగి నాణాన్ని జారీ చేశారు.

### 10.6.4 గాంధార శిల్పకళ

కుషాణుల కాలం గాంధార శిల్పకళకు ప్రసిద్ధి చెందింది. కనిష్కుని కాలంలో ఈ కళకు ప్రత్యేక ప్రోత్సాహం లభించింది. గాంధార శిల్పకళనే ఇండో-గ్రీకు శిల్పకళ అని కూడా పిలుస్తారు. దీనిలో ఎంతో మంది భారతీయ శిల్పులతో పాటు గ్రీకు, రోమ్ శిల్పులు కూడా పాల్గొన్నారు. దీనిముఖ్య లక్షణాలను పరిశీలించినట్లయితే రింగులు తిరిగిన జుట్టు, బలిష్టమైన శరీరం, వెంట్రుకల ముడి, త్రిముఖ భంగిమలు, సగం తెరిచిన కళ్ళు, చిరునవ్వుతో గల ముఖం ప్రముఖంగా చూడగలం. గాంధార శిల్పకళ బౌద్ధ మతంతో ఎంతో అనుబంధం కలిగి ఉంది. బుద్ధుని జీవితంలోని ప్రధాన ఘట్టాలను శిల్ప రూపంలో గాంధార శిల్పకళ ప్రతిబింబించింది. ఈ గాంధార శిల్పకళ, మధుర శిల్పకళ, అమరావతి శిల్పకళలను ప్రభావితం చేసింది.



*చిత్రం-10.5: గాంధార శైలిలో చెక్కబడిన బుద్ధుడి శిల్పం*

#### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. కళింగ యుద్ధం తరువాత అశోకునిలో కలిగిన పరివర్తనను, దాని పరిణామాలను తెలియజేయండి.
2. మౌర్యుల పరిపాలన-ఆర్థిక పరిస్థితులను వివరించండి.
3. గాంధార శిల్పకళ ప్రత్యేకతను తెలియజేయండి.

## 10.7 శాతవాహనులు

దక్షిణ భారతదేశంలో మొట్ట మొదటి స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించిన ఘనత శాతవాహనులకు దక్కుతుంది. అశోకుని మరణానంతరం మౌర్యుల బలహీనతను గమనించి వీరు స్వతంత్రులైనారు. ఉత్తర భారతం విదేశీయులైన

శకులు, కుషాణులు, ఇండో-గ్రీకుల దాడులకు గురవుతున్న సమయంలో, దక్కన్ ప్రాంతాన్ని ఏకం చేసి శాంతిని, స్థిరత్వాన్ని సాధించారు.

### 10.7.1 రాజకీయ చరిత్ర

శాతవాహనులు సుమారుగా సాధారణ శకానికి పూర్వం 230 నుండి సాధారణ శకం 220 వరకు 450 సంవత్సరాలు పరిపాలించారు.

### 10.7.2 ముఖ్యమైన రాజులు సంక్షిప్త చరిత్ర

**శ్రీముఖుడు:** శాతవాహన వంశ స్థాపకుడు శ్రీముఖుడు. ఇతను అశోకుని మరణానంతరం తన స్వతంత్రతను ప్రకటించుకున్నాడు.

**రెండవ శాతకర్ణి:** రెండవ శాతకర్ణి సుదీర్ఘంగా 56 సంవత్సరాల పాటు పాలించాడు. ఇతడు శకులను ఓడించి మధ్యప్రదేశ్ ప్రాంతాన్ని ఆక్రమించాడు.

**హాలుడు:** శాతవాహనులలో మరొక పాలకుడు హాలుడు. ఇతడు అనేక మంది కవి పండితులను పోషించాడు. స్వయంగా కవి, 'గాథాసప్తశతి' అనే గ్రంథాన్ని రచించాడు.

**గౌతమీపుత్ర శాతకర్ణి:** శాతవాహన వంశంలోనే కాకుండా దక్షిణ భారతదేశాన్ని పాలించిన రాజులలోకెల్లా మొదటి గొప్ప పాలకుడు. ఇతని విజయాల గురించి ఇతని తల్లి బాలశ్రీ వేయించిన 'నాసిక్ శాసనం' తెలుపుతుంది. ఇతని సామ్రాజ్యం ఉత్తరాన రాజస్థాన్ నుంచి దక్షిణాన వైజయంతి వరకు విస్తరించింది. నాసిక్ శాసనం ఇతనిని 'త్రిసముద్ర తోయపీతవాహన', 'క్షత్రియ దర్పమాన మర్దన', 'ఆగమ నిలయ', 'ఏకబ్రాహ్మణ' అని పేర్కొంటుంది.

### 10.7.3 పరిపాలనా వ్యవస్థ

దక్కన్ ప్రాంతాన్ని ఏకం చేయడమే కాకుండా ఈ ప్రాంతాన్ని అన్ని విదేశీ శక్తుల నుండి కాపాడిన ఘనత శాతవాహనులకు దక్కుతుంది. శాతవాహనుల పాలనా వ్యవస్థ మౌర్యుల పాలన వ్యవస్థను పోలి ఉంటుంది. వంశ పారంపర్యమైన రాచరిక వ్యవస్థను వీళ్లు అవలంభించారు. దైవదత్తాధికారాన్ని విశ్వసించక 'రాజన్' అనేబిరుదుతో తృప్తి చెందారు. నిరంకుశ అధికారాన్ని పాటించక ధర్మబద్ధులై పాలించారు. యువరాజులు పాలనలో అనుభవం గడించడానికి వారిని కుమారామాత్యులుగా నియమించేవారు. రాజుకు పరిపాలనలో సహకరించడానికి మంత్రి మండలి ఉండేది.

శాతవాహనులు తమ రాజ్యాన్ని జనపదాలుగా, ఆహారాలుగా, విషయాలుగా, గ్రామాలుగా విభజించారు. జనపదాలపై రాజకుమారులే పాలకులుగా ఉండేవారు. ఆహారానికి అమాత్యులు పాలనాధికారులు. పరిపాలనలో చివరిదైన గ్రామానికి 'గ్రామణి' పాలకుడు. గ్రామ సభలు అతనికి పాలనలో సహకరించేవి.

### 10.7.4 సమాజం

శాతవాహనుల సమాజంలో కుల వ్యవస్థ పూర్తిగా స్థిరపడలేదు. బ్రాహ్మణులు వేదాధ్యయనం చేసి, యజ్ఞ నిర్వహణ చేయగా, క్షత్రియులు రాజ్యపాలనకు అవసరమైన విద్యలు అభ్యసించి పాలకులుగా ఎదిగేవారు. వైశ్యులు వర్తక వ్యాపారాలు నిర్వహించేవారు. శూద్రులు వ్యవసాయం, వివిధ వృత్తులు నిర్వహిస్తుండేవారు.

వృత్తుల విషయంలో ఎవరు ఏ వృత్తినైనా స్వీకరించవచ్చు. సమాజంలో ఉమ్మడి కుటుంబం సర్వసాధారణం. పితృస్వామ్య కుటుంబ వ్యవస్థ ఉండేది. స్త్రీలకు సమాజంలో గౌరవ స్థానం ఉంది. నాటి స్త్రీలు స్వయంగా దాన ధర్మాలు నిర్వహించేవారు. విద్యావంతులైన ఉన్నత వర్గాల మహిళలు సభా సమావేశాలలో, చర్చా వేదికలో పాల్గొనేవారు. నాటి శాతవాహన పాలకులు తమ పేర్లకు ముందు తమ తల్లిపేరు ధరించడం నాటి స్త్రీలకు గల ప్రాధాన్యతను తెలుపుతుంది. వితంతు పునర్వివాహాలు లేవు.

### 10.7.5 ఆర్థిక వ్యవస్థ

శాతవాహన కాలంలో దక్షిణ భారతదేశం ఆర్థికంగా చక్కని పురోగతి సాధించింది. వ్యవసాయం, పరిశ్రమలు, దేశీయ, విదేశీ వ్యాపారం ప్రగతి పథంలో ఉన్నాయి. నాటి ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయం. వరి, చెరకు, గోధుమ, నూనె గింజలు మొదలైనవి ప్రధాన పంటలు. వ్యవసాయంతో పాటు పశుపోషణ అనుబంధ వృత్తిగా ఉండేది. నాటి వృత్తి వర్గాలలో కొలికలు (నేత పనివారు), కులిక (కుమ్మరి), తిలపిసక (గానుగవారు), కమ్మర్ (ఇనుప పనివారు), సువర్ణక (స్వర్ణకారులు), వధిక (వడ్రంగులు) మొదలైన వారు ఉన్నారు. వివిధ వర్గాల వారు వృత్తి సంఘాలను ఏర్పరుచుకున్నారు. వాటిని శ్రేణులు అని పిలిచేవారు. శ్రేణి పెద్దను శ్రేష్టి అనే వారు. శ్రేణులు నేటి బ్యాంకుల వలె ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించేవి. నాటి గ్రీకు రచనల ద్వారా దక్షిణ భారతదేశం వ్యాపారంలో ఎంతో పురోగతి సాధించిందని తెలుస్తోంది. పైథాన్, తగర, జున్నార్, నాసిక్, బనవాసి, విజయపురి, ధాన్యకటకం నాటి ప్రధాన వాణిజ్య కేంద్రాలు. ఈ నగరాలు రహదారులు, నదుల ద్వారా అనుసంధానించబడినవి. ఎడ్ల బండ్లు ముఖ్యమైన రవాణా సాధనాలు.

**మీ ప్రగతిని పరీక్షించుకోండి**

1. శాతవాహనుల కాలంలోని సమాజాన్ని గురించి వర్ణించండి.
2. శాతవాహనుల ఆర్థిక వ్యవస్థను గురించి వివరించండి.

## 10.8 గుప్త సామ్రాజ్యం

భారతదేశ చరిత్రలో గుప్తుల పాలనా కాలాన్ని స్వర్ణయుగంగా చరిత్రకారులు వర్ణించారు. కుషాణుల పతనానంతరం ఉత్తర భారతదేశం అనేక రాజ్యాలుగా విడిపోయింది. గుప్తులు ఈ చిన్న చిన్న రాజ్యాలను ఓడించి గొప్ప సామ్రాజ్యాన్ని నిర్మించారు. సుమారు 200 సంవత్సరాలు ఉత్తర భారతదేశంలో రాజకీయ సుస్థిరత, సమైక్యత సాధించగలిగారు.

### 10.8.1 ముఖ్యమైన రాజులు-సంక్షిప్త చరిత్ర

**శ్రీగుప్తుడు (సా.శ. 219 నుండి సా.శ. 280 వరకు):** గుప్తవంశ మూల పురుషుడు శ్రీగుప్తుడు. ఇతడు ఒక చిన్న రాజ్యాన్ని పాలిస్తూ 'మహారాజా' అనే బిరుదును ధరించాడు. కానీ ఎక్కువగా సామ్రాజ్య విస్తరణ చేయలేదు.

**మొదటి చంద్రగుప్తుడు (సా.శ. 320 నుండి సా.శ. 335 వరకు):** మొదటి గుప్త రాజులలో ప్రముఖుడు. 'మహా రాజాధిరాజా' బిరుదును ధరించాడు. ఇతడు గుప్త సామ్రాజ్యానికి గట్టి పునాది వేశాడు. చంద్రగుప్తుడి వివాహం లిచ్చవీ రాకుమారి 'కుమారదేవి'తో వివాహం జరగడం గుప్త సామ్రాజ్యం పటిష్టతకు కారణమైంది.

**సముద్రగుప్తుడు (సా.శ. 340 నుండి సా.శ. 380 వరకు):** సముద్రగుప్తుడి చరిత్రను తెలిపే ప్రాథమిక ఆధారాలలో ముఖ్యమైనది హరిసేనుడి అలహాబాద్ ప్రశస్తి, ఇదేకాకుండా శాసనాలు, నాణేలు కూడా కలవు. సముద్రగుప్తుడు గొప్ప యోధుడు, సామ్రాజ్య నిర్మాత, విజయవంతమైన సైన్యాధ్యక్షుడు, ఓటమి ఎరుగని వీరుడు. పశ్చిమంలో చంబల్ నది వరకు, ఉత్తరంలో ఉత్తర ప్రదేశ్, తూర్పున బెంగాల్ వరకు, దక్షిణాన దాదాపు అన్ని రాజ్యాలను జయించాడు. అయితే తన సార్వభౌమాధికారాన్ని ఒప్పుకున్న రాజులకు, కప్పం కట్టే షరతు పైన వారి రాజ్యాలను తిరిగిఇచ్చేశాడు.

**రెండవ చంద్రగుప్తుడు (సా.శ. 380 నుండి సా.శ. 415 వరకు):** రెండవ చంద్రగుప్తుడు గొప్ప పరాక్రమవంతుడు, సమర్ధుడైన పాలకుడు. తండ్రి ద్వారా సంక్రమించిన రాజ్యాన్ని యుద్ధాల ద్వారా, దౌత్య సంబంధాల ద్వారా మరింత సామ్రాజ్య విస్తరణ గావించాడు. ఇతడు శకరాజైన మూడవ రుద్రసింహుడ్ని ఓడించి గుజరాత్ వరకు తన సామ్రాజ్యాన్ని విస్తరించాడు.

### 10.8.2 పరిపాలనా వ్యవస్థ

రాజు సర్వాధికారి. రాజ్యాధికారం వంశపారంపర్యంగా వచ్చేది. రాజు తర్వాత ఆయన పెద్ద కుమారుడు రాజయ్యేవాడు. ఒకవేళ పెద్ద కుమారుడు సమర్థుడు కాకపోతే, సమర్థుడయినటువంటి ఇతర కొడుకులలో ఒకడిని రాజు వారసునిగా ప్రకటించేవాడు.

రాజుకు సలహాదారులుగా మంత్రులను నియమించేవారు. వారు వివిధ శాఖల పని తీరును పర్యవేక్షించేవారు. ప్రతి మంత్రి తప్పనిసరిగా సైన్యాన్ని నడిపించే దక్షత కలిగి ఉండాలి. కేంద్రంలో మంత్రులుగా మహామంత్రి, మహాబలాధీకృత, మహాదండనాయక, మహాప్రతిహారా, సంధివిగ్రహిక అని ఉండేవారు, జిల్లా అధికారులను కుమారామాత్యులు అనేవారు. వీరందరూ పాలన సమర్థవంతంగా జరిగేందుకు రాజుకు సహకరించేవారు. పరిపాలనా వికేంద్రీకరణ గుప్తరాజుల పాలన యొక్క ప్రత్యేకత.

గుప్తులు సామ్రాజ్యాన్ని ప్రాంతాలుగా విభజించారు. ఈ ప్రాంతాలను 'భుక్తి' లేదా 'దేశ' అని పిలిచేవారు. భుక్తి పాలనాధికారిని ఉపకరిక/ గోప్త్రి అని పిలిచేవారు. ఒకవేళ దీనికి రాజపుత్రులను అధికారిగా నియమిస్తే వారిని మహారాజపుత్ర/ దేవభట్టారక అని పిలిచేవారు. ప్రాంతాలను విషయాలుగా, విషయాలను మండలాలుగా, భోగాలుగా, గ్రామాలుగా విభజించారు. పాలనలో చిట్టచివరి విభాగం గ్రామం. విషయ పాలకుడిని విషయపతి అని పిలిచేవారు. గ్రామ స్థాయి అధికారులను గ్రామిక/ భోజక అని వ్యవహరించేవారు.

### 10.8.3 విద్య-సాహిత్యం

గుప్తుల కాలంలో శాస్త్ర, సాహిత్య, కళలు గొప్పగా అభివృద్ధి చెందాయి. దీనికి కారణం ఆనాటి ఆరోగ్యకరమైన విద్యా వ్యవస్థ. పాటలీపుత్రం, వల్లభి, ఉజ్జయిని, పద్మావతి అవరాపురం, వత్సగుల్మము, కాశీ, మధుర, నాసిక్, కంచి మొదలైనవి గొప్ప విద్యా కేంద్రాలుగా అభివృద్ధి చెందాయి. ఈ కాలంలో స్థాపించిన నలందా విశ్వవిద్యాలయం,

వల్లభి విశ్వవిద్యాలయం, తక్షశిల విశ్వవిద్యాలయం మొదలైనవి ప్రపంచ ప్రఖ్యాతిగాంచాయి. ఈ విశ్వవిద్యాలయాలు స్వయంప్రతిపత్తితో నడిచేవి. రాజులు, ధనవంతులు భూమి, ధనం, ఇతర వస్తు వాహనాల రూపంలో ఈ విశ్వవిద్యాలయాలకు విరివిగా విరాళాలిచ్చేవారు. ఈ విశ్వవిద్యాలయాలలో ప్రవేశం విద్యార్థి పూర్వ ప్రతిభ ఆధారంగా కల్పించేవారు. ఉచిత భోజన, నివాస వసతి కల్పించేవారు. విద్యార్థి సామర్థ్యం, ఉత్సాహం ఆధారంగా మత సంబంధ విద్య లేదా లౌకిక విద్యను బోధించేవారు. ఈ కాలంలో అనేక స్మృతులు, కావ్యాలు, గ్రంథాలు వ్రాయబడ్డాయి. వీటిలో ముఖ్యమైనవి సుబంధుని 'స్వప్నవాసవదత్త', భట్టి 'రావణవధ', భారవి 'కిరాతార్జునీయం', విశాఖదత్తుడి 'ముద్రారాక్షసం', శూద్రకుడి 'మృచ్ఛకటికం', దండి 'దశకుమార చరిత్ర' మొదలైనవి.



*చిత్రం-10.6: నలంద విశ్వవిద్యాలయం*

## 10.8.4 విజ్ఞాన సాంకేతిక రంగాలు

గుప్తయుగం విజ్ఞాన, సాంకేతిక శాస్త్రాలలో గొప్ప అభివృద్ధి సాధించింది. ముఖ్యంగా ఖగోళ, గణిత శాస్త్రాలలో భారతీయులు గ్రీకుల కంటే ముందే అభివృద్ధి సాధించారు. ఆర్యభట్ట గొప్ప గణిత శాస్త్రవేత్త. తన ఆర్యభట్టీయంలో బీజగణితం, రేఖాగణితం, జ్యామితిలోని కఠిన ప్రశ్నలకు సమాధానాలు కనుగొన్నాడు. తన సుప్రసిద్ధ రచన 'సూర్య సిద్ధాంతం'లో సూర్య, చంద్ర గ్రహణాలు సంభవించడానికి గల కారణాలను శాస్త్రబద్ధంగా, ఆధునిక విజ్ఞాన శాస్త్రవేత్తలతో సమానంగా నిరూపించాడు. దశాంశ విధానాన్ని చర్చించి 'శూన్యా'నికి (0) బీజగణితంలో ఉన్న ప్రాముఖ్యతను వివరించారు.

వరాహమిహిరుడు గొప్ప ఖగోళ శాస్త్రవేత్త. ఇతడు బృహత్ సంహిత, పంచ సిద్ధాంతికలను రచించాడు. బ్రహ్మగుప్తుడు బ్రహ్మ సిద్ధాంతాన్ని రూపొందించాడు. దీనిలో గ్రహాలు, నక్షత్రాల గురించిన ఆసక్తికరమైన వివరాలను పేర్కొన్నాడు. న్యూటన్ వ్యక్తీకరించిన గమన సూత్రాలు (భూమి గురుత్వాకర్షణ శక్తి) అతని కంటే శతాబ్దాల ముందుగానే వ్యక్తీకరించాడు. ఈ కాలంలో ఆయుర్వేదం కూడా బాగా అభివృద్ధి చెందింది. 'నవనీతకం' ఈ కాలంలోని గొప్ప ఆయుర్వేద గ్రంథం. పశు వైద్యం కూడా బాగా అభివృద్ధి చెందింది. దానికి సంబంధించిన గ్రంథాలు కూడా వ్రాయబడ్డాయి. ఆయుర్వేద శాస్త్రంలో ప్రసిద్ధిగాంచిన



*చిత్రం-10.7: కుతుబ్ మీనార్ దగ్గరి తుప్పుపట్టని ఇనుప స్తంభం*

వాగ్భటుడు వైద్యశాస్త్రంపై 'అష్టాంగ సంగ్రహం' అనే అద్భుత రచన చేశాడు. శస్త్ర చికిత్స (సర్జరీ)పై శుశ్రుతుడు 'శుశ్రుత సంహిత' అనే అని గొప్ప రచన చేశాడు. వైద్య శాస్త్రంలో ప్రఖ్యాతిగాంచిన ధన్వంతరి ఈ కాలం వారే. కుతుబ్ మీనార్ దగ్గర తుప్పుపట్టని ఇనుప స్తంభం ఈ కాలపు లోహ పరిజ్ఞానానికి తార్కాణం.

## 10.9 హర్షవర్ధనుడు

గుప్తుల తరువాత ఉత్తర భారతదేశాన్ని పాలించిన రాజులలో పుష్యభూతి వంశస్థుడైన హర్షవర్ధనుడు గొప్పవాడు. ఉత్తర భారతంలో రాజకీయ ఐక్యతను చేకూర్చి, శాంతి భద్రతలను కాపాడినాడు. హర్షుని చరిత్రకు ముఖ్య ఆధారాలు బాణుని 'హర్ష చరిత్ర', హ్యూయాన్‌త్సాంగ్ రచించిన సి.యు.కి., రెండవ పులకేశి యొక్క ఐహోలు శాసనం, సమకాలీన శాసనాలు,నాణేలు ముఖ్యమైనవి.

సాధారణ శకం 606లో హర్షుడు సింహాసనానికి వచ్చేసరికి రాజ్యంలో చాలా క్లిష్ట పరిస్థితులు ఉన్నాయి. హర్షుడు చాకచక్యంతో వాటన్నింటినీ ఎదుర్కొని సుస్థిరపాలన అందించాడు

### 10.9.1 హర్షుడి దండయాత్రలు

తన స్థానాన్ని సుస్థిరపరుచుకొన్న తరువాత హర్షుడు పెద్ద సైన్యాన్ని సమకూర్చుకొని, ఆరుసంవత్సరాలపాటు నిరంతరాయంగా యుద్ధాలను చేసి సామ్రాజ్యాన్ని విస్తరింపజేశాడని హ్యూయాన్‌త్సాంగ్ రచనల వల్ల తెలుస్తుంది. మాళవ దేశపు రాజు దేవగుప్తుడ్ని ఓడించి, అతని తమ్ముడైన మాధవగుప్తుడికి సింహాసనం అప్పగించి తనకు సామంతుడిగా చేసుకున్నాడు. వల్లభిరాజు రెండో ధ్రువసేనుడ్ని ఓడించాడు. సాధారణ శకం 637లో తూర్పు ప్రాంత దండయాత్రలో వంగ, మగధ, గంజాం (ఒరిస్సా) ప్రాంతాలను పాలిస్తున్న శశాంకుడ్ని ఓడించాడు.

### 10.9.2 ధర్మపరిషత్

హర్షుడు ప్రతి 5 సంవత్సరాలకు ఒకమారు 'మహా మోక్షపరిషత్' నిర్వహించేవాడు. ఈ సమావేశంలో హర్షుడు ఈ 5 సంవత్సరాల కాలంలో సంపాదించిన సంపాదనంతా పేదవారికి పంచి పెట్టేవాడు. హ్యూయాన్‌త్సాంగ్ 6వ మహా మోక్షపరిషత్తుకు హాజరైనట్లు పేర్కొన్నాడు. హర్షుడు తన రాజ్యంలో జంతు వధను నిషేధించాడు. అనేక స్థూపాలు, విహారాలు నిర్మించాడు. కనోజ్‌లో గొప్ప విహారాన్ని నిర్మించాడు. అందులో బంగారంతో చేసిన నిలువెత్తు బుద్ధుడి విగ్రహాన్ని ప్రతిష్టించినట్లు హ్యూయాన్‌త్సాంగ్ పేర్కొన్నాడు.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. గుప్తుల పరిపాలన పద్ధతిని సమీక్షించండి.
2. గుప్తుల కాలంలోని విద్యా వ్యవస్థ గురించి తెలపండి.
3. గుప్తుల కాలంలోని సాంకేతిక, విజ్ఞాన శాస్త్రాల గురించి వివరించండి.
4. మహా మోక్షపరిషత్ ముఖ్యోద్దేశ్యం ఏమిటి?

## 10.10 ముగింపు (ముఖ్యాంశాలు)

- భారతదేశపు మూల నాగరికత సింధూ నాగరికత.
- సింధు నాగరికత ప్రజలు అత్యున్నతమైన, ప్రణాళికాబద్ధమైన నిర్మాణ కౌశలం కలిగి ఉన్నారు.

- వేదాలు 4: ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణవేదం.
- భారతదేశంలో మొట్ట మొదటి మహా సామ్రాజ్య నిర్మాతలు మౌర్యులు.
- భారతదేశంలో శిలా శాసనాలు వేయించిన మొదటి చక్రవర్తి అశోకుడు.
- గాంధార శిల్ప కళను కనిష్కుడు బాగా ప్రోత్సహించాడు.
- దక్షిణ భారతదేశంలో మొదట మహా సామ్రాజ్యాన్ని స్థాపించినది శాతవాహనులు.
- శాతవాహన చక్రవర్తులలో గౌతమీపుత్ర శాతకర్ణి గొప్పవాడు.
- చరిత్రకారులు, గుప్తుల పాలనా కాలాన్ని స్వర్ణయుగంతో పోలుస్తారు.
- గుప్తుల కాలంలో విద్య, శాస్త్ర, సాంకేతిక, వైజ్ఞానిక రంగాల్లో భారతదేశం అద్భుత ప్రగతి సాధించింది.
- హర్షుడు ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి 'మహా మోక్షపరిషత్' నిర్వహించేవాడు.

## 10.11 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 1-2 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. భారతదేశంలో తొలి నగరీకరణ ఫలితాలు ఏవి?
2. తొలి ఆర్యులు ఎక్కడ నివసించారు?
3. అశోకుని బిరుదులేవి?
4. గాంధార శిల్పకళ విశేషాలు ఏవి?
5. హర్షుడి గురించి తెలిపే ఆధారాలేవి?

**II. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 4-5 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. వైదిక వాఙ్మయం గురించి తెలియజేయండి.
2. మౌర్యుల గురించి తెలిపే ఆధారాలను వివరించండి.
3. శాతవాహనుల పరిపాలన గురించి తెలియజేయండి.
4. జైన - బౌద్ధ మతాల గురించి వివరించండి.
5. గుప్తుల కాలంలోని విజ్ఞాన, సాంకేతిక రంగాల ప్రగతిని సమీక్షించండి.

**III. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 8-10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. సింధూ ప్రజల నిర్మాణ కౌశలాలను గురించి వివరించండి.
2. తొలి వేద కాలపు ఆర్థిక వ్యవస్థను మలి వేద కాలపు ఆర్థిక వ్యవస్థతో పోల్చండి.
3. కళింగ యుద్ధం అశోకునిలో ఎటువంటి పరివర్తనను కలిగించింది? దాని పరిణామాలేమిటి?
4. శాతవాహనుల కాలంలోని సాంఘిక ఆర్థిక పరిస్థితులను వివరించండి.
5. గుప్తుల పాలనా కాలాన్ని గొప్ప అద్భుతమైన కాలంగా వర్ణించవచ్చునా? సమర్థించండి.

**IV. కింది వాటిలో సరైన జవాబును ఎంపిక చేయండి.**

1. రావి నదీ తీరాన బయల్పడిన సింధూ నాగరికత నగరం ( )

   ఎ) హరప్పా బి) కాలిబంగన్ సి) మొహంజోదారో డి) లోథాల్

2. తొలి ఆర్యులు ఏ నదిని 'నదీతమ'గా కీర్తించారు ( )

   ఎ) గంగా నది బి) సింధూ నది సి) యమునా నది డి) సరస్వతీ నది

3. మొట్ట మొదటి వేదం ( )

   ఎ) సామవేదం బి) యజుర్వేదం సి) ఋగ్వేదం డి) అధర్వణ వేదం

4. భారతదేశ మొదటి చారిత్రక చక్రవర్తి ( )

   ఎ) గౌతమీపుత్ర శాతకర్ణి బి) అశోకుడు సి) మౌర్య చంద్రగుప్తుడు డి) కనిష్కుడు

5. ఏ పాలకులు తమ పేర్లకు ముందు తమ తల్లి పేర్లను చేర్చుకునేవారు ( )

   ఎ) గుప్తులు బి) శాతవాహనులు సి) మౌర్యులు డి) కుషాణులు

6. వాగ్భటుడు ఈ శాస్త్రంలో పండితుడు ( )

   ఎ) వైద్య శాస్త్రం బి) గణిత శాస్త్రం సి) ఆయుర్వేద శాస్త్రం డి) జ్యోతిష్య శాస్త్రం

7. మహా మోక్ష పరిషత్ ను నిర్వహించింది ( )

   ఎ) హ్యూయాత్సాంగ్ బి) హర్షుడు సి) కనిష్కుడు డి) అశోకుడు

8. అలహాబాద్ ప్రశస్తి ఎవరి గురించి వివరిస్తుంది ( )

   ఎ) మౌర్య చంద్రగుప్తుడు బి) హాలుడు సి) సముద్రగుప్తుడు డి) హర్షుడు

## 10.12 ఉపయుక్త గ్రంథాలు


- డా॥ వి. యశోదాదేవి: భారతీయ చరిత్ర – సంస్కృతి (తెలుగు అకాడమీ ప్రచురణ)
- డా॥ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయ ప్రచురణ: భారతదేశ చరిత్ర అనాది నుండి 1526 వరకు
- కె.ఏ. నీలకంఠ శాస్త్రి: హిస్టరీ ఆఫ్ ఇండియా.
- ఏ.ఎల్. భాష్యం: ద వండర్ దట్ వాజ్ ఇండియా.
- ఆర్.సి. మజుందార్: ది వేదిక్ ఏజ్

# 11 మధ్యయుగ భారతదేశం

## 11.0 అభ్యసన ఫలితాలు

- తొలి మధ్య యుగంలో ఆవిర్భవించిన వివిధ కొత్త రాజ వంశాలు, వారి పరిపాలన, రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక పరిణామాల గురించి వివరిస్తారు.
- ఇస్లాం మతం ఆవిర్భావం, భారతదేశంపై జరిగిన అరబ్బు దండయాత్రలు, మహమ్మద్ ఘజిని మరియు మహమ్మద్ ఘోరిలు చేసిన దాడుల గురించి వివరిస్తారు.
- ఢిల్లీ సామ్రాజ్యాన్ని పాలించిన వివిధ సుల్తానులు, పాలనలోవారు తీసుకొచ్చిన వివిధ సంస్కరణలు గురించి విశ్లేషిస్తారు.
- ఢిల్లీ సుల్తానుల కాలంలో సామాజిక, ఆర్థిక, మత, సాంస్కృతి పరిణామాలు, భక్తి సూఫి ఉద్యమాల గురించి వివరిస్తారు.
- మొఘల్ పాలకుల సామాజిక, అర్థిక, మత విధానాలను వాస్తు, శిల్ప, సాహిత్య కళారంగాలలో సాధించిన ప్రగతిని వివరిస్తారు
- దక్షిణ భారతదేశంలోని మరాఠాలు, బహమనీ రాజ్యం గురించి వివరిస్తారు.

## 11.1 పరిచయం

హర్షవర్ధనుని మరణానంతరం భారతదేశ చరిత్రలో మనం అనేక విప్లవాత్మకమైన రాజకీయ , సామాజిక, సాంస్కృతిక అంశాలను గమనించవచ్చు. రాజకీయంగా గమనిస్తే అనేక కొత్త రాజవంశాలు వివిధ ప్రాంతాలలో అధికారానికి వచ్చి కొత్త రాజ్యాలను స్థాపించాయి. ఈ ప్రాంతీయ రాజ్యాలు సామ్రాజ్య హెూదాను పొందడంలో భాగంగా తమ రాజ్య విస్తరణను కొనసాగిస్తూ తమలో తాము నిరంతరం తీవ్ర ఘర్షణలకు దిగినాయి. అయితే ఒకవైపు రాజకీయ సంఘర్షణలు చోటు చేసుకుంటున్నప్పటికి, మరోవైపు మతం, భాష, సాహిత్యం, వాస్తు కళలు తదితర రంగాలలో సృజానాత్మకత కూడిన అభివృద్ధి కనిపిస్తుంది. ఇదే సమయంలో అరబ్ ప్రాంతంలో వచ్చిన ఇస్లాం క్రమంగా విస్తరిస్తూ భారతదేశానికి పాకింది. ఢిల్లీ సుల్తానుల రాకతో భారతదేశం సమాజంలో సరికొత్త మార్పులకు నాంది పలికింది.

## 11.2 కొత్త రాజ్యాల ఆవిర్భావం

### 11.2.1 ఉత్తర భారతదేశంలో రాజపుత్రులు

హర్షవర్ధనుని మరణానంతరం భారత దేశాన్ని ఆక్రమించడానికీ ముస్లింలు చేసిన దాడుల నుంచి రక్షణ కల్పిస్తూ, భారతీయ సంస్కృతిని విదేశీయుల ప్రమాదం నుండి కాపాడి ఒక శక్తివంతమైన సంస్కృతిగా నిలబెట్టడమే రాజపుత్రులు భారతదేశానికి చేసిన గొప్ప కృషిగా చెప్పవచ్చు. ఉత్తర భారతదేశంలో మొట్ట మొదట రాజాకీయాధికారాన్ని స్థాపించిన రాజపుత్ర వంశం ప్రతీహారులు. మొదటి నాగభట్టుడు ఈ రాజ్య స్థాపకుడు. ఇతని వారసుడు వత్సరాజు బెంగాల్‌ను పాలిస్తున్న ధర్మపాలున్ని ఓడించి వెనుతిరుగుతున్న క్రమంలో రాష్ట్రకూట ధృవుడు దండెత్తి ప్రతిహారులను ఓడిస్తాడు. ప్రతీహార రాజ్య పతనానంతరం కనౌజ్ కేంద్రంగా గహద్వాలుల పాలన మొదలైనది. సా.శ. 956 లో సింహరాజ్ చౌహాన్ నాయకత్వంలో సాంబర్ ప్రాంతంలో చౌహానుల స్వతంత్ర రాజ్యం మొదలైనది. చౌహానులలో గొప్ప రాజు పృథ్వీరాజ్ చౌహాన్. ఉత్తర భారత దేశంపై ముస్లింల దండయాత్రలను ఎదుర్కోవడంలో ఈయన కీలక పాత్ర పోషించాడు.

> భారతదేశాన్ని విదేశీ ముస్లిం దాడుల నుండి కాపాడటంలో రాజపుత్రులు ఇతర రాజులతో కలిసి ఐక్యత చూపకపోవడం వల్ల భారతదేశంలో ముస్లిం రాజ్య స్థాపనకు మార్గం సుగమమైంది. ఈ అభిప్రాయం సరైనదేనా?

### 11.2.2 దక్షిణ భారతదేశంలో రాష్ట్రకూటులు, చోళులు, తూర్పు భారతంలో పాల వంశీయులు

రాష్ట్రకూటులు బాదామి చాళుక్యులకు సామంతులుగా ఉండి వారి తరవాత స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించారు. ఈ రాజ్య స్థాపకుడు దంతిదుర్గుడు. సా.శ. 738 సంవత్సరంలో జరిగిన యుద్ధంలో అరబ్బులను ఓడించి వారికి మరల గుజరాత్‌పై దండెత్తే ధైర్యం లేకుండా చేశాడు. ఇతని తర్వాత రాజ్యాధికారం స్వీకరించిన మొదటి కృష్ణుడు గొప్ప యోధుడే కాక కళాపోషకుడు. ప్రఖ్యాతి చెందిన ఎల్లోరాలోని కైలాసనాథ దేవాలయం ఇతని నిర్మాణమే. ఇతని మరణానంతరం రాజ్యాధికారం పొందిన గోవిందుడ్ని తొలగించి ధృవుడు సింహాసనం అధిష్టించాడు. అసమాన బల పరాక్రమం కలిగిన ధృవుడు ఉత్తర భారతదేశంపై దండెత్తి ఘూర్జర ప్రతిహార రాజు వత్సరాజును, బెంగాల్ ధర్మపాలున్ని ఓడించి తమ సామంతులుగా చేసుకున్నాడు. దక్షిణంలో పల్లవులను ఓడించి తన ఆధిపత్యం నెలకొల్పాడు. ధృవుని అనంతరం రాజైన మూడో గోవిందుడు ఉత్తర భారతదేశంపై మరలా దండయాత్రను కొనసాగిస్తూ రెండో నాగభట్టుని తరిమికొట్టి తన పూర్తి ఆధిపత్యంను నెలకొల్పాడు. ఇతని వారసునిగా వచ్చిన అమోఘవర్షుని కాలం తిరుగుబాట్లతో, అంతఃకలహాలతో, యుద్ధాలతో గడిచినప్పటికీ రాష్ట్రకూట రాజ్యానికి ఎలాంటి నష్టం వాటిల్లలేదు.

సా.శ. 850 ప్రాంతంలో చోళ రాజ్యాన్ని విజయాలయ చోళుడు పునరుద్ధరించాడు. పల్లవ, పాండ్య ఘర్షణలను అవకాశంగా తీసుకోని తన స్వతంత్ర పాలన ప్రారంభించాడు. చోళ సామ్రాజ్యపు కీర్తి ప్రతిష్టలను ఇనుమడింప చేసిన రాజులలో ముఖ్యుడు మొదటి రాజరాజు. సా.శ. 985 నుండి 1040 వరకు సాగిన ఇతని పాలన కాలంలో చోళుల అధికారం పాండ్య, కేరళ, సింహళం, మాల్దీవుల వరకు విస్తరించింది. క్రమబద్ధమైన

పరిపాలన, శక్తివంతమైన సైన్యం, నావికాదళం, పటిష్టమైన ఆర్థిక పరిస్థితి, అద్భుతమైన దేవాలయ నిర్మాణంతో ఇతని పరిపాలన ప్రగతికి సూచికగా నిలిచింది. తంజావురులోని అత్యంత సుందరమైన బృహదీశ్వరాలయం ఇతని నిర్మాణమే. ఇతని తర్వాత రాజ్యాధికారం స్వీకరించిన రాజేంద్ర చోళుడు (సా.శ. 1012 నుండి 1044 వరకు)కూడా అత్యంత సమర్థుడు. ఇతడు గంగైకొండ చోళపురం అనే పట్టణాన్ని నిర్మించాడు. స్థానిక స్వపరిపాలనకు చోళుల పాలన ప్రఖ్యాతిగాంచింది.

ఉత్తర భారతంలో బెంగాల్, బీహార్, ఒరిస్సా, నేపాల్, అస్సాం వరకు విస్తరించిన పాల వంశీయుల పాలన కాలం మధ్య యుగ భారతదేశంలో ప్రముఖమైంది. సా.శ. 780 నుండి 815 వరకు పాలించిన ధర్మపాలుని కాలంలో ఒకవైపు గుర్జర ప్రతీహారులతో, మరో వైపు రాష్ట్రకూటులతో నిరంతరం సంఘర్షణ చోటు చేసుకుంది. అతను బెంగాల్‌లో స్థాపించిన విక్రమశిల విశ్వవిద్యాలయం ఎందరో విదేశీ విద్యార్థులను ఆకర్షించి నలందా విశ్వవిద్యాలయంతో పోటీ పడింది. వీరు మంచి కళా పోషకులు. చెరువులు, కాలువల నిర్మాణం చేసి వ్యవసాయ అభివృద్ధికి ఇతోధిక కృషి చేశారు.

### 11.2.3 రాజకీయ, సామాజిక, సాంస్కృతిక పరిణామాలు

తొలి మధ్య యుగ భారతదేశం రాజకీయంగా, సామాజికంగా, సాంస్కృతికంగా అనేక కీలక పరిణామాలకు వేదిక అయింది. ఈ కాలపు రాజరికం భూస్వామ్య వ్యవస్థపై ఆధారపడిందని చెప్పవచ్చు. ఈ భూస్వాములు తమ ఆధీన ప్రాంతాలలో వచ్చే ఆదాయాన్ని వసూలు చేసుకునేవారు. అందుకు బదులుగా కొంత సైన్యాన్ని పోషించి యుద్ధ సమయాలలో రాజ్యానికి అందించడం జరిగేది. ఈ భూస్వాములు లేదా సామంతులు బలవంతులై తమ తమ ప్రాంతాలలో స్వాతంత్రం ప్రకటించుకోవడం లేదా తిరుగుబాట్లు చేయడం వలన కొంత రాజకీయ అస్థిరత ఏర్పడేది.

ఈ కాలపు సమాజం పూర్తిగా వర్ణ వ్యవస్థపై ఆధారపడి కొనసాగింది. చతుర్వర్ణ వ్యవస్థలోని బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలలో బ్రాహ్మణులు అత్యధిక గౌరవాధికారాలు పొందారు. పురోహితులుగానే కాకుండా రాజ్య పరిపాలనలో కీలక పదవులలో ఉండి వివిధ అధికారాలు కలిగి ఉండేవారు. క్షత్రియులు పాలకులుగా, సైనికులుగా విధులు నిర్వహించేవారు. వైశ్యులు వ్యవసాయంతో పాటు వ్యాపారం చేసేవారు. శూద్రులు వృత్తి పనివారుగా పై వర్ణాల వారికి సేవలు అందించేవారు. ఈ కాలంలోనే ఉప కులాలు వృద్ధి చెందాయి. ఈ కాలంలో స్త్రీలు విద్య, లలిత కళలు మొదలగు విషయాలలో పురుషులతో సమానంగా ఉన్నత స్థానాలు పొందారు. అవంతీ సుందరి, ఇందులేఖ, మోరిక, విజ్జిక సుభద్ర, పద్మశ్రీ మొదలగు వారు నాడు నాటి ప్రసిద్ధ కవయిత్రిలు. కొంత మంది స్త్రీలు పరిపాలనలో యుద్ధ విద్యలలో కూడా ప్రావీణ్యం సంపాదించారు.

మతపరంగా ఈ కాలంలో అనేక మార్పులు గమనించవచ్చు. విదేశీ దండయాత్రలు, స్వదేశీ రాజుల ఆదరణ తగ్గిపోవడం వల్ల బౌద్ధ మతం క్రమంగా క్షీణించింది. అదే సమయంలో హిందు మతం ప్రాధాన్యం బాగా పెరిగింది. కొన్ని ప్రాంతాలలో జైన మతానికి ఆదరణ లభించింది. విద్య, భాషా సాహిత్యం, వాస్తు నిర్మాణ రంగాలలో కీలకమైన పురోగతి జరిగిందని చెప్పవచ్చు. నలందా, విక్రమశిల, వల్లభి నాడు ప్రధాన విద్యా కేంద్రాలు.

రాజపుత్రుల కోటలు, ఆలయాలు, భవనాలు అనేకం నిర్మించారు. రాజస్థాన్‌లోని రణతంభోర్, గ్వాలియర్ కోటలు రాజపుత్రుల కళానైపుణ్యానికి ప్రతీకలు. గ్వాలియర్‌లోని మాన్‌సింగ్ రాజ ప్రసాదం, అంబర్‌లోని భవనాలు ఉదయ్‌పూర్‌లోని సరస్సులు కుడా అద్భుత వాస్తు నైపుణ్యాలకు నిదర్శనం. అలాగే రాష్ట్రకూటులు నిర్మించిన ఎల్లోరా దేవాలయం, చోళుల బృహదీశ్వారాలయం వాస్తు కళల అత్యున్నత ప్రగతికి తార్కాణం. రాజస్థాన్‌లోని అబూ ఆలయాలు, మధ్యప్రదేశ్‌లోని ఖజురహో దేవాలయం, ఒరిస్సాలోని పూరి, కోణార్క్ ఆలయాలు, మార్తాండ్ సూర్య దేవాలయం, అవంతీపూర్‌లోని శివ, వైష్ణవాలయాలు ఈ కాలం నాటివే. చాలా ఆలయాలు ముస్లిం దండయాత్రలలో ధ్వంసమైనప్పటికీ మిగిలి ఉన్న ఆలయాలు నాటి వాస్తు కళా రంగాల ప్రగతికి చిహ్నాలుగా నిలుస్తున్నాయి.



*చిత్రం-11.1: అంబర్ రాజభవనం*

## 11.3 భారతదేశంపై అరబ్బుల దండయాత్ర

ఇస్లాం మతస్తులైన అరబ్‌ల దృష్టి భారత ఉపఖండంపై పడింది. భారత ఉపఖండంలోని అపార సంపద వారిని ఆకర్షించింది. ఆ సమయంలో సింధు రాష్ట్రంను దాహిర్ అను రాజు పాలిస్తున్నాడు. సా.శ. 712లో మహమ్మద్ బిన్ కాశీం నేతృత్వంలో ఒక బలమైన సైన్యాన్ని సింధ్‌ను ఆక్రమించాడు. అయితే సింధ్ ఆక్రమణ భారతదేశంపై పెద్దగా ప్రభావం కలిగించలేదు. అది భారత సైనిక శక్తిని దెబ్బతీయ లేకపోయింది కనుక భారతదేశంలో ఇస్లామిక్ రాజ్య స్థాపన చేయలేకపోయింది. కాని భారతీయ సంస్కృతిని వీరు ప్రపంచానికి పరిచయం చేశారని చెప్పవచ్చు. ముఖ్యంగా భారతీయ తత్వశాస్త్రం, గణిత, ఖగోళ, వైద్య శాస్త్రములను ఐరోపా ఖండం వరకు వ్యాపింపజేయడంలో అరబ్బుల పాత్రను ప్రముఖంగా పేర్కొనవచ్చు.

**ఆలోచించండి**

భారతదేశంపై అరబ్బుల దండయాత్ర ఏమైనా ఫలితాలను సాధించిందా?

## 11.4 మహమ్మద్ గజిని దండయాత్రలు

సా.శ. 10వ శతాబ్దంలో గజినీ పాలకులైన తురుష్కులు భారతదేశంపై రెండవ దండయాత్ర చేశారు. మహమ్మద్ గజినీ భారతదేశంపై 17 సార్లు దండయాత్రలు చేశాడు. అతని మొదటి దాడి సా.శ. 1000 సంవత్సరంలో కొన్ని వాయవ్య భారత పట్టణాలను దోచుకోవడంతో ప్రారంభమైంది. తరవాత పంజాబ్ ప్రాంతానికి చెందిన భారతీయ రాజులను ఓడించి స్థానేశ్వర్, కనౌజ్‌లను కొల్లగొట్టాడు. హిందువుల పుణ్యక్షేత్రమైన మధురను దోచుకొని అక్కడి దేవాలయాలను నాశనం చేశాడు. గజినీ దండయాత్రలలో అత్యంత ప్రాముఖ్యత కలిగినది సోమనాథ్ దేవాలయ దోపిడి సా.శ. 1024లో మహమ్మద్ గజినీ అక్కడి పాలకుడు భీమరాజును ఓడించి అక్కడి దేవాలయాన్ని ధ్వంసం చేసి అపారమైన ధనరాశులను కొల్లగొట్టాడు. అయితే గజినీ భారతదేశంపై అనేక మార్లు దండయాత్రలను చేసినప్పటికీ ఇక్కడ తురుష్క సామ్రాజ్యాన్ని స్థాపించాలనుకోలేదు. కేవలం భారతదేశంలోని ధన రాశులను కొల్లగొట్టి ఇక్కడ ఆలయాలను ధ్వంసం చేయడమే అతని లక్ష్యం.

## 11.5 మహమ్మద్ ఘోరీ దండయాత్రలు

మహమ్మద్ ఘోరి చేసిన యుద్ధాలలో అత్యంత ప్రధానమైనవి మొదటి, రెండవ తరైన్ యుద్ధాలు. సా.శ. 1191లో జరిగిన మొదటి తరైన్ యుద్ధంలో మహమ్మద్ ఘోరి ఢిల్లీని పాలిస్తున్న చౌహాన్ వంశ రాజు పృథ్వీరాజ్ చౌహాన్‌తో తలపడి ఘోరంగా ఓడిపోయి వెనుతిరిగాడు. దీనికి ప్రతీకారం తీర్చుకోవాలనే ఉద్దేశ్యంతో మహమ్మద్ ఘోరి లక్షకు పైచిలుకు సైన్యం సమకూర్చుకుని మరల సా.శ. 1192లో రెండవ తరైన్ యుద్ధ రంగంలో పృథ్వీరాజ్ చౌహాన్‌ను ఓడించి ఢిల్లీని ఆక్రమించాడు. దీనితో భారత దేశంలో ముస్లిం రాజ్య స్థాపనకు బీజం పడింది. ఘోరి తన ప్రతినిధిగా కుతుబుద్దీన్ ఐబక్‌ను డిల్లీలో నియమించాడు. ఇతడు స్వతంత్ర ముస్లిం రాజ్యాన్ని స్థాపించాడు.

## 11.6 ఢిల్లీ సుల్తానులు - రాజ్య స్థాపన, విస్తరణ

సా.శ. 1206 సంవత్సరంలో కుతుబుద్దీన్ ఐబక్ ఢిల్లీలో స్వతంత్ర ముస్లిం రాజ్యాన్ని స్థాపించాడు. ఢిల్లీని రాజధానిగా చేసుకుని సుల్తాన్ అనే బిరుదుతో రాజ్య పాలన చేయడం వలన వీరిని 'ఢిల్లీ సుల్తానులు'గా పిలిచారు. ఈ సుల్తానుల యుగంలో ఐదు రాజవంశాలు ఢిల్లీని పరిపాలించాయి. అవి: 1. బానిస వంశం (సా.శ. 1206 నుండి 1290 వరకు), 2. ఖిల్జీ వంశం (సా.శ. 1290 నుండి 1320 వరకు) 3. తుగ్లక్ వంశం (సా.శ. 1320 నుండి 1414 వరకు), 4. సయ్యద్ వంశం (సా.శ. 1414 నుండి 1451 వరకు), 5. లోడి వంశం (సా.శ. 1451 నుండి 1526 వరకు)

కుతుబుద్దీన్ ఐబక్ స్థాపించిన వంశాన్ని బానిస వంశం అని పిలుస్తారు. ఐబక్ తర్వాత బానిస వంశంలో ప్రముఖ సుల్తాన్ ఇల్‌టుట్ మిష్. సా.శ. 1211నుంచి 1236 వరకు ఇతను పరిపాలన చేశాడు. ముల్తాన్, ఉచ్, సింధు రాష్ట్రాలను ఢిల్లీ సుల్తనేట్‌లో కలిపేశాడు. తదుపరి రాజపుత్ర రాజ్యాలను ఆక్రమించాడు. ఉజ్జయిని లోని ప్రసిద్ధ మహాకాళీ ఆలయాన్ని నాశనం చేసి దోచుకున్నాడు. ప్రప్రథమంగా లాహోర్‌కు బదులుగా ఢిల్లీని హిందుస్థాన్‌కు రాజధానిగా చేశాడు. ఇతని వారసులు అసమర్థులవడంచే రజియా సుల్తానా ఢిల్లీ సింహాసనం అధిష్టించింది. ఢిల్లీని పాలించిన మొదటి మహిళ రజియా సుల్తానా. అయితే ఒక మహిళను పాలకురాలిగా ఒప్పుకోని ముస్లిం సర్దారులు చిహల్‌గనిగా ఏర్పడి ఆమె పాలనను సాగనివ్వలేదు.

తదుపరి సింహాసనాన్ని అధిరోహించిన గియాసుద్దీన్ బాల్బన్ (సా.శ. 1266 నుండి 1286 వరకు) బానిస వంశ పాలకులలో అత్యంత సమర్థుడు. సుల్తాన్‌గా అతడు భారత వాయవ్య ప్రాంతాలపై తరచూ జరిగే మంగోలుల దాడులను ఇతడు శక్తివంతమైన సైన్యంతో మంగోలుల దాడులను తిప్పికొట్టాడు. ఇతని వారసుడు అసమర్థుడవడం వలన ఖిల్జీ వంశస్తుడైన జలాలుద్దీన్ ఖిల్జీ క్రీ.శ. 1290లో ఢిల్లీ సింహాసనం అధిష్టించడంతో బానిస వంశ పాలన అంతమైంది.

ఖిల్జీ వంశ స్థాపకుడు జలాలుద్దీన్ ఖిల్జీ. ఇతని అల్లుడైన అల్లావుద్దీన్ ఖిల్జీ (సా.శ. 1296 నుంచి 1316 వరకు) ఢిల్లీ సుల్తానులందరిలో అగ్రగణ్యుడు. సమర్థవంతులైన సేనానుల సహకారంతో గుజరాత్, రణథంభోర్, మేవాడ్, మాళ్వా, తదితర రాజ్యాలను ఆక్రమించాడు. మాలిక్ కాఫర్ అనే సేనాని నేతృత్వంలో దక్షిణ భారతదేశంలో అనేక ప్రాంతాలను ఆక్రమించాడు. సా.శ. 1311లో మధురపై చేసిన దాడి చేసి అక్కడి అపార ధనరాశులను

కొల్లగొట్టాడు. శ్రీరంగం, రామేశ్వరం ఆలయాలను దోచి, ధ్వంసం చేసి రామేశ్వరంలో మసీదును నిర్మించాడు. పరిపాలనలో, సైన్యంలో అనేక సంస్కరణలు చేశాడు. ఇతను ప్రవేశపెట్టిన రెవెన్యూ, మార్కెట్ సంస్కరణలు చాలా ప్రసిద్ధి చెందినాయి.

అల్లావుద్దీన్ ఖిల్జీ వారసులు బలహీనులవడంతో ఘియాజుద్దిన్ తుగ్లక్ సా.శ. 1320లో ఢిల్లీ సింహాసనమధిష్టించాడు. ఇతని తరువాత మహమ్మద్ బిన్ తుగ్లక్ రాజ్యాధికారం చేపట్టాడు. ఇతడు గొప్ప పండితుడు. కాని పాలనా పరంగా అతను తీసుకున్న అనేక చర్యలు తీవ్ర విమర్శలకు దారి తీశాయి. ముఖ్యంగా కరువు సమయంలోను గంగా, యమున అంతర్వేదిలో భూమి శిస్తు పెంచడం, రాజధానిని ఢిల్లీ నుంచి దేవగిరికి మార్చడం, ప్రజలను తరలించడం, రాగి నాణెములను బంగారం వెండి నాణెములతో సమానంగా చెలామణిలో ఉంచడం వంటి చర్యల వలన ప్రజలలో తీవ్ర వ్యతిరేకత పెరిగింది. రాజ్యంలో అనేక చోట్ల తిరుగుబాట్లు ప్రారంభమైనాయి. సా.శ. 1336లో హరిహర రాయులు తిరుగుబాటు చేసి స్వతంత్ర విజయనగర రాజ్యాన్ని స్థాపించడం ఇందులో ముఖ్యమైనదని చెప్పవచ్చు. మహమ్మద్ తరువాత ఫిరోజ్ షా తుగ్లక్ సా.శ. 1351లో సింహాసనం అధిష్టించాడు. ఇతనికి సనాతన ఇస్లాం పట్ల ఆసక్తి ఎక్కువ. ఇస్లాం స్వీకరించిన వారికి ప్రోత్సాహలిచ్చేవారు. సా.శ. 1360లో నాగర్ కోటపై దాడి చేసి అక్కడి జ్వాలాముఖి దేవాలయాన్ని ధ్వంసం చేసి విగ్రహాలను మదీనాకు పంపించాడు. ఒరిస్సాలోని జగన్నాథ ఆలయాన్ని నేలమట్టం చేశాడు. హిందువులపై జిజియా పన్ను విధించి కఠినంగా వసూలు చేశాడు. ఇతని తరవాత వచ్చిన వారసులలో చివరి వాడైన మహమూద్ సా.శ. 1413లో మరణించడంతో తుగ్లక్ వంశ పాలన అంతమైనది. తరువాత సయ్యద్ వంశం, లోడీ వంశ రాజులు పరిపాలించారు. వీరిలో చివరి రాజైన ఇబ్రహింలోడికి, బాబర్‌కు మధ్య సా.శ. 1526లో మొదటి పానిపట్టు యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో బాబర్ విజయం సాధించడంతో ఢిల్లీ సుల్తానుల పాలన అంతమై మొఘలుల పాలన ప్రారంభమైంది.

## 11.6.1 పరిపాలన - రెవెన్యూ, సైనిక, ఇతర చర్యలు

సుమారు మూడు శతాబ్దాలుగా కొనసాగిన ఢిల్లీ సుల్తానుల పాలన ఇస్లాం మతపరమైన చట్టాలను అనుసరించి ఉండేది. ఢిల్లీ సుల్తానులు తాము ఖలీఫాకు ప్రతినిధులమని చెప్పుకునేవారు కాని అల్లావుద్దీన్ ఖిల్జీ, కుతుబుద్దీన్ ఐబక్ ఖలిఫా ఆదేశాలను పాటించలేదు. ఢిల్లీ సుల్తానుల పరిపాలన పూర్తిగా కేంద్రీకృత పరిపాలనగా చెప్పవచ్చు. సుల్తాన్ సర్వాధికారి. సుల్తాన్ పదవికి వారసత్వపు హక్కు లేదు. బలవంతునిదే రాజ్యం అనే సూత్రంపై రాజ్యాధికారం ఆధారపడి ఉండేది. పరిపాలనలో రాజుకు సహకరించడానికి వజీర్, దివాన్-ఇ-రిసాలత్, దివాన్-ఇ-అరజ్, దివాన్-ఇ-ఇంషా వంటి మంత్రులుండేవారు. రాజ్యాన్ని 'ఇక్తాలు' అనే రాష్ట్రాలుగా విభజించారు. ప్రతి రాష్ట్రానికి ఒక గవర్నర్ (రాజు-ప్రతినిధులు)లు నియమించబడేవారు. వీరు సాధారణంగా రాజు కుటుంబ సభ్యులు లేదా బంధువులు ఉండేవారు. రాజ్య విస్తరణ, రక్షణకు పటిష్టమైన సైనిక వ్యవస్థ ఉండేది. సైనికులను నగదు రూపంలో వేతనాలు చెల్లించిన మొదటి సుల్తాన్ అల్లావుద్దీన్. సైనికులకు నిత్యావసర వస్తువులు తక్కువ ధరకు లభించేలా మార్కెట్ సంస్కరణలు తీసుకొచ్చాడు. రాజ్యానికి ప్రధాన ఆదాయం భూమి శిస్తే. దిగుబడిలో 50 శాతం శిస్తుగా వసూలు చేయబడింది.

**ఆలోచించండి**

అల్లావుద్దీన్ రాజ్య అవసరాల కొరకే మార్కెట్ నియంత్రణ చర్యలను చేపట్టాడా లేదా తన ప్రజలదరికీ మేలు చేయాలనే ఉద్దేశంతో చేశాడా? ఆలోచించండి.

మహమ్మద్ బిన్ తుగ్లక్ క్షామ పరిస్థితులు గమనించక గంగా, యమున అంతర్వేదిలో పన్నుల పెంపు చర్య వలన రైతాంగం తీవ్ర ఇబ్బందులేదుర్కొన్నారు. ఈ ఇబ్బందులను అధిగమించుటకు దివాన్-ఇ-కోహి పేర వ్యవసాయ శాఖను ఎర్పాటు చేసి పన్నులను తగ్గించడం, కొత్త వ్యవసాయ భూముల అభివృద్ధి, పంట ఋణాల మంజూరు వంటి చర్యలు చేపట్టాడు. ఈ సంస్కరణల వల్ల రాజ్య ఖజానా ఖాళీ కావడం, బంగారం, వెండి కొరత ఏర్పడటం వలన రాగి నాణెములను ప్రవేశపెట్టాడు. కాని వాటి ముద్రణను ప్రభుత్వ ఆధీనంలో ఉంచకపోవడం వలన రాజ్యంలోని ప్రతీ కుటుంబం ఒక టంకశాలగా మారడంతో వాటినీ ఉపసంహరించి, బదులుగా ప్రజలకు వెండి నాణెములు చెల్లించాడు. ఫిరోజ్ షా తుగ్లక్ కాలంలో జాగిర్దారీ విధానాన్ని ప్రవేశపెట్టి సైనికులకు జీతాలకు బదులుగా భూములను ఇచ్చే విధానాన్ని ప్రవేశపెట్టాడు. బానిస వ్యవస్థను పునరుద్దరించాడు. ప్రజా సంక్షేమ చర్యలలో భాగంగా నదుల నుండి నాలుగు కాలువలు త్రవ్వించి నీటి పారుదల సౌకర్యాలు కల్పించాడు. ధర్మశాలలు, ఆసుపత్రులు నిర్మించాడు.

**ఆలోచించండి**

మహమ్మద్ బిన్ తుగ్లక్ చేపట్టిన సంస్కరణలు ఎందుకు విఫలమైనాయి?

## 11.6.2 సాంఘిక, మత పరిస్థితులు

భారతదేశంలో ముస్లిం రాజ్య స్థాపన కొన్ని శాశ్వతమైన మార్పులకు బాటలు వేసింది. సా.శ. 14, 15వ శతాబ్దాలలో హిందు, ఇస్లాం సమాజాలు సుదీర్ఘంగా ప్రక్కప్రక్కనే జీవించడం వలన వాటి కలయికతో కూడిన ఇండో-ముస్లిం సమాజం ఆవిర్భవించింది. ఒకరి అచార వ్యవహారాల ప్రభావం మరొకరిపై పడింది. ఆనాటి ముస్లిం జనాభాలో భారతదేశానికి వలస వచ్చిన అరబ్బులు, తురుష్కులు, ఆఫ్ఘన్లు, పర్షియన్లు, మంగోలులు మొదలగు వారు ఉన్నప్పటికీ అత్యధికులు ముస్లిం మతంలోకి మార్చబడిన హిందువులే అని చెప్పవచ్చు. జిజియా పన్ను నుండి మినహాయింపు పొందటానికి, ముస్లింల వద్ద బానిసగా ఉండడానికి ఇష్టపడక లేదా ప్రాణ భీతి, ఉద్యోగ ఆపేక్షతో నాడు హిందువులు ఇస్లాంను స్వీకరించారు. మతం మారినప్పటికీ సామాజిక వివక్షత కొనసాగిందని చెప్పవచ్చు. నిరంతర ముస్లింల దాడుల వల్ల మహిళలు అత్యధికంగా హింసకు గురి అయినారు. తమను తాము రక్షించుకోవడంలో, తమ గౌరవాన్ని కాపాడడంలో భాగంగా అనేక సాంఘిక దురాచారాలు పుట్టుకొచ్చాయి. ముస్లిం పాలకుల చేతిలో పడి తమ పరువుకు భంగం వాటిల్లుతుందని భావించినప్పుడు రాజపుత్ర స్త్రీలు తమను తాము అంతం చేసుకునేవారు. దీనినే 'జౌహార్'గా పిలుస్తారు. హిందువులలో సతీసహగమనం అనే దురాచారం మరింత బలపడింది.

తమ రాజ్య విస్తరణకు ఢిల్లీ సుల్తానులు మతాన్ని ఒక ఆయుధంగా వాడేవారు. ఫిరోజ్ షా తుగ్లక్ లాంటి వారు అనేక హిందూ దేవాలయాలను విధ్వంసం చేశారు. రెండు మతాల మధ్య సంఘర్షణ ప్రారంభమై సామరస్య సాంఘిక జీవనానికి గల అవకాశాలను దెబ్బతీశాయి. ముస్లింలు పాలక వర్గానికి చెందినవారు కావడం వలన హిందువులు అనేక కష్టనష్టాలకు గురయ్యారు. అయితే హిందువులు, ముస్లింలు సంవత్సరాలుగా ఒకే ప్రాంతంలో కలిసి నివసిస్తుండడం వలన క్రమంగా ఒకరి మత విశ్వాసాలను మరొకరు గౌరవించడం ప్రారంభించారని చెప్పవచ్చు. కాల క్రమంలో దసరా, హోళీ, మొహర్రం, శబ్-ఇ-బరాత్, మొహర్రం వంటి పండుగలను ఇరు మతస్తులు కలిసి జరుపుకోవడాన్ని గమనించవచ్చు.

## 11.7 భక్తి, సూఫి ఉద్యమాలు

భారతదేశంలో ఇస్లాం రాక హిందూ ధర్మంపై విశేష ప్రభావం చూపింది. ఇస్లాంలోని దేవుడొక్కడే, సర్వ సమానత్వం అనే భావనలు హిందువులను ఆలోచింపజేసినాయి. అదే సమయంలో బలవంతంగా ఇస్లాంలో మత మార్పిడులు జరగడం వలన, హిందూ ధర్మాన్ని కాపాడవలసిన ఆవశ్యకతను గుర్తించి, సనాతన హిందూ ధర్మంలోని లోపాలను సవరించి దాని రక్షణకు కొందరు భక్తి ఉద్యమకారులు ప్రయత్నించారు. ఈ భక్తి ఉద్యమకారులలో ముఖ్యులు శంకరాచార్యులు, రామానుజాచార్యులు, వల్లభాచార్యుడు, రామానందుడు, కబీర్, చైతన్యుడు, మీరాబాయి, సంత్ నాందేవ్, జ్ఞాన్ దేవ్, సమర్థ రాందాస్, సంత్ ఏక్ నాథ్, తుకారాం, గురునానక్ మొదలగువారు. దేవుడొక్కడేనని, ఆ దేవున్ని చేరే మార్గాలే వివిధ మతాలని, భక్తి భావంతో ఆరాధించడం వలన ఎవరైనా మోక్షంను పొందవచ్చుని, దానికి కుల మతాలతో సంబంధం లేదని, భగవంతుని దృష్టిలో అందరు సమానమేనని వీరు బోధించారు. ఇస్లాం ధర్మంలో వచ్చిన తాత్విక ఉద్యమమే సూఫి ఉద్యమం. 'సఫా' అనే పదం నుండి సూఫి అనే పదం ఉద్భవించింది. సఫా అనగా పవిత్రత, నిరాడంబరత. కుల మతాలకు అతీతంగా నిర్మలమైన మనస్సుతో భగవంతుని ధ్యానించి అతనిలో లీనమవడం ద్వారా, నిరాడంబర జీవితాన్ని గడపడం ద్వారా దేవున్ని చేరవచ్చుని వీరి నమ్మకం. సూఫి సన్యాసులలో అనేక శాఖలుండేవి. చిస్తీ, సూహ్రావర్ది, ఖాదిరి, నక్షబంది మొదలగునవి ప్రసిద్ధమైనవి. ఖ్వాజా మోయినుద్దీన్ చిస్తీ, హమిదుద్దిన్, షేక్ సలీం చిస్తీ, బాబా ఫరిదుద్దీన్, బహాఉద్దీన్ జకారియా, అబ్దుల్ ఖాదర్ తదితరులు భారతదేశంలోని ప్రముఖ సూఫి సన్యాసులు. హిందు ముస్లింల మధ్య సామరస్యతకై సూఫీలు కృషి చేశారు.

## 11.8 సాంస్కృతిక పరమైన పరిణామాలు

ఢిల్లీ సామ్రాజ్య స్థాపన భారతీయ సంస్కృతిపై అనగా సాహిత్యం, వాస్తు, చిత్ర కళా రంగాలను విశేషంగా ప్రభావితం చేసింది. ముస్లిం నిర్మాణాలైన మసీదులు, సమాధులు, రాజ భవనాలు, మినారులు మొదలగునవి భారతదేశంలో ప్రవేశించినాయి. కుతుబుద్దీన్ ఐబక్ నిర్మించిన ఢిల్లీలోని కుతుబ్ మినార్, కువ్వత్ ఉల్ ఇస్లాం మసీదు, అల్లావుద్దీన్ ఖిల్జీ నిర్మించిన జమాత్ ఖానా మసీదు, అలయ్ దర్వాజా నాటి ప్రముఖ మసీదులుగా చెప్పవచ్చు.



చిత్రం-11.2: అలయ్ దర్వాజా

నాడు పర్షియన్, టర్కీ భాషలో అనేక గ్రంథాలు రాయబడ్డాయి. కుతుబుద్దీన్ ఐబక్ ఆస్థానంలో ఫక్రుద్దీన్, హసన్ నిజామీ అని పండితులు ఉండేవారు. వీరు వరుసగా 'తారిఖ్-ఈ-ముబారక్ షాహి, తాజ్-ఉల్-మాసిర్" అనే గ్రంథాలను రాశారు. 'తబకత్-ఇ-నాసిరి' అనే గ్రంథాన్ని రచించిన మిన్హాజ్ సిరాజ్, ఇల్టుట్ మిష్ కాలానికి చెందిన ప్రముఖ రచయిత. ఢిల్లీ సుల్తానుల కాలంలోని కవులందరిలో

అగ్రగణ్యుడు అమీర్ ఖుస్రూ. తారిఖ్-ఇ-అలామి, తుఘ్లక్ నామా, ఖాజియన్-ఉల్-ఫతహా, ఆషికా అతని పసిద్ధ రచనలు. ఇతడిని 'తోతా-ఇ-హింద్ ( Parrot of India)' అని పిలుస్తారు. బెంగాల్‌కు చెందిన జయ దేవుడు రాసిన 'గీత గోవిందం', కల్హణుడు రాసిన 'రాజ తరంగిణి' సంస్కృత సాహిత్యంలో వెలువడ్డ గొప్ప గ్రంథాలు. అలాగే చంద్ బర్ దాయ్ రాసిన 'పృథ్వి రాజ్ రాసో', సారంగధరుని 'హమ్మిర రాసో' నాటి ప్రముఖ గ్రంథాలుగా చెప్పవచ్చు.

## 11.9 మొఘల్ సామ్రాజ్య స్థాపన - విస్తరణ

సా.శ. 1526 ఏప్రిల్ 21న జరిగిన మొదటి పానిపట్టు యుద్ధంలో ఢిల్లీ సుల్తాన్ అయిన ఇబ్రహీంలోడీని ఓడించి బాబర్ భారతదేశంలో మొఘల్ సామ్రాజ్యాన్ని స్థాపించాడు. సా.శ. 1527లో జరిగిన కాణ్వా యుద్ధంలో మేవాడ్ రాజు రాణా సంగాను, 1528లో గొగ్రా యుద్ధంలో మహమ్మద్ లోడిని ఓడించి బీహార్ వరకు రాజ్య విస్తరణ చేస్తాడు. బాబర్ తరువాత అతని వారసుడు హుమాయున్ ఢిల్లీ సింహాసనమెక్కాడు. సా.శ. 1539 సంవత్సరంలో జరిగిన చౌసా యుద్ధం, 1540లో జరిగిన కనౌజ్ యుద్ధంలో ఆఫ్ఘన్ రాజు షేర్షా సూరి చేతిలో ఓడిపోయి పర్షియాకు వెళ్లి తలదాచుకున్నాడు. మచ్చివారా యుద్ధం (సా.శ. 1555)లో ఆఫ్ఘనులను ఓడించి పంజాబ్, ఢిల్లీలను మళ్ళీ ఆక్రమించి ఢిల్లీపై మొఘలుల అధికారం పునఃస్థాపించాడు.

### 11.9.1 అక్బర్, జహాంగీర్, షాజహాన్ పరిపాలన విశేషాలు


చిత్రం-11.3: అక్బర్

సా.శ. 1556లో హుమాయున్ మరణం తరువాత అతని వారసుడు అక్బర్ మొఘల్ సింహాసనం అధిష్టించాడు. భారతదేశంలో మొఘల్ సార్వభౌమత్వాన్ని పటిష్టం చేసిన ఘనత అక్బర్‌కు దక్కుతుంది. సమర్థ పరిపాలన యంత్రాంగం, పటిష్ట సంస్కరణలు చేపట్టి మొఘల్ పాలనను సుస్థిరం చేశాడు. 13 సంవత్సరాల వయసులోనే అధికారాన్ని చేపట్టాడు. ఈ సమయంలో హేమచంద్ర ఢిల్లీని ఆక్రమించి విక్రమాదిత్య పేరుతో స్వాతంత్రాన్ని ప్రకటించుకుంటాడు. మధ్యయుగ భారతదేశ చరిత్రలో అతి స్వల్ప కాలం ఢిల్లీ సింహాసనాన్ని ఆక్రమించిన మొదటి, చివరి హిందూ రాజు హేమచంద్ర. సా.శ. 1556లో జరిగిన రెండవ పానిపట్టు యుద్ధంలో అక్బర్ విజయం సాధించాడు. దీనినే రెండవ పానిపట్టు యుద్ధంగా పిలుస్తారు. సా.శ. 1561లో మాళ్వా, జాన్‌పూర్‌ను, 1564లో గోండ్వానాను, 1572-73లో గుజరాత్‌ను, 1574-76లో బీహార్, బెంగాల్‌లను ఆక్రమించాడు.

తన అధికారాన్ని సుస్థిరం చేసుకోవడానికి అక్బర్ రాజపుత్రులతో ఒకవైపు మైత్రి, మరో వైపు యుద్ధ తంత్రాన్ని అనుసరించాడు. తన అధికారాన్ని ఒప్పుకున్న రాజపుత్ర రాజ్యాలలోని రాకుమార్తెలను పెళ్ళి చేసుకోవడం, ఒప్పుకోని వారిపై దండెత్తి లోబరచుకోవడం అనే విధానాన్ని అక్బర్ అనుసరించాడు. అక్బర్ రాజపుత్రులతో జరిపిన యుద్ధాలలో అత్యంత ప్రధానమైనవి మేవాడ్, హల్దీ ఘాట్ యుద్ధాలు. అక్బరే స్వయంగా తన సైన్యాలకు నాయకత్వం వహించి పోరాడినప్పటికీ శిశోడియా వంశీయుడైన రాణా ఉదయ్‌సింగ్, రాణా ప్రతాప్‌సింగ్‌లు తీవ్రంగా ప్రతిఘటించారు.

అక్బర్ చేపట్టిన పాలన, సామాజిక, మత సంస్కరణలు చరిత్రలో అతనిని అగ్రగణ్య పాలకునిగా నిలిపాయి. రాజాతోడర్ మల్ ఆధ్వర్యంలో రెవెన్యూ విధానం రూపొందించి జాగీర్లను రద్దు పరిచాడు. దహసాలా అను పద్ధతిని ప్రవేశపెట్టి భూమిని సర్వే చేయించి, భూమి రకం, పది సంవత్సరాల పంట ధరల సగటు ఆధారంగా శిస్తు వసూలు చేశాడు. సైన్యాన్ని పటిష్టం చేయటానికి మన్సబ్‌దారీ అనే విధానం ప్రవేశపెట్టి సైనికుల హోదాలకనుగుణంగా వేతనాలు చెల్లించే విధానం అనుసరించాడు. మిగతా మొఘల్ చక్రవర్తులతో పోల్చినపుడు అక్బర్‌కాంత మత సహనాన్ని పాటించాడు. అనేక మంది ముస్లిం మత గురువులతో, హిందూ మతాచార్యులతో, సూఫి సన్యాసులతో నిరంతరం సంభాషణలు, చర్చలు చేసేవాడు. ఫతేపూర్ సిక్రిలో 'ఇబాదత్ ఖానా' అనే సమావేశ మందిరం ఏర్పాటు చేసి అన్ని మతాల గురువులను అందులో ఆహ్వానించాడు. అన్ని మతాల సారంతో 'దీన్-ఇ-ఇలాహి' అనే మత విధానాన్ని ఏర్పాటు చేశాడు. కానీ అది విజయవంతం కాలేదు.

> అక్బర్ అనుసరించిన మత విధానం తన రాజ్య ప్రయోజనాల దృష్టిలో ఉంచుకొని అమలు చేయబడ్డదా లేదా ప్రజా సంక్షేమంను దృష్టిలో ఉంచుకుని అమలు చేయబడ్డదా?

అక్బర్ మరణానంతరం సా.శ. 1605లో జహంగీర్ సింహాసనం అధిష్టించాడు. సా.శ. 1610లో కాంగ్రా కోటను, అహ్మద్‌నగర్‌ను జహంగీర్ ఆక్రమించాడు. కాని రాజ్యంలో వచ్చిన తిరుగుబాట్ల వలన కొని ప్రాంతాలను కోల్పోయాడు. జహంగీర్ దురలవాట్లకు బానిసై పరిపాలనపై దృష్టి పెట్టలేకపోవడం వలన పాలనలో అతని భార్య నూర్జహాన్ జోక్యం ఎక్కువైనది. దీనితో అసంతృప్తి చెందిన షాజహాన్ తిరుగుబాటు చేశాడు. తిరుగుబాట్లను జహంగీర్ అణచివేసినప్పటికి అవి అతని పాలనను బలహీనపరచాయి. జహంగీర్ సాహిత్యం, కళల పట్ల అభిమానం కలిగి ఉండేవాడు. స్వయంగా 'తుజకి-ఇ-జహంగీరి' అనే స్వీయ చరిత్రను రాశాడు. చిత్ర కళ పట్ల ఇతనికి అభిరుచి ఎక్కువ. రాజ్యంలో ధర్మ గంటను నెలకొల్పి సామాన్యులకు స్వయంగా అందుబాటులో ఉండి న్యాయం అందించేందుకు కృషి చేశాడు. అయితే హిందువుల దేవాలయాలను ధ్వంసం చేయడం, సిక్కులు, జైనులను, సూఫిలను హింసించడం, అజ్మీర్ క్షేత్రాన్ని ధ్వంసం చేయడం అతని పాలనలో తప్పిదాలుగా మిగిలాయని చెప్పవచ్చు

జహంగీర్‌పై తిరగబడి అతని కుమారుడు షాజహాన్ సా.శ. 1627లో మొఘల్ సింహాసనం ఆక్రమిస్తాడు. రాజ్య విస్తరణలో భాగంగా దక్షిణ భారత రాజ్యాలైన బీజాపూర్, గోల్కొండలపై దండయాత్ర జరిపాడు. ఈ కాలం వాస్తు నిర్మాణ రంగంలో అభివృద్ధి చెందింది. ఆగ్రాలోని తాజ్ మహల్, ఆగ్రా కోటలోని దివాన్-ఇ-ఖాస్, మోతి మసీదు, జామా మసీదు అతని కాలంలో నిర్మించడ్డాయి. ఢిల్లీలోని ఎర్రకోట, అందులోని రాజ భవనాలు అద్భుత వాస్తు నైపుణ్యాలకు తార్కాణాలు. కోహినూర్ వజ్రాన్ని పొదగి తయారు చేయించిన బంగారు నెమలి సింహాసనం షాజహాన్ కళా పిపాసకు నిదర్శనం. అతని ఆస్థానంలో ఎందరో గొప్ప కవులు, కళాకారులు ఉండేవారు. అయితే ప్రజలపై పన్నుల భారం అధికంగా ఉండడం, బనారస్‌లోని హిందూ దేవాలయాలను కూల్చడం, క్రైస్తవులైన పోర్చుగీసు వారిని, సిక్కు మతస్తులను వేధించడం ఇతని పాలనలోని లోపాలుగా చెప్పవచ్చు.

షాజహాన్ తరువాత తన సోదరులందరిని హతమార్చి ఔరంగజేబ్ రాజ్యాధికారం వహించాడు. అయితే బాల్యం నుంచే మత గురువుల సాన్నిధ్యంలో పెరగడం వలన అతనికి లౌకిక భావాలు అలవడలేదు. సున్నీ

మతాభిమాని కావడం వలన పరిపాలనలో మతపరమైన ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. తన దర్బార్‌లో పర్షియన్ పద్ధతి ప్రకారం జరిపే 'నౌరోజ్' పండుగను నిషేధిస్తాడు. ముస్లిం సాంప్రదాయాలకు విరుద్ధమని భావించి సంగీతం, శిల్పం, చిత్ర లేఖనం వంటి కళలను నిషేధించాడు. ఆస్థానం నుండి కళాకారులను బహిష్కరించాడు. పరమత ద్వేషం ప్రదర్శిస్తూ కాశీలోని ప్రసిద్ధ విశ్వేశ్వర దేవాలయాన్ని, గుజరాత్‌లోని సోమనాథ మందిరాన్ని, మధురలోని కేశవాలయాన్ని కూలగొట్టించాడు. గోవధను ప్రోత్సహించాడు. జిజియా మరియు యాత్రికుల పన్నులను వసూలు చేయడం పునఃప్రారంభించాడు. అంతేకాక సిక్కుల 9వ మత గురువు అయిన గురు తేజ్ బహదూర్‌ను ఢిల్లీకి రప్పించి ఇస్లాం స్వీకరించమని బలవంతం చేశాడు. అందుకు నిరాకరించిన తేజ్ బహదూర్‌ను చిత్రహింసలకు గురి చేసి శిరచ్ఛేదం చేస్తాడు. ఈ పరమత విద్వేషంతో కూడిన పాలనకు వ్యతిరేకంగా సామ్రాజ్యమంతటా తిరుగుబాట్లు మొదలైనాయి. ఛత్రపతి శివాజీ నాయకత్వంలో మరాఠాలు జరిపిన తిరుగుబాటు అత్యంత ప్రముఖమైనదిగా చెప్పవచ్చు. మరాఠాలతో యుద్ధంలో ఔరంగజేబ్ దాదాపు 20 సంవత్సరాలు దక్షిణ భారతంలో మకాం వేయవలసి వచ్చింది. ఫలితంగా ఔరంగజేబ్ పాలనపై పట్టు కోల్పోయాడు. చివరికి మరాఠాలను అణచలేక నిరాశతో సా.శ. 1707లో మరణిస్తాడు. అతను అనుసరించిన ఈ విద్వేష పాలన మొఘల్ సామ్రాజ్య ఉనికికే ముప్పు తెచ్చి పెట్టింది. నిరంతర తిరుగుబాట్లు, యుద్ధాల వలన అర్థికంగా, సైనికంగా అపార నష్టం సంభవించింది. ఫలితంగా రాజ్య పతనం ప్రారంభమైనది.

### 11.9.2 సామాజిక, అర్థిక పరిస్థితులు

మొఘల్ కాలం నాటికి భారతదేశంలో ఎందరో రాజులు, రాజ వంశాలు, మతాలు మారినా కుల వ్యవస్థలో పెద్దగా మార్పులేమి రాలేదు. స్వదేశీ రాజులైనా, విదేశీ రాజులైనా తమ ఆధిపత్యాన్ని కొనసాగించడానికి కుల వ్యవస్థను అలాగే కొనసాగనిచ్చారు. కులాన్ని బట్టి, వృత్తిని బట్టి కులం నిర్ణయించే పద్ధతి మొఘల్ కాలం వరకు కూడా అలాగే కొనసాగింది. అయితే విదేశాల నుంచి వచ్చిన తురుష్కులు, ఆఫ్ఘనులు, ఉజ్బేగ్‌లు, మంగోలులు వంటి వారు వచ్చి దేశంలో స్థిరపడడం, స్వదేశీయులను మత మార్పిడి చేయడంతో కొన్ని నూతన సామాజిక వర్గాలేర్పడ్డాయి. మత మార్పిడి చేసుకున్న వారితో పోల్చితే పాలక వర్గంగా ఉన్న విదేశీయులు అధిక హోదాను కలిగి ఉండేవారు. ముస్లిం సమాజంలో షేక్, సయ్యద్, సూఫీ, పఠాన్, ఫకీర్ అనే వర్గాలుండేవి. ఈ కాలం నాటికి మహిళల పరిస్థితిలో పెద్ద మార్పులేమి రాలేదు. రాజకీయ, సామాజిక, ఆర్థిక ఆధిక్యతను అనుభవిస్తున్న వారి విలాస వస్తువుగా మహిళను పరిగణించడం కొనసాగుతున్నది. అక్బర్ రాజాంతపురంలో 5000 మంది స్త్రీలు ఉన్నట్లు చెప్పబడుతుంది. ముస్లింలలో ఉన్న 'తలాఖ్' పద్ధతి, 'పరదా' పద్ధతి, బాహు భార్యత్వం స్త్రీల బానిసత్వానికి, పురుషుల అవసరాలకు ఉపయోగపడే విధానాలకు చిహ్నాలుగా మారినాయి. హిందూ సమాజంలో సతి వంటి దురాచారాలు కొనసాగుతున్నాయి. బాల్య వివాహాలు సమాజంలో సర్వ సాధారణమైనాయి. పాలక వర్గ కుటుంబాలలో తప్ప స్త్రీలు సమాజంలో విద్యకు పూర్తిగా దూరం జరిగారని చెప్పవచ్చు.

మొఘల్ పాలన కాలంలో వరి, గోధుమ వంటి ఆహార ధాన్యాలతో పాటు పసుపు, ప్రత్తి, చెరకు వంటి వాణిజ్య పంటలు పండించేవారు. ఉత్తర ప్రదేశ్, బెంగాల్, బీహార్ వంటి ప్రాంతాలలో చెరకు అధికంగా పండించేవారు. గంగా, యమున ప్రాంతాలలో నీలిమందు, గుజరాత్, దక్కన్ ప్రాంతాలలో ప్రత్తిని పండించేవారు. బెంగాల్, బీహార్, ఒరిస్సా, గుజరాత్ వంటి ప్రాంతాల్లో నేత పరిశ్రమ విస్తరించింది. రాజస్థాన్, సంభార్ ప్రాంతాల్లో ఉప్పు

తయారు చేసేవారు. పన్నుల భారం వీరిపై ఎక్కువగా ఉండేది. కరువు కాటకాలు తరచుగా సంభవించేవి. సా.శ. 1630లో మొఘల్ రాజ్యమంతా తీవ్ర క్షామం ఏర్పడింది. సా.శ. 1641లో కాశ్మీర్‌లో అతివృష్టి సంభవించి దాదాపు 50,000 మంది ప్రజలు లాహోర్‌కు తరలి వెళ్ళారని, షాజహాన్ ఈ పరిస్థితులను ఎదుర్కోవడానికి అనేక చర్యలు చేపట్టడని నాటి సమకాలీన గ్రంథాలు చెబుతున్నాయి. షేర్షా కాలంలో రూపుదిద్దుకున్న రూపాయి అను నాణెం అక్బర్ కాలం నాటికి విస్తృతంగా చలామణి అయింది. అధిక విలువ గల మహ్రా, అష్రఫి అనే స్వచ్ఛమైన బంగారు నాణెములను మొఘల్ రాజులు ముద్రించారు. జిజియా, గౌషుమారి, సలామి, సరాఫి, హజాని, జరిబ్ వంటి అనేక రకాల పన్నుల వల్ల రాజ్య ఆదాయం విపరీతంగా పెరిగింది. కాని ప్రజలు ఈ పన్నుల వల తీవ్ర ఇబ్బందులెదుర్కొన్నారు.

### 11.9.3 వాస్తు, శిల్ప, సాహిత్య, కళా రంగాల అభివృద్ధి



*చిత్రం-11.4: ఆగ్రాలోని తాజ్‌మహల్*

మొఘల్ వంశ స్థాపకుడైన బాబర్ స్వయంగా కవి. తుర్కి భాషలో తన స్వీయ చరిత్ర 'తుజకీ-ఇ-బాబరీ' పేరుతో రాశాడు. హుమాయున్ మేనత్త 'హుమాయున్ నామా' అను గ్రంథాన్ని రాశారు. అక్బర్ ఆస్థానంలో తుర్కి, పారశీ, సంస్కృతం, హిందీ తదితర భాషల్లో చరిత్ర నుంచి అనువాదాల వరకు అనేక గ్రంథాలు రాయబడినాయి. అబుల్ ఫజల్ "అక్బర్ నామా, అయిన్-ఇ-అక్బరి" అను గ్రంథాలు రాశాడు. బదౌని రాసిన ముంతఖాబ్-ఉత్-తవారిక్, నిజాముద్దీన్ అహ్మద్ రాసిన తబాకత్-ఇ-అక్బరీ నాటి ప్రముఖ చారిత్రక గ్రంథాలు. అక్బర్ కాలంలోనే మహాభారతం 'రజం నామా' పేరుతో పర్షియన్ భాషలోకి అనువదించబడింది. 'రామాయణ గ్రంథం' కూడా పర్షియన్‌లోకి అనువాదం చేయబడింది. ఇబ్రహి సర్ హింది 'అధర్వణ వేదాన్ని', ఫైజి 'లీలావతి గణిత శాస్త్రాన్ని' మల్ మల్ ఖాన్ జ్యోతిష్య శాస్త్రాన్ని పర్షియన్ భాషలోకి అనువదించారు. 'రామ చరిత్ మానస్' రాసిన తులసీదాస్, సూర సాగర్‌ను రాసిన సూరదాస్, కేశవదాస్, భగవాన్‌దాస్ అను హిందీ కవులు అక్బర్ ఆస్థానంలో ఆదరణ పొందారు. షాజహాన్ కుమారుడు దారాషుకో భగవద్గీతను, ఉపనిషత్తులను పర్షియన్ భాషలోకి అనువదించాడు.

వాస్తు శిల్ప కళ మొఘల్ కాలంలో ప్రపంచ పసిద్ధిగాంచింది. ఆగ్రా, ఢిల్లీ, ఫతేపూర్ సిక్రి తదితర ప్రాంతాలలో మొఘలులు నిర్మించిన కోటలు, రాజ భవనాలు, మసీదులు, దర్వాజాలు అత్యంత సుందర నిర్మాణాలుగా పేరు

పొందాయి. అక్బర్ కాలంలో హిందు, ముస్లీం వాస్తు పద్ధతులు సమ్మిళితమై ఒక నూతన నిర్మాణ శైలి రూపొందింది. ఆగ్రాలో పాలరాయితో నిర్మించబడ్డ తాజ్ మహల్, ఢిల్లీలోని ఎర్రకోట, జామా మసీదు మొదలైనవి అద్భుత వాస్తు నిర్మాణాలకు ప్రతీకలు. బాబర్ నుంచి షాహజాన్ వరకు తోటల నిర్మాణాన్ని ప్రోత్సహించి అనేక సుందర తోటలను నిర్మించారు.

లలిత కళలైన సంగీతం, చిత్ర లేఖనం మొదలగునవి నాడు సృజనాత్మకతకు ప్రతీకగా నిలిచినవి. హిందుస్థానీ సంగీతానికి ప్రాణం వంటివాడైన 'తాన్ సేన్' అక్బర్ ఆస్థానంలో ఉండేవాడు.

### 11.9.4 సామ్రాజ్య పతనం - కారణాలు

మొఘల్ సామ్రాజ్యం ఔరంగజేబ్ కాలం నుంచి క్రమంగా పతనం కావడం ప్రారంభమైంది. అనేక అంతర్గత, బహిర్గత కారణాలు ఇందుకు దోహదపడినాయని చెప్పవచ్చు. తరచుగా వారసుల మధ్య సింహాసనం కొరకు పోరాటం, చక్రవర్తుల భోగ లాలసత, ఆ సమయంలో స్వార్థపరులైన ఆస్థాన సభ్యుల తిరుగుబాట్లు ఆర్థికంగా, రాజకీయంగా మొఘల్ సామ్రాజ్యానికి నష్టం చేకూర్చాయి. ఔరంగజేబ్ అనుసరించిన తీవ్ర మత విద్వేషం ఫలితంగా దేశంలో అన్ని ప్రాంతాలలో తిరుగు బాట్లు చెలరేగడం, ఔరంగజేబ్ తరవాత వచ్చిన వారసులు బలహీనమవడం, యూరోపియన్ శక్తుల ఫలితంగా మొఘల్ సామ్రాజ్యానికి ఎదురయ్యే సవాళ్ళను ఊహించే దూరదృష్టి లోపించడం వలన సరైన సమయంలో సరైన చర్యలు తీసుకోలేకపోయారు. ఫలితంగా మొఘల్ సామ్రాజ్యం క్రమంగా పతనమైనది.

## 11.10 సమకాలీన ప్రాంతీయ రాజ్యాలు-కాకతీయులు, విజయనగర రాజులు, మరాఠాలు, బహమనీలు

సా.శ. 14 నుండి 17వ శతాబ్దం భారత దేశ చరిత్రలో అనేక కీలక పరిణామాలకు వేదికైంది. ముఖ్యంగా కాకతీయులు, విజయనగర రాజ్యం, మరాఠాలు తదితర ప్రాంతీయ రాజ్యాలు పుట్టుకొచ్చి దక్షిణ భారతంలో ఇస్లామిక్ దాడుల నుంచి ప్రాచీన భారత సంస్కృతిని కాపాడుతూ వారి సామ్రాజ్య విస్తరణను అడ్డుకున్నాయని చెప్పవచ్చు. తెలంగాణ, ఆంధ్ర ప్రాంతంలో కాకతీయులు, కర్నాటక, రాయలసీమ ప్రాంతాలలో విజయనగర రాజులు, మహారాష్ట్ర ప్రాంతంలో మరాఠాలు సుస్థిర పాలన అందిస్తూ సాహిత్య, వాస్తు తదితర కళలకు విశేష సేవలందించాయి. కాకతీయుల గురించి మీరు 'తెలంగాణ చరిత్ర' అను పాఠ్యాంశంలో వివరంగా తెలుసుకుంటారు.

### 11.10.1 బహమనీలు

దక్షిణ భారతంలో మొదటి స్వతంత్ర ముస్లిం రాజ్యం బహమనీ రాజ్యం. ఢిల్లీ సుల్తాన్ అయిన మహమ్మద్ బిన్ తుగ్లక్‌పై తిరుగుబాటు చేసిన అల్లావుద్దీన్ బహమన్ షా సా.శ. 1347లో దీనిని స్థాపించాడు. దీని రాజధాని ప్రస్తుత కర్నాటకలోని బీదర్. అల్లావుద్దీన్ బహమన్‌షా తరువాత వరుసగా మొదటి మహమ్మద్‌షా, హుమాయున్‌షా, మూడవ అహ్మద్‌షా, మూడవ మహమ్మద్‌షాలు సింహాసనం అధిష్టించారు. వీరి కాలంలో మహమ్మద్ గవాన్ ప్రధానమంత్రిగా చాలా కీలక పాత్ర పోషించారు. అయితే విజయనగర రాజ్యంతో నిరంతర యుద్ధాలతో బలహీనమైన బహమనీ రాజ్యం సా.శ. 1518లో ఐదు స్వతంత్ర రాజ్యాలుగా విడిపోయింది. అహ్మద్‌నగర్‌లో నిజాంషాహీలు, బీదర్‌లో బరిద్ షాహీలు, గోల్కొండ కేంద్రంగా కుతుబ్‌షాహీలు, బీరార్ కేంద్రంగా ఇమద్‌షాహీలు, బీజాపూర్

కేంద్రంగా ఆదిల్‌షాహీలు తరువాతి కాలంలో పాలించారు. బహుమనీల కాలంలో హిందూ, ముస్లిం సంస్కృతుల సమ్మేళనం జరిగి దక్షిణ భారతదేశంలో ఒక నూతన సంస్కృతికి నాంది పలికిందని చెప్పవచ్చు. వీరి కాలంలో పర్షియన్ భాషలో అనేక గ్రంథాలు వెలువడినాయి. ఇండో–ఇస్లామిక్ వాస్తు కళల మేళవింపుతో అనేక రాజ భవనాలు, మసీదులు, కోటలు, మదర్సాలు నిర్మించబడినాయి. బీజాపూర్‌లోని మహమ్మద్ ఆదిల్‌షా సమాధి అయిన గోల్ గుంబజ్ చాలా ప్రసిద్ధమైన నిర్మాణం.

### 11.10.2 మరాఠా సామ్రాజ్యం - శివాజీ - పరిపాలన, ఇతర సంస్కరణలు



చిత్రం–11.5: ఛత్రపతి శివాజీ మహారాజ్

మరాఠా సామ్రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ. షాహజీ భోంస్లే, జిజాబాయి దంపతులకు శివనేరు కోటలో సా.శ. 1627, ఫిబ్రవరి 19న జన్మించారు. తల్లి జిజాబాయి పెంపకంలో పెరిగిన శివాజీ బాల్యం నుంచే అసమాన ధైర్య పరాక్రమాలు కలిగినవాడు. సమర్థ రామదాసు, సంత్ తుకారాం బోధనలచే ప్రభావితం అయిన శివాజీ మహారాష్ట్ర రాజ్యమే కాదు, మహారాష్ట్ర జాతిని నిర్మించాడని చెప్పవచ్చు. అందువల్లనే శివాజీని 'మహారాష్ట్ర జాతి పిత' అని పిలుస్తారు. మహారాష్ట్రలోని వివిధ వర్గాల్లో ఐక్యత భావాన్ని కల్పించి, ధర్మ రక్షణ కొరకు అవిశ్రాంత కృషి చేశాడు. అతని నేతృత్వంలో మరాఠాలు ఔరంగజేబు అనుసరించిన మత విద్వేషాన్ని అడ్డుకొని భారతీయ సంస్కృతిని ఒక వైపు రక్షిస్తూ, మరోవైపు క్రమశిక్షణ గల పరిపాలనతో ఢిల్లీ వరకు తమ సార్వభౌమత్వంను విస్తరించారు. మరాఠాలు వ్యవసాయం ప్రధాన వృత్తిగా జీవిస్తున్న వివిధ కులాల మిశ్రమం. వారు ఒక వైపు వ్యవసాయం చేస్తూనే అవసరమైనప్పుడు సైనికులుగా పని చేసేవారు. మావళీలుగా పిలిచే వీరిని దాదాజీ కొండదేవ్ సహాయంతో శివాజీ ఏకీకృతం చేశాడు. తానాజీ మాల్ సురే, గోమాజీ నాయక్, పానా సంభాల్ మొదలగు విశ్వాసపాత్రులను తన సేనా నాయకులుగా నియమించుకొని సా.శ. 1646 సంవత్సరంలో బీజాపూర్ రాజ్యంలోని తోరణ దుర్గాన్ని ఆక్రమించడం ద్వారా తన తొలి విజయాన్ని నమోదు చేశాడు. తరువాత వరసగా చకన్, కోండన, పురంధర్, బారామతి మొదలగు ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నాడు. సా.శ. 1652లో సింహగఢ్ దుర్గాన్ని జయించాడు. 1656లో జావళీ ప్రాంతాన్ని ఆక్రమించాడు. 1657లో కొంకణ్ ప్రాంతాన్ని తన ఆధీనంలోకి తెచ్చాడు. తరువాత కళ్యాణ్, భివండీ అను ప్రాంతాలను ఆక్రమించి తన నావికాదళ స్థావరాలుగా మార్చాడు. బీజాపూర్‌లోని ప్రాంతాలను వరుసగా ఆక్రమిస్తూ రాజ్య విస్తరణ చేస్తున్న శివాజీని నియంత్రించడానికి బీజాపూర్ సుల్తాన్ అఫ్జల్‌ఖాన్ అను సేనానిని పంపిస్తాడు. శివాజీని మోసంతో లొంగదీసుకోవాలని అఫ్జల్‌ఖాన్ పథక రచన చేస్తాడు. కాని సమయస్ఫూర్తి కలిగిన శివాజీ చేతిలో అతడు వధించబడతాడు.

మొఘల్ ప్రాంతాల వైపు విస్తరిస్తున్న శివాజీకి అడ్డుకట్ట వేయటానికి ఔరంగజేబ్ నాటి దక్కన్ గవర్నర్ షాహిస్తాఖాన్‌ను పూనా అక్రమణకు పంపిస్తాడు. కాని షాహిస్తాఖాన్ శివాజీ చేతిలో గాయపడి పారిపోతాడు. మొఘల్ సైన్యాలను తరుముకుంటూ శివాజీ 1664లో మొఘల్ ముఖ్య పట్టణమైన సూరత్‌పై దాడి చేసి అపార ధనరాశులను కొల్లగొడతాడు. తరవాత ఔరంగజేబ్ రాజా జైసింగ్ నేతృత్వంలో భారీ సైన్యాన్ని శివాజీపైకి పంపిస్తాడు. 1665 సంవత్సరంలో జైసింగ్ పురంధర్ కోటను బంధించి మరాఠా గ్రామాలను కొల్లగొడతాడు. శివాజీ సమయస్ఫూర్తితో జైసింగ్‌తో 'పురంధర్ సంధి' చేసుకుంటాడు. సంధి షరతుల ప్రకారం సా.శ. 1666లో మొఘల్ అస్థానాన్ని శివాజీ సందర్శిస్తాడు. కాని అక్కడ  ఔరంగజేబ్ అతనిని బంధిస్తాడు. కాని కొన్ని వారాల్లోనే అత్యంత చాకచక్యంగా మొఘల్ చెర నుంచి తప్పించుకుని తిరిగి తన స్వరాజ్యం చేరుకుంటాడు. తాను కోల్పోయిన పురంధర్, సింహగఢ్, రోహిందా, లోహగఢ్ వంటి ప్రాంతాలను మొఘల్‌ల నుండి తిరిగి స్వాధీనం చేసుకుంటాడు. తన స్థానాన్ని సుస్థిరం చేసుకుని సా.శ. 1774లో 'ఛత్రపతి' అను బిరుదుతో పట్టాభిషేకం చేసుకుంటాడు.

శివాజీ ఒక గొప్ప యోధుడే కాక ఒక సంస్కారవంతుడైన పాలకుడు. ఔరంగజేబ్ మత విద్వేశాన్ని ప్రదర్శిస్తూ తన శత్రు రాజ్యాలలోని మందిరాలను ధ్వంసం చేస్తుంటే శివాజీ మత సహనం చూపిస్తూ అన్య మతస్తులను గౌరవిస్తాడు. తన ముఖ్య సేనానుల్లో అనేక మంది ముస్లింలు ఉండేవారు. కళ్యాణ్ ఆక్రమణ సమయంలో శివాజీ వ్యక్తిత్వపు గొప్పతనమును తెలుసుకోవచ్చు. తమ  సైన్యాల చేత చిక్కిన బీజాపూర్ కోడలిని సైనికాధికారులు శివాజీకి బహుమతిగా పంపినప్పుడు, ఆమెను తన తల్లితో పోల్చి గౌరవించి, ఆభరణాలు బహుమతిగా ఇచ్చి బీజాపూర్ రాజ్యానికి తిరిగి పంపించాడు శివాజీ. తన సమయస్ఫూర్తి, అసమాన ధైర్య సాహసాలతో ముస్లిం దాడుల నుంచి దక్షిణ భారతాన్ని, హైందవ సంస్కృతిని రక్షించడంలో శివాజీ పోషించిన పాత్ర నిరుపమానమైనదని చెప్పవచ్చు. అతని మరణానంతరం శంభాజీ, సాహు,  పీష్వాల నేతృత్వంలో మరాఠా రాజ్యం క్రమంగా ఢిల్లీ వరకు విస్తరించింది.

### 11.10.3 పరిపాలన

మరాఠా ప్రాంతం భౌగోళికంగా రాళ్లతో కూడిన నేలలు, కొండలు గుట్టలతో కూడి ఉంది. అటువంటి ప్రాంతాన్ని  ఒకవైపు మొఘల్ దాడుల నుంచి మరోవైపు బీజాపూర్ ఆక్రమణల నుంచి కాపాడుకుంటూ చక్కటి పాలనా వ్యవస్థను ఏర్పాటు చేసి సుస్థిరం చేశాడు శివాజీ. అతని లక్ష్యం 'స్వరాజ్య' స్థాపన. అమాత్య, సచివ్, సుమంత్, సేనాపతి, పండిత్‌రావ్ మొదలగు వారితో కూడిన 'అష్ట ప్రధాన్'లు అనే మంత్రి వర్గం సహాయంతో పాలన కొనసాగేది. రాజ్యమంతటిని 'ప్రాంత్'గా విభజించారు. వాటిని తిరిగి జిల్లాలుగా ఏర్పాటు చేశారు. సుబేదార్ జిల్లా అధిపతి. చౌత్ మరియు సర్దేశ్ ముఖి అను పన్నులు శివాజీ రాజ్యానికి ప్రధాన ఆదాయ వనరులు. తన రాజ్య రక్షణకు పటిష్ట సైన్యం ఏర్పాటు చేశాడు. పోర్చుగీసు వారి సహకారంతో  పటిష్ట నావికాదళాన్ని ఏర్పాటు చేసుకోవడం అతని దూరదృష్టికి నిదర్శనం. శివాజీ ఏర్పర్చిన పాలనా యంత్రాంగం, తన ప్రజలలో కలిగించిన స్వరాజ్య స్ఫూర్తి తరువాత కాలంలో మరాఠాల అధికారం ఢిల్లీ వరకు విస్తరించడానికి దోహదపడి భారతదేశ చరిత్రలో ఒక నూతనాధ్యాయం లిఖించిందని చెప్పవచ్చు.

## 11.11 ముగింపు (ముఖ్యాంశాలు)

- హర్ష వర్ధనుని మరణానంతరం ఉత్తర భారతదేశంలో రాజపుత్రులు, దక్షిణ భారతదేశంలో రాష్ట్రకూటులు, చోళులు, తూర్పు భారతంలో పాల వంశీయులు పరిపాలించారు.
- సా.శ. 712 వ సంవత్సరంలో భారతదేశంపై మహమ్మద్ బిన్ కాశీం నాయకత్వంలో అరబ్బుల దండయాత్ర జరిగింది కాని ఇది విఫలమైంది.
- తరువాత మహమ్మద్ గజని, మహమ్మద్ ఘోరిలు భారతదేశంపై అనేక దాడులు జరిపారు. మహమ్మద్ ఘోరి యొక్క ప్రతినిధి అయిన కుతుబుద్దీన్ ఐబక్ భారతదేశంలో ముస్లిం రాజ్యాన్ని స్థాపించాడు.
- ఢిల్లీ రాజధానిగా బానిస వంశం, ఖిల్జీ, తుగ్లక్, సయ్యద్, లోడీ వంశాల రాజులు దాదాపు 300 సంవత్సరాలు పరిపాలించారు. వీరి పాలన కాలంలో భారతదేశంలో అనేక సామాజిక, మత పరమైన మార్పులు సంభవించాయి.
- సా.శ. 1526 లో భారతదేశంలో మొఘల్ వంశ పాలన మొదలై బ్రిటిష్ వారి అధికార స్థాపన వరకు కొనసాగింది. కాలంలో భారతదేశం అనేక రాజకీయ, సామాజిక, మత, అర్థిక పరిణామాలకు వేదికైంది. వాస్తు కళలు, లలిత కళలు, సాహిత్యం విశేషంగా అభివృద్ధి చెందాయి.
- దక్షిణ భారతంలో శివాజీ నాయకత్వంలో మరాఠా సామ్రాజ్యం అవతరించి మొఘలుల విస్తరణను అడ్డుకుని భారతీయ సంస్కృతిని రక్షించడంలో కీలక పాత్ర పోషించింది.

## 11.12 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 1-2 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. ఉత్తర భారతదేశంలో మొదటగా స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించిన రాజపుత్రులెవరు?
2. ఇస్లాం మతం హిందూ ధర్మంపై ఎలాంటి ప్రభావం చూపెట్టింది?

**II. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 4-5 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. అక్బర్ కాలంలో రాజా తోడర్‌మల్ ప్రవేశపెట్టిన భూ సంస్కరణలు తెలియజేయండి.
2. మొఘలుల సామ్రాజ్య పతనానికి కారణాలు తెలియజేయండి.
3. శివాజీ పరిపాలనా విశేషాలను తెలపండి.

**III. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 8-10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. మొఘలుల నుండి శివాజీ మధ్య భారతాన్ని ఎలా రక్షించాడో వివరించండి.
2. ఢిల్లీ సుల్తానుల కాలంలోని పరిపాలన-రెవెన్యూ విశేషాలను తెలపండి.
3. జహంగీర్ కాలపు పాలనా విశేషాలను తెలియజేయండి.

### IV. బహుళైచ్ఛిక ప్రశ్నలు

1. ఖలీఫా ఆదేశాలను పాటించని ఢిల్లీ సుల్తాన్ ( )

   ఎ) మహ్మద్ బిన్ తుగ్లక్ బి) అల్లా ఉద్దీన్ ఖిల్జీ

   సి) కుతుబుద్దీన్ ఐబక్ డి) బాల్బన్

2. అక్బర్ ప్రవేశపెట్టిన మతం ( )

   ఎ) దీన్-ఇ-ఇలాహి బి) ఇబాదత్ ఖానా సి) దివాన్-ఇ-ఖాస్ డి) తలాఖ్

3. అష్ట ప్రధాన్ ఎవరి మంత్రి వర్గం ( )

   ఎ) శివాజీ బి) అక్బర్ సి) షాజహాన్ డి) రాణా ప్రతాప్

4. బాల్బన్ తన అస్థానంలో ప్రవేశపెట్టిన "పైబస్" అనగా ( )

   ఎ) పాదాలకు నమస్కరించడం బి) పాదాలకు ముద్దు పెట్టుకోవడం

   సి) సాష్టాంగ నమస్కారం డి) ఆలింగనం చేసుకోవడం

5. శివాజీని ఓడించడంలో విఫలమైన మొఘల్ రాజు ( )

   ఎ) జహంగీర్ బి) షాజహాన్ సి) ఔరంగజేబ్ డి) అక్బర్

## 11.13 ఉపయుక్త గ్రంథాలు


1. Indian History and Culture - Vol.II - B.S.L. Hanumantha Rao
2. Rise of the Maratah Power - M. G. Ranade
3. భారతదేశ చరిత్ర (సా.శ. 1526-1964) - తెలుగు అకాడమీ
4. సమగ్ర భారతదేశ చరిత్ర - మధ్య యుగం - కె.కృష్ణారెడ్డి

# 12 ఆధునిక భారతదేశం

## 12.0 అభ్యసన ఫలితాలు

- భారతదేశ చరిత్రలో ప్లాసీ యుద్ధానికి గల ప్రాముఖ్యతను వివరిస్తారు.
- 1857 తిరుగుబాటుకు గల కారణాలను మరియు తిరుగుబాటు ఫలితాలను వివరిస్తారు.
- మితవాదులు, అతివాదుల మధ్య లక్ష్యాలు, పద్ధతులలో గల భేదాలు తెల్పుతారు.
- మహాత్మాగాంధీలో తమకు నచ్చిన గుణ గణాలను వివరిస్తారు.
- భారతదేశ పటంలో వివిధ ప్రాంతాలను, నగరాలను గుర్తిస్తారు.

## 12.1 పరిచయం

భారతదేశానికి వర్తకం కొరకు వచ్చిన ఐరోపా వాసులు ఆ తర్వాత కాలంలో సామ్రాజ్య స్థాపనకై పోటీపడినారు. చివరకు బ్రిటీష్ వారు భారతదేశ పాలనను హస్తగతం చేసుకున్నారు. అందుకు భారతీయ రాజుల అనైక్యత కూడా కారణం. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన 1857 తిరుగుబాటు విఫలమైనప్పటికినీ, బ్రిటీష్ పాలన పట్ల భారతీయుల వ్యతిరేకతను, పోరాట పటిమను బ్రిటీష్ వారికి తెలియజేసింది. శతాబ్దకాలం కొనసాగిన జాతీయోద్యమంలో ఎందరో నాయకులు పోరాటం చేశారు. మహాత్మాగాంధీ ప్రజలలో నూతన చైతన్యాన్ని తీసుకువచ్చి జాతీయోద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చారు. ఈ పాఠ్యాంశంలో భారతదేశానికి యూరోపియన్ల రాక మొదలుకొని బ్రిటీష్ వారి నుండి స్వాతంత్ర్యం పొందే వరకు గల ముఖ్య ఘట్టాలను చదువుతారు.

## 12.2 భారతదేశంలో బ్రిటీష్ సామ్రాజ్య స్థాపన

ప్రాచీన కాలం నుండి భారతదేశం మరియు పాశ్చాత్య దేశాల మధ్య వాణిజ్యం కాన్‌స్టాంటి నోపుల్ గుండా భూమార్గం ద్వారా జరిగేది. 1453లో ఆ నగరాన్ని తురుష్కులు ఆక్రమించిన కారణంగా భూమార్గం మూసివేయబడినది. అందువల్ల యూరోపియన్లు సముద్ర మార్గాలను అన్వేషించవలసి వచ్చింది. పోర్చ్‌గీసు వారు భారతదేశానికి సముద్ర మార్గాన్ని కనుగొని మొదటగా భారతదేశానికి వచ్చారు. తరువాత డచ్‌వారు, ఆంగ్లేయులు, ఫ్రెంచ్ వారు వ్యాపార నిమిత్తం భారతదేశానికి వచ్చారు.

### 12.2.1 భారతదేశానికి యూరోపియన్ల రాక

**పోర్చుగీసువారు**

1498లో పోర్చుగల్ నావికుడైన వాస్కోడిగామా భారతదేశానికి సముద్ర మార్గం కనుగొని పడమటి తీరంలోని కాలికట్ చేరుకున్నాడు. కాలికట్ పాలకుడైన జామొరిన్ షా, వాస్కోడిగామాను ఆహ్వానించి పోర్చుగీసు వారికి వ్యాపార అనుమతులను ఇవ్వడం జరిగింది. తర్వాత వారు గోవా, డయ్యూ, డామన్‌లను ఆక్రమించారు. తర్వాతి కాలంలో వీరి స్థావరాలను డచ్‌వారు, ఆంగ్లేయులు ఆక్రమించుకున్నారు.

### డచ్‌వారు

హాలండ్ దేశస్థులైన వీరు "యునైటెడ్ ఈస్ట్ ఇండియా కంపెనీ ఆఫ్ నెదర్‌లాండ్స్" అనే వర్తక సంఘాన్ని ఏర్పాటు చేసుకొని 1605లో భారతదేశానికి వచ్చారు. చాలాకాలం పులికాట్‌ను తర్వాత నాగపట్నంను వ్యాపార కేంద్రంగా చేసుకొని వ్యాపారం సాగించారు. సముద్రాధిపత్యం గల ఇంగ్లాండ్ వారితో పోటీ పడలేక భారతదేశంలో తమ వ్యాపార కేంద్రాలను కోల్పోయారు.

### ఇంగ్లీషు వారు

1600 సంవత్సరంలో ఏర్పడిన "ఈస్ట్ ఇండియా వర్తక సంఘం" ఇంగ్లాండ్ మహారాణి అనుమతితో భారతదేశానికి వ్యాపారం కొరకు వచ్చింది. మొగల్ చక్రవర్తి జహంగీర్ నుండి వ్యాపార అనుమతులు పొందారు. 1611లో తమ మొదటి వ్యాపార స్థావరాన్ని ఏర్పాటు చేశారు. సూరత్ వీరి ప్రధాన వర్తక కేంద్రమయింది. తర్వాత ఫ్రెంచ్ వారిని ఓడించి భారతదేశంలో తమ సామ్రాజ్యాన్ని స్థాపించారు.

ఈస్టిండియా కంపెనీ చిహ్నం

### ఫ్రెంచ్ వారు

భారతదేశానికి వచ్చిన చివరి యూరోపియన్లు వీరు. 1668లో సూరత్‌లో తమ తొలి స్థావరాన్ని ఏర్పాటు చేశారు. చివరకు కర్ణాటక యుద్ధాలలో బ్రిటీష్ వారి చేతిలో ఓడిపోయి భారతదేశం నుండి వెళ్ళిపోయారు.

## 12.2.2 బ్రిటీష్ సామ్రాజ్య స్థాపన

ఆంగ్లేయులు కోరమండల్ తీరంలో డచ్‌వారిని, మలబార్ తీరంలో పోర్చుగీసు వారిని తొలగించారు. ఫ్రాన్స్ వారిని కర్ణాటక యుద్ధాలలో ఓడించారు. చివరకు ప్లాసీ యుద్ధం, బాక్సర్ యుద్ధాలలో విజయం సాధించి భారతదేశంలో తమ అధికారాన్ని స్థాపించారు.

## 12.2.3 కర్ణాటక యుద్ధాలు

ఐరోపా రాజకీయ సంఘటనలు మరియు మన దేశంలోని స్థానిక పరిస్థితుల ప్రమేయం వలన ఆంగ్లేయులకు, ఫ్రెంచి వారికి మధ్య మూడు కర్ణాటక యుద్ధాలు జరిగినవి. చివరకు ఆంగ్లేయులు విజయం సాధించి ఫ్రెంచి వారు భారతదేశాన్ని వదిలి వెళ్ళారు.

### మొదటి కర్ణాటక యుద్ధం (1746–1748)

ఫ్రెంచ్ గవర్నర్ డూప్లే తన రాజకీయ చతురతతో ఆంగ్లేయుల నుండి మద్రాసును ఆక్రమించగలిగినాడు. కాని తర్వాత జరిగిన ఒప్పందం ప్రకారం మద్రాసును ఆంగ్లేయులకు ఇచ్చివేయడం జరిగినది.

### రెండవ కర్ణాటక యుద్ధం (1749–54)

భారతదేశంలో స్థానిక సంస్థానాల అనిశ్చిత రాజకీయ పరిస్థితిని ఆసరాగా చేసుకొని ఫ్రెంచి వారు హైదరాబాద్, కర్ణాటక వారసత్వ యుద్ధాలలో తలదూర్చి ఆంగ్లేయులను ఎదురించి కర్ణాటకలో చందాసాహెబ్‌ను, హైదరాబాద్‌లో ముజఫర్ జంగ్‌ను సింహాసనంపై అధిష్టింపజేశారు. తర్వాత ఫ్రెంచి వారు హైదరాబాద్ సింహాసనాన్ని పొందడంలో సలబత్ జంగ్‌కు సహాయం చేసి ఉత్తర సర్కార్‌లను పొందినారు.

### మూడవ కర్ణాటక యుద్ధం (1758-1763)


భారతదేశంలో ఆంగ్లేయులను ఓడించుటకు ఫ్రెంచి ప్రభుత్వం "కౌంట్ డి లాలీ"ని భారతదేశానికి పంపించింది. కాని అతని అనాలోచిత నిర్ణయాల వలన ఫ్రెంచి వారు హైదరాబాద్‌లో తమ ప్రాబల్యాన్ని ఉత్తర సర్కారులను కోల్పోయారు. చివరకు ఆంగ్లేయుల చేతిలో ఓడిపోయి తమ ప్రాంతాలన్నింటిని కోల్పోయి భారతదేశాన్ని వదిలి వెళ్ళి పోయారు.

## 12.2.4 ప్లాసీ యుద్ధం (1757 జూన్ 25)



రాబర్ట్ క్లైవ్

బెంగాల్‌లో తమ ప్రాబల్యమును పెంచుకొనుటకు ఆంగ్లేయులు, ఫ్రెంచి వారు కోటల నిర్మాణాన్ని చేపట్టినారు. అట్టి నిర్మాణాలను ఆపివేయమని బెంగాల్ నవాబైన సిరాజ్ ఉద్ దౌలా ఆజ్ఞాపించెను. ఫ్రెంచి వారు నిర్మాణాలను ఆపివేయగా ఆంగ్లేయులు నవాబు ఆజ్ఞలను ఉల్లంఘించారు. అప్పుడు సిరాజ్-ఉద్-దౌలా కలకత్తాను ఆక్రమించి బెంగాల్ నుండి ఆంగ్లేయులను తరిమికొట్టెను. ఈ వార్త విన్న వెంటనే మద్రాస్ గవర్నర్, రాబర్ట్ క్లైవ్ నాయకత్వంలో సైన్యాన్ని బెంగాల్‌కు పంపెను. బెంగాల్ చేరిన రాబర్ట్ క్లైవ్, సిరాజ్-ఉద్-దౌలా సేనానియగు మీర్జాఫర్‌తో కుట్రపన్ని 1757లో జరిగిన ప్లాసీ యుద్ధంలో సిరాజ్-ఉద్-దౌలాను ఓడించి, మీర్జాఫర్‌ను బెంగాల్ నవాబుగా నియమించెను. ఫలితంగా కలకత్తా సమీపాన 24 పరగణాలను, విశేష ధనరాసులను నవాబు నుండి పొందెను. ఈ విధంగా ప్లాసీ యుద్ధం భారతదేశంలో బ్రిటీష్ సామ్రాజ్య స్థాపనకు పునాదులు వేసెను.




*పటం-12.1: ఈస్ట్ ఇండియా కంపెనీ రాజ్యం*


### 12.2.5 బక్సార్ యుద్ధం (1764)

బెంగాల్‌లో తమకు అనుకూలమైన వర్తక నిబంధనలు రూపొందించని కారణంగా బెంగాల్ నవాబుగా ఉన్న మీర్ ఖాసిమ్‌ను పదవి నుండి తొలగించి పూర్వపు నవాబైన మీర్జాఫర్‌ను ఆంగ్లేయులు బెంగాల్ నవాబును చేసినారు. పదవీచ్యుతుడైనా మీర్‌ఖాసిమ్ అయోధ్య నవాబైన షూజా ఉద్దౌలా, మొగల్ చక్రవర్తియైన షా అలంలతో కూటమిని ఏర్పర్చి ఆంగ్లేయులతో బక్సార్ యుద్ధంలో తలపడెను. కాని ఆంగ్లేయులు ఈ కూటమిని ఓడించారు. యుద్ధానంతరం బెంగాల్, బీహార్, ఒరిస్సాలలో పరిపాలన బాధ్యతలు నవాబుకు భూమి శిస్తు వసూలు అధికారం ఆంగ్లేయులకు అప్పగించడం జరిగి "ద్వంద్వ ప్రభుత్వం" ఏర్పాటు చేయబడెను. ప్లాసీ యుద్ధం బ్రిటీష్ సామ్రాజ్య స్థాపనకు పునాది వేస్తే, బక్సార్ యుద్ధం బ్రిటీష్ అధికారాన్ని భారతదేశంలో సుస్థిరం చేసెను.

**మీ ప్రగతిని పరీక్షించుకోండి**

1. ఎక్కువ మంది యూరోపియన్లను భారతదేశం ఆకర్షించడానికి గల కారణాలేమి?
2. కర్ణాటక యుద్ధాలలో ఫ్రెంచి వారి ఓటమికి వారి వ్యూహాలే కారణమా?
3. ప్లాసీ, బక్సార్ యుద్ధాలే భారతదేశంలో బ్రిటీష్ సామ్రాజ్య స్థాపనకు దారితీసినవా?

## 12.3 1857 తిరుగుబాటు



*చిత్రం-12.1: సిపాయిల తిరుగుబాటు*

ఆధునిక భారతదేశ చరిత్రలో 1857 తిరుగుబాటు ఒక గొప్ప సంఘటన. భారతదేశానికి వ్యాపారం కొరకు వచ్చిన బ్రిటీష్ వారు ఆనాటి భారతీయుల అనైక్యత, అంతరంగిక కలహాల కారణంగా 1740 దశకం నుండి భారత రాజకీయాలలో ప్రవేశించారు. ఆది నుండి భారతీయులు బ్రిటీష్ వారిని ప్రతిఘటిస్తూ వచ్చారు. కాని అవి స్థానిక తిరుగుబాట్లు కావడం వలన బ్రిటీష్ వారు తమ సైనిక బలంతో వాటిని అణచి వేశారు. 1857లో బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా ప్రారంభమైన తిరుగుబాటులో అసంతృప్తితో ఉన్న అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్నారు. నానా సాహెబ్, తాంతియా తోపే, ఝాన్సి లక్ష్మిబాయి మొదలగువారు తిరుగుబాటుకు నాయకత్వం వహించారు. 1857 తిరుగుబాటు విఫలమైనప్పటికినీ భారత స్వాతంత్ర్యోద్యమానికి నాందిగా నిలిచింది.



ఝాన్సి లక్ష్మిబాయి



నానా సాహెబ్



తాంతియా తోపే

## 12.3.1 తిరుగుబాటు కారణాలు

1857 తిరుగుబాటు అనేక సంవత్సరాలుగా పేరుకుపోయిన బలమైన కారణాల ఫలితంగా సంభవించింది. దీనికి గల కారణాలను రాజకీయ, ఆర్థిక, సాంఘిక, మత, సైనిక కారణాలుగా విభజించవచ్చు.

**రాజకీయ కారణాలు:**

డల్హౌసీ ప్రవేశపెట్టిన రాజ్యసంక్రమణ సిద్ధాంతం వలన హిందూరాజులకు దత్తత తీసుకొనే అవకాశం నిరాకరించబడి అనేక మంది రాజ్యాలను కోల్పోయారు. రాజుల బిరుదులు హరించబడ్డాయి. మొగల్ చక్రవర్తి బిరుదును రద్దు పరచడం, డల్హౌసి అయోధ్యను ఆక్రమించడం వంటి చర్యలు అన్ని వర్గాల ప్రజలలో అసంతృప్తిని కలిగించాయి. ఆయా రాజులు తిరుగుబాటుకు మొగ్గు చూపారు.

**ఆర్థిక కారణాలు:**

స్వదేశీ సంస్థానాలు ఆంగ్ల సామ్రాజ్యంలో కలిపి వేయబడడం కారణంగా అక్కడి సైనికులు, ఉద్యోగులు వృత్తిపనివారు, కళాకారులు ఉపాధి కోల్పోయారు. మన దేశం నుండి ముడి సరుకులను ఇంగ్లాండ్‌కు తరలించి అక్కడ తయారైన వస్తువులను అమ్మడానికి మన దేశాన్ని మార్కెట్‌గా ఉపయోగించడం వలన భారతీయ పరిశ్రమలు దెబ్బతిన్నాయి. కావున సాధారణ ప్రజలు కూడా తిరుగుబాటులో పాల్గొన్నారు.

**సాంఘిక కారణాలు:**

ఆంగ్లేయులు ప్రవేశపెట్టిన సతీసహగమన నిషేధం, బాల్య వివాహాలు రద్దు, వితంతు వివాహాలను చట్టబద్ధం గావించడం లాంటి చట్టాలు సనాతన హైందవ ధర్మానికి విరుద్ధమని ప్రజలు భావించారు. తంతి తపాల, ఆవిరి నౌకలు, రైల్వేలు ప్రవేశపెట్టడం కూడా తమ మతాన్ని కించపర్చడమేనని వారు భావించారు.

**మత కారణాలు:**

హిందూ, ముస్లిం మత సాంప్రదాయాలను అవహేళన చేస్తూ తమ మత ప్రచారాన్ని క్రైస్తవ మిషనరీలు ఉధృతం చేయడం, ఇంగ్లీషు విద్యను ప్రవేశపెట్టడం, మతం మార్చుకొన్నప్పటికినీ ఆస్తిలో హక్కు కల్పించడం, హిందూ మత వ్యవహారాలలో ప్రభుత్వం జోక్యం చేసుకోవడం వంటి వాటి వల్ల హిందూ, ముస్లింలు తమ మతాల రక్షణార్థం ఆంగ్లేయులను ప్రతిఘటించారు.

**సైనిక కారణాలు:**

కంపెనీ సైన్యంలో ఆంగ్ల సైనికులు, భారతీయ సైనికుల మధ్య విధులు, జీత భత్యాలు మరియు గౌరవ మర్యాదలలో చాలా తేడా ఉండేది. భారతీయ సిపాయిల జీత భత్యాలు తక్కువ. ఆహారం, వసతి సరిగా ఉండేవి కావు. వారిని చాలా హీనంగా చూసేవారు. కొత్తగా ప్రవేశపెట్టిన ఎన్‌ఫీల్డ్ తుపాకులలో ఉపయోగించే తూటాలకు ఆవు కొవ్వు మరియు పంది కొవ్వు పూసినట్లు వదంతులు వ్యాపించాయి. ఆవు హిందువులకు పవిత్రమైనది. పందిని ముస్లింలు అసహ్యించుకుంటారు. కావున ఆ తూటాలను కొరికి తుపాకులలో అమర్చడానికి భారతీయ

సిపాయిలు నిరాకరించారు. 1857 మార్చి 29న బారక్‌పూర్‌లో తూటాలను ఉపయోగించమని ఒత్తిడి చేసిన ఆంగ్ల అధికారిని మంగళ్ పాండే అనే భారతీయ సిపాయి కాల్చి చంపడంతో తిరుగుబాటు ప్రారంభం అయింది.

### 12.3.2 తిరుగుబాటు విఫలవడానికి కారణాలు

తిరుగుబాటు ఉత్తర, మధ్య భారతదేశాలకు మాత్రమే పరిమితమైంది. కాని దేశ వ్యాప్తంగా విస్తరించలేదు. కొద్ది మంది స్వదేశీ సంస్థానాధీషులు మాత్రమే తిరుగుబాటులో పాల్గొనగా కొందరు సంస్థానాదీషులు తిరుగుబాటును అణచడానికి బ్రిటీష్ వారికి సహాయపడినారు. బ్రిటీష్ వారిని ఎదుర్కొనే సైనిక సంపత్తి, ఆధునిక యుద్ధ పరికరాలు, అనుభవం మరియు సమర్థవంతమైన నాయకత్వం భారతీయులకు లోపించినవి. కావున ఆంగ్లేయులు తిరుగుబాటును అణిచి వేయగలిగినారు.

### 12.3.3 తిరుగుబాటు ఫలితాలు

1857 తిరుగుబాటు ఫలితంగా ఈస్ట్ ఇండియా కంపెనీ రద్దు చేయబడి భారతదేశ పాలన బ్రిటీష్ ప్రభుత్వానికి మార్చబడినది. భారతదేశ పాలన కొరకు15 మంది సభ్యులతో ఇండియా కౌన్సిల్ ఏర్పాటు చేయడం జరిగినది. 1858 చట్టాన్ననుసరించి గవర్నర్ జనరల్ బ్రిటీష్ పాలిత రాష్ట్రాలకు గవర్నర్ జనరల్‌గా, సంస్థానాలకు వైస్రాయ్‌గా వ్యవహరించును. ఆంగ్ల సైన్యంలో భారతీయ సైనికుల సంఖ్య తగ్గించబడెను. రాజ్య సంక్రమణ సిద్ధాంతం రద్దు చేయబడి రాజ్య విస్తరణను స్వస్తి చెప్పబడెను.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. స్వాతంత్ర్యోద్యమంలో 1857 తిరుగుబాటుకు గాంధీజీ సాగించిన పోరాటానికి మధ్య భేదాలను తెల్పండి.
2. ఆది నుండి బ్రిటీష్ పాలనను భారతీయులు ఎదురిస్తున్నప్పటికినీ 1857 తిరుగుబాటును భారత స్వాతంత్ర్య సంగ్రామం అని పిలవడాన్ని ఏ విధంగా సమర్థించవచ్చు?
3. 1857 తిరుగుబాటు ఫలితాలు భారతీయులకు మేలు చేసినవా? వివరించండి.

## 12.4 భారత స్వాతంత్ర్యోద్యమం

*పట్టిక 12.1: రాజకీయ సంఘాలు – స్థాపకులు*

| క్ర.సం. | సంస్థ | సంవత్సరం | స్థాపకులు |
|---|---|---|---|
| 1. | మొదటి భారత రాజకీయ సంఘం | 1866 | దాదాభాయి నౌరోజి |
| 2. | పూనా సార్వజనిక సభ | 1870 | జస్టిస్ గోవింద్ రానాడే |
| 3. | ఇండియన్ అసోసియేషన్ | 1876 | సురేంద్రనాథ్ బెనర్జీ |
| 4. | మద్రాసు మహాజన సభ | 1884 | ఎం.వి.రాఘవాచారి, జి.సుబ్రమణ్య అయ్యర్ |
| 5. | బొంబాయి ప్రెసిడెన్సీ అసోసియేషన్ | 1885 | ఫిరోజ్‌షా మెహతా, కె.టి.తెలాంగ్ |
| 6. | భారత జాతీయ కాంగ్రెస్ | 1885 | ఎ.ఓ.హ్యూమ్ |

మన దేశంలో బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమమే భారత స్వాతంత్ర్యోద్యమం. దేశంలోని అన్ని మతాల వారు. అన్ని వర్గాల వారు పాల్గొని దేశంలోని అన్ని ప్రాంతాలలో సాగిన ఒక మహా ప్రజా ఉద్యమం

భారత స్వాతంత్ర్యోద్యమం. 19వ శతాబ్దపు చివరలో కలకత్తా, మద్రాసు, బొంబాయి వంటి పెద్ద నగరాలలో ఆంగ్ల విద్యా వ్యాప్తితో భారతీయులలో జాతీయ భావం ప్రారంభమైంది. దేశంలో పరిపాలనాపరమైన, రాజకీయ పరమైన ఏకీకరణ, బ్రిటీష్ వారి ఆర్థిక దోపిడి, వారు ప్రవేశపెట్టిన సామాజిక మత సంస్కరణలు, ఆధునిక రవాణా కమ్యూనికేషన్‌ల అభివృద్ధి, భారతీయ వార్తా పత్రికలు వృద్ధి చెందడం, వంటివి భారతీయలలో జాతీయభావం పెంపొందించడానికి తోడ్పడ్డాయి.

ఫలితంగా అనేక ప్రాంతీయ రాజకీయ సంఘాలు ఏర్పాటు చేయబడ్డాయి. 1866లో దాదాబాయ్ నౌరోజి మొదటి భారతీయ రాజకీయ సంఘాన్ని, 1870లో జస్టిస్ గోవింద్ రానడేతో పాటు మరికొందరు పూనా సార్వజనీక సభను, 1876లో సురేంద్రనాథ్ బెనర్జీ, ఆనందమోహన్ బోసులు కలిసి ఇండియన్ అసోసియేషన్ ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతీయ సంఘాలు భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భవానికి దారి తీశాయి.

### 12.4.1 భారతీయ జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావం (1885)



*చిత్రం-12.2: భారత జాతీయ కాంగ్రెసు, 1885 మొదటి సమావేశానికి హాజరైన ప్రతినిధులు*

భారత జాతీయ కాంగ్రెస్ స్థాపనతో మన దేశ స్వాతంత్ర్యోద్యమంలో ఒక నూతన ఘట్టం ప్రారంభమైంది. విద్యావంతులైన భారతీయలలో పెరిగిపోతున్న అసమ్మతికి ఒక రక్షక కవాటంగా ఉపయోగపడుతుందని భావించిన ఒక పదవీ విరమణ చేసిన ఆంగ్ల ఉద్యోగి అయిన ఎ.ఓ. హ్యూమ్ సహాయంతో 1885 డిసెంబర్‌లో భారత జాతీయ కాంగ్రెస్ స్థాపించబడింది. ఈ సంస్థ క్రమంగా ఒక మహా సంస్థగా అభివృద్ధి చెంది దేశ స్వాతంత్ర్యోద్యమానికి కేంద్ర బిందువైంది. దీని మొదటి సమావేశం 1885 డిసెంబర్ 28 నుండి 30 వరకు బొంబాయిలో జరిగెను. సమావేశానికి డబ్ల్యు.సి బెనర్జీ అధ్యక్షత వహించగా దేశం నలుమూలల నుండి 72 మంది ప్రతినిధులు హాజరయ్యారు. కాంగ్రెస్ సాగించిన స్వాతంత్ర్యోద్యమాన్ని మూడు దశలుగా విభజించవచ్చు. 1) మితవాద దశ 2) అతివాద దశ 3) గాంధేయ దశ.

### 12.4.2 మితవాద దశ

1885 నుండి 1905 వరకు జరిగిన పోరాటాన్ని మితవాద దశ అంటారు. ఈ కాలంలోని నాయకులకు బ్రిటీష్ ప్రభుత్వం పట్ల సదాభిప్రాయం ఉండేది. వీరు దేశ ప్రజలకు బ్రిటీష్ ప్రభుత్వం నుంచి న్యాయపరమైన హక్కులు కోరినారే కాని, స్వరాజ్యాన్ని కోరలేదు. సమావేశాలు జరపడం, తీర్మానాలు చేయడం ఫిర్యాదులు పంపడం, నిరసనలు తెలుపడం వంటి మితవాద పద్ధతులను అనుసరించారు. అందువల్ల ఈ దశను మితవాద దశ అని పిలవడం జరిగింది. ఈ దశ నాయకులలో గోపాలకృష్ణ గోఖలే. దాదాభాయి నౌరోజీ, ఫిరోజ్‌షా మెహతా, డబ్ల్యు.సి. బెనర్జీ ప్రముఖులు.


సురేంద్రనాథ్ బెనర్జీ


గోపాలకృష్ణ గోఖలే


దాదాభాయి నౌరోజీ

### 12.4.3 అతివాద దశ (1905-1919)

మితవాదులు ఆశించిన ప్రయోజనాలను ఆంగ్లేయుల నుండి పొందలేకపోయారు. అందువల్ల కాంగ్రెస్‌లోని ఒక వర్గం పోరాటం ద్వారా మాత్రమే తమ లక్ష్యాన్ని సాధించగలమని భావించారు. ఈ కారణంగానే వీరిని అతివాద జాతీయవాదులు అని పిలవడం జరిగింది. అతివాదుల ప్రధాన లక్ష్యం స్వరాజ్యం లేదా స్వాతంత్ర్యం సంపాదించడమే. నాటి అతివాద నాయకులలో లాలాలజపతిరాయ్, బాల గంగాధర్ తిలక్, బిపిన్ చంద్రపాల్ (వీరినే లాల్, బాల్, పాల్ అంటారు). అరవిందఘోష్‌లు ముఖ్యులు. తిలక్ "పోరాడితేగాని రాజకీయ హక్కులు లభించవని" ప్రకటించి "స్వరాజ్యం నా జన్మహక్కు దానిని సాధించి తీరుతాను" అనే నినాదాన్ని ఇచ్చాడు.


లాలాలజపతి రాయ్


బాలగంగాధర తిలక్



బిపిన్ చంద్రపాల్

1905లో లార్డ్ కర్జన్ బెంగాల్‌లో జాతీయోద్యమాన్ని బలహీనపర్చడానికి బెంగాల్‌ను రెండుగా విభజించెను. తద్వార హిందూ, ముస్లింల ఐక్యతను దెబ్బతీయాలని ప్రయత్నించెను. కాని అతివాదులు వందేమాతర ఉద్యమాన్ని నడిపి ప్రజలను ఏకం చేశారు.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. భారత జాతీయ కాంగ్రెస్ ఎందుకు స్థాపించబడింది?
2. మితవాద దశ, అతివాద దశ అని ఎందుకు పిలిచారు?

## 12.4.4 గాంధేయ దశ




మహాత్మా గాంధీ గుజరాత్‌లోని పోరుబందర్‌లో 1869 అక్టోబర్ 2న జన్మించాడు. ఈయన ఇంగ్లాండులో న్యాయశాస్త్రంలో బారిష్టర్‌ను పూర్తి చేసి, న్యాయవాద వృత్తి నిర్వహించడానికై దక్షిణాఫ్రికా వెళ్ళాడు. అక్కడ భారతీయుల పట్ల చూపుతున్న జాత్యాహంకారానికి వ్యతిరేకంగా పోరాటం జరిపి భారతీయులకు హక్కులు సాధించడంలో విజయం సాధించాడు. ఈ పోరాటంలో ఆయన సత్యం, అహింసల మీద ఆధారపడిన సత్యాగ్రహాన్ని ఆయుధంగా ఎంచుకొనినాడు. 1915లో భారతదేశానికి తిరిగి వచ్చి, తన రాజకీయ గురువైన గోపాలకృష్ణ గోఖలే సలహా మేరకు సంవత్సర కాలం పాటు దేశ పర్యటన జరిపి పరిస్థితులను అవగాహన చేసుకొనెను.

### తొలి పోరాటాలు

1917లో గాంధీజీ బీహార్‌లోని చంపారన్ ప్రాంతంలో ఉద్యమం నిర్వహించి నీలిమందు రైతుల బాధలు నివారించాడు. 1918లో అహ్మదాబాద్‌లో నూలు మిల్లు కార్మికులతో కలిసి సత్యాగ్రహం చేసి వారి జీతాలు పెంచేలా చేశారు. ఆ తర్వాత గుజరాత్‌లోని కైరాలో రైతు ఉద్యమం నిర్వహించి పన్ను వసూళ్ళను వాయిదా వేయించి, భూముల జప్తులను ఆపగలిగాడు. ఈ ఉద్యమాల కారణంగా అనతికాలంలోనే గాంధీజీ అత్యంత జనాదరణ కలిగిన వ్యక్తిగా రాజకీయ కార్యకలాపాలకు కేంద్ర బిందువుగా మారాడు. ఆ తర్వాత తన దృష్టిని జాతీయ రాజకీయాల వైపు మరల్చాడు. 1919లో బ్రిటీష్ ప్రభుత్వం చేసిన రౌలట్ చట్టం భారతీయుల పాలిట శాపంగా మారింది. ఎందుకంటే పోలీసులు అనుమానిస్తే, ఎలాంటి విచారణ లేకుండా ఎవరినైన అరెస్ట్ చేసే అధికారం పోలీసులకు లభించింది. గాంధీజీ ఈ రౌలత్ చట్టాలకు వ్యతిరేకంగా సత్యాగ్రహం నిర్వహించాడు.

టర్కీ సుల్తాన్‌ను ఖలీఫా పదవి నుండి బ్రిటీష్ వారు తొలగించడానికి వ్యతిరేకంగా భారతదేశంలో ప్రారంభమైన ఖిలాఫత్ ఉద్యమానికి తన సంపూర్ణ మద్దతును ప్రకటించి హిందూ, ముస్లింల ఐక్యతకు పాటు పడ్డాడు.

ఆ తర్వాత భారత జాతీయ కాంగ్రెస్ గాంధీజీ నాయకత్వంలో మూడు అతి పెద్ద ఉద్యమాలను నిర్వహించాడు. అవి : సహాయ నిరాకరణోద్యమం, శాసనోల్లంఘనోద్యమం, క్విట్ ఇండియా ఉద్యమం.

### సహాయ నిరాకరణోద్యమం (1920-22)


బ్రిటీష్ ప్రభుత్వానికి భారతీయులు అహింసాయుతంగా అన్ని రంగాలలో సహాయాన్ని నిరాకరిస్తే దేశానికి స్వరాజ్యం సిద్ధిస్తుందని గాంధీజీ ఆశించాడు. గాంధీజీ ప్రతిపాదించిన సహాయ నిరాకరణోద్యమ తీర్మానాన్ని 1920 సెప్టెంబర్‌లో కలకత్తాలో జరిగిన ప్రత్యేక సమావేశంలో భారత జాతీయ కాంగ్రెస్ ఆమోదించింది.

గాంధీజీ పిలుపు మేరకు వేలాది మంది విద్యార్థులు ప్రభుత్వ విద్యాలయాలను వదిలిపెట్టి జాతీయ విద్యాలయాలలో చేరారు. అనేక మంది న్యాయవాద వృత్తిని వదిలి జాతీయోద్యమంలో పాల్గొన్నారు. విదేశీ వస్తువులు, వస్త్రాలను తగులబెట్టారు. దేశ వ్యాప్తంగా ఖద్దరు వస్త్రాలు తయారు చేయబడినవి. గాంధీజీ పిలుపు

మేరకు బెంగాల్, ఆంధ్రా ప్రాంతాలలో రైతులు ప్రభుత్వానికి పన్నులు చెల్లించడం నిలిపివేశారు. కాని 1922 ఫిబ్రవరి 12న ఉత్తరప్రదేశ్‌లోని చౌరీచౌరా గ్రామంలో రైతులు పోలీస్ స్టేషన్‌పై దాడి చేసి 22 మంది పోలీసులను సజీవ దహనం చేయడంతో గాంధీజీ సహాయ నిరాకరణ ఉద్యమాన్ని నిలుపదల చేసెను.

### శాసనోల్లంఘనోద్యమం (1930)

1930 జనవరిలో గాంధీజీ 11 ముఖ్యమైన అంశాలతో కూడిన ఒక వినతి పత్రమును బ్రిటీష్ వైస్రాయ్‌కి సమర్పించినాడు. అందులో సామాన్య ప్రజల జీవన అవసరమైన ఉప్పుపై పన్నును రద్దు చేయాలని కూడా కోరినాడు. కాని ప్రభుత్వం నుంచి స్పందన లేనందువలన శాసనోల్లంఘనోద్యమాన్ని ప్రారంభించెను.



చిత్రం-12.3: దండి వద్ద ఉప్పును తయారు చేస్తున్న గాంధీజీ

1930 మార్చి 12న గాంధీజీ తన 78 మంది అనుచరులతో గుజరాత్‌లోని సబర్మతీ ఆశ్రమం నుండి కాలి నడకన బయలుదేరి 200 మైళ్ళు నడిచి ఏప్రిల్ 6న సముద్ర తీరంలో ఉన్న "దండి" గ్రామం చేరుకొని, అక్కడ ప్రభుత్వ. శాసనాన్ని ధిక్కరించి సముద్రపు నీటితో ఉప్పును తయారు చేశాడు. దానితో దేశంలో అనేక ప్రాంతాలలో ప్రజలు ఉప్పును తయారు చేయడం జరిగినది. దీనినే శాసనోల్లంఘనోద్యమం (లేదా) దండి సత్యాగ్రహం (లేదా) ఉప్పు సత్యాగ్రహం అంటారు.

## 12.5.4 క్విట్ ఇండియా ఉద్యమం (1942)

1939లో రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది. యుద్ధంలో భారతీయుల పూర్తి సహకారం పొందాలని బ్రిటీష్ వారు భావించారు. కాని యుద్ధంలో మద్దతుకు బదులుగా భారతదేశానికి స్వయంపాలనా అధికారాన్ని ఇవ్వాలని కాంగ్రెసు కోరింది. ఈ విషయమై బ్రిటీష్ వారు పంపిన క్రిప్స్ రాయబారం కూడా విఫలమైంది. కాబట్టి దేశ స్వాతంత్ర్యం కొరకు గాంధీజి నాయకత్వంలో 1942 ఆగస్టు 8న, "క్విట్ ఇండియా ఉద్యమం" ప్రారంభించబడింది. ఉద్యమానికి పిలుపుగా గాంధీజి 'స్వాతంత్ర్యమో లేదా మరణమో (Do or Die)' అనే నినాదాన్నిచ్చాడు.

మరుసటి రోజు ఉదయానికే గాంధీజి, నెహ్రూ, పటేల్ లాంటి నాయకులందరిని నిర్బంధించినప్పటికినీ ప్రజలు స్వచ్ఛందంగా ఉద్యమంలో పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా హర్తాళ్‌లు, సమ్మెలు, సభలు, ప్రదర్శనల రూపంలో తమ నిరసనను వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్తులను తగుల బెట్టారు.

పట్టిక12.2: భారత స్వాతంత్రోద్యమంలో ముఖ్యమైన ఘట్టాలు

| సంవత్సరం | ముఖ్య సంఘటనలు |
|---|---|
| 1857 | 1857 తిరుగుబాటు |
| 1885 | భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావం |
| 1905 | స్వదేశీ ఉద్యమం/ వందేమాతర ఉద్యమం |
| 1916 | హోమ్ రూల్ ఉద్యమం |
| 1918 | చంపారన్ సత్యాగ్రహం |
| 1918 | కైరా సత్యాగ్రహం |
| 1918 | అహ్మదాబాద్ సత్యాగ్రహం |
| 1919 | రౌలత్ చట్టాల వ్యతిరేక సత్యాగ్రహం |
| 1919 | జలియన్‌వాలాబాగ్ దురంతం |
| 1919 | ఖిలాఫత్ ఉద్యమం |
| 1920 | సహాయ నిరాకరణోద్యమం |
| 1930 | శాసనోల్లంఘనోద్యమం |
| 1942 | క్విట్ ఇండియా ఉద్యమం |
| 1947 | భారతదేశ స్వాతంత్ర్య సాధన |

టెలిఫోన్, టెలిగ్రాఫ్ వైర్లను కోసివేశారు. రైల్వే పట్టాలను తొలగించారు. ప్రభుత్వం తీవ్ర అణిచివేతకు పూనుకుంది. పోలీసుల కాల్పుల్లో వెయ్యికి పైగా ప్రజలు చనిపోయారు. తొంబై వేలకు పైగా జైళ్లలో నిర్బంధించబడ్డారు. చివరకు ఉద్యమం ఆగిపోయింది.



**సుభాష్ చంద్రబోస్**

సుభాష్ చంద్రబోస్ స్వరాజ్య ఉద్యమకారుడు, విప్లవవాద జాతీయవాది. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో బ్రిటన్ ఎదుర్కొంటున్న కష్ట సమయాన్ని వారితో పోరాడటానికి మంచి అవకాశం అనే ఆలోచనలతో బ్రిటన్ శత్రువులైన జర్మనీ, జపాన్‌ల సహాయం తీసుకోవాలని భావించాడు.



*చిత్రం-12.4: ఆజాద్ హింద్ ఫౌజ్ సైనికులతో సుభాష్ చంద్రబోస్*

భారత యుద్ధ ఖైదీలతో విప్లవ వీరులు రాస్ బిహారి బోస్, మోహన్ సింగ్‌లు ఏర్పరచిన **'భారతీయ జాతీయ సైన్యం'** (Indian National Army - INA) కు నాయకత్వం వహించాడు. ఈ సైన్యం ఆజాద్ హింద్ ఫౌజ్‌గా పేరొందింది. ఇందులో 60 వేలకు పైగా సైనికులు ఉండేవారు. అక్టోబర్ 21న సింగపూర్‌లో స్వతంత్ర భారత తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. 1944 మార్చి 18న 'ఛలో ఢిల్లీ' నినాదంతో ఈ సైన్యం భారతదేశంలో ప్రవేశించింది. 1944 లో కోహిమాను ఆక్రమించింది. కానీ రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మనీ, జపాన్‌ల కూటమి ఓటమి పాలవడంతో ఆజాద్ హింద్ ఫౌజ్ బ్రిటన్ చేతిలో ఓటమి చవిచూసింది. 1945 లో విమాన ప్రమాదంలో బోస్ మరణించాడని జపాన్ ప్రకటించింది. కానీ ఇప్పటికీ ఆయన సజీవంగా ఉన్నాడని చాలా మంది విశ్వసిస్తారు.

శతాబ్ద కాలం కొనసాగిన భారత జాతీయోద్యమం ఫలితంగా చివరకు భారతదేశానికి 1947 ఆగష్టు 15న స్వాతంత్ర్యం సిద్ధించింది.

## మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. మహాత్మా గాంధీ స్వాతంత్ర్యం కోసం చేసిన ఉద్యమాలు ఏవి?
2. క్విట్ ఇండియా ఉద్యమాన్ని ప్రజా ఉద్యమని ఎట్లు చెప్పవచ్చు?

## 12.6 ముగింపు (ముఖ్యాంశాలు)

- 1498 లో వాస్కోడిగామా భారతదేశానికి సముద్ర మార్గం కనుగొనడంతో యూరోపియన్లు మన దేశానికి వ్యాపారం కొరకు వచ్చారు.
- కర్ణాటక యుద్ధాలు, ప్లాసీ యుద్ధం, బక్సార్ యుద్ధం మొదలగు వాటిలో విజయం సాధించి, ఆంగ్లేయులు భారతదేశ పాలనను హస్తగతం చేసుకొనినారు.
- బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా భారతీయులు 1857 లో తిరుగుబాటు చేసినారు.
- సరైన సైనిక సంపత్తి, ఆయుధాలు, నాయకత్వం లేకపోవడం వలన 1857 లో తిరుగుబాటు విఫలమైనది.
- 1885 లో స్థాపించబడిన భారతీయ జాతీయ కాంగ్రెస్ జాతీయోద్యమానికి కేంద్ర బిందువైనది. మితవాద, అతివాద, గాంధేయవాద దశలలో కాంగ్రెస్ పోరాటం కొనసాగింది.
- మితవాద నాయకులు "ప్రార్థన, విజ్ఞప్తి, నిరసన" లాంటి మితమైన పద్ధతులు అనుసరించారు. అతివాదులు ఆంగ్లేయులతో పోరాటం ద్వారా మాత్రమే స్వరాజ్యంసాధించగలమని భావించారు.
- గాంధీజి నాయకత్వంలో సహాయ నిరాకరణోద్యమం, శాసనోల్లంఘనోద్యమం మరియు క్విట్ ఇండియా ఉద్యమం లాంటి ప్రజా ఉద్యమాలు నిర్వహించబడెను.
- భారతదేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం సిద్ధించింది.

## 12.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 1-2 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. భారతీయులలో జాతీయతా భావం పెంపొందడానికి తోడ్పడిన రెండు అంశాలను పేర్కొనుము.
2. "ద్వంద్వ ప్రభుత్వం"ను నిర్వచింపుము.

**II. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 4-5 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. మితవాదులు, అతివాదుల మధ్య లక్ష్యాలు, పద్ధతులలో గల భేదాలను తెల్పండి.
2. మహాత్మాగాంధీలో నీకు నచ్చిన గుణాలను వివరించండి.

**III. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 8-10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. వాస్కోడిగామా భారతదేశానికి సముద్రమార్గం కనుగొనడం ఎందుకు ప్రాధాన్యత గల అంశమో వివరించండి.
2. బ్రిటీష్ వారు అనుసరించిన విధానాలే 1857 తిరుగు బాటుకు కారణమని ఎట్లు చెప్పవచ్చు?

**IV. కింది వాటిలో సరైన జవాబును ఎంపిక చేయండి.**

1. భారతదేశానికి చివరగా వచ్చిన యూరోపియన్‌లు ( )
   ఎ) ఆంగ్లేయులు బి) ఫ్రెంచ్ వారు సి) డచ్ వారు డి) పోర్చ్‌గీసు వారు
2. భారతదేశ పాలకుడైన మొగల్ చక్రవర్తి ఓడిపోయిన యుద్ధం ( )
   ఎ) ప్లాసీ యుద్ధం బి) బక్సార్ యుద్ధం సి) కర్ణాటక యుద్ధం డి) పానిపట్ యుద్ధం
3. భారతదేశ పటంలో క్రింది వాటిని గుర్తించండి. ( )
   ఎ) ముంబాయి బి) సూరత్ సి) కలకత్తా డి) చెన్నై

## 12.8 ఉపయుక్త గ్రంథాలు


1. ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం - చరిత్ర
2. బిపిన్ చంద్ర - ఆధునిక భారతదేశం
3. వైదేహి, అల్లాడి - భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్ర 1858-1947

# 13 తెలంగాణ చరిత్ర

## 13.0 అభ్యసన ఫలితాలు

- తెలంగాణ భౌగోళిక పరిస్థితులను వివరిస్తారు.
- శాతవాహనుల పరిపాలనను విశ్లేషిస్తారు.
- విష్ణుకుండినుల సామాజిక ఆర్థిక పరిస్థితులను తెలియజేస్తారు.
- చాళుక్యుల పరిపాలన విధానాన్ని సమీక్షిస్తారు.
- కాకతీయుల నాయంకర విధానాన్ని వివరిస్తారు.
- గోల్కొండ సుల్తానుల పరిపాలనను విశ్లేషిస్తారు.
- సాలార్జంగ్ సంస్కరణలను సమీక్షిస్తారు.

## 13.1 పరిచయం

భారతదేశ చరిత్రలో తెలంగాణ ప్రాంతానికి విశిష్టమైన గుర్తింపు కలదు. 'తెలంగాణ' అనే పదం 'త్రిలింగ' అనే పదం నుంచి ఆవిర్భవించింది. 'త్రిలింగ' అంటే మూడు శివ లింగాలు. ఇవి. శ్రీశైలం (కర్నూలు జిల్లా) ద్రాక్షారామం (తూర్పు గోదావరి జిల్లా) కాళేశ్వరం (కరీంనగర్ జిల్లా) భౌగోళికంగా ఈ మూడు లింగాల మధ్య ఉన్నటువంటి ప్రదేశమే తెలంగాణ. హైదరాబాద్ సంస్థానంలోనూ తెలుగు మాట్లాడే ప్రాంతాన్ని తెలంగాణగా వ్యవహరించారు. పురాణ, ఇతిహాసాలలోను, ప్రాచీన గ్రంథాలలోనూ దక్షిణాపథంగా పేర్కొనబడి కాలక్రమంలో 'దక్కన్'గా పిలువబడ్డ దక్కన్ పీఠభూమిలోని భాగమే ఈ తెలంగాణ ప్రాంతం. రాజకీయంగా, భౌగోళికంగా ప్రత్యేక విశిష్టతను, ఉనికిని కలిగి ఉంది.

## 13.2 అశ్మక మహాజనపదం

చరిత్రకారులు పేర్కొన్నదాన్ని బట్టి ప్రతి జనపదం ప్రత్యేక లక్షణాన్ని కలిగి ఉండేది ఆచారాలు, పండుగలు, భాష, ప్రాచీన కాలం నుండి కొనసాగుతున్న స్థానిక ప్రత్యేకతల కారణంగా వృక్షజాలం, జంతుజాలం పూర్తి వైవిధ్యతతో ఉండేవి. ఈ జనపదాల హద్దులు కాలాన్ని బట్టి మారుతూ ఉండేది సామ్రాజ్యాలు ఏర్పడ్డాక జనపదాలు అందులో ఒక రాజ్యంగా మారినవి.

‘అంగుత్తరనికాయ’ అనే బౌద్ధ గ్రంథం పేర్కొన్న దాన్నిబట్టి గోదావరి దక్షిణ ప్రాంతం షోడశ మహాజనపదాలలోని అశ్మక జనపదమేనని రూఢీ అయింది. కొన్ని గ్రంథాలలో అశ్మక, అస్మక, అసక (పాళీ భాష) అని కూడా పిలిచేవారు. దీని యొక్క రాజధాని ‘పోతన్’ దీన్ని కూడా కొన్ని గ్రంథాలలో పోతలి, పౌధాన్యపురం, బహుధాన్య పురం, బోధన్ అని పిలిచేవారు.

## 13.3 శాతవాహనులు

మౌర్యుల పతనానంతరం దక్షిణ భారతదేశంలో శాతవాహనులు సుమారుగా 450 సంవత్సరాలు పరిపాలించారు. వీరి రాజ్యం ఉత్తరాన మగధ వరకు వ్యాపించింది. శాతవాహనుల రాకతో తెలంగాణ చరిత్రలో ఒక నూతన అధ్యాయం ప్రారంభమైంది. దక్కన్ ప్రాంతంలో విశాల సామ్రాజ్యం స్థాపించి సుదీర్ఘ కాలం పాలించిన రాజవంశం శాతవాహనులదే. వీరి పాలనలో సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో అభివృద్ధి జరిగింది. శాతవాహనులు మౌర్యుల కాలంలో సామంతులుగా ఉండి తర్వాత దక్కన్ ప్రాంతంలో శాతవాహన రాజ్యాన్ని స్థాపించారు.




*పటం–13.1: శాతవాహన సామ్రాజ్యం*

శాతవాహనుల చరిత్ర తెలుసుకోవడానికి అనేక రకాలైన ఆధారాలు కలవు. ముఖ్యంగా ‘మత్స్య పురాణం’, ‘వాయు పురాణం’, కాళిదాసు ‘మాళవికాగ్నిమిత్రం’, హాలుని ‘గాథా సప్తశతి’ మొదలైన గ్రంథాలలో కూడా శాతవాహన రాజుల గురించి విలువైన సమాచారం ఉంది.

## 13.4 విష్ణుకుండినులు

శాతవాహనుల తరువాత దక్కన్‌లో విశాల సామ్రాజాన్ని పాలించిన ఘనత విష్ణుకుండినులదే. విష్ణుకుండినులలో మొట్ట మొదటగా పేర్కొన్న రాజు మొదటి ఇంద్రవర్మన్. ఇతను 4వ శతాబ్దంలో తన స్వతంత్రతను చాటుకున్నాడు. ఇతని తరువాత అతని కుమారుడైన మొదటి మాధవవర్మన్ రాజయ్యాడు. తుమ్మలగూడెంలో లభించిన తామ్ర శాసనం ఆధారంగా విష్ణుకుండినుల రాజధాని ‘ఇంద్రపుర’ అని తెలుస్తోంది. ఇది ప్రస్తుతం నల్లగొండ జిల్లా, రామన్నపేట తాలూకాలో గల ‘ఇంద్రపాలగుట్ట’గా గుర్తించడం జరిగింది.

### 13.4.1 గోవింద వర్మ

విష్ణుకుండినులలో ప్రముఖుడైన రాజు గోవిందవర్మ. ఇతడు ‘మొదటి ఈపూరు శాసనం’ వలన తెలియవస్తున్నాడు. ఆ శాసనం, ఇతడు అనేక మంది సామంతులను కలిగి ఉండి ప్రజారంజనే ధ్యేయంగా పాలిస్తూ అన్ని కులాల వారిని సమాదరించాడని వివరిస్తుంది.

### 13.4.2 రెండో మాధవ వర్మ

గోవింద వర్మ కుమారుడైన రెండవ మాధవ వర్మ మహావీరుడు, గొప్ప విజేత. తన యుద్ధ విజయాలను ప్రకటిస్తూ 11 అశ్వమేధ యాగాలు చేశాడు. అతని కాలంలో రాజకీయ, సైనిక విషయాల్లో మాధవ వర్మ చురుకుగా పాల్గొని, విష్ణుకుండిన వంశాన్ని ప్రబలంగాను, ప్రతిష్టాత్మకంగాను రూపొందించాడని తెలుస్తోంది. ఇతడు వాకాటక రాకుమార్తెను వివాహం చేసుకుని, సామ్రాజ్య విస్తరణకు వాకాటకుల మద్దతును పొందాడు.

### 13.4.3 పాలనా విధానం

రాజే సర్వాధికారి. పాలన విషయాల్లో ఆయన మాటే అంతిమ నిర్ణయం. అయితే రాజు నిర్ణయాలు ప్రజాభిప్రాయాన్ని, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఉండేవి. మంత్రి మండలి అభిప్రాయాలకు కూడా రాజాస్థానంలో సముచితమైన స్థానం ఉండేది. మాధవ వర్మ, న్యాయవేత్తలతో చర్చించి తన కొడుకుకు కూడా మరణ దండన విధించాడట. దీని వల్ల విష్ణుకుండినులు ధర్మ విచక్షణ ప్రకారమే పాలించారు కానీ, పక్షపాతంతో కాదనేది మనకు రూఢీ అవుతుంది.

విష్ణుకుండినులు దేశాన్ని రాష్ట్రాలుగా, రాష్ట్రాన్ని విషయాలుగా, విషయాలను గ్రామాలుగా విభజించారు. విషయానికి పాలకుడు విషయాధిపతి, అలాగే రాజ్యంలో కొంత భాగానికి రాజు కొడుకును యువరాజుగా నియమించేవారు. అలాగే కొన్ని సామంత రాజ్యాలు కూడా విష్ణుకుండిన రాజ్యానికి లోబడి పాలించేవి. అనన్య సామంతులు, సకల సామంతులు అనే పేర్లతో సామంతులు ఉండేవారు. అలాగే సామంతులతో వైవాహిక సంబంధాలను కూడా నెరిపారు. అవి కూడా రాజ్య రక్షణకు విస్తృతికి దోహదం చేశాయి.

### 13.4.4 ఆర్థిక - ససామాజిక పరిస్థితులు

విష్ణుకుండినుల నాటి గ్రామాల్లో స్వయం సమృద్ధమైన ఆర్థిక వ్యవస్థ ఉండేది. అంటే, వ్యవసాయదారులు వివిధ వృత్తుల వారు ఒకరిపై ఒకరు ఆధారపడి బతికేవారు. రాజులు వ్యవసాయాభివృద్ధికై చర్యలు తీసుకున్నారు. బ్రాహ్మణులకు అగ్రహారాలను దానం చేశారు. రైతులు కొత్త భూములను సాగులోకి తెచ్చారు. విష్ణుకుండినులు వ్యవసాయ బావులను, చెరువులను అనేకం తవ్వించారని వారి శాసనాలు తెలుపుతున్నాయి. ఆ కాలంలో భూమిని నివర్తనాల్లో కొలిచేవారు.

విష్ణుకుండినుల రాజ్యంలో స్వదేశీ, విదేశీ వర్తక వాణిజ్యాలు కూడా సాగాయి. వారి నాణేలు ఏలేశ్వరం, ఫణిగిరి, భువనగిరి, సుల్తానాబాద్, బొజ్జన్నకొండ, ఎలమంచిలి, నాసిక్, ఖానాపూర్, నాగపూర్, బ్రహ్మగిరి మొదలైన ప్రాంతాల్లో దొరికాయి. వాడపల్లి, బెజవాడ, అమరావతి, మోటుపల్లి, ఘంటసాల, కోడూరు, అలంపూర్ మొదలైనవి స్వదేశీ, విదేశీ వర్తక కూడళ్ళుగాను, ఓడరేవులుగాను విలసిల్లాయి.

వీరు 'హిరణ్యగర్భ యాగం' చేసినట్లు శాసనాల ద్వారా ప్రకటితమవుతుంది. అంటే శూద్రులైన వీరు అనేక యాగాలు చేసి పైకి పాకినట్లుంది. వైశ్యులు, స్వదేశీ, విదేశీ వ్యాపారాల్లో నిమగ్నమై ఉండేవారు. శూద్రుల్లో కంసాలి వారు, శిల్పులు, చేనేత పనివారికి సముచితమైన స్థానం ఉండేది. రైతులు దేశానికి వెన్నెముక అని గుర్తించిన విష్ణుకుండినులు వారికి కూడా అగ్రహారాలతో పాటు మాన్యాలను దానం చేసేవారు. సామూహిక

వివాహాలు జరిపినప్పుడు, శయన, ఆసన, యాన, పాన, భోజన, భవన, వసన, ఆభరణాలను కూడా దానం చేసేవారట. ఆనాటి ప్రజలు తల్లిదండ్రుల పట్ల, పెద్దల పట్ల భయ భక్తులు కలిగి ఉండేవారని తెలుస్తోంది.

### 13.4.5 మతం

**వైదిక మతం:**

విష్ణుకుండినుల వైదిక మతాన్ని అనుసరించేవారు. శ్రీ పర్వతస్వామి వారి కుల దైవం, తాము శ్రీ పర్వత స్వామి పాదానుధ్యానం వల్ల పాలనాధికారం పొందామని చెప్పుకున్నారు. వారి నాణేలపై కూడా 'శ్రీ పర్వత' అనే పదాన్ని చెక్కించారు. అమ్రాబాద్ మండలంలో శ్రీ పర్వత పాదంలోనే ఉమామహేశ్వర దేవాలయం ఉంది. ఇది శ్రీశైల ఉత్తర ద్వారంగా పేరొందింది. శ్రీశైల మల్లికార్జునుడు కూడా విష్ణుకుండినుల కాలం నుండే ఆ పేరుతో ప్రచారం పొందాడు.

**బౌద్ధ మతం:**

విష్ణుకుండినుల పాలనాధికారం తొలి దశలో బౌద్ధ మతం బాగా వ్యాప్తిలో ఉండేది. తొలి తరం విష్ణుకుండినులు హైందవ మతానుయాయులైనప్పటికీ కూడా బౌద్ధ మత సంస్థలను పోషించారు. బౌద్ధ భిక్షువుల కోసం రాజ్యం నలువైపులా బౌద్ధ ఆరామాలు, విహారాలు కట్టించారు. అప్పటికే మనుగడలో ఉన్న వాటికి పెద్ద ఎత్తున మరమ్మతులు చేయించారు. బౌద్ధ మతాన్ని పోషించిన చివరి తెలుగు రాజులూ విష్ణుకుండినులే.

**జైన మతం:**

సాధారణ శకం 1115 లో నయసేనుడు అనే జైన కవి కన్నడంలో రచించిన 'ధర్మామృతం' అనే గ్రంథంలో శ్రీపర్వతం దాని పరిసర ప్రాంతాలకు పేర్లు ఎలా వచ్చాయో వివరణ ఉంది. ఇప్పుడు అమ్రాబాద్‌గా పిలువబడుతున్న అప్పటి అమరావతి మండలంలో వటవేర్లపల్లి దగ్గర మల్లెల తీర్థం కలదు. జైన ఋషులను మునులు అని పిలుస్తారు. కాబట్టి వారు తపస్సు చేసిన ప్రాంతమే ఇప్పటి 'మున్ననూర్'.

**మీ ప్రగతిని పరీక్షించుకోండి**

1. విష్ణుకుండినుల కాలం నాటి సామాజిక ఆర్థిక పరిస్థితిని సమీక్షించండి.
2. విష్ణుకుండినుల కాలంలోని మత విశేషాలను వివరించండి.

## 13.5 చాళుక్య యుగం

విష్ణుకుండినుల తర్వాత తెలంగాణ ప్రాంతాన్ని దాదాపు రెండు వందల సంవత్సరాల పాటు బాదామి చాళుక్యులు పాలించారు. వీరి రాజధాని కర్ణాటక ప్రాంతంలోని బాదామి (వాతాపి) అయినప్పటికీ, వారు తెలంగాణాలోని కొన్ని ప్రాంతాలకు అధిపతులను, రాష్ట్రపతులను, విషయపతులను నియమించి పాలన చేశారు.

### 13.5.1 బాదామి చాళుక్యులు

బాదామి చాళుక్యులు మధ్య దక్కన్ ప్రాంతాన్ని 6వ శతాబ్దం మధ్య నుంచి 8వ శతాబ్దం వరకు పరిపాలించారు. విష్ణుకుండినులు, కదంబులు బలహీనులు కావడంతో మొదటి పులకేశి బాదామి (వాతాపి) రాజధానిగా సాధారణ శకం 534లో చాళుక్య రాజ్యాన్ని స్థాపించాడు. ఈ విషయాలు ఏలేశ్వరంలోని లేఖనాలలో లభించాయి.

పులకేశి కుమారుడైన కీర్తివర్మ సాధారణ శకం 557 నుండి 597 వరకు పాలించాడు. ఇతను కదంబులను, కొంకణ్‌లో మిగిలిన మౌర్యులను ఓడించి సామ్రాజ్యాన్ని విస్తరింపజేశాడు. అతని తర్వాత అతని కుమారుడు రెండవ పులకేశి సాధారణ శకం 609 లో పట్టాభిషిక్తుడైనట్లు అతని హైదరాబాద్ శాసనం తెలియపరుస్తుంది. పశ్చిమ చాళుక్యులలో రెండవ పులకేశి అగ్రగణ్యుడు సా.శ. 609 నుండి 642 మధ్య ఇతని పరిపాలనలో మొత్తం దక్షిణ భారతదేశంలో అతి పెద్ద సామ్రాజ్యాన్ని స్థాపించడమే కాక ఉత్తర భారతదేశ చక్రవర్తి అయిన హర్షవర్ధనుడిని ఓడించినట్లు ఇతని 'అయ్యావోలు ప్రశస్తి'లో వివరించబడింది. కోస్తాంధ్ర రాజులతో పాటు, కాంచీపురం పరిపాలకులైన పల్లవులను కూడా ఓడించి, దండయాత్రలలో తనకు సహకరించిన సైన్యాధిపతులను ఆయా రాష్ట్రాలకు పాలకులుగా నియమించాడు. ఈ విధంగా ఎంతో మంది కర్ణాటకీయులు ఆంధ్ర ప్రాంతంలో పాలకులుగా స్థిరపడ్డారు. దీనిలో భాగంగానే సా.శ. 624లో ఇతని తమ్ముడైన కుబ్జవిష్ణువర్ధనుడు, వేంగి పాలకుడిగా నియమించబడి వేంగి రాజ్య స్థాపకుడయ్యాడు.

### 13.5.3 వేములవాడ చాళుక్యులు

వేములవాడ చాళుక్యులు, ప్రస్తుత రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ కేంద్రంగా స్వతంత్ర రాజ్యాన్ని నెలకొల్పారు. వీరి తొలి కేంద్రం నిజామాబాద్‌లోని బోధన్, వీరు పాలించిన ప్రాంతాన్ని సమకాలీన ఆధారాలలో 'సబ్బి' మండలంగా వర్ణించారు.

వేములవాడ లేదా లేములవాడ (ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జిల్లా) చాళుక్యులు రాష్ట్రకూటులకు విశ్వసనీయంగా ఉండటమేకాక, వారి కింద రాజులుగా అర్ధ స్వతంత్ర హోదాలో దాదాపు రెండు వందల సంవత్సరాలకు పైగా పాలన చేశారు.

వీరి కుటుంబ చరిత్ర సా.శ. 641లో రెండవ పులకేశితో మొదలైనా, తెలంగాణ ప్రాంతంలో వీరి పాలన ప్రభావం మాత్రం రాష్ట్రకూట వంశజుల కాలంలోనే ఎక్కువగా కనిపిస్తుంది. వీరి గురించి శిలా శాసనాలు, రాగి శాసనాల ద్వారా, పంప కవి రచించిన 'విక్రమార్జున విజయం', 'ఆది పురాణం', సోమదేవసూరి రచించిన 'యశస్తిలక', మల్లియ రేచన రచించిన 'కవిజనాశ్రయం' వంటి సమకాలీన గ్రంథాల ద్వారా తెలుస్తుంది.

అయితే వీరి రాజకీయ, సాంస్కృతిక ప్రభావం నేటి రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజధాని అయిన తర్వాతనే ఇనుమడించింది. కాబట్టి చరిత్రకారులు వీరిని వేములవాడ చాళుక్యులు అని సంబోధించారు. వీరు నాలుగు ప్రాంతాలను పాలించారు. అవి పొదననాడు (బోధన్ ప్రాంతం) సపాదలక్ష దేశం లేదా సబ్బినాడు (భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం వరకు) చెన్నూరు (మంచిర్యాల జిల్లా ప్రాంతం) రామడుగు విషయం నల్గొండ జిల్లాలోని దేవరకొండ ప్రాంతం నుండి నాగర్‌కర్నూల్, అయితే రామడుగు ప్రాంతం వీరి ఆధీనంలో కొద్ది కాలం మాత్రమే ఉంది.

### 13.5.4 ముదిగొండ చాళుక్యులు

చాళుక్య వంశపు రాజులలో ఒక ముఖ్యమైన శాఖ ముదిగొండ చాళుక్యులది. వీరు సా.శ. 8వ శతాబ్దం చివరి కాలం నుండి సా.శ 13వ శతాబ్దం తొలి దశకం వరకు వరంగల్ జిల్లాలోని తూర్పు ప్రాంతం మొదలుకొని

ఖమ్మం జిల్లా అంతటిని పాలించారు. వీరు వేంగి చాళుక్యుల వాయువ్య ప్రాంత రక్షకులుగా సుమారు 350 సంవత్సరాలకు పైగా పాలించారు.

ముదిగొండ చాళుక్యులు మొగిలిచర్ల (వరంగల్ జిల్లా)లో వేయించిన రాగి శాసనం, కురవి (మహబూబ్‌బాద్ జిల్లా)లో వేయించిన శిలాశాసనం వీరి చరిత్రకు ప్రధాన ఆధారాలు. శాసనాలలో ముదిగొండగా పేర్కొన్న వీరి రాజధాని ముదిగొండ ఖమ్మం జిల్లాకు సుమారు 10 కిలో మీటర్ల దూరంలో ఉంది. వీరు పాలించిన సీమ కేంద్రం వరంగల్ జిల్లాలో ఉంది.

### 13.5.5 చాళుక్యుల పరిపాలన విధానం

తెలంగాణ ప్రాంతంలో పైన పేర్కొన్న రాజవంశీయుల కాలంలో అంతా ఒకే విధమైన పరిపాలన కొనసాగలేదు. కానీ కాలక్రమేణా మార్పులు చెందుతూ వచ్చింది. ఇక్ష్వాకులు, విష్ణుకుండినుల కాలంలో పరిపాలనంతా శాతవాహనుల కాలం నాటి పరిపాలన విధానాన్ని పోలి ఉండేది. రాజే రాజ్యానికంతటికీ అధిపతి, అతని మాటే వేదవాక్కుగా ఉండేది. అతను 'ధర్మశాస్త్రం'లో పేర్కొన్న విధంగా, వైదిక శాసనాలను అనుసరించి పరిపాలన సాగించేవాడు. పాలనపరంగా 'రాష్ట్రం' అతి పెద్ద విభాగం. దానికి 'మహా సేనాపతి' ఆధిపత్యం వహించేవాడు. ఈ రాష్ట్రం, దేశ విషయ అనే రెండు విభాగాలుగా విభజింపబడ్డాయి. వీటిలో అతి చిన్న పరిపాలన విభాగం గ్రామం. గ్రామ పెద్దను మహాతల్వార అని, న్యాయాధికారిని మహాదండనాయక అని, పన్ను వసూలు చేసే వారిని కోశాధికారిక అని పిలిచేవారు.

చాళుక్యుల కాలం నుండి తెలంగాణ ప్రాంతంలో పాలనా పద్ధతులు అన్ని కన్నడ రాజ్య పరిపాలనా వ్యవస్థ వలె ఉండేవి. తెలంగాణ ప్రాంతం 50-70 గ్రామాల సమూహంతో కూడిఉన్న రాష్ట్రాలు, విషయాలు, భుక్తిలుగా విభజించి పాలించబడ్డాయి. ఇవి రాష్ట్రపతి, విషయపతి, బోగపతి అనే వారిచే ఆధిపత్యం వహించబడి పరిపాలన సాగించాయి.

### 13.5.6 ఆర్థిక వ్యవస్థ

చాళుక్యుల కాలంలో ప్రజలు ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడేవారు. ఈ పరిణామంతో భూమి యొక్క ప్రాముఖ్యత పెరిగింది. ప్రభుత్వ ఉద్యోగులు, బ్రాహ్మణులు ఇతర పలుకుబడి గల వర్గాలవారు భూములు, అగ్రహారాలు పొంది భూస్వాములుగా రూపాంతరం చెందారు. రైతులు వీరి భూములను సాగుచేసేవారు. జనాభా పెరగడం మూలంగా వ్యవసాయ విస్తరణ తప్పనిసరైంది. దాంతో భూమ్మీద ఒత్తిడి రావడం ప్రారంభమైంది. నీటి సౌకర్యం, భూసారాన్ని బట్టి, పంట దిగుబడిని బట్టి శిస్తు నిర్ణయం జరిగేది. ఆ కాలంలో కొబ్బరి, తమలపాకు, పోక తోటలు, మామిడి, చెరకు, పత్తి మొదలైన వాణిజ్య పంటలుండేవి. భూములను కొలవడానికి మరుట్లు లేదా మత్తర్, నివర్తన, ఖందుగ, రాజమాన మొదలైన పేర్లతో కొలతలు ప్రమాణాలుండేవి.

వ్యవసాయానికి నీటి పారుదల చాలా ముఖ్యం కాబట్టి, పాలకులు నీటి వనరులను కల్పించడానికి చెరువులు కుంటలు, బావులను తవ్వించి, నదులకు కాలువలను ఏర్పరచేవారు. ఈ కృత్రిమ జలాశయాలను కెరె, సముద్రం, కుంటలు లేదా తటాకం అని పిలిచేవారు. తటాకాలు తవ్వించడాన్ని సప్తపుణ్యాలలో ఒకటిగా భావించేవారు.

ఆనాటి పన్నులలో పండిన పంటలో 1/6 భాగం శిస్తుగా వసూలు చేసేవారు. ఇవిగాక నీటి పన్ను, వృత్తి పన్ను, ఎగుమతి, దిగుమతులపై సుంకం, అంగడి పన్ను, పశుసంపద, నివాస గృహాలు, వివాహాలపై పన్నులు విధించేవారు.

గ్రామాల్లో వస్తు మార్పిడి పద్ధతి ఉన్నప్పటికీ ద్రవ్య చలామణి కూడా వాడుకలో ఉంది, గద్యాణ, మాడ, ద్రమ్మాలు అనే పేర్లతో బంగారు, వెండి, రాగి నాణేలు వాడుకలో ఉండేవి సోల, మానిక, అడ్డె, కుంచె, శేరు, మణుగు, పుట్టి మొదలైన పేర్లతో ధాన్యం కొలవడానికి కొలతలు ప్రమాణాలుండేవి.

### 13.5.7 సమాజం

చాళుక్యుల కాలంలో వైదిక మతం ప్రాధాన్యతను సంతరించుకుంది. వృత్తి వ్యవస్థ స్థిర రూపాన్ని పొందింది. వృత్తులలో నైపుణ్యం, నాణ్యత పెంపొందాయి. చతుర్వర్ణ వ్యవస్థలో బ్రాహ్మణులది ప్రథమ స్థానం. వీరు సమాజంలో అగ్ర భాగాన ఉండేవారు. రెండవ స్థానంలో క్షత్రియులు, కానీ చాళుక్యుల కాలంలో ఎన్నో యుద్ధాలు జరగడంతో సైనికావసరాలకై ఎంతో మంది శూద్రులు సైన్యంలో చేరి ఉన్నత స్థితికి వచ్చి క్షాత్ర ధర్మాన్ని నిర్వహించువాడే క్షత్రియుడనే భావం ప్రబలి తమను తాము చంద్ర వంశం, సూర్య వంశం వారమని చెప్పుకోవడం శాసనాలలో కనిపిస్తుంది. చాతుర్వర్ణ వ్యవస్థలోని మూడవ వర్గంవారు వైశ్యులు, వీరు ఎక్కువగా వ్యాపార లావాదేవీల నిర్వహించే వారు. వీరిని శెట్టి, శ్రేష్టి, కోమటి అని కూడా అనేవారు. చాతుర్వర్ణ వ్యవస్థలోని నాలుగవ వర్ణం శూద్రులు, వీరు వ్యవసాయం, సైనిక వృత్తితో పాటు సమాజంలోని వివిధ చేతి వృత్తులను స్వీకరించినవారు. పాలకులు వీరికి మాన్యాల రూపంలో భూములను దానంగా ఇచ్చి అభివృద్ధికి తోడ్పడ్డారు.

**మీ ప్రగతిని పరీక్షించుకోండి**

1. చాళుక్యుల చరిత్రను సమీక్షించండి.
2. చాళుక్యుల ఆర్థిక వ్యవస్థను గురించి వివరించండి.

## 13.6 కాకతీయ యుగం


*చిత్రం-13.1: వేయి స్థంభాల గుడి*

శాతవాహనుల తర్వాత తెలుగు వారందరినీ సమైక్యం చేసినవారు కాకతీయులు. వీరు మొదట హనుమకొండ, తర్వాత ఓరుగల్లు (ప్రస్తుతం వరంగల్) కేంద్రాలుగా సుమారు 250 సంవత్సరాల పాటు జనరంజకంగా పాలించారు. వీరు రాష్ట్రకూట వంశానికి చెందినవారు. తమను తాము శూద్రులుగా, దుర్జయవంశానికి చెందిన వారిగా పేర్కొన్నారు. తొలి కాకతీయులు రాష్ట్రకూటులకు, ఆ తర్వాత కళ్యాణి చాళుక్యులకు మాండలికులుగా, సేనాధిపతులుగా సేవలందించారు.

### 13.6.1 ఆధారాలు

కాకతీయుల చరిత్రకు సంబంధించి మనకు శాసనాధారాలు (మాంగల్లు శాసనం (956), వేయి స్తంభాల గుడి శాసనం (1,063), పాలంపేట శాసనం (1,213), మోటుపల్లి అభయ శాసనం (1,244), సాహిత్యాధారాలలో ముఖ్యమైనవి పాల్కురికి సోమనాధుని పండితారాధ్య చరిత్ర, బసవపురాణం, విద్యానాథుడు వ్రాసిన ప్రతాపరుద్ర యశోభూషణం, జాయపసేనాని రచించిన నృత రత్నావళి, వినుకొండ వల్లభరాయుని క్రీడాభిరామం, కాకతి రుద్రదేవుని నీతిసారం, జియా ఉద్దీన్ బరౌనీ రాసిన 'తరాక్-ఇ-ఫిరోజ్ షాహీ', పెరిస్తా రాసిన 'తారిక్ ఇ పెరిస్తా', మార్కోపోలో రాసిన 'ది ట్రావెల్స్'.

### 13.6.2 కట్టడాలు

హన్మకొండలోని వేయి స్థంభాల గుడి, పాలంపేటలోని రామప్ప దేవాలయం, ఓరుగల్లు కోట, పిల్లలమర్రి, నాగులపాడు, ఘనపురం మొదలైన చోట్ల కాకతీయులు కట్టించిన దేవాలయాలు నాటి చరిత్రను వాస్తు, శిల్పాలనూ తెలియజేస్తున్నాయి.

### 13.6.3 రాజకీయ చరిత్ర

కాకతీయులు మొదటగా రాష్ట్రకూటులకు సామంతులుగా ఉండి తర్వాత స్వతంత్రులయ్యారు. ఈ వంశ ముఖ్యరాజుల క్రమాన్ని ఈ విధంగా ప్రకటించవచ్చు. బయ్యారం చెరువు శాసనం ప్రకారం దుర్జయ వంశానికి చెందిన వెన్న కాకతీయ వంశానికి మూల పురుషుడు. అతని కుమారుడు గుండన, మనుమడు రెండవ గుండన మునిమనుమడు మూడవ గుండన వరుసగా రాష్ట్రకూటులకు సేనాధిపతులుగా ఉండిరి. తరువాత పశ్చిమ చాళుక్యుల సామంతులుగా మొదటి బేతరాజు, మొదటి ప్రోలరాజు, రెండవ బేతరాజు, దుర్గరాజు, రెండవ ప్రోలరాజు సేవలందించారు.

**రుద్రదేవుడు (1158-1195)**

రెండవ ప్రోలరాజు మరణానంతరం అతని కుమారుడు రుద్రదేవుడు సింహాసనానికి వచ్చాడు. ఇతడు గొప్ప యోధుడు హన్మకొండలోని వేయి స్థంభాల గుడి శాసనం (1163) రుదద్రేవుడు స్వతంత్ర పాలనను ప్రారంభించిన విషయాన్ని తెలియజేస్తుంది. చాళుక్యుల నుండి సామంత స్థాయిని తొలగించి స్వతంత్రంగా పరిపాలించిన మొదటి కాకతీయ రాజు రుద్రదేవుడు. ఇతడికి 'దయాగజకేసరి' అనే బిరుదు కలదు. ఈ బిరుదుతో ఇతను నాణేలు కూడా ముద్రించాడు.

**గణపతిదేవుడు (1199-1262)**

కాకతీయ రాజులందరిలో గణపతి దేవుడు గొప్పవాడు, యోధుడు, పరిపాలనాధ్యక్షుడు, ఇతడి కాలంలో కాకతీయ సామ్రాజ్యం మహోజ్వలంగా వెలుగొందింది. పాలకుడిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్న తర్వాత గణపతి దేవుడు రాజ్య విస్తరణ కోసం తీరాంధ్ర వైపు దృష్టి సారించాడు. తన రాజ్యంలో పిన్నెచోడుడి రాజ్యం, కొలనువంశ రాజ్యం, వెలనాడు, దక్షిణ కళింగ, పశ్చిమ తెలంగాణ, ఉత్తర తెలంగాణ ప్రాంతాలను జయించాడు. చోళ, సేవణ, కర్ణాటక శత్రు కూటమిని కూడా ఓడించాడు. తిక్కన సోమయాజి రాయబారంపై నెల్లూరు

రాజ్యంలో మనుమసిద్ధికి సహాయం అందించాడు. గణపతిదేవునికి పుత్ర సంతానం లేదు. రుద్రాంబ, గణపాంబ అనే ఇద్దరు కూతుర్లు మాత్రమే ఉన్నారు. పెద్ద కుమార్తెను చాళుక్య వీరభద్రుడికిచ్చి, రెండవ కుమార్తెను కోట వంశానికి చెందిన బేతనకిచ్చి వివాహం జరిపించాడు. తర్వాత కాలంలో తన రాజధానిని హన్మకొండ నుండి ఓరుగల్లుకి మార్చాడు.

### రుద్రమదేవి (1262–1289)


రుద్రమదేవి

రుద్రమదేవి తెలంగాణ చరిత్రలోని మొదటి మహిళా పాలకురాలు. ఈమె తన రాజ్యపాలనలో అసమాన ధైర్య సాహసాలను కనబరిచింది. ఆమె ఎప్పుడూ పురుష వేషంలోనే సంచరించేది. గుర్రపు స్వారీ, కత్తి సాము, విలు విద్య, సైనిక శిక్షణ, రాజనీతిలో ఆరితేరినది. రుద్రమదేవి పాలన మొదటి రోజుల్లోనే యాదవ రాజు మహాదేవుడు ఒక స్త్రీ కాకతీయ రాజ్య పాలకురాలైందని విని చిన్నచూపుతో కాకతీయ రాజ్యంపైకి దండెత్తాడు. కానీ రుద్రమదేవి నిరుపమాన ధైర్య సాహసాలతో యాదవ సైన్యాన్ని తోక ముడిచేలా చేసింది. అంతేకాక వారి ఆధీనంలోనే బెదద (బీదర్) కోట దుర్గాన్ని ఆక్రమించి పెద్ద మొత్తంలో నష్ట పరిహారాన్ని వసూలు చేసింది. చోళ, పాండ్య దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టింది. దాయాదులైన హరిహర, మురారి దేవులు తిరుగుబాటు చేయగా వారిని అణచివేసింది. పాలనలో రుద్రమకు గోన గన్నారెడ్డి, రేచర్ల ప్రసాదిత్యుడు, కాయస్థ జన్నిగదేవుడు, ఇందులూరి అన్నయ, విరియాలసూరి వంటి విశ్వాసపాత్రులు సహాయం చేశారు. తండ్రికి తగ్గ కూతురుగా 'రాయగజకేసరి' అనే బిరుదును ధరించింది.

### రెండవ ప్రతాపరుద్రుడు (1289–1309)

రుద్రమదేవి కూడా పుత్ర సంతానం లేకపోవడంతో పెద్ద కుమార్తె ముమ్మడమ్మ కుమారుడైన ప్రతాపరుద్రుడిని యువరాజుగా ప్రకటించింది. ఇతడే కాకతీయ వంశపు చివరి రాజు. ప్రతాపరుద్రుడు రాజయ్యాక అనేక విజయవంతమైన దండయాత్రలు చేశాడు. కాయస్థ అంబదేవుడిని ఓడించాడు. నెల్లూరుపై మనుమసిద్ధి మనుమడైన రాజగొండ గోపాలుడికి మద్దతుగా దండెత్తాడు. పాండ్యుల వారసత్వ తగాదాలను కూడా పరిష్కరించాడు.

ఓరుగల్లుపై ఢిల్లీ సుల్తానులు దండెత్తడం ఒక కీలక పరిణామం. మొదటిదాడి 1303లో జరుగగా వారిని కాకతీయ సేనలు ఉప్పరపల్లి వద్ద ఓడించి పంపాయి. కానీ 1309లో అల్లాఉద్దీన్ ఖిల్జీ సేనాని మాలిక్ కాఫర్ (మొదట అతను సోలంకి రాజవంశీయుడైన సబూర్ భాయ్, అతన్ని యుద్ధంలో బంధించి ఇస్లాంలోకి మార్చి తరువాత సేనానిగా నియమించారు.) ఓరుగల్లుపై దాడిచేయగా ప్రతాపరుద్రుడు అతనితో సంధిచేసుకున్నాడు. అపారమైన ధనరాశులను, అసంఖ్యాక ఏనుగులను, గుర్రాలను సమర్పించి ప్రతి సంవత్సరం కప్పం కట్టడానికి ఒప్పుకున్నాడు. మాలిక్ కాఫర్ ఓరుగల్లు నుంచి దోచుకున్న సంపదను వేయి ఒంటెలపైన ఢిల్లీకి తరలించాడని అమీర్ ఖుస్రో పేర్కొన్నాడు. కానీ ఆ తర్వాత కూడా ఢిల్లీ సుల్తానులు, ఇక్కడి సంపదకై నిరంతరం దాడులు జరపడంతో ఓరుగల్లు విపరీతంగా నష్టపోయింది. చివరకు ప్రతాపరుద్రుడు నర్మదా నదిలో దూకి తనువు చాలించాడు.

### 13.6.4 పరిపాలన నాయంకర పద్ధతి

కాకతీయకాలంలో సాంప్రదాయక రాచరిక వ్యవస్థ అమలులో ఉండేది. రాజే సర్వాధికారి, పాలనలో రాజుకు మంత్రిమండలి సహకరించేది. వీరిలో మహా ప్రధానులు, మంత్రులు, అమాత్యులు, ప్రెగ్గడ మొదలైన వారు ఉండేవారు మొత్తం 72 శాఖలు ఉండేవి. ఈ శాఖలన్నింటిపైనా 'బహత్తర నియోధిపతి' అనే అధికారి పర్యవేక్షణకు నియమించబడ్డాడు. సామర్థ్యమే ప్రాతిపదికగా అన్ని కులాల వారిని అన్ని పదవుల్లోకి అనుమతించేవారు.

సామ్రాజ్యాన్ని నాడులుగా, నాడులను స్థలాలుగా, స్థలాలను గ్రామాలుగా విభజించారు. కమ్మనాడు, పాకనాడు, రేనాడు, సబ్బినాడు, మొదలైనవి ఆనాటి ముఖ్య నాడులు. ఒక్కో స్థలంలో 10 నుండి 60 గ్రామాల వరకు ఉండేవి. పాలనలో గ్రామమే చివరిది. గ్రామ పాలన కోసం రెడ్డి, తలారి, కరణం, పురోహితుడు వంటి 12 మంది అయగార్లు ఉండేవారు.

**నాయంకర పద్ధతి:** కాకతీయుల సైనిక విధానంలో నాయంకర వ్యవస్థ ముఖ్యమైంది. ఇది ఒక రకంగా జాగీర్దారీ వ్యవస్థను పోలి ఉండేది. రాజుకు విధేయత చూపటం దీని ముఖ్య లక్షణం. రాజులు నాయంకరులకు కొన్ని గ్రామాలను ఇచ్చేవారు. గ్రామాల నుండి వచ్చే ఆదాయంతో వారు నిర్ణీత సంఖ్యలో సైన్యాన్ని పోషించి యుద్ధ సమయంలో రాజుకి తోడ్పడేవారు. రాజుకు క్రమం తప్పకుండా కప్పాన్ని చెల్లించాలి. ఈ కాలంలో 72 మంది నాయంకరులుండేవారు ఒక్కో నాయకుడు, ఒక్కో దుర్గ రక్షణకు బాధ్యత వహించేవాడు. ఈ విధానాన్నే తర్వాతి కాలంలో విజయనగర రాజులు అమరనాయక వ్యవస్థగా ప్రవేశపెట్టారు.

### 13.6.5 సామాజిక - ఆర్థిక పరిస్థితులు

కాకతీయులు శూద్రులైనప్పటికీ రాజధర్మాన్ని అనుసరించి అన్ని వర్గాల ప్రజల సహకారంతో శాంతియుతంగా పాలించారు. చేపట్టిన వృత్తుల ఆధారంగా అనేక ఉపకులాలు ఏర్పడ్డాయి. 'సమయాలు' అనే కుల సంఘాలు ఏర్పడ్డాయి. ప్రతి కుల సంఘం తమలో ఒకరిని కులపెద్దగా ఎన్నుకునే వారు అతడు కుల సంరక్షణకు కృషి చేసేవాడు. ఆ కులంలోని వారు కుల సంఘానికి కొన్ని పన్నులు చెల్లించేవారు. కుల పెద్ద తమ కులంలోని తగాదాలను పరిష్కరించేవాడు. అయితే ఒక్కోసారి కొన్ని కులాల మధ్య తీవ్ర వైషమ్యాలు ఏర్పడేవి. అలా ఏర్పడిన వైషమ్యాలతో ముస్లింల దండయాత్రల సమయంలో కొందరు చక్రవర్తి పూర్తిగా సహకరించలేదు. అది కాకతీయ రాజ్య వినాశనానికి దారితీసింది.

ఈ కాకతీయ రాజ్యం నీటి వనరులు, భూసారం తక్కువగా ఉన్నటువంటి దక్కన్ పీఠభూమి ప్రాంతంలో ఏర్పడటంతో ప్రారంభంలో ఖజానాలో డబ్బులు తక్కువగానే ఉండేవి. కానీ గణపతిదేవుని సైనిక విజయాలతో వ్యవసాయ పన్నులు, వర్తక సుంకాల ద్వారా కోశాగారం నిండినది.

### 13.6.6 వర్తక వాణిజ్యం

కాకతీయుల కాలంలో వ్యవసాయంతో పాటు అనేక పరిశ్రమలు వృద్ధి చెందాయి. పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్రలో 20కి పైగా వస్త్రాలను పేర్కొన్నారు. వరంగల్‌లో రత్నకంబళ్ళు, ముఖమల్ వస్త్రాలు తయారు చేసేవారు. దేవాలయాలలో తరచుగా ఉపయోగించే లోహపు గంటలు, కంచు కరదీపికలు, పంచ

లోహలతో తయారు చేసిన వస్తువులు ముఖ్యమైనవి. నిర్మల్‌లో తయారైన కత్తులకు విదేశాలలో మంచి గిరాకీ ఉండేది. గోల్కొండ ప్రాంతంలో వజ్రాల గనులు ఉన్నట్టు మార్కోపోలో పేర్కొన్నాడు. ఓరుగల్లు, పానగల్లు, జడ్చర్ల, అలంపూర్, మక్తల్, మంథెన మొదలైనవి ప్రముఖ వర్తక కేంద్రాలుగా విరాజిల్లాయి.

విదేశీ వాణిజ్యానికి మోటుపల్లి ప్రధాన కేంద్రం కాగా, కృష్ణపట్నం, హంసలదీవి, మచిలీపట్నాలలో విదేశీ వాణిజ్యం జరుగుతుండేవి.

ఈ కాలంలో వృత్తి శ్రేణులు, వర్తక శ్రేణులు వ్యాపారంలో కీలక పాత్ర పోషించేవి. వర్తకం స్వదేశీ, విదేశీ అని రెండు రకాలుగా ఉండేది. మొదటి వర్గం వారిని 'నకరం' అని, రెండవ వర్గం వారిని 'నానాదేశి', 'పెక్కంద్రు' అనే వారు వర్తకం ఎక్కువగా వైశ్యుల చేతిలో కేంద్రీకృతమై ఉండేది. వీరిని చెట్టి, శ్రేష్ఠి అని పిలిచేవారు. ప్రధాన కేంద్రాలను కలుపుతూ రహదారులను కూడా నిర్మించారు.

### 13.6.7 మతం-వాస్తు నిర్మాణం

కాకతీయ యుగంలో జైన, బౌద్ధ మతాలు క్షీణిస్తూ వచ్చాయి. బుద్ధుడిని విష్ణువు దశావతారాలలో ఒకటిగా చేర్చడంతో బౌద్ధ మతం హిందూ మతంతో కలిసిపోయింది. 12వ శతాబ్దంలో కాకతీయ రాజులు జైన మతాన్ని అవలంభించారు. రెండవ ప్రోలరాజు కాలం నుండి శైవ మతం బలపడింది.

వీరి కాలంలో వాస్తు శిల్పాలు అభివృద్ధి చెందాయి. ఉన్నత అధిష్ఠానాలు, నున్నటి శిల్పాలతో కూడిన స్తంభాలు చక్కని శిల్పాలు గల లోకప్పులు, తోరణ శిల్పం, హంసలు, పద్మాలు కాకతీయ శిల్పాల యొక్క ముఖ్య లక్షణాలు, ఇసుక పునాదులపై నిర్మాణాలు వీరి యొక్క ప్రత్యేకత. వీరి నిర్మాణాలలో ఎక్కడ కూడా సిమెంటు, సున్నం వాడకపోవడం ముఖ్య విశేషం. హన్మకొండలో సిద్దేశ్వరాలయం, పద్మాక్షి ఆలయాలను మొదటి ప్రోలరాజు కట్టించాడు. హన్మకొండలో రుద్రదేవుడు రుద్రేశ్వరాలయం (వేయి స్తంభాల గుడి) కట్టించాడు. ఇది త్రికూటాలయం, శివుడు, విష్ణువు, సూర్యుడు ఇందులో కొలువై ఉన్నారు. ఇక్కడి నంది విగ్రహంలో జీవకళ ఉట్టిపడుతుంది. దేవాలయం నలువైపుల రాతితో చెక్కిన ద్వార తోరణాలు కలవు. ఇవి నాటి శిల్పుల పనితనానికి నిదర్శనాలు.

కాకతీయుల నిర్మాణాలన్నింటిలోకి తలమానికమనదగ్గ కట్టడం రామప్ప దేవాలయం ప్రస్తుతం ములుగు జిల్లాలోని పాలంపేటలో కలదు. నక్షత్రాకారంలో గల దీనిని గణపతిదేవుని సేనాని రేచర్ల రుద్రుడు 1213లో కట్టించాడు.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. కాకతీయుల స్వతంత్ర పాలకుల గురించి వివరించండి.
2. కాకతీయుల కాలంలోనే సామాజిక ఆర్థిక పరిస్థితులను గురించి తెలియజేయండి.
3. కాకతీయుల మత వాస్తు నిర్మాణాల గురించి వివరించండి.

## 13.7 గోల్కొండ కుతుబ్‌షాహీలు

గుల్బర్గా కేంద్రంగా బహమనీ రాజ్యం దక్కన్లో వెలిసింది. క్రమేణా ఈ ప్రాంతీయ రాజ్యం బలపడ్డాయి. బహమనీలు తెలంగాణ ప్రాంతాన్ని కూడా ఆక్రమించారు. కానీ మహమ్మద్ షా (సా.శ. 1463-1482) కాలంలో

బహమనీ రాజ్యపతనం ప్రారంభమైంది. ఇతని కాలంలోనే కుతుబ్‌షాహీ రాజ్య స్థాపకుడైన కులీ కుతుబ్ ఉల్ ముల్క్ బహమనీ సుల్తాన్ పట్ల విశ్వాసంగా విధులు నిర్వహించినప్పటికీ 1518లో గోల్కొండ కేంద్రంగా స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నాడు.

**కులీ-కుతుబ్-ఉల్-ముల్క్ (సా.శ.1518-1543)**

స్వతంత్ర గోల్కొండ రాజ్య స్థాపకుడు సుల్తాన్ కులీ-కుతుబ్-ఉల్-ముల్క్, ఇతడి పూర్వీకులు మధ్య ఆసియాకు చెందినవారు. గుల్బర్గాలో జరిగిన అంతర్యుద్ధంలో కులీ-కుతుబ్-షా బహమనీ సుల్తాన్ యొక్క ప్రాణాలు కాపాడటంతో ఇతన్ని తెలంగాణకు 'తరఫ్‌దార్‌గా' నియమించబడ్డాడు. ఇతడు గోల్కొండ రాజ్యాన్ని కోటను సుస్థిరం చేయడానికి ప్రయత్నించాడు. చివరకు సా.శ. 1543లో తన 99వ యేట తన కొడుకు జంషేద్ కులీ పన్నిన కుట్రలో హత్యకు గురయ్యాడు.

| కుతుబ్‌షాహీలు | |
|---|---|
| 1518-1543 | సుల్తాన్ కులీ కుతుబ్-ఉల్-ముల్క్ |
| 1543-1550 | జంషీద్ కులీ కుతుబ్ షా |
| 1550-1550 | సుభాన్ కులీ కుతుబ్ షా |
| 1550-1580 | ఇబ్రహీం కులీ కుతుబ్ షా |
| 1580-1612 | ముహమ్మద్ కులీ కుతుబ్ షా |
| 1612-1626 | సుల్తాన్ ముహమ్మద్ కుతుబ్ షా |
| 1626-1672 | అబ్దుల్లా కుతుబ్ షా |
| 1672-1686 | అబుల్ హసన్ కుతుబ్ షా |

## 13.7.1 ప్రభుత్వం - మంత్రిమండలి

గోల్కొండ కేంద్రంగా సుమారు 175 సంవత్సరాల పాటు తెలుగు, మరాఠా, కన్నడ ప్రజలపై అధికారాన్ని చెలాయించిన కుతుబ్‌షాహీలు ప్రజలకు సమర్థవంతమైన పరిపాలన అందించారు. కుతుబ్‌షాహీల పరిపాలనా వ్యవస్థలో సుల్తాన్ స్థానం కీలకమైంది. మజ్లిస్ ఇ దివాన్‌దారీ (మంత్రి పరిషత్) సుల్తాన్ ఆదేశాల ప్రకారం పని చేసేది. సుల్తాన్ కొన్ని సందర్భాల్లో తనను తాను 'జిల్లుల్లా (దేవుని ప్రతిబింబం)'గా భావించేవాడు అతనికి సహాయంగా మీర్ జుమ్లా (ప్రధాని), అయినీ ఉల్ ముల్క్ (సైనిక వ్యవహారాల మంత్రి), ఖజానాధార్ (కోశాధికారి), మజుందార్ (ఆడిట్ వ్యవహారాలు), శుభ్రునవీస్ (అధికార రికార్డులను భద్రపరిచే అధికారి), కొత్వాల్ (శాంతి భద్రత పర్యవేక్షణ) మొదలైనవారు సుల్తాన్‌కు సహకరించేవారు.

## 13.7.2 పరిపాలన

కుతుబ్‌షాహీలు తమ రాజ్యాన్ని తరఫ్‌లుగా విభజించారు. అబుల్ హసన్ తానాషా కాలంలో గోల్కొండ రాజ్యంలో మొత్తం 6 తరఫ్‌లు ఉన్నట్లు ఆధారాలు ఉన్నాయి. తరఫ్‌కు పెద్ద తరఫ్‌దార్. ఇతన్ని సుల్తాన్ నియమించేవాడు. తరఫ్‌లను సర్కార్‌లుగా విభజించారు.రాజ్యంలో మొత్తం 37 సర్కార్లు ఉన్నట్లు తెలుస్తున్నది.



*చిత్రం-13.2: గోల్కొండ కోట*

పరగణాలు, తాలూకాలు అనేవి ఇతర పాలనా విభాగాలు. ఫౌజ్ దార్, సర్కార్లు, హవల్దార్లు మొదలైనవారు పరగణ స్థాయిలో ఇతర అధికారులు, తిరిగి సర్కారులను (జిల్లాలను) సిమి, సీమగా విభజించారు. బెల్లంకొండ సీమ, వినుకొండ సీమ, నిజాంపట్నం సీమ, కొండపల్లి, మచిలీపట్నం కొండపల్లి, మచిలీపట్నం, ఏలూరు, రాజమండ్రి మొదలైనవి ముఖ్య సీమలు పరిపాలనలో చివరి యూనిట్ గ్రామం. గ్రామ పెద్ద ముఖుద్దుమ్, కులకర్ణి (గ్రామస్థాయి అకౌంటెంట్). వీరి ఆధ్వర్యంలో గ్రామ పాలన జరిగేది.

### 13.7.3 సామాజిక పరిస్థితులు

ఆనాటి సమాజంలో హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు గలరు. ఇక్కడి ప్రాంతంలోని ముస్లింలలో సున్నీ, షియా అనే రెండు తెగలు కలవు. అయితే కుతుబ్‌షాహీలు 'షియా' శాఖకు చెందిన వారు కావడం వల్ల పాలనలో షియాలకు అధిక ప్రాధాన్యం ఉండేది. ఉన్నత పదవులు చాలా మటుకు వారికే ఇచ్చేవారు. తర్వాత స్థానం సున్నీలకు ఇచ్చేవారు. సమాజంలోని ప్రజలు తమ యొక్క కుల వృత్తులను ఎక్కువగా అనుసరించేవారు. హిందూ ముస్లిం మతాల మధ్య సామరస్యం వెల్లివిరిసింది. మొహర్రం వేడుకలలో రెండు వర్గాల ప్రజలు ఉత్సాహంగా పాల్గొనేవారు. సూఫీలు అనే మతగురువులు మత సామరస్యానికి ప్రాధాన్యతనిచ్చారు.

### 13.7.4 మత పరిస్థితులు

కుతుబ్‌షాహీలు పరమత సహనం కలవారిగా కీర్తించబడ్డారు. తమ రాజ్యంలో అధిక శాతం జనాభా అయినటువంటి హిందువుల ఆచార వ్యవహారాలను వీరు గౌరవించారు. హిందూ దేవాలయాలు, పండితులను ఆదరించారు. భద్రాచలం ఆలయానికి అబుల్ హసన్ తానాషా, శంకరగిరి, పాల్వంచ గ్రామాలను దానమిచ్చాడు.

### 13.7.5 సాంస్కృతిక పరిస్థితులు

గోల్కొండ రాజ్యంలో అత్యధిక ప్రజల మాతృ భాష అయినటువంటి తెలుగును కుతుబ్‌షాహీలు సమాదరించారు. కొందరు సుల్తాన్లు తెలుగు భాషలో పట్టు సాధించారు. అనేక తెలుగు కవులను పండితులను వీరు గౌరవించారు. మధ్యయుగ దక్కన్ చరిత్రలో ఇతర ముస్లిం పాలకులు ఈ విధమైనటువంటి సహనాన్ని ప్రదర్శించలేదు. ఇబ్రహీం కులీ కుతుబ్‌షా కాలంలో గోల్కొండ తెలుగు కవులకు భువన విజయంగా మారింది. ఈ కాలంలోని ముఖ్యమైన కవులు అద్దంకి గంగాధరుడు, 'తపతీసంవరణోపాఖ్యానం' రచయిత రుద్రకవి, పొన్నగంటి తెలగనార్యుడు. గణేశ పండితుడు, సారంగతమ్మయ్య పదకవితా పితామహుడైన క్షేత్రయ్య ఈ కాలం వారే. ఇతను సుల్తాన్ ఆస్థానాన్ని సందర్శించి వెయ్యికిపైగా పదాలు పాడాడు.

## 13.8 అసఫ్‌జాహీల యుగం

ఔరంగజేబు సా.శ. 1687లో గోల్కొండ రాజ్యాన్ని ఆక్రమించాడు. అప్పటి నుండి 1724 వరకు మొగలుల ఆధీనంలో ఉంది. అప్పటి మొగల్ వైస్రాయ్, నిజాం ఉల్ ముల్క్ బిరుదు గ్రహీత అయిన మీర్ కమ్రుద్దీన్ సా.శ 1724లో స్వతంత్రత ప్రకటించుకుని హైదరాబాద్ రాజ్యాన్ని ఏర్పాటు చేశాడు.

ఇతని అసలు పేరు మీర్ కమ్రుద్దీన్ ఔరంగజేబు ఆస్థానంలో మున్సబ్ దారుగా ఉండేవాడు. ఔరంగజేబ్ ఇతనికి చిన్ ఖిలిచ్ ఖాన్ అనే బిరుదునిచ్చాడు. ఔరంగజేబు మరణం తర్వాత జరిగిన పరిణామాల్లో 1724లో

దక్కన్ ప్రాంత గవర్నర్ అయిన ముబారిజ్ ఖాన్ బీరార్ వద్ద 'షక్కర్ ఖేడా' యుద్ధంలో ఓడించి స్వతంత్రత ప్రకటించుకున్నాడు. మొగల్ చక్రవర్తి ఇతని స్వతంత్రతను అంగీకరించి అసఫ్ జా బిరుదును ప్రదానం చేశాడు. అప్పటి నుండి తెలంగాణ ప్రాంతంలో అసఫ్‌జాహీల పాలన ప్రారంభమైంది.

| అసఫ్‌జాహీలు | |
|---|---|
| మీర్ కమరుద్దీన్ నిజాం-ఉల్-ముల్క్ (అసఫ్ జా I) | 1724-1748 |
| నిజాం అలీఖాన్ (అసఫ్ జా II) | 1762-1803 |
| మీర్ అక్బర్ అలీ ఖాన్ సికిందర్ (అసఫ్ జా III) | 1803-1829 |
| మీర్ ఫర్ఖుండా అలీ ఖాన్ నాసిర్-ఉద్-దౌలా (అసఫ్ జా IV) | 1829-1857 |
| మీర్ తహ్నియాట్ అలీ ఖాన్ అఫ్జల్-ఉద్-దౌలా (అసఫ్ జా V) | 1857-1869 |
| మీర్ మహబూబ్ అలీఖాన్ (అసఫ్ జా VI) | 1869-1911 |
| మీర్ ఉస్మాన్ అలీఖాన్ (అసఫ్ జా VII) | 1911-1948 |

### 13.8.1 సాలార్ జంగ్ సంస్కరణలు

**ఆర్థిక సంస్కరణలు:**

హైదరాబాద్ రాజ్య ప్రధానమంత్రి అయిన సాలార్ జంగ్ ప్రవేశపెట్టిన ముఖ్య సంస్కరణలలో ఆర్థిక సంస్కరణలు ముఖ్యమైనవి. పన్నుల వసూళ్లలో జరిగే అవకతవకలను ఆరికట్టడానికి సాలార్జంగ్, ప్రభుత్వం తరపున తాలూకాదారులను నియమించి వారి ద్వారా రైతుల నుంచి పన్ను వసూలు చేయడం ప్రారంభించాడు. ఈ అధికారులకు రాజ్యమే జీతభత్యాలు చెల్లించేది. దీని వల్ల రాజ్యానికి రైతులతో నేరుగా సంబంధాలు ఏర్పడ్డాయి. ప్రజలకు దళారీ వ్యవస్థ నుంచి విముక్తి కలిగింది.

సాలార్జంగ్ కంటే ముందు నాణేల ముద్రణ ప్రభుత్వంతో పాటు ప్రైవేటు వ్యక్తులు కూడా చేపట్టేవారు. దీనితో నకిలీ నాణాలు వాడుకలోకి వచ్చాయి. దీన్ని అరికట్టడానికి నాణేల ముద్రణ కేవలం ప్రభుత్వం బాధ్యత అని ప్రకటించాడు.

**రవాణా సౌకర్యాలు:**

రవాణా సౌకర్యాలు మెరుగుపరచడానికి రోడ్లు మరియు రైల్వే లైన్లను ఏర్పాటు చేశాడు. 1868లో హైదరాబాద్ నుంచి షోలాపూర్ వరకు రోడ్డు మార్గాన్ని వేయించాడు. మద్రాసు నుంచి బొంబాయి వెళ్ళే మార్గంలో వాడి నుండి హైదరాబాద్ వరకు రైల్వేలైన్ వేయించాడు. 1871లో సింగరేణి బొగ్గుగనుల వరకు డోర్నకల్, ఇల్లందు మీదుగా రైల్వే మార్గం వేయించాడు. తర్వాత దీన్ని విజయవాడ వరకు పొడిగించారు.

**విద్యా సంస్కరణలు - గ్రంథాలయోద్యమం:**

సాలార్జంగ్ విద్య గొప్పతనాన్ని, అభివృద్ధిలో దాని పాత్రను గమనించి, చక్కని పరిపాలనకు సమర్థవంతమైన అధికారులు అవసరమని దానికి నాణ్యమైన విద్యను అందించాలని భావించాడు.

హైదరాబాద్ రాజ్యంలో 1805లో ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేశారు. సిటీ హైస్కూల్, చాదర్‌ఘాట్ హైస్కూల్ మొదలైన వాటిని పాశ్చాత్య విద్యను అందించడానికి ఏర్పాటు చేశారు. 1870లో ఇంజనీరింగ్ పాఠశాలను ఏర్పాటు చేశాడు. ఉన్నత వర్గాల పిల్లల కోసం 1873లో మదర్సా-ఎ-అలియాను ఏర్పాటు చేశాడు. రాజవంశీయుల పిల్లల కోసం 1878లో మదర్సా-ఎ-జా ను ఏర్పాటు చేశాడు.

విద్యను ప్రోత్సహించడానికి గ్రంథాలయ ఏర్పాటును గుర్తించి హైదరాబాద్ రాష్ట్రంలో అనేక గ్రంథాలయాలు ఏర్పాటు అయ్యాయి. అయితే ఇందులో దాదాపు సగం కంటే ఎక్కువ స్వచ్ఛంద గ్రంథాలయాలే, 19వ శతాబ్దం రెండవ భాగంలో ఉద్భవించిన మేధావివర్గం ద్వారా గ్రంథాలయ ఉద్యమం ప్రారంభమైంది. ఇది తెలంగాణ ప్రాంతంలో సామాజిక, సాంస్కృతిక రాజకీయ చైతన్యాన్ని తీసుకువచ్చింది. గ్రంథాలయాలు చైతన్యవాహికలుగా పని చేశాయి. అయితే నిజాం ప్రభుత్వం వీటిని ప్రోత్సహించేది కాదు. అధికారులు గాని, అధికార భాష గాని తెలుగులో గ్రంథాలయ ఏర్పాటుకు తోడ్పడేది కాదు. జమీందార్లు, సంస్థానాధీశులు కూడా గ్రంథాలయాలను ప్రోత్సహించలేదు. గ్రంథాలయాల స్థాపనలో ప్రభుత్వ కోపానికి గురై చెరసాల జీవితం గడపినవారు బహుశా తెలంగాణలోనే కనిపిస్తారు. తెలంగాణలో మొట్టమొదటి గ్రంథాలయాన్ని 1872లో సోమసుందర మొదలియార్ స్థాపించాడు.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. కుతుబ్‌షాహీల చరిత్రను తెలియజేయండి.
2. అసఫ్‌జాహీల చరిత్రను వివరించండి.
3. సాలార్‌జంగ్ సంస్కరణల గురించి విశ్లేషించండి.

## 13.9 ముగింపు (ముఖ్యాంశాలు)

- తెలంగాణ ప్రాంతం పీఠభూమిలో ఉంది.
- తెలంగాణ ప్రాంతం మొత్తాన్ని ఏకం చేసి మొదటగా పాలించిన సామ్రాజ్యం శాతవాహన సామ్రాజ్యం.
- శాతవాహనుల తర్వాత విష్ణుకుండినులు ఈ ప్రాంతాన్ని పాలించారు.
- విష్ణుకుండినుల తర్వాత చాళుక్యులు ఈ ప్రాంతాన్ని కొంత కాలం పాలించారు.
- చాళుక్యుల తర్వాత ఈ ప్రాంతాన్ని పాలించిన మరొక ముఖ్య వంశం కాకతీయులది.
- కాకతీయుల కాలంలో ఈ ప్రాంతం సర్వతోముఖాభివృద్ధి చెందింది.
- తెలంగాణ ప్రాంతంలో మొట్టమొదటి మహిళా పాలకురాలు రాణి రుద్రమదేవి.
- కాకతీయుల తర్వాత పద్మనాయకులు కొంతకాలం పాటు ఈ ప్రాంతాన్ని పాలించారు.
- కాకతీయుల తర్వాత కుతుబ్‌షాహిలు ఈ ప్రాంతాన్ని దాదాపు 150 సంవత్సరాలు పాలించారు.
- కుతుబ్‌షాహీలు పరమత సహనంతో పాలించారు.
- కుతుబ్‌షాహీల రాజ్యం మొగలుల దండయాత్రలతో అంతరించిపోయింది.
- ఔరంగజేబు మరణం తర్వాత దక్కన్‌లో అసఫ్‌జాహీల పాలన ప్రారంభమైంది.
- సాలార్ జంగ్ సంస్కరణలు అసఫ్‌జాహీల పరిపాలనలో ముఖ్యమైనవి.

## 13.10 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 1-2 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. విష్ణుకుండినులు ఎలాంటి యాగాలు నిర్వహించారు?
2. చాళుక్యుల పరిపాలన విభాగాలు ఏవి?
3. కాకతీయుల కట్టడాలు ఏవి?
4. కాకతీయుల కాలంలోని బౌద్ధ మతం గురించి తెలపండి.
5. గ్రంథాలయోద్యమం ప్రాముఖ్యం తెలియజేయండి.

**II. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 4-5 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. బాదామి చాళుక్యుల గురించి తెలియజేయండి.
2. చాళుక్యుల పాలనా విధానాన్ని వివరించండి.
3. రాణి రుద్రమదేవి గురించి రాయండి.
4. కాకతీయుల వర్తక - వాణిజ్యం గురించి వివరించండి.
5. కుతుబ్ షాహీల సాంస్కృతిక సేవ గురించి వివరించండి.
6. మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ గురించి తెలపండి.

**III. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 8-10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. చాళుక్యుల ఆర్థిక పరిస్థితిని సమీక్షించండి.
2. కాకతీయుల మతం వాస్తు నిర్మాణాలు గురించి విశ్లేషించండి.
3. సాలార్‌జంగ్ సంస్కరణలు, వాటి గురించి విశ్లేషించండి.

## 13.11 ఉపయుక్త గ్రంథాలు


1. డా॥ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయ ప్రచురణ, ఆంధ్రుల చరిత్ర 1687 వరకు
2. ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం, తెలుగు అకాడమి

# 14 తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం - ఆవిర్భావం

## 14.0 అభ్యసన ఫలితాలు

- తెలంగాణ రాచరికం నుండి ప్రజాస్వామ్య పాలనలోకి ఎలా వచ్చిందో వివరిస్తారు.
- తెలంగాణ ఆంధ్రప్రదేశ్ విలీనానికి దారితీసిన అంశాలను వివరిస్తారు.
- పెద్ద మనుష్యుల ఒప్పందంలోని ముఖ్య అంశాలను విశ్లేషిస్తారు.
- 1969 ఉద్యమానికి గల కారణాలను వివరించగలుగుతారు.
- తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల అభివృద్ధి మధ్య ఉన్న పోలికలు, భేదాలను విశ్లేషిస్తారు.
- తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో విద్యార్థుల జెఏసిల రాజకీయ పార్టీల పాత్రలను విశ్లేషిస్తారు.
- ప్రత్యేక రాష్ట్ర ప్రకటనకు దారితీసిన పరిస్థితుల గురించి వివరిస్తారు
- తెలంగాణ ఉద్యమంలో వివిధ రూపాలలో జరిగిన నిరసనల గురించి వివరిస్తారు.

## 14.1 పరిచయం

విశాలమైన భూభాగం, సాంస్కృతిక భిన్నత్వం గల తమ ప్రాంత వనరుల సద్వినియోగం ప్రత్యేక రాష్ట్రం ద్వారా మాత్రమే సాధ్యమని భావించిన ప్రజలు, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమం ద్వారా తమ ఆకాంక్షలకు ప్రతిరూపంగా సాధించుకున్న తెలంగాణ 2014, జూన్ 2వ తేదీన ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించింది.

## 14.2 స్వాతంత్ర్యానంతరం

15 ఆగస్ట్, 1947 మనకు స్వాతంత్ర్యం వచ్చే నాటికి భారతదేశంలో 550 సంస్థానాలు ఉండేవి. బ్రిటిష్ వారు స్వాతంత్ర్యాన్ని ప్రకటిస్తూ, స్వదేశీ సంస్థానాల విషయంలో భారతదేశంలో ఉంటాయో, పాకిస్తాన్‌లో ఉంటాయో లేదా స్వతంత్రంగా ఉంటాయో నిర్ణయించుకునే అధికారం సంస్థానాలకే ఇచ్చారు. ఈ అవకాశంతో కొన్ని సంస్థానాలు స్వయంప్రతిపత్తి ప్రకటించుకున్నాయి. అందులో హైదరాబాద్ కూడా ఒకటి. నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్, హైద్రాబాద్ సంస్థానం స్వతంత్ర్య రాజ్యంగా ఉంటుందని ప్రకటించాడు.

### 14.2.1 హైదరాబాద్ రాష్ట్రం - భారతదేశంలో విలీనం

హైదరాబాద్ రాష్ట్రంలోని మొత్తం16 జిల్లాలలో, తెలుగు భాష మాట్లాడే వారు గల జిల్లాలు 8, మరాఠా భాష మాట్లాడేవారు గల జిల్లాలు 5, కన్నడ భాష మాట్లాడేవారు గల జిల్లాలు 3 ఉన్నాయి. 84 శాతంగా ఉన్న హిందువులు, ముస్లింలు 11 శాతంగా ఉన్నారు. మిగతావారు క్రైస్తవ, జైన, సిక్కు ఇతర అల్పసంఖ్యాక మతాలకి

చెందిన వారు. ఆ విధంగా సామాజిక పరంగా, భాషా పరంగా, సంస్కృతి పరంగా సమ్మిళిత జీవనానికి హైదరాబాద్ రాష్ట్రం ఒక విశిష్టమైన ఉదాహరణ.


చిత్రం-14.1: సర్దార్ వల్లభాయి పటేల్, మీర్ ఉస్మాన్ అలీఖాన్

ఒక వైపు జాతీయవాదుల జాయిన్ ఇండియా ఉద్యమ ప్రభావం వల్ల, మరోవైపు నిజాం పాలన పట్ల వ్యతిరేకత వల్ల ప్రజలు అసంతృప్తిగా ఉన్న ప్రజలు, హైదరాబాద్ రాష్ట్రాన్ని భారతదేశంలో కలపాలని భావించారు. అంతర్గత ఘర్షణల వల్ల హైదరాబాద్, ఇతర ప్రాంతాలలో చోటు చేసుకుంటున్న శాంతి భద్రతల క్షీణతకు పరిష్కారంగా హైదరాబాద్ ప్రాంతంపై భారత ప్రభుత్వం సైనిక చర్య జరిపింది. ఈ సైనిక చర్యనే పోలీస్ యాక్షన్ అంటారు. 1948 సెప్టెంబర్ 17న నిజాం లొంగుబాటుతో హైదరాబాద్ రాష్ట్రం భారతదేశంలో విలీనమయ్యింది.

### 14.2.2 1952 మొదటి సార్వత్రిక ఎన్నికలు

భారత రాజ్యాంగం 1950, జనవరి 26వ తేదీన అమల్లోకి రావడంతో 1952లో అన్ని రాష్ట్రాలతో పాటు మొదటి సార్వత్రిక ఎన్నికలు జరిగాయి.

### 14.2.3 ముల్కీ ఉద్యమం

హైదరాబాద్ రాజ్యంలో 20వ శతాబ్దం మొదట్లో ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వారిని ఉద్యోగాలలో ఎక్కువగా నియమించేవారు. దీంతో హైదరాబాద్ సంస్థానంలోని ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని తెలంగాణ నిరుద్యోగులు 1910 నుంచి 1918 వరకు ఉద్యమించారు. ఈ డిమాండ్‌కు తలవంచి 1919లో ముల్కీ నిబంధనలు ప్రవేశపెట్టడం జరిగింది. ముల్కీ నిబంధనల ప్రకారం సంస్థానంలోని ఉద్యోగాలు స్థానికులకే దక్కాలి. ముల్కీ (స్థానిక అభ్యర్థి) అంటే 15 సంవత్సరాల పాటు కనీసం ఈ ప్రాంతంలో నివాసం ఉండాలి. ఒక వ్యక్తి ముల్కీగా గుర్తింపు పొందడానికి సంబంధిత అధికారుల వద్ద ఒక డిక్లరేషన్ కూడా సమర్పించాల్సి ఉంటుంది. ఈ నిబంధనలు స్థానికులకు ఉద్యోగాల సాధనలో రక్షణ కల్పించాయి. అయితే ఈ నిబంధనలను ఉల్లంఘించి వేలాది మంది నాన్ ముల్కీలు (స్థానికేతరులు) స్థానిక ఉద్యోగాలలో చేరి, తెలంగాణ యువతకు అవకాశాలు లేకుండా చేశారు. భారతదేశంలో విలినం అయిన తరువాత ఏర్పడిన పౌర ప్రభుత్వాలు ముల్కీ నిబంధనలపై సరైన అవగాహన లేక, అవి అనుసరించిన ఉద్యోగ, ఉపాధి విధానాలు స్థానికుల అవకాశాలను దెబ్బ తీశాయి.

ఈ పరిణామాలన్నింటి ఫలితంగా ఆందోళనలకు గురైన విద్యార్థులు నిరుద్యోగులు ఐక్యకార్యాచరణ కమిటీగా ఏర్పడి ర్యాలీలు నిర్వహించారు. పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరసనలు తెలిపారు. 'నాన్ ముల్కీ గో బ్యాక్', 'ఇడ్లీ సాంబార్ గో బ్యాక్' వంటి నినాదాలతో ర్యాలీలు నిర్వహించారు. వీటి ఫలితంగా అప్పటికే ఉన్న ముల్కీ నిబంధనలు పరిశీలించి, వివిధ వర్గాల వారితో చర్చించి, స్థానికేతరులను తిప్పి పంపే ప్రక్రియను ప్రభుత్వం చేపట్టింది. కానీ ఈలోగా, భాషా ప్రయుక్త రాష్ట్రాల అంశం తెరపైకి రావడంతో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటుతో ఈ ప్రక్రియ ఆగిపోయింది.

## మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. ముల్కీ అనగానేమి?
2. స్థానికేతరులు వివిధ మార్గాల ద్వారా స్థానికుల అవకాశాలు లేకుండా చేయటంపై మీ అభిప్రాయం ఏమిటి?

## 14.3 రెండు రాష్ట్రాల విలీనం

దక్షిణ భారతదేశంలో భాషా ప్రాతిపదికన నూతన రాష్ట్రాల ఏర్పాటుకై రాష్ట్రాల పునర్విభజన కమిషన్ 1953లో ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో మద్రాసు రాష్ట్రం నుండి విడిపోయి, కర్నూల్ రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. కన్నడ ప్రాంతాలను మైసూరు రాష్ట్రంలో కలపాలని, మరాఠీ ప్రాంతాలను బొంబాయి రాష్ట్రంలో కలపాలని కమీషన్ సిఫారసు చేసింది. ఆంధ్ర ప్రజలు తెలంగాణ రాష్ట్రంలో కలవడానికి ఇష్టపడుతున్నారు కానీ, తెలంగాణ ప్రజలు మాత్రం వ్యతిరేకంగా ఉన్నారు. అధిక విద్యావంతులైన ఆంధ్రులు తెలంగాణ లోకి వస్తే, తెలంగాణ ప్రజలు నష్టపోతారనే భావనతో పాటు విద్యాపరంగా అణగదొక్కబడతారని, నీటిపారుదల ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురవుతాయని తెలంగాణ ప్రజలు భావించారు. కేంద్ర ప్రభుత్వ చొరవతో ఇరు ప్రాంతాల నాయకులు ఢిల్లీలో సమావేశమై 'పెద్ద మనుషుల ఒప్పందం' కుదుర్చుకున్నారు. దీంతో విలీన ప్రక్రియకు ప్రాతిపదిక ఏర్పడింది.

### 14.3.1 పెద్ద మనుషుల ఒప్పందం

1956 ఫిబ్రవరి 20న ఢిల్లీలోని హైదరాబాద్ అతిథి గృహంలో ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ఆధ్వర్యంలో రాష్ట్రాల పునర్విభజన కమిషన్ నివేదికను పరిశీలించి విశాలాంధ్ర ఏర్పాటు విషయంలో తెలంగాణ ప్రజల అనుమానాలను నివృత్తి చేయడానికి, వారికి రక్షణ కల్పించడానికి చేసిన తీర్మానమే పెద్ద మనుషుల ఒప్పందం.

ఈ సమావేశానికి తెలంగాణ నుంచి బూర్గుల రామకృష్ణారావు, మర్రి చెన్నారెడ్డి, కె.వి రంగారెడ్డి, జెవి నర్సింగరావు, ఆంధ్ర ప్రాంతం నుంచి బెజవాడ గోపాలరెడ్డి, నీలం సంజీవరెడ్డి, సర్దార్ గౌతు లచ్చన్న, అల్లూరి సత్యనారాయణ రాజులు హాజరై పెద్దమనుషుల ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంలో తెలంగాణ ప్రాంతానికి సంబంధించిన 14 అంశాలపై తీర్మానం చేశారు.


ఈ ఒప్పందంలోని ముఖ్య అంశాలు:

1. పరిపాలనపై ఖర్చును రెండు ప్రాంతాలు ఆయా నిష్పత్తిలో భరించాలి. తెలంగాణలోని రెవెన్యూ మిగులుని తెలంగాణ అభివృద్ధికి మాత్రమే ఖర్చు చేయాలి.
2. తెలంగాణలో అప్పటికే ఉన్న విద్యా సౌకర్యాలను తెలంగాణ విద్యార్థులకు మాత్రమే కేటాయిస్తారు.
3. పన్నెండేళ్ళపాటు తెలంగాణలో నివసిస్తే తెలంగాణ ప్రాంతంలో ఉద్యోగాలకు, విద్యా సంస్థలలో ప్రవేశాలకు అర్హతనిచ్చే ముల్కీ నియమాలను కొనసాగించడానికి అంగీకరించారు.
4. తెలంగాణ అభివృద్ధి, అవసరాలను పర్యవేక్షించడానికి శాసనసభ నుంచి 20 మంది సభ్యులతో చట్టబద్ధమైన ప్రాంతీయ సంఘం ఏర్పాటు చేయటానికి అంగీకరించారు.
5. తెలంగాణలో వ్యవసాయ భూమి అమ్మకం ఈ ప్రాంతీయ సంఘం నియంత్రిస్తుంది.

6. ఆంధ్రప్రదేశ్ మంత్రుల బృందంలో 40 శాతం సభ్యులు తెలంగాణ నుంచి, 60 శాతం సభ్యులు ఆంధ్రా నుంచి ఉంటారు.
7. ముఖ్యమంత్రి ఆంధ్రప్రాంతం నుంచి ఉంటే ఉపముఖ్యమంత్రి తెలంగాణ నుంచి, ముఖ్యమంత్రి తెలంగాణ నుంచి ఉంటే ఉపముఖ్యమంత్రి ఆంధ్ర నుంచి ఉండాలి.

పెద్ద మనుషుల ఒప్పందంలో తెలంగాణ ప్రాంతీయ మండలి ఏర్పాటు చాలా కీలకమైనది. శాసనసభ అభివృద్ధి, ఆర్థిక ప్రణాళికలు, స్థానిక పరిపాలనా వ్యవహారాలు, ప్రజారోగ్యం, పారిశుద్ధ్యం, స్థానిక ఆసుపత్రులు, విద్య తెలంగాణా విద్యా సంస్థల్లో ప్రవేశాలు, వ్యవసాయ భూముల అమ్మకం మొదలగునవి అన్ని ప్రాంతీయ మండలి పరిధిలో ఉంటాయి. తెలంగాణ ప్రాంత అవసరాలకు అనుగుణంగా అభివృద్ధికై ఈ మండలి కృషి చేయాల్సి ఉంటుంది. తెలంగాణ భూములను తెలంగాణేతర ప్రాంత ప్రజలకు అమ్మడాన్ని ఇది నియంత్రిస్తుంది. ఈ విధంగా ఈ ఒప్పందం ప్రభుత్వం వనరులు సమంగా వాడుకునేలా తెలంగాణ యువతకు, విద్య ఉపాధి అవకాశాలు లభించేలా చేయడానికి ప్రయత్నించింది.

### 14.3.2 ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు




*పటం–14.1: విభజనకు ముందు ఆంధ్రప్రదేశ్*

1953 డిసెంబర్ 22న ఏర్పడిన రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమిషన్‌తో ప్రారంభమైన విలీన ప్రక్రియ అనేక దశలను దాటి చివరికి రాష్ట్రపతి ఆమోదంతో 1956 నవంబర్ 1న హైదరాబాద్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడింది.

**మీ ప్రగతిని పరీక్షించుకోండి**

1. పెద్ద మనుషుల ఒప్పందంలోని ముఖ్యాంశాలు ఏవి?
2. తెలంగాణ ప్రాంతీయ మండలి గురించి తెలపండి.

## 14.4 తొలిదశ తెలంగాణ ఉద్యమం

ఆంధ్రా పాలకులు పెద్ద మనుషుల ఒప్పందానికి మొదట్లోనే అడ్డు వేశారు. అప్పటి ఆంధ్రా పాలకులు. ఈ ఒప్పందం ప్రకారం ముఖ్యమంత్రి ఆంధ్ర ప్రాంతానికి చెందిన వారైతే, ఉప ముఖ్యమంత్రి పదవి తెలంగాణ వారికి కేటాయించాలి. కానీ ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా నియమితులైన నీలం సంజీవరెడ్డి ఉప ముఖ్యమంత్రిని ఎన్నుకోక పోగా, ఉప ముఖ్యమంత్రి పదవినే రద్దు చేశాడు.

ఉద్యోగుల విషయంలోనూ తెలంగాణ వారిని సూపర్ న్యూమరీ (తాత్కాలిక) పోస్టులలో కేటాయించడం వల్ల కొద్ది రోజులకే వారిని తొలగించారు. తప్పుడు ముల్కీ ధ్రువీకరణ పత్రాల ద్వారా చాలా మంది స్థానికేతరులు కూడా ఉద్యోగాలు పొందారు. విద్యాసంస్థల్లో కూడా తెలంగాణ విద్యార్థులకు చెందవలసిన సీట్లను ఆంధ్ర

విద్యార్థులకు ఇచ్చారు. మిగులు నిధులను తెలంగాణ ప్రాంతానికే ఖర్చు చేయాల్సి ఉండగా ఆంధ్ర ప్రాంత అభివృద్ధికి ఖర్చు చేశారు.

పెద్ద మనుషుల ఒప్పందంలోని ఎనిమిదో అంశం ప్రకారం తెలంగాణ వ్యవసాయ భూములను అమ్మడం, కొనడం ప్రాంతీయ కమిటీ నియంత్రణకు లోబడి ఉండాలి. దీని అనుమతి లేనిదే తెలంగాణేతరులెవ్వరు వ్యవసాయ భూములను కొనరాదు. కానీ తెలంగాణలోని చాలా ప్రాంతాల్లో లక్షలాది ఎకరాలను ఆంధ్ర ప్రాంతం నుంచి వలస వచ్చిన వారు కమిటీ అనుమతి లేకుండానే తక్కువ ధరకు కొనుగోలు చేశారు.

ఈ విధంగా అప్పటి పాలకులు తెలంగాణ ప్రజల భూములను, వనరులను, ఉద్యోగాలను కొల్లగొట్టడం వల్లనే ఉద్యమం తలెత్తింది. ఇలా అన్ని రంగాల్లో జరిగిన అన్యాయాలు, వివక్ష, పెద్ద మనుషుల ఒప్పందం ఉల్లంఘనలకు విసిగి వేసారిపోయిన తెలంగాణ ప్రజలు తొలిసారి 1969లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమానికి శ్రీకారం చుట్టారు.

### 14.4.1 తెలంగాణ ఉద్యమం 1969

ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు 1969 జనవరిలో ప్రత్యేక రాష్ట్ర సాధనకై ఉద్యమ కార్యాచరణ మొదలుపెట్టారు. తెలంగాణ కోసం సమ్మె చేయాలని తీర్మానించారు. మంత్రులు ఎమ్మెల్యేలు రాజీనామా చేయాలని, తెలంగాణ 70 కోట్ల నిధులు విడుదల చేయాలని, తెలంగాణ నిధులు దుర్వినియోగంపై న్యాయ విచారణ జరిపించాలని, పెద్ద మనుషుల ఒప్పందాన్ని తూ.చా తప్పకుండా అమలు చేయాలని స్థానికేతరులను వెంటనే వెనక్కు పంపించాలని తీర్మానాలు చేశారు.

ఈ డిమాండ్ల సాధనకై సామూహిక నిరవధిక బంద్‌లు, సామూహిక నిరాహార దీక్షలకు పిలుపునిచ్చారు. అన్ని విద్యా సంస్థలు మూసివేశారు. నిరసన కార్యక్రమాలు, సత్యాగ్రహం, బైఠాయింపులు, జైల్ భరోలు చేపట్టారు. విద్యార్థులు తలపెట్టిన ఈ ఉద్యమం అందరిలోనూ స్ఫూర్తిని నింపింది. ఉద్యోగులు, ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమంలో పాల్గొన్నారు. ప్రాంతీయ అసమానతలను రూపుమాపడానికి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడాల్సిన అవసరం ఉందనే భావన ఆ రోజుల్లో బలంగా ఉంది. ఈ నిరసన కార్యక్రమాల్లో అనేక చోట్ల పోలీసులు నిరసనకారులను అణచి వేశారు. కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో 300 మందికి పైగా చనిపోయారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

### 14.4.2 తెలంగాణ ప్రజా సమితి

ఈ ఉద్యమానికి సరైన నాయకత్వం గాని, వేదిక గాని లేకపోవడంతో ఆందోళనలు, ఊరేగింపులు, సదస్సులు, బంద్‌లతో మొదలై అవధులు దాటి బస్సుల కాల్చివేత, ప్రైవేట్, పబ్లిక్ ఆస్తుల విధ్వంసానికీ చేరుకుంది. ప్రభుత్వ అణచివేత కూడా తీవ్రమైంది.

ఈ సమయంలోనే 1969 ఫిబ్రవరిలో తెలంగాణ ప్రాంత మధ్య తరగతి మేధావులు, లాయర్లు, జర్నలిస్టులు, వాణిజ్య వర్గాలు కలిసి 'తెలంగాణ పీపుల్స్ కన్వెన్షన్' అనే వేదికను ఏర్పాటు చేశాయి. ఈ కన్వెన్షన్ విద్యార్థి, ఉద్యోగ సంస్థల ఆందోళన కార్యక్రమాలను బాగా బలపర్చింది. తరువాత దీనిని 'తెలంగాణ ప్రజా సమితి'గా మార్చారు. 1971 లో రాజకీయ పార్టీగా ప్రకటించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధనే తెలంగాణ ప్రజా సమితి లక్ష్యం అన్న ఏక వాక్య సందేశంతో తమ ఎన్నికల ప్రణాళికను ప్రకటించారు. మర్రి చెన్నా రెడ్డి అధ్యక్షతన

1971 లోక్ సభ మధ్యంతర ఎన్నికల్లో పోటీ చేసి 49% ఓట్లు సంపాదించింది. అన్ని వర్గాల ప్రజలు తెలంగాణ ప్రజా సమితికి మద్దతు తెలిపాయి.

### 14.4.3 ఆరు సూత్రాల పథకం

1969 ఉద్యమం తీవ్ర రూపం దాల్చడంతో కేంద్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. తెలంగాణ నుంచి తరలించిన నిధులపై సమీక్షకుగాను ఒక కమిటీ వేయడం, ప్రాంతీయ అభివృద్ధి సంఘాన్ని ఏర్పాటు చేయడం, దానికి ఎక్కువ అధికారాలు ఇవ్వడం, ముల్కీ నిబంధనలు కఠినంగా అమలుపరచడం లాంటి హామీలతో ఎనిమిది సూత్రాల పథకాన్ని ప్రకటించారు.

ఇదే సమయంలో తెలంగాణ ఉద్యమానికి ప్రతిస్పందనగా సీమాంధ్ర ప్రాంతంలో 1972లో జై ఆంధ్ర ఉద్యమం మొదలైంది. కోస్తా జిల్లాలను మరింత అభివృద్ధి చేయాలని కోరుతూ, స్థానిక హోదాకు సంబంధించి ముల్కీ నియమాలను కూడా తొలగించాలని ఉద్యమించారు. దీంతో 1973లో కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉపాధిలో స్థానిక ప్రజలకు ప్రాధాన్యత ఇస్తామని అన్ని ప్రాంతాల ప్రజలకు విశ్వాసం కల్పిస్తూ ఆరు సూత్రాల పథకాన్ని రూపొందించారు.

దీంతో తెలంగాణ ప్రాంతీయ కమిటీలను, ముల్కీ నిబంధనలను ఆపివేశారు. తెలంగాణను విడిగా చూపించే నియమం కూడా లేకుండా చేశారు. ముల్కీ నియమాల స్థానంలో వచ్చిన స్థానిక రిజర్వేషన్ల కారణంగా పూర్వం ఉన్న నివాస అర్హతను నాలుగు సంవత్సరాలకు కుదించడంతో స్థానిక రిజర్వేషన్ల ఉల్లంఘనకు అవకాశం లభించినట్లయింది. దీంతో పెద్ద మనుషుల ఒప్పందంలో పొందుపరిచిన తన ప్రత్యేక అస్తిత్వాన్ని తెలంగాణ ప్రాంతం కోల్పోయింది. అప్పటి ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాలను ఒకే రకంగా పరిగణించారు. దీని వల్ల తెలంగాణ ప్రాంత విద్యార్థులు, యువత ఎంతో అసంతృప్తికి గురయ్యారు.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. 1969 ఉద్యమం ఏర్పడడానికి గల కారణాలను విశ్లేషించండి.
2. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఉద్యమించిన వారిలో విద్యార్థులే ఎందుకు ముఖ్య పాత్ర పోషించారో తెలపండి.

### 14.5 మలి దశ తెలంగాణ ఉద్యమం

1969లో వచ్చిన తొలిదశ ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని రాజకీయ చర్యల ద్వారా నిరోధించగలిగినప్పటికీ తమకు జరుగుతున్న అన్యాయాలపై తెలంగాణలోని వివిధ వర్గాల ప్రజల్లో అసంతృప్తి అలాగే ఉంది. దానికి తోడు హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో సీమాంధ్రులు పెట్టిన పెట్టుబడులు, ప్రజల వలసలు కుల వృత్తుల విధ్వంసం, సంస్కృతి పట్ల చిన్న చూపు, నూతన ఆర్థిక విధానాల ఆరంభం, మెట్ట ప్రాంతాల్లో కూడా హరిత విప్లవాన్ని ప్రవేశపెట్టడానికి గాను రూపొందించిన బోరుబావుల వ్యవసాయం, వర్షాధార ప్రాంతాలు వ్యవసాయ పంటలను, పద్ధతులను దెబ్బతీసిన రెండు రూపాయల కిలో బియ్యం పథకం, ప్రజాపంపిణీ వ్యవస్థ, నక్సలైట్ ఉద్యమం, కొత్త సామాజిక వర్గం ఇవన్నీ కూడా ఆ మలిదశ ఉద్యమానికి కారణాలుగా చెప్పవచ్చు.

### 14.5.1 తెలంగాణలో పెరుగుతున్న అసంతృప్తి

1956 నుంచి 1990 వరకు ప్రణాళికాబద్ధ అభివృద్ధి కాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనేక అభివృద్ధి పనులు జరిగాయి. పెద్ద పెద్ద ఆనకట్టలు కట్టారు. సాగునీరు, విద్యుత్ పథకాలను మొదలు పెట్టారు. పెద్ద పెద్ద గనులు, పారిశ్రామిక కేంద్రాలను ప్రారంభించారు. వ్యవసాయ ఉత్పత్తి పెంపొందించడానికి హరిత విప్లవాన్ని అమలు చేశారు. పెద్ద సంఖ్యలో విశ్వవిద్యాలయాలు, సాంకేతిక సంస్థలను స్థాపించారు. 1990 తరువాత రాష్ట్రంలో ప్రత్యేకంగా హైదరాబాదులో సమాచార సాంకేతిక పరిశ్రమ వెల్లి విరిసింది. అయితే తెలంగాణ ప్రజలు ఈ అభివృద్ధి చాలా అసమానంగా ఉందని, అసలు ప్రయోజనాలు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు మాత్రమే చేకూరుతున్నాయని భావించసాగారు.

వ్యవసాయ అభివృద్ధిలో కూడా ఆంధ్రా ప్రాంతానికి, తెలంగాణా ప్రాంతానికి మధ్య అసమానతలు ఎక్కువయ్యాయి. తెలంగాణ రైతుల ఆదాయంలో ఎటువంటి పెరుగుదల కనిపించకపోగా, రైతులు రైతు కూలీలుగా మారే పరిస్థితి వచ్చింది. విద్యా రంగంలో కూడా కోస్తాంధ్ర కంటే తెలంగాణ వెనుకబడి ఉంది. 2001 లో తెలంగాణలో అక్షరాస్యత 53 శాతం కాగా ఆంధ్రాలో 63 శాతం ఉంది. అదే సమయంలో తెలంగాణలోని పేదలు, సామాజికంగా వెనుకబడిన వర్గాలలో అక్షరాస్యత శాతం ఇంకా తక్కువగా ఉంది.

అసమాన అభివృద్ధే కాకుండా తెలంగాణ ప్రజలలో సాంస్కృతికంగా వివక్షతకు గురవుతున్నామని భావన కలిగింది. రెండు ప్రాంతాల కలయిక తర్వాత కోస్తా ఆంధ్ర సంస్కృతి ఆదర్శమైనదని ప్రచారం చేసి తెలంగాణ భాష, సంస్కృతులను వెనుకబడిన వాటిగా చూపసాగారు. పాఠశాల పాఠ్యపుస్తకాలలో తెలంగాణ చరిత్ర, సంస్కృతి నాయకులకు తగినంత ప్రాతినిధ్యం లభించలేదు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ఇలా జరుగుతోందని తెలంగాణ ప్రజలు భావించారు.

### 14.5.2 మలి దశ ఉద్యమం

ఈ సమయంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం సంక్షేమ పథకాలు తగ్గిస్తూ సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలను అమలు చేయడం ప్రారంభించింది. వ్యవసాయంపై ఆధారపడిన రైతులు, కూలీలు, వ్యవసాయ అనుబంధ వృత్తులైన చేతి వృత్తులు కులవృత్తుల వారికి ఉపాధి అవకాశాలు గణనీయంగా తగ్గిపోయాయి. ఉద్యోగ నియామకాలూ తగ్గిపోయాయి. ప్రైవేటీకరణ విస్తరించినప్పటికీ ఉద్యోగ భద్రత లేనందున నిరుద్యోగ సమస్య అలాగే ఉంది. ఈ కారణంగా వివిధ వర్గాల ప్రజలు, తెలంగాణ ప్రాంతం సమైక్య రాష్ట్రంలో వివిధ రంగాలలో ఎలా నష్టపోతున్నది వివరిస్తూ, ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని బలోపేతం చేయటానికి వివిధ రకాల వేదికలుగా ఏర్పడ్డారు. వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ సమస్యను పరిష్కరించవలసిందిగా సదస్సులు, సమావేశాలు, ధర్నాలు, రాస్తారోకోలు, నిరాహార దీక్ష శిబిరాలు వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పట్టభద్రులు వివిధ సంఘాలుగా ఏర్పడ్డారు. అన్ని సంఘాలను కలుపుతూ ఏర్పడిన 'తెలంగాణ ఐక్యవేదిక' పలు సేవా కార్యక్రమాలతో పాటుగా తెలంగాణ ఉద్యమాన్ని ఉధృతం చేసే వివిధ రకాలైన కార్యక్రమాలు నిర్వహించింది.

ఈ మలిదశ ఉద్యమంలో 2001 లో కల్వకుంట్ల చంద్రశేఖరరావు స్థాపించిన తెలంగాణ రాష్ట్ర సమితి పాత్ర కీలకమైనది. తెలంగాణ సాధన కోసమే పార్టీ ఏర్పడడంతో టిఆర్ఎస్‌ను ప్రజలు ఆదరించారు. అనేక ప్రజా సంఘాలు, కవులు, రచయితలు, పాత్రికేయులు, మేధావులు, విద్యావంతులు ప్రజల్లో కలిగించిన చైతన్యాన్ని తెలంగాణ ప్రజలలో గల అసంతృప్తిని ఉద్యమ రూపానికి మార్చడంలో ఈ పార్టీ సఫలీకృతమైంది. అన్ని రాజకీయ పార్టీలు ప్రజలను ఉద్యమంలో భాగస్వామ్యం చేయడంలో తమ వంతు పాత్ర పోషించాయి.

రాజకీయ పరిస్థితులు ఈ విధంగా ఉంటే ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో రాజకీయాలతో ప్రత్యక్ష సంబంధం లేని అనేక కుల సంఘాలు, ప్రజా సంఘాలు, ఎన్జీవోలు, కర్షకులు, విద్యార్థి ఉపాధ్యాయులు, పాత్రికేయులు, మేధావులు స్వచ్ఛందంగా పాల్గొనడం ప్రారంభించారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటికీ ప్రత్యేక రాష్ట్రమే పరిష్కారమని పెద్ద ఎత్తున ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారు.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాల మధ్య అభివృద్ధిలో గల తేడాలను వివరించండి.
2. తెలంగాణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు మాత్రమే పరిష్కారంగా ఉండిందా? దీనికి వేరే ప్రత్యామ్నాయాలేమిటి?

## 14.6 తీవ్రమైన ఉద్యమం

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో కేంద్ర ప్రభుత్వ దాటవేత ధోరణిని నిరసిస్తూ తక్షణమే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ప్రకటించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కె చంద్రశేఖర రావు 2009 నవంబర్ 29న సిద్దిపేటలో నిరాహారదీక్ష ప్రారంభించాలని సంకల్పించాడు. అయితే పోలీసులు కెసిఆర్‌ను అరెస్టు చేసి మొదట ఖమ్మం జైలులో తరువాత హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అయినా ఆస్పత్రిలోనే కెసిఆర్ నిరాహార దీక్ష కొనసాగించాడు. ఈ దీక్షకు మద్దతుగా తెలంగాణ సమాజం అంతా కదిలింది. తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాల్లో, విశ్వవిద్యాలయాల్లో, కార్యాలయాల్లో, విద్యార్థులు, ఉద్యోగులు, యువకులు ఐక్య కార్యాచరణ సమితి (ఐకాస)లుగా ఏర్పడ్డారు. రాస్తారోకోలు, రిలే నిరాహార దీక్షలు, ప్రదర్శనలతో గ్రామ స్థాయి నుంచి తెలంగాణ ప్రాంతమంతటా అన్ని వర్గాల ప్రజలు ఇందులో స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

### 14.6.1 ప్రత్యేక రాష్ట్ర ప్రకటన – ఉపసంహరణ

ఉద్యమం తీవ్రమవుతున్న దశలో ప్రత్యేక రాష్ట్ర ప్రకటన చేయకపోతే 2009 డిసెంబర్ 10న శాసన సభను ముట్టడిస్తామని విద్యార్థి ఐకాస చేసిన ప్రకటన కూడా చాలా కీలకమైనది. ఇటువంటి పరిస్థితుల్లో గ్రామ గ్రామాన ప్రజలలోకి ఉద్యమం విస్తరించడం, కెసిఆర్ నిరాహార దీక్ష కొనసాగుతూ ఉండటం. ప్రతిపాదిత ఆసెంబ్లీ ముట్టడి కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ఏర్పాటుపై నిర్ణయం తీసుకోక తప్పని పరిస్థితి ఏర్పడింది. అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి అన్ని పార్టీలు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు తమ సానుకూలత వ్యక్తం చేయటంతో 2009 డిసెంబర్ 9న కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తున్నామని ప్రకటించింది. దాంతో కె.చంద్రశేఖరరావు పదిరోజుల పాటు సాగిన తన నిరాహార దీక్షను విరమించాడు.

అయితే రాష్ట్ర విభజనకు సానుకూలత తెలిపిన ఆంధ్ర నాయకులు తమ నిర్ణయాన్ని మార్చుకుని కేంద్ర ప్రకటనకు నిరసనగా తమ పదవులకు రాజీనామా చేశారు. రాష్ట్ర విభజన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలంటూ కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చారు. ఆంధ్ర ప్రాంతంలో నిరసనోద్యమాలు మొదలయ్యాయి. దాంతో కేంద్ర ప్రభుత్వం 2009 డిసెంబర్ 23న రాష్ట్ర విభజనకు సంబంధించి మరిన్ని సంప్రదింపులు అవసరమని భావిస్తున్నట్లు రాష్ట్ర విభజన, ప్రకటనను ఉపసంహరించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ పరిణామాలను అధ్యయనం చేసి కేంద్రానికి నివేదిక అందించమని జస్టిస్ శ్రీకృష్ణ నేతృత్వంలో ఒక కమీషన్‌ను ఏర్పాటు చేశారు.

## 14.6.2 ఉద్యమంలో నిరసన రూపాలు

రాష్ట్ర ఏర్పాటుపై కేంద్రం వెనకడుగు వేయడంతో తెలంగాణ భగ్గుమంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ సమాజ మొత్తం ఏకమవాల్సిన అవసరాన్ని గుర్తించి, తెలంగాణ ప్రజల ఆకాంక్షను ప్రజా ఉద్యమంగా మార్చడం కోసం 2009, డిసెంబర్ 24న తెలంగాణ రాజకీయ జేఏసీ ఏర్పడింది. తెలంగాణ ప్రజల్లో ఉద్యమ చైతన్యం సజీవంగా ఉండే విధంగా ఆందోళనా కార్యక్రమాలను సహాయ నిరాకరణ, మిలియన్ మార్చ్, సకల జనుల సమ్మె, సాగర హారం, సంసద్ యాత్ర, ఛలో అసెంబ్లీ లాంటి ఎన్నో రూపాలలో బలమైన ఉద్యమం నడిపించింది. ధూమ్ ధామ్, రాస్తారోకోలు, నిరాహార దీక్షలు, వంటా–వార్పులు, మానవ హారాలు, బతుకమ్మలు, బోనాల ఊరేగింపులు, అమరుల అంతిమయాత్రలు, కొవ్వొత్తుల ర్యాలీలు, దిష్టిబొమ్మల దహనాలు, పాదయాత్రలు, విద్యార్థులు చేపట్టిన ఛలో అసెంబ్లీ, న్యాయవాదుల ఛలో రాజ్‌భవన్, ఉద్యోగుల పెన్ డౌన్, టీ జేఏసీ చేపట్టిన పల్లె పల్లె పట్టాల పైకి ఇలా వివిధ ఉద్యమ రూపాలలో నిరసనలు చేపట్టారు. నలభై రెండు రోజుల పాటు సాగిన సకల జనుల సమ్మెలో తెలంగాణ ప్రజానీకం మొత్తం పాల్గొనడం ప్రజల ఆకాంక్షను తెలిపింది.

వివిధ కులాలకు చెందిన ప్రజలు ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. సబ్బండ వర్ణాల వాళ్లు తమ తమ ఐకాసలను ఏర్పాటు చేసుకుని ఈ నిరసన ఉద్యమంలో భాగస్వాములయ్యారు. ఆదివాసీలు, దళిత సంఘాలు, వివిధ కుల సంఘాలు తుడుం, దెబ్బ, లంబాడ నగారా భేరి, ఎరుకల కుర్రు, మాదిగ దండోరా, గొల్ల కురుమల డోలు దెబ్బ, మోకు దెబ్బ వంటి నిరసన కార్యక్రమాల ద్వారా ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వివిధ సంస్థల ఆధ్వర్యంలో ప్రదర్శనలు నిర్వహించాయి.


## 14.6.3 తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం

తెలంగాణ ఉద్యమ తీవ్రతను, ప్రజల ఆకాంక్షను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం నిర్వహించి రాష్ట్రానికి చెందిన ప్రధాన రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించి వారి అభిప్రాయం తెలుసుకొన్నారు. వారి అభిప్రాయాలపై కాంగ్రెస్ కోర్ కమిటీ చర్చించి, అభిప్రాయాలను తెలుసుకొని తెలంగాణ రాష్ట్ర విభజనకు అనుకూలంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయాన్ని అడ్డుకునేందుకు సీమాంధ్ర నాయకులు చివరి వరకు అనేక రకాలుగా విఫలయత్నం చేశారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విభజిస్తూ హైదరాబాద్ రాజధానిగా పది జిల్లాల తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు, 2014 ఫిబ్రవరి 18న లోక్ సభలో 2014 ఫిబ్రవరి 20న రాజ్యసభలో బిల్లు ఆమోదం పొంది 2014 మార్చి 1న రాష్ట్రపతి ఆమోద ముద్రతో 2014 జూన్ 2 'అపాయింట్మెంట్ డే'గా ప్రకటిస్తూ చట్టం రూపొందించారు.

పార్లమెంట్‌లో యూపీఏ ప్రభుత్వంతో పాటు బిజెపి, బిఎస్‌పి, సిపిఐ పార్టీలు మద్దతునిచ్చాయి. ప్రస్తుతం ఆ 10 జిల్లాలను విభజించి 33 జిల్లాలుగా పునర్వ్యవస్థీకరించారు.

తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా, ఉద్యమకారుల అలుపెరగని పోరాటం వల్ల అన్ని వర్గాలను ఏకం చేసుకుని దేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది.




*పటం–14.2: జూన్ 2, 2014న సాకారమైన తెలంగాణ*

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి అనుకూలంగా ప్రకటన ఇచ్చి, తిరిగి ఉపసంహరించుకోవడంపై మీ అభిప్రాయాన్ని తెలపండి.
2. తెలంగాణా ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి మద్దతుగా సబ్బండ వర్ణాల వాళ్ళు ఎందుకు ఉద్యమం చేయవలసి వచ్చిందో తెలపండి.

## 14.7 ముగింపు

- నిజాం పాలిస్తున్న హైదరాబాద్ సంస్థానం, పోలీస్ చర్య ద్వారా 1948 సెప్టెంబర్ 17న భారతదేశంలో విలీనం అయ్యింది.
- 1956 లో ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు విషయంలో ఆంధ్రా, తెలంగాణ ప్రాంతాల పెద్ద మనుషుల ఒప్పందం జరిగింది.
- పెద్ద మనుషుల ఒప్పందం ఉల్లంఘనల వల్ల ఉద్యోగావకాశాలు కోల్పోయిన ఉస్మానియా విద్యార్థులు 1969లో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం మొదలుపెట్టారు.
- మధ్య తరగతి మేధావులు, లాయర్లు, జర్నలిస్టులు, వాణిజ్య వర్గాలు కలిసి 1971లో తెలంగాణ ప్రజా సమితి అనే రాజకీయ పార్టీని ఏర్పాటు చేశారు.
- 1973 లో కేంద్ర్య ప్రభుత్వ ఉపాధిలో స్థానిక ప్రజలకు ప్రాధాన్యత ఇస్తామని అన్ని ప్రాంతాల ప్రజలకు విశ్వాసం కల్పిస్తూ ఆరు సూత్రాల విధానాన్ని రూపొందించారు.
- 1990 లో ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజలు ఐక్యకార్యాచరణ సమితిలుగా ఏర్పడి ఉద్యమాన్ని బలోపేతం చేశారు.
- తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షుడు కె. చంద్రశేఖర్ రావు నిరాహార దీక్ష ఫలితంగా ఉద్యమం తీవ్రమైంది. తెలంగాణ సమాజం అంతా స్వచ్ఛందంగా ఉద్యమంలో పాల్గొన్నారు.
- 2009 డిసెంబర్ 9న కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ప్రకటన చేసి, ఆంధ్ర నాయకుల ఒత్తిళ్ళకు తలొగ్గి డిసెంబర్ 23న ఉపసంహరించుకుంది.

- చివరికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక తెలంగాణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదింపజేసింది. దాంతో 2014 జూన్ 2న భారతదేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది.

## 14.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 1-2 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. తెలంగాణ రాష్ట్ర ప్రకటన ఉపసంహరణకు ప్రధాన కారణమేమిటి?
2. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం ఎప్పుడు జరుపుకుంటాము?

**II. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 4-5 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. 1969 తెలంగాణ ఉద్యమం గురించి తెలియజేయండి.
2. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో ప్రదర్శించిన వివిధ నిరసన రూపాలను తెలపండి.

**III. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 8-10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. పెద్ద మనుషుల ఒప్పందంలోని ప్రధానాంశాలు వివరించండి.
2. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కొరకు చేపట్టిన వివిధ వినూత్న నిరసన కార్యక్రమాలపై మీ అభిప్రాయం తెలపండి.

**IV. కింది వాటిలో సరైన జవాబును ఎంపిక చేయండి.**

1. మొదటగా ముల్కీ నియమాల ప్రకారం స్థానికత నిర్ధారణకు తెలంగాణ ప్రాంతంలో ఎన్ని సంవత్సరాల నివాసం ఉండాలి? (     )

   ఎ) 14 సంవత్సరాలు   బి) 12 సంవత్సరాలు   సి) 15 సంవత్సరాలు   డి) 7 సంవత్సరాలు

2. పెద్ద మనుషుల ఒప్పందం ప్రకారం ఈ క్రింది వాటిలో ఏది తప్పైన వాక్యం (     )

   ఎ) ప్రాంతీయ మండలి ఏర్పాటు   బి) స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యత

   సి) ముల్కీ నియమాలు కొనసాగించటం

   డి) తెలంగాణ రెవెన్యూ మిగులును రాష్ట్రం మొత్తానికి ఖర్చు చేయటం

3. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తేది? (     )

   ఎ) 09 డిసెంబర్ 2009   బి) 23 డిసెంబర్, 2009

   సి) 20 ఫిబ్రవరి 2004   డి) 02 జూన్ 2004

## 14.9 ఉపయుక్త గ్రంథాలు

1. తెలంగాణ చరిత్ర - సుంకిరెడ్డి నారాయణరెడ్డి
2. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాలు - మారం రాజు సత్యనారాయణరావు

# 15 తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం - సామాజిక, ఆర్థికాభివృద్ధి

## 15.0 అభ్యసన ఫలితాలు

- తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన నాటి స్థితిగతులను తెలుసుకోగలరు.
- రాష్ట్ర భౌగోళిక స్వరూపాన్ని, శీతోష్ణ స్థితిని, అడవుల విస్తీర్ణాన్ని అవగాహన చేసుకోగలరు.
- రాష్ట్ర జనాభా లక్షణాలను వివరించగలరు.
- తెలంగాణలో వ్యవసాయ రంగపు ప్రస్తుత పరిస్థితిని, దాని అభివృద్ధి పట్ల ప్రభుత్వ చర్యలను విశ్లేషించగలరు.
- నూతన పారిశ్రామిక విధానాన్ని విపులీకరించగలరు.
- రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో సేవల రంగం పాత్రను అంచనా వేయగలరు.
- ప్రజా సంక్షేమం, సామాజిక అభివృద్ధి కొరకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన వివిధ పథకాలను వివరించగలరు.

## 15.1 పరిచయం

తెలంగాణ రాష్ట్రం 2 జూన్ 2014 నాడు భారత రిపబ్లిక్‌లో 29వ రాష్ట్రంగా ఆవిర్భవించడం ఒక చరిత్రకు ముగింపు, మరో కొత్త శకానికి శ్రీకారం. ఉమ్మడి రాష్ట్ర పాలనలో పాలకుల పక్షపాతానికి గురైన తెలంగాణ ప్రజల మేధాసంపత్తికి ఒక గుర్తింపును తీసుకురావడం, కొత్త పథకాలు, విధానాలు, కార్యక్రమాల రూపకల్పనకు శ్రీకారంగా తెలంగాణ ఏర్పాటును గుర్తించవచ్చు. 'పురోగతి-అందరికీ న్యాయం' అనే సూత్రానికి కట్టుబడి తెలంగాణ ప్రభుత్వం అనేక కార్యక్రమాల అమలుకు నడుం బిగించింది.

ప్రజా ఆరోగ్య వ్యవస్థలను పునరుద్ధరించడానికి, వాటి మీద సామాన్య పౌరుడు ఆధారపడగలిగేలా అతడి స్థోమతకు అవి అందుబాటులో ఉండేలా చేయడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది. ప్రజలను విద్యావంతులుగా చేయడానికి, వారి ఆరోగ్య, యోగక్షేమాలను అభివృద్ధి చేయడానికి విద్య, వైద్యం అనే రెండు ముఖ్య రంగాలలో తగినన్ని పెట్టుబడులు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

తెలంగాణలో రైతు కుటుంబాలలో నిస్పృహను రూపుమాపి రైతుల ఆత్మహత్యలు లేకుండా చూడడానికి, సేద్యపు నీటి వనరులను పునరుద్ధరించి వ్యవసాయానికి అవసరమైన నీటిని అందించడానికి, తద్వారా రైతుల పంటలకు జీవం పోయడానికి, నకిలీ విత్తనాల, పురుగు మందుల బెడదను రూపుమాపడానికి, విత్తన భాండాగారాలు, సబ్సిడీ విత్తనాలు రైతులకు అందించడం మొదలైన అనేక కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టింది.


ఇవేకాకుండా నూతన పారిశ్రామిక విధానం, మౌలిక సదుపాయాల రూపకల్పన, సంక్షేమం కోసం రూపొందించబడిన కార్యక్రమాలు, జరిగిన అభివృద్ధిని మనం వివరంగా ఈ అధ్యాయంలో తెలుసుకుందాం.

## 15.2 తెలంగాణ రాష్ట్ర ముఖ చిత్రం

### 15.2.1 తెలంగాణ భౌగోళిక స్వరూపం

తెలంగాణ రాష్ట్రం ఉనికి గురించి 'అధ్యాయం-2:భారతదేశ ఉనికి - భౌగోళిక స్వరూపాలు'లో చదివియున్నారు.

2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణ విస్తీర్ణం 1,14,840 చ.కి.మీ. కాని, పోలవరం నీటి పారుదల ప్రాజెక్టు దృష్ట్యా రాష్ట్ర విభజన అనంతరం కేంద్ర ప్రభుత్వం పూర్వ ఖమ్మం జిల్లాలోని 7 మండలాలను ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించడం వలన 2011 జన గణన (సెన్సస్) ప్రకారం తెలంగాణ రాష్ట్ర వైశాల్యం 1,12,077 చ.కి.మీ.కు తగ్గింది. జనాభా పరంగా, వైశాల్య పరంగా కూడా తెలంగాణ భారతదేశంలో పన్నెండవ పెద్ద రాష్ట్రం. 2019 చివరి నాటికి తెలంగాణలో 33 జిల్లాలు, 74 రెవెన్యూ డివిజన్లు, దాదాపు 590 మండలాలు ఉన్నాయి. తెలంగాణ రాజధాని అయిన హైదరాబాదు దేశంలో 5వ పెద్ద నగరం.




తెలంగాణ ప్రాంతం చాలా వరకు అనార్ద్రతతో కూడిన దక్కన్ పీఠభూమి ప్రాంతం. తెలంగాణలో వ్యాపించి ఉన్న దక్కన్ పీఠభూమి చాలా భాగం సముద్ర మట్టం నుండి 500-600 మీటర్ల మధ్యన ఉంది, హైదరాబాద్ నగరం 550 మీటర్ల ఎత్తులో ఉంది. తెలంగాణలో గోదావరి, కృష్ణా, మంజీరా, భీమా, ప్రాణహిత, మూసీ నదులు ఉన్నాయి.

### 15.2.2 తెలంగాణ శీతోష్ణ స్థితి, వర్షపాతం, అడవులు

తెలంగాణ రాష్ట్రం కర్కట రేఖ, భూమధ్య రేఖల మధ్య విస్తరించి ఉండడం వలన ఇది ఉష్ణ మండల ప్రాంతంలో ఉన్నదని చెప్పవచ్చు. రాష్ట్ర సగటు అత్యధిక ఉష్ణోగ్రత 44 డిగ్రీల సెంటీగ్రేడ్ కాగా అతి తక్కువ సగటు ఉష్ణోగ్రత 15 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు ఉంటుంది. తెలంగాణ రాష్ట్రం పీఠభూమి ప్రాంతంలో ఉండి, సముద్ర ప్రభావం లేనందువలన సగటు గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలలో తేడాలు ఎక్కువగా ఉంటాయి. ఇలాంటి శీతోష్ణ స్థితినే 'ఖండాంతర్గత శీతోష్ణ స్థితి' అంటారు.

సాధారణంగా తెలంగాణలోని వర్షపాతంలో వైషమ్యం, అనిశ్చితత్వం చాలా ఎక్కువ. ఈ అస్థిరమైన వర్షపాత ప్రభావం వ్యవసాయ సాగును నిర్దేశిస్తుంది. తెలంగాణలో అత్యధిక వర్షపాతం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనూ, అత్యల్ప వర్షపాతం ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో కురుస్తుంది. అందుకే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎక్కువ అడవులు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో తక్కువ అడవులు ఉంటాయి.

తెలంగాణ రాష్ట్రంలో అడవులు మొత్తం రాష్ట్ర విస్తీర్ణంలో 25.46% భూభాగాన్ని ఆక్రమించి ఉన్నవి. భారతదేశ అడవుల విస్తీర్ణంలో తెలంగాణ రాష్ట్రం 12వ స్థానాన్ని ఆక్రమించింది. ఉమ్మడి ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలలో విస్తారమైన అటవీ ప్రాంతం ఉంది. అటవీ విస్తీర్ణాన్ని మరింత పెంచడానికి తెలంగాణ ప్రభుత్వం 'హరిత హారం' అనే పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తున్నది.

**మీ ప్రగతిని పరీక్షించుకోండి**

1. తెలంగాణ ప్రాంత భౌగోళిక లక్షణాలను వివరించండి.
2. తెలంగాణ ప్రాంతం ఏ పీఠభూమిలో ఒక భాగం?
3. తెలంగాణ ప్రాంతంలో ఏ రకమైన శీతోష్ణ స్థితి ఉంది?

**గమనించండి/ కనుక్కోండి**

మీ జిల్లా గుండా ఏవైనా నదులు ప్రవహిస్తున్నాయా?

## 15.3 తెలంగాణలో జనాభా లక్షణాలు (Demographic Characteristics)

ఏదేని ఒక రంగం అభివృద్ధి చెందాలంటే మానవ వనరులు చాలా ముఖ్యమైనవి. జనాభా అధికంగా ఉన్న ప్రాంతాలలో మానవ వనరుల లభ్యత ఎక్కువగా ఉండి, తక్కువ ధరకు శ్రామికులు, వేతన జీవులు లభ్యమవడం వలన అనేక సంస్థలు అలాంటి ప్రాంతాలలో తమ పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపిస్తాయి. ఇప్పుడు మన తెలంగాణ జనాభా గురించి తెలుసుకుందాం.

2011 జనాభా లెక్కల ప్రకారం తెలంగాణ జనాభా 3.52 కోట్లు. రాష్ట్ర విభజన తర్వాత పూర్వ ఖమ్మం జిల్లాలోని 7 మండలాలను కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బదిలీ చేసిన తర్వాత తెలంగాణ రాష్ట్ర జనాభా సుమారుగా 3.10 కోట్లుగా ఉండింది. తెలంగాణ జనాభాలో దాదాపు 85% హిందువులు, 12.6% ముస్లింలు, 1.3% క్రిష్టియన్లు, 1% సిక్కులు, జైనులు, బుద్ధిస్టులు ఉన్నారు. రాష్ట్ర జనాభాలో 77% తెలుగు మాట్లాడేవారు, 12.6% ఉర్దూ మాట్లాడేవారు, మిగిలిన జనాభాలో ఇతర భాషలు మాట్లాడేవారు ఉన్నారు.

సాంఘిక ఆర్థిక దృక్పథం (Socio Economic Outlook)-2020, ప్రణాళికా విభాగం, తెలంగాణ ప్రభుత్వ నివేదిక ప్రకారం 39.4 లక్షల జనాభాతో హైదరాబాద్ జిల్లా అగ్ర స్థానంలో ఉండగా, 2.94 లక్షల జనాభాతో ములుగు జిల్లా చివరి స్థానంలో ఉంది. ఈ నివేదిక ప్రకారం దాదాపు 61% జనాభా గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తూ ఉండగా 39% పట్టణ ప్రాంతాలలో నివసిస్తూ ఉన్నారు. దేశంలోని ఇతర ప్రాంతాల వారు, రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల వారు పట్టణ ప్రాంతాలకు తరలి (వలస) రావడం వలన పట్టణ జనాభా పెద్ద ఎత్తున పెరుగుతున్నది. రాష్ట్రంలోని పట్టణ జనాభాలో దాదాపు 29% జనాభా రాష్ట్రంలోని అతి పెద్ద పట్టణమైన హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. ఆర్థికాభివృద్ధి రాష్ట్రం నలుమూలలా వికేంద్రీకరణ జరగకపోవడమే ఇందుకు గల ప్రధాన కారణమని చెప్పవచ్చు.

### 15.3.1 జన సాంద్రత (Density of Population)

ఏదేని చదరపు కిలో మీటర్ పరిధిలో నివసిస్తున్న ప్రజల సంఖ్యను 'జన సాంద్రత' అంటారు. తెలంగాణ రాష్ట్ర జన సాంద్రత 312 కాగా, అత్యధిక జన సాంద్రత హైదరాబాద్ జిల్లా (18,172) లో, అత్యల్ప జన సాంద్రత ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో (ప్రతి చదరపు కిలో మీటర్‌కు 170 మంది) కలదు. అయితే అధిక జన సాంద్రత గల ప్రాంతాలు ప్రయోజనాలను, లోపాలను కలిగి ఉంటాయి. అధిక జన సాంద్రత గల ప్రాంతాలు పరిశ్రమల స్థాపనను, సేవల రంగపు స్థాపనను, విద్య, వైద్యం, బ్యాంకింగ్ రంగాన్ని ఆకర్షించి వర్తక వాణిజ్యాలు అధికంగా పెరగడానికి తోడ్పడుతాయి. అయితే అధిక జన సాంద్రత వలన గృహ వసతి, పారిశుధ్యం, త్రాగు నీటి సరఫరా కొరత, మురికి వాడల వృద్ధి, అధిక కాలుష్యం, సేద్యపు భూముల తగ్గుదల వంటి ప్రధాన సమస్యలు ఎదురవుతాయి.

### 15.3.2 లింగ నిష్పత్తి (Sex Ratio)

జనాభాలో ప్రతి వెయ్యి మంది పురుషులకు ఎంత మంది స్త్రీలు ఉన్నారో తెలియజేసేది లింగ నిష్పత్తి. 2011 సెన్సస్ ప్రకారం, భారతదేశంలో లింగ నిష్పత్తి 943. కాగా 'సామాజిక ఆర్థిక దృక్పథం-2020', రాష్ట్ర ప్రభుత్వ నివేదికను అనుసరించి, తెలంగాణలో లింగ నిష్పత్తి 988. రాష్ట్రంలోని 33 జిల్లాలలోని 13 జిల్లాలలో లింగ నిష్పత్తి వెయ్యికి పైన ఉండగా, ఇతర 20 జిల్లాలలో వెయ్యికి తక్కువగా ఉంది. అత్యధిక లింగ నిష్పత్తి నిర్మల్ జిల్లాలో (1,046) ఉండగా, అత్యల్ప లింగ నిష్పత్తి రంగారెడ్డి జిల్లాలో (950) ఉంది. లింగ నిష్పత్తి తగ్గిపోవడానికి ప్రధాన కారణం లింగ వివక్షతను పాటించడం అని చెప్పవచ్చు. మహిళా అక్షరాస్యతను, గ్రామీణ ప్రాంతాలలో విద్యావకాశాలను పెంచడం ద్వారా మహిళల పట్ల వివక్షను తగ్గించవచ్చు.

### 15.3.3 జనాభాలో సామాజిక కూర్పు

తెలంగాణ రాష్ట్ర జనాభాలో షెడ్యూల్డ్ కులాలు (ఎస్.సి.), షెడ్యూల్డ్ తెగలు (ఎస్.టి.), అల్పసంఖ్యాక వర్గాలు, ఇతర వెనుకబడిన తరగతులతో (ఓ.బి.సి.) కలిపి దాదాపు 80% మంది వెనుకబడిన తరగతులకు చెందిన వారే. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభాలో షెడ్యూల్డ్ కులాల జనాభా 15.45% కాగా షెడ్యూల్డ్ తెగల జనాభా 9.08%. అత్యధిక షెడ్యూల్డ్ కులాల జనాభా నల్లగొండ జిల్లాలో ఉండగా, అత్యల్పంగా కుమరంభీం జిల్లాలో ఉంది. కాగా షెడ్యూల్డ్ తెగలకు సంబంధించి అత్యధిక జనాభా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉండగా, అత్యల్పంగా జోగులాంబ గద్వాల జిల్లాలో ఉంది.

### 15.3.4 అక్షరాస్యత (Literacy)

ఏడు సంవత్సరాలు అంతకు మించి వయస్సు గల వారిలో ఉన్న అక్షరాస్యతను 'అక్షరాస్యతా శాతం' తెలియజేస్తుంది. భారతదేశ అక్షరాస్యతా శాతం 74.04% కాగా, తెలంగాణలో ఈ అక్షరాస్యతా శాతం 66.54% గా ఉంది. అంటే తెలంగాణ అక్షరాస్యతా శాతం జాతీయ అక్షరాస్యతా శాతం కన్నా తక్కువగా ఉంది. ఇంకో విషయం ఏమిటంటే అల్పాదాయ రాష్ట్రాలైన ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌ల కన్నా తెలంగాణలో అక్షరాస్యతా శాతం తక్కువగా ఉండడం ఆందోళన కలిగించే అంశం. అక్షరాస్యతా స్థాయిలో పురుషులకు, స్త్రీలకు మధ్య కూడా తీవ్ర వ్యత్యాసం ఉంది. తెలంగాణలో పురుషుల అక్షరాస్యతా శాతం 74.95% కాగా, మహిళల అక్షరాస్యతా

శాతం చాలా తక్కువగా 57.92% మాత్రమే. ఎస్.సి., ఎస్.టి. ల అక్షరాస్యతా స్థాయిలు వరుసగా 58.90%, 49.51% మాత్రమే. మొత్తంగా చెప్పుకోవాలంటే తెలంగాణలో మహిళలు, ఎస్.సి., ఎస్.టి.ల అక్షరాస్యతా స్థాయిలు పెంచవలసిన అవసరం ఎంతైనా ఉంది. అందుకుగాను ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధాన్యతను ఇవ్వాల్సి ఉంది.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. ఏదేని ఒక ప్రాంతంలో జన సాంద్రత ఎక్కువగా ఉండడానికి గల కారణాలేవి?
2. మన దేశంలో అక్షరాస్యతా స్థాయి ధోరణులను తెలపండి.
3. లింగ వివక్షతను ఏవిధంగా తగ్గించవచ్చు?

## 15.4 తెలంగాణ రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (GSDP), తలసరి ఆదాయం (PCI)

### 15.4.1 తెలంగాణ రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (Gross State Domestic Product)


ఒక రాష్ట్రంలో ఒక సంవత్సర కాలంలో ఉత్పత్తి అయిన మొత్తం వస్తువులు, సేవల విలువల మొత్తాన్ని ఆ రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి అని చెప్పవచ్చు. రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి లేదా రాష్ట్ర ఆదాయం అనేది రాష్ట్ర ఆర్థిక వృద్ధిని కొలవడానికి ఒక ముఖ్య సూచిక. ఆర్థిక గణాంక శాఖ సంచాలకులు రాష్ట్రంలో ఉత్పత్తి, ఆదాయ మదింపు పద్ధతుల ద్వారా రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తిని అంచనా వేస్తారు.

స్థూలంగా రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తిని రెండు మార్గాల ద్వారా విశ్లేషించవచ్చు. అవి:

1. దశాబ్దాల కాలంగా ప్రస్తుత ధరలలో స్థూల ఆదాయ స్థాయిల అధారంగా వృద్ధిని పరిశీలించడం.
2. రాష్ట్ర స్థూల ప్రాంతీయాదాయంలో మూడు రంగాల వాటా అంటే ప్రాథమిక, ద్వితీయ, తృతీయ రంగాల సాపేక్ష మార్పులను అధ్యయనం చేసి వివిధ రంగాల ప్రాధాన్యతలను విశ్లేషణ చేయవచ్చు.

2019-20 లో తెలంగాణకు ప్రస్తుత ధరల వద్ద స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి (జిఎస్‌డిపి) రూ.9.70 లక్షల కోట్లుగా అంచనా వేయబడింది (డైరెక్టరేట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ వారి అడ్వాన్స్‌డ్ ఎస్టిమేట్స్ ప్రకారం). ఇది 12.6% వృద్ధి రేటును సూచిస్తుంది. వాస్తవానికి, తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి ప్రతి సంవత్సరం భారతదేశపు వృద్ధి రేటును అధిగమించింది.

దేశంలో చివరిగా ఏర్పడిన రాష్ట్రం అయినప్పటికీ, తెలంగాణ వేగంగా వృద్ధిని సాధించింది. వ్యవసాయం వంటి రంగాలలో ప్రభుత్వం చేపట్టిన అనేక కార్యక్రమాలకు ఇది కారణమని చెప్పవచ్చు. పశుసంవర్ధక, విద్యుత్, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు మరియు పట్టణీకరణ తెలంగాణ ఆర్థికాభివృద్ధికి దోహదపడ్డాయి. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని తెలుసుకోవాలంటే దానిని దేశ సగటు లేదా మిగిలిన రాష్ట్రాల రాష్ట్రీయ ఆదాయంతో పోల్చాలి. ఇలా పోల్చినప్పుడు జాతీయ సగటును కూడా దాటి తెలంగాణ శరవేగంగా అభివృద్ధి దిశగా పయనిస్తుందని మనకు అర్థం అవుతుంది. తెలంగాణ రాష్ట్రీయ ఆదాయం వృద్ధి రేటు తెలంగాణ రాష్ట్రం ఏర్పడడానికి ముందు 2013-14 లో 4.02% వృద్ధి రేటు ఉండగా 2019-20 లో (ప్రస్తుత ధరలలో) 4.76% కు పెరిగింది. గ్రాఫ్-15.1 ద్వారా ఇది తేటతెల్లమవుతుంది.




*గ్రాఫ్-15.1: భారతదేశ జిడిపి వాటాలో, తెలంగాణ జిఎస్‌డిపి వాటాలో పోకడలు*

## 15.4.2 తలసరి ఆదాయం (Per Capita Income - PCI)

ఒక రాష్ట్ర అభివృద్ధిని పోల్చడానికి ఆ రాష్ట్ర స్థూల ఆదాయం అంతగా ఉపయోగపడదు. వివిధ రాష్ట్రాల జనాభాలో తేడా ఉంటుంది, కాబట్టి మొత్తం ఆదాయాలను పోలిస్తే సగటు వ్యక్తి ఆదాయం ఎంత ఉంటుందో తెలియదు. ఒక రాష్ట్రంలోని లేదా దేశంలోని ప్రజలు మరో రాష్ట్రంలోని ప్రజలతో లేదా మరో దేశంలోని ప్రజలతో పోల్చినప్పుడు మెరుగ్గా ఉన్నారా లేదా అన్న విషయం తెలుసుకోవడానికి మనకు సగటు ఆదాయం ఉపయోగపడుతుంది. రాష్ట్రం మొత్తం ఆదాయాన్ని ఆ రాష్ట్ర మొత్తం జనాభాతో భాగిస్తే సగటు ఆదాయం వస్తుంది. ఈ సగటు ఆదాయాన్ని 'తలసరి ఆదాయం' అని కూడా అంటారు.

ఏ రాష్ట్ర అభివృద్ధి స్థాయి గురించి అయినా మెరుగైన అవగాహన కల్పించేది తలసరి ఆదాయమే. ప్రజల జీవన ప్రమాణానికి ఇది ఒక పరోక్ష సూచిక. రాష్ట్ర ప్రభుత్వ నివేదిక ప్రకారం తెలంగాణలో తలసరి ఆదాయం 2019-20లో రూ. 2.28 లక్షలు (ముందస్తు అంచనాలు), ఇదే కాలంలో జాతీయ తలసరి ఆదాయం రూ. 1.34 లక్షలు. దేశ తలసరి ఆదాయం కంటే రాష్ట్ర తలసరి ఆదాయం వేగంగా పెరుగుతోంది.

రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (GSDP) మాదిరిగానే జిల్లాల (స్థూల దేశీయ) ఉత్పత్తిని ఆర్థిక విలువల మొత్తంగా నిర్వచించవచ్చు. ఒక జిల్లా యొక్క భౌగోళిక సరిహద్దులలో ఉత్పత్తి చేయబడిన అన్ని తుది వస్తువులు మరియు సేవలు ఒక నిర్దిష్ట వ్యవధిలో, సాధారణంగా సంవత్సరానికి, నకిలీ లేకుండా లెక్కించబడతాయి. ప్రాంతీయ అసమతుల్యతలను అంచనా వేసి దిద్దుబాటు చర్య చేపట్టడం కోసం ఈ అంచనాలు దోహదపడతాయి.

'సామాజిక ఆర్థిక దృక్పథం-2020'లో ఇవ్వబడిన వివరాల ప్రకారం, 2018-19లో రంగారెడ్డి జిల్లా యొక్క స్థూల జిల్లా దేశీయోత్పత్తి (జిడిడిపి) అత్యధికంగా (రూ. 1.73 లక్షల కోట్లు) ఉండగా, ములుగు జిల్లాలో అత్యల్పంగా (రూ. 5.9 వేల కోట్లు) ఉంది. ఇక తలసరి ఆదాయాన్ని తీసుకుంటే 2018-19 సంవత్సరంలో రంగారెడ్డి జిల్లాలో అత్యధిక తలసరి ఆదాయం రూ. 3.57 లక్షలు ఉండగా, నారాయణపేట జిల్లాలో అత్యల్పంగా (రూ. 98,220) ఉంది.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. తెలంగాణ రాష్ట్ర స్థూల దేశీయాదాయం భారతదేశం యొక్క జాతీయాదాయానికన్నా ఎక్కువ వృద్ధి చెందడానికి గల కారణాలు ఏమై వుంటాయని నీవు భావిస్తున్నావు?
2. తెలంగాణలోని ఏ జిల్లాలో తలసరి ఆదాయం అత్యల్పంగా ఉంది?

**కనుక్కోండి**

'సామాజిక ఆర్థిక దృక్పథం-2020', తెలంగాణ ప్రభుత్వం ప్రకారం మీ జిల్లా తలసరి ఆదాయం 2018-19లో ఎంత ఉంది?

## 15.5 తెలంగాణలో వ్యవసాయ రంగం

### 15.5.1 తెలంగాణలో వ్యవసాయం సవాళ్ళు

తెలంగాణలో వ్యవసాయ రంగం ప్రధానంగా వర్షాధారమైనది. నానాటికీ తరిగిపోతున్న భూగర్భ జలాల మీద అది గణనీయంగా ఆధారపడింది. రాష్ట్ర జనాభాలో దాదాపు 55.49% మంది తమ జీవనోపాధి కోసం ఏదో విధంగా వ్యవసాయ కార్యకలాపాల మీదనే ఆధారపడి ఉన్నారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి కూడా ఎక్కువ భాగం వ్యవసాయంపై ఆధారపడిందే. పెరిగే జనాభాకు ఆహారాన్ని ఇవ్వడం, పరిశ్రమలకు ముడి సరుకులను సప్లయ్ (సరఫరా) చేయడం, విదేశాలకు వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల ద్వారా విదేశీ మారక ద్రవ్య ఆర్జన మరియు గొలుసు కట్టు చెరువులు, కాలువలు, వివిధ రకాల నీటి వసతులు లభించే ప్రాంతం కావడం వలన తెలంగాణ రాష్ట్రం ప్రధానంగా వ్యవసాయ ఆధారిత రాష్ట్రంగా ఉన్నది.

అడవులు అంతరించడం వలన భూకోత ఎక్కువవడం, తద్వారా చెరువులు, నీటి పారుదల ప్రాజెక్టులు పూడికకు గురికావడం, భూమిలో నీరు ఇంకే సామర్థ్యం తగ్గిపోవడంతో భూగర్భ జలాలు గణనీయంగా పడిపోతున్నాయి. దీనితో రైతులు అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారు.

అధిక దిగుబడులను ఇచ్చే వంగడాల ధరలు, పురుగు మందుల ధరలు, వ్యవసాయ కూలీల వేతనాలు, పనిముట్ల ధరలు కూడా విపరీతంగా పెరగడం రైతుల మీద ప్రభావం చూపుతున్నది. ఆర్థికంగా అన్ని విధాలా నిలదొక్కుకోగలిగిన రీతిలో వ్యవసాయ రంగంలో వృద్ధిని సాధించడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కీలకమైన ఎజెండా.

తెలంగాణలో సాగు భూమిపై కీలకమైన ఉత్పత్తి పోకడలు క్రింది విధంగా ఉన్నాయి:

1. ఆహార ధాన్యాల సాగు 61% భూమిలో జరుగుతున్నది. అయితే ఈ శాతం నెమ్మదిగా క్షీణిస్తున్నది.
2. వరి, మొక్కజొన్న, ప్రత్తి ఈ మూడూ మన రాష్ట్రంలో 2018-19లో ఎక్కువగా పండించిన పంటలు.
3. స్థూల విలువలో పంటల స్థానం క్రమంగా తగ్గుతూ పంటేతర ఆదాయాల వాటా క్రమంగా పెరుగుతుంది.

పంటల వైవిధ్యీకరణ యొక్క ప్రాముఖ్యతను గమనిస్తూ తెలంగాణ రాష్ట్రం ఉద్యాన వన కేంద్రీకృత ప్రాంతంగా గుర్తించబడింది. 2018-19 లో 71.52 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి చేయడానికి 12.40 లక్షల ఎకరాల విస్తీర్ణం ఉద్యాన వన పంటల క్రింద సాగు చేయబడింది. ఉద్యాన వన పంటలలో కీలకమైన ఉత్పత్తి పోకడలు ఈ విధంగా ఉన్నాయి:

1. 25.69 మెట్రిక్ టన్నుల పండ్ల ఉత్పత్తిని సాధించడానికి 4.42 లక్షల ఎకరాలలో పండ్ల తోటలు పెంచబడ్డాయి.
2. పండ్ల తోటల సాగు విస్తీర్ణంలో రాష్ట్రం దేశంలో 3వ స్థానంలో ఉండగా, పండ్ల దిగుబడి పరంగా 8వ స్థానంలో ఉంది. పసుపు సాగులో దేశంలోనే తెలంగాణ ప్రథమ స్థానంలో ఉంది.

ఉద్యాన వన పంటల ప్రాధాన్యతను గుర్తించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక రాయితీ పథకాలను ప్రవేశపెట్టింది. వ్యవసాయం మరియు దాని అనుబంధ కార్యకలాపాలలో మరో ముఖ్య రంగం పశు సంవర్ధక శాఖ. విశేషం ఏమిటంటే గత కొంత కాలంగా వ్యవసాయ రంగంలో దీని వాటా పెరుగుతున్నది. ఈ రంగాన్ని కాపాడటానికి ప్రభుత్వం పశు ఆరోగ్య సేవలపై దృష్టి పెట్టింది. పాదం మరియు నోటి వ్యాధి నివారణ, మొబైల్ వెటర్నరీ క్లినిక్‌లు, గొర్రెలు, మేకలను క్రమం తప్పకుండా డీ వార్మింగ్ చేయడం మొదలైనవి చేస్తున్నది.

చివరగా వ్యవసాయ రంగంలో అత్యధిక వేగంతో అభివృద్ధి చెందుతున్న విభాగం మత్స్య శాఖ. ఉపాధి కల్పించడంలోనూ, ఆదాయంలోనూ ఈ రంగం వేగంగా అభివృద్ధి చెందుతున్నది.

### 15.5.2 తెలంగాణలో భూ వినియోగం

తెలంగాణ రాష్ట్రం 112.08 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో ఉంది. 2018-19లో ఈ విస్తీర్ణంలో సుమారు 41.58% (46.60 లక్షల హెక్టార్లు) నికరంగా పంట నాటిన ప్రాంతం. ఏదేమైనా, పంటల సాగులో వివిధ జిల్లాలలో గణనీయమైన అంతర్రాష్ట్ర వైవిధ్యం కలదు. నల్లగొండ మరియు ఖమ్మం అత్యంత వ్యవసాయ జిల్లాలు (నికరంగా నాటిన విస్తీర్ణం వరుసగా 3.8 మరియు 2.5 లక్షల హెక్టార్లతో) కాగా, పూర్తిగా పట్టణ ప్రాంతం అయిన హైదరాబాద్ జిల్లాలో దాదాపుగా వ్యవసాయ భూమి లేదు.

వ్యవసాయ కమతాల గణన, 2010-11 ప్రకారం రాష్ట్రంలో భూ కమతాల సంఖ్య 55.54 లక్షలు. ఈ కమతాల క్రింద ఉన్న మొత్తం భూమి పరిమాణం 61.97 లక్షల హెక్టార్లు. తెలంగాణలో భూ కమతాల పరిమాణం రోజు రోజుకు పడిపోతుంది. వ్యవసాయదారుల సగటు కమతాల పరిమాణం 2010-11లో 1.12 హెక్టార్‌లు ఉండగా అది 2015-16 నాటికి 1 హెక్టారుకు పడిపోయింది. పూర్వ నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఖమ్మం, వరంగల్ జిల్లాలలో 60 శాతానికి పైగా భూములు నామమాత్రపు కమతాలే. సగటు కమతం విస్తీర్ణం పూర్వ ఆదిలాబాద్ జిల్లాలో అత్యధిక స్థాయిలో 1.40 హెక్టార్లు ఉండగా 0.92 హెక్టార్ల సగటు విస్తీర్ణంతో పూర్వ నిజామాబాద్ జిల్లా అతి తక్కువ స్థాయిలో ఉంది.

### 15.5.3 వర్షపాతం

తెలంగాణ రాష్ట్రం వర్షపాతంలో వైషమ్యం, అనిశ్చితత్వం చాలా ఎక్కువ. రాష్ట్రంలో సగటు వార్షిక వర్షపాతం సుమారు 906 మి.మీ. దీనిలో 80 శాతం నైరుతీ రుతుపవనాల నుండి (జూన్ నుండి సెప్టెంబరు) లభిస్తుంది. రాష్ట్రంలో వాన కురిసే విధానం ఒకే తీరుగా ఉండదు. వర్షపు నీటి పంపిణీ కూడా వేర్వేరు మండలాలలో వేర్వేరు తీర్లలో ఉంటుంది. దీనితో "వ్యవసాయం అన్నది వరుణ దేవుడి కరుణా కటాక్షాల మీద ఆధారపడిన జూదం" అన్న సామెతగా మారిపోయింది.

## 15.5.4 వ్యవసాయ రంగానికి ప్రభుత్వ కృషి

తెలంగాణ రాష్ట్రానికి వ్యవసాయ రంగంలో చాలా ఆటంకాలున్నాయి. వీటిని పరిష్కరించడానికి, వ్యవసాయదారులకు చేయూతనివ్వడానికి తెలంగాణ ప్రభుత్వం చాలా పథకాలు చేపట్టడం జరిగింది. వాటిలో కొన్నింటిని మనమిప్పుడు చర్చించుకొందాం.

**1) రైతు బంధు – వ్యవసాయ పెట్టుబడి మద్దతు**

వ్యవసాయం కోసం పెట్టుబడికి మద్దతుగా రైతులకు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకమే 'రైతుబంధు' పథకం. ఈ పథకాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి మే 10, 2018న కరీంనగర్ జిల్లా, హుజూరాబాద్ నియోజకవర్గంలోని శాలపల్లి – ఇందిరానగర్ వద్ద ప్రారంభించాడు. ప్రాథమికంగా, దీని క్రింద ప్రతి సీజన్‌లో ఎకరానికి వ్యవసాయ పెట్టుబడికి మద్దతుగా ప్రభుత్వం రూ.4,000 రైతులకు అందించింది. అయితే, ఆ మొత్తాన్ని ఖరీఫ్ 2019 నుండి రూ.5,000 లకు పెంచడం జరిగింది. రబీ 2018 నుండి ఈ సహాయాన్ని నేరుగా రైతు బ్యాంకు ఖాతాలోకి డిపాజిట్ చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదర్శంగా తీసుకుని ఇతర రాష్ట్రాలు, భారత ప్రభుత్వం కూడా రైతు పెట్టుబడి మద్దతు పథకాన్ని వివిధ పేర్లతో అమలు చేస్తున్నాయి.

**2) రైతు బీమా**

ఏ కారణం చేతనైనా రైతు ప్రాణాలు కోల్పోయిన సందర్భంలో కుటుంబ సభ్యులకు / ఆధారపడిన వారికి ఆర్థిక ఉపశమనాన్ని, సామాజిక భద్రతను కల్పించడమే 'రైతు బీమా' ప్రధాన లక్ష్యం. రైతు ప్రాణాలు కోల్పోయిన సందర్భంలో, వారి కుటుంబాలు వారి రోజువారీ అవసరాలకు కూడా తీవ్రమైన ఆర్థిక సమస్యలను ఎదుర్కొంటున్నాయి. 'రైతుల గ్రూప్ లైఫ్ ఇన్సూరెన్స్ పథకం' మరణించిన రైతు కుటుంబంలోని సభ్యులకు ఆర్థిక భద్రత మరియు ఉపశమనం కల్పిస్తుంది. 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు గల రైతులు ఈ పథకం కింద నమోదు చేసుకోవడానికి అర్హులు. మొత్తం ప్రీమియంను లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (భారతదేశంలో బీమా కోసం అతి పెద్ద ప్రభుత్వ రంగ సంస్థ) కు ప్రభుత్వం చెల్లిస్తుంది. సహజ మరణంతో సహా ఏదైనా కారణం వల్ల నమోదు చేసుకున్న రైతు మరణించిన సందర్భంలో బీమా మొత్తం రూ.5 లక్షలను పది రోజుల్లో నామినీ ఖాతాలో జమ చేయబడుతుంది.

ఈ పథకాలు మాత్రమే కాకుండా భూ ఆరోగ్య కార్డులు, వ్యవసాయదారుల పెట్టుబడికి బ్యాంకులు, సహకార సంఘాల ద్వారా ఋణాలు, సబ్సిడీపై విత్తనాలు, యాంత్రీకరణ పెరిగిన నేపథ్యంలో వెనుకబడిన వర్గాలకు యంత్ర లక్ష్మి పథకం, వ్యవసాయ సాగుకు 24 గంటల ఉచిత కరెంటు, రైతులు పండించిన పంటలను నిల్వ చేసుకోవడానికి గిడ్డంగుల నిర్మాణం వంటివి చేపట్టడం జరిగింది. అదే కాకుండా ఉద్యాన వన పంటల కొరకై సబ్సిడీపై డ్రిప్, స్ప్రింక్లర్‌లు, గ్రీన్ హౌజ్‌లు, పాలీ హౌజ్‌లు సబ్సిడీపై నిర్మాణం, పశు పోషణకై మొబైల్ వెటర్నరీ క్లినిక్‌లు, మత్స్యకారులకు వాహనాల పంపిణీ వంటి ఎన్నో కార్యక్రమాలను తెలంగాణ ప్రభుత్వం చేపట్టి వ్యవసాయదారుడు సమాజంలో ఆర్థికంగా, సామాజికంగా ఎదగడానికి కృషి చేస్తున్నది.

## మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం పాత్రను తెలపండి.
2. తెలంగాణలో వ్యవసాయదారుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను వివరించండి.

## 15.6 తెలంగాణలో పారిశ్రామిక రంగం

వ్యవసాయం, పరిశ్రమలు రెండూ ఆర్థిక చక్రానికి రెండు కళ్ళవంటివి. పరిశ్రమలకు అవసరమైన ముడి సరుకును వ్యవసాయ రంగం సరఫరా చేయగా, వ్యవసాయ యాంత్రీకరణకు అవసరమైన యంత్ర పరికరాలను పారిశ్రామిక రంగం అందిస్తుంది. పెరుగుతున్న జనాభాకు ఉపాధి కల్పించాలన్నా, వ్యవసాయ రంగంలోని ప్రచ్ఛన్న నిరుద్యోగితను తగ్గించాలన్నా పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధిపరచవలసిన అవసరం ఎంతైనా ఉంది. పారిశ్రామికీకరణ అనేది తెలంగాణకు ఆర్థిక వృద్ధి మరియు అభివృద్ధి కోసం అనుసరించాల్సిన ముఖ్య వ్యూహం. పారిశ్రామికీకరణ ద్వారా యువతకు ఉద్యోగాల కల్పన, అభివృద్ధిని ప్రోత్సహించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. వెనుకబడిన ప్రాంతాలలో, అందుబాటులో ఉన్న ఖనిజ సంపద, మానవ వనరుల వినియోగం ద్వారా పారిశ్రామిక వృద్ధి జరుగుతుంది.

దేశంలోని ప్రధాన పారిశ్రామిక రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. తెలంగాణ పరిశ్రమల పరంగా 6వ స్థానంలో, పరిశ్రమల నుంచి సమకూరే స్థూల విలువ ఆధారిత అంశాల పరంగా 8వ స్థానంలోనూ ఉంది. ఔత్సాహిక మహిళా పారిశ్రామిక వేత్తలకు, షెడ్యూల్డ్ కులాలకు (ఎస్.సి.), షెడ్యూల్డ్ తెగలకు (ఎస్.టి.) చెందిన వారికి అనుకూలమైన సాధికారతా వాతావరణాన్ని సృష్టించడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంటున్నది.

### 15.6.1 తెలంగాణలో కీలక పరిశ్రమలు

బల్క్ డ్రగ్స్, ఫార్మాస్యూటికల్స్, వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్, సిమెంట్, ఖనిజ ఆధారిత పరిశ్రమలు, ఇంజనీరింగ్, జౌళి, తోలు, ఇనుము, ఉక్కు, రత్నాలు, ఆభరణాలు, బయోటెక్నాలజీ, రక్షణ లాంటి భారీ ఉత్పాదక పరిశ్రమలకు నిలయం తెలంగాణ రాష్ట్రం. సమాచార సాంకేతిక (IT) ఆధారిత సేవలు, ఫార్మా, ఇంజనీరింగ్ కాంపోనెంట్స్ లాంటి విజ్ఞాన ఆధారిత పరిశ్రమలకు తెలంగాణలో బలమైన ఉనికి ఉంది. అయితే వీటిలో ఎక్కువ శాతం హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో నెలకొల్పబడి ఉన్నాయి. పూర్వ నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాలు ఎక్కువగా వ్యవసాయం మీద ఆధారపడి ఉన్నాయి. ఈ జిల్లాలలో పారిశ్రామిక అభివృద్ధి జరగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### 15.6.2 నూతన పారిశ్రామిక విధానం

తెలంగాణలో ఆర్థిక వృద్ధికి, అభివృద్ధికి అనుసరించాల్సిన కీలక వ్యూహం పారిశ్రామికీకరణ. యువతరానికి ఉద్యోగాల కల్పన, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి సాధన, అందుబాటులో ఉన్న వనరులను ఆదర్శవంతంగా వినియోగించుకోవడం ద్వారా వృద్ధి అవకాశాలను పెంచడం, ప్రజల ప్రతిభను, నైపుణ్యాలను వినియోగించుకోవడం, ప్రతి ఇంట్లో సంపదను సృష్టించడం లాంటి అంశాల్లో రాష్ట్ర ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం మీద భారీ ఆకాంక్షలు ఉన్నాయి. తెలంగాణ ప్రజల్లో నెలకొన్న ఈ ఆకాంక్షలను నెరవేర్చే సామర్థ్యం పారిశ్రామికీకరణకు ఉంది.

ఈ దిశలోనే, ప్రభుత్వం నూతన 'పారిశ్రామిక విధాన చట్టం 2014'ను ప్రవేశ పెట్టింది. 'నవ్యావిష్కరణల కోసం పరిశోధన, పరిశ్రమల కోసం నవ్య ఆవిష్కరణ, సంపద కోసం పరిశ్రమలు' అనేది తెలంగాణ పారిశ్రామికీకరణ విషయంలో ప్రభుత్వ దార్శనిక దృక్పథం. 'ఇన్ తెలంగాణ ఇన్నోవేట్, ఇన్‌క్యుబేట్, ఇన్‌కార్పొరేట్ (తెలంగాణలో నవ్యావిష్కరణలు చేయండి, నూతన పరిశ్రమలకు శ్రీకారం చుట్టండి, సువ్యవస్థిత పరిశ్రమగా అవతరించండి) అనే నినాదం పారిశ్రామిక విధాన నిర్మాణానికి ఛోదక శక్తి. కరచాలనం చేసుకున్నంత సులువుగా వ్యాపారాన్ని సాగించే ఓ వ్యాపార నియంత్రణ వాతావరణాన్ని కల్పించడమే ఈ నూతన పారిశ్రామిక విధాన ఉద్దేశం.

**1. నూతన పారిశ్రామిక విధానం దిగువ పేర్కొన్న నిర్దిష్టమైన మౌలిక విలువలపై ఆధారపడి ఉంది:**

- ప్రభుత్వ నియంత్రణ చట్టం పారిశ్రామిక వృద్ధికి దోహదపడాలి.
- ప్రశాంతమైన, సురక్షితమైన, ప్రగతిశీలమైన వ్యాపార నియంత్రణ వాతావరణంలో పారిశ్రామిక అభివృద్ధి సాధించాలి.
- పారిశ్రామికాభివృద్ధి భారీ స్థాయిలో ఉద్యోగాల కల్పనకు, తద్వారా స్థానిక యువతరానికి ప్రయోజనాలను అందించేందుకు దారి తీయాలి.
- పారిశ్రామికీకరణ సమ్మిళితంగా ఉండాలి, సామాజిక సమానత్వానికి దోహదపడాలి.
- పారిశ్రామికీకరణ ప్రయోజనాలు రాష్ట్రంలోని అట్టడుగు, సామాజికంగా అణగారిన వర్గాల వారికి చేరాలి.
- పర్యావరణాన్ని పరిరక్షించాలి, సంభవించగల ప్రభావాలను తగ్గించాలి.

**2. నూతన పారిశ్రామిక విధాన లక్ష్యాలు:**

- ప్రస్తుతం ఉన్న పరిశ్రమలను మరింత పోటీపడేలా తీర్చిదిద్దడం.
- పారిశ్రామిక రంగంలోకి కొత్తగా అంతర్జాతీయ, జాతీయ పెట్టుబడులను ఆకర్షించడం.
- పట్టణ, గ్రామీణ యువతరం కోసం ఉపాధి అవకాశాలు సృష్టించడానికి కీలకమైన ఉత్పాదక రంగాలపై దృష్టి కేంద్రీకరించడం.
- అత్యంత పోటీ ధరలకు అత్యున్నత స్థాయి వస్తువుల్ని ఉత్పత్తి చేయడం.
- భారీ స్థాయిలో అంతర్జాతీయ స్థాయి గుర్తింపు సాధించేలా 'మేడ్ ఇన్ తెలంగాణ – మేడ్ ఇన్ ఇండియా'ను ఓ బ్రాండ్‌గా నెలకొల్పడం.
- లంచగొండితనాన్ని ఏ మాత్రం ఉపేక్షించక పోవడం.
- విధాన నిర్ణయాలను పారదర్శకంగా తీసుకోవడం.
- పర్యవేక్షణను తగ్గించడం, సౌలభ్యాన్ని పెంచడం.

ఈ నూతన పారిశ్రామిక విధానం ద్వారా తెలంగాణ ప్రభుత్వం పెట్టుబడిదారుల అనుకూల విధానాన్ని ప్రవేశపెట్టి, పెట్టుబడులను ఆకర్షించి పారిశ్రామిక ప్రగతికి బాటలు వేసింది. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి

విద్యుత్తు, రోడ్లు, నీరు, భూమి లాంటి మౌళిక వనరుల మెరుగుదలకు కృషి చేస్తుంది. తద్వారా రాష్ట్రంలో పారిశ్రామిక రంగంలో పెట్టుబడులు పెరిగి ఉపాధికి, ఉత్పత్తికి దోహదపడే అనుకూల వాతావరణం ఏర్పడుతుందని ప్రభుత్వం కార్యాచరణను రూపొందించింది. 15 పని దినాల్లో పారిశ్రామిక అనుమతులు ఇచ్చేటట్లు 'ఏక గవాక్ష పద్ధతి'ని ప్రవేశ పెట్టింది.

**కనుగొనండి**

మీ జిల్లాలో నెలకొల్పబడిన పరిశ్రమలు ఏమిటో తెలుసుకోండి.

**మీ ప్రగతిని పరీక్షించుకోండి**

1. పారిశ్రామిక రంగ ఆవశ్యకతను వివరించండి.
2. నూతన పారిశ్రామిక విధానంపై మీ అభిప్రాయాన్ని తెలియజేయండి.
3. పారిశ్రామిక రంగంలో తెలంగాణ సాధిస్తున్న ప్రగతిని వివరించండి.

## 15.7 తెలంగాణలో సేవల రంగం

వస్తువులను నేరుగా తయారు చేయకుండా వస్తువుల ఉత్పత్తికి, ప్రజలకు అవసరమైన సేవలు అందించే కార్యకలాపాలు అన్నీ సేవల రంగం క్రిందికి వస్తాయి. ఉదా: ఉపాధ్యాయుడు, డాక్టర్, బ్యాంక్ ఉద్యోగి మొదలైనవారు. వీరు చేసే పనుల వలన ఎలాంటి వస్తువు ఉత్పత్తి కాదు. కానీ వీరు ప్రజలకు తమ తమ సేవలను అందిస్తారు.

అభివృద్ధి చెందుతున్న దశలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ నుంచి పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థకు రూపాంతరం చెందుతుంది. ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి ఊపందుకుంటున్న దశలో, పారిశ్రామిక వాటా కన్నా సేవల రంగం అందించే వాటా వేగంగా పెరుగుతుంది. సేవా రంగం 'స్పర్శకందని ఉత్పత్తులైన' సేవలను అందిస్తుంది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలోని అన్ని సామాజిక, ఆర్థిక రంగాల్లోకి ఈ సేవలు విస్తరించాయి. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో వస్తువులను ఉత్పత్తి చేయడానికి అవసరమైన వాటికన్నా తక్కువ సహజ మూలధనం, ఎక్కువ మానవ వనరుల పెట్టుబడి ఈ సేవలను ఉత్పత్తి చేసేందుకు అవసరమౌతాయి.

నేడు సేవల రంగం ఆర్థిక వ్యవస్థలో మౌళిక రంగంగా గుర్తించబడింది. ఇది తెలంగాణ రాష్ట్రంలో ప్రధాన వృద్ధిని కలిగించే రంగంగా అవతరించింది. సేవల రంగంలో ప్రధానంగా వాణిజ్యం, పర్యాటకం, ఆతిథ్యం, రవాణా, నిల్వ (గిడ్డంగి), కమ్యూనికేషన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మరియు సంబంధిత సేవలు, మరమ్మతు సేవలు, ఆర్థిక సేవలు, రియల్ ఎస్టేట్, విద్యా మరియు వైద్య సేవలు, సామాజిక మరియు వ్యక్తిగత సేవలు, ప్రజా పరిపాలన వంటివి ఉంటాయి.

ఉత్పత్తి మరియు ఎగుమతుల విషయంలో దేశంలో ఐటి, ఐటి ఆధారిత సేవల (Information Technology enabled services) రంగాలలో రాష్ట్రం అగ్ర స్థానంలో ఉంది. అదనంగా, పర్యాటకం అనేది ఉపాధి కల్పించే సేవ. పర్యాటకం ప్రత్యక్ష మరియు పరోక్ష ఉపాధిని అందిస్తుంది. రాష్ట్రంలో సేవలు, రెస్టారెంట్లు, రవాణా సేవలు, వినోద సేవలు, ఆరోగ్యం, దుస్తులు, రత్నాలు, నగలు మొదలగు ఉప రంగాలలో ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ప్రముఖ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) హబ్‌లలో ఒకటిగా హైదరాబాద్ గుర్తింపు

పొందింది. IT / ITes కంపెనీలు కలిసి లక్షల మంది నిపుణులకు ప్రత్యక్షంగా, అలాగే లక్షల మందికి పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్నాయి. ప్రపంచంలో ఐ.టి. ఆధారిత సేవలకు సంబంధించిన అతి పెద్ద ప్రపంచ గమ్యస్థానాలలో హైదరాబాద్ ఒకటి.

పర్యాటక రంగం ఎన్నో అవకాశాలున్న ఒక పరిశ్రమ. రాష్ట్రంలో సామాజిక ఆర్థిక వృద్ధికి ఇది గణనీయంగా దోహదం చేస్తుంది. పర్యాటక పరిశ్రమకు అనేక అవకాశాలను ప్రభుత్వం అందిస్తుంది. తెలంగాణ రాష్ట్ర పర్యాటక సంస్థను ఏర్పాటు చేయడం ద్వారా విభిన్న తరహాల పర్యాటక ప్యాకేజీలను/ సేవలను అమలు చేసేందుకు, దేశీయ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు వినూత్నమైన పద్ధతులను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. తద్వారా పర్యాటక రంగంలో ఉపాధి అవకాశాలు పెరిగి సేవల రంగంలో పర్యాటక రంగం యొక్క వాటా క్రమంగా పెరుగుతున్నది.

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అనేక అందమైన ఆలయాలు, చారిత్రకమైన ఆరాధనా ప్రదేశాలు ఉన్నాయి. అవి ఇప్పుడు ప్రసిద్ధ యాత్రా కేంద్రాలుగా రూపు దిద్దుకుంటున్నాయి. హైదరాబాద్‌కు సమీపంలోని చిలుకూరు బాలాజీ ఆలయాన్ని, భద్రాచలంలో గల సీతారామచంద్ర స్వామి ఆలయాన్ని, బాసరలో గల సరస్వతీ ఆలయాన్ని, యాదాద్రిలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని సందర్శించుకోవడానికి ప్యాకేజీ టూర్లని తెలంగాణ రాష్ట్ర పర్యాటక సంస్థ ఏర్పాట్లు చేసింది. వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం, కొండగట్టులోని హనుమాన్ ఆలయం, ధర్మపురిలోని నరసింహ స్వామి ఆలయం, వరంగల్ జిల్లా పాలంపేటలోని రామప్ప ఆలయం, ఆలంపూర్‌లోని జోగులాంబ ఆలయాల దగ్గర పర్యాటకుల కోసం సౌకర్యాల అభివృద్ధికి పనులు చేపట్టారు. టిటిడి తరహాలో యాదగిరి గుట్ట దేవస్థానాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అవసరమైనన్ని నిధులను మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టు కింద నరసింహ స్వామి అభయారణ్యాన్ని 400 ఎకరాల్లో అభివృద్ధి చేయడంతో పాటు మరో 1,600 ఎకరాల్లో ఉద్యాన వనాలు, కళ్యాణ మండపాలు, ధ్యాన మందిరాలు, వేద పాఠశాల, కాటేజీలను ప్రభుత్వం నిర్మిస్తున్నది. ఇలా ప్రభుత్వం పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడం ద్వారా లక్షల మందికి ఉపాధి లభించి సేవల రంగం రాష్ట్ర స్థూల ఆదాయంలో ప్రముఖ పాత్ర వహిస్తుంది.

అయితే సేవా రంగంలో అనేక మంది అవ్యవస్థీకృత రంగంలో పని చేస్తున్నారు. సేవల రంగంలో ఆదాయ పెరుగుదల కనిపించినంత వేగంగా ఉపాధి పెరగడం లేదు. సేవా రంగం అభివృద్ధి చెందినా ఆ రంగంలోని అన్ని కార్యకలాపాలు సమానంగా పెరగడం లేదు. తెలంగాణలో సేవా రంగంలో అనేక రకాల వ్యక్తులు ఉపాధి పొందుతున్నారు. ఒకవైపు బాగా చదువుకున్న, నైపుణ్యాలున్న వ్యక్తులకు ఉపాధి ఇచ్చే కొద్దిపాటి సేవలు ఉన్నాయి. ఇంకోవైపు చిన్న చిన్న దుకాణాలు నడిపే వాళ్ళు, మరమ్మతులు చేసే వాళ్ళు, రవాణా సేవలు అందించే వాళ్ళు పెద్ద సంఖ్యలో ఉన్నారు. వాళ్ళ జీవనం అతి కష్టం మీద కొనసాగుతుందని చెప్పక తప్పదు. అయినా వారు మరో దారి లేక అదే సేవల రంగంలో కొనసాగుతున్నారు. అంటే సేవల రంగంలో ఒక భాగానికే ప్రాధాన్యత పెరుగుతుందని చెప్పవచ్చు.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. సేవల రంగం అనగానేమి? సేవల రంగంలో జరిగే కొన్ని పనులకు ఉదాహరణలు తెలుపండి.
2. తెలంగాణ ప్రభుత్వం సేవల రంగానికి ఇచ్చిన ప్రాముఖ్యత ఏమిటి?
3. 'సేవల రంగంలో ఒక భాగానికే ప్రాధాన్యత పెరుగుతుంది' అనే అభిప్రాయంతో మీరు ఏకీభవిస్తారా?

## 15.8 అవస్థాపనా సౌకర్యాల (మౌలిక సదుపాయాల) అభివృద్ధి

ఒక ప్రాంతం అభివృద్ధిలో రాణించాలంటే మౌలిక సదుపాయాలు తప్పనిసరి. మౌలిక సదుపాయాల పాత్రను ఎప్పటికీ తగ్గించలేం. ఎందుకంటే ఇవి ఆర్థిక వ్యవస్థకు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను దోహదం చేస్తాయి.

నీటి పారుదల, విద్యుత్ ప్రాజెక్టులు, రోడ్లు, నీటి సరఫరా, రైల్వేలు, విమానాశ్రయాలు మొదలైనవి ఆర్థిక (భౌతిక) మౌలిక సదుపాయాలు. పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు, ఆసుపత్రులు, డిస్పెన్సరీలు మొదలైనవి సామాజిక మౌలిక సదుపాయాలు. ఆర్థిక మౌలిక సదుపాయాలు 'వృద్ధికి' దోహదం చేయగా, సామాజిక మౌలిక సదుపాయాలు రాష్ట్రం యొక్క 'అభివృద్ధి'కి దోహదం చేస్తాయి. ఉదాహరణకు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు త్రాగు నీటిని సరఫరా చేయడానికి 'మిషన్ భగీరథ', అన్ని చెరువులలో పూడిక తీసి వాటిని పునరుద్ధరించడానికి 'మిషన్ కాకతీయ', వ్యవసాయ రంగానికి 24 గంటల ఉచిత విద్యుచ్ఛక్తి, సాగు నీటికై కాళేశ్వరం ప్రాజెక్టు వంటి మౌలిక సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్నది.

### 15.8.1 నీటి పారుదల

రాష్ట్ర అభివృద్ధి కొరకు, ప్రజల సంక్షేమం కొరకు నీటి వనరులను పెంచడానికి తెలంగాణ ప్రభుత్వం అనేక ప్రాజెక్టులను ప్రారంభించింది. వీటిని సాధించడానికి క్రింది లక్ష్యాలను నిర్దేశించుకుంది:

1. వ్యవసాయ రంగానికి సకాలంలో నీటిని అందించడం.
2. రాష్ట్ర ప్రజలందరికీ త్రాగు నీరు అందించడం.
3. పారిశ్రామిక అభివృద్ధికి అవసరమైన నీటిని అందించడం.

రాష్ట్ర ప్రభుత్వం కనీసం ఒక కోటి ఎకరాల భూమికి సాగు నీరు అందించే లక్ష్యాన్ని సాధించడానికి వివిధ నీటి పారుదల ప్రాజెక్టులను చేపట్టింది. ఈ దిశలో దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రధాన మరియు మధ్యస్థ నీటి పారుదల ప్రాజెక్టులు అన్నింటినీ పూర్తి చేయడానికి ప్రయత్నాలు, ఇప్పటికే ఉన్న నీటి పారుదల మౌలిక సదుపాయాలు, పాత నీటి పారుదల, చెరువుల పునరుద్ధరణ లక్ష్యంగా పెట్టుకున్నది.

కృష్ణా, గోదావరి నదులు, వాటి ఉపనదులైన మూసి, మంజీర మొదలైనవి తెలంగాణ రాష్ట్రం గుండా ప్రవహించే ముఖ్యమైన నదులు. వీటి నీటిని ఒడిసి పట్టడానికి ప్రభుత్వం 38 ఇరిగేషన్ ప్రాజెక్టులను ప్రారంభించింది. దీనిలో 22 మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు, 13 మధ్య స్థాయి నీటి పారుదల ప్రాజెక్టులు, ఒకటి వరద కాలువ, మరో రెండు ప్రాజెక్టులు ఆధునికీకరణలో ఉన్నాయి.

**1. కాళేశ్వరం ప్రాజెక్ట్**

గోదావరి నది నుండి 180 టి.యం.సి.ల నీటిని ఒడిసి పట్టడానికి మరియు ఈ నీటి ద్వారా తెలంగాణలోని వెనుకబడిన ప్రాంతాలకు సాగు నీటిని అందించడానికి ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టడం జరిగింది.

**ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యాలు క్రింది విధంగా ఉన్నాయి:**

- గోదావరిలోని 180 టి.యం.సి.ల నీటిని శ్రీపాదరావు ఎల్లంపల్లి ప్రాజెక్టుకు మళ్ళించడం, అదే విధంగా అక్కడి నుండి మిడ్ మానేరు రిజర్వాయర్‌కు ఎత్తిపోతల ద్వారా మళ్ళించి ఎత్తైన ప్రాంతంలోని భూములను సాగులోకి తీసుకురావడం.
- అవిభక్త ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నల్లగొండ, నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో 18.25 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు అందించడం మరియు హైదరాబాదు, సికింద్రాబాదు పట్టణాలకు త్రాగు నీరు, పారిశ్రామిక అవసరాలకు అవసరమైన నీటిని అందించడం.
- భూగర్భ జలాలను పెంచడం కోసం భూ ఉపరితల నీటి వినియోగానికి మారడం ద్వారా భూగర్భ జలమట్టాన్ని దాని అసలు స్థితికి తీసుకురావడం.

ఈ కాళేశ్వరం ప్రాజెక్ట్ వ్యవసాయదారులకు సాగు నీరు, ప్రజలకు త్రాగు నీరు, పరిశ్రమలకు నీరు అందించి రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర వహిస్తుందనడంలో సందేహం లేదు.

### 2. మిషన్ కాకతీయ

తెలంగాణలో వందలాది సంవత్సరాలుగా చెరువులే ప్రధాన సాగు నీటి వనరులుగా ఉన్నాయి. చాలా కాలం పాటు, సరైన నిర్వహణ లేనందున, పూడికలు తీయనందున వీటిలో చాలా చెరువులు పూడుకుపోయాయి లేదా నిరర్థకంగా మిగిలిపోయాయి. ఉపరితల జలాల లభ్యత తగ్గడం వలన అందుబాటులో గల భూగర్భ జలాలపై ఒత్తిడి పెరిగిపోయింది. కాగా రాష్ట్రంలో 85% సాగు భూమి వర్షాధారంగానే ఉంది. తెలంగాణ నైసర్గిక స్వరూపం, వర్షపాత నమూనా కారణంగా ఈ ప్రాంతంలో సాగు నీటి చెరువులే నీటి పారుదలకు, నీటి నిల్వకు, వ్యవసాయ వినియోగం కోసం నీటి ప్రవాహాన్ని నియంత్రించేందుకు శ్రేష్ఠమైనవిగా నిలుస్తున్నాయి. రాష్ట్రంలో వ్యవసాయాభివృద్ధికి చెరువుల వ్యవస్థ కీలకమైనది. భూసార, జల సంరక్షణ, వరదల నియంత్రణ, కరువు నివారణ, పశుగణం, గృహ వినియోగాలు, భూగర్భ జలాలను పెంచడం, శీతోష్ణ స్థితి, పర్యావరణ పరిరక్షణలకు ఇవి తోడ్పడతాయి.

సామాజిక భాగస్వామ్యంతో వికేంద్రీకరణ నమూనాలో తెలంగాణ ప్రభుత్వం 'మిషన్ కాకతీయ' (మన ఊరు-మన చెరువు) పేరిట 46,531 చిన్న తరహా సాగు నీటి వనరుల పునరుద్ధరణ కోసం చేపట్టింది.

### 3. మిషన్ భగీరథ

తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ రక్షిత మంచి నీటిని అందించాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం 'మిషన్ భగీరథ'ను ప్రారంభించింది. మిషన్ భగీరథ పైలాన్‌ను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడి గారు 2016, ఆగస్టు 7న గజ్వేల్ శాసన సభ నియోజకవర్గంలోని కోమటిబండలో ఆవిష్కరించారు. ఈ పథకం ద్వారా కృష్ణ, గోదావరి నదులతో పాటు ఇతర జలాశయాల నుంచి నీటిని పైపులైన్ల మార్గం ద్వారా రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లోని ప్రతి ఇంటికీ త్రాగు నీరు అందించబోతున్నారు.

### 15.8.2 రహదారులు, భవనాలు

రవాణా వ్యవస్థలోని ప్రాథమిక సాధనాల్లో రహదారులు ఒకటి. మౌళిక సదుపాయాలలో ముఖ్యమైన ప్రాధాన్యత కలిగిన రంగం కూడా ఇది. సేవా రంగం మీద ఆధారపడిన, రైళ్ళ అనుసంధానత లేని తెలంగాణ ప్రాంతాల అభివృద్ధిలో రోడ్లు ముఖ్య పాత్ర పోషిస్తాయి. ఎక్కడ రవాణా వ్యవస్థలు సమర్థవంతంగా ఉంటే అక్కడ ప్రజలకు అత్యుత్తమ ఆర్థిక అవకాశాలు, సులభంగా రాకపోకలు సాగించే వీలు ఉంటుంది. ప్రత్యేకించి గ్రామాల నుంచి పట్టణ ప్రాంతాలకు అనుసంధానమయ్యే రహదారుల వ్యవస్థ సరుకుల, సేవల రాకపోకలను వేగవంతం చేస్తుంది.

**మీ ప్రగతిని పరీక్షించుకోండి**

1. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో అవస్థాపనా (మౌలిక) సౌకర్యాల పాత్రను వివరించండి.
2. మిషన్ కాకతీయను తెలంగాణ రాష్ట్రం ఎందుకోసం చేపట్టింది?

## 15.9 సంక్షేమం, సామాజిక అభివృద్ధి : సంక్షేమ పథకాలు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి ప్రభుత్వం వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం, వారికి అండగా నిలవడానికి ఎన్నో రకాలైన పథకాలను ప్రకటించి అమలుపరుస్తున్నది. ఈ పథకాల అమలు యొక్క ముఖ్య ఉద్దేశం సమాజంలో వెనుకబడిన వర్గాల వారిని అభివృద్ధి పరిచి వారిని కూడా రాష్ట్ర అభివృద్ధిలో భాగం చేయడమే. ఆహార భద్రతలో భాగంగా తెల్ల రేషన్ కార్డ్ ఉన్న ప్రతీ కుటుంబంలోని ప్రతీ మనిషికి 6 కిలోల బియ్యం చొప్పున ప్రజా పంపిణీ ద్వారా ప్రభుత్వం అందిస్తుంది. ఈ మధ్యనే ఆసరా పింఛన్ల మొత్తాన్ని కూడా పెంచింది. పేదరికంలో కూరుకుపోయిన కుటుంబాలకు కళ్యాణ లక్ష్మి, మైనారిటీలకు షాదీ ముబారక్ ద్వారా పేద కుటుంబాలు అప్పుల బారిన పడకుండా పెళ్ళిళ్ళు చేయవచ్చు.

రాష్ట్ర ప్రభుత్వం పేద గర్భిణీ స్త్రీలకు ఉచితంగా పౌష్ఠికాహారం, ఉచిత హెల్త్ చెకప్, మందుల వంటి వాటిని సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం (ICDS) క్రింద ఇస్తుంది. తద్వారా ప్రభుత్వం పేద గర్భిణీ మహిళల ఆరోగ్యానికి రక్షణగా ఉన్నది. రాష్ట్రంలో ప్రజల ప్రాణాలను, శాంతి భద్రతలను కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. దీనిలో భాగంగా పోలీసు శాఖ హైదరాబాద్ నగరంలో సి.సి. కెమెరాలను ఏర్పాటు చేసింది మరియు గ్రామాలలో కూడా సామాజిక భాగస్వామ్యంతో సి.సి. కెమెరాలను ఏర్పాటు చేస్తున్నది. దీనికి అనుబంధంగా మహిళలో ఆత్మ విశ్వాసాన్ని నింపడానికి మరియు మహిళల రక్షణకై షీ టీమ్‌లను ఏర్పాటు చేయడం జరిగింది.

సామాజిక వెనుకబాటుతనం అభివృద్ధికి ఒక ఆటంకం వంటిది. వివిధ పథకల ద్వారా ఈ సామాజిక వెనుకబాటుతనాన్ని రూపుమాపి సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు సహాయం చేసి వారి ఆదాయ మార్గాలను పెంచి వారిని కూడా దారిద్ర్య రేఖకు ఎగువకు తీసుకువచ్చిన నాడే రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనించగలుగుతుంది. అందుకే సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు అనేక రకాలైన పథకాలను ప్రవేశ పెట్టింది. వాటిని ఒకసారి చర్చించుకుందాం.

### 15.9.1 ఆసరా ఫించన్లు

పేదలందరూ గౌరవప్రదంగా, భద్రతతో జీవించడానికి ప్రభుత్వం తన వంతు సంక్షేమ చర్యలు, సామాజిక భద్రతా వలయ వ్యూహంలో భాగంగా ఆసరా పింఛన్లను ప్రవేశపెట్టింది. సమాజంలో కష్టాలకు అత్యధికంగా

గురవుతున్న వర్గాలను ఆదుకోవడానికి, ముఖ్యంగా వృద్ధులు, బలహీనులు, హెచ్.ఐ.వి. - ఎయిడ్స్‌లతో జీవిస్తున్న వారు, వితంతువులు, వృద్ధాప్యం మీద పడడంతో పనిచేసే సామర్థ్యాన్ని కోల్పోయి, జీవనోపాధి కోల్పోయిన నేత పని వారు, కల్లు గీత పని వారు సామాజిక భద్రతతో, హుందాగా జీవితం సాగించడానికి తమకు రోజు వారీగా అవసరమైన కనీస అవసరాలను తీర్చుకోవడంలో అండగా నిలవడానికి 'ఆసరా పథకం' ఉద్దేశించబడినది.

ఆసరా పింఛన్‌లో భాగంగా జూన్ 2019 నుండి వృద్ధులు, వితంతువులు, బీడీ కార్మికులు, గీత కార్మికులు, నేత కార్మికులు, ఒంటరి మహిళలు, బోద కాలు వ్యాధిగ్రస్తులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు అంతవరకు ఇస్తున్న పెన్షన్‌ను రూ. 1,000 నుంచి రూ. 2,016 కు పెంచారు. దివ్యాంగులు, వృద్ధ కళాకారుల పెన్షన్ ను రూ. 1,500 నుంచి రూ. 3,016కు పెంచారు.

### 15.9.2 ఆర్థిక సహాయ పథకాలు

**i) షెడ్యూల్డ్ కులాల వారికి ఆర్థిక సహాయ పథకాలు:** ఈ పథకాల లక్ష్యం ఆదాయాన్ని సృష్టించే ఆస్తుల సృష్టికి ఆర్థిక సహాయం అందించడం. పేద షెడ్యూల్డ్ కులాల కుటుంబాలకు వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం ఈ పథకాలు ఉద్దేశించబడ్డాయి. తెలంగాణ షెడ్యూల్డ్ కులాల సహకార అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా ఈ పథకాలు అమలు చేయబడుతున్నాయి.

**ii) షెడ్యూల్డ్ తెగల వారికి ఆర్థిక సహాయ పథకాలు:** వ్యవసాయం, ఉద్యాన వనాలు, మత్స్య, చిన్న నీటి పారుదల, పశు సంవర్ధక మరియు స్వయం ఉపాధి రంగాలలో ఆర్థిక సహాయ పథకాలు అమలు పరిచినట్లయితే గిరిజన జనాభా మరియు గిరిజన ప్రాంతాలు మెరుగైన జీవన ప్రమాణాలను పొందగలుగుతాయి.

**షెడ్యూల్డ్ తెగల యువకుల కోసం డ్రైవర్-కమ్-ఓనర్ పథకం:** ఈ పథకం షెడ్యూల్డ్ తెగల డ్రైవర్ల మద్దతుకై ఉద్దేశించబడింది. షెడ్యూల్డ్ తెగల డ్రైవర్లలో గల వృత్తి నిపుణతను మెరుగుపరిచేందుకు మారుతీ డ్రైవింగ్ స్కూల్ ద్వారా శిక్షణను ఇప్పించి సబ్సిడీపై వాహనాలను ప్రభుత్వం అందిస్తుంది.

**iii) వెనుకబడిన తరగతుల వారికి ఆర్థిక సహాయ పథకాలు:** తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలో బాగా వెనుకబడిన తరగతుల కొరకు వెనుకబడిన తరగతుల కార్పొరేషన్ ద్వారా ఈ పథకాలు అమలులోకి తీసుకు రావడం జరిగింది. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన తరగతుల వారికి ఆర్థిక సహాయం అందించడం ద్వారా వారి ఆదాయాన్ని పెంచడం ఈ కార్యక్రమపు ముఖ్య ఉద్దేశం. ఈ పథకం క్రింద ఆధునిక యాంత్రిక లాండ్రీ యూనిట్లను అందించడం, నాయీ బ్రాహ్మణులకు బ్యూటీషియన్ కోర్సులు మొదలైన వాటిలో శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఇదే విధంగా అల్ప సంఖ్యాక వర్గాల వారికి కూడా కొన్ని పథకాలను అమలుపరచడం జరుగుతుంది.

**iv) షెడ్యూల్డు కులాల/ షెడ్యూల్డు తెగల బాలికలకు కళ్యాణ లక్ష్మి పథకం:** తెలంగాణ ప్రభుత్వం 2 అక్టోబర్ 2014 నుండి షెడ్యూల్డు కులాల/ షెడ్యూల్డు తెగల బాలికలకు కళ్యాణ లక్ష్మి పథకాన్ని ప్రవేశ పెట్టింది. షెడ్యూల్డు కులాల/ షెడ్యూల్డు తెగల బాలిక తెలంగాణ రాష్ట్రానికి చెందినదై ఉండి 18 సంవత్సరాలు నిండి, తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం రూ. 2 లక్షలు మించకుండా ఉన్న వారందరూ ఈ పథకానికి అర్హులే. దీనిలో భాగంగా ఆడ పిల్ల పెళ్ళి ఖర్చుల నిమిత్తం పెళ్ళి సమయానికి రూ. 1,00,116లను ప్రభుత్వం అందజేస్తుంది.

**v) వెనుకబడిన తరగతుల/ ఆర్థికంగా వెనుకబడిన తరగతుల (EBC) బాలికలకు కళ్యాణ లక్ష్మి పథకం:** 2016-17 సంవత్సరం నుండి వెనుకబడిన తరగతుల/ ఆర్థికంగా వెనుకబడిన తరగతుల బాలికలకు కూడా కళ్యాణ లక్ష్మి పథకం వర్తింప చేయడం జరిగింది.

**vi) షాదీ ముబారక్:** ఈ కార్యక్రమం క్రింద అర్హులైన అల్ప సంఖ్యాక వర్గాల తెలంగాణ బాలికలకు ప్రభుత్వం రూ.1,00,116లను అందజేస్తుంది. మైనారిటీ వర్గాలకు చెంది ఉండి 18 సంవత్సరాలు నిండిన బాలికల పెళ్ళి ఖర్చుల నిమిత్తం వారి తల్లిదండ్రుల ఆదాయం రూ.2 లక్షలకు మించకుండా ఉన్నట్లయితే ఈ పథకానికి అర్హులు.

**vii) ప్రజా పంపిణీ వ్యవస్థ:** 01-10-2015 నుండి తెలంగాణ రాష్ట్రంలో జాతీయ ఆహార భద్రత పథకం అమలవుతున్నది. 1 రూపాయికి కిలో బియ్యం చొప్పున కుటుంబంలోని ప్రతి ఒక్కరికి 6 కిలోల చొప్పున బియ్యం ఈ పథకం క్రింద అందజేయబడుతున్నది. అదే విధంగా కిలోకి రూ.1 చొప్పున 35 కిలోల బియ్యం అంత్యోదయ, అన్న యోజన కార్డులు ఉన్న లబ్ధిదారులకు అందజేయబడుతున్నది. అదే కాకుండా అన్న యోజన కార్డు ఉన్న వారికి 10 కిలోల ఉచిత బియ్యం అందజేయబడుతుంది.

**viii) ఇతర కార్యక్రమాలు:** ఇవే కాకుండా వివిధ వర్గాలకు ఆరోగ్య లక్ష్మి పథకం క్రింద పోషకాహారం అందించడం, బస్తీ దవాఖానాలు, మహిళా శక్తి కేంద్రాల ఏర్పాటు, సఖి సెంటర్ల స్థాపన, బేటీ బచావో-బేటీ పడావో పథకం, ఇలా ఎన్నో పథకాలను ప్రభుత్వం వివిధ వర్గాల కొరకు ప్రవేశపెట్టడం జరిగింది.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలను తెలపండి.
2. షెడ్యూల్డ్ తెగల వారి ప్రయోజనానికై అమలు అవుతున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించండి.

## 15.10 తెలంగాణ పరిపాలనా వ్యవస్థ

భారతదేశంలో 29వ రాష్ట్రంగా జూన్ 2, 2014 నాడు తెలంగాణ ఆవిర్భవించింది. భారత రిపబ్లిక్‌లో తెలంగాణ ఒక భాగం. భారత రాజ్యాంగం ద్వారా తెలుపబడినట్లుగా మన రాష్ట్ర ప్రభుత్వ నిర్మాణం ఇతర రాష్ట్రాల మాదిరిగానే ఉంటుంది. అందుకే యూనిట్-18 లోని రాష్ట్ర పరిపాలనా వ్యవస్థను చదవండి.

## 15.11 ముగింపు (ముఖ్యాంశాలు)

- భూమధ్య రేఖ, కర్కట రేఖల మధ్య ఉష్ణ మండల ప్రాంతంలో తెలంగాణ ఉంది.
- రైతులకు పెట్టుబడి సహాయం అందించేందుకు రైతు బంధు పథకాన్ని అమలు చేస్తున్నారు.
- ఆహార భద్రత, ఆసరా పింఛన్లు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, కంటి వెలుగు, కేసీఆర్ కిట్లు, ఆరోగ్య లక్ష్మి, పౌష్టికాహారం లాంటి పథకాలు రాష్ట్రంలో మానవ వనరులను పెంపొందిస్తున్నాయి.
- తెలంగాణ రాష్ట్రంలో పారిశ్రామిక అనుమతులను 15 దినాలలో ఇవ్వడానికి 'ఏక గవాక్ష పద్ధతి'ని ప్రవేశపెట్టింది.
- ఇతర రాష్ట్రాల నుండి, ఇతర దేశాల నుండి పెట్టుబడులను ఆకర్షించి పారిశ్రామిక ప్రగతిని సాధించడానికి నూతన పారిశ్రామిక విధానాన్ని ప్రవేశపెట్టింది.

- ప్రపంచంలో ఐ.టి. ఆధారిత సేవలకు సంబంధించిన అతి పెద్ద ప్రపంచ గమ్యస్థానాలలో హైదరాబాద్ ఒకటి.
- వ్యవసాయ రంగానికి, పారిశ్రామిక రంగానికి అవసరమైన నీటిని అందించడానికి రాష్ట్రంలో అనేక కొత్త నీటి పారుదల పథకాలు, పాత నీటి పారుదల పథకాల నవీనీకరణ జరుగుతున్నది.
- వెనుకబడిన తరగతుల వారికి ఆదాయాన్ని సృష్టించే ఆర్థిక సహాయ పథకాలను ప్రవేశపెట్టింది.
- తెలంగాణ రాష్ట్రంలో సామాజిక భాగస్వామ్యంతో వికేంద్రీకరణ నమూనాలో 'మిషన్ కాకతీయ' పథకాన్ని చిన్న తరహా సాగు నీటి వనరుల పునరుద్ధరణ కోసం చేపట్టింది.

## 15.12 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. కింది ప్రశ్నలకు 1-2 వాక్యాల చొప్పున సమాధానాలు రాయండి.**

1. ఆర్థిక సహాయ పథకాల ముఖ్య లక్ష్యం ఏమిటి?
2. తెలంగాణలో ప్రతి ఇంటికి రక్షిత మంచి నీటిని అందించాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పథకం ఏది?

**II. కింది ప్రశ్నలకు 4-5 వాక్యాల చొప్పున సమాధానాలు రాయండి.**

1. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను వివరించండి.
2. ప్రజా పంపిణీ వ్యవస్థ గురించి విశదీకరించండి.

**III. కింది ప్రశ్నలకు 8-10 వాక్యాల చొప్పున సమాధానాలు రాయండి.**

1. తెలంగాణలో చేపట్టిన వివిధ సంక్షేమ పథకాలను వివరించండి.
2. తెలంగాణ రాష్ట్రంలో పారిశ్రామిక రంగంలో వచ్చిన మార్పులు ఎట్టివి?
3. తెలంగాణలో వ్యవసాయదారులకు చేయూతను ఇవ్వడానికి ప్రవేశపెట్టిన పథకాలను విపులీకరించండి.
4. అవస్థాపనా సౌకర్యాల కల్పనకు తెలంగాణలో చేపట్టిన చర్యలను విశ్లేషించండి.

**IV. కింది వాటిలో సరైన సమాధానాలను ఎంపిక చేయండి.**

1. స్పర్శకు అందని ఉత్పత్తులను ఇచ్చే రంగం ( )

   ఎ) పారిశ్రామిక రంగం బి) వ్యవసాయ రంగం సి) సేవల రంగం డి) ప్రాథమిక రంగం

2. ఆర్థిక (భౌతిక) మౌలిక సదుపాయాల క్రిందికి రానిది ( )

   ఎ) విద్యుత్తు బి) దేవస్థానాలు సి) రవాణా డి) పాఠశాలలు

## 15.13 ఉపయుక్త గ్రంథాలు


1. ఇంటర్మీడియట్ రెండవ సంవత్సర 'అర్థశాస్త్రం', తెలుగు అకాడమి, హైదరాబాద్, 2020.
2. Socio Economic Outlook-2020, Planning Department, Govt. of Telangana
3. తెలంగాణ సామాజిక ఆర్థిక చిత్రం-2015, తెలంగాణ ప్రభుత్వం

# 16 భారత రాజ్యాంగం -ప్రవేశిక

## 16.0 అభ్యసన ఫలితాలు

- భారత రాజ్యాంగం ఏ విధంగా ప్రాథమిక చట్టంగా వ్యవహరిస్తుందో వివరిస్తారు.
- రాజ్యాంగం యొక్క విలువలను గ్రహించి పాటిస్తారు.
- రాజ్యాంగ ముసాయిదా కమిటీ గురించి వివరిస్తారు.
- భారత రాజ్యాంగ లక్ష్యాలను వివరిస్తారు.

## 16.1 పరిచయం


రాజ్యాంగం ప్రకారం దేశంలో వివిధ కార్యాలయాలు, అధికారులు, సంస్థలు ఏర్పడి విధులు నిర్వర్తించడం జరుగుతుంది. మన రాజ్యాంగం అన్నింటికంటే ముఖ్యంగా రాజకీయ విధానంలో అన్ని అంశాల గురించి మరియు పాటించవలసిన విలువలు, విధి విధానాల గురించి వివరిస్తుంది. ఈ విలువలు ప్రభుత్వాన్నే కాక దేశ పౌరులకు సమాజాలకు కూడా మార్గదర్శకంగా ఉంటాయి. భారత రాజ్యాంగం యొక్క విలువలు, దాని స్వరూపం, సమాఖ్య రాజ్యం, పార్లమెంటరీ ప్రభుత్వం వంటివి చర్చించడం జరిగింది.

## 16.2 భారత రాజ్యాంగం

రాజ్యాంగం గురించి చర్చ మొదలు పెట్టేముందు మొదటగా మనం రాజ్యాంగం అన్న పదం యొక్క అర్థం తెలుసుకుందాం.

### 16.2.1 రాజ్యాంగం అర్థ వివరణ

రాజ్యాంగం అంటే లిఖించబడిన నియమావళి. రాజ్యాంగం అంటే ప్రాథమిక సూత్రాలు, నియమాలు మరియు పూర్వం జరిగిన ముఖ్య విషయాల క్రమబద్ధీకరణ, ఇది రాష్ట్రం/ దేశం యొక్క వివిధ అంశాలను గుర్తించి, వివరించి మరియు క్రమబద్ధం చేయడమే కాక దేశంలోని మూడు ప్రధాన సంస్థలైన చట్టం, న్యాయ మరియు ప్రభుత్వాల యొక్క నిర్మాణాలను, అధికారాలను, విధులను నిర్ణయిస్తుంది. అంతేకాక దేశ పౌరుల స్వేచ్ఛను, విధులను, హక్కులను తెలుపుతూ పౌరులకు ప్రభుత్వానికి మధ్య గల సంబంధాన్ని తెలుపుతుంది.




చిత్రం-16.1: రాజ్యాంగం

ఒక రాజ్యాంగంలో ఆ రాజ్యానికి సంబంధించిన ప్రాథమిక నియమాలు, చట్టాలు ఉంటాయి. ఇది అత్యున్నతమైనది మరియు తిరుగులేనిది. ఏ నిర్ణయం కాని, చర్యకాని రాజ్యాంగం ప్రకారం లేకపోతే అది రాజ్యాంగబద్ధమైనదిగా భావింపబడదు. అది చట్ట వ్యతిరేకమైనదిగా భావింపబడుతుంది. ప్రభుత్వం యొక్క అధికారం దుర్వినియోగం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం యొక్క అధికారానికి హద్దులను నిర్ణయిస్తుంది. ఇది స్థిరమైనది కాదు. దీనిని కాలానుగుణంగాను, అవసరాన్ని బట్టి కూడా మార్చుకోవడానికి వీలు ఉంటుంది. కనుక దీన్ని సజీవమైనదిగా చెప్పవచ్చును.

**మీకు తెలుసా?**

1942లో క్రిప్స్ రాయబారం రాజ్యాంగం పరిషత్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. అనంతరం 1946లో కేబినెట్ కమిటీ సిఫార్సుల మేరకు రాజ్యాంగ పరిషత్ ఏర్పాటైంది.

### 16.2.2 భారత రాజ్యాంగం - ముసాయిదా

మన రాజ్యాంగం 1950 వ సంవత్సరం జనవరి 26 వ తేదీన అమలులోనికి వచ్చింది. అప్పటి నుండి మనం ప్రతి సంవత్సరం జనవరి 26 వ తేదీన 'గణతంత్ర దినోత్సవం'గా జరుపుకుంటారు. భారత రాజ్యాంగం భారతీయ రాజకీయ విధానాలకు సంబంధించిన అన్ని అంశాలను, వాటి లక్ష్యాలను విధులను నిర్దేశిస్తుంది, దీనిలో

ఎ) భారతదేశ సరిహద్దులు

బి) పౌరసత్వం

సి) ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులు

డి) రాజ్యం యొక్క మార్గదర్శక సూత్రాలు

ఇ) కేంద్ర పాలిత ప్రాంతాల, కేంద్రం, రాష్ట్రాల యొక్క స్థానిక సంస్థల యొక్క స్వరూపం, విధులు

ఎఫ్) రాజకీయ విధానం వంటి అనేక అంశాల గూర్చి ప్రస్తావిస్తుంది. ఇది మన దేశ సర్వస్వతంత్ర, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా వర్ణించింది. ఇది పౌరుడికి రాజ్యానికి మధ్య సంబంధాన్ని తెలుపుతుంది. అంతేకాక సామాజిక మార్పు తెచ్చేందుకు అనువుగా కూడా ఉంది.

**మీ ప్రగతిని పరీక్షించుకోండి**

1. రాజ్యాంగం అనగానేమి?

## 16.3 రాజ్యాంగ పరిషత్

### 16.3.1 రాజ్యాంగ పరిషత్ సభ్యుల ఎన్నిక

రాజ్యాంగ పరిషత్ తమను తాము పరిపాలించుకోవడానికి, తమకు దీర్ఘ కాల లక్ష్యాలు నిర్దేశించుకోవడానికి భారత ప్రజల కోసం కొత్త రాజ్యాంగం రూపొందించడానికి ఏర్పడింది. రాజ్యాంగ పరిషత్ సభ్యులను రాష్ట్ర శాసన

సభలు నైష్పత్తిక ప్రాతినిధ్య ఓటు బదలాయింపు పద్ధతిలో ఎన్నుకున్నారు. రాజ్యాంగ పరిషత్‌లో మొత్తం సభ్యులు 389. అందులో బ్రిటిష్ రాష్ట్రాల నుండి 292 మంది, రాజుల సంస్థానాల నుండి 93 మంది, చీఫ్ కమిషనర్ ప్రాంతాలైన ఢిల్లీ, అజ్మీర్ మరియు మేవార్, కూర్గ్ మరియు బ్రిటిష్ బలుచిస్తాన్ నుండి నలుగురు సభ్యులు ఎన్నికయ్యారు.

ఇందులో బ్రిటీష్ పాలనలో ఉన్న రాష్ట్రాల నుండి 296 సభ్యుల ఎన్నిక ఆగష్టు 1946 నాటికి పూర్తయింది. ఇందులో కాంగ్రెస్ 208 స్థానాలు, ముస్లిం లీగ్ 73 స్థానాలు గెలుపొందాయి. ఈ ఎన్నికల తర్వాత ముస్లిం లీగ్ పార్టీ కాంగ్రెస్‌తో సహకరించడానికి నిరాకరించడంతో రాజకీయ అనిశ్చితి కొనసాగింది. ముస్లిం లీగ్ భారతదేశంలో ఉన్న ముస్లింల కోసం ప్రత్యేక రాజ్యాంగ పరిషత్‌ను డిమాండ్ చేసింది. భారతదేశ చిట్ట చివరి బ్రిటీష్ గవర్నర్ జనరల్ అయిన మౌంట్ బాటన్ కేబినెట్ మిషన్ ప్లాన్‌ను రద్దు చేయాలని జూన్ 3, 1947న నిర్ణయించాడు. ఇదే విషయాన్ని భారత స్వాతంత్ర్య చట్టం-1947లో పొందుపరిచారు. ఈ చట్టాన్ని అనుసరించి భారత్ మరియు పాకిస్తాన్ అనే రెండు ప్రత్యేక దేశాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. భారత స్వాతంత్ర్య చట్టం-1947ను జూలై 1947 న ఆమోదించారు. దీనితో భారతదేశం ఆగష్టు 15, 1947న స్వాతంత్ర్యం పొందింది. డిసెంబర్ 9, 1946 న రాజ్యాంగ పరిషత్ మొట్ట మొదటిసారిగా సమావేశమైంది. ఆగష్టు 14, 1947న మరొకసారి సమావేశమై బ్రిటిష్ పార్లమెంట్ స్థానంలో భారత పార్లమెంట్ గా రాజ్యాంగ పరిషత్ భర్తీ అయింది.

మౌంట్ బాటన్ ప్రణాళికను అనుసరించి దేశ విభజన జరిగి జూన్ 3, 1947 న పాకిస్తాన్ కు ప్రత్యేక రాజ్యాంగ పరిషత్‌ను ఏర్పరిచారు. పాకిస్తాన్ ప్రాంతం నుండి ఎన్నికైన రాజ్యాంగ సభ్యులు పాకిస్థాన్ రాజ్యాంగ పరిషత్ సభ్యులుగా కొనసాగారు.

భారత రాజ్యాంగ పరిషత్తులో పశ్చిమ పంజాబ్ మరియు తూర్పు బెంగాల్ నుండి సభ్యుల ఎన్నిక కోసం ఎన్నికలు నిర్వహించారు. పునర్ వ్యవస్థీకరించబడిన భారత రాజ్యాంగ పరిషత్ సభ్యుల సంఖ్య 299గా మారింది. రాజ్యాంగ పరిషత్ సభ్యులు మూడు సంవత్సరాల (ఖచ్చితంగా 2 సం.11 నెలల 18 రోజులు) కాల వ్యవధిలో 114 రోజులు సమావేశమై వివిధ అంశాలను చర్చించి రాజ్యాంగంలో పొందుపర్చాల్సిన అంశాలను ప్రతిపాదించారు.


**మీకు తెలుసా?**

రాజ్యాంగ పరిషత్ మొదటి సమావేశం 1946, డిసెంబర్ 9న ఢిల్లీలోని పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో జరిగింది. మొదటి సమావేశానికి 211 మంది (9మంది మహిళా సభ్యులతో సహా) సభ్యులు హాజరయ్యారు. ఈ సమావేశం డిసెంబర్ 12 వరకు కొనసాగింది. సమావేశం తొలి రోజున (డిసెంబర్ 9న) డాక్టర్ సచ్చిదానంద సిన్హాను రాజ్యాంగ పరిషత్ తాత్కాలిక అధ్యక్షుడిగా, ఫ్రాంక్ ఆంథోనిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.

1946 డిసెంబర్ 11న డాక్టర్ ఆర్. రాజేంద్రప్రసాద్‌ను రాజ్యాంగ పరిషత్ శాశ్వత అధ్యక్షుడిగా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

### 16.3.2 రాజ్యాంగ ముసాయిదా కమిటీ

రాజ్యాంగ పరిషత్‌లో ఉన్న అన్ని కమిటీలు కన్నా రాజ్యాంగ ముసాయిదా కమిటీ ముఖ్యమైనది. దీనిని రాజ్యాంగ పరిషత్ ఆగష్టు 29, 1947న ఏర్పరించింది. నూతన రాజ్యాంగాన్ని రచించే బాధ్యతను ఈ కమిటీకి అప్పగించారు. రాజ్యాంగ ముసాయిదా కమిటీలో ఏడుగురు సభ్యులు ఉన్నారు. రాజ్యాంగ ముసాయిదా కమిటీ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌ను ఛైర్మన్‌గా నియమించారు.


*చిత్రం-16.2: రాజ్యాంగ ముసాయిదా కమిటీ*

1. డా॥ బి.ఆర్. అంబేద్కర్ (ఛైర్మన్)
2. ఎన్.గోపాలస్వామి అయ్యంగార్
3. అల్లాడి కృష్ణస్వామి అయ్యర్
4. డాక్టర్ కె.ఎం.మున్షీ
5. సయ్యద్ మహమ్మద్ సాదుల్లా
6. ఎన్ మాధవరావు (B.L. మిట్టల్ అనారోగ్య కారణంగా రాజీనామా చేయడంతో ఆ స్థానంలో సభ్యునిగా వచ్చారు)
7. టి.టి. కృష్ణమాచారి (D.P. ఖైతాన్ మరణించడంతో ఆ స్థానంలో వచ్చారు).

**మీకు తెలుసా?**

అంతర్జాతీయ న్యాయవాది. బెనగల్ నరసింగరావును రాజ్యాంగ పరిషత్ ముఖ్య సలహాదారుగా నియమించారు. ఆయన బర్మా ప్రస్తుత మయన్మార్ రాజ్యాంగ రచనలో కూడా పాల్గొన్నారు.

### 16.4 భారత రాజ్యాంగం - ప్రవేశిక

ఏ దేశం యొక్క రాజ్యాంగమైన కొన్ని నిర్దిష్ట లక్ష్యాలను కలిగి ఉంటుంది. రాజ్యాంగంలో పొందుపర్చిన ఆశయాలే ఆ దేశంలో ప్రజలు నివసించాలని కోరుకోవడానికి ఆధారంగా ఉంటాయి.

వివిధ రకాల నమ్మకాలు / విశ్వాసాలు కలిగిన ప్రజలను కలిగి ఉన్న సమాజాలచే నిండి ఉన్నదే దేశం. అందరికి ఆమోదయోగ్యమైన సూత్రాలు, నియమాలు, విధానాలను రాజ్యాంగం సమకూరుస్తుంది. వీటి ఆధారంగానే ఆ దేశంలోని సమాజాలు మరియు ప్రభుత్వం నడుచుకుంటాయి. ఇది దేశం యొక్క ఆశయాలను నిర్దేశించడమే కాక దేశంలో ఏ రకమైన ప్రభుత్వం ఉండాలన్నది కూడా నిర్ణయిస్తుంది.

భారత రాజ్యాంగ ప్రవేశిక భారత ప్రజల ఆకాంక్షలను తెలియజేస్తుంది. అందుకే ప్రవేశికలో మన రాజ్యాంగాన్ని 'మనకు మేమే ఇచ్చుకున్నాం' అని పేర్కొనడం జరిగింది. రాజ్యాంగ ప్రవేశికను పరిశీలించండి. రాజ్యాంగ విలువలను గుర్తించండి.

### 16.4.1 ప్రవేశిక

**భారతదేశ ప్రజలమైన మేము**
**భారతదేశాన్ని సర్వసత్తాక,**
**సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య,**
**గణతంత్ర రాజ్యంగా**
**నిర్మించుకోవడానికి; ఈ**
**పౌరులందరికీ సాంఘిక, ఆర్థిక,**
**రాజకీయ న్యాయాన్ని; ఆలోచన,**
**భావప్రకటన, విశ్వాసం, ధర్మం**
**ఆరాధనలలో స్వాతంత్ర్యాన్ని;**
**అంతస్తుల్లోను, అవకాశాల్లోను**
**సమానత్వాన్ని; చేకూర్చుటకు;**
**వారందరిలో వ్యక్తి గౌరవాన్ని,**
**జాతీయ సమైక్యతను సంరక్షిస్తూ**
**సౌభ్రాతృత్వాన్ని;**
**పెంపొందించడానికి; 1949**
**నవంబర్, 26న మన రాజ్యాంగ**
**పరిషత్తులో ఎంపిక చేసికొని**
**శాసనంగా రూపొందించుకున్న ఈ**
**రాజ్యాంగాన్ని మాకు మేమే**
**ఇచ్చుకున్నాం.**

Subs. by the constitution [Forty-second Amendment] Act, 1976, Sec.2, for "Sovereign Democratic Republic" (w.e.f. 3.1.1977)

Subs. by the constitution [Forty-second Amendment] Act, 1976, Sec.2, for "Unity of the Nation" (w.e.f. 3.1.1977)

### 16.4.2 రాజ్యాంగ ప్రవేశిక – విలువలు

భారత రాజ్యాంగం మొదటి పేజీలలో వ్రాయబడిన ప్రవేశికను ఎప్పుడైనా చదివారా? రాజ్యాంగ విలువలకు ప్రవేశికలో మాత్రం ప్రాథమిక విలువలు మరియు రాజ్యాంగానికి మూలాధారంగా ఉన్నతత్వం గురించి చర్చిస్తుంది. అంతేకాక ఏ రాజ్యాంగం యొక్క ప్రవేశిక అయినా ఆ గ్రంథంలో పొందుపరచబడిన సారాంశంగా ఉంటుంది. కనుక భారత రాజ్యాంగం యొక్క ప్రవేశిక కూడా అదే విధంగా ఉంటుంది. ప్రవేశికలో తెల్పిన విలువలే రాజ్యాంగం యొక్క లక్ష్యాలుగా తెలుపబడ్డాయి. అవి: సార్వభౌమాధికారం, సామ్యవాదం, లౌకికవాదం, ప్రజాస్వామ్యం, గణతంత్ర రాజ్యం, న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, ఐకమత్యం, సరళత, సౌశీల్యం మొదలగునవి. వీటి గురించి వివరంగా తెలుసుకుందాం.

**1. సార్వభౌమత్వం**

రాజ్యాంగం యొక్క ప్రవేశిక మన దేశాన్ని సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా వర్ణించింది. సార్వభౌమత్వం అనగా సంపూర్ణ అధికారం. రాజకీయంగా సంపూర్ణ స్వేచ్ఛ కలిగి ఉండటం. అనగా భారతదేశం అంతర్గతంగా బలమైనది. మరియు బహిర్గతంగా స్వేచ్ఛగా ఉన్నది. మన దేశం యొక్క అధికారాన్ని సవాలు చేసే హక్కు ఇతర దేశాలకు కానీ వ్యక్తులకు కానీ లేదు. ఇది అంతర్జాతీయంగా మన దేశాన్ని ఒక జాతిగా గర్వంగా ఉండేలా చేస్తుంది. రాజ్యాంగ ప్రవేశికలో చెప్పబడిన భారతీయులైన మనం అనే అంశం దేశ సార్వభౌమత్వం దేశ ప్రజల చేతుల్లో ఉందని తెలుపుతుంది. అనగా ప్రభుత్వ విభాగాలు మరియు రాజ్యాంగ పరంగా అధికారాలు తమ అధికారాన్ని ప్రజల నుండి పొందుతారు.

## 2. సామ్యవాదం

భారత సమాజంలో అనాదిగా సాంఘిక మరియు ఆర్థిక అసమానతలు అంతర్లీనంగా ఉన్నాయి. కనుక ఈ అసమానతలను తొలగించడానికి, ఈ సమాజంలో మార్పు తేవడానికి సామ్యవాదాన్ని మన రాజ్యాంగ విలువగా చేశారు. అన్ని రంగాలలోను ఆశించిన సామాజిక అభివృద్ధి జరిగేలాగా ప్రభుత్వాన్ని ప్రజలను మార్గదర్శకత్వం చేస్తోంది. దేశంలో ధనం, అధికారం కొంత మంది చేతిలో ఉండకుండా అడ్డుకుంటుంది.

## 3. లౌకిక వాదం

ప్రపంచంలోని దాదాపు అన్ని మతాలకు భారత దేశము ఇల్లు లాంటిది. లౌకికవాదం అనగా మన దేశం ఏదో ఒక మతం లేదా మత సిద్ధాంతాల వలన నడుపబడదు. అన్ని మతాలకు సమాన విలువ ఉంటుంది. కాని ఏ మతానికి వ్యతిరేకం కాదు. దేశ పౌరులందరికీ ఏ మతం అయినా స్వీకరించి ఆచరించేందుకు హక్కు కలిగిస్తుంది. మతపరంగా భేద భావం చూపించడం రాజ్యాంగ విరుద్ధంగా భావింపబడుతుంది.

## 4. ప్రజాస్వామ్యం

రాజ్యాంగం యొక్క ప్రవేశిక ప్రజాస్వామ్యాన్ని ఒక విలువగా అభివర్ణించింది. ప్రజాస్వామ్య ప్రభుత్వం తన అధికారాన్ని ప్రజల నుండి పొందుతుంది. ప్రజలు పాలకులను ఎన్నుకుంటారు. పాలకులు ప్రజలకు జవాబుదారిగా ఉంటారు. సార్వత్రిక వయోజన ఓటు లేదా ఒక మనిషి ఒక ఓటు విధానంలో ప్రజలు ప్రభుత్వంలోని వివిధ స్థాయిల్లోని పాలకులను ఎన్నుకుంటారు. సమాజం యొక్క నిరంతర అభివృద్ధికి, స్థిరత్వానికి మరియు రాజకీయ మార్పు ప్రభుత్వాల మార్పు శాంతియుతంగా జరగడానికి ప్రజాస్వామ్యం ఉపయోగపడుతుంది. అంతే కాక భిన్న అభిప్రాయాలను కలిగి ఉండటాన్ని, సహనాన్ని ఉత్తేజపరుస్తుంది.

## 5. గణతంత్రం

భారతదేశం ప్రజాస్వామ్య దేశమే కాక గణతంత్ర రాజ్యం కూడా. గణతంత్రమనగా దేశ నాయకుడు (రాజరికం లాగా కాకుండా) వారసత్వంగా వచ్చిన వాడిగా కాక ప్రజలచే ఎన్నుకోబడిన వాడుగా ఉండటం. దీంతో దేశంలోని ప్రతి పౌరుడికి కూడా దేశ నాయకుడయ్యే అయ్యే అవకాశం కలిగి ఉండడం. రాజకీయ సమన్యాయం అనునది గణతంత్ర దేశం యొక్క ముఖ్య లక్షణం.

## 6. న్యాయం

ప్రజాస్వామ్య దేశంలో ప్రజలందరికీ సమ న్యాయం జరిగిందని చెప్పలేం. ఇప్పటికీ ఎంతో మందికి ఆర్థిక, సామాజిక మరియు రాజకీయ పరంగా అన్యాయం జరగడం మనం గమనిస్తూనే ఉంటాం. అందువల్లనే మన రాజ్యాంగ కర్తలు సామాజిక, రాజకీయ, ఆర్థిక పర సమన్యాయాన్ని రాజ్యాంగ విలువలుగా పొందుపర్చారు. సామాజిక ఆర్థిక సమన్యాయం ఆధారంగా కొత్త సామాజిక క్రమాన్ని ఏర్పాటు చేయడంలో పౌరులకు ఇవ్వబడిన

రాజకీయ స్వేచ్ఛ ఉపయోగపడుతుందని రాజ్యాంగ కర్తలు భావించారు. ఈ సమసమాజవాదం భారత రాజ్యాంగం యొక్క ముఖ్య లక్షణంగా భావింపబడుతుంది.

**7. స్వేచ్ఛ**

రాజ్యాంగం యొక్క ప్రవేశిక పౌరుల యొక్క ఆలోచన, వ్యక్తీకరణ వ్యక్తపరచుట. నమ్మకం, విశ్వాసం మరియు పూజించడం మొదలగు అంశాలలో స్వేచ్ఛను ముఖ్యమైన విలువగా నిర్దేశించింది. ఇవి లేనిదే ప్రజాస్వామ్యం మనుగడ సాధించలేదు.

**8. సమానత్వం**

రాజ్యాంగంలోని ఇతర విలువ లాగే సమానత్వం కూడా చాలా ముఖ్యమైనది. ప్రతి పౌరుడి యొక్క మనుగడకు, అభివృద్ధికి వీలు కలిగించేట్లుగా వారికి సమాన ప్రతిపత్తి మరియు సమాన అవకాశాలు రాజ్యాంగం కల్పించింది. దేశంలో ఒక మనిషిగా హుందాగా ఆనందంగా జీవించడానికి భంగం కలిగించే అసమానతలను మన రాజ్యాంగంలో నిషేధించబడినవి. కనుక సమానత్వం అనేది ఒక ముఖ్యమైన రాజ్యాంగ విలువ ఉన్నది.

**9. సౌభ్రాతృత్వం**

దేశ పౌరులందరూ అన్నదమ్ములా మెలగాలన్న స్ఫూర్తి మన రాజ్యాంగంలో పొందుపరచబడినది. ఈ సోదరభావం లేకపోతే బహుళ వర్ణ సమాజమైనా మన దేశం ముక్కలుగా విడిపోయేది. కనుక స్వేచ్ఛ, సమానత్వం మరియు న్యాయం వంటి ఆదర్శాలను నిలుపుకోవాలంటే సౌభ్రాతృత్వం తప్పనిసరి. కుల, మత ప్రాంత వర్గ అసమానతలను తొలగించడం ద్వారా సౌభ్రాతృత్వాన్ని పెంపొందించి తద్వారా దేశంలో ఐకమత్యాన్ని పెంచవచ్చు.

**10. వ్యక్తిగత గౌరవం**

వ్యక్తిగత గౌరవాన్ని ప్రతి వ్యక్తి పొందాలంటే సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడం తప్పనిసరి. ప్రజాస్వామ్య విధానంలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం తప్పనిసరి. కనుక పౌరుల వ్యక్తిగత గౌరవం లేనిదే ప్రజాస్వామ్యం విజయవంతం కాదు.

**11. దేశం యొక్క సరళత మరియు ఐకమత్యం**

దేశం యొక్క స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కాపాడాలంటే ఐకమత్యం తప్పనిసరి. సౌభ్రాతృత్వం అనే విలువ దేశ ఐకమత్యాన్ని కాపాడుతుంది. దేశ పౌరులు అందరూ ఐక్యమత్యాన్ని కాపాడడానికి ఉద్యుక్తులై ఉండాలని, దీనిని తమ విధిగా భావించాలని రాజ్యాంగం చెబుతోంది.

**12. ప్రాథమిక విధులు**

మన రాజ్యాంగం పౌరులు నిర్వర్తించవలసిన కొన్ని ప్రాథమిక విధులను నిర్దేశిస్తోంది. ఇవి ప్రాథమిక హక్కుల లాగా తప్పనిసరిగా పాటించవలసినవి కావు. కాని పౌరులు స్వచ్ఛందంగా పాటించవలసినది. ప్రాథమిక హక్కుల కంటే ప్రాథమిక విధులు గొప్పవి. ఎందుకంటే, దేశభక్తి, జాతీయత, సమానత్వము, మానవత్వం, ఐక్యమత్యంతో నివసించడం, లింగ వివక్షత చూపించకపోవడం, శాస్త్రీయ దృష్టి మరియు ఆలోచన, వ్యక్తిగత మరియు సమూహ ప్రాశస్త్యం వంటి విలువలను ప్రాథమిక విధులు అలవరుస్తాయి.

**మీకు తెలుసా?**

భారత రాజ్యాంగం 1950, జనవరి 26 నుంచి అమల్లోకి వచ్చింది. ఆ రోజునే గణతంత్ర దినోత్సవంగా నిర్వహిస్తారు. జనవరి 26ను రాజ్యాంగ అమలు తేదీగా నిర్ణయించడం వెనుక చారిత్రక నేపథ్యం ఉంది. నెహ్రూ అధ్యక్షతన లాహోర్‌లో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశం (1929, డిసెంబర్ 31) జనవరి 26ను పూర్ణ స్వరాజ్య దినోత్సవంగా ప్రకటించింది. ఆ సంఘటనకు గుర్తుగా జనవరి 26ను రాజ్యాంగ అమలు తేదీగా నిర్ణయించారు.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. రాజ్యాంగ ప్రవేశికలో పొందుపర్చబడిన ఏవైనా రెండు విలువలను పేర్కొని, అవి ఎందుకు ముఖ్యమైనవో వివరించండి.

## 16.5 రాజ్యాంగంలోని కొన్ని ముఖ్యాంశాలు

రాజ్యాంగ మౌళిక స్వరూపంలో కొన్ని ముఖ్యమైన అంశాలు ఉన్నాయి. వాటి గురించి వివరంగా తెలుసుకుందాం.

**లిఖిత రాజ్యాంగం**

ఇంతకు ముందు చెప్పినట్టు భారత రాజ్యాంగం ప్రపంచంలో అతి పెద్ద లిఖిత రాజ్యాంగం. దీనిలో 22 భాగాలు, 395 అధికరణలు, 12 షెడ్యూల్స్ మరియు 5 భాగాలు ఉన్నాయి.

ఇది రాజకీయ విధానాన్ని వివరించే ప్రాథమిక చట్టాలు, ప్రభుత్వంలోని వివిధ భాగాలు వాటి విధివిధానాలు తెలిపే ఒక పుస్తకం. ఇది ప్రజాస్వామ్య దేశంగా, భారతదేశం యొక్క భవిష్యత్తును తెలుపుతుంది. అంతే కాకుండా పౌరులకు ప్రాథమిక హక్కులను, విధులను నిర్దేశిస్తుంది.

**దృఢ మరియు అదృఢ సమ్మేళనం**

భారత రాజ్యాంగం అమెరికా రాజ్యాంగం లాగ దృఢమైనది కాదు. అలాగే బ్రిటిష్ రాజ్యాంగం లాగ అదృఢమైనది కాదు. ఇది నిరంతరమైనది. మార్పులకు అనువైనదిగా ఉంటుంది. రాజ్యాంగ సవరణలు చేయడానికి 3 మార్గాలు ఉన్నాయి. అవి: 1) పార్లమెంట్‌లో సాధారణ మెజారిటీ అభిప్రాయం ప్రకారం 2) పార్లమెంట్‌లో ప్రత్యేక మెజారిటీ అభిప్రాయం ప్రకారం 3) పార్లమెంట్‌తో పాటు రాష్ట్రాల మెజారిటీ అభిప్రాయం ప్రకారం రాజ్యాంగ సవరణలు చేయబడతాయి.

**ప్రాథమిక హక్కులు మరియు విధులు**

రాజ్యాంగం ప్రతి పౌరుడికి కొన్ని హక్కులను కల్పించడం ద్వారా దేశం నుండి ఇతర వ్యక్తుల నుండి కాపాడతాయి. అదే విధంగా పౌరులకు ప్రాథమిక విధులు కూడా 42వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా 51A ప్రకరణ చేర్చడం జరిగింది. ప్రాథమిక హక్కులు, విధుల గురించి ప్రాథమిక హక్కులు, విధులు అనే పాఠంలో విపులంగా తెలుసుకుంటారు.

**ఆదేశిక సూత్రాలు**

ప్రాథమిక హక్కులతో పాటు రాజ్యాంగంలో మార్గదర్శక సూత్రాలు గురించిన విభాగం కూడా ఉంది. ఈ మార్గదర్శక సూత్రాలు దేశానికి విధానాలను / చట్టాలు అమలు చేసేందుకు తద్వార సాంఘిక, ఆర్థిక సంస్కరణలు చేపట్టేందుకు, పేదరికం మరియు సాంఘిక అసమానతలు తొలగించేందుకు సహాయపడతాయి. ఈ మార్గదర్శక సూత్రాలు భారతదేశాన్ని ఒక సుభిక్షమైన దేశంగా చేసేందుకు ఉద్దేశించబడినాయి.

**సమీకృత మరియు స్వతంత్ర న్యాయ వ్యవస్థ**

సమాఖ్య దేశమైన అమెరికా న్యాయ వ్యవస్థ లాగా కాక భారత న్యాయ వ్యవస్థ ప్రత్యేకమైనది. ఇది సమీకృతమైనది. కేంద్రంలో సుప్రీంకోర్టు, రాష్ట్రంలో హైకోర్టు, జిల్లాలో మరియు దిగువన సబార్డినేట్ కోర్టులు ఒక వరుస క్రమంలో ఉంటాయి. ఈ క్రమంలో సుప్రీంకోర్ట్ అత్యున్నత స్థానంలో ఉంటుంది. ఈ సమీకృత న్యాయ వ్యవస్థ పౌరులందరికీ సమానంగా న్యాయం అందించడం లక్ష్యంగా ఏర్పాటు చేయబడ్డాయి. రాజ్యాంగం న్యాయవ్యవస్థకు స్వతంత్రత కల్పించింది. అనగా ఇది రాజకీయ నాయకులు మరియు అధికారుల ప్రభావానికి లోను కాకుండా అధికారాలు ఇవ్వబడ్డాయి.

**ఏక పౌరసత్వం**

భారత రాజ్యాంగం ఏక పౌరసత్వాన్ని సూచిస్తుంది. ఏక పౌరసత్వం అనగా ప్రతి భారతీయుడు కూడా దేశంలోని ఏ ప్రాంతంలో పుట్టినప్పటికీ భారతీయ పౌరసత్వం కలిగి ఉంటారు. అదే అమెరికాలో అయితే ద్వంద్వ పౌరసత్వం అమల్లో ఉంటుంది. దీని ప్రకారం ఒక పౌరుడు నివసించే ప్రాంతాన్ని బట్టి ఒక పౌరసత్వం మరియు పుట్టిన దేశాన్ని బట్టి రెండవ పౌరసత్వం పొందవచ్చు. భారత పౌరసత్వ విధానం రాజ్యాంగ విలువలైన సమానత్వం, ఐకమత్యం, సమీకృత విధానాలను బలపరుస్తుంది.

**సార్వత్రిక వయోజన ఓటు**

సమానత్వం, సమన్యాయం అనే అంశాలు రాజ్యాంగంలో మరొక నిగూఢ అంశాలుగా సూచించబడ్డాయి. 18 సం. నిండిన ప్రతి వ్యక్తి కూడా జాతి, కుల, మతం, వర్గం, ప్రాంతం, లింగ వివక్షత లేకుండా ఓటు హక్కు కలిగి ఉండడమే సార్వత్రిక వయోజన ఓటు హక్కు.

**సమాఖ్య విధానం మరియు పార్లమెంటరీ ప్రభుత్వం**

భారత రాజ్యాంగం యొక్క మరొక ముఖ్య లక్షణం ఏమనగా ఇది సమాఖ్య విధానానికి మరియు పార్లమెంటరీ విధానానికి అవకాశం కల్పిస్తుంది. సమాఖ్య విధానం దేశం యొక్క ఐకమత్యం, సరళత అను విలువలను తెలుపుతుంది. అంతేకాక అధికార వికేంద్రీకరణ అనే అంశానికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తుంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో శాసన సభకు కీలక స్థానం ఉంటుంది. శాసన సభలకు కార్య నిర్వాహక శాఖ బాధ్యత వహిస్తుంది.



*చిత్రం-16. 3: భారత పార్లమెంటు*

## 16.6 ముగింపు (ముఖ్యాంశాలు)

- ఒక రాజ్యం యొక్క ముఖ్యమైన సంస్థలు/ వ్యక్తులకు సంబంధించిన కార్య నిర్వాహక, శాసన మరియు న్యాయ వ్యవస్థలను గుర్తించి, నిర్వచించి, నియంత్రించేది మరియు నిర్దేశిత సూత్రాలను, నియమాలను సూచించేదే రాజ్యాంగం.
- రాజ్యాంగం ముఖ్యమైన వ్యక్తులకు, సంస్థలకు విధులను నిర్దేశించడమే కాక, దేశ పౌరులకు ఉండే హక్కులను, స్వేచ్ఛను తెలుపుతుంది.
- పౌరుడికి, ప్రభుత్వానికి మధ్య గల సంబంధాన్ని తెలుపుతుంది. ఏ దేశం యొక్క రాజ్యాంగమైనా ఆ దేశానికి సంబంధించి కొన్ని లక్ష్యాలను నిర్దేశిస్తుంది.
- భారతదేశ రాజ్యాంగం ఈ దేశాన్ని సర్వస్వతంత్ర, ప్రజాస్వామ్య, సామ్యవాద, లౌకిక, గణతంత్ర రాజ్యంగా నిర్వచించింది.

## 16.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 1-2 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. భారత రాజ్యాంగం యొక్క ముఖ్య లక్షణాలు ఏవి?
2. ఏక పౌరసత్వం అనగానేమి?

**II. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 4-5 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. భారతదేశ రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలలో సూచించబడిన రాజ్యాంగ విలువలు ఏవి?
2. భారత న్యాయ వ్యవస్థను 'సమీకృత న్యాయ వ్యవస్థ' అని ఎందుకు అంటారు?

**III. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 8-10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. సమాఖ్య విధానం యొక్క ముఖ్య లక్షణాలను వివరించండి.
2. 'భారతదేశం రూపంలో సమాఖ్య, ఆత్మలో ఏక కేంద్రం' అని చెప్పడానికి ఏవైనా రెండు కారణాలను తెలుపుము.

**IV. కింది వాటిలో సరైన జవాబును ఎంపిక చేయండి.**

1. .............. రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మన్ ( )

   ఎ) డా॥ రాజేంద్రప్రసాద్ బి) డా॥బి.ఆర్. అంబేద్కర్

   సి) సర్దార్ వల్లభాయి పటేల్ డి) జవహర్‌లాల్ నెహ్రూ

2. మన దేశంలో ప్రతీ సంవత్సరం జనవరి 26 వ తేదీన ఇలా జరుపుకుంటాం......... ( )

   ఎ) స్వాతంత్ర్య దినోత్సవం బి) న్యాయ దినోత్సవం

   సి) జాతీయ దినోత్సవం డి) గణతంత్ర దినోత్సవం

3. భారతదేశంలో అత్యున్నత న్యాయస్థానం ( )

ఎ) సుప్రీం కోర్టు బి) హైకోర్టు

సి) జిల్లా కోర్టు డి) సెషన్స్ కోర్టు

4. పక్షపాతం, భేద భావాలు లేకుండా అందరిని సమానంగా చూడడం అనే వ్యవస్థ ( )

ఎ) సార్వభౌమత్వం బి) లౌకికవాదం

సి) సామ్యవాదం డి) ప్రజాస్వామ్యం

## 16.8 ఉపయుక్త గ్రంథాలు


- SCERT, Telangana సాంఘికశాస్త్ర పుస్తకాలు

# 17 ప్రాథమిక హక్కులు - విధులు

## 17.0 అభ్యసన ఫలితాలు

- భారత రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రాథమిక హక్కులను వివరిస్తారు.
- ప్రాథమిక హక్కులకు, మానవ హక్కులకు మధ్య ఉన్న తేడాలను చెబుతారు.
- ప్రాథమిక విధుల గురించి వివరిస్తారు.

## 17.1 పరిచయం

ఇటీవల కాలంలో విద్యా హక్కు, సమాచార హక్కు మరియు శాంతియుతంగా నిరసనను వ్యక్తపరిచే హక్కు అనే పదాలు చాలా తరచుగా వాడబడుతున్నాయి. అయితే వీటి గురించిన ప్రస్తావన రాజ్యాంగంలో ఉందా? ఒకసారి పరిశీలిద్దాం. భారత రాజ్యాంగం పౌరులకు సంబంధించిన హక్కులకు భద్రతను కల్పిస్తుంది. అవి 'ప్రాథమిక హక్కులు'గా పేర్కొనబడ్డాయి. వీటితో పాటు ప్రతి పౌరుడు నిర్వర్తించాల్సిన కొన్ని ముఖ్యమైన బాధ్యతలు కూడా భారత రాజ్యాంగంలో పొందుపరచబడినవి. అవే ప్రాథమిక విధులుగా పేర్కొనబడ్డాయి. ఈ పాఠంలో ప్రాథమిక హక్కులు మరియు ప్రాథమిక విధులకు సంబంధించిన విషయాలను చర్చిద్దాం.

## 17.2 హక్కులు మరియు విధులు - అర్థం మరియు ప్రాముఖ్యత

మనం తరచుగా హక్కులను గురించి మాట్లాడుకుంటాం. కాని హక్కుల అర్థం ఏమిటో మనకు తెలుసా? హక్కులు అనేవి వ్యక్తులను అనుసంధానం చేసే నియమ నిబంధనలు. ఇవి రాజ్య, వ్యక్తుల లేక సమూహాల చర్యలపై పరిమితులను, నియంత్రణలను ఉంచుతాయి. ఉదా: అతను లేక ఆమె యొక్క వ్యక్తిగత వికాసం కోసం వ్యక్తులచే కోరబడి రాజ్య, సమాజాల చేత గుర్తించబడిన అవకాశాలే హక్కులు. ఇవి స్వేచ్ఛకు సంబంధించిన చట్టబద్ధమైన, సామాజికపరమైన మరియు నైతిక సూత్రాలతో కూడి ఉన్నవి.

ఎప్పుడైతే వ్యక్తులు తమ విధులను సక్రమంగా నెరవేరుస్తారో, అప్పుడు మాత్రమే హక్కులకు నిజమైన అర్థం ఉంటుంది. విధి అనగా ఒక వ్యక్తి ఇతరులపట్ల నెరవేర్చవలసిన లేదా చేయవలసిన బాధ్యత. ఉదా: తల్లిదండ్రులు తమ బిడ్డల పట్ల శ్రద్ధ తీసికొనవలసిన బాధ్యత ఉంది. అలాగే పిల్లలు కూడా తమ తల్లిదండ్రుల పట్ల శ్రద్ధ వహించవలసిన బాధ్యత ఉంది. ఉపాధ్యాయుడు కూడా విద్యార్థులకు విద్యాబోధన చేయవలసిన బాధ్యత వుంది. వాస్తవంగా హక్కులు మరియు విధులనేవి జీవిత రథాన్ని సాఫీగా ముందుకు తీసికొనిపోయే రెండు చక్రాల్లాంటివి. హక్కులు, విధులు పరస్పర సంబంధం కలిగి ఉన్నట్లయితే మానవ జీవితం ఒడిదుడుకులు లేకుండా ఉంటుంది. హక్కులనేవి ఇతరులు మనకు ఏమి చేయాలని మనం కోరుకొనేవైయుండగా, విధులనేవి

మనం ఇతరుల పట్ల ఏమి చేయవలసి ఉన్నది అని తెలియజేస్తాయి. ఆ విధంగా ఇతరుల హక్కులను గౌరవించే విధంగా హక్కు అనేది ఒక బాధ్యతగా ఉంది. హక్కులతో పాటు కలిసి ఉండే బాధ్యత విధుల రూపంలో ఉన్నాయి. ప్రజా సదుపాయాలైనటువంటి రవాణా లేక ఆరోగ్య సేవలు అనుభవించే హక్కు మనకు ఎంత ముఖ్యమో, ఇతరులు కూడా ఆ విధంగా వాటిని అనుభవించేందుకు మన విధిని నిర్వర్తించవలెను. మనకు స్వేచ్ఛ హక్కు ఉన్నట్లయితే అది దుర్వినియోగపరచబడకుండా మరియు ఇతరులకు హాని కలిగించే విధంగా కాకుండా ఉండేటట్లు మన బాధ్యతలు నెరవేర్చాలి.

**కృత్యం: కింద ఇవ్వబడిన బాక్సులలో మీ కుటుంబం పట్ల, మీ స్నేహితుల పట్ల మరియు ఇతరుల పట్ల మీ హక్కులు, విధులు రాయండి.**

**నా విధులు**

| నా కుటుంబం పట్ల | నా స్నేహితుల పట్ల | నా పొరుగువారి పట్ల |
|---|---|---|
| 1. | 1. | 1. |
| 2. | 2. | 2. |

**నా హక్కులు**

| నా కుటుంబంలో | నా స్నేహితులకి సంబంధించి | నా పొరుగువారికి సంబంధించి |
|---|---|---|
| 1. | 1. | 1. |
| 2. | 2. | 2. |

## 17.3 ప్రాథమిక హక్కులు

ప్రాథమిక హక్కులు భారత రాజ్యాంగంలో, 3వ భాగంలో పొందుపరచబడ్డాయి. రాజ్యాంగం భారత పౌరుల ఆరు ప్రాథమిక హక్కులకు భద్రత కల్పించింది. అవి: 1. సమానత్వపు హక్కు 2. స్వేచ్ఛ-స్వాతంత్ర్యపు హక్కు, 3. పీడనాన్ని నిరోధించే హక్కు, 4. మత స్వాతంత్ర్యపు హక్కు, 5. విద్యా-సాంస్కృతిక విషయాల హక్కు, 6. రాజ్యాంగ పరిరక్షణ హక్కు. ఈ ప్రాథమిక హక్కులు విశ్వజనీనమైనవి అయినప్పటికీ రాజ్యాంగం వీటిపై కొన్ని మినహాయింపులు, పరిమితులను విధించింది.

**ఆలోచించండి**

మీ విధులు మరియు హక్కుల పట్ల తేడాలను గురించి మీరు ఏమి భావిస్తున్నారు? ఈ రెండింటి మధ్య అంతర్గత సంబంధం ఉందని భావిస్తున్నారా? అయితే ఎలా?

### 1. సమానత్వపు హక్కు

భారతదేశం వంటి సమాజంలో సమానత్వపు హక్కు చాలా ప్రధానమైనది. ఈ హక్కు యొక్క ముఖ్య ఉద్దేశం చట్టం ముందు మత, జాతి, కుల, లింగ మరియు జన్మస్థల వివక్ష లేకుండా అందరిని సమానంగా చూడడం.

**i) చట్టం దృష్టిలో అందరూ సమానులే:** చట్టం దృష్టిలో ప్రజలందరూ సమానంగా ఉండేటట్లు రాజ్యాంగం హక్కులకు భద్రత కల్పించింది. చట్టానికి ఎవరు అతీతులుకారు. అనగా ఇద్దరు వ్యక్తులు ఒకే రకమైన నేరానికి పాల్పడితే సంపద మరియు హోదాలతో సంబంధం లేకుండా సమానమైన శిక్ష విధించబడుతుంది.

**ii) మత, జాతి, కుల, లింగ, లేక జన్మస్థల ప్రాతిపదికన వ్యక్తుల మధ్య వివక్ష చూపకుండుట:** రాజ్యం, మతం, జాతి, కుల, లింగ లేక జన్మస్థల ప్రాతిపదికన పౌరుల మధ్య ఎలాంటి వివక్షత చూపించదు. సాంఘిక సమానత్వాన్ని సాధించుటకు ఇది చాలా అవసరం. షాపుల్లోను, రెస్టారెంట్స్‌లోను, సినిమా థియేటర్స్ వద్ద బావులు, చెరువులు లేక రహదారులు వంటి బహిరంగ ప్రదేశాల్లో వివక్షత లేకుండా ప్రతి పౌరునికి సమానమైన అవకాశాన్ని కల్పించింది. అయినప్పటికీ మహిళలకు, చిన్న పిల్లలకు ప్రత్యేక సౌకర్యాలు లేదా మినహాయింపులు ప్రభుత్వం కల్పించవచ్చు.

**ii)) ప్రభుత్వోద్యోగాలు విషయాలలో పౌరులందరికి సమాన అవకాశాలు:** ప్రభుత్వోద్యోగాలను కల్పించే విషయంలో రాజ్యం ఎవరి మధ్య వివక్షత చూపదు, పౌరులందరు ప్రభుత్వోద్యోగాలకు దరఖాస్తు పెట్టుకొని, ప్రభుత్వోద్యోగాలను సంపాదించుకోవచ్చు. ప్రభుత్వోద్యోగం పొందడానికి ప్రతిభ మరియు అర్హతలు ప్రధానము. అయినప్పటికి ఈ హక్కుకు, కొన్ని పరిమితులు కలవు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు మరియు వెనుకబడిన తరగతుల వారికి ప్రత్యేకమైన రిజర్వేషన్ సౌకర్యాలు కల్పించబడనవి.

**iv) అంటరానితనాన్ని నిర్మూలించుట:** అంటరానితనాన్ని ఏ రూపంలోనైనా వ్యక్తులు పాటిస్తే చట్టరీత్యా వారు శిక్షార్హులవుతారు. కుల ప్రాతిపదికన, వృత్తి రీత్యా కించపరచబడేటువంటి లేదా బహిష్కరింపబడేటువంటి ప్రజల యొక్క సామాజిక స్థితిని మెరుగుపరచేందుకు ఈ సదుపాయం కల్పించబడింది.

**v) బిరుదులను నిర్మూలించుట:** బ్రిటీష్ వారి పాలనలో వారికి విధేయులుగా ఉండే వారికి సర్ (నైట్‌హుడ్) లేదా రాయ్ బహదూర్ వంటి బిరుదులు ప్రసాదించబడేవి. కాని రాజ్యాంగం అమలులోకి వచ్చిన తరువాత, వీటివలన వ్యక్తుల మధ్య కృత్రిమమైన అసమానతలు ఏర్పడే అవకాశమున్నందున, భారత ప్రభుత్వం ఈ బిరుదులను నిషేధించింది అయిననూ భారత రాష్ట్రపతి పౌర, సైనిక రంగాలలో విశిష్ట సేవలు అందించిన వారికి కొన్ని అవార్డులను ప్రసాదిస్తారు. పౌర సంబంధమైన అవార్డులలో భారతరత్న, పద్మవిభూషణ్, పద్మభూషణ్ మరియు పద్మశ్రీ వంటివి సైనిక అవార్డులలో వీరచక్ర, పరమవీరచక్ర, అశోకచక్ర వంటివి ఇవ్వబడుతున్నాయి.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. చట్టం దృష్టిలో ప్రజలందరూ సమానమనే పదం యొక్క భావాన్ని అనుసరించి, ప్రజలందరు సమానులుగా ఉన్నారనే దానితో మీరు ఏకీభవిస్తారా? కారణాలు రాయండి.

## 2. స్వేచ్ఛా-స్వాతంత్ర్యపు హక్కు

మానవులకు స్వేచ్ఛ అనేది తప్పనిసరియైనది మరియు అవసరమైనది. మీకు కూడా స్వేచ్ఛ కావాలి. భారత రాజ్యాంగం పౌరులందరికీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల హక్కును కల్పించింది. ఈ హక్కు రాజ్యాంగంలోని 19 నుండి 22 నిబంధనలు మధ్య వివరించబడింది. ఈ కింద ఇవ్వబడిన నాలుగు భాగాలు స్వేచ్ఛ హక్కుకు సంబంధించినవి.

**i) ఆరు ప్రాథమిక స్వాతంత్ర్యాలు:**

రాజ్యాంగంలోని 19వ నిబంధన ఈ క్రింది ఆరు ప్రాథమిక స్వాతంత్ర్యాలను కల్పించింది. అవి:

ఎ) వాక్ స్వాతంత్ర్యం మరియు భావ ప్రకటనా స్వాతంత్ర్యం

బి) ఎటువంటి ఆయుధాలు లేకుండా శాంతియుతంగా సభలు, సమావేశాలు జరుపుకునే స్వాతంత్ర్యం

సి) సంఘాలను, సంస్థలను ఏర్పరచుకొనే స్వాతంత్ర్యం

డి) దేశంలోని వివిధ ప్రాంతాలలో సంచరించే స్వాతంత్ర్యం

ఇ) దేశంలో ఎక్కడైనా స్థిర నివాసాన్ని ఏర్పరచుకొనే స్వాతంత్ర్యం

ఎఫ్) దేశంలో ఏదైనా వృత్తి, ఉద్యోగం, వ్యాపారం, వర్తకాలను నిర్వహించే స్వాతంత్ర్యం

ఈ ఆరు స్వాతంత్ర్యాల ముఖ్య ఉద్దేశం దేశంలో ఒక క్రమబద్ధమైన ప్రజాస్వామ ప్రభుత్వాలు పని చేసేందుకు అవసరమైన వాతావరణాన్ని నెలకొల్పుకొని, నిర్వహించుటే అయినప్పటికీ, ఈ ప్రాథమిక స్వాతంత్ర్యాలపై తగిన పరిమితులను విధించే అధికారాన్ని రాజ్యానికి కల్పించింది.

**ii) నేర నిర్ధారణ విషయంలో రక్షణ:**

రాజ్యాంగంలోని 20వ నిబంధన వ్యక్తులకు నేర శిక్షలకు సంబంధించి రక్షణ కల్పిస్తుంది. ఈ నిబంధన వ్యక్తికి తనకి తానుగా నిర్దోషిగా నిరూపించుకొనే స్వేచ్ఛ కల్పించింది. ఒక వ్యక్తి న్యాయ స్థానంలో నేరస్తునిగా రుజువు కానపుడు అతడు నేరస్తునిగా పరిగణించబడడు. మరియు విచారణ చట్టపరంగా, చట్టపరిధిలోనే జరగాలి తప్ప మరే విధంగా అతన్ని నిర్బంధించరాదు. ఒక నేరానికి సంబంధించి వ్యక్తికి ఒక్కసారి కంటే ఎక్కువసార్లు శిక్ష విధించకూడదు మరియు వ్యక్తిచే బలవంతపు సాక్ష్యం చెప్పించకూడదు

**iii) వ్యక్తి ప్రాణం, స్వేచ్ఛలకు రక్షణ:**

21వ అధికరణలో పొందుపరచినట్లుగా వ్యక్తి యొక్క స్వేచ్ఛకు ప్రాణానికి చట్టరీత్యా హాని కలిగించకూడదు.

**iv) అక్రమ నిర్బంధం నుండి రక్షణ:**

22వ అధికరణ ప్రకారం ఒక వ్యక్తి అరెస్టయిన పక్షంలో, అతనికి సాధ్యమయినంత త్వరలో ఏ కారణం చేత అరెస్టు చేయబడింది తెలియజేయడమే గాక, అతని యొక్క నిర్దోషిత్వాన్ని నిరూపించుకునేందుకు, అతని ఇష్టప్రకారం న్యాయవాదిని కలుసుకోవడానికి మరియు తన పక్షాన వాదించడానికి అనుమతించాలి.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. భారత రాజ్యాంగంలో పొందుపరచబడిన ప్రాథమిక స్వాతంత్ర్యాలు ఏవి?

## 3. పీడనాన్ని నిరోధించే హక్కు

మన సమాజంలో ఎన్ని రకాలయిన పద్ధతుల ద్వారా అణచివేత చోటు చేసుకుంటున్నదని ఎప్పుడైనా ఆలోచించావా? చిన్న పిల్లవాడు టీ దుకాణంలో పని చేయడం లేక నిరక్షరాస్యుడిచేత ఒక ధనికుని ఇంట్లో బలవంతాన పని చేయించడం చూసి ఉండవచ్చు. తరతరాలుగా సాంప్రదాయబద్ధంగా భారత సమాజంలో అనేక రూపాలలో దోపిడీతనం కొనసాగుతూ వచ్చింది.

అందుచేత ఈ దోపిడీతనాన్ని నిర్మూలించేందుకై రాజ్యాంగం కొన్ని నిబంధనలను రూపొందించింది. రాజ్యాంగంలోని 23, 24 ప్రకరణలు వ్యక్తులు దోపిడీకి గురికాకుండా భద్రత కల్పించాయి. మనుషులను వస్తువుల సరుకుల వలె అమ్మడం, కొనడం వంటి దానిని మరియు వ్యక్తుల చేత నిర్బంధంగా పని చేయించడాన్ని నిషేధించింది. 14 ఏళ్ళ లోపు గల ఏ పిల్లవాడు కర్మాగారాలలోను, లేదా గనులలోను లేదా పరిశ్రమలలోను పని చేయకూడదు. ప్రమాదకరమైన పరిస్థితులున్న చోట వారు పనులు చేయకూడదు. ఈ హక్కు యొక్క ముఖ్య ఉద్దేశం భారతదేశం తరతరాలుగా ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యలలో బాల కార్మిక వ్యవస్థ ఒకటి. అది నిర్మూలించబడాలి.

## 4. మత స్వాతంత్ర్యపు హక్కు

"పౌరులందరికీ నమ్మకాన్ని ప్రకటించుటలో స్వేచ్ఛ, మత విశ్వాసంలోను, ఆరాధనలలోను స్వాతంత్ర్యాన్ని కల్పించబడింది. భారతదేశంలో హిందువులతో పాటు మహ్మదీయులు, సిక్కులు, క్రైస్తవులు, బౌద్ధులు, జైనులు వంటి అనేక మతాల వారు ఉన్నారు. భారత రాజ్యాంగం మన దేశాన్ని లౌకిక రాజ్యంగా ప్రకటించింది. అనగా భారతదేశానికి అధికార మతం అంటూ ఏదీ లేదు. పౌరులందరు తమకు ఇష్టం వచ్చిన మతాన్ని స్వీకరించుటకు, ఆరాధించుటకు, పూర్తి స్వాతంత్ర్యం ఉంది. ఇతరుల మత స్వాతంత్ర్యానికి, విశ్వాసాలకు భంగం కలగని రీతిలో వ్యక్తులు తమ మత స్వాతంత్ర్యాన్ని అనుభవించాలి.

### i) అంతరాత్మానుసారం ఇష్టం వచ్చిన వృత్తిని, మతాన్ని స్వీకరించి, ఆచరించి ప్రచారం చేసుకొనే స్వాతంత్ర్యం

దేశంలోని ప్రజలందరికి అంతరాత్మ చెప్పినట్లు నడుచుకొనుటకు మరియు ఎవరికి నచ్చిన మతాన్ని వారు స్వీకరించి, ఆరాధించుటకు ప్రచారం చేసుకొనుటకు పూర్తి స్వాతంత్ర్యం కల్పించబడింది. అయితే దీని అర్థం, బలవంత మత మార్పిడి చేయకూడదు. కొన్ని రకాలైన అమానుష అక్రమమైన మరియు మూఢ నమ్మకాలను ఆచరించడం కూడా నిషేధించబడినది.

### ii) మతపరమైన వ్యవహారాలను నిర్వహించే స్వేచ్ఛ / స్వాతంత్ర్యం

ఎ) మత పరమైన మరియు చారిటబుల్ ట్రస్టు స్థాపించి నిర్వహించటం.

బి) మత పరమైనవంటి వ్యవహారాలకు సంబంధించి స్వీయ మత వ్యవహారాలను నిర్వహించటం.

సి) స్థిర, చరాస్తులను సొంతంగా సంపాదించి మరియు కలిగి ఉండటం.

డి) చట్ట ప్రకారంగానే ఆ ఆస్తులను నిర్వహించటం.

### iii) ఒక ప్రత్యేకమైన మతాన్ని పోషించేందుకు పన్నులు చెల్లించే విషయంలో స్వేచ్ఛ

ఏ వ్యక్తి కూడా ప్రత్యేకమైన ఒ క మతం లేదా మత వర్గానికి సంబంధించిన కార్యక్రమాలను పోషించుకోవడానికి లేదా నిర్వహించుకోవడానికి అయ్యే ఖర్చులను భరించడానికి, వ్యక్తులు పన్నులు చెల్లించే విషయాలలో ఎవరిని బలవంతం చేయకూడదు, వివిధ మత సముదాయాలు, మత ప్రచారానికి చట్ట పరిధిలో స్థిర చరాస్తులను సంపాదించుకుని వినియోగించుకోవచ్చు.

**iv) కొన్ని ప్రత్యేక విద్యాసంస్థలలో మతపరమైన బోధనలకు లేదా మతపరమైన ఆరాధనలకు హాజరయ్యే స్వేచ్ఛ**

ప్రభుత్వం నిధులతో నడపబడుతున్న ఏ విద్యా సంస్థలోనైనా మతపరమైన విద్యాబోధన జరుపకూడదు. కల్పించకూడదు. ప్రభుత్వంచే గుర్తింపు పొందిన, కొన్ని ధార్మిక విద్యాసంస్థలకు ఈ నిబంధన వర్తించదు. కాని అలాంటి విద్యాసంస్థలలో కూడా ఏ వ్యక్తి యొక్క అభీష్టంకు వ్యతిరేకంగా తప్పనిసరిగా హాజరు కావాలని నిర్బంధం చేయకూడదు. చిన్న పిల్లల విషయంలో ఈ కార్యకలాపాలకు హాజరయ్యే విషయాలలో వారి సంరక్షకుల అనుమతి తప్పనిసరి.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. దౌర్జన్యాన్ని ప్రతిఘటించే ప్రాథమిక హక్కు యొక్క ముఖ్య ఉద్దేశ్యమేమి?
2. మీ పొరుగు వారెవరైనా బహిరంగంగా దోపిడికి గురైన, ఏవైనా నాలుగు నిజ జీవిత పరిస్థితులను తెల్పండి.

### 5. విద్యా-సాంస్కృతిక విషయాల హక్కు

ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో భిన్న సంస్కృతులు మరియు భాషలు లిపులు, మతాలు కలిసి ఉన్నాయి. మనకు తెలిసిన విధంగా ప్రజాస్వామ్యమనేది మెజార్టీ ప్రజల పాలన, ప్రజాస్వామ్యం విజయవంతం కావడానికి దేశంలో అన్ని మైనారిటీ వర్గాల వారికి కూడా సమానమైన ప్రాతినిధ్యం కల్పించబడాలి. ప్రజలకు తమ సంస్కృతి మరియు భాష పట్ల ఉన్నటువంటి అస్తిత్వభావం వలన వారి కోసం ఒక ప్రత్యేకమైన విద్యా సాంస్కృతిక విషయాల హక్కు ప్రాథమిక హక్కుల జాబితాలో చేర్చబడింది. 29, 30 నిబంధనలలో రెండు ప్రధానాంశాలు రూపొందించబడ్డాయి.

**అల్ప సంఖ్యాక వర్గాలవారి ప్రయోజనాల పరిరక్షణ:** ఏ అల్ప సంఖ్యాక వర్గం వారికైనా తమకున్న ప్రత్యేకమైన భాషను, లిపిని లేదా సంస్కృతిని పరిరక్షించుకొనేందుకు హక్కు ఉండాలి. ప్రభుత్వం చేత నిర్వహించబడుతున్న విద్యాసంస్థలలో గాని లేదా ప్రభుత్వ ఆర్థిక సహాయంతో నడపబడుతున్న విద్యా సంస్థలలో మత ప్రాతిపదికన, జాతి పరంగా, కుల పరంగా, భాష పరంగా మరియు ఏ ఇతర ప్రాతిపదికల వలన వ్యక్తులకు ప్రవేశం నిరాకరించబడకూడదు.

### 6. రాజ్యాంగ పరిరక్షణ హక్కు

ప్రాథమిక హక్కులు న్యాయసమ్మతమైనవి. ఏవైనా అతిక్రమణకు గురైతే, న్యాయస్థానాల ద్వారా పొందే హక్కు ఉంది. ప్రాథమిక హక్కులు పరిరక్షించబడడానికి రాజ్యాంగం చట్టబద్ధమైన పరిష్కారాలను కల్పిస్తుంది. దానిని 32వ అధికరణలో పొందుపరచి రాజ్యాంగ పరిరక్షణ హక్కుగా పిలువబడుతుంది. మనం అనుభవిస్తున్న హక్కులు అతి క్రమింపబడినట్లయితే, ఉన్నత న్యాయస్థానాల ద్వారా మనం న్యాయం పొందవచ్చు.

## 17.4 విద్యా హక్కు

2002వ సంవత్సరంలో చేయబడిన 86వ రాజ్యాంగ సవరణ ద్వారా, 21ఎ నిబంధనను నూతనంగా ప్రవేశపెట్టి ప్రాథమిక హక్కుల జాబితాలో విద్యాహక్కు చేర్చబడింది. చిరకాల కోరిక అయినటువంటి ప్రాథమిక హక్కు.

అయిన 6 నుండి 14 సంవత్సరాల పిల్లలకు తల్లిదండ్రులు నిర్బంధ ఉచిత ప్రాథమిక విద్యను పొందే హక్కు వుంది. దేశంలో నిరక్షరాస్యతను నిర్మూలించే విషయంలో ఇదొక మైలురాయి 2009 సంవత్సరంలో విద్యాహక్కు చట్టం-2009ని ఆమోదించేంత వరకు ఈ హక్కు రాజ్యాంగంలో చేర్చబడినప్పటికీ సరిగా అమలు జరగలేదు. ఈ చట్టం ద్వారా 6 నుండి 14 సంవత్సరాల మధ్య వయస్సు పిల్లలు భారతదేశంలోని పాఠశాలలకు వెళ్ళి, నాణ్యమైన విద్యను పొందే హక్కు ఉంది.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. ప్రాథమిక హక్కులను పేర్కొని, వాటి గురించి వివరించండి.

## 17.5 మానవ హక్కులుగా ప్రాథమిక హక్కులు

మీరు చదివిన విధంగా ప్రాథమిక హక్కులు అనేవి ప్రతి పౌరుడు మంచిగా జీవించడానికి నిజంగా చాలా అవసరమైనవి. ప్రజలు మంచి పరిసరాలను కల్పించుట కొరకు ఉత్తమ జీవన పరిస్థితుల కొరకు మరియు మానవ ప్రతిష్టను, హుందాతనాన్ని కాపాడు కోవడం కోసం అన్యాయానికి, అణచివేతకు మరియు అసమానత్వానికి వ్యతిరేకంగా పోరాడారు, ఈ పోరాటాలు ప్రపంచ మానవాళి అందరు అనుభవించేందుకు జరిగాయి. అంతేగాక మానవ హక్కులుగా ప్రసిద్ధిగాంచిన ఈ హక్కులను గుర్తించేందుకు ప్రపంచ స్థాయిలో గట్టి ప్రయత్నాలు జరిగాయి. ఈ మేరకు 1948లో ఐక్యరాజ్య సమితి యొక్క సాధారణ సభ మానవ హక్కులను స్వీకరించింది మరియు వీటిని విశ్వ మానవ హక్కులలో పొందుపరిచింది. కొన్ని మానవ హక్కులు ఏవనగా; చట్టం దృష్టిలో అందరూ సమానులే, వివక్షత నుంచి విముక్తి పొందే స్వేచ్ఛ, జీవించే హక్కు స్వేచ్ఛ మరియు వ్యకితగ భద్రత, స్వేచ్ఛగా సంచరించే హక్కు, విద్యాహక్కు, వివాహం చేసుకొని కుటుంబాన్ని ఏర్పరచుకునే హక్కు, భావ ప్రకటనా స్వాతంత్ర్యపు హక్కు, అంతరాత్మానుసారం మత స్వాతంత్ర్యం, శాంతియుతంగా సమావేశాలను జరుపుకునే

### విద్యాహక్కు చట్టం-2009

6 నుండి 14 సంవత్సరాల పిల్లలందరికి ఉచిత నిర్బంధ ఎలిమెంటరీ విద్యనందించడానికి ఉద్దేశించబడినది. ఇది ఏప్రిల్ 1, 2010 నుండి అమల్లోకి వచ్చింది.

**చట్టంలోని ముఖ్యాంశాలు:**

- పిల్లలందరికి అందుబాటులో పాఠశాలలను ఏర్పాటు చేయాలి.
- పాఠశాలలకు మౌలిక వసతులను కల్పించాలి.
- పిల్లలందరిని వయస్సుకు తగిన తరగతిలో చేర్పించాలి.
- వయస్సుకు తగ్గ తరగతిలో చేర్చిన తరవాత తోటి వారితో సమానంగా ఉండటానికి ప్రత్యేక శిక్షణ ఇప్పించాలి.
- ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు సాధారణ పిల్లలతో పాటు విద్య కొనసాగించడానికి తగు వసతులు ఏర్పాటు చేయాలి.
- బడిలో చేర్చుకోవడానికి ఎలాంటి పరీక్షలు నిర్వహించరాదు. ఎటువంటి రుసుము, చార్జీలు వసూలు చేయరాదు.
- బడిలో చేరిన పిల్లల పేరు తీసివేయడం, అదే తరగతిలో కొనసాగించడం చేయరాదు.
- పిల్లల్ని శారీరకంగా, మానసికంగా హింసించరాదు.
- వయస్సు నిర్ధారణ పత్రం, ఇతర ధృవీకరణ పత్రాలు లేవనే కారణం చేత పిల్లలకు బడిలో ప్రవేశాన్ని నిరాకరించరాదు.
- తగిన అర్హతలున్న వారిని మాత్రమే ఉపాధ్యాయులుగా నియమించాలి.
- పిల్లలు నిర్దేశించిన సామర్థ్యాలు సాధించేలా బోధనాభ్యసనం, మూల్యాంకనం ఉండాలి.
- ఎలిమెంటరీ విద్య పూర్తయ్యేవరకు పిల్లలకు ఎలాంటి బోర్డు పరీక్షలు నిర్వహించరాదు.
- పద్నాలుగు సంవత్సరాలు పూర్తయినప్పటికినీ, ఎలిమెంటరీ విద్య పూర్తయ్యేవరకు పాఠశాలలో పిల్లలు కొనసాగవచ్చును.
- బలహీనవర్గాలకు, ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న బృందాలకు చెందిన పిల్లలు ఏవిధమైన వివక్షతకు గురికాకుండా చూడాలి.
- రాజ్యాంగంలో పొందుపరిచిన విలువలకు అనుగుణంగా, విద్యార్థులను భయం, ఆందోళనకు గురిచేయని రీతిలో వారి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడే పాఠ్య ప్రణాళిక, మూల్యాంకన విధానాలను రూపొందించాలి.

స్వాతంత్ర్యం మరియు సంఘాలను ఏర్పరచుకునే హక్కు, సమాజంలోని సాంస్కృతిక కార్యకలాపాలలో పాలుపంచుకునే హక్కు. పైన పేర్కొనబడిన హక్కులను జాగ్రత్తగా పరిశీలించినట్లయితే, మానవ హక్కులకు ఎంత ప్రాధాన్యత ఉందో అర్థమవుతుంది. ఇందువలన చాలా మానవ హక్కులు భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కుల అధ్యాయంలో స్థానాన్ని సంపాదించుకొన్నవి. ప్రాథమిక హక్కులలో స్థానాన్ని పొందలేకపోయిన కొన్ని మానవ హక్కులు ఆదేశిక సూత్రాల అధ్యాయంలో చేర్చబడినవి. అంతేగాక మానవ హక్కులకు ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని భారతీయ పౌరులు కూడా అనుభవించడానికి, కాపాడుకోవడం కోసం 1993లో భారత ప్రభుత్వం జాతీయ మానవ హక్కుల కమీషన్‌ను స్థాపించింది.

**మీ ప్రగతిని పరీక్షించుకోండి**

1. మానవ హక్కులుగా అమలు అవుతున్న ఏవైనా నాలుగు ప్రాథమిక హక్కులను రాయండి.

## 17.6 ప్రాథమిక విధులు

1950 జనవరి 26 న అమలులోకి వచ్చిన భారత రాజ్యాంగం ప్రాథమిక విధులను ప్రస్తావించలేదు. భారత పౌరులు తమ అంగీకారంతోనే తమ విధులను నిర్వర్తించవలసి ఉంది అని రాజ్యాంగం భావించింది. కాని పరిస్థితులు ఆవిధంగా లేవు. అందువలన 1976 సంవత్సరం 42వ రాజ్యాంగ సవరణ చట్టం ఆర్టికల్ 51-A ద్వారా 10 ప్రాథమిక విధులు కల్పించబడినవి. ఏది ఏమైనా ప్రాథమిక హక్కులు చట్టబద్ధమైనవి కాగా ప్రాథమిక విధులు చట్ట పరిధిలోకి రావు. ఈ కింద ఇవ్వబడిన ప్రాథమిక విధులు భారత రాజ్యాంగంలో పొందుపర్చబడినవి.

1. భారత రాజ్యాగం పట్ల, జాతీయ పతాకం పట్ల ప్రతి పౌరుడు విధేయత చూపాలి.
2. స్వాతంత్ర్య పోరాట లక్ష్యాల సాధన కోసం ప్రతి పౌరుడు కృషి చేయాలి.
3. భారతదేశం యొక్క సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను, సమైక్యతను కాపాడాలి.
4. దేశ రక్షణకు కృషి చేయవలెను. అవసరమైతే జాతీయ సేవలో పాల్గొనాలి.
5. భారతదేశ ప్రజలందరి మధ్య సోదర భావాన్ని పెంపొందించాలి. మహిళల గౌరవ ప్రతిష్ఠలకు భంగం కలిగించే చర్యలను విడనాడాలి.
6. సుసంపన్నమైన వారసత్వాన్ని, జాతీయ భిన్నత్వ సంస్కృతిని ప్రతి పౌరుడు కాపాడాలి.
7. సహజ వాతావరణాన్ని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి, వాటిని పరిరక్షించవలెను. తోటి ప్రాణికోటి పట్ల భూతదయ చూపాలి.
8. వైజ్ఞానిక, మానవతా దృక్పథాలను అలవరచుకోవాలి. సంస్కరణతతో కూడిన ప్రోత్సాహక వైఖరిని కలిగి ఉండాలి.
9. ప్రజల, ప్రభుత్వ ఆస్తులను కాపాడాలి. హింసాయుత చర్యలను విడనాడాలి.
10. వ్యక్తిగత సామాజిక వికాసానికి కృషి చేయాలి.

11. విద్యాహక్కు చట్టం 2009ని రూపొందించిన తరవాత మరొక విధి వీటికి జత చేయబడింది. అదేమంటే, 6 నుంచి 14 సంవత్సరాల లోపు గల బాల బాలికలకు వారి తల్లిదండ్రులు, సంరక్షకులు తగిన విద్యా సదుపాయాలను కల్పించాలి.

## 17.7 ముగింపు (ముఖ్యాంశాలు)

- హక్కులనేవి వ్యక్తులచే కోరబడేవి. అవి అతను లేక ఆమె యొక్క వికాసానికి అత్యవసరమైనవి మరియు అవి సమాజం చేత గుర్తించబడ్డాయి.
- విధి అనేది ఒక వ్యక్తి అనేక కారణాల వలన మరియు నైతిక కారణాల వలన లేదా చట్టబద్ధ కారణాల వలన ఇతరుల పట్ల నెరవేర్చవలసి ఉన్నవి.
- హక్కులు-విధులనేవి పరస్పరం సంబంధం కలిగియున్నవి.
- అయితే హక్కులన్నీ సమాజం చేత గుర్తించబడ్డాయి. వాటిలో కొన్ని హక్కులు ఎక్కువ ప్రాముఖ్యత కలిగిన హక్కులుగా గుర్తించబడుటచే, వాటిని రాజ్యాంగంలో పొందుపరచింది. ఆ హక్కులే ప్రాథమిక హక్కులుగా పిలువబడుతున్నాయి.
- రాజ్యాంగం భారత పౌరులకు రక్షణ కల్పించేటువంటి ఆరు ప్రాథమిక హక్కులు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

  1) సమానత్వపు హక్కు, 2) స్వేచ్ఛా స్వాతంత్ర్యపు హక్కు, 3) పీడనాన్ని నిరోధించే హక్కు, 4) మత స్వాతంత్ర్యపు హక్కు, 5) విద్యా-సాంస్కృతిక విషయాల హక్కు, 6) రాజ్యాంగ పరిరక్షణ హక్కు
- ప్రాథమిక హక్కులు విశ్వ వ్యాప్తమైనవి. రాజ్యాంగం వీటిపై కొన్ని మినహాయింపులు మరియు పరిమితులను విధించింది.
- 1976 సంవత్సరంలో చేయబడిన 42వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా రాజ్యాంగంలో 51ఎ అధికరణం క్రింద 10 ప్రాథమిక విధులు చేర్చబడినది.
- ప్రాథమిక హక్కుల వలె గాక, ప్రాథమిక విధులకు న్యాయస్థానాల రక్షణ కల్పించలేదు.

## 17.8 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 1-2 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. రాజ్యాంగ పరిహారపు హక్కు అనగానేమి?
2. స్వేచ్ఛా-స్వాతంత్ర్యపు హక్కులలో ఏవైనా రెండింటిని రాయండి.
3. విద్యా హక్కు చట్టం-2009 ముఖ్య ఉద్దేశ్యం ఏమిటి?

**II. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 4-5 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. మత స్వాతంత్ర్యపు హక్కులో పొందుపరచబడిన ముఖ్యాంశాలను వివరించండి.
2. మానవ హక్కులను పేర్కొని, ఏదైనా ఒక దాని గురించి వివరించండి.

**III. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 8-10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. రాజ్యాంగంలో పేర్కొన్న ప్రాథమిక హక్కులను సోదాహరణంగా వర్ణించండి.
2. సమానత్వపు హక్కు గురించి మీ అభిప్రాయాన్ని రాయండి.
3. ప్రాథమిక విధుల గురించి వివరించండి.

**IV. కింది వాటిలో సరైన జవాబును ఎంపిక చేయండి.**

1. పౌరులందరికి స్వేచ్ఛ-స్వాతంత్ర్యపు హక్కులను పొందుపరచబడిన రాజ్యాంగ నిబంధనలు ( )

   ఎ) నిబంధనలు 5-11 బి) నిబంధనలు 20-30

   సి) నిబంధనలు 19-22 డి) నిబంధనలు 40-45

2. 6 నుండి 14 సంవత్సరాల పిల్లలందరూ ఉచిత, నిర్బంధ విద్య పొందడం ఒక ( )

   ఎ) ప్రాథమిక హక్కు బి) ప్రాథమిక విధులు సి) ఆదేశిక సూత్రాలు డి) పైవేవీ కావు

3. భారత రాజ్యాంగం తన పౌరులందలకి తమకు నచ్చిన మతాన్ని స్వీకరించుట, ఆరాధించుట, ప్రచారం చేసుకొనుటకు పూర్తి స్వతంత్ర్యం ఉంది, అనగా భారత దేశం ఒక .......... ( )

   ఎ) ప్రజాస్వామ్య దేశం బి) గణతంత్ర దేశం సి) సార్వభౌమ దేశం డి) లౌకిక దేశం

4. శాస్త్రీయ దృక్పథాన్ని, మానవ జిజ్ఞాసను, పరిశోధన, సంస్కరణ స్ఫూర్తిని పెంపొందించుకోవడాన్ని ఇవి నిర్దేశిస్తాయి: ( )

   ఎ) ఆదేశిక సూత్రాలు బి) ప్రాథమిక హక్కు సి) ప్రాథమిక విధులు డి) పైవన్నీ

## 17.9 ఉపయుక్త గ్రంథాలు


- SCERT, Telangana సాంఘికశాస్త్ర పుస్తకాలు

# 18 ప్రభుత్వాలు - కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు

## 18.0 అభ్యసన ఫలితాలు

- కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాల మధ్య గల వ్యత్యాసాలను విశదీకరిస్తారు.
- రాష్ట్రపతి, ప్రధానమంత్రి అధికారాలను తెలియజేస్తారు.
- పార్లమెంటులోని లోక్ సభ, రాజ్య సభల విధులను, అధికారాలను గురించి వివరిస్తారు.
- లోక్ సభ, రాజ్య సభ సభ్యుల అర్హతలు, రాష్ట్రపతి పదవికి పోటీ చేసే అభ్యర్థుల అర్హతలను తెలియజేస్తారు.
- సుప్రీం కోర్టు అధికారాలను, విధులను తెలియజేస్తారు.
- స్థానిక ప్రభుత్వాల ఆవశ్యకతను, ప్రయోజనాలను వాటిలోని వివిధ స్థాయిలను వివరిస్తారు.
- గ్రామ పంచాయతీ సర్పంచ్ అధికారాలను, విధులను తెలియజేస్తారు.
- మండల, పరిషత్ జిల్లా పరిషత్ నిర్మాణం, బాధ్యతలను గురించి వివరిస్తారు.
- పట్టణ పాలనకు సంబంధించి పురపాలక సంఘం, కార్పొరేషన్ నిర్మాణం, విధులు, అధికారాలను గురించి వివరిస్తారు.

## 18.1 పరిచయం

దేశాభివృద్ధిని ప్రభుత్వాల పనితీరు ప్రభావితం చేస్తుంది. వ్యవసాయం, పరిశ్రమలు, వివిధ సేవారంగాలు అభివృద్ధి చేయడంలో ప్రభుత్వాలు పాత్ర కీలకమయినది. దీని కొరకు వివిధ స్థాయిలలో అనేక చట్టాలు చేసి అమలు చేయవలసి ఉంటుంది. దేశం మొత్తానికి వర్తించే రక్షణ, కరెన్సీ, విదేశీ వ్యవహారాలు వంటి వాటికి సంబంధించిన చట్టాలు ఎవరు చేస్తారు? రాష్ట్ర పరిధిలో శాంతి భద్రతలు, ఆరోగ్య సంరక్షణ, అటవీ విస్తీర్ణం పెంచడం వాటిని కాపాడడవంటివి ఎవరి ఆధీనంలో ఉంటాయి? అలాగే ఒక గ్రామంలో పారిశుద్ధ్యం, వీధి దీపాల ఏర్పాటు ఎవరు చూస్తారు అనే విషయాలను ఈ పాఠంలో వివరంగా చర్చిద్దాం.

## 18.2 కేంద్ర ప్రభుత్వం

- భారతదేశంలో ప్రస్తుతం 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలున్నాయి ఇవన్నీ కేంద్రం ప్రభుత్వం ఆధీనంలో ఉంటాయి. అనగా కేంద్ర ప్రభుత్వం చేసే చట్టాలన్నీ అన్ని రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు వర్తిస్తాయి. కేంద్ర స్థాయిలో పరిపాలన 3 ప్రధానాంశాల ద్వారా జరుగుతుంది.

- **కార్య నిర్వాహక శాఖ:** కేంద్ర కార్య నిర్వహణకు శాఖలో రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధాన మంత్రి మరియు కేంద్ర మంత్రి మండలి భాగస్వాములుగా ఉంటారు అనేక అంశాలకు సంబంధించి విధాన పత్రాలను రూపకల్పన చేస్తుంది. అంతర్గత బాహ్య సమస్యలను పరిష్కరిస్తూ ప్రజల సంక్షేమానికి, దేశాభివృద్ధికి ప్రయత్నం చేస్తుంది.

## 18.2.1 రాష్ట్రపతి – ఎన్నిక

భారత రాష్ట్రపతి రాజ్యాంగ అధినేతగా ఉంటాడు. రాజ్యాంగ విలువలకు రక్షకుడుగా ఉంటూ దేశానికి ప్రధమ పౌరుడుగా ఉంటాడు. నామమాత్ర అధికారాలు మాత్రమే కలిగి ఉంటాడు.

భారత రాష్ట్రపతి ఎన్నికల గణం ద్వారా ఎన్నికవుతాడు. ఎన్నికల గణంలో పార్లమెంటులోని లోక్ సభ, రాజ్య సభలోని ఎన్నికైన సభ్యులు, రాష్ట్రాల విధాన సభల, విధాన మండలుల ఎన్నికైన సభ్యులు ఓటర్లుగా ఉంటారు.

## 18.2.2 రాష్ట్రపతి పదవికి పోటీ చేయు వ్యక్తికి ఉండవలసిన అర్హతలు

- భారతదేశ పౌరుడై ఉండాలి.
- 35 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి.
- లోక్ సభకు ఎన్నికయ్యే సభ్యుడికి ఉండే అర్హతలు ఉండాలి.
- కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలలోనూ, ఆదాయం వచ్చే ఉద్యోగంలోనూ కొనసాగుతూ ఉండకూడదు.

## 18.2.3 పదవీ కాలం

రాష్ట్రపతి పదవీ స్వీకారం చేసిన రోజు నుండి అయిదు సంవత్సరాలు పదవిలో కొనసాగుతారు. ఆ పదవికి ఎన్ని సార్లు అయిననూ పోటీ చేయవచ్చు.

## 18.2.4. (మహాభియోగ తీర్మానం) అభిశంసన తీర్మానం

రాష్ట్రపతి రాజ్యాంగాన్ని అతిక్రమించినచో పదవీచ్యుతుని చేయడం కోసం పార్లమెంటులోని ఏదో ఒక సభలో కనీసం 1/4 వంతు సభ్యులు తమ సంతకాలతో ప్రతిపాదించాలి. 14 రోజుల లోపు దానిపై చర్చించి 2/3 వంతుకు తగ్గకుండా సభ్యులు ఆమోదిస్తే, దానిని రెండవ సభకు పంపిస్తారు. అక్కడ కూడా ఆమోదం పొందితే రాష్ట్రపతి పదవి నుండి తొలగిపోతాడు.

## 18.2.5 రాష్ట్రపతి అధికారాలు

రాష్ట్రపతికి సాధారణ మరియు అత్యవసర అధికారాలు ఉంటాయి.

**అధికారాలు**

| **సాధారణ అధికారాలు** | **అత్యవసర అధికారాలు** |
|---|---|
| 1) శాసన నిర్మాణ అధికారాలు | 1) జాతీయ అత్యవసర అధికారాలు |
| 2) కార్య నిర్వాహక అధికారాలు | 2) రాజ్యాంగపరమైన అత్యవసర అధికారాలు |
| 3) ఆర్థిక అధికారాలు | 3) ఆర్థిక అత్యవసర అధికారాలు |
| 4) న్యాయ అధికారాలు | |

### 18.2.6 శాసన నిర్మాణ అధికారాలు

పార్లమెంటులోని ఉభయ సభలను సమావేశ పరచడం, వాయిదా వేయడం, లోక్ సభను రద్దు చేయడం, లోక్ సభకు ఇద్దరు ఆంగ్లో ఇండియన్ సభ్యులను, రాజ్య సభకు 12 మంది సభ్యులను నామినేట్ చేయడం వంటి అధికారాలను రాష్ట్రపతి కలిగి ఉంటాడు. పార్లమెంటు సమావేశాలలో లేనపుడు ఆర్డినెన్స్ జారీ చేయడం పార్లమెంటు పంపిన తీర్మానాలను ఆమోదించడం లేదా పునఃపరిశీలన చేయవలసిందిగా కోరడం శాసనాధికారాల కిందకు వస్తాయి.

### 18.2.7 కార్యనిర్వాహక అధికారాలు

రాష్ట్రపతి కార్యనిర్వాహక అధికారాలలో దిగువ పేర్కొన్న వారిని నియమించడం ప్రధానమైనది.

1) భారత ప్రధానమంత్రి
2) కేంద్ర మంత్రి మండలి సభ్యులు
3) భారత ఆటార్నీ జనరల్
4) భారత కంప్ట్రోలర్ మరియు ఆడిట్ జనరల్
5) సుప్రీం కోర్టు, హై కోర్టు ప్రధాన న్యాయమూర్తులు
6) రాష్ట్రాల గవర్నర్లు కేంద్రపాలిత, ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్‌లు
7) ఎన్నికల కమీషనర్లు
8) జాతీయ మానవ హక్కుల సంఘం చైర్మన్ మొదలైనవి

### 18.2.8 ఆర్థిక అధికారాలు

పార్లమెంటులో ఆర్థిక బిల్లులను ప్రవేశ పెట్టడానికి అనుమతి ఇస్తాడు. భారత సంచిత నిధి, సంఘటిత నిధిపై అధికారం కలిగి యుంటాడు. ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి ఆర్థిక సంఘం చైర్మన్‌ను నియమిస్తాడు. ఆర్థిక సంఘం. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ సమర్పించే నివేదికలను పార్లమెంటుకు సమర్పించేలా చేస్తాడు. వార్షిక బడ్జెట్ పార్లమెంటు ప్రభుత్వం సమర్పించేలా చేస్తాడు.

### 18.2.9 న్యాయ అధికారాలు

ఉన్నత న్యాయస్థానాలు విధించిన శిక్షలను తగ్గించడానికి, అమలును వాయిదా వేయడానికి లేదా శిక్షల స్వభావాన్ని మార్చడానికి రాష్ట్రపతికి అధికారం ఉంది. రాజ్యాంగ పరమైన అంశాలపై సుప్రీం కోర్టు సలహాను కోరవచ్చు.

వీటితో బాటు సర్వసైన్యాధ్యక్షుడుగా, త్రివిధ దళాల అధిపతిగా అధికారులను నియమించడం, యుద్ధం, శాంతి సంబంధిత అంశాలపై అధికారం కల్గి ఉంటాడు. అంతర్జాతీయ వేదికలపై దేశానికి ప్రాతినిధ్యం వహించడం, విదేశీ రాయబారుల నియామక పత్రాలు స్వీకరించడం వంటి బాధ్యతలు కూడా నిర్వహిస్తాడు.

### 18.2.10 అత్యవసర అధికారాలు

**ఎ) జాతీయ అత్యవసర అధికారాలు:**

విదేశీ దండయాత్రలు, యుద్ధం, సాయుధ తిరుగుబాటు పరిస్థితులు ఏర్పడి భద్రతకు ముప్పు ఏర్పడినపుడు

**బి) రాష్ట్రాలు:**

రాజ్యాంగ సూత్రాల ప్రకారం పరిపాలన కొనసాగలేని పరిస్థితి ఏర్పడినపుడు ఆయా రాష్ట్ర గవర్నర్లచే నివేదిక తెప్పించుకొని రాష్ట్రపతి పాలన విధిస్తాడు.

దేశంలో లేదా ఒక ప్రాంతంలో ఆర్థిక అస్థిరత్వం ఏర్పడినపుడు ఆర్థిక అత్యవసర పరిస్థితి విధించవచ్చు.

## 18.3 ఉపరాష్ట్రపతి ఎన్నిక అధికారాలు

ఉపరాష్ట్రపతిని పార్లమెంటు ఉభయ సభలలోని ఎన్నికైన, నామినేటెడ్ సభ్యులు రహస్య బ్యాలెట్ పద్ధతి ప్రకారం ఎన్నుకోవడం జరుగుతుంది. పదవీ కాలం అయిదు (5) సంవత్సరాలు రాజీనామా లేదా మరణం వల్ల పదవికి ఖాళీ ఏర్పడినపుడు ఆరు (6) నెలల వ్యవధి మించకుండా ఎన్నికల సంఘం ఎన్నిక నిర్వహిస్తుంది.

**అధికారాలు:**

ఉప రాష్ట్రపతి రాజ్య సభకు పదవి రీత్యా అధ్యక్షుడు. రాజ్య సభ సమావేశాలకు అధ్యక్షత వహిస్తాడు. రాజ్య సభలో నిర్ణాయక ఓటును వినియోగిస్తాడు. రాజ్యసభలో సభ్యుడు కాకపోవడం వలన సాధారణ ఓటింగ్‌లో పాల్గొనడు. రాష్ట్రపతి పదవి ఏ కారణం వల్లనైనా ఖాళీ ఏర్పడితే ఉప రాష్ట్రపతి రాష్ట్రపతిగా వ్యవహరిస్తారు. ఇలా ఆరు నెలల వరకు కొనసాగవచ్చు.

## 18.4 ప్రధాన మంత్రి - ఎన్నిక

భారతదేశంలో ప్రభుత్వం యొక్క వాస్తవ కార్య నిర్వాహక అధికారం ప్రధానమంత్రిదే. రాష్ట్రపతి నామమాత్ర అధికారం నిర్వహిస్తారు. ప్రధానమంత్రి, మంత్రిమండలి చేసిన నిర్ణయాలను రాష్ట్రపతి ఆమోదిస్తారు. లోక్ సభకు సార్వత్రిక ఎన్నికలు జరిగిన తర్వాత సభలో మెజారిటీ స్థానాలను గెలుచుకొన్న పార్టీ నాయకుడిని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవలసిందిగా రాష్ట్రపతి ఆహ్వానిస్తారు. ఆ విధంగా ఎన్నుకోబడిన పార్టీ నాయకుడు ప్రధానమంత్రి అవుతారు.

### 18.4.1 ప్రధానమంత్రి అధికారాలు - విధులు

ప్రధాన మంత్రి కేంద్ర కేబినెట్‌కు అధినేత. మంత్రులను శాఖలను కేటాయిస్తాడు. కేబినెట్ సమావేశాలకు ఎజెండా నిర్ణయించడం, అధ్యక్షత వహించడం ప్రధాన మంత్రి బాధ్యత. ప్రధాన మంత్రి పార్లమెంటులో నాయకుడుగా వ్యవహరిసారు. మంత్రి మండలి నిర్ణయాలను పార్లమెంటుకు తెలియజేస్తారు. ప్రధాన సమస్యలపై ప్రతిపక్ష పార్టీలతో చర్చిస్తారు.

## 18.4.2 కేబినెట్ మంత్రి మండలి

కేంద్ర మంత్రి మండలికి నాయకుడు ప్రధాన మంత్రి. మంత్రి మండలిలో కేబినెట్ హోదా గల మంత్రులు, స్టేట్ మంత్రులు, మరియు డిప్యూటీ లేదా సహాయ మంత్రులు ఉంటారు.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. రాష్ట్రపతి పదవికి పోటీ చేయు వ్యక్తికి ఉండవలసిన అర్హతలు ఏవి?
2. ప్రధాన మంత్రి అధికారాలు - విధుల గురించి వివరించండి.

## 18.5 శాసన నిర్మాణ శాఖ - పార్లమెంటు

భారతదేశంలో అత్యున్నత శాసన నిర్మాణ సంస్థ పార్లమెంటు కేంద్ర శాసన నిర్మాణ శాఖలో రాష్ట్రపతి, పార్లమెంటులోని ఉభయ సభలైన లోక్ సభ, రాజ్య సభ అంతర్భాగాలు.

## 18.5.1 పార్లమెంటు లోక్ సభ నిర్మాణం

పార్లమెంటులోని లోక్ సభను దిగువ సభ అంటారు. లోక్ సభలో మొత్తం 545 మంది సభ్యులుంటారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుండి 543 మంది సభ్యులు ప్రత్యక్షంగా ఎన్నికవుతారు. ఆంగ్లో ఇండియన్‌లు ఎవరూ ఎన్నిక కానపుడు రాష్ట్రపతి ఇద్దరు ఆంగ్లో ఇండియన్ ప్రముఖులను నియమిస్తాడు. లోక్ సభ కాలపరిమితి 5 సంవత్సరాలు లోకసభ, నిర్వహణపై స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌లను ఎన్నుకుంటారు.

## 18.5.2 లోక్ సభ సభ్యుల అర్హతలు



*చిత్రం-18.1: భారత పార్లమెంటు భవనం*

- భారత దేశ పౌరుడై ఉండాలి.
- 25 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి.
- ఆదాయం వచ్చే పదవిలో ఉండకూడదు.
- పార్లమెంటు నిర్ణయించిన ఇతర అర్హతలు ఉండాలి.

## 18.5.3 లోక్ సభ అధికారాలు - కొన్ని ముఖ్యమైన విధులు

- వివిధ బిల్లులపై అధికార, ప్రతిపక్ష సభ్యులు ప్రసంగించేందుకు తగిన సమయాన్ని కేటాయించడం, ఓటింగ్ నిర్వహించి ఫలితాలను ప్రకటించడం.
- రాష్ట్రపతి ప్రసంగంపై సభ్యుల అభిప్రాయాలు స్వీకరించి ధన్యవాద తీర్మానాన్ని ఆమోదించడం.
- వార్షిక ఆదాయ, వ్యయ పట్టిక (బడ్జెట్) ను లోక్ సభలో ప్రవేశపెట్టడం.
- ఆర్థిక బిల్లులతో పాటు సాధారణ బిల్లులను కూడా లోక్ సభలో ప్రవేశపెట్టవచ్చు.

## 18.6 పార్లమెంటు - రాజ్య సభ

భారత పార్లమెంటులోని ఎగువ సభయే రాజ్య సభ. రాజ్య సభను 'పెద్దల సభ' అని కూడా అంటారు.

### 18.6.1 పార్లమెంటు - రాజ్య సభ నిర్మాణం

రాజ్య సభలో గరిష్ఠంగా 250 మంది సభ్యులు ఉంటారు. భారత ఉపరాష్ట్రపతి రాజ్య సభ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. సభ్యులలో ఒకరు డిప్యూటీ చైర్మన్‌గా ఎన్నికవుతారు. 238 సభ్యులు రాష్ట్రాల శాసన సభ్యులచే ఎన్నిక కాగా 12 మందిని సాహిత్యం, శాస్త్ర విజ్ఞానం, కళలు, సామాజిక, సేవా రంగాలలో విశిష్ఠ సేవలందించిన వారిని నామినేట్ చేస్తారు.

### 18.6.2 రాజ్య సభ సభ్యుల అర్హతలు

- భారతీయ పౌరుడై ఉండాలి.
- 30 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి.
- ఆదాయం వచ్చే పదవిలో ఉండకూడదు.
- పార్లమెంటు నిర్ణయించిన ఇతర అర్హతలు కలిగి ఉండాలి.

### 18.6.3 రాజ్య సభ - కొన్ని ముఖ్యమైన అధికారాలు - విధులు

- రాజ్య సభను ఉప రాష్ట్రపతి నిర్వహిస్తాడు.
- అఖిల భారత సర్వీసుల ఏర్పాటుకు తీర్మానం చేస్తుంది.
- సాధారణ బిల్లులను రాజ్య సభలో ప్రవేశపెట్టవచ్చు.
- వివిధ బిల్లులపై సభలో చర్చిస్తారు. బిల్లులపై ఓటింగ్ జరిపిస్తారు.
- బడ్జెట్‌పై చర్చ చేస్తుంది.

## 18.7 కేంద్ర న్యాయ శాఖ

కేంద్ర న్యాయ శాఖ అనేది కేంద్ర ప్రభుత్వంలో ఒక ముఖ్యమైన అంగం. ప్రభుత్వ పని తీరుకు న్యాయశాఖయే నిదర్శనం.

### 18.7.1 భారత సుప్రీం కోర్టు

భారత సుప్రీం కోర్టు 1950 జనవరి 26న ప్రారంభమైంది. భారత రాజ్యాంగ నిర్మాతలు సుప్రీం కోర్టు నిర్మాణం. అధికారాల గురించి పరిశీలన జరిపేటప్పుడు బ్రిటన్ అమెరికాలోని న్యాయ వ్యవస్థను దృష్టిలో ఉంచుకున్నారు. బ్రిటన్ రాజ్యాంగం నుండి సమన్యాయ పాలన, అమెరికన్ రాజ్యాంగం నుండి న్యాయ సమీక్షను గ్రహించడం జరిగింది.

### 18.7.2 సుప్రీం కోర్టు నిర్మాణం

సుప్రీం కోర్టులో ఒక ప్రధాన న్యాయమూర్తి, 30 మంది న్యాయమూర్తులు ఉంటారు. సుప్రీం కోర్టు ప్రధాన కార్యాలయం న్యూ ఢిల్లీలో ఉంది. సుప్రీంకోర్టు తీర్పులు దేశం మొత్తానికి వర్తిస్తాయి. ప్రధాన న్యాయమూర్తిని ఇతర న్యాయమూర్తులను కొన్ని ప్రత్యేక పరిస్థితులలో పార్లమెంటు అభిశంసన ద్వారా మాత్రమే రాష్ట్రపతి తొలగిస్తాడు.

### 18.7.3 సుప్రీం కోర్టు న్యాయమూర్తుల అర్హతలు

- కనీసం ఏదేని ఒక హైకోర్టులో 5 సంవత్సరాల పాటు ఎలాంటి అంతరాయం లేకుండా న్యాయమూర్తిగా వ్యవహరించి ఉండాలి. లేదా
- కనీసం ఏదేని ఒక హైకోర్టులో 10 సంవత్సరాల పాటు ఎలాంటి అంతరాయం లేకుండా న్యాయవాదిగా వ్యవహరించి ఉండాలి.
- రాష్ట్రపతి అభిప్రాయంలో ప్రముఖ న్యాయకోవిదుడై ఉండాలి.
- భారతీయ పౌరుడై ఉండాలి.

### 18.7.4 సుప్రీం కోర్టు న్యాయమూర్తుల పదవీ కాలం

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులు 65 సంవత్సరాల వయస్సు నిండే వరకు తమ పదవులలో కొనసాగుతారు.

### 18.7.5 సుప్రీం కోర్టు అధికారాలు – విధులు

- భారత ప్రభుత్వానికి, ఏదైనా రాష్ట్ర ప్రభుత్వానికి, భారత ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలలో భిన్న అభిప్రాయాలు ఏర్పడినపుడు, రెండు లేదా అంతకుమించి రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఉత్పన్నమయ్యే వివాదాలను పరిష్కరిస్తుంది.
- రాజ్యాంగానికి సంబంధించిన వివాదాలు; సివిల్, క్రిమినల్ వివాదాలు పరిష్కరిస్తుంది. హైకోర్టుల తీర్పులపై విచారిస్తుంది.
- రాష్ట్రపతి కోరినపుడు సుప్రీం కోర్టు సలహా ఇస్తుంది.
- సుప్రీం కోర్టు తీర్పులను భద్రపరస్తుంది. దీనిని 'కోర్టు ఆఫ్ రికార్డ్' అంటారు.
- రాజ్యాంగ అంశాలను వ్యాఖ్యానించడానికి, రాజ్యాంగ విలువలు కాపాడటానికి రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు రూపొందించి అమలు చేసే చట్టాలపై వ్యాఖ్యానిస్తుంది.
- అవసరమైతే గతంలో ఇచ్చిన తీర్పులను పునఃపరిశీలిస్తుంది. దీనినే 'న్యాయ సమీక్ష' అంటారు.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

- లోక్ సభ సభ్యుల అర్హతలు ఏవి?
- రాజ్య సభ నిర్మాణం గురించి వ్రాయండి.

## 18.8 రాష్ట్ర ప్రభుత్వం

**ఉపోద్ఘాతం**

భారతదేశంలో రాష్ట్ర ప్రభుత్వాల నిర్మాణం, నిర్వహణ కేంద్ర ప్రభుత్వాన్ని పోలి ఉంటుంది. దేశం మొత్తానికి రాష్ట్రపతి ఉన్నట్టుగా రాష్ట్రానికి గవర్నర్ ఉంటారు. అలాగే దేశానికి ప్రధాన మంత్రి ఉన్నట్లుగా రాష్ట్రానికి ముఖ్యమంత్రి ఉంటారు.

## 18.8.1 గవర్నరు

గవర్నరు రాష్ట్ర కార్య నిర్వాహక శాఖకు రాజ్యాంగబద్ధమైన అధిపతి రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిగా ఉంటాడు. గవర్నరును రాష్ట్రపతి నియమిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాలన్నీ గవర్నరు పేరు మీద అమలవుతాయి. గవర్నరు పదవీ కాలం 5 సంవత్సరాలు. గవర్నరును రాష్ట్రపతి నియమిస్తాడు.

**అర్హతలు:**

- భారతదేశ పౌరుడై ఉండాలి.
- 35 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి.
- పార్లమెంటులోనూ రాష్ట్ర శాసన నిర్మాణ శాఖలోని ఏ సభలోనూ సభ్యుడై ఉండకూడదు.
- ఆదాయం వచ్చు ఉద్యోగంలో ఉండకూడదు.

### గవర్నరు అధికారాలు

**కార్యనిర్వాహక అధికారాలు:**

గవర్నరు ముఖ్యమంత్రిని, అతని సలహా మేరకు మంత్రులను నియమిస్తాడు. రాష్ట్రంలోని విశ్వ విద్యాలయాలకు ఉపకులపతులను, వివిధ కమీషన్ల చైర్మన్‌లను నియమిస్తాడు. శాసన సభ సమావేశాలు లేని సమయంలో ఆర్డినెన్స్ జారీ చేస్తాడు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని, అడ్వకేట్ జనరల్‌ను నియమిస్తాడు.

**శాసన నిర్మాణ అధికారాలు:**

రాష్ట్ర శాసన సభను, మండలిని సమావేశపరచడం, వాయిదా వేయడం విధాన సభను రద్దు చేయడం గవర్నర్ అధికారంలో భాగం. విధాన పరిషత్ లేదా మండలిలో ఆరో వంతు సభ్యులను నామినేట్ చేస్తాడు. ఆంగ్లో ఇండియన్ తెగకు చెందిన వారు విధాన సభకు ఎవరూ ఎన్నిక కాకపోతే ఆ తెగకు చెందిన ఒకరిని నామినేట్ చేస్తారు. శాసన నిర్మాణ శాఖ ఆమోదించిన బిల్లులపై సంతకం చేస్తాడు.

**ఆర్థిక అధికారాలు:**

విధాన సభలో వార్షిక బడ్జెట్ సమర్పించేటట్లు చేస్తాడు. ఆర్థిక బిల్లులు ప్రవేశ పెట్టడానికి అనుమతిస్తాడు. రాష్ట్ర ప్రభుత్వ ఆగంతుక నిధిని గవర్నర్ నిర్వహిస్తాడు.

**న్యాయ అధికారాలు:**

రాష్ట్ర గవర్నరుకు రాష్ట్ర స్థాయిలో న్యాయ స్థానాలు విధించిన శిక్షను తగ్గించడానికి, క్షమాభిక్ష పెట్టడానికి లేదా రద్దు చేయడానికి అధికారం ఉంటుంది.

## 18.8.2 ముఖ్యమంత్రి

రాష్ట్ర ప్రభుత్వంలో ముఖ్యమంత్రికి శక్తివంతమైన స్థానం ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వ వ్యవహారాలు చూసే రాష్ట్రమంత్రి మండలికి అధినేతగా ఉంటాడు. అసెంబ్లీలో మెజారిటీ పార్టీ నాయకుడుగా ఉంటాడు. విధాన సభ సభ్యులకు ఉండే అర్హతలే ముఖ్యమంత్రికి కూడా వర్తిస్తాయి. సభా విశ్వాసం కాపాడుకుంటూ ఉన్నంత వరకు పదవిలో ఉంటారు.

**ముఖ్యమంత్రి ఎన్నిక**

శాసన (విధాన) సభకు జరిగిన సార్వత్రిక ఎన్నికల తర్వాత మెజారిటీ పార్టీ నాయకుడిని గవర్నరు ముఖ్యమంత్రిగా నియమిస్తాడు.

**ముఖ్యమంత్రి అధికారాలు**

రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్ర మంత్రి మండలిని ఏర్పాటు చేస్తాడు. పునర్వవస్థీకరణ చేస్తాడు. ముఖ్యమంత్రి రాజీనామా చేసినచో మంత్రిమండలి రద్దు అవుతుంది. మంత్రిమండలి సమావేశాలకు అధ్యక్షత వహిస్తాడు. గవర్నరుకు మంత్రిమండలికి వారధిగా ఉంటాడు. విధాన సభకు నాయకుడుగా ఉంటాడు. రాష్ట్రప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి అధికారిక ప్రతినిధిగా వ్యవహరిస్తాడు. విధాన సభను రద్దు చేయవలసినదిగా గవర్నరును కోరే విశేష అధికారం ముఖ్యమంత్రికి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వంతో ఉత్తర ప్రత్యుత్తరాలు నిర్వహిస్తాడు.

**మంత్రి మండలి**

రాష్ట్ర మంత్రి మండలిలో కేంద్రంలో వలె కేబినెట్ మంత్రులు, సహాయ మంత్రులు ఉంటారు. ముఖ్యమంత్రి మరియు మంత్రులందరూ గవర్నరుచే నియమించబడతారు. రాష్ట్ర మంత్రి మండలి రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనను నిర్వహిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు రూపకల్పన చేస్తుంది. వివిధ శాఖలను సమన్వయం చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ విధానాన్ని నిర్ణయిస్తుంది. రాష్ట్ర శాసన సభ ఆమోదించిన వార్షిక బడ్జెట్ కేటాయింపుల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ విధానాలను అమలు చేస్తుంది.

## 18.9 శాసన సభ

రాష్ట్ర ప్రభుత్వంలో శాసన నిర్మాణం అనేది శాసన సభ ద్వారా జరుగుతుంది. శాసస సభను రాష్ట్ర విధాన సభ అని, అసెంబ్లీ అని, ప్రజా ప్రతినిధుల సభ అని కూడా అంటారు. దీనికే 'దిగువ సభ' అని కూడా పేరు.




*చిత్రం-18.2: తెలంగాణ రాష్ట్ర శాసన సభ*

### శాసన సభ నిర్మాణం – అర్హతలు

ప్రతి రాష్ట్రానికి విధాన సభ ఉంటుంది. విధాన సభ సభ్యులను ఎం.ఎల్.ఏ. గా పిలుస్తారు. తెలంగాణ రాష్ట్ర శాసన (విధాన) సభలో 119 స్థానాలున్నాయి. ఈ సభ్యులందరినీ రాష్ట్రంలోని ఓటర్లు ప్రత్యక్ష ఎన్నిక ద్వారా ఎన్నుకుంటారు.

శాసన (విధాన) సభకు పోటీ చేసే అభ్యర్థికి క్రింది అర్హతలుండాలి:

- భారత పౌరుడై ఉండాలి.
- 25 సంవత్సరాలు వయస్సు నిండి ఉండాలి.
- ఆదాయం వచ్చే ప్రభుత్వ పదవిలో ఉండకూడదు.
- పార్లమెంటు నిర్ణయించిన ఇతర అర్హతలు కల్గి ఉండాలి.

### శాసన సభ అధికారాలు

ప్రభుత్వాలు చట్టాలు చేయడానికి అవకాశం గల అంశాలను మూడు రకాలుగా వర్గీకరించారు. అవి: కేంద్ర జాబితా, రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితా. వీటిలో రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితాలోని అంశాలపై రాష్ట్ర శాసన శాఖ శాసనాలు రూపొందిస్తుంది. ఆర్థిక బిల్లులన్నీ మొదట విధాన సభ పరిశీలించి ఆమోదిస్తుంది. సభా వ్యవహారాల నిర్వహణకై స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌లను ఎన్నుకుంటుంది.

## 18.10 రాష్ట్ర శాసన మండలి

రాష్ట్ర శాసన మండలిని 'విధాన పరిషత్తు' అని అంటారు. దీనిని 'ఎగువ సభ' అంటారు. ప్రస్తుతం భారత దేశంలో ఆంధ్రప్రదేశ్, బీహార్, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో శాసన మండలి అమలులో ఉంది.

### శాసన మండలి నిర్మాణం – అర్హతలు

తెలంగాణ శాసన మండలిలో మొత్తం 40 మంది సభ్యులున్నారు. వీరిలో 35 మంది ఎన్నిక కాగా 5గురు నామినేట్ చేయబడతారు. మొత్తం సభ్యులలో 1/3 వంతు సభ్యులు పురపాలక సంస్థలు, నగర పాలక సంస్థలు, జిల్లా పరిషత్తు సభ్యులు ఎన్నుకుంటారు. మొత్తం సభ్యులలో 1/12 వంతు సభ్యులు పట్టభద్రులు ఎన్నుకోగా మరొక 1/12 వంతు సభ్యులు ఉపాధ్యాయులు ఎన్నుకుంటారు. 1/3 వంతు సభ్యులను విధాన సభ సభ్యులు ఎన్నుకొంటారు. మిగిలిన సభ్యులను సాహిత్యం, విజ్ఞానం, కళలు, సామాజిక సేవా రంగాలకు సంబంధించిన వారిని గవర్నరు నామినేట్ చేస్తారు. శాసనమండలికి చైర్మన్, డిప్యూటీ చైర్మన్‌ను ఎన్నుకుంటారు.

**అర్హతలు:**

- భారత పౌరుడై ఉండాలి.
- 30 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి.
- ఆదాయం వచ్చే ఉద్యోగాలలో ఉండరాదు.
- పార్లమెంటు నిర్ణయించే ఇతర అర్హతలు కలిగి ఉండాలి.

### శాసన మండలి అధికారాలు

విధాన సభ ఆమోదించిన తీర్మానాలను శాసన మండలి (విధాన పరిషత్తు) పరిశీలన చేసి ఆమోదిస్తుంది. ఆ తీర్మానాలను తిరస్కరించవచ్చు. తీర్మానంలో కొన్నింటిని లేదా అన్నింటిని సవరించవచ్చు. మూడు నెలల పాటు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవచ్చు. తీర్మానాలను విధాన సభకు త్రిప్పి పంపవచ్చు.

## 18.12 రాష్ట్ర న్యాయశాఖ - హై కోర్టు



*చిత్రం-18.3: తెలంగాణ హై కోర్టు*

రాష్ట్ర స్థాయిలో హైకోర్టు అత్యున్నత న్యాయ స్థానం. భారతదేశంలో పెద్ద రాష్ట్రాలన్నింటిలో హైకోర్టులున్నాయి.

### హైకోర్టు నిర్మాణం, న్యాయమూర్తుల అర్హతలు, కాలపరిమితి

రాష్ట్ర హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తి, కొందరు సాధారణ న్యాయమూర్తులు ఉంటారు. ప్రధాన న్యాయమూర్తిని, ఇతర న్యాయమూర్తులను రాష్ట్రపతి నియమిస్తాడు. 62 సంవత్సరాల వయస్సు నిండే వరకు పదవిలో కొనసాగుతారు.

**అర్హతలు:**

- భారత పౌరుడై ఉండాలి.
- ఏదైనా ఒక న్యాయ వ్యవస్థ పదవిని కనీసం పదేళ్ల పాటు నిర్వహించి ఉండాలి.
- హైకోర్టులో పదేళ్ల పాటు అడ్వకేటుగా ఎలాంటి అంతరాయం లేకుండా విధులు నిర్వహించి ఉండాలి.

**అధికారాలు**

హైకోర్టులు సివిల్, క్రిమినల్ వివాదాలను పరిష్కరిస్తాయి. ప్రాథమిక హక్కుల అమలుకై హెబియస్ కార్పస్ వంటి రిట్లను జారీ చేస్తాయి. జిల్లా కోర్టుల తీర్పులపై వచ్చే అప్పీళ్లను విచారిస్తాయి. జిల్లా సెషన్స్ కోర్టు విధించిన మరణ శిక్షను హైకోర్టు ధృవీకరించిన తర్వాతే అమలు చేస్తారు.

హైకోర్టు ఇచ్చిన తీర్పులను భద్రపరుస్తుంది. దీనిని 'కోర్టు ఆఫ్ రికార్డు' అంటారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే ఆదేశాలు రాజ్యాంగ విరుద్ధంగా ఉంటే అవి చెల్లవని ప్రకటిస్తుంది. న్యాయ సంబంధ విషయాల్లో గవర్నరుకు సలహాలిస్తుంది. హైకోర్టు క్రింది కోర్టులను, ట్రిబ్యునల్‌లను పర్యవేక్షణ చేస్తుంది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవర్నర్ చేత ప్రమాణ స్వీకారం చేయిస్తారు.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. రాష్ట్ర పరిపాలనలో ముఖ్యమంత్రి స్థానం ఎటువంటిది?
2. హై కోర్టు న్యాయమూర్తి నియామకానికి అర్హతలు ఏవి?

## 18.12 స్థానిక ప్రభుత్వాలు, ఆవశ్యకత - ప్రయోజనాలు

భారతదేశంలో స్వాతంత్ర్యానంతరం గ్రామీణ / పట్టణ స్థానిక సంస్థలు బలవంతరాయ్ మెహతా కమిటీ (1957) సూచనల మేరకు ఏర్పాటైనది. (వాటి పనితీరును పరిశీలించి, నిర్వహణలో పాలను గుర్తించి సమర్థవంతమైన సంస్థలుగా తీర్చిదిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కమిటీలను నియమించాయి. అవి సూచించిన సలహాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవసరమైన చర్యలు చేపట్టి గ్రామీణ / పట్టణ, స్థానిక సంస్థలను బలోపేతం చేస్తున్నాయి. అందులో భాగమే 73, 74 రాజ్యాంగ సవరణలు.)

స్థానిక అవసరాలు స్థానిక ప్రజలకు స్పష్టంగా తెలుస్తాయి. స్థానిక అభివృద్ధికి కావలసిన ప్రణాళికలు స్థానికంగానే తయారు చేయడం వలన అవసరాలు పూర్తి చేయగల్గుతారు.

విధానాల నిర్ణయం అమలులో స్థానిక ప్రజలకు అవకాశం లభిస్తుంది. ప్రజా సమస్యలు త్వరితంగా పరిష్కారమవుతాయి. స్థానికంగా అందుబాటులో ఉండే మానవ వనరులు, భౌతిక వనరులు సమర్థవంతంగా వినియోగించబడుతాయి.

**వివిధ స్థాయిలలో స్థానిక ప్రభుత్వాలు**

**స్థానిక ప్రభుత్వాలు**

| గ్రామీణ | పట్టణ |
|---|---|
| 1) గ్రామ పంచాయతీ | 1) నగర పంచాయతీ |
| 2) మండల పరిషత్ | 2) మునిసిపాలిటీ (పురపాలక సంఘం) |
| 3) జిల్లా పరిషత్ | 3) మునిసిపల్ కార్పొరేషన్ (నగర పాలక సంస్థ) |

### 18.12.1 గ్రామ పంచాయతీ

గ్రామ పంచాయతీలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు ఉంటారు. వార్డు సభ్యుల సంఖ్య కనీసం ఐదుగురు (5) ఉంటుంది. 21 సంవత్సరాల వయస్సు నిండి ముగ్గురు కంటే ఎక్కువ పిల్లలు లేని వ్యక్తి పోటీ చేయుటకు అర్హుడు. వీరిని గ్రామ ఓటర్లు ఎన్నుకుంటారు. ఎన్నికైన వార్డు సభ్యులు ఉప సర్పంచ్‌ను ఎన్నుకుంటారు. ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్యదర్శిని నియమిస్తుంది. గ్రామ పంచాయతీలోని ఓటర్లందరిని కలిపి గ్రామ సభ అంటారు. గ్రామ సభల సమావేశాలకు సర్పంచ్ అధ్యక్షత వహిస్తాడు.

**గ్రామ పంచాయతీ విధులు**

- రహదారుల నిర్మాణం, మరమ్మతులు, డ్రైనేజీ కాల్వల నిర్మాణం, మరమ్మతులు, స్మశానవాటికల నిర్వహణ.
- విద్యుత్ సౌకర్యం, జనన మరణాల రిజిష్టర్ నిర్వహణ, టీకాలు వేయించడం, త్రాగు నీటి సౌకర్యాలు కల్పించడం చిన్న వంతెనలను, పబ్లిక్ పార్కులు, కంపోస్టు ఎరువులు తయారీ వంటి కరణీయ విధులతో పాటు క్రింద పేర్కొన్న వివేచానాత్మక విధులను కూడా నిర్వహిస్తుంది.
- విశ్రాంతి మందిరాల నిర్వహణ, గ్రంథాలయాల ఏర్పాటు, ఆధునిక సేద్య పద్ధతులు అమలు చేయడం, మాతా శిశు సంక్షేమం వంటివి నిర్వహిస్తుంది.

### 18.12.2 మండల పరిషత్తు నిర్మాణం, విధులు

ఒక మండలంలోని గ్రామ పంచాయతీ సర్పంచ్‌లందరూ మండల పరిషత్తులో సభ్యులుగా ఉంటారు. ప్రతి మండలంలో మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులను (MPTC) ఓటర్లు ఎన్నుకుంటారు. వీరు మండల పరిషత్తు అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యుడు, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ మండల పరిషత్ సమావేశాలలో శాశ్వత ఆహ్వానితులుగా ఉంటారు. జిల్లా పరిషత్ చైర్మన్ మరియు స్థానిక శాసన సభ్యులు కూడా శాశ్వత ఆహ్వానితులే. ప్రభుత్వం మండల పరిషత్తు అభివృద్ధి అధికారిని నియమించుతుంది. మండల పరిషత్తు సమావేశాలకు మండల పరిషత్తు అధ్యక్షుడు అధ్యక్షత వహిస్తాడు.

- అభివృద్ధి పథకాల అమలుకు చర్యలు తీసుకుంటుంది.
- వైద్యశాలలు, త్రాగు నీరు కల్పన.
- కుటీర పరిశ్రమలు, మహిళా, సాంఘిక సంక్షేమం, ఎరువులు, క్రిమి సంహారక మందులు, అధునాతన వ్యవసాయ పరికరాల వినియోగం వంటివి మండల పరిషత్ విధులు.

### 18.12.3 జిల్లా పరిషత్ నిర్మాణం, విధులు

ప్రతి జిల్లాకు ఒక జిల్లా పరిషత్ ఉంటుంది. తెలంగాణలో కేవలం హైదరాబాద్ జిల్లాకు జిల్లా పరిషత్ లేదు. కారణం అది పూర్తిగా నగర ప్రాంతం కావడమే. జిల్లా స్థాయిలో అత్యున్నత స్థాయి స్వపరిపాలన సంస్థ జిల్లా పరిషత్. జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యులు (ZPTC) జిల్లా పరిషత్ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. జిల్లా పరిషత్ సమావేశాలకు చెర్మన్ అధ్యక్షత వహిస్తాడు. ప్రభుత్వం ముఖ్య కార్యనిర్వహణాధికారిని నియమిస్తుంది.

జిల్లా పరిషత్ జిల్లాలోని మండల పరిషత్తుల, వార్షిక బడ్జెట్‌లను ఆమోదిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మండలాల మంజూరు చేసిన సహాయక గ్రాంట్లను మండల పరిషత్తులకు కేటాయిస్తుంది. వివిధ మండల పరిషత్తుల కార్యకలాపాలను సమన్వయం చేస్తుంది. జిల్లాలోని సెకండరీ పాఠశాలలను నిర్వహణ చేస్తుంది. మండల పరిషత్తులు, గ్రామ పంచాయతీల అభివృద్ధికి గాను అవసరమైన సూచనలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపిస్తుంది.

## 18.13 పట్టణ స్థానిక ప్రభుత్వాలు

### 18.13.1 నగర పంచాయతీ

11.000 నుండి 25,000 వరకు జనాభా కలిగి యుండి గ్రామీణ ప్రాంత స్థాయి నుండి నగర స్థాయికి మారుతున్న పెద్ద గ్రామాలలో నగర పంచాయతీ ఏర్పాటు చేయడం జరుగుతుంది దీనికి చైర్మన్ మరియు వార్డు సభ్యులు ఉంటారు. వయోజన ఓటింగ్ ద్వారా 5 సంవత్సరాల కొరకు వీరి ఎన్నిక జరుగుతుంది.

### 18.13.2 పురపాలక సంఘం (మునిసిపాలిటీ)

పురపాలక సంఘ సభ్యులను కౌన్సిలర్ అంటారు. వీరు ఓటర్లచే ప్రత్యక్షంగా ఎన్నిక కాబడతారు. ప్రతి పురపాలక సంఘానికి చైర్మన్, వైస్ చైర్మన్ ఉంటారు. కౌన్సిలర్లు వీరిని ఎన్నుకుంటారు. వీరి పదవీ కాలం అయిదు (5) సంవత్సరాలు. ప్రభుత్వం కమిషనర్‌ను పురపాలక సంఘ అధికారిగా నియమిస్తుంది. ఓటు హక్కు

లేకుండా అన్ని సమావేశాలలో ఈయన పాల్గొంటారు. పురపాలక సంఘ తీర్మానాలను అమలు పరచే బాధ్యత కమిషనర్‌దే.

రోడ్ల నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు, త్రాగు నీటి సరఫరా, ప్రజారోగ్యం, జనన మరణాల రిజిష్టర్ నిర్వహణ, పాఠశాలల నిర్వహణ, మార్కెట్ల నిర్వహణ, ఉద్యానవనాలు, గ్రంథాలయాల నిర్వహణ, వివాహాల రిజిస్ట్రేషన్ వంటి విధులను పురపాలక సంఘం నిర్వహిస్తుంది. ఇంటి పన్ను, ఆస్తి పన్ను, వినోద పన్ను వంటివి పురపాలక సంఘానికి ఆదాయ మార్గాలు.

### 18.13.3 నగర పాలక మండలి (మునిసిపల్ కార్పొరేషన్)

**నిర్మాణం, విధులు**

నగర పాలక సంస్థలో ఓటర్ల ద్వారా ఎన్నికైన ప్రతినిధులుంటారు. వీరిని కార్పోరేటర్లు అంటారు. కార్పొరేటర్లు మేయర్, డిప్యూటీ మేయర్‌ను ఎన్నుకుంటారు. సమావేశాలకు మేయర్ అధ్యక్షత వహిస్తాడు. ప్రభుత్వం కార్యనిర్వహణాధికారిగా కమిషనర్‌ను నియమిస్తుంది. నగరపాలక సంస్థ ప్రథమ పౌరుడు మేయర్.

## 18.14 జిల్లా అభివృద్ధిలో కలెక్టర్ పాత్ర

జిల్లా పరిపాలనలో కలెక్టర్ కీలక పాత్ర వహిస్తాడు. అతడు జిల్లా 'పరిపాలన అధిపతి'గా వ్యవహరిస్తాడు. కలెక్టర్‌గా IAS (Indian Administrative Service) హోదాలో ఉన్న వారిని నియమిస్తారు. కలెక్టర్ జిల్లా మెజిస్ట్రేట్‌గా వ్యవహరిస్తారు. జిల్లా కలెక్టర్ ప్రభుత్వంలోని వివిధ శాఖా అధికారుల సమన్వయం చేస్తారు. ప్రభుత్వ పథకాలను అమలు చేయుటలో సంబంధించిన ఆదేశాలిస్తాడు. ఎన్నికల సమయంలో జిల్లా ముఖ్య ఎన్నికల అధికారిగా ఉంటాడు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే జనాభా లెక్కల సేకరణ సందర్భంగా జిల్లా జనాభా లెక్కల ముఖ్య అధికారిగా వ్యవహరిస్తాడు. ప్రభుత్వానికి ప్రజలకు అనుసంధానకర్తగా తన విధులను నిర్వర్తిస్తాడు.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. స్థానిక ప్రభుత్వాలు అనగానేమి?
2. పట్టణ, స్థానిక ప్రభుత్వాల గురించి వ్రాయండి.

## 18.15 ముగింపు (ముఖ్యాంశాలు)

- దేశంలో పరిపాలన కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాల ద్వారా జరుగుతుంది. కేంద్రంలో కార్యనిర్వాహక శాఖ, శాసన నిర్మాణశాఖ, న్యాయశాఖ అనే మూడు శాఖలు పని చేస్తాయి.
- భారత రాష్ట్రపతికి శాసన నిర్మాణ అధికారాలు, కార్యనిర్వాహక అధికారాలు, ఆర్థిక అధికారాలు, న్యాయాధికారులతో పాటు అత్యవసర అధికారాలు ఉంటాయి.
- దేశాభివృద్ధిలో ప్రధానమంత్రి కీలకపాత్ర వహిస్తారు.

- పార్లమెంటులో లోక్ సభ, రాజ్య సభ అనే రెండు సభలు ఉంటాయి. ఇవి శాసనాలను రూపొందిస్తాయి.
- రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం ఉంటుంది. గవర్నర్, ముఖ్యమంత్రి, శాసన సభ ఆధారంగా చట్టాలు చేసి రాష్ట్రంలో అమలు చేస్తారు.
- స్థానిక అభివృద్ధి కోసం గ్రామ పాలన, పట్టణ పాలన మన దేశంలో అమలులో ఉన్నాయి. గ్రామ స్థాయిలో సర్పంచ్ గ్రామానికి పెద్దగా వ్యవహరిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను చేపడతారు.

## 18.16 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 1-2 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. రాష్ట్రపతి ఎన్నిక ఎలా జరుగుతుంది?
2. మహాభియోగ తీర్మానం అనగానేమి?
3. రాష్ట్రపతికి గల శాసన నిర్మాణ అధికారాలను తెలపండి.
4. రాష్ట్రపతికి గల అత్యవసర అధికారాలలో ఏవేని రెండింటిని తెలపండి.
5. కేంద్ర మంత్రిమండలిలోని మూడు రకాల మంత్రులు ఎవరు?

**II. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 4-5 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. రాష్ట్ర ముఖ్యమంత్రి అధికారాలేవి?
2. రాష్ట్ర శాసన సభకు, శాసన మండలికి గల భేదాలేవి?
3 రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఉండవలసిన అర్హతలేవి?

**III. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 8-10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. గ్రామ పంచాయతీ విధుల నిర్వహణ మీ గ్రామంలో / పట్టణంలో సూచించిన విధంగా జరుగుతోందా? ఉదాహరణలతో వివరించండి.
2. భారత సుప్రీం కోర్టు అధికారాలను గురించి వ్రాయండి.
3. నేటి కాలంలో స్థానిక ప్రభుత్వాల బలోపేతానికి సూచనలు చేయండి.

## 18.17 ఉపయుక్త గ్రంథాలు


- పౌరశాస్త్రం - ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం, తెలుగు అకాడమీ ప్రచురణ-2014
- సాంఘికశాస్త్రం - 9వ తరగతి పాఠ్య పుస్తకం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రచురణ-2011
- Democratic Politics-II Text Book for class X

# 19 భారతదేశ ప్రజాస్వామ్యం - సవాళ్ళు

## 19.0 అభ్యసన ఫలితాలు

- ప్రజాస్వామ్యం యొక్క అర్థం దాని పుట్టుక / మూలం గురించి వివరిస్తారు.
- వివిధ రకాల ప్రజాస్వామ్యాలను వర్గీకరిస్తారు.
- ప్రజాస్వామ్య లక్షణాలను, సూత్రాలను వివరిస్తారు.
- ఎన్నికలు ప్రజాస్వామ్యానికి ఎంత ముఖ్యమో గుర్తిస్తారు.
- ప్రజాస్వామ్యానికి ఎదురవుతున్న సవాళ్లను పేర్కొని వాటిని అధిగమించడానికి తగు చర్యలను సూచిస్తారు.
- ప్రజాస్వామ్య బలోపేతానికి పౌరుల భాగస్వామ్యం అవసరాన్ని వివరిస్తారు.

## 19.1 పరిచయం

భారతదేశ జాతీయోద్యమ నాయకులు బ్రిటిష్ వారితో కేవలం రాజకీయ స్వేచ్ఛ కోసం మాత్రమే పోరాటం చేయలేదు. ఒక క్రమబద్ధమైన సమాజ నిర్మాణం గురించి కూడా వారు ఆలోచించారు. వారు సాంఘిక, ఆర్థిక అసమానతలు లేని సమాజం, మానవ గౌరవాన్ని పునరుద్ధరించడం, పౌర హక్కులకు భద్రత, మత సామరస్యం, అందరికీ న్యాయం వంటి వాటిని కలగన్నారు. నాటి పోరాటాల ఫలితంగా భారతదేశం స్వాతంత్ర్యం పొంది ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశాలలో ఒకటిగా విజయవంతమైనది. ఈ ఆశలు, వ్యక్తీకరణాలన్నీ మనం రూపొందించుకున్న, 26 జనవరి 1950లో ఆమోదించుకున్న రాజ్యాంగంలో పొందుపరుచుకున్నాం. గత 70 సంవత్సరాలుగా విజయవంతంగా ఎన్నికలు నిర్వహిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో శాంతియుతంగా మార్పులు జరగడం, ప్రజలు స్వేచ్ఛగా భావవ్యక్తీకరణ చేయడం, మత స్వాతంత్ర్యం అవలంభించడం వంటివి మనం చూస్తూనే వున్నాం. మంచి పాలన మరియు జవాబుదారీతనం నిజమైన ప్రజాస్వామ్యం మరియు అభివృద్ధిని సాధించడానికి అవసరమైన సూత్రాలు. కానీ నేడు అనేక సవాళ్ళు ప్రజాస్వామ్య మనుగడకు ప్రతిబంధకాలుగా వ్యవహరిస్తున్నాయి. ఈ పాఠంలో మనం ప్రజాస్వామ్యానికి ఎదురయ్యే సవాళ్ళు ,వాటిని ఎలా అధిగమించాలో అనే విషయాలను చర్చిద్దాం.

## 19.2 ప్రజాస్వామ్యం - అర్థం, నిర్వచనాలు, పుట్టుక

ప్రజాసామ్యం యొక్క భావన సాధారణ శకం పూర్వం 5వ శతాబ్దం లోని ఏథెన్స్ నగరానికి చెందినదిగా గుర్తిస్తారు. గ్రీకు భాషలో 'డెమోస్' అనగా ప్రజలు, 'క్రెషియా' అనగా పాలన లేదా అధికారం అని అర్థం. డెమోక్రసీ అనగా ప్రజల పాలన లేదా ప్రజలచే పరిపాలన. స్థూలంగా ప్రజాస్వామ్యం ఒక రకమైన ప్రభుత్వ విధానమని, ఇది ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులచే నిర్వహించబడుతుందని మీకు అవగతమవుతుంది.

### 19.2.1 ప్రజాస్వామ్యం – రకాలు

ప్రజాస్వామ్యం రెండు రకాలుగా వర్గీకరించవచ్చు అవి: 1. ప్రత్యక్ష ప్రజాస్వామ్యం 2. ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం

1. **ప్రత్యక్ష ప్రజాస్వామ్యం:** ప్రత్యక్ష ప్రజాస్వామ్యంలో ప్రజలు తమ సొంత ప్రగతి మరియు అభివృద్ధి కోసం విధానాలు మరియు చట్టాలను రూపొందించడం కోసం ప్రభుత్వాన్ని ఎన్నుకోవడంలో ప్రత్యక్షంగా పాల్గొంటారు. ప్రత్యక్ష ప్రజాస్వామ్య వ్యవస్థను భౌగోళికంగా చిన్న పరిమాణం మరియు తక్కువ జనాభా ఉన్న దేశాలలో మాత్రమే ఆచరించవచ్చు. ఇది ప్రజాదరణ పొందిన స్వపరిపాలన వ్యవస్థ.
2. **ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం:** దీనిలో పౌరులు రాజకీయ నిర్ణయాలు తీసుకోవడానికి, చట్టాలను రూపొందించడానికి మరియు ప్రజల సంక్షేమం కోసం కార్యక్రమాలను నిర్వహించడానికి ప్రజా ప్రతినిధులను ఎన్నుకుంటారు. ఈ రకమైన ప్రజాస్వామ్యం పరిమితం మరియు పరోక్షంగా ఉంది. ప్రతి నిర్దిష్ట సంవత్సరాలకు ఒకసారి ఓటు వేసి ప్రతినిధులను ఎన్నుకునే విధానం దీనిలో వుంటుంది. ఈ రకమైన ప్రభుత్వంలో ప్రజల ప్రత్యక్ష భాగస్వామ్యం చాలా తక్కువ.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. 'ప్రజాస్వామ్యం' అంటే ఏమిటి?
2. ప్రజాస్వామ్యాన్ని వర్గీకరించండి.

## 19.3 ప్రజాస్వామ్యం యొక్క ముఖ్య లక్షణాలు

ప్రజాస్వామ్యమనేది అత్యంత మెరుగైన పాలన విధానం. ఇది విలువలు, వైఖరులు, అభ్యాసాలు మరియు ఆచారాలు అర్థం చేసుకున్న విభిన్న రూపాలు, సంస్కృతుల ప్రజా సమూహాలపై ఆధారపడి వుంటుంది. ప్రజాస్వామ్యం పౌరుల గౌరవాన్ని పెంచుతుంది. ఎందుకంటే ఇది రాజకీయ సమానత్వం యొక్క సూత్రం మీద ఆధారపడి ఉంటుంది. ఏ ఒక్క వ్యక్తి లేదా సమూహం చాలా శక్తివంతం కాకుండా ప్రజాస్వామ్యం నిరోధిస్తుంది. ఇది పౌరుడి ఓటు హక్కు ద్వారా ఎన్నుకోబడిన అధికారులకు కాల పరిమితి విధించడం ద్వారా జరుగుతుంది. ప్రజాస్వామ్యం యొక్క ముఖ్య లక్షణాలు మరికొన్ని చర్చిద్దాం.

### 19.3.1 ఎన్నికలు

ఎన్నికలు ప్రజాస్వామ్య రాజకీయ ప్రక్రియలో అతి ముఖ్య భాగం. ప్రతి రాజకీయ వ్యవస్థ కూడా ఎన్నికను ప్రజాస్వామ్యానికి చిహ్నంగా ఉపయోగిస్తుంది. ఎన్నికలు ప్రజలకు వారి అభిప్రాయాన్ని చెప్పడానికి మరియు వారికి నచ్చిన వ్యక్తిని ఎన్నుకోవటానికి అవకాశం కల్పిస్తాయి. మన దేశంలో స్వాతంత్ర్యం వచ్చిన తరువాత సార్వత్రిక వయోజన ఓటుహక్కు కల్పించడం జరిగినది. దీని ప్రకారం 18 ఏళ్లు పైబడిన ప్రతి పౌరుడు ఓటు హక్కు కలిగి ఉంటాడు.

ప్రజాస్వామ్యంలో ఎన్నికల ఆవశ్యకత

1. **నాయకత్వ ఎంపిక:** భారతదేశ పౌరులు తమకు నచ్చిన అభ్యర్థి లేదా పార్టీకి అనుకూలంగా ఓటు వేయడం ద్వారా వారు తమ నాయకులను ఎన్నుకోవటానికి ఎన్నికలు ఒక మార్గాన్ని అందిస్తాయి.
2. **నాయకత్వ మార్పు:** భారతదేశంలో ఎన్నికలు ఒక పాలక పార్టీకి వ్యతిరేకంగా ప్రజలు తమ ఆగ్రహాన్ని తెలియజేయడానికి ఒక సాధనంగా ఉపయోగపడుతాయి. ఇతర పార్టీలకు ఓటు వేయడం లేదా వేరే ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం ద్వారా, పౌరులు తమకు అంతిమ అధికారం కలిగి ఉన్నామని నిరూపిస్తారు.
3. **రాజకీయ భాగస్వామ్యం:** భారతదేశ పౌరుడు ఏ పార్టీల ఎజెండా లేకుండా అతను లేదా ఆమె స్వతంత్రంగా లేదా కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయడం ద్వారా ఎన్నికలలో పోటీ చేసే స్వేచ్ఛను కలిగి ఉంటారు.
4. **స్వీయ-దిద్దుబాటు అవకాశం:** భారతదేశంలో ప్రతి ఐదేళ్ళకు ఒకసారి ఎన్నికలు జరుగుతాయి కాబట్టి. రాజకీయ పార్టీలు వారి పని తీరును సమీక్షించి ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నించే స్వీయ దిద్దుబాటు వ్యవస్థగా ఇది పని చేస్తుంది.

## 19.3.2 అత్యధికుల పాలన

ఎన్నికలు నిర్వహించినప్పుడు పౌరుల ఓట్ల ద్వారా సగం కంటే ఎక్కువ మెజారిటీ సాధించిన ప్రతినిధుల ద్వారా ఏర్పాటైన ప్రభుత్వం పాలన కొనసాగిస్తూ వుంటుంది. ప్రజాస్వామ్యంలో మెజారిటీతో రాజకీయ నిర్ణయాలు తీసుకుంటారు. అందరి హక్కులు, సాంస్కృతిక గుర్తింపులు, సామాజిక పద్ధతులు మరియు మతపరమైన పద్ధతులను పరిరక్షించడం ప్రజాస్వామ్యాల బాధ్యత.

## 19.3.3 వ్యక్తి హక్కులు

తమ ఓటు ద్వారా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా, స్వేచ్ఛగా ప్రతినిధులను ఎన్నుకునే హక్కు దేశ పౌరులందరికీ ఉంది. పౌరుల ప్రాథమిక హక్కులు గౌరవించబడుతాయి మరియు రక్షించబడతాయి. వాక్ స్వేచ్ఛ మరియు మతం వంటి ప్రాథమిక మానవ హక్కులను పరిరక్షించడమే ప్రజాస్వామ్యాల ప్రధాన విధి. చట్టం ప్రకారం సమాన రక్షణ పొందే హక్కు, సమాజంలోని రాజకీయ, ఆర్థిక మరియు సాంస్కృతిక జీవితంలో పూర్తిగా పాల్గొనడానికి లేదా నిర్వహించడానికి ప్రజాస్వామ్యాలు అవకాశం కల్పిస్తున్నాయి.

## 19.3.4 సహకారం మరియు అంగీకారం/ రాజీతత్వం

ప్రతి సమాజంలో పౌరులందరికీ ప్రాముఖ్యత గల వివిధ అంశాలపై విభిన్న అభిప్రాయాలు కలిగిన వ్యక్తులు ఉంటారు. ప్రజాస్వామ్యంలో ఇది వ్యక్తుల మధ్య సహనం, సౌభ్రాతృత్వం, విభిన్న దృక్కోణాలు వృద్ధి చెందడానికి అవకాశం కల్పిస్తుంది. దేశానికి ప్రయోజనకరంగా ఉంటుంది. ఎప్పుడైతే ప్రజలందరూ ఒకరి క్షేమం మరొకరు కోరుతారో అప్పుడే సహకారం, రాజీతత్వం అనే లక్షణాలు అలవడుతాయి.

## 19.3.5 సమన్యాయ పాలన

ఏ వ్యక్తి, (అధ్యక్షుడు లేదా పౌరుడు) కూడా చట్టానికి అతీతుడు కాదు. అంటే చట్టం ముందు అందరూ సమానులే. ప్రజాస్వామ్య ప్రభుత్వాలు చట్టం ద్వారా అధికారాన్ని పొంది వినియోగించుకుంటాయి మరియు అవి

చట్ట పరిమితులకు లోబడి పని చేస్తాయి. సమన్యాయ పాలనలో అత్యున్నత అధికారాలు, వనరులు గల స్వతంత్ర న్యాయవ్యవస్థ వుంటుంది. చట్టం ప్రజలందరి శాంతి భద్రతలను, హక్కులను కాపాడుతుంది.

**మీ ప్రగతిని పరీక్షించుకోండి**

1. ప్రజాస్వామ్యంలో ప్రజల అంగీకారం ముఖ్యమైనదని ఎలా చెప్పగలవు?
2. నీవు కనుక ఒక రాచరిక పాలనలో ఉండివుంటే ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు నీకు వుండేదా? ఆలోచించండి.

## 19.4 ప్రజాస్వామ్యం - సవాళ్ళు

ప్రపంచంలో ప్రస్తుతమున్న అన్నీ ప్రభుత్వ విధానాలలో ప్రజాస్వామ్యమే అత్యున్నతమైనది. దీనికి సరిపోయే ఏ ప్రభుత్వ విధానం లేదు. మరి ప్రజాస్వామ్యం విజయవంతంగా మనుగడ సాగిస్తుందా? అని చూసినప్పుడు దేశంలోని అన్నీ సామజిక వర్గాలు అన్నీ సంస్థలలో మరియు ప్రాంతాలలో విస్తరించడానికి ఇది ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూనే ఉందని తెలుస్తుంది.

భారతదేశ ప్రజాస్వామ్యమునకు గల ముఖ్య సవాళ్ళలో కొన్నింటిని చూద్దాం.

### 19.4.1 నిరక్షరాస్యత

ప్రజాస్వామ్యాన్ని అర్థం చేసుకోవడానికి, ప్రోత్సహించడానికి విద్య ఒక ముఖ్యమైన ఆయుధం. ప్రజల గౌరవ మర్యాదలను నిర్ణయించడంలో విద్య ఒక కీలకాంశం. దేశంలోని వివిధ సమస్యలు, డిమాండ్లు మరియు ఆసక్తుల గురించి తెలియచేస్తుంది. మనకు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత జరిగిన మొదటి ఎన్నికల నాటికి మన అక్షరాస్యతా కేవలం 18.33%. అందులో మహిళల శాతం 9.9 శాతంతో చాలా స్వల్పం.

విద్య స్వయంగా ఒక దేశం యొక్క ఆర్థిక, రాజకీయ లేదా సామాజిక నిర్మాణాలను నేరుగా మార్చలేనప్పటికీ, విద్య రెండు నిర్దిష్ట మార్గాల్లో ప్రజాస్వామ్యానికి మరియు ప్రజాస్వామ్య పౌరసత్వానికి దోహదం చేస్తుంది. మొదటిది వివిధ సామాజిక-ఆర్థిక మరియు సాంస్కృతిక నేపథ్యాల పిల్లలకు సమాన అవకాశాలను అందించడం. విద్య ప్రజాస్వామ్యానికి దోహదపడే రెండవ మార్గం ఏమిటంటే, ప్రజాస్వామ్యాన్ని తెలుసుకోవటానికి, అర్థం చేసుకోవడానికి మరియు ఎవరిని ఎన్నుకోవాలనే విషయం ద్వారా వారికి నిర్దిష్ట జ్ఞానం, నైపుణ్యాలు మరియు విలువలు లేదా ప్రజాస్వామ్య పౌరులుగా మారడానికి అవసరమైన వైఖరులు నేర్పడం అనేది జరుగుతుంది.

**అక్షరాస్యత రేటు**

| సంవత్సరం | అక్షరాస్యత (%) | పురుషులు (%) | మహిళలు (%) |
|---|---|---|---|
| 2011 | 74.04 | 82.14 | 65.46 |

నిరక్షరాస్యత ప్రజాస్వామ్య విజయానికి అవరోధంగా ఉంటుంది. నిరక్షరాస్యులు రాజకీయ నాయకుల ప్రలోభాలకు, నెరవేర్చలేని వాగ్దానాలకు ఆకర్షితులయ్యే ప్రమాదం ఉంది. ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను, ఉపయోగించుకోలేరు. వారు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులను ప్రశ్నించలేరు విధాన నిర్ణయాలలో భాగస్వాములు కాలేరు.

## 19.4.2 సామాజిక, ఆర్థిక అసమానత్వాలు

భారతదేశం అనేక వైవిధ్యాలకు నిలయం. ఇది కొన్నిసార్లు అనుకూలంగా మరికొన్నిసార్లు ప్రతికూలంగా మారి అనేక సవాళ్లను కలిగిస్తూ ఉంది. మన దేశంలో లౌకికతత్వం అనే రాజ్యాంగ మౌలిక సూత్రాన్ని గౌరవిస్తూ ప్రజలంతా సహజీవనం కొనసాగిస్తున్నారు. కానీ కొన్నిసార్లు సామాజిక, ఆర్థికపరమైన అసమానతలు ప్రజాస్వామ్యానికి సవాళ్లను విసురుతూనే ఉన్నాయి. వాటిలో కొన్నింటిని చూద్దాం.

### పేదరికం

పేదరికం ప్రజాస్వామ్య విజయానికి ఒక పెద్ద అవరోధంగా ఉంటుంది. హక్కులు పొందలేకపోవడం, అసమానతలకు పేదరికం ప్రత్యక్ష సంబంధం కలిగి ఉంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల పేదరికానికి ముఖ్య కారణం నిరుద్యోగమే. ఇటీవలి నివేదికల ప్రకారం, భారతదేశ గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న జనాభాలో నాలుగింట ఒక వంతు మంది దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న మొత్తం జనాభాలో, దాదాపు 25% మంది దారిద్ర్య రేఖకు దిగువన నివసిస్తున్నారు, పట్టణ ప్రాంతాల్లో, కొంచెం మెరుగ్గా దాదాపు 13% జనాభా దారిద్ర్య రేఖకు దిగువన ఉంది. ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం ప్రకటించే మనవాభివృద్ధి సూచిక దృష్ట్యా పేదరికం రాజకీయ-ఆర్థిక మరియు మానవ హక్కులకు సంబంధించిన అంశం.

**మీకు తెలుసా?**

**దారిద్ర్య రేఖ:** ప్రాథమిక మానవ అవసరాలను తీర్చడానికి అవసరమైన వస్తువులు మరియు సేవల బుట్టను కొనుగోలు చేయడానికి అవసరమైన కనీస వ్యయాన్ని (లేదా ఆదాయాన్ని) దారిద్ర్యరేఖ అంటారు.

ఆర్.బి.ఐ. మాజీ గవర్నర్ సి. రంగరాజన్ కమిటీ నివేదిక ప్రకారం పట్టణ ప్రాంతాలలోరోజుకు 47 రూపాయలు, గ్రామీణ ప్రాంతంలో రోజుకు 32 రూపాయలను దారిద్ర్య రేఖ గా నిర్ణయించారు. ఆ మొత్తం కూడా ఖర్చు పెట్టలేని వారిని పేదరికపు రేఖకు దిగువున వున్నవారు అంటారు.

పేదరికం రెండు విధాలుగా ప్రజాస్వామ్యానికి ముప్పు. మొదటిది, ఇది ప్రజాస్వామ్య ముఖ్య సూత్రమైన అందరూ సమానమనే దానిని నాశనం చేస్తుంది. రెండవది, విధానపరమైన సమిష్టి నిర్ణయం తీసుకోవడంలో పేదలను పాల్గొనకుండా చేస్తుంది. పేదవారు ఎన్నికలలో స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవడానికి, పోటీ చేయడానికి ఎక్కువగా ముందుకు రావడం లేదు.

1. **కులతత్వం మరియు మతతత్వం:** కులం అనేది భారతదేశంలో పుట్టుకతోనే సంక్రమించిన ఒక సామాజిక అంశం. అనాదిగా మన దేశంలో అనేక కులాలు, మతాలు కలసి శాంతియుత సహజీవనం కొనసాగిస్తున్నాయి అని మనకు తెలుసు. కానీ ప్రస్తుతం భారతీయ ప్రజాస్వామ్యం కులతత్వం మరియు మతతత్వం నుండి పెను సవాళ్లను ఎదుర్కొంటున్నది. రాజకీయం కుల, మతాలతో మిళితమై విడదీయరానిదిగా మారిపోయింది. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు కులం లేదా మతం ఆధారంగా అభ్యర్థులను పోటీలో నిలుపుతున్నారు. ఓటర్లను కూడా కులం లేదా మతం ఆధారంగా సమీకరించడం మరియు ప్రభావితం చేస్తున్నారు. కులం లేదా మతం ఆధారంగా ఎన్నుకోబడిన ప్రతినిధులు తమ కులం లేదా మతానికి చెందిన ప్రజల సంక్షేమం కోసం పని చేస్తారు. కులతత్వం మరియు మతతత్వం కొన్నిసార్లు భారతదేశంలో రాజకీయ అస్థిరతకు కూడా కారణాలయ్యాయి.

2. **ప్రాంతీయతత్వం:** 1967 ఎన్నికల తరువాత దేశంలో వివిధ రాష్ట్రాలలో ప్రాంతీయభావాలు బలపడడంతో ప్రాంతీయతత్వం పెరగసాగింది. ప్రాంతాలలో జరిగిన అభివృద్ధి వ్యత్యాసాలు అనగా తలసరి ఆదాయంలో తేడాలు, ఉద్యోగ అవకాశాలు లేకపోవడం, నీటి పారుదల సౌకర్యాలలో వ్యత్యాసాలు వంటి వాటి వలన తాము వివక్షకు, దోపిడీకి గురవుతున్నామన్న భావనతో ప్రాంతీయ ఉద్యమాలు ప్రారంభమవుతాయి. ప్రాంతీయ ఆకాంక్షల సాధన పేరుతో అనేక ప్రాంతీయ పార్టీలు పుట్టుకొని వచ్చి ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఏర్పాటు చేయడంలో కీలకంగా మారుతున్నాయి. నిరంతరాయంగా జరిగే ప్రాంతీయ ఉద్యమాలతో శాంతి భద్రతలకు విఘాతం కలగవచ్చు. కొన్ని సార్లు ఈ ప్రాంతీయతత్వమే వేర్పాటువాదంగా మార్పుచెంది ప్రజాస్వామ్యాలకు పెను సవాల్‌గా మారే అవకాశం వుంది.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. ప్రాంతీయ రాజకీయ పార్టీలకు కొన్ని ఉదాహరణలివ్వండి.
2. కుల, మతతత్వం వల్ల కలిగే నష్టాలు ఏవి?

3. **లింగ అసమానత్వం:** లింగ సమానత్వం ప్రజాస్వామ్య సమాజాలలో కీలకమైన లక్షణం. ప్రభుత్వ సంస్థలు మానవ హక్కులను సమానంగా పెంచే సేవలను అందించాలి. మహిళలు మరియు పురుషులు కలిసి నిర్ణయాలు తీసుకున్నప్పుడు, ఆ ప్రయోజనాలు వారి సమాజమంతా పంచుకుంటారు. భారతదేశ చట్ట సభలలో మహిళల ప్రాతినిధ్యం చెప్పుకోదగినంతగా లేదు. రాజకీయ పార్టీలు వారికి ఎన్నికలలో చాలా తక్కువ స్థానాలు కేటాయిస్తున్నాయి. 2019 సార్వత్రిక ఎన్నికలలో పోటీ చేసినవారిలో మహిళలు కేవలం 10% మాత్రమే ఉన్నారు. మహిళా రాజకీయ అభ్యర్థుల కొరత ప్రభుత్వంలో వారి ప్రాతినిధ్యానికి క్లిష్టమైన అవరోధం. మహిళల ప్రాతినిధ్యం పెంచుతామని చెప్పే పార్టీలు పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు మాత్రం చట్టంగా రూపు దిద్దుకోవడానికి సహకరించడం లేదు. పురుషులతో సమానంగా అవకాశాలు అన్న మాట మాటలుగానే మిగిలిపోయాయి. చట్ట సభలలో మహిళాభాగస్వామ్యం ఎక్కువగా వున్నప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుంది.

## 19.4.3 అవినీతి

ప్రజాస్వామ్యంలో అతి ముఖ్యమైన ఎన్నికల సమయంలో అభ్యర్థులు తమ దగ్గర గల డబ్బుతో ఓటర్లను ప్రభావితం చేసి ఎన్నిక కావడం సామాన్యంగా జరుగుతున్నది, ప్రజలు కూడా అభ్యర్థుల వ్యక్తిత్వాన్ని చూసి

కాకుండా ఎవరు ఎక్కువ డబ్బు/ బహుమతులు ఇస్తున్నారో వారికే ఓటు వేయడం చేస్తున్నారు. ఈ అవినీతి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ ప్రజాస్వామ్య విలువలను దిగజారుస్తున్నది. సులువుగా డబ్బు సంపాదించడానికి, విలాసవంతమైన జీవనం గడపడానికి అక్రమాలకు పాల్పడడాన్నే ఆవినీతి అనవచ్చు. అవినీతి అనేది రాజకీయ అస్థిరతకు, సంస్థాగత పతనానికి, దేశ సమగ్రతకు తీవ్రమైన సవాలుగా ఏర్పడింది.

## 19.4.4 రాజకీయాలలో నేర స్వభావం, హింస

భారత రాజకీయాలలో నేరం, హింస అనేవి విడదీయలేనంతగా కలసిపోయాయి. అంగ బలం లేదా అర్థ బలంతో చాలా మంది నేరస్తులు ప్రజాప్రతినిధులుగా ఎన్నికవుతూనే వున్నారు. ఎన్నికల సంబంధిత చట్టాలపై చట్టబద్ధం చేయడానికి ఎన్నికల కమిషన్‌కు పరిమిత అధికారాలు ఉన్నాయి. ఇది మంచి పాలనను అందించడంలో ప్రజాస్వామ్య ప్రక్రియ యొక్క సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తుంది.

**ప్రజాస్వామ్యంపై నేరం, హింస ప్రభావాలు:**

- రాజ్యాంగ ధర్మానికి భంగం కలిగిస్తుంది.
- ఇది మరింత నేరాలు మరియు అవినీతిని పెంచుతుంది.
- సామాజిక విలువలు క్షీణతకు దారితీస్తుంది, చివరికి సామాజిక విచ్ఛిన్నానికి కూడా కారణమవుతుంది.
- ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి అవసరమైన న్యాయమైన ఎన్నికల సూత్రానికి వ్యతిరేకంగా ఉంటుంది.
- అవినీతి, స్వపక్షపాతం సూత్రాల ఆధారంగా అన్యాయమైన పాలనను పెంచుతుంది.

## 19.4.5 ప్రసార మాధ్యమాలు

ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంపై కూడా మీడియా ప్రభావం అధికంగా వుంది. ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు సోషల్ మీడియాను ఉపయోగించుకొని తమ పార్టీ గురించి, పార్టీ మానిఫెస్టో గురించి తెలియజేస్తారు. ఓటర్లను ఆకర్షించడానికి ప్రయత్నిస్తూ వుంటారు. ప్రజాస్వామ్యం మరియు పాలన యొక్క క్రియాత్మక రంగాలను కూడా మీడియా ప్రభావితం చేస్తుంది. అక్షరాస్యుల కంటే నిరక్షరాస్యులు మీడియా పట్ల త్వరగా ప్రభావితమవుతారు. సోషల్ మీడియా వార్తలను లేదా ప్రజా అభిప్రాయాలను ప్రసారం చేసి ప్రజాస్వామ్య ప్రక్రియలను ప్రభావితం చేస్తున్నాయి.

## 19.4.6 పార్టీ ఫిరాయింపులు

భారత ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో పార్టీ ఫిరాయింపులు ఒకటి. ఒక రాజకీయ పార్టీ తరఫున ఎన్నికైన సభ్యులు అధికారం కోసం లేదా తమ స్వలాభం కోసం తరచుగా మరో పార్టీలోకి ఫిరాయింపులు చేస్తున్నారు. నైతిక విలువలకు తిలోదకాలిచ్చి అవకాశవాదంతో పార్టీలను ఫిరాయించడం వల్ల రాజకీయ అస్థిరత్వం ఏర్పడటంతో పాటు ప్రజాభిప్రాయానికి విలువ లేకుండా పోతుంది. ప్రజాస్వామ్య గౌరవానికి భంగం వాటిల్లుతోంది. నానాటికీ జటిలమవుతున్న ఈ సమస్యను అరికట్టడానికి నిబంధనలను కఠినతరం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పార్టీ ఫిరాయింపులను నివారించడానికి కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో అనేక ప్రయత్నాలు జరిగాయి. తొలిసారిగా పశ్చిమ బెంగాల్ రాష్ట్రం 1979లో పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని రూపొందించింది. 1985లో కేంద్ర ప్రభుత్వం 52వ రాజ్యాంగ సవరణ ద్వారా మొదటిసారిగా 'పార్టీ ఫిరాయింపుల చట్టం' రూపొందించింది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం పార్లమెంటు, రాష్ట్రాల శాసన సభ్యులు కింది సందర్భాల్లో అనర్హతకు గురవుతారు.

1. ఒక పార్టీ తరపున టికెట్ పొంది ఎంపికైన శాసన సభ్యుడు ఆ పార్టీకి స్వచ్ఛందంగా రాజీనామా చేసినప్పుడు.
2. పార్టీ జారీ చేసిన విప్‌కు వ్యతిరేకంగా సభ్యులు గైర్హాజరైనా, అదేవిధంగా పార్టీ విప్‌కు వ్యతిరేకంగా ఓటు వేసినా సభ్యత్వాన్ని కోల్పోతారు.
3. స్వతంత్ర అభ్యర్థులుగా ఎన్నికైన శాసనసభ్యులు ఏదైనా పార్టీలో చేరితే వారి సభ్యత్వం రద్దవుతుంది.
4. పార్లమెంటు/ రాష్ట్ర శాసన సభలకు నామినేటైన సభ్యులు ఏదైనా రాజకీయ పార్టీలో చేరితే వారి సభ్యత్వం రద్దవుతుంది. నామినేటెడ్ సభ్యులు నామినేటైన రోజు నుంచి ఆరు నెలల్లోపు ఏదైనా రాజకీయ పార్టీలో చేరితే వారి సభ్యత్వం రద్దు కాదు.

## 19.5 పరిష్కారాలు

పై అంశాలు చర్చించడం ద్వారా భారత ప్రజాస్వామ్యం పలు సవాళ్ళు ఎదుర్కొన్నదనే విషయం మనకు అవగతమైనది. ఈ సవాళ్లను ఇలానే వదిలేస్తే ప్రజాస్వామ్య మనుగడే ప్రశ్నార్థకం అవుతుంది. కొన్నాళ్ళకు ప్రజాస్వామ్యం అంతరించి మళ్ళీ నియంతృత్వం లేదా పరాయి పాలనలోకి వెళ్ళే ప్రమాదం కూడా వుంది. కాబట్టి ఈ సవాళ్లను అధిగమించి ధృడమైన ప్రజాస్వామ్యంగా కొనసాగాలి. అందుకు కొన్ని పరిష్కార మార్గాలు అన్వేషించాలి. దానికై ప్రభుత్వ సంస్థలు, రాజకీయ పార్టీలు, పౌర సమాజం, మధ్య పరస్పరం సహకారం తప్పనిసరి. ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించే కొన్ని మార్గాలను చూద్దాం.

### 19.5.1 సార్వత్రిక విద్య

అభివృద్ధిని ప్రభావితం చేసే రాజకీయ, సామాజిక, ఆర్థిక మరియు సాంస్కృతిక సంస్థలలో ప్రజలు పాల్గొనాలంటే అక్షరాస్యత చాలా ముఖ్యం. మన రాజ్యాంగంలో 14 సంవత్సరాల పిల్లలకు ఉచిత నిర్బంధ విద్యను తప్పనిసరి చేశారు. దానిని అమలు చేయుటకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. సర్వ శిక్షా అభియాన్ వంటి పథకాల ద్వారా అక్షరాస్యత పెరుగుదలకు అనేక కార్యక్రమాలు చేపట్టడంతో క్రమంగా అక్షరాస్యత పెరగసాగింది. అక్షరాస్యత అంటే కేవలం చదవడం, రాయడం మాత్రమే కాకుండా తమ హక్కులు, విధులు తెలుసుకొని ఒక క్రియాశీలమైన పౌరునిగా ఉండడంగా మారింది. (జాతీయ పాఠ్య ప్రణాళిక ముసాయిదా [NCF]-2005) అందరికీ విద్యను అందించాలనే ఉద్దేశ్యంతో 2009లో భారత ప్రభుత్వం విద్యాహక్కును ప్రాథమిక హక్కుగా రూపొందించినది. జాతీయ అక్షరాస్యతా దళం. మధ్యాహ్న భోజన పథకం, గురుకుల పాఠశాలలు వంటి వాటి ద్వారా నిరక్షరాస్యత నిర్మూలనకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. విద్యలో మరింత సమగ్రత ఉద్దేశ్యంతో ప్రభత్వం జాతీయ విద్యా ప్రణాళిక-2020ను ప్రవేశపెట్టడానికి నిర్ణయించారు.

### 19.5.2 పేదరిక నిర్మూలన

పేదరిక నిర్మూలన అనేది కేవలం ఆర్థిక అత్యవసరం మాత్రమే కాదు, రాజకీయ అవసరం కూడా. పేదరికాన్ని నిర్మూలించి ప్రజలందరికీ కనీస సౌకర్యాలను కల్పించాలని ప్రభుత్వాలు వివిధ రకాల పథకాలు, కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది. పేదరిక రేఖకు దిగువన ఉన్నవారిని ఎగువకు తీసుకురావటానికి సమీకృత గ్రామీణ అభివృద్ధి (IRDP) కార్యక్రమం ద్వారా స్వయం ఉపాధి పొందేలా చేయడం జరిగినది. ప్రధానమంత్రి గ్రామీణ ఆవాస్ యోజన క్రింద పేద ప్రజలకు ఇండ్ల నిర్మాణం చేపట్టడం. ఈ మధ్య కాలంలో స్వయం సహాయక సంఘాల (SHG) ఏర్పాటు ద్వారా ఉపాధి కార్యక్రమాలను సమన్వయం చేయడంలో ఎన్జీఓలు మరియు ఇతర కార్యకర్తలు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (MNREGA), ఎలాంటి నైపుణ్యం లేని, పని చేయడానికి సిద్ధంగా వున్న గ్రామీణ ప్రాంత యువతకు కనీసం 100 రోజుల పని కల్పన ధ్యేయంగా 2005లో ఏర్పాటైంది. ప్రకృతి విపత్తు, కరువు సమయంలో పని రోజులు 150 వరకు ఉంటాయి. అధికారాల వికేంద్రీకరణతో పాటు వివిధ పేదరిక నిర్మూలన కార్యక్రమాలను సమీకృతం చేసినట్లయితే పేదరికాన్ని కొంత మేర వేగంగా తగ్గించవచ్చు.

### 19.5.3 లింగ అసమానత్వాన్ని తొలిగించడం

స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం మరియు న్యాయం అనే మౌలిక సూత్రాల కారణంగా ప్రజాస్వామ్యం విస్తృత ఆమోదం పొందింది. విధాన నిర్ణయాలలో మహిళలు మరియు బాలికలకు తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం అనేది ప్రజాస్వామ్య సూత్రం 'అందరి చేత' అనే దానిని విస్మరించడమే అవుతుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ప్రకారం రాజకీయ, సామాజిక ఆర్థిక అంశాలలో స్త్రీలకు పురుషులతో పాటు సమాన హక్కులుంటాయి. మహిళలు అన్నీ రంగాలలో పాల్గొన్నప్పుడే లింగ సమానత్వం సాధించపడుతుంది. ప్రతి దేశంలో ఇంకా లింగ సమానత్వాన్ని సాధించకపోవడానికి ఒక ప్రాథమిక కారణం ఏమిటంటే మహిళలు తక్కువ సామర్థ్యం కలవారనే అపోహ కలిగి వుండడం. భారత ప్రభుత్వం సంస్థాగతమైన సంస్కరణలు ప్రవేశపెడుతూ మహిళా సాధికారతను, లింగ సమానత్వాన్ని సాధించడానికి, మహిళాభ్యున్నతికి పాటుపడుతున్నాయి. వాటిలో కొన్నింటిని పరిశీలిద్దాం

11-18 సంవత్సరాలలోపు కౌమార బాలికల సాధికారత కోసం 'సబల' అనే పథకం ప్రవేశపెట్టారు. భారత దేశ మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రవేశపెట్టిన 'బేటీ పడావో, బేటీ బచావో' పథకం ద్వారా తగ్గుతున్న లింగ నిష్పత్తిని పెంచడం, బాలిక విద్యను ప్రోత్సహించడం అవసరమైన వారికి మద్దతు మరియు రక్షణ కల్పించడం జరుగుతుంది. ప్రసవ సమయంలో తల్లీ, పిల్లలను రక్షించి శిశు మరణ రేటు తగ్గించడానికి 'జననీ సురక్ష యోజన'ను ప్రవేశపెట్టారు. NCF-2005, ద్వారా పాఠశాల విద్యలో కూడా సమగ్రమైన మార్పులు చేయడం జరిగింది. కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాలు, ప్రత్యేక ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు ద్వారా విద్య పరంగా వెనుకబడిన వర్గాల వారి బాలికలకి వసతి, విద్యను అందించడం, బాలికల, మహిళల సాధికారత కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మరికొన్ని పథకాలు.

**“నేషనల్ పాలసీ ఫర్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ 2001”**

ఈ విధానం ద్వారా మహిళలకు కావలసిన పురోగతి, అభివృద్ధి మరియు సాధికారతలను కల్పించడం ప్రధాన లక్ష్యం.

- “బేటి బచావో, బేటి పడావో”, మహిళల విద్యారంగంలో మహిళలను ఉద్ధరించడానికి ఉద్దేశించబడింది.
- “సుకన్య సమృద్ధి ఖాతా”, వారి కుమార్తెల కోసం కుటుంబాలను ఆదా చేయడంలో సహాయపడుతుంది.
- “వన్ స్టాప్ సెంటర్ పథకం” గృహహింస లేదా హింసతో బాధపడుతున్న మహిళలకు సులభంగా ప్రాప్యత కల్పించడం మరియు మద్దతు అవసరం
- “ప్రధాన్ మంత్రి ఉజ్వల యోజన” అంటే దారిద్ర్యరేఖకు దిగువన నివసించే మహిళలకు ఉచిత ఎల్‌పిజి కనెక్షన్లు ఇవ్వడం.
- ‘మహిళా హాత్’ మహిళా పారిశ్రామికవేత్తలకు మరియు మహిళా స్వయం సహాయక బృందాలకు మద్దతు ఇవ్వడం.
- పని చేసే తల్లుల పిల్లల కోసం “రాజీవ్ గాంధీ నేషనల్ పథకం” అంటే శ్రామిక మహిళలకు సరైన డే కేర్ సేవలను అందించడం.
- “ప్రసూతి ప్రయోజన పథకం” గర్భిణీ స్త్రీలు మరియు పాలిచ్చే తల్లులకు ఉద్దేశించబడింది.

## 19.5.4 ప్రాంతీయ అసమనత్వాలను తొలగించుట

స్వాతంత్ర్యం తరువాత భారత ప్రభుత్వం ప్రాంతీయత సమస్యను అధిగమించడానికి వివిధ వ్యూహాలను అనుసరించింది. సమతుల్య ప్రాంతీయ వృద్ధిని నిర్ధారించడానికి ప్రణాళికా సంఘం ఏర్పాటు, 5వ షెడ్యూల్ మరియు 6 వ షెడ్యూల్‌లో స్వయంప్రతిపత్తి కల్పించడం, రాష్ట్రాల భాషా పునర్వ్యవస్థీకరణ, త్రిభాషా సూత్రం, వెనుకబడిన రాష్ట్రాలకు ప్రత్యేక గ్రాంట్లు మరియు తేడాలను పరిష్కరించడానికి ఇంటర్–స్టేట్ కౌన్సిల్‌కు నిబంధనలు మొదలగునవి కొన్ని ఏర్పాటు చేశారు. కేంద్రంతో పాటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రాంతీయ అసమానతలను తొలగించడానికి విశేష కృషి చేస్తున్నాయి. గిరిజన, కొండ ప్రాంతాల అభివృద్ధి కార్యక్రమం, సరిహద్దు ప్రాంతాల అభివృద్ధి కార్యక్రమం, పశ్చిమ కనుమల అభివృద్ధి కార్యక్రమం, కరువుకు గురయ్యే ప్రాంతాల అభివృద్ధి కార్యక్రమం, ఎడారి ప్రాంతాల అభివృద్ధి కార్యక్రమం వంటి వాటి ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రాంతీయ అసమానతలను తగ్గించే ప్రయత్నం చేస్తున్నది.

దేశంలోని చాలా వెనుకబడిన ప్రాంతాలకు రవాణా మరియు కమ్యూనికేషన్ వ్యవస్థ ఏర్పాటు ద్వారా ఇతర ప్రాంతాలతో అనుసంధానం ఎర్పడి అభివృద్ధికి అవకాశం కలుగుతుంది. విద్య ద్వారా జాతీయవాద దృక్పథాన్ని నిర్మించడం వంటి దీర్ఘకాలిక చర్యలు తీసుకోవాలి. అందరం భారతీయులమనే భావన భవిష్యత్తు తరాల వారిలో తీసుకురావడమే దీని లక్ష్యంగా వుండాలి. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం నీతి అయోగ్

వంటి కొత్త సంస్థాగత నిర్మాణాల సహాయం, సూచనలు తీసుకోవాలి. రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం పెంచుకొని అన్ని ప్రాంతాల యొక్క ఏకరీతి అభివృద్ధిని చేపట్టడం, తద్వారా ఏ ప్రాంతమూ ఒంటరిగా మరియు వెనుకబడి లేకుండా చేయాలి. సహజ వనరుల కేటాయింపులో స్థానిక సంస్థల వాటాను సరైన రీతిలో పంచుకోవాలి. ప్రాంతీయ పార్టీలు ప్రాంతీయ ఆకాంక్షల పేరిట ప్రాంతీయతత్వం, ఉప ప్రాంతీయతత్వం పెరగటానికి ఆస్కారం కల్పిస్తారు. అటువంటి వారి పట్ల ప్రజలు జాగురూకతతో ఉండాలి. ఈ విధమైన కొన్ని చర్యల ద్వారా ప్రాంతీయ అసమానతలు తగ్గించే ప్రయత్నం చేయవచ్చు.

### 19.5.5 నేరం, హింస

2018 సెప్టెంబర్‌లో, ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవ నిర్ణయంలో, అభ్యర్థులందరూ తమ నేరపూరిత చరిత్రను ఎన్నికలలో పోటీ చేయడానికి ముందు ఎన్నికల కమిషన్‌కి ప్రకటించాల్సి ఉంటుందని చెప్పారు. ఓటర్లకు తెలియజేయడానికి నేరపూరిత నేపథ్యం నుండి వచ్చిన అభ్యర్థుల గురించి ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం కోసం ధర్మాసనం పిలుపునిచ్చింది.

ఏ రాజకీయ పార్టీ కూడా నేరచరితులకు ఎన్నికలలో పోటీ చేయడానికి అవకాశం ఇవ్వకూడదు. ఎన్నికల కమిషన్ అటువంటి వారిని ఎన్నికలలో పోటీ చేయడానికి అనర్హులుగా ప్రకటించాలి. ఎన్నికైన తరువాత నేరం లేదా హింసకు పాల్పడినట్లు రుజువు అయితే వారి ఎన్నికను రద్దు చేయాలి. పోటీలో ఉండే అభ్యర్థుల నేర చరిత్రను ఆయా పార్టీల వెబ్‌సైట్‌లో వుంచాలని కూడా సుప్రీం కోర్టు ఆదేశాలిచ్చింది. ఓటర్లు కూడా అభ్యర్థుల వ్యక్తిత్వాన్ని చూసి ఎన్నుకోవాలి. ప్రజాస్వామ్యంలో ఏ రకమైన హింసకు తావు లేదు. కుల, మత వైషమ్యాలతో కూడా హింస చెలరేగే అవకాశం వుంటుంది. వీటి వల్ల ఎక్కువగా నష్టపోయేది పేదలు, మహిళలు మరియు అణగారిన వర్గాల ప్రజలే. కాబట్టి హింసను, లేదా నేరాన్ని ప్రేరేపించేవారిని, అందుకు పాల్పడేవారిని కూడా కఠినంగా శిక్షించాలి. అలాంటి వారిని గుర్తించి వారితో జాగ్రత్తగా వుండాలి.

#### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. ప్రాంతీయ వ్యత్యాసాలు తగ్గించడానికి ప్రభుత్వాలు తీసుకున్న చర్యలు కొన్నింటిని తెల్పండి.
2. ప్రాంతీయ అసమానతలు తగ్గించడానికి కొన్ని సూచనలివ్వండి.

## 19.6 ప్రజాస్వామ్యం లో పౌరుల పాత్ర

వైవిధ్యమైన ఈ దేశం ప్రాచీన సంస్కృతి, సాంప్రదాయాలు పాటిస్తూనే, ఆధునికమైన ప్రజాస్వామ్య లక్షణాలను అందిపుచ్చుకొని ప్రపంచంలోనే ఒక గొప్ప దేశంగా నిలబడింది. మీకు తెలిసినట్లుగా, మన దేశంలో ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని మనం ఎన్నుకున్న ప్రతినిధులు నిర్వహిస్తారు. ఆ కోణంలో, జాతీయ, రాష్ట్ర మరియు స్థానిక. ప్రభుత్వాలు వివిధ స్థాయిలలో ఎలా పనిచేస్తాయో ప్రతి పౌరుడు బాధ్యత వహిస్తాడు. అందువల్ల, ప్రతి పౌరుడు పాలనలో కీలక పాత్ర పోషించాలి. భారతీయ పౌరులుగా మనం ఇది చేస్తున్నామా? పరిశీలిద్దాం.

పౌరుల పాత్రలకు ప్రధాన అవకాశాలు ఈ క్రింది విధంగా ఉండవచ్చు. ప్రజలు పాల్గొనని ప్రజాస్వామ్యానికి అర్థం లేదు. ప్రజాస్వామ్యంలో వయోజనులైన పౌరులందరు ఓటు వేసి ప్రతినిధులను ఎన్నుకుంటారని మీకు తెలుసు కదా! అంటే దీని అర్థం ప్రజా భాగస్వామ్యం తోనే ప్రభుత్వాలు ఏర్పడుతాయి. మంచి నాయకులను

ఎన్నుకోవడంలో ప్రజలు ముఖ్య పాత్ర వహిస్తారు. ప్రజాస్వామ్య రాజకీయాలలో భాగస్వామ్యం అంటే కేవలం ఓటు వేయడమే కాదు, హక్కులు, బాధ్యతలు తెలుసుకొని ప్రవర్తించడం, రాజకీయ పార్టీలలో సభ్యత్వంతో పాటు రాజకీయేతర స్వచ్ఛంద సంస్థలలో అనగా పౌర సమాజంలో చురుకుగా పాల్గొనడం జరగాలి. పౌర సమాజంలో పాల్గొనడం ద్వారా వివిధ సమూహాలతో కలసి పనిచేసే అవకాశం వస్తుంది. సహనం, సామరస్యం వంటి విలువలు తెలుసుకునే అవకాశం లభిస్తుంది  ప్రజాస్వామ్యంలో ప్రతీ పౌరుడు దేశం మొత్తాన్ని ప్రభావితం చేసే అంశాలు అనగా, ఆర్థిక వ్యవస్థ, పర్యావరణం, విదేశాంగ విధానం వంటి వాటి పట్ల అవగాహనను కలిగి వుండాలి. ప్రజా జీవితంలో పాల్గొనడమే ప్రజాసామ్యంలో పౌరుని యొక్క ముఖ్య పాత్ర.

## 19.7 జవాబుదారీ వ్యవస్థ

ప్రజాస్వామ్యం అంటే ప్రజల ప్రభుత్వం మరియు ప్రజలకు జవాబుదారీగా వుంటుంది. ప్రజలు తమ హక్కులు, విధుల గురించి తెలుసుకుంటేనే మంచి ప్రజాస్వామ్య ప్రభుత్వం సాధ్యమవుతుంది.

> బాబా సాహెబ్ అంబేద్కర్ చెప్పినట్లుగా పౌరులు తమ హక్కులను నిలబెట్టుకోవడానికి ప్రతిదీ చేయాలి, “మనం పోగొట్టుకున్న హక్కులు ఎప్పుడూ దోపిడీదారుల మనస్సాక్షికి చేసిన విజ్ఞప్తుల ద్వారా తిరిగి పొందలేము. కానీ వాటిని తిరిగి అవిశ్రాంతమైన పోరాటం ద్వారామాత్రమే సాధించగలం. మేకలను బలి అర్పణల కోసం ఉపయోగిస్తారు తప్ప సింహాలను కాదు.”

ప్రజాస్వామ్యంలో పౌరుడికి అనేక బాధ్యతలు ఉన్నాయి. ప్రభుత్వం ఏమి చేస్తుందో వారు ఎల్లప్పుడూ తెలుసుకోవాలి. ప్రభుత్వాలు సంస్థలు కూడా పారదర్శకంగా, జవాబుదారీతనంగా వుండాలి. చట్టాన్ని పాటించాల్సిన బాధ్యత పౌరుడికి ఉండాలి. ప్రభుత్వాలు ఎన్నికలలో ఇచ్చిన హామీలు నెరవేర్చ లేక పోవడాన్ని ప్రజలు గుర్తించినపుడు వాటిని ప్రసార మాధ్యమాల ద్వారా బహిరంగపరచడం లేదా నాయకుల, అధికారుల దృష్టికి తీసుకెళ్ళి వారిని బాధ్యులుగా చేయాలి. సమస్యల పరిష్కారం కోసం వివిధ రకాల పౌర ఆందోళనలు, అహింసా మార్గంలో చేయాలి. సమాచార హక్కు చట్టం-2005 ప్రభుత్వాలను జవాబుదారీగా చేసే విధంగా పౌరులకు అభించిన ఒక ఆయుధం. ఇవేకాకుండా ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా ఉండడానికి తీసుకోవలసిన మరికొన్ని చర్యలు.

**ఫిర్యాదులు తీసుకోవడానికి ఒక వేదికను ఏర్పాటు చేయుట:** ఫిర్యాదులు దాఖలు చేయడానికి, ప్రభుత్వ సమాచారాన్ని అభ్యర్థించడానికి పౌరులు ఉపయోగించగల ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లను లేదా ఇతర అధికారిక కమ్యూనికేషన్ పద్ధతులను ప్రభుత్వాలు ఏర్పాటు చేయాలి. వచ్చిన ఫిర్యాదులకు, అభ్యర్థనలకు అధికారులు ప్రతిస్పందించాలి.

1. **సమర్థవంతమైన వివాద పరిష్కారం:** పౌరులు, ప్రభుత్వం మరియు ప్రభుత్వ ఉద్యోగుల మధ్య వివాదాలను న్యాయంగా పరిష్కరించడానికి  మరియు న్యాయ ప్రక్రియను క్రమబద్ధీకరించడానికి, న్యాయస్థానాలు నిష్పాక్షికంగా ఉండాలి.
2. **పర్యవేక్షణ:** పౌరులను అధికారులను జవాబుదారీగా ఉంచడంలో సహాయపడటానికి, ప్రభుత్వం కార్యాలయాల బాధ్యతలు మరియు అధికారాలను స్పష్టంగా నిర్వచించాలి. అధికారుల పనితీరును మదింపు చేయడానికి వారిపై నిరంతర పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేస్తే వారిలో జవాబుదారీతనం పెరిగే అవకాశం వుంటుంది.

## 19.8 ముగింపు (ముఖ్యాంశాలు)

- ప్రజాస్వామ్యం ఒక ప్రభుత్వ విధానం, ఇది ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజా ప్రతినిధులచే నిర్వహించబడుతుంది
- ప్రజాస్వామ్యం రెండు రకాలు 1. ప్రత్యక్ష ప్రజాస్వామ్యం, 2. పరోక్ష ప్రజాస్వామ్యం
- అధిక జనాభా కలిగి వుండడం వల్ల మన దేశం పరోక్ష ప్రజాస్వామ్యం అనుసరిస్తుంది.
- ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ప్రధానం మరియు ప్రజలకు ప్రాథమిక హక్కులు కల్పించబడుతాయి.
- భారతదేశ ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న ముఖ్యమైన సవాళ్ళు: పేదరికం, అధిక జనాభా, నిరక్షరాస్యత, లింగ అసమానత్వం, కులతత్వం, మతతత్వం, ప్రాంతీయతత్వం, పార్టీ ఫిరాయింపులు మొదలగునవి. ప్రజాస్వామ్య బలోపేతానికి పౌరుల భాగస్వామ్యం చాలా కీలకం. ప్రభుత్వాలు కూడా జవాబుదారీతనం కలిగి వుండాలి.

## 19.9 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 1-2 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. ప్రజాస్వామ్యం ఎన్ని రకాలుగా వర్గీకరించవచ్చు?
2. భారతదేశం ప్రాతినిధ్య ప్రజాస్వామ్యాన్ని అనుసరించడానికి గల కారణమేమిటి?

**II. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 4-5 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. ప్రజాస్వామ్య ప్రభుత్వ విధానాన్ని నీవు సమర్థిస్తావా? ఎందుకు?
2. సమన్యాయ పాలన అనగానేమి?

**III. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 8-10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. ప్రస్తుత ప్రజాస్వామ్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను పేర్కొని ఏవైనా రెండింటిని వివరించుము.
2. "ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అతి ముఖ్యమైనది" అని ఎలా చెప్పగలవు?
3. ప్రసార మాధ్యమాలు తమ బాధ్యతను సరిగ్గా నెరవేరుస్తున్నాయని నీవు అనుకుంటున్నావా? వివరింపుము.

**IV. కింది వాటిలో సరైన జవాబును ఎంపిక చేయండి.**

1. క్రింది ఏ సూత్రంపై ప్రజాస్వామ్యం ఆధారపడి వుంటుంది ( )

   ఎ) సామ్యవాదం బి) రాజకీయ సమానత్వం సి) విభజన డి) ఆర్థిక సమానత్వం

2. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ప్రధాన లక్ష్యం ( )

   ఎ) 100 రోజుల ఉపాధి కల్పన బి) 200 రోజుల ఉపాధి కల్పన

   సి) సంవత్సరమంతా ఉపాధి కల్పన డి) నిరుద్యోగులకు భృతి చెల్లించడం

## 19.10 ఉపయుక్త గ్రంథాలు


- SCERT, Telangana సాంఘికశాస్త్ర పుస్తకాలు

# 20 సమకాలీన అంశాలు - సంబంధిత చట్టాలు

## 20.0 అభ్యసన ఫలితాలు

- భారత దేశం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలను పేర్కొంటారు.
- మహిళలు, చిన్నపిల్లలపై జరిగే హింసను అరికట్టడానికి తగు సూచనలు, సలహాలు ఇస్తారు.
- ఆర్టికల్ 370 ఎందుకు రద్దు చేయవలసి వచ్చిందో వివరిస్తారు.

## 20.1 పరిచయం

వలస పాలనలో భారతీయులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని ఇంతకుముందు పాఠాలలో మనం చూశాం. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి పేదరికం, నిరుద్యోగం పారద్రోలుతామని అధికారంలోకి వచ్చిన ప్రతీ ప్రభుత్వం చెపుతూనే వున్నా అది ఇంకా కనుచూపుమేరలో లేదు. మహిళలు, అణగారిన వర్గాల ప్రజలపై ఇంకా వేధింపులు కొనసాగుతూనే వున్నాయి. పర్యావరణం క్షీణిస్తూనే ఉంది. బాల్య వివాహాలు జరుగుతూనే వున్నాయి. అవినీతి విశృంఖలంగా విస్తరిస్తూనే ఉంది. భారతదేశంలోని సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో చోటు చేసుకుంటున్న పలు ముఖ్య అంశాలను, వాటి నివారణకై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన కొన్ని చట్టాలను గురించి ఈ పాఠంలో చూద్దాం.

## 20.2 సామాజిక, ఆర్థిక అంశాలు

సమాజం అంటే వ్యవస్థీకృత మార్గంలో కలిసి జీవించడం. విభిన్న, నిర్దిష్ట సాంస్కృతిక, భాష, మత విశ్వాసాలు, సంప్రదాయాలు, నమ్మకం, ప్రాంతీయత మొదలైన అంశాలు ప్రతి సమాజానికి వుంటాయి. సమాజంలో అస్తవ్యస్తత కారణంగా సామాజిక సమస్యలు సృష్టించబడతాయి. క్రమంగా, అవి పేరుకుపోయి సాధారణ సామాజిక జీవితాన్ని ప్రభావితం చేస్తాయి. ఒక్కసారి సామాజిక సమస్య వేళ్లూనుకొని అభివృద్ధి చెందితే, సహనం యొక్క హద్దులు దాటి దానిపై ఆగ్రహం తలెత్తుతుంది. అప్పుడు సామాజిక సామరస్యం మరియు సమస్యల యొక్క పరిష్కారం కోసం డిమాండ్ పెరుగుతుంది. ఈ సామాజిక సమస్యల వల్ల బడుగు బలహీన వర్గాల ప్రజలే ఎక్కువగా ఇబ్బందులుపడతారు. అటువంటి సామాజిక సమస్యలలో సమకాలీన అంశాలను వాటి పరిష్కారం కోసం ప్రభుత్వాలు చేసిన చట్టాలను కొన్నింటిని పరిశీలిద్దాం.

### 20.2.1 కులతత్వం

భారతదేశంలో ప్రాచీన కాలం నుండి వర్ణ వ్యవస్థ కొనసాగుతూ వుంది. ఈ వర్ణ వ్యవస్థ లేదా కుల వ్యవస్థ ఒక వ్యక్తికి చెందిన ప్రత్యేక కులానికి సంబంధించి వృత్తులను నిర్దేశించింది. పూర్వ కాలంలో అన్ని కులాలు సమాజంలో సమాన బాధ్యతలు నిర్వహిస్తూ ఒకరికి ఒకరు సహకరించుకుంటూ గౌరవంగా కొనసాగేవి. కానీ రానురాను కులాల మధ్య వైషమ్యాలు పెరగసాగాయి. కొన్ని కులాల వారు దోపిడీకి గురయ్యారు.

ప్రజాస్వామ్యం మానవ సమానత్వాన్ని ప్రోత్సహిస్తుంది. కుల వ్యవస్థ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. అనేక సార్లు జాతీయ ప్రయోజనాల కంటే కుల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల జాతీయ ఐక్యత అనే భావన ప్రాముఖ్యత తగ్గిపోతుంది. సమాజం కులానికి చెందిన కృత్రిమ సమూహాలుగా విభజించబడింది. కుల ఆధారిత వివక్ష కొన్నిసార్లు హింసకు దారి తీస్తుంది. ఏ రూపంలో ఉన్నా కుల వివక్ష నేరమే. కులమే భారతదేశంలో మానవ హక్కుల ఉల్లంఘనలకు ప్రధాన మూల కారణం. కుల వివక్ష సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వాలు చేపట్టిన కొన్ని చర్యలు.

**రాజ్యాంగంలోని ఆర్టికల్ 46:** ప్రకారం కుల వివక్షతకు ఎక్కువగా గురయ్యే SC మరియు ST వర్గాల వారికి ప్రత్యేక శ్రద్ధతో విద్యను కల్పించి, ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వాలు అవకాశాలు కల్పించాలి.

**పౌర హక్కుల రక్షణ చట్టం 1955 ఆర్టికల్ 17** ప్రకారం అన్నీ రూపాలలో వున్న అంటరానితనం నిషేధం.

**ఎస్సీ, ఎస్టీ వేధింపుల నివారణ చట్టం, 1989:** ఎస్సీ, ఎస్టీలపై దారుణాలను క్రిమినల్ ఐపిసి కిందకు తీసుకువచ్చారు. ప్రత్యేక కోర్టులు, వేగవంతమైన విచారణ, ద్వారా శిక్షలు అమలు చేస్తారు.

**రాజ్యాంగం 65 వ సవరణ చట్టం, 1990:** 12 మార్చి, 1992 న ఎస్సీ మరియు ఎస్టీల జాతీయ కమిషన్ ఏర్పాటు చేయబడింది.

### 20.2.2 మహిళల అంశాలు

వేద కాలం నుండి మన దేశంలో స్త్రీలు దేవతాస్వరూపులుగా కీర్తించబడేవారు. సమాజ నిర్మాణంలో స్త్రీల పాత్ర చాలా కీలకమైనది. జనాభాలో సగం వున్న మహిళలు పురుషులతో పాటు సమాన హక్కులు కలిగి ఉన్నారు. స్త్రీల హక్కులను గౌరవించి, వారికి విద్యావకాశాలు కల్పించిన సమాజాలన్నీ అభివృద్ధి పథంలో ముందున్నాయి.

సమాజంలో పేరు ప్రఖ్యాతులు పొందుతున్నప్పటికి ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మంది మహిళలు వేధింపులకు, గృహ హింసకు గురవుతున్నారు. మహిళలు తమ ఇళ్లలో, బహిరంగ ప్రదేశాల్లో లేదా కార్యాలయంలో ఉన్నా సురక్షితంగా ఉండరు. మాటలతో వేధించడం, చేతలతో బాధించడం, తక్కువ చేసి మాట్లాడడం, ఎగతాళి చేయడం, లైంగిక హింసకు గురిచేయడం, వరకట్న వేధింపులు వంటి మానసిక, శారీరక హింసకు గురవుతున్న వారి గురించి మనం వింటూనే ఉన్నాం. కొంత మంది బాలికలను, మహిళలను అక్రమ రవాణా చేస్తున్నారు మరియు బలవంతంగా వ్యభిచారంలోకి దింపడం చేస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం కూడా పొందడం లేదు.

ఇవన్నీ మహిళలకు గల మానవ హక్కులను హరించి వేయడం మరియు వివక్షతను చూపడమే అవుతుంది. వీటి నుండి మహిళలు, బాలికలు రక్షణ పొందాలంటే వారికి సంబంధించిన హక్కులు మరియు చట్టాల గురించిన అవగాహన కలిగి ఉండాలి. అప్పుడే వారు గృహ హింస, వేధింపుల నుండి రక్షణ పొందగలుగుతారు.

**మీకు తెలుసా?**

**బాలికల మరియు మహిళా రక్షణ చట్టాలు**

- **వరకట్న వేధింపుల చట్టం 1961:** కట్నం ఇవ్వడం, తీసుకోవడం కూడా నేరమే. ఈ చట్టాన్ని ఉల్లంఘించిన వారికి కనీసం 5 సంవత్సరాల జైలు శిక్ష ,15 వేల వరకు జరిమానా విధించే అవకాశం వుంది.
- **గృహ హింస నుండి మహిళా రక్షణ చట్టం 2005:** దీనిలో అన్ని రకాల - గృహహింస, మాటలతో లేదా చేతలతో బాధించినా, లైంగిక హింసకు గురిచేసినా, సదరు బాధిత మహిళ ఫిర్యాదు చేస్తే భారత శిక్షా స్మృతి 489 A ప్రకారం ఆమెకు తగిన రక్షణ కల్పిస్తారు.
- **నిర్భయ చట్టం:** బాలికల మరియు మహిళల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం క్రిమినల్ న్యాయ సవరణ చట్టం 2013 ఆమోదించింది.
- **పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2013:** పని ప్రదేశాలలో తమపై జరిగే లైంగిక హింస, వేధింపులపై మహిళలు తమ పైఅధికారులకు ఫిర్యాదు చేసి రక్షణ కల్పించమని కోరవచ్చు.
- **ముస్లిం మహిళల (వివాహంపై హక్కుల పరిరక్షణ) చట్టం, 2019:** ఈ చట్టాన్ని పార్లమెంటు ఉభయ సభలు ఆమోదించాయి. ఈ చట్టం, ట్రిపుల్ తలాక్, అనగా తలాక్-ఎ-బిద్దత్ చట్టవిరుద్ధమని ప్రకటించింది. అలాంటి తలాక్‌ను తన భార్యకు ఇవ్వదలిచే, ఉచ్చరించే ఏ ముస్లిం భర్త అయినా మూడేళ్ల జైలు శిక్ష మరియు జరిమానా కూడా చెల్లించాల్సి ఉంటుంది.

### 20.2.3 బాలల అంశాలు - చట్టాలు

ఎటువంటి లింగ భేదం లేకుండా 18 సంవత్సరాల లోపు గల పిల్లలందరూ బాలలుగానే పరిగణింపబడుతారు. నేటి బాలలే రేపటి పౌరులు కదా! ప్రభుత్వపరంగా బాలల హక్కులకు భద్రత కల్పించాలి. భారత రాజ్యాంగంలోని నిర్దేశిక సూత్రంగా, "పిల్లలకు ఆరోగ్యకరమైన పద్ధతిలో మరియు స్వేచ్ఛ మరియు గౌరవం ఉన్న పరిస్థితులలో అభివృద్ధి చెందడానికి అవకాశాలు మరియు సౌకర్యాలు కల్పించబడాలని మరియు నైతిక మరియు శారీరిక దోపిడీకి వ్యతిరేకంగా బాల్యం మరియు యువత రక్షించబడాలని" ఉంది.

బాలలకు సంబంధించిన కొన్ని సమస్యలు మనం చర్చించే ముందుగా బాలల హక్కుల గురించి తెలుసుకుందాం.

## బాలల హక్కులు

1. జీవించే హక్కు.
2. తల్లిదండ్రులతో గడిపే హక్కు.
3. విషయ పరిజ్ఞానం పెంచుకోవటం, వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా ప్రపంచ విషయాలపై అవగాహన పెంచుకునే హక్కు.
4. బాధాకరమైన, దౌర్జన్యపూరితమైన, హానికరమైన వాటి నుండి రక్షణ పొందే హక్కు.
5. ప్రత్యేక అవసరాలుగల పిల్లలు కూడా సంపూర్ణ జీవితం గడపటానికి, అభివృద్ధిలోకి రావటానికి ప్రత్యేక సంరక్షణా హక్కు.
6. పూర్తి ఆరోగ్యం, వైద్య సౌకర్యం పొందే హక్కు.
7. బాలలు మాతృ భాషలో మాట్లాడే హక్కు, వారి మత, సాంప్రదాయాలు పాటించే హక్కు.
8. ఆటలాడుకునే హక్కు.
9. హానికరమైన మందులు వాడుట, తయారుచేయుట, కొనుట నుండి రక్షణ పొందే హక్కు.
10. బాధించబడినా, నిర్లక్ష్యం చేయబడిన రక్షణ పొందే హక్కు.

**మీకు తెలుసా?**

**ఆపరేషన్ ముస్కాన్ అంటే..**

తల్లిదండ్రులు లేక కొందరు, ఇంటి నుంచి పారిపోయి వచ్చినవారు మరికొందరు అనాథల్లా జీవితం గడుపుతుంటారు. ఇలాంటి వారిని రాష్ట్ర వ్యాప్తంగా ఏకకాలంలో బహిరంగ ప్రదేశాల్లో గుర్తించడానికి పోలీసు బృందాలు, బాలల స్వచ్ఛంద సంస్థలు చేపట్టే కార్యక్రమాన్నే **ఆపరేషన్ ముస్కాన్** అంటారు.

ఇన్ని హక్కులు ఉన్నప్పటికీ బాలలకు రక్షణ కరువైంది. చాలా మంది చదువులకు దూరంగా బాల కార్మికులుగా, పరిశ్రమలలో, గనులలో, వ్యవసాయ పనులలోకి పంపబడుతున్నారు లేదా తమ తోబుట్టువులను, ఇంట్లో వుండే వృద్ధులను చూసే బాధ్యత తీసుకుంటున్నారు. కొంత మంది పిల్లలు అక్రమ రవాణా చేయబడుతున్నారు. దీని వల్ల పిల్లలు వారి బాల్యాన్ని కోల్పోతున్నారు. ఇది వారి శారీరక మరియు మానసిక అభివృద్ధికి హానికరం. భారతదేశంలో బాల కార్మికులకు పేదరికం, మంచి పాఠశాలలు లేకపోవడం, చదువు ప్రాముఖ్యత తెలియకపోవడం ముఖ్యమైన కారణాలుగా భావించవచ్చు. చాలా మంది బాలికలకు బాల్య వివాహాలు జరిగి అంధకారంలోకి నెట్టబడుతున్నారు.

## బాలలను రక్షించే చట్టాలు

1. **బాల్య వివాహాల నిరోధక చట్టం 2006:** వివాహ సమయానికి అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండి వుండాలి. ఇద్దరిలో ఎ ఒక్కరికి నిర్ణయించిన వయస్సు కంటే తక్కువగా వుంటే ఇద్దరిలో వయస్సులో పెద్దవారు మరియు ఆ వివాహాన్ని ప్రోత్సాహిస్తున్నవారు కూడా శిక్షించబడుతారు.

2. **ఫాక్టరీల చట్టం 1948:** 14 సంవత్సరాలు లోపు పిల్లలు ఫాక్టరీలలో పనిచేయుట నిషేధం

3. **గనుల చట్టం 1952:** ప్రమాదకరమైన గనులలో గాని, ప్రదేశంలో గాని పిల్లలు ఎవ్వరూ ఉండకూడదు.

4. **బాల కార్మిక చట్టం 1986:** ప్రమాదకరమైన లేదా ప్రమాదకరం కానీ ఏ పనులలో కూడా పిల్లలు పని చేయకూడదని చెపుతుంది.

5. **లైంగిక వేధింపుల నుండి పిల్లల రక్షణ చట్టం, 2012:** లైంగిక వేధింపులు మరియు అశ్లీలత వంటి నేరాల నుండి పిల్లల రక్షణ కోసం ఒక బలమైన చట్టపరమైన చట్రాన్ని అందించడానికి రూపొందించబడింది.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. బాల కార్మిక వ్యవస్థకు ఏవైనా రెండు కారణాలు రాయండి.

### 20.2.4 వలసలు

భారతదేశంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 30.7 కోట్ల మంది వలస వెళ్ళారు. జనాభాలో ప్రతీ నాల్గవ వ్యక్తి వలస వెళ్ళిన వారే. ఒక వ్యక్తి తన జన్మ స్థానం నుండి కనీసం ఆరు నేలలు లేదా అంతకు మించి ఎక్కువకాలం ఇతర ప్రాంతాలలో నివాసం ఉంటే దానిని వలసగా భావిస్తారు. వివిధ ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలవల్ల ఇతర ప్రాంతాలకు ప్రజలు వలస వెళతారు. వలసలు మూడు రకాలుగా వుంటాయి. అవి: 1. అంతర్జాతీయ వలసలు – ఒక దేశం నుండి ఇతర దేశాలకు వెళ్ళడం, 2. జాతీయ వలసలు – దేశం లోపల ఒక ప్రాంతం నుండి వేరొక ప్రాంతానికి వలస వెళ్ళడం, 3. కాలానుగుణ వలసలు – కేవలం ఒక కాలం లేదా ఋతువులో వలస వెళ్ళి తిరిగి రావడం.

అధిక ఉపాధి అవకాశాలు, ఉన్నత ఉద్యోగాలు, అధిక వేతనాలు మొదలగునవి వలసలను ఆకర్షిస్తాయి. అధిక జనాభా, అల్ప ఉపాధి, తక్కువ వేతనాలు వంటివి ప్రజలను వలస వెళ్ళేలా చేస్తాయి. వలస వెళ్ళడం వలన ప్రజలు ఆర్థికంగా బలపడతారు, వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది, నైపుణ్యాలు పెంపొందించుకుంటారు. వలసల వలన కొన్ని సమస్యలు కూడా ఉంటాయి. వలస వెళ్ళిన వాళ్ళ మీద వలస ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుంది. భిన్నమైన వాతావరణంలో ఉండవలసి రావడం, దాని వల్ల కలిగే వత్తిడి, ఆహార మార్పు, సామాజిక వాతావరణం వల్ల చాలా ఇబ్బందులు కూడా ఎదుర్కొంటారు.

వలస కార్మికులను రక్షించడానికి ప్రభుత్వాలు చేసిన కొన్ని చట్టాలు, సౌకర్యాలు ఒకసారి చూద్దాం.

- మానవ హక్కుల యొక్క సార్వత్రిక ప్రకటన ఆర్టికల్ 22 ప్రకారం, సమాజంలోని ప్రతి సభ్యునికి సామాజిక భద్రతకు హక్కు ఉంది.
- **ఇంటర్–స్టేట్ మైగ్రెంట్ వర్క్‌మెన్ చట్టం 1979:** వలస కార్మికుల హక్కులను పరిరక్షించడానికి అమలు చేసిన (ఉపాధి నియంత్రణ మరియు సేవా నిబంధనలు) చట్టం. ఈ చట్టం అంతర్–రాష్ట్ర వలసదారుల ఉపాధిని మరియు వారి సేవా పరిస్థితులను నియంత్రించడానికి ప్రయత్నిస్తుంది.

- **కాంట్రాక్ట్ లేబర్ ఆక్ట్ (నియంత్రణ మరియు నిర్మూలన) 1970:** ఒప్పంద కార్మికుల దోపిడిని నివారించి వారి పరిస్థితులను మెరుగుపరచడం కోసం ప్రవేశ పెట్టారు.
- కార్మికుల హక్కుల రక్షణకై లేబర్ కమిషన్ ఏర్పాటు చేయనైనది.
- భారత దేశీయులు విదేశాలకు వలస వెళ్ళి పని చేయడాన్ని వలసల చట్టం, 1983 అనే భారత దేశ చట్టం పర్యవేక్షిస్తుంది. పని నిమిత్తం వెళ్ళే వాళ్ళ ప్రయోజనాలను కాపాడటానికి ఇది కొన్ని షరతులు విధిస్తుంది.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. వలస వెళ్ళిన ప్రాంతంలో వలస కార్మికులు ఎదుర్కొన్న సమస్యలు వివరించండి.

## 20.2.5 అవినీతి, లంచగొండితనం

చట్టబద్ధంకాని మార్గంలో అన్యాయంగా, సులువుగా, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించడాన్ని అవినీతి లేదా లంచగొండితనం (scam) అంటారు. అవినీతి అనేది వివిధ రూపాలలో ఉంటుంది. వ్యక్తులను వారి విధుల నుండి దూరం చేయుట లేదా వారి హక్కులను వారు పొందకుండా చేయుట కూడా అవినీతే, నైతిక విలువలు పాటించకపోవడం, దొంగతనాలు, ప్రజా ఆస్తుల వృథా. నిజాయితీ లేకపోవడం, దోపిడీ, దుర్వినియోగం, మోసాలు మరియు కుంభకోణాలు అవినీతి యొక్క వివిధ వ్యక్తీకరణలు.

అవినీతి లేదా లంచగొండితనం వల్ల చాలామంది పేదవారు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. వారి సమస్యలు తీర్చుకోలేకపోతున్నారు. హక్కులు అనుభవించలేకపోతున్నారు. సత్వర న్యాయం పొందలేకపోతున్నారు.

### సమాచార హక్కు చట్టం

2005లో అమలు చేయబడిన, ఈ చట్టం ద్వారా ప్రభుత్వ అధికారులు పౌరులు కోరిన సమాచారాన్ని తప్పని సరిగా అందించాలి లేదా శిక్షాత్మక చర్యలను ఎదుర్కోవలసి ఉంటుంది.

### ప్రజాసేవల హక్కు చట్టం

భారతదేశంలోని 19 రాష్ట్రాల్లో అమలు చేయబడింది. ప్రభుత్వం పౌరులకు అందించే వివిధ ప్రజా సేవలకు సమయానుసారంగా అందించడానికి హామీ ఇస్తుంది మరియు శాసనం ప్రకారం నిర్దేశించిన సేవలను అందించడంలో లోపాలు జరిగినపుడు శిక్షించే యంత్రాంగాన్ని అందిస్తుంది.

### భారతదేశంలో అవినీతి నిరోధక చట్టాలు

భారతదేశంలో ప్రభుత్వ ఉద్యోగుల అవినీతికి జరిమానా విధించవచ్చు.

1. భారతీయ శిక్షాస్మృతి, 1860 ఆదాయపు పన్ను చట్టం
2. 1961లోని ప్రాసిక్యూషన్ విభాగం
3. అవినీతి నిరోధక చట్టం, 1988
4. బినామీని నిషేధించడానికి 'ది బినామి లావాదేవీల (నిషేధ) చట్టం', 1988

5. మనీలాండరింగ్ నిరోధక చట్టం, 2002 అవినీతికి వ్యతిరేకంగా ఐక్యరాజ్యసమితి అవినీతి నిరోధక విస్తృత సదస్సు 2005లో తీసుకున్న చర్యలను ఆమోదిస్తూ భారతదేశం సంతకం చేసింది. (2011లో ఆమోదించబడింది)
6. లోక్‌పాల్ మరియు లోకాయుక్త చట్టం, 2013
7. విజిల్ బ్లోయర్స్ ప్రొటెక్షన్ యాక్ట్, 2011

ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు చేసినప్పటికీ ప్రజలు, అధికారులలో మార్పు రానంత వరకు ఈ జాడ్యాన్ని ఎవరు తగ్గించలేరు.

### 20.2.6 మాదక ద్రవ్యాలు

మద్యం/ మద్య పానీయాలు, పొగాకు, సిగరెట్లు, హెరాయిన్, కొకైన్, గంజాయి, మార్ఫిన్ వంటి హానికరమైన మత్తు పదార్థాల అలవాటు లేదా దానిపై ఆధారపడటాన్ని మాదకద్రవ్యాల దుర్వినియోగం లేదా వ్యసనం అని అంటారు. మాదకద్రవ్య దుర్వినియోగం యొక్క ఉచ్చులోకి యువకులతో పాటు పెద్దలు కూడా నెట్టబడుతున్నారు వీటికి ముఖ్య కారకాలలో తోటి స్నేహితుల యొక్క ప్రభావం మరియు అనుకూలత లేని కుటుంబ వాతావరణం మరియు ఒత్తిడి ఉన్నాయి. సరదాగా మొదలయ్యే ఈ అలవాటు. చివరికి బానిసగా మార్చుకుంటుంది. అనేక నేరాలు చేసేందుకు డ్రగ్స్ ప్రేరేపిస్తాయి. చదువులో వెనుకబడిపోతారు. ఏ పనీ చేయలేరు. స్నేహితులు, బాంధవ్యాలను మరిచి ఒంటరిగా కుంగిపోతారు. అవి దొరకని పరిస్థితిలో తమని తాము హింసించుకోవడం, చివరికి ఆత్మహత్యలకు కూడా దారితీయవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు.

మన దేశంలోకి ఈ మాదక ద్రవ్యాలు ఇతర దేశాల నుండి దొంగతనంగా సరఫరా (smuggling) చేస్తున్నారు. వీటిని చేరవేయటానికి అనేక రకాల మార్గాలు ఉపయోగించి కోట్లాది రూపాయలు సంపాదిస్తున్నారు. దేశంలోని యువతను వక్రమార్గంలోకి నెట్టడానికి, వారిని నిర్వీర్యం చేయడానికి దీనిని ఒక సాధనంగా వాడుతున్నారు.

మాదకద్రవ్యాల జాతీయ సంస్థ నివేదిక 2010 ప్రకారం మాదకద్రవ్యాలను సేవించే దురలవాటును నివారించడానికి, దాని నుండి యువతను కాపాడడానికి కుటుంబం, సమాజం యొక్క నివారణ కార్యక్రమాల పాత్రను నొక్కి చెప్పింది. మల్టీ డైమన్షనల్ ఫ్యామిలీ థెరఫీ, సకారాత్మక ప్రవర్తనా చికిత్స (Cognitive Behavioural Therapy-CBT) అనేది కుటుంబం ద్వారా మాదకద్రవ్యయాలు సేవించే వారికి ఇచ్చే ఒక రకమైన చికిత్స.

**మాదకద్రవ్యాలు – సంబంధిత చట్టాలు**

- మాదకద్రవ్యాల మరియు సైకోట్రోపిక్ పదార్థాల చట్టవిరుద్ధ అక్రమ రవాణా నిరోధ చట్టం (NDPS Act), 1988 మాదక ద్రవ్యాల మరియు సైకోట్రోపిక్ పదార్థాల అక్రమ రవాణా నిరోధక చట్టం 1988లో భారత పార్లమెంటు మాదకద్రవ్యాల నియంత్రణ కోసం ఆమోదించిన చట్టం. భారతదేశంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా మరియు దుర్వినియోగానికి వ్యతిరేకంగా బాధ్యత వహించే నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సిబి) అనేది ప్రధానమైన చట్టబద్ధమైన మరియు ఇంటెలిజెన్స్ ఏజెన్సీ. ఇది

మాదకద్రవ్యాల అక్రమ రవాణాను దుర్వినియోగాన్ని నివారిస్తుంది. ఎన్‌డిపిఎస్ (NDPS Act) చట్టాన్ని ఉల్లంఘించిన ఎవరైనా నిషేధించబడిన పదార్థం పరిమాణం ఆధారంగా శిక్షను ఎదుర్కొంటారు.

## 20.3 రాజకీయ అంశాలు

స్వాతంత్ర్యం సిద్ధించగానే రాజ్యాంగాన్ని రూపొందించుకొని ప్రజాస్వామ్య ప్రభుత్వ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నామని ముందు పాఠంలో తెలుసుకున్నాం కదా! ప్రజాస్వామ్యంలో ప్రజల ఆశయాలు, ఆకాంక్షలకు విలువ ఉంటుంది. స్వాతంత్ర్యం రావడం, దేశ విభజన కావడం ఒకేసారి జరిగాయి. అప్పటి నుండి కొన్ని రాష్ట్రాలలో శాంతి భద్రతల సమస్యలు, ఉగ్రవాదం కొనసాగుతూనే వున్నాయి. అటువంటి వాటిలో జమ్ము కాశ్మీర్ రాష్ట్రం గురించి క్లుప్తంగా పరిశీలిద్దాం.

### 20.3.1 ఆర్టికల్ 370 రద్దు

స్వాతంత్ర్యం వచ్చేనాటికి బ్రిటిష్ అధికారం కింద వివిధ స్థాయిలలో మన దేశంలో దాదాపు 550 సంస్థానాలు ఉండేవి. భారతదేశంలో వాటిని విలీనం చేసే బాధ్యతను సర్దార్ వల్లభాయి పటేల్‌కు అప్పగించారు. అతడు రాచరిక కుటుంబాలతో చర్చలు జరిపి సంస్థానాల విలీన ప్రక్రియ పూర్తి చేశాడు. 1947 ఆగష్టు 15 నాటికి కాశ్మీర్, హైదరాబాద్, జునాఘడ్‌లు తప్పించి మిగిలిన సంస్థానాలన్నీ భారతదేశంలో విలీనమయ్యాయి.

1947లో భారత్, పాకిస్థాన్ విడిపోయినా జమ్ముకశ్మీర్ ఏ దేశంలోనూ చేరలేదు. ఆ ఏడాది అక్టోబరు 20న పాక్‌లోని గిరిజన తెగలు ఆ దేశ సైన్యం సాయంతో కశ్మీర్‌పై దండయాత్ర చేశాయి. దీంతో కశ్మీర్ మహారాజు హరిసింగ్ సైనిక సాయం చేయాలని భారత్‌ను కోరారు. కశ్మీర్‌ను భారత్‌లో విలీనం చేయాలన్న భారత ప్రభుత్వ షరతుకు ఆయన అంగీకరించారు. భారత సైన్యం పాక్ శక్తులను తరిమికొట్టింది. అప్పటికే కశ్మీర్‌లోని 1/3 వంతు భూ భాగాన్ని పాకిస్థాన్ ఆక్రమించుకుంది. దీన్నే పాక్ ఆక్రమిత కాశ్మీర్‌గా పిలుస్తున్నాం. జమ్ముకశ్మీర్‌ను భారత్‌లో కలుపుతూ అక్టోబరు 26న భారత సర్కారుతో హరిసింగ్ ఒప్పందం కుదుర్చుకున్నారు. 1947 అక్టోబరు 26న కశ్మీర్‌ను భారత యూనియన్‌లో విలీనం చేశారు. రక్షణ, విదేశీ వ్యవహారా లు, కమ్యూనికేషన్లు అనే మూడు అంశాలకే ఈ విలీనం తొలుత పరిమితమైంది. 1949 జులైలో కాశ్మీర్ రాజకీయ పార్టీ నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత భారత ప్రభుత్వంతో చర్చల ఫలితంగా కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించాలని కోరాడు. జమ్మూ కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ నాటి భారత ప్రభుత్వం చేసిన ఏర్పాటే ఆర్టికల్ 370.

1947లో ఉపఖండం విభజించబడినప్పటి నుండి పాకిస్థాన్ భారతదేశంపై మూడు యుద్ధాలు చేసింది. కాశ్మీర్‌లోని యువతను ఉగ్రవాదం వైపు ప్రోత్సహిస్తూ పాకిస్తాన్ వేర్పాటువాద ఉద్యమాలను బలపరుస్తూ వస్తోంది. భారతదేశం మరియు పాకిస్తాన్ పరిపాలించే భూభాగాలను నియంత్రణ రేఖ (నియంత్రణ రేఖ) ద్వారా విభజించారు. ఈ విభజన రేఖ వద్ద భారతీయ మరియు పాకిస్తాన్ మిలిటరీల మధ్య తరచుగా కాల్పులుజరుగుతూనే వుంటాయి.

కాశ్మీర్లో ఆందోళనలు తగ్గించి శాంతిని నెలకొల్పాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వ జోక్యం అవసరమని భావించి ఆ రాష్ట్రానికి వున్న ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370 తొలగించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కేంద్ర కేబినెట్‌లో ఆమోదం, రాష్ట్రపతి సమ్మతి తర్వాత జమ్ము కాశ్మీర్ విషయంలో ఏడు దశాబ్దాలుగా

కొనసాగుతూ వస్తున్న 'జమ్ము-కాశ్మీర్ స్వయంప్రతిపత్తి, పునఃవ్యవస్థీకరణ బిల్లు-2019'తో 2019 ఆగస్టు 5 న రద్దయింది. ఇదే సమయంలో జమ్ము కాశ్మీర్‌ను మూడు ప్రాంతాలుగా విభజించారు. జమ్ము-కాశ్మీర్‌కు ఉన్న రాష్ట్ర హోదాను తొలగించి రెండు భాగాలుగా చేస్తూ అసెంబ్లీతో కూడిన కేంద్రపాలిత ప్రాంతంగా జమ్ము మరియు కాశ్మీర్‌ను, అదే సమయంలో లడఖ్‌ను అసెంబ్లీ రహిత కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించారు.

### మీ ప్రగతిని పరీక్షించుకోండి

1. ఉగ్రవాదం వల్ల జరిగే నష్టం వివరించండి.

## 20.4 ముగింపు (ముఖ్యాంశాలు)

- ప్రభుత్వాలు చేసిన చట్టాలు కఠినంగా అమలుచేసి నిమ్న కులాలపై జరిగే దౌర్జన్యాలను అరికట్టాలి.
- మహిళలపై వివక్ష వరకట్నం, గృహహింస, లైంగిక వేధింపులు, మహిళా చట్టాల గురించి మహిళలకు అవగాహన కల్పించాలి.
- బాలల హక్కులను కాపాడి వారికి సార్వత్రిక ఉచిత నిర్బంధ విద్యను అమలు చేస్తే బాలల సర్వతోముఖాభివృద్ధి సాధించవచ్చు.
- మాదకద్రవ్యాలకు సంబంధించి చట్టాలను వివరించి, వాటికి బానిసలు కాకుండా యువతను రక్షించి, వారిని సన్మార్గంలో నడిపినట్లైతే దేశ భవిష్యత్తు బాగుంటుంది.
- వలస కార్మికులు. వలస చట్టాలను తెలుసుకొని వాటి అమలు కోసం యాజమాన్యాలతో సంప్రదింపులు చేయవచ్చు.
- ఆర్టికల్ 370 రద్దు చేసి కాశ్మీర్‌ను విభజించి జమ్ము మరియు కాశ్మీర్‌ను అసెంబ్లీ కలిగిన కేంద్ర పాలిత ప్రాంతంగా, లద్దాఖ్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా చేశారు.

## 20.5 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 1-2 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. కులతత్వం వల్ల ఏర్పడే ఏవైనా రెండు సమస్యలు పేర్కొనుము.
2. వలసల వల్ల కలిగే ప్రయోజనాలేమిటి?

**II. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 4-5 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. మహిళా రక్షణ చట్టాలు రెండింటిని వివరించండి.
2. అవినీతి నిరోధించడానికి నీవేమి సూచనలు చేస్తావు?

**III. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 8-10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. బాలల హక్కులు మరియు రక్షణ చట్టాలను వివరించండి.
2. మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే సమస్యలను వివరించండి.

**IV. కింది వాటిలో సరైన జవాబును ఎంపిక చేయండి.**

1. అవినీతి రూపుమాపడంలో అతి ముఖ్యమైన చట్టం ( )

   ఎ) నిర్భయ చట్టం బి) సమాచార హక్కు చట్టం

   సి) పనుల చట్టం డి) ఆర్టికల్ 370

2. ఆర్టికల్ 370 రద్దు వలన ఏర్పడిన కేంద్ర పాలిత ప్రాంతాలు ( )

   ఎ) జమ్ము కాశ్మీర్, లడ్డాఖ్ బి) జమ్ము మరియు లడ్డాఖ్

   సి) లడ్డాఖ్ మరియు డయ్యూ డామన్ డి) ఢిల్లీ మరియు లడ్డాఖ్

# 21 సామాజిక, ఆర్థిక అభివృద్ధి - అనుకూల వర్గాల సాధికారత

## 21.0 అభ్యసన ఫలితాలు

- సామాజిక, ఆర్థిక, సుస్థిర అభివృద్ధి భావనలను వివరిస్తారు.
- మానవ వనరుల అభివృద్ధి నివేదిక 2019 ఆధారంగా దేశంలో సామాజిక, ఆర్థిక అభివృద్ధిలో అంతరాలను విశ్లేషిస్తారు.
- దేశంలో కొన్ని వర్గాల వెనుకబాటుకు గల కారణాలను చెబుతారు.
- 'సామాజిక న్యాయం' అంశంపై వ్యాఖ్యానిస్తారు.
- అనుకూల వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను, కార్యక్రమాలను చర్చిస్తారు.

## 21.1 పరిచయం

ఒక వ్యవస్థ లేక సమాజం యొక్క అభివృద్ధిని వివిధ రూపాల్లో అంచనా వేస్తారు. ఎలా అంచనా వేస్తారో తెలుసుకోవాలంటే ముందు అభివృద్ధి అంటే ఏమిటి? వివిధ రంగాల అభివృద్ధి భావనలను తెలుసుకుందాం.

### 21.1.1 అభివృద్ధి అంటే ఏమిటి?

ఒక సమాజం తన పురోగతి కోసం విధించుకున్న లక్ష్యాలను చేరుకోవడం కోసం నిరంతరం కృషి చేస్తుంది. ఈ క్రమంలో ఆ సమాజంలో జరిగే గుణాత్మక మార్పులను అభివృద్ధి అంటారు. సహజంగా ఒక దేశం/సమాజం యొక్క అభివృద్ధిని ఆర్థిక అంశాల ప్రాతిపదికన కొలిచేవారు. దానినే ఆర్థిక అభివృద్ధి అంటారు.

స్థూల దేశీయ ఉత్పత్తి (జి.డి.పి), జాతీయాదాయం, తలసరి ఆదాయం అనే అంశాలు ఆర్థికాభివృద్ధికి కొలమానాలుగా ఉంటాయి.

### 21.1.2 స్థూల దేశీయ ఉత్పత్తి (జి.డి.పి.)

ఒక సంవత్సర కాలంలో ఒక దేశంలో ఉత్పత్తి చేసిన అంతిమ వస్తు, సేవల విలువనే స్థూల దేశీయ ఉత్పత్తి అంటారు.

### 21.1.3 జాతీయాదాయం

ఒక సంవత్సరం కాలంలో ఒక దేశంలోని వ్యక్తుల మొత్తం ఆదాయాన్ని కలిపి జాతీయాదాయం అంటారు.

## 21.1.4 తలసరి ఆదాయం

ఒక దేశ జాతీయాదాయాన్ని ఆ దేశ మొత్తం జనాభాతో భాగించగా వచ్చే సరాసరిని తలసరి ఆదాయం అంటారు.

**కృత్యము**

1. భారతదేశ జిడిపి, జాతీయ ఆదాయం, తలసరి ఆదాయం ఎంతో తెలుసుకోండి.

## 21.2 సామాజిక అభివృద్ధి

ఆర్థిక అభివృద్ధి స్థూలంగా ఆర్థిక అంశాలలో ఒక దేశం లేదా వ్యవస్థ యొక్క అభివృద్ధి ఏ స్థాయిలో ఉందో లెక్కిస్తుంది. ఇది ఆ దేశంలో ప్రజల అభివృద్ధిని నిర్దిష్టంగా అంచనా వేయలేదు. ఒక వ్యవస్థలో ప్రజల ఉపాధి, సామాజిక న్యాయం, లింగ సమానత్వం, వనరుల పంపిణీ తదితర అంశాలలో అభివృద్ధిని అంచనా వేయడమే సామాజిక అభివృద్ధి. అంటే ఆర్థిక అభివృద్ధి యొక్క ఫలితాలు నిర్దిష్టంగా ప్రజలందరికీ సమానంగా పంపిణీ చేయబడితేనే సామాజిక అభివృద్ధి జరిగినట్లు. ఆర్థిక, సామాజిక అభివృద్ధి రెండు వేరు వేరు అంశాలుగా కనపడినప్పటికీ అంతర్లీనంగా రెండూ ఒకదానికొకటి సంబంధం కలిగి ఉంటాయి.

అయితే ఈ సూచికలు, అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరుతున్నాయా లేదా అన్న విషయాన్ని నిర్ణయించలేకపోతున్నాయి. అందుకే ప్రజల సమగ్ర అభివృద్ధిని అంచనా వేయడం కోసం 'మానవ అభివృద్ధి' అనే భావన ముందుకు వచ్చింది.

**కృత్యము**

1. భారతదేశంలో ఆర్థిక, సామాజిక అభివృద్ధి ఒకే రకంగా జరుగుతున్నదా? మీ ప్రాంత పరిస్థితుల ఆధారంగా అంచనా వేయండి.


## 21.3 మానవ అభివృద్ధి

ఒక వ్యవస్థలోని ప్రజల అభివృద్ధిని విస్తృత స్థాయిలో సమగ్రంగా పరిశీలించి అంచనా వేసేదే మానవాభివృద్ధి. ఇది ఆదాయమే కాక దాని నాణ్యత, పంపిణీ గురించి కూడా దృష్టి సారిస్తుంది.

మానవ అభివృద్ధి భావనను పాకిస్తాన్ ఆర్థిక వేత్త డాక్టర్ మహబూబ్-ఉల్-హక్, భారత ఆర్థిక వేత్త, నోబెల్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ అమర్త్యసేన్‌తో కలిసి అభివృద్ధి చేశాడు. 1990 వ సంవత్సరం నుండి ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం (యు.ఎన్.డి.పి.) ప్రతి సంవత్సరం వివిధ దేశాల మానవ అభివృద్ధిని అంచనా వేసి వార్షిక నివేదిక రూపంలో విడుదల చేస్తున్నది.

మానవాభివృద్ధి నివేదిక-1990 ప్రకారం భారతదేశం అట్టడుగు స్థానాలలో ఉన్నది. 2019 నివేదిక ప్రకారం మొత్తం 189 దేశాలలో 129 వ స్థానంలో ఉన్నది.

భారత ప్రభుత్వం కూడా రాష్ట్రాల వారీగా మానవాభివృద్ధి సూచీని తయారు చేస్తుంది. పటం-21.1 ద్వారా వివిధ రాష్ట్రాల స్థాయిని గమనించవచ్చు.




*పటం–21.1: భారతదేశ మానవ అభివృద్ధి సూచిక, 2018*

**కృత్యము**


1. మానవాభివృద్ధి నివేదిక ప్రకారం మన రాష్ట్రం ఏ స్థాయిలో ఉన్నది? రెండు కారణాలు తెలపండి.

## 21.4 సుస్థిర అభివృద్ధి

అభివృద్ధి అనే పేరుతో మనం సహజ వనరుల్ని విచక్షణారహితంగా వాడుతున్నాం. ఇది ఇలానే కొనసాగితే ఖనిజ వనరులైన బొగ్గు, పెట్రోల్, గ్యాస్ తదితరాలు కొన్ని దశాబ్దాల తర్వాత కనుమరుగవుతాయి. నీటి వనరులు, గాలిని కలుషితం చేస్తున్నాము. భవిష్యత్ తరాలు నివసించడానికి, వాడుకోవడానికి వనరులు లేకుండా మనమే వాడేస్తున్నాము. నిజమైన అభివృద్ధి అంటే ఇదేనా? ఆలోచించండి.

ప్రస్తుత తరాల వారు తమ అభివృద్ధి కోసం అందుబాటులో ఉన్న వనరులను సక్రమంగా వాడుకుంటూనే భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉంచడాన్నే సుస్థిర అభివృద్ధి అంటారు. ఆర్థిక, సామాజిక, మానవ అభివృద్ధితో పాటు పర్యావరణ అభివృద్ధి కూడా జరిగితేనే అది సమగ్ర అభివృద్ధిగా పరిగణించాలి.

వనరుల వాడకంలో పొదుపు పాటించాలి. తక్కువగా ఉన్న వనరుల స్థానంలో ప్రత్యామ్నాయ వనరులను వినియోగించాలి.




*పటం–21.2: సుస్థిర అభివృద్ధి చిత్రం*

**కృత్యము**

1. మానవ అభివృద్ధి సూచికలు, వివిధ రాష్ట్రాల పరిస్థితిని గమనిస్తే రాష్ట్రాల అభివృద్ధిలో అసమానతలకు కారణాలు ఏమిటి? ఆలోచించండి.

## 21.5 దేశంలో అభివృద్ధి - అసమానతలు

సమగ్ర అభివృద్ధి అంటే దేశంలో అన్ని ప్రాంతాల ప్రజలు అభివృద్ధి చెందడం. అభివృద్ధి ఫలితాలు ప్రజలందరూ సమానంగా వినియోగించుకోవాలంటే వివిధ ప్రాంతాల మధ్య అసమానతలను తొలగించి అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలి. అయితే మన దేశంలో వివిధ కారణాల వల్ల ప్రాంతీయ అసమానతలు పెరిగాయి.

### 21.5.1 అసమానతలకు కారణాలు

భౌగోళిక కారణాలు, సహజ వనరులు, బ్రిటిష్ వారి పాలన, మౌలిక సౌకర్యాల కొరత, ప్రభుత్వ విధానాలు, జనాభా పెరుగుదల, వ్యవస్థాపరమైన అంశాలు కూడా ప్రాంతీయ అసమానతలకు కారణమయ్యాయి.

### 21.5.2 అసమానతలను కొలిచే సూచికలు

తలసరి ఆదాయం, పేదరికం స్థాయి, వ్యవసాయ అభివృద్ధి, పారిశ్రామిక అభివృద్ధి, అక్షరాస్యత, రవాణా, సమాచార సౌకర్యాల ఆధారంగా అసమానతలను లెక్కిస్తారు. వివిధ రాష్ట్రాల మానవాభివృద్ధి సూచిక పట్టికను పరిశీలించండి.

*పట్టిక-21.1: దేశంలో వివిధ రాష్ట్రాల మధ్య అసమానతలు: HDI నివేదిక-2018*

| క్ర.సం. | రాష్ట్రము | HDI ర్యాంకు | | |
|---|---|---|---|---|
| | | 2004-05 | 2011-12 | 2017-18 |
| 1 | కేరళ | 1 | 1 | 1 |
| 2 | తెలంగాణ | 13 | 10 | 22 |
| 3 | బీహార్ | 20 | 21 | 36 |
| 4 | ఛత్తీస్‌గఢ్ | 18 | 19 | 31 |
| 5 | మధ్యప్రదేశ్ | 19 | 19 | 31 |
| 6 | పంజాబ్ | 2 | 4 | 9 |
| 7 | హిమాచల్ ప్రదేశ్ | 3 | 3 | 8 |
| 8 | తమిళనాడు | 4 | 2 | 11 |
| 9 | హర్యానా | 6 | 6 | 11 |
| 10 | ఒడిశా | 21 | 18 | 32 |

**కృత్యము**

1. మన రాష్ట్రం అభివృద్ధి చెందడానికి లేదా వెనుకబడటానికి రెండు కారణాలను రాయండి.

## 21.6 అననుకూల వర్గాలు

దేశంలో వివిధ ప్రాంతాల మధ్య అభివృద్ధిలో అసమానతలు ఉన్నట్లే ప్రజల అభివృద్ధిలో కూడా అసమానతలు ఉన్నాయి. మన దేశంలో కొన్ని సమూహాలు సామాజికంగా, ఆర్థికంగా వివక్షకు గురి అవుతున్నాయి. ఈ సమూహాలనే అననుకూల వర్గాలు లేదా బలహీన వర్గాలు అని అంటారు. షెడ్యూల్డ్ కులాలు (ఎస్.సి.), షెడ్యూల్డ్ జాతులు (ఎస్.టి.), ఇతర వెనుకబడిన తరగతులు (ఓబిసి), అల్ప సంఖ్యాకులు (మైనార్టీలు) ఉన్నారు.

భారతదేశంలో 2011 జనాభా లెక్కల ప్రకారం షెడ్యూల్డ్ కులాల వారు 17%, షెడ్యూల్డ్ తెగల వారు 8.6%, మైనారిటీలు 20% ఉన్నారు. మండల్ కమిషన్ నివేదిక ప్రకారం వెనుకబడిన తరగతులు 52% ఉన్నారు.

### 21.6.1 అననుకూల వర్గాలు - వెనుకబాటు

వ్యక్తుల మధ్య వైరుధ్యాలు సహజమే అయినప్పటికీ, ప్రత్యేకంగా కొన్ని వర్గాల మొత్తం వెనుకబాటుకు సామాజిక, ఆర్థిక, రాజకీయ, భౌతిక కారణాలు ఉన్నాయి.

**1. సామాజిక కారణాలు:** భారతదేశంలో ప్రాచీన కాలం నుండి సాంస్కృతికంగా, సామాజికంగా భిన్న వర్గాలు, సమూహాలు ఉన్నాయి. వాటిలో కొన్ని సామాజికంగా క్రింది స్థాయి వర్గాలుగా పరిగణించబడ్డాయి. ఇతర వర్గాలతో సమానంగా స్థాయి, గౌరవం, అవకాశాలు ఇవ్వబడలేదు.

**2. ఆర్థిక కారణాలు:** క్రింది స్థాయి వర్గాలు ఉత్పత్తిలో భాగస్వాములు అయినప్పటికీ ఫలితంలో వారికి భాగస్వామ్యం లేదు. ఉత్పత్తికి కీలకమైన కారకాలు భూమి, పరిశ్రమలు, పరికరాలపై యాజమాన్యం వారికి దక్కే అవకాశం లేకపోవడంతో ఆర్థికంగా మెరుగైన స్థితి పొందలేదు.

**3. రాజకీయ కారణాలు:** ప్రాచీన కాలం నుండి ఆయా వర్గాలకు అధికారం, పరిపాలనలో భాగస్వామ్యం లేదు. సామాజిక నియంత్రణ మొత్తంగా ఉన్నత వర్గాల చేతుల్లో ఉండేది.

**4. భౌతిక కారణాలు:** కొన్ని వర్గాలు భౌతికంగా అననుకూల ప్రాంతాల్లో నివసించడం వల్ల వారికి మిగిలిన సమాజంతో అనువైన సంబంధాలు ఏర్పడలేదు. అడవులు, కొండ ప్రాంతాల్లో నివసించే ఆదివాసీలకు వారి భౌతిక అననుకూల పరిస్థితుల వల్ల ఇతర సమూహాలతో కలయిక సాధ్యపడలేదు.

**5. ఇతర కారణాలు:** వీటితో పాటు రాచరిక పాలకులు, అనంతరం బ్రిటిష్ పాలకులు ఆయా అననుకూల వర్గాల అభివృద్ధిపై దృష్టి సారించలేదు. ఉపాధి, విద్య, మెరుగైన జీవన స్థితి కల్పించక పోవడం వల్ల వారి వెనుకబాటుతనం కొనసాగుతూ వచ్చింది. మరోవైపు వారు సామాజికంగా దోపిడీకి, అసమానతలకు గురయ్యారు.

**కృత్యము**

1. మన రాష్ట్రంలో అననుకూల వర్గాల అక్షరాస్యత స్థాయి ఏవిధంగా ఉంది?
2. సంచార జాతుల వారు అభివృద్ధిలో వెనుకబాటుకు గురవడానికి కారణాలు ఏమై ఉండవచ్చు?

## 21.7 సామాజిక న్యాయం

వ్యవస్థలో అందరికీ ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా సమానమైన హక్కులు, అవకాశాలు కల్పించడమే సామాజిక న్యాయం. అప్పటికే వెనుకబడి ఉన్న వర్గాలకు వివిధ రూపాలలో చేయూతనిచ్చి ఇతర వర్గాలతో సమానంగా అభివృద్ధి చెందేందుకు అవకాశం ఇవ్వాలి.

### 21.7.1 సామాజిక న్యాయ కల్పనలో ముఖ్యాంశాలు

1. వనరుల అందుబాటు
2. అవకాశాలలో సమానత్వం
3. భిన్నత్వం
4. భాగస్వామ్యం
5. మానవ హక్కులు

### 21.7.2 సామాజిక న్యాయం - రాజ్యాంగ హక్కులు

భారత రాజ్యాంగం అననుకూల వర్గాలకు సామాజిక న్యాయం కల్పిస్తూ దోపిడి నుండి వారికి విముక్తి కల్పిస్తున్నది. వీరి రక్షణ కోసం ప్రభుత్వాలు కొన్ని చట్టాలు చేశాయి.

**కృత్యము**

1. సామాజిక న్యాయం సాధించడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలి? సలహాలు ఇవ్వండి.

## 21.8 ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు - పథకాలు

### 21.8.1 అందరికీ విద్య

అందరికీ విద్య అందించడం కోసం సమగ్ర శిక్షా, మధ్యాహ్న భోజన పథకం, జాతీయ సాక్షరతా మిషన్ తదితర పథకాలు అమలు చేస్తున్నది.

### 21.8.2 అందరికీ ఆరోగ్యం

అందరికీ ఆరోగ్యం అందించడం కోసం జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్, జాతీయ నగర ఆరోగ్య మిషన్, జననీ సురక్ష యోజన, బాలికా సమృద్ధి యోజన, తదితర కార్యక్రమాలు అమలు చేస్తున్నారు.

### 21.8.3 షెడ్యూల్డ్ తెగల వారి కోసం అమలవుతున్న కొన్ని కార్యక్రమాలు

1. ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్‌లు
2. ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలలు
3. వనబంధు కళ్యాణ యోజన

### 21.8.4 షెడ్యూల్డ్ కులాలు, ఇతర వెనుకబడిన వర్గాల కోసం అమలవుతున్న కొన్ని కార్యక్రమాలు

1. ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు
2. బాలురకు, బాలికలకు ప్రత్యేక హాస్టళ్లు
3. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన
4. రాష్ట్రీయ వయోశ్రీ యోజన

విద్య, వైద్యం, ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలలో అననుకూల వర్గాల అభివృద్ధిలో ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయి. వారి అభివృద్ధికి అవసరమైన చట్టాల రూపకల్పన, అమలు విషయంలో కృషి చేస్తున్నాయి. ఫలితంగా పరిస్థితులు కొంత మెరుగయ్యాయి. స్వాతంత్ర్య పూర్వ పరిస్థితితో పోల్చినప్పుడు ప్రస్తుతం అననుకూల వర్గాలు పాక్షికంగా అభివృద్ధి చెందాయి.

**కృత్యము**

1. మీ ప్రాంతంలో ఎస్.సి., ఎస్.టి.ల అక్షరాస్యతా స్థాయి ఎలా ఉంది?

## 21.9 అననుకూల వర్గాల సాధికారత - అవరోధాలు

అననుకూల వర్గాలు సాధికారత సాధించడంలో కొన్ని అవరోధాలు ఏర్పడుతున్నాయి. గతం నుంచి ఉన్న కొన్ని సమస్యలు కొనసాగుతున్నాయి. సమస్యల పరిమాణం, సంక్లిష్టతలు అననుకూల వర్గాల సాధికారత, సామాజిక న్యాయం సాధనకు అవరోధాలుగా ఉన్నాయి.

1. విద్యలో వెనుకబాటుతనం-నిరక్షరాస్యత
2. ఆర్థిక వెనుకబాటు-పేదరికం
3. మార్కెట్ ఆర్థిక వ్యవస్థలో కనిష్ట భాగస్వామ్యం-అల్ప ఉపాధి
4. సామాజిక అణచివేత-దురాచారాలు
5. వేర్పాటు, దోపిడి
6. అననుకూల వర్గాలపై నేరాలు, అత్యాచారాలు
7. ఆధునిక నైపుణ్యాలు-సాంకేతికత కొరత

పై కారణాల వల్ల స్వాతంత్ర్యానంతరం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తున్నప్పటికీ ఆశించిన అభివృద్ధి జరగలేదు. వెనుకబాటుతనం, సామాజిక జాఢ్యాలు కొనసాగుతున్నాయి.

**కృత్యము**

1. అననుకూల వర్గాల సాధికారతకు ఉన్న అవరోధాలను రెండింటిని తెలపండి.
2. అననుకూల వర్గాలు సాధికారత సాధించాలంటే ఇంకా ఏమేం చేయాలో ఆలోచించండి.

## 21.10 అనుకూల వర్గాల సాధికారతకు తీసుకోవాల్సిన చర్యలు

సమగ్ర దృక్పథంతో కూడిన కార్యాచరణ ద్వారానే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుంది.

1. అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసే ప్రభుత్వ, ప్రభుత్వేతర ఏజెన్సీల మధ్య సహకారం, సమన్వయం పెరగాలి.
2. అంతరాలు, అణచివేత, దోపిడి లేకుండా సామాజిక రక్షణను కల్పించాలి.
3. విద్య, ఆర్థిక అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యతను ఇవ్వాలి.
4. అభివృద్ధి ఫలాలు అనుకూల వర్గాలకు అందేలా సూక్ష్మ ప్రణాళికలను అమలు చేయాలి.
5. పోషకాహారం, రక్షిత మంచి నీరు, ప్రాథమిక విద్య, ఆరోగ్యం, వసతి, పారిశుద్ధ్యం కల్పనకు ప్రాముఖ్యత ఇవ్వాలి.
6. అనుకూల వర్గాలు కేంద్రంగా అభివృద్ధి ప్రణాళికలను అమలు చేయాలి.
7. కార్యక్రమాల అమలులో అనుకూల వర్గాల భాగస్వామ్యం పెంపొందించాలి.
8. స్థానిక సంస్థల ప్రాధాన్యతను పెంచడం ద్వారానే క్షేత్ర స్థాయిలో అనుకూల వర్గాల ప్రత్యేక కార్యక్రమాల అమలు సాధ్యం అవుతుంది.
9. ప్రభావవంతమైన కార్యాచరణ, పర్యవేక్షణ, నియంత్రణ ఉండాలి.
10. బడ్జెట్లో ఆయా వర్గాలకు తగిన మేరకు నిధులు కేటాయించాలి.
11. అనుకూల వర్గాల రక్షణకు కేటాయించిన చట్టాలు పటిష్టంగా అమలు చేయాలి.
12. వివిధ కార్యక్రమాలు, పథకాల గురించి ఆయా వర్గాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి అవగాహన కల్పించాలి.

చిత్తశుద్ధి, నిజాయితీతో కూడిన కార్యాచరణ ద్వారానే అనుకూల వర్గాల సాధికారత సాధ్యమవుతుంది.

## 21.11 ముగింపు (ముఖ్యాంశాలు)

- ఒక వ్యవస్థలో ప్రజల అభివృద్ధిని ఆర్థిక, సామాజిక, రాజకీయ అంశాల ద్వారా మాత్రమే సమగ్రంగా అంచనా వేయగలం.
- సుస్థిర అభివృద్ధి మాత్రమే అసలైన అభివృద్ధి అని చెప్పవచ్చు.
- భారతదేశంలో అభివృద్ధి ఫలాలు కొన్ని వర్గాలకే అందుతున్నాయి. శతాబ్దాల తరబడి కొన్ని వర్గాలు వివక్షకు గురయ్యాయి.
- ఎస్.సి., ఎస్.టి., ఓబిసి, మైనారిటీలను కలిపి అనుకూల వర్గాలు అంటారు.
- అనుకూల వర్గాల వెనుకబాటుతనానికి సామాజిక, రాజకీయ, ఆర్థిక, భౌగోళిక కారణాలున్నాయి.
- అనుకూల వర్గాలకు సామాజిక న్యాయం అమలు చేయడానికి ప్రభుత్వాలు చట్టాలు రూపొందించి వారి అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు, పథకాలు అమలు చేస్తున్నాయి.

- 70 సంవత్సరాల స్వతంత్ర భారతం అననుకూల వర్గాల అభివృద్ధి కోసం చేసిన కృషి పాక్షిక ఫలితాలను మాత్రమే ఇచ్చింది.
- ప్రపంచీకరణ తర్వాత ఏర్పడిన మార్కెట్ ఆర్థిక వ్యవస్థలో అననుకూల వర్గాల అభివృద్ధి అవకాశాలు ఇంకా సన్నగిల్లుతున్నాయి.
- అననుకూల వర్గాల అభివృద్ధి జరగాలంటే ప్రస్తుతం ఉన్న అవరోధాలను అధిగమిస్తూ సమగ్ర దృక్పథంతో కూడిన కార్యక్రమాలను అమలు చేయాలి.
- అననుకూల వర్గాల అభివృద్ధికి ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు చొరవ తీసుకోవాలి. ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలి. అభివృద్ధిలో వారిని భాగస్వాములు చేయాలి.

## 21.12 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 1-2 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. సుస్థిర అభివృద్ధి అనగానేమి?
2. మానవాభివృద్ధి సూచికను తయారు చేసే సంస్థ ఏది?

**II. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 4-5 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. అననుకూల వర్గాల సాధికారతకు తీసుకోవాల్సిన చర్యలు ఏవి?
2. సామాజిక న్యాయం కల్పనలో ముఖ్యాంశాలు ఏవి?

**III. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 8-10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. అననుకూల వర్గాల కోసం ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలు ఏవి?

**IV. కింది వాటిలో సరైన జవాబును ఎంపిక చేయండి.**

1. మానవాభివృద్ధి సూచికలో ప్రథమ స్థానంలో ఉన్న రాష్ట్రం ఏది? ( )

   ఎ) తమిళనాడు బి) తెలంగాణ సి) కేరళ డి) హిమాచల్‌ప్రదేశ్

2. పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల ఏర్పాటు కోసం అమలవుతున్న కార్యక్రమం ( )

   ఎ) జాతీయ సాక్షరతా మిషన్ బి) సమగ్ర శిక్ష

   సి) సర్వ శిక్ష అభియాన్ డి) విద్యాహక్కు చట్టం

## 21.13 ఉపయుక్త గ్రంథాలు


- UNDP విడుదల చేసిన HDI నివేదికలు – (www.undp.org)
- సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం నివేదికలు (https://socialjusitce.nic.in)
- ఆర్థిక మరియు గణాంకాల డైరెక్టరేట్ తెలంగాణ, HDI నివేదిక 2017 (https://ecostat.telangana.in)

# 22 అంతర్జాతీయ సంస్థలు

## 22.0 అభ్యసన ఫలితాలు

- అంతర్జాతీయ సంస్థలు ఏర్పడడానికి గల కారణాలు వివరిస్తారు.
- అంతర్జాతీయ సంస్థల ఆవశ్యకతను వివరిస్తారు.
- నానాజాతి సమితి ఏర్పాటు, లక్ష్యాలను వివరిస్తారు.
- నానాజాతి సమితి వైఫల్యానికి కారణాలు చెబుతారు.
- ఐక్యరాజ్య సమితి లక్ష్యాలు వివరిస్తారు.
- వీటో అధికారం అంటే ఏమిటో చెబుతారు.
- ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థల పట్టిక తయారు చేస్తారు.
- ఐక్యరాజ్య సమితి సాధించిన విజయాలను వివరిస్తారు.

## 22.1 పరిచయం

ప్రస్తుతం ప్రపంచంలో సుమారుగా 200 దేశాలు ఉన్నాయి. ప్రతి దేశము తమ పరిపాలనను విభిన్న స్వరూపాలతో ఏర్పాటు చేసుకున్నాయి. ప్రతి దేశం తమ ఉనికిని కాపాడుకోవడానికి సైన్యాన్ని కలిగి ఉన్నాయి. ప్రతి దేశానికి భౌతికంగా, సహజంగా, ఆర్థిక పరిస్థితులు భిన్నంగా ఉంటాయి. కొన్ని దేశాలు పేద దేశాలుగాను, కొన్ని ధనిక దేశాలుగాను, కొన్ని సైనిక పరంగా బలంగా, మరికొన్ని బలహీనంగాను ఉన్నాయి. దేశాలన్ని తమ మనుగడ కోసం మరొక దేశంతో సంబంధాన్ని కలిగి ఉంటాయి.

ఈ విధంగా ప్రతి దేశం వివిధ దేశాలతో సంబంధాలు ఏర్పరచుకొనే క్రమంలో కొన్ని సార్లు కొన్ని దేశాల మధ్య వివాదాలు కూడా రావచ్చు. ఈ వివిదాల యొక్క ప్రభావం ప్రపంచ దేశాలపై ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని ఉంటుంది. ఇటువంటి వివాదాలను పరిష్కరించుటకు ఉపయోగపడే సంస్థలనే అంతర్జాతీయ సంస్థలు అనవచ్చు. అంతర్జాతీయ శాంతి, సౌభాగ్యాలను పరిరక్షించడానికి కొన్ని సంస్థల అవసరం ఎంతో ఉంది. అటువంటి కొన్ని అంతర్జాతీయ సంస్థల గురించి ఈ పాఠంలో తెలుసుకుందాం.

## 22.2 నానాజాతి సమితి - ఏర్పాటు

మొదటి ప్రపంచ యుద్ధం (1914-18) తర్వాత జరిగిన వర్సైయిల్స్ సంధి ఒప్పందం ఫలితంగా ప్రపంచ శాంతి సాధన లక్ష్యంతో మొదటి అంతర్జాతీయ సంస్థగా నానాజాతి సమితి 1920 జనవరి 11న ఏర్పడింది.

### 22.2.1 లక్ష్యాలు

1) సంప్రదింపుల ద్వారా సమస్యలను పరిష్కరించడం
2) యుద్ధాలు జరగకుండా నివారించడం
3) ఆయుధాల తయారీని తగ్గించడం

- మొదటి ప్రపంచ యుద్ధం 1914-1918
- నానాజాతి సమితి ఏర్పాటు 1920
- రెండవ ప్రపంచ యుద్ధం 1939-1945
- UNO ఏర్పాటు 1945

**పనితీరు:** సమితి తన సభ్య దేశాల మధ్య అనేక చిన్న చిన్న వివాదాలను పరిష్కరించింది.

- బాల్టిక్ సముద్రంలోని ఆలండ్ దీవి కోసం స్వీడన్, ఫిన్లాండ్‌ల మధ్య ఏర్పడిన వివాదాన్ని పరిష్కరించింది.
- సైలేషియా సరిహద్దు విషయంలో జర్మనీ, పోలెండ్‌ల మధ్య విభేదాలను శాంతియుతంగా పరిష్కరించింది.
- గ్రీస్, బల్గేరియాల మధ్య సరిహద్దు నిర్ణయాన్ని పరిష్కరించింది.
- మానవత, సామాజిక, సేవా రంగంలో ఈ సమితి ఎంతో సేవ చేసింది.
- అంతర్జాతీయ కార్మిక సంస్థ ద్వారా మానవ శారీరక శ్రమ పట్ల గౌరవం పెంపొందించింది.

**వైఫల్యం:** సమితి ముఖ్యంగా రాజకీయ రంగంలో తన ప్రధాన లక్ష్యాన్ని సాధించడంలో విఫలమైంది.

- ఇది నిరాయుధీకరణను సాధించలేకపోయింది.
- యుద్ధాలను, దురాక్రమణలను నివారించలేకపోయింది.
- సమితి వైఫల్యాలలో కొన్ని:
    - జపాన్ (1931) మంచూరియాపై దండెత్తినప్పుడు ఆపలేకపోవడం
    - ఇటలీ (ముస్సోలిని) అబిసీనియాస్‌పై (1935) దాడి చేసినప్పుడు నివారించలేకపోవడం
    - జర్మనీ హిట్లర్ దండయాత్రలను అడ్డుకోలేకపోవడం

## 22.3 ఐక్యరాజ్య సమితి ఆవశ్యకత - ఆవిర్భావం

రెండవ ప్రపంచ యుద్ధ (1939-45) పరిణామాలలో ఐక్యరాజ్య సమితి ఆవిర్భావం ఒకటి. ఈ యుద్ధంలో జరిగిన నష్టం చాలా ఎక్కువ. ఐరోపా దేశాలు ముఖ్యంగా USSR, పోలండ్, యుగోస్లోవియాలు తమ జనాభాలో 20% వరకు కోల్పోయాయి. నగరాలు, గ్రామాలు, కర్మాగారాలు, గనులు విధ్వంసం కాబడినవి.

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అంతర్జాతీయ శాంతి భద్రతలను కాపాడడానికి మరో యుద్ధం జరగకుండా నివారించడానికి ఒక ప్రపంచ స్థాయి సంస్థ అవసరమని భావించడమైంది. 1945లో శాన్‌ఫ్రాన్సిస్కోలో సమావేశమైన 50 దేశాల ప్రతినిధులు ఐక్యరాజ్య సమితి చార్టర్‌ను రూపొందించారు. 1945 అక్టోబర్ 24న ఇది లాంఛనంగా అమల్లోకి వచ్చింది.

ఐక్యరాజ్య సమితి ఏర్పడినప్పుడు 50 సభ్య దేశాలు ఉంటే ఇప్పుడు 193 (2020 సంవత్సరంలో) సభ్య దేశాలు కలవు.

## 22.3.1 సమితి లక్ష్యాలు

1. యుద్ధాలను నివారించి అంతర్జాతీయ శాంతిని కాపాడడం.
2. ప్రపంచ ప్రజలందరికీ మానవ హక్కులు, ప్రజాస్వామ్యం లభించేలా చూడడం.
3. పేదరికం, ఆకలి అంతమయ్యేలా చూడడం.

## 22.3.2 ఐక్యరాజ్య సమితి ప్రధాన అంగాలు - ఆరు (6)

వేరువేరు సంస్థల ద్వారా ఐక్యరాజ్య సమితి పని చేస్తుంది.

**1. సాధారణ సభ (జనరల్ అసెంబ్లీ):** ఐక్యరాజ్య సమితిలోని సభ్య దేశాలన్నీ జనరల్ అసెంబ్లీలో సభ్యులుగా వ్యవహరిస్తాయి. ప్రతి సభ్య దేశానికి ఒక ఓటు ఉంటుంది. ఇవి సంవత్సరానికి ఒక్కసారైనా సమావేశం కావాలి.

**2. భద్రతామండలి (సెక్యూరిటీ కౌన్సిల్):** ఇందులో మొత్తం సభ్య దేశాలు 15. వీటిలో 5 శాశ్వత సభ్య దేశాలు, 10 తాత్కాలిక సభ్య దేశాలు. తాత్కాలిక సభ్య దేశాలు రెండేళ్ళ కాలానికి సాధారణ సభచే ఎన్నిక కాబడతాయి. శాశ్వత సభ్య దేశాలకు 'వీటో' అధికారముంటుంది. 'వీటో' అనగా తిరస్కరణ అధికారం అని అర్థం.

**3. ఆర్థిక మరియు సామాజిక మండలి (ఎకనామిక్ అండ్ సోషల్ కౌన్సిల్):** ఆర్థిక, సామాజిక మండలి సాధారణ సభ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, విద్య, ఆరోగ్య రంగాలకు సంబంధించిన అంశాలలో సమన్వయం కొరకు కృషి చేస్తుంది.

**4. ధర్మకర్తృత్వ మండలి (ట్రస్టీషిప్ కౌన్సిల్):** ఇతర దేశాల పాలన క్రింద కొనసాగిన భూభాగాల ప్రయోజనాలను కాపాడుట ఈ మండలి ముఖ్య ఉద్దేశ్యం. వాటికి స్వాతంత్ర్యం కల్పించుట లేదా స్వపరిపాలనకు రంగం సిద్ధం చేయుటకు ఈ మండలి కృషి చేస్తుంది. ప్రస్తుతం ఇది సుప్తచేతనావస్థలో ఉంది. ఎందుకనగా ప్రస్తుతం ఏ దేశం కూడా మరొక దేశం చేత పాలించబడటం లేదు.

**5. అంతర్జాతీయ న్యాయస్థానం (ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్):** అంతర్జాతీయ న్యాయస్థానం ప్రధాన కార్యాలయం నెదర్లాండ్స్‌లోని ది హేగ్ నగరంలో ఉంది. ఈ న్యాయస్థానం ఒక అంతర్జాతీయ ఒప్పందం ద్వారా ఏర్పడింది. వివిధ దేశాల మధ్య తలెత్తే తగాదాలు పరిష్కరించడం, అధికారిక అంతర్జాతీయ సంస్థలు సమర్పించే న్యాయపరమైన ప్రశ్నలకు సలహాలనివ్వడం ఈ న్యాయస్థానం ముఖ్య విధులు.

**6. సచివాలయం (సెక్రటేరియట్):** సచివాలయం ఐక్యరాజ్య సమితి ఇతర అంశాలకు, సంబంధించిన అంశాలను పర్యవేక్షిస్తుంది. సచివాలయానికి సెక్రటరీ జనరల్ అధిపతిగా ఉంటాడు.

## 22.3.4 ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థలు

ఐక్యరాజ్య సమితి తన ప్రధాన అంగాలతో పాటు ప్రత్యేక సంస్థల ద్వారా తన లక్ష్య సాధనలకు కృషి చేస్తుంది. కొన్ని ముఖ్య సంస్థలను చూద్దాం.

**అంతర్జాతీయ బాలల అత్యవసర నిధి (UNICEF)**

1946లో బాలలకు యుద్ధానంతర సహాయాన్ని అందించుటకు ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ బాలల అత్యవసర నిధిని ఏర్పాటు చేసింది. బాలలు మరియు వారి తల్లుల జీవన ప్రమాణాలను పెంచడాన్ని ఈ నిధి లక్ష్యంగా పెట్టుకున్నది.

**ఐక్యరాజ్య సమితి విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక సంస్థ (UNESCO)**

యునెస్కో సంస్థ విద్య, వైజ్ఞానిక, సాంస్కృతిక రంగాలలో సహకరించుట ద్వారా శాంతి భద్రతల పరిరక్షణకు తోడ్పడుతుంది.

**యు.ఎన్.ఓ. సెక్రటరీ జనరల్‌లు**

| | |
|---|---|
| 1. ట్రిగ్వేలి | : 1946-53 |
| 2. డాగ్ హమ్మర్ షీల్డ్ | : 1953-61 |
| 3. యుథాంట్ | : 1961-71 |
| 4. కుర్టు వాల్డీమ్ | : 1972-82 |
| 5. జేవియర్ ఫెరెజ్ డిక్యులర్ | : 1982-92 |
| 6. బౌత్రోస్ జాత్రోస్ ఘలీ | : 1992-97 |
| 7. కోఫి అన్నన్ | : 1997-2007 |
| 8. బాన్‌కీమూన్ | : 2007-2017 |
| 9. అంటోనియగుటరీస్ | : 2017 |

**ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO)**

అన్ని వర్గాల ప్రజలకు అత్యుత్తమ ఆరోగ్య సదుపాయాలు కల్పించుటే ప్రపంచ ఆరోగ్య సంస్థ ముఖ్య ఉద్దేశ్యం. మశూచిని నిర్మూలించడంలో **ప్రపంచ ఆరోగ్య సంస్థ** పాత్ర ముఖ్యమైనది. హెచ్.ఐ.వి.పై ఐక్యరాజ్య సమితి ఉమ్మడి కార్యక్రమం 1996లో ప్రారంభమైంది. క్షయ, ఎయిడ్స్, డయేరియా, మలేరియా, క్యాన్సర్, కలరా, కరోనా (COVID-19) మొదలైన 10 రకాల వ్యాధులను WHO ప్రాణాంతక వ్యాధులుగా గుర్తించింది.

**అంతర్జాతీయ కార్మిక సంస్థ (ILO)**

అంతర్జాతీయ కార్మిక చట్టాలను రూపొందించి బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, వెట్టిచాకిరి నిర్మూలనకు కృషి చేస్తుంది.

## 22.3 ఐక్యరాజ్య సమితి సాధించిన విజయాలు

ఐక్యరాజ్య సమితి ఏర్పడినప్పటి నుండి ప్రపంచ శాంతి స్థాపనలో ముఖ్య పాత్ర వహించింది. ప్రపంచ దేశాల మధ్య పోరాటాలను, సమీప యుద్ధాలను నివారించడంలో కీలక పాత్ర నిర్వహించింది.

- డచ్ నుంచి ఇండోనేషియాకు స్వాతంత్ర్యం సంపాదించి పెట్టడంలో ఐక్యరాజ్య సమితి విజయవంతమైంది.
- అరబ్బులకు, యూదులకు మధ్య పాలస్తీనాలో ఏర్పడిన వివాదాన్ని పరిష్కరించింది.
- సైనిక చర్య ద్వారా దక్షిణ కొరియా మీద ఉత్తర కొరియా దురాక్రమణను నిలిపివేసింది.
- సూయజ్ కాలువ సంక్షోభం మీద ఇంగ్లాండ్‌కు, ఈజిప్ట్‌కు మధ్య యుద్ధాన్ని నివారించడంలో విజయవంతమైంది.

### UNO సాధించిన ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక విజయాలు

ఐక్యరాజ్య సమితి, ప్రపంచ ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించడానికి సంపూర్ణోద్యోగితను సాధించడానికి, ఆర్థిక పరిస్థితులు మెరుగుపర్చడానికి సామాజిక ప్రగతిని పెంపొందించడానికి కృషి చేస్తుంది.

- 1949 నుంచి ఐక్యరాజ్య సమితి ప్రపంచ ఆర్థిక పరిస్థితులకు సంబంధించిన, వార్షిక నివేదికను ప్రచురిస్తూ ఉంది.
- అంతర్జాతీయ బ్యాంకు ద్వారా ఇది రుణాలిస్తుంది.
- 1957 సంవత్సరంలో అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక వికాసానికి అంతర్జాతీయ ఆర్థిక సంస్థను ఏర్పాటు చేయడమైనది.
- ఆర్థిక వనరులను అందుబాటులో ఉంచడం కోసం 1968లో మూలధన అభివృద్ధి నిధిని ప్రారంభించడమైంది.
- అంతర్జాతీయ కార్మిక సంస్థ ద్వారా వెట్టిచాకిరి నిర్మూలనకు ప్రయత్నం చేస్తుంది.
- మలేరియా, క్షయ, మశూచి, ఇన్‌ఫ్లుయెంజా, కుష్ఠు, ట్రకోమా వంటి వ్యాధులను అరికట్టడానికి ఐక్యరాజ్య సమితి ప్రపంచ ఆరోగ్య సంస్థ ద్వారా చాలా దేశాలకు సహాయం చేసింది.
- యునెస్కో ద్వారా నిరక్షరాస్యత నిర్మూలన కోసం కృషి చేస్తుంది. ఇది ప్రాథమిక విద్యను ప్రోత్సహిస్తుంది. శాస్త్రీయ పరిశోధనను శీఘ్రతరం చేస్తుంది.

## 22.4 ఐక్యరాజ్య సమితి వైఫల్యాలు

ఐక్యరాజ్య సమితి తన లక్ష్య సాధన కోసం పనిచేస్తూ కొన్ని విజయాలను సాధించినప్పటికి కొన్ని అపజయాలు కూడా ఉన్నాయి. ఐక్యరాజ్య సమితికి పూర్తి స్థాయి అధికారం లేకపోవడం, ఆర్థిక, సైనిక అవసరాల కోసం సభ్య దేశాలపై ఆధారపడి ఉండడం వలన సంపూర్ణంగా విజయాలను సాధించలేకపోయింది. ఐక్యరాజ్య సమితి కొన్ని అపజయాలను చూద్దాం.

- 1948 నుండి పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడిని ఆపలేకపోవడం
- పరిష్కృతం కాని కాశ్మీర్ సమస్య
- కంబోడియాలో జరిగిన హింస

## 22.5 ఐక్యరాజ్య సమితి - జరగాల్సిన మార్పులు - ఆవశ్యకత

ఐక్యరాజ్య సమితి నిర్మాణంలో ఉన్న లోపాలు సవరించాల్సిన అవసరం ఉంది. 1945 కాలం నాటి పరిస్థితులు – ప్రస్తుత పరిస్థితులు చాలా భిన్నంగా ఉన్నాయి. ఆ సమయంలో ఉన్న పరిస్థితులకు అనుగుణంగా ఐక్యరాజ్య సమితి ఏర్పడింది. కేవలం అప్పటి ఆధిపత్యం చెలాయించిన దేశాలు వారి ప్రాబల్యం ఉండే విధంగా ఏర్పాటు జరిగింది.

ప్రస్తుతం కొన్ని దేశాలు బాగా వృద్ధి చెందడం, మరికొన్ని దేశాలు వెనుకబడిపోవడం జరిగింది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఐక్యరాజ్య సమితి నిర్మాణంలో మార్పులు రావాలి. వివిధ అంగాలలో సభ్య దేశాలకు ఉన్న ప్రత్యేక ప్రాధాన్యతలను మార్చవలసి ఉంది. అన్ని దేశాలకు సమాన ప్రాధాన్యతను కల్పించినప్పుడే ప్రపంచ అభివృద్ధి సాధ్యమౌతుంది.

## 22.6 ముగింపు (ముఖ్యాంశాలు)

- అంతర్జాతీయ సంస్థలు అంతర్జాతీయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాయి.
- ప్రపంచ దేశాల మధ్య ఏర్పడే సరిహద్దు రాజకీయ, సాంస్కృతిక సమస్యలకు మార్గాలను చూపుతాయి.
- మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత నానాజాతి సమితి ఏర్పడింది.
- రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచ శాంతి కోసం UNO అవతరించింది.
- UNO తన 6 ప్రధాన అంగాల ద్వారా పని చేస్తుంది.
- అనుబంధ సంస్థల సహాయంతో వివిధ రకాలైన సమస్యలను పరిష్కరిస్తుంది.
- UNO ప్రపంచ శాంతిలో ముఖ్య పాత్ర వహించినప్పటికీ ఇంకా పరిష్కారం కాని సమస్యలు ఎన్నో ఉన్నాయి.

## 22.7 మాదిరి పరీక్షా ప్రశ్నలు

**I. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 1-2 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. UNO ఎప్పుడు ఏర్పడింది?
2. UNO యొక్క రెండు లక్ష్యాలు రాయండి.
3. వీటో అధికారం గల దేశాలు ఏవి?
4. నానాజాతి సమితి ఏర్పడినప్పుడు ఏర్పడిన అంతర్జాతీయ సంస్థ ఏది?
5. ప్రస్తుత ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఎవరు?

**II. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 4-5 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. నానాజాతి సమితి ఏర్పాటు, లక్ష్యాలు రాయండి.
2. ఐక్యరాజ్య సమితి సాధించిన వైజ్ఞానిక అంశాలు ఏవి?
3. ఐక్యరాజ్య సమితి ఆరోగ్య సంబంధించిన విజయాలు ఏవి?

**III. కింది ప్రశ్నలకు ఒక్కొక్క దానికి 8-10 వాక్యాలలో జవాబులు రాయండి.**

1. రెండు ప్రపంచ యుద్ధాల అనంతరం అంతర్జాతీయ సంస్థల ఏర్పాటుకు గల కారణాలు ఏవి?
2. ఐక్యరాజ్య సమితి యొక్క ప్రధాన అంగాల గురించి రాయండి.
3. ఐక్యరాజ్య సమితి సాధించిన విజయాలను రాయండి.
4. ప్రస్తుత పరిస్థితులలో ఐక్యరాజ్య సమితి లక్ష్యాలలో ఎలాంటి మార్పులు అవసరమో రాయండి.
5. ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి 2030 లక్ష్యాలు ఏవి?

**IV. కింది వాటిలో సరైన జవాబును ఎంపిక చేయండి.**

1. వర్సైయిల్స్ ఒప్పందం తర్వాత ఏర్పడిన సంస్థ ( )

   ఎ) UNO బి) నానాజాతి సమితి సి) WHO డి) WTO

2. అంతర్జాతీయ న్యాయ స్థానం గల నగరం ( )

ఎ) జెనీవా బి) న్యూయార్క్ సి) లండన్ డి) ది హేగ్

3. కింది వాటిలో వీటో అధికారం లేని దేశం ( )

ఎ) అమెరికా బి) ఇంగ్లాండ్ సి) ఇండియా డి) చైనా

4. ఐక్యరాజ్య సమితి లక్ష్యం కానిది ( )

ఎ) దేశంలోని అంతర్గత సమస్యలను పరిష్కరించడం

బి) అంతర్జాతీయ శాంతిని కాపాడడం

సి) దేశాల మధ్య స్నేహపూర్వకమైన సంబంధాలు పెంపొందించడం

డి) మానవతావాద స్వభావం గల అంతర్జాతీయ సమస్యలను పరిష్కరించడం

5. ప్రస్తుత UNO సెక్రటరీ జనరల్ ( )

ఎ) బాన్‌కీమూన్ బి) జాన్‌కీమూన్ సి) కోఫీ అన్నన్ డి) అంటోనియా గుటోరిస్


## 22.8 ఉపయుక్త గ్రంథాలు

- SCERT, Telangana సాంఘికశాస్త్ర పుస్తకాలు

ప్రపంచ అవుట్‌లైన్ పటం



## భారతదేశ అవుట్‌లైన్ పటం



## తెలంగాణ అవుట్‌లైన్ పటం



## భారతదేశ నైసర్గిక స్వరూప పటం

